# వజ్రచ్ఛేదిక

## పరిపూర్ణ సంప్రజ్ఞత



## The Diamond Sutra

గౌతమబుద్ధుడి వజ్రచ్ఛేదికా ప్రజ్ఞాపారమిత సూత్రాలు

ఓషో

OSHO

Scanned with OKEN Scanner

# వజ్రచ్ఛేదిక

## గౌతమబుద్ధుడి వజ్రచ్ఛేదికా ప్రజ్ఞా పారమితా సూత్ర ప్రవచనాల పరిబోధలు

## ( TheDiamond Sutra )

## పరిపూర్ణ సంప్రజ్ఞత

**ఓషో**



అనువాదం

**P.G. రామ్మోహన్**

**Vajrachedika** (Paripurna Sampragnatha)
Telugu Translation Copyright © 2005
Osho International Foundation. All rights reserved.

Originally Published in English Under the title
**The Diamond Sutra**
Copyright © 1979 Osho International Foundation.
All rights reserved.

***Grateful acknowledgement is given to Buddhist Wisdom Books, by Edward Conze, for the sutras quoted in this book.***

*Translation by*
**P.G. Rammohan**

*Published by*
D. Sarveshwar
H.No. 17-1-40/A, Edi Bazar, Hyderabad - 500 023
Mobile : 90591 64976

Copies : 300

Price : Rs. 350/-

November 2022

*For Copies*
**Osho Mevlana Meditation Centre,** 506, Mahavir House, Basheer Bagh,
Hyderabad - 500 029 Ph : 93924 72766, 88973 23143

& All Leading Book Shops

***Printed at***
Veda Advertising, S.R.Nagar, Hyderabad
Cell : 77300 12579

Osho is a registered trademark of Osho International Foundation, used under license.

For more information: www.osho.com

A comprehensive multilingual web site featuring Osho's meditations, books and tapes and an online tour of the Osho International Meditation Resort.

No part of this book may be reproduced or transmitted in any form or by any means electronic or mechanical including photocopying or recording or by any information storage and retrieval system without permission in writing from Osho International Foundation.

# పరిచయం

“మీ మీదే ఆశపెట్టుకుని నేనున్నాను అని బుద్ధుడు మీ గురించే మాట్లాడుతూ ఉన్నాడు : ధర్మచక్ర పరిభ్రమణం ఇప్పుడు ఆగిపోయి వుంది. దాన్ని మళ్ళీ తిప్పాలి.”

ఈ మాటలను వింటూ ఉన్నప్పుడు, ఓషో అసాధ్యాన్నే సాధ్యం చేస్తున్నాడని నాకు అర్థమైంది, రెండువేల అయిదువందల సంవత్సరాల చారిత్రక కాలాంతరంలోకి ఓ వారధిని నిర్మించి వర్తమానంలోకి గౌతమబుద్ధుణ్ణి ఆహ్వానించి ఇక్కడికే, ఇప్పుడే తీసుకొచ్చేసారు.

ఈ ప్రసంగాలలో ఓ మహా అరుదైన సంఘటనకు మనల్ని ప్రత్యక్ష సాక్షులు చేస్తున్నాడు ఓషో : జ్ఞానోదయ ప్రాప్తపు అంచుదాకా వచ్చేసి భక్తిప్రపత్తులతో బుద్ధదేవుణ్ణి ఆరాధించే మహాశిష్యుడితో – ఆయన ఉంటున్న స్థితి ప్రాముఖ్యత గురించి – బుద్ధుడు అనుభవించే ఆనందతన్మయత్వపు స్థితిని యావన్మందికీ అనుభవంలోకి తెప్పించగలిగే ఓ బోధిసత్వుడి స్థితి సామర్థ్యం గురించి – సుభూతితో, బుద్ధుడు జరుపుతున్న సంభాషణే ఈ పుస్తకం.

కానీ ఈ పుస్తకం తన మహాప్రాశస్త్యాన్ని తానే స్వయంగా ప్రకటించుకుంటుంది, బుద్ధుడి గురించీ, సుభూతి గురించీ చదువుతున్నప్పుడు, గతం వర్తమానంలోకి వచ్చేసి ఉందని సంభ్రమాశ్చర్యాలతో హఠాత్తుగా మీరు గ్రహించినప్పుడు. ఓషో ఆ అవకాశాన్నే ఇప్పుడు మనకు అందిస్తున్నాడు – మిమ్మల్ని, నన్ను ఆయన ఆహ్వానిస్తూ ఉన్నాడు తనతోపాటు హిమాలయపర్వతాల మహాఎత్తుల్లోని చైతన్యంలోకి మనల్ని తీసుకెళ్ళేందుకు, బోధిసత్వసామర్థ్యం మనకూ ఉందని స్పష్టంగా మనమే స్వయంగా గ్రహించగలిగేందుకు. మనం కూడా ఆ బుద్ధపుష్పం వికసిస్తున్న సమయంలోనే ప్రస్తుతం ఉంటున్నాం, ద్విగుణీకృత ఆశీర్వాదులమై. ఎందుకంటే మన ఆరంభం ప్రారంభం దగ్గర్నుండే మొదలవుతూ ఉంది కాబట్టి. ఓషో మనకు గుర్తుచేసి చూపిస్తున్నట్లుగా. ఓ కొత్త పరిభ్రమణం ప్రస్తుతం ప్రారంభం అవుతోంది. ప్రస్తుతం ఓ నవ్యోదయం సంభవం అవుతూ ఉంటోంది. ఇప్పుడే ఓ నవ్యబోధిసత్వుడి ఆవిర్భావానికి నాంది జరుగుతోంది.

ఓషో మాటల్లోని సత్యాన్ని తమ హృదయాల్లో అనుభూతి పొందుతూ, ఆధ్యాత్మిక జీవులుగా మేల్కొనే సమయం ఆసన్నమై ఉందని అర్థంచేసుకుంటూ, ఎప్పుడో మరచిపోయి ఉంటున్న తమ బుద్ధత్వాన్ని పునఃస్మరించి పునర్గ్రహించుకోవాలి అనుకుంటున్న అందరికీ ఈ పుస్తకమే ఆహ్వానం.

**– స్వామి ఆనంద సుభూతి**

# విషయసూచిక

| | | |
|---|---|---|
| 1. | నిర్వాణ తలం | 6 |
| 2. | ప్రేమ విడుదలైంది | 35 |
| 3. | ధర్మచక్రం | 59 |
| 4. | అతీతం లోంచి | 85 |
| 5. | సంప్రజ్ఞత రుచి | 107 |
| 6. | బోధిసత్వత్వం | 138 |
| 7. | శాంతినివాసి | 168 |
| 8. | ఇల్లు చేరే ఉన్నాం | 197 |
| 9. | నిర్మల ధరిత్రీ స్వర్గం | 229 |
| 10. | బొత్తిగా శూన్యం | 254 |
| 11. | పరిపూర్ణ సంప్రజ్ఞుడు | 286 |

# 1. నిర్వాణ తలం

అలా విన్నా ఒకప్పుడు నేను. ఆ భగవానుడు ఉండేవాడప్పుడు శ్రావస్తిలో... ఓ ప్రాతఃకాలంలో ఆ భగవానుడు భిక్షువలువలను ధరించాడు, భిక్షాపాత్రను తీసుకున్నాడు, భిక్షాన్ని స్వీకరించేందుకు శ్రావస్తీ మహానగరానికి చేరుకున్నాడు.

ఆహారాన్ని భుజించి తన భిక్షా ఆవృత్తి నుండి వెనుదిరిగి వచ్చేసిన తరువాత, భగవానుడు భిక్షాపాత్రనూ, వలువలనూ యథాస్థానాల్లో పెట్టేసి, చేతులూ కాళ్ళూ కడుక్కుని, ఆయన కోసం తయారుచేసి ఉన్న ఆసనం మీద కూర్చుని, పద్మాసనం వేసుకుని, నిటారుగా శరీరాన్ని నిలిపి, తన ముందున్న స్థలం మీద దృష్టిని నిలిపి ఉంచాడు. అప్పుడు సన్యాసులెందరో వచ్చి ఆ భగవానుణ్ణి దర్శించుకుని, ఆయన పాదాలకు తమ తలలు ఆనించి నమస్కారాలను సమర్పించుకుని, ఆయన చుట్టూ ముమ్మారు ప్రదక్షిణలు చేసి, వెళ్ళి ఓ ప్రక్కన కూర్చున్నారు.

ఆ రోజుల్లో మహాప్రాశస్త్యాన్ని పొంది ఉన్న సుభూతి ఆ సమావేశానికి వచ్చి కూర్చున్నాడు. ఆ తరువాత ఆయన తన ఆసనం మీద నుంచి లేచి, తన ఉత్తరీయాన్ని తీసి, ఓ భుజంమీదకు వేసుకుని, కుడిమోకాలును భూమిమీద నిలిపి, చేతులు జోడించి, భగవానుడి ముందు వినమ్రుడై ప్రణమిల్లి, భగవానుడితో అన్నాడు.

అద్భుతం! భగవాన్ ఇది పరమాద్భుతం! ఓ సుగతుడా, గతించిన బోధిసత్వులెందరో మహాజీవులెందరో, పొందే ఉన్నారు తథాగతుని మహాసహాయాన్ని...

ఎలా భగవాన్? బోధిసత్వుని వాహనంలో బయల్దేరి వెళ్ళినవాడు అప్పుడెలా నిలబడాలి, ఎలా పురోగమించాలి. తన ఆలోచనలను

ఎలా నియంత్రించుకోవాలి?
ఈ మాటల తదనంతరం భగవానుడు అన్నాడు సుభూతితో :
... కాబట్టి సుభూతీ, శ్రద్ధగా విను, విను అవధానంతో!

బోధిసత్వుని వాహనంలో బయలుదేరినవాళ్ళు, చెయ్యాలి ముందుగా
ఈ ఆలోచనను ఈ విధంగా : విశ్వంలోని యావన్మందినీ 'సమస్త జీవరాశి'
అనబడుతున్న సర్వుల్నీ, నిశ్చితంగా నిర్వాణంలోకి నేను నడిపించే తీరాలి,
నిశ్శేషంగా ఆ నిర్వాణతలంలోకి. లెక్కకు మిక్కిలి జీవులను ఆ రీతిన
నిర్వాణంలోకి నడిపిస్తూనే ఉన్నా ఏ జీవీ నడిపించబడలేదు,
నిక్కముగా ఇప్పటికీ, ఆ నిర్వాణంలోకి.
ఏమిటి కారణం అందుకు? ఓ బోధిసత్వుని మానసంలో తానో 'జీవిని'
అన్న భావన కలిగితే, ఓ 'బోధిజీవి' అని ఆ బోధిసత్వుణ్ణి చెప్పుకోకూడదు.
ఎందుకు చెప్పుకోకూడదు 'బోధిజీవి' అని ఆ బోధిసత్వుణ్ణి?
ఆత్మననీ, జీవిననీ అనుకుంటున్న వాడినీ, లేదా, జీవాత్మననీ, వ్యక్తిననీ
అనుకుంటున్న వాడిని ఎందుకనకూడదు ఓ 'బోధిజీవి' అని?

బుద్ధుడైన గౌతముడంటే నాకెంతో ఇష్టం. ఎందుకంటే ఆయన మత మౌలికసారాన్నే మూర్తీభవించి ఉండేవాడు కనుక. బౌద్ధమతానికి ఆయన స్థాపకుడు కాడు - బౌద్ధమతం ఓ ఉపవస్తువుగా ఆవిర్భవించింది - కానీ ఆయనే ఈ ప్రపంచంలోని ఓ మహావిభిన్న మతానికి ఆద్యుడు. ఆయన మతం కాని మతతత్వానికే స్థాపకుడు. ఆయన నిర్మించింది ఓ మతాన్ని కాదు, ఆయన ఓ మతతత్వాన్నే నిర్మించాడు. ఆ విధంగా మానవ చైతన్య చరిత్ర ఓ మహా మౌలిక పరివర్తనాన్నే పొందింది.

బుద్ధునికి పూర్వం ఎన్నో మతాలు ఉండేవి కానీ ఓ స్వచ్ఛమైన మతతత్వం మాత్రం ఎప్పుడూ లేదు. మానవుడు అప్పటికి పరిణితిని అందుకోలేదు. బుద్ధుని వల్ల మానవత్వం ఓ పరిణితి పొందిన యుగంలోకి ప్రవేశించింది. మానవ జీవులందరూ ఇప్పటికీ అందులోకి చేరుకోవడం లేదు. ఇది సత్యం. కానీ బుద్ధుడే ఆ దారికి దూత అయ్యాడు. బుద్ధుడు వాకిళ్ళు కాని వాకిళ్ళను తెరిచాడు. అంతటి మహాసందేశం అర్థం కావడానికి మానవ జీవులకు ఎంతో సమయం పడుతుంది. బుద్ధుడిది మహాప్రగాఢ సందేశం. బుద్ధుడు చేసినంతటి మహత్కార్యాన్ని ఇప్పటిదాకా

ఎవ్వరూ చెయ్యలేదు, అంతటి మహాకార్యాన్ని ఆయన చేశాడు. ఆయన తప్ప వేరెవ్వరూ అంతటి నిర్మల సుగంధ స్వరూపులు కాలేదు.

మహాప్రాజ్ఞులైన ఇతర మతస్థాపకులు తమ మతానుయాయులతో రాజీపడి పోయారు. బుద్ధుడు ఎవ్వరితోనూ సమాధానపడిపోకుండా సుస్థిరుడై స్థితుడయ్యాడు. అందువల్లే ఆయన స్వచ్ఛతతో ఉన్నాడు. మీరు ఆయనను ఎలా అర్థం చేసుకుంటున్నారో అన్న విషయాన్ని పట్టించుకోకుండా 'ఏది సత్యం?' అన్న విషయం పట్లే ఆయన ఖచ్చితంగా ఉండేవాడు. మీకు అర్థం అవుతూ ఉందా లేదా అన్న విషయాన్ని ఏ మాత్రం ఎంచకుండా నిర్దుష్టంగా సత్యవాక్యాన్నే పలికేవాడు. ఒక విధంగా దీన్ని చూస్తే ఆయన మహాకఠినంగానే ఉన్నట్లు అనిపిస్తుంది : మరోవిధంగా వీక్షిస్తే అక్కడ మహాకరుణే కనిపిస్తుంది.

సత్యాన్ని ఉన్నది ఉన్నట్లుగానే చెప్పాలి. ఏ క్షణంలో మీరు రాజీపడిపోతారో తక్షణంలోనే సత్యాన్ని సామాన్య మానవ చైతన్యస్థాయిలోకి మీరు పట్టుకొచ్చి దించేస్తారు. అప్పుడు అది దాని ఆత్మను పోగొట్టుకుంటుంది. ఉపరితలం మీద పైపైనే ఆ సత్యం ఉంటూ అది ఓ మృత విషయంగా తయారైపోతుంది. మానవ చైతన్యపు స్థాయిలోకి సత్యాన్ని మీరు దిగజార్చకూడదు. సత్యం ఉన్న స్థాయిలోకే మానవుణ్ణి మీరు ఆరోహింపజేయాలి. అదే బుద్ధుడి మహాకార్యం.

ఇరవై అయిదు శతాబ్దాల క్రితం, ఓ రోజు ప్రాతఃకాలంలో – ఇప్పుడు ఈ రోజు ఉన్నట్లుగానే – ఈ సూత్రం జన్మించింది. అప్పుడు పన్నెండువందల యాభైమంది సన్యాసులు వున్నారు. ఇది శ్రావస్తీ నగరంలో జరిగింది. ఆ రోజుల్లో అది మహానగరం. 'శ్రావస్తి' అన్న పదానికి అర్థం 'మహాశోభ ఉన్న నగరం' అని. ప్రాచీన భారతదేశంలో అది మహావైభవంతో వెలుగొందిన నగరం. ఆ నగరంలో తొమ్మిదిలక్షల కుటుంబాలు నివసిస్తూ ఉండేవి. ఇప్పుడు ఆ నగరం పూర్తిగా అదృశ్యమైపోయి వుంది. ఇప్పుడు అక్కడ ఓ అతిచిన్న కుగ్రామం ఉంది – దానిపేరు భౌగోళిక పటంలో కూడా మీకు కనిపించదు. ఆ నగరపు పేరు కూడా మాయం అయిపోయింది. ఇప్పుడు దాన్ని సహేత్–మహేత్ అంటున్నారు. ఒకప్పుడు అక్కడ ఓ మహానగరం ఉండేదని చెప్తే మనం ఏ మాత్రమూ నమ్మలేం. ఇదే జీవిత గమనపు శైలి – విషయాలు సదా పరివర్తనం అయిపోతూనే ఉంటాయి. నగరాలు స్మశానాలు అయిపోతాయి, స్మశానాలు మహానగరాలు అయిపోతాయి... జీవితం అతలాకుతలం.

బుద్ధుడికి ఈ నగరం అంటే ఎంతో ఇష్టం ఉండి ఉంటుంది. ఎందుకంటే నలభై అయిదు సంవత్సరాల జీవిత మంత్రాంగంలో ఆయన పాతికేళ్ళపాటు శ్రావస్తీ నగరంలో ఉన్నాడు. అక్కడి మనుష్యుల్ని ఆయన ఎంతగానో ప్రేమించి ఉంటాడు. ఆ నగరంలోని ప్రజలకు తప్పకుండా ఓ పరిణితినందుకున్న చైతన్యస్థితి ఉండి ఉండవచ్చు. బుద్ధుని గొప్ప సూత్రాలన్నీ, దాదాపుగా ఆయన అన్ని సూత్రాలూ శ్రావస్తీ నగరంలోనే జన్మించాయి.

ఈ సూత్రం – ఈ వజ్రసూత్రం – కూడా శ్రావస్తీ నగరంలోనే జన్మించింది. ఈ సూత్రానికి సంస్కృత భాషలోని పేరు 'వజ్రచ్ఛేదికా ప్రజ్ఞాపారమితా సూత్రం'. దీనికి అర్థం 'మెరుపులా తెగ్గొట్టే పూర్ణవివేకం' అని. మీరు ఒప్పుకుంటే, మెరుపులా బుద్ధుడు మిమ్మల్ని శిరచ్ఛేదం చేసేస్తాడు. మిమ్మల్ని వధించి 'మీరు పునర్జన్మించే' సహాయాన్ని చేస్తాడు.

ఓ బుద్ధుడు ఈ రెండు పనుల్నీ చేయగలిగి ఉండాలి – ఓ హంతకుడి పనినీ, ఓ తల్లి పనినీ. ఒకవైపు మిమ్మల్ని చంపేస్తూ ఉండాలి, మరోవైపు ఓ కొత్త ఉనికిని మీకు ప్రసాదిస్తూ ఉండాలి. ఓ నవ్యజీవి జననం పాతమనిషి విధ్వంసం తరువాత మాత్రమే సంభవం కాగలుగుతుంది. పాత చితాభస్మంలోంచే కొత్త జీవి జన్మిస్తుంది. మానవుడే ఫీనిక్స్ పక్షి. పురాణపు ఫీనిక్స్ పక్షి కేవలం పౌరాణికం కాదు. అదో రూపకాలంకారం. ఇది మానవుడికే ప్రతీక. ఫీనిక్స్ పక్షి మానవుడిలో తప్ప మరెక్కడా ఉండదు. మానవుడే మరణించి మళ్ళీ జన్మించాల్సి ఉంటుంది.

జీసస్ నికొడమస్‌తో ఈ మాటే అన్నాడు. నికొడమస్ ఓ మహాచార్యుడు. జ్ఞాని. ఓ రబ్బీ. జెరూసలెమ్ దేవాలయ కార్యవర్గ సభ్యుల్లోని మనిషి. ఓ చీకటి రాత్రిలో నికొడమస్ జీసస్‌ను దర్శించుకునేందుకు వచ్చాడు. పగటిపూట జీసస్‌ను కలుసుకునే ధైర్యం ఆయనకు లేదు. మనుష్యులు ఏమంటారో అన్నదే ఆయన భయం. ఆయన మహాగౌరవనీయుడు. అందరి గౌరవాలూ అందుకుంటున్నవాడు కూడా. ఓ దేశదిమ్మరి గురువు వద్దకు వెళ్ళడమా?... రబ్బీలందరి ఆక్షేపణలకూ, పండితులందరి ద్వేషానికీ గురిఅవుతున్న ఆ మనిషి దగ్గరకు వెళ్తున్నాడా?... దొంగలతో, తాగుబోతులతో, వ్యభిచారులతో తిరుగుతున్న మనిషి వద్దకు వెళ్తున్నాడా? కానీ నికొడమస్‌లో జీసస్ వద్దకు వెళ్ళితీరాలన్న మహాప్రగాఢ వాంఛితం ఉంది. ఎప్పుడో జీసస్ ఆ దేవాలయానికి వస్తున్నప్పుడు తను ఆయన్ని చూసి ఉండవచ్చు. ఏ ఆరాధనా

భావమో తన అచేతనాంతర్మూలంలో కలిగి ఉండవచ్చు. జీసస్ వద్దకు వెళ్ళకుండా నికొడమస్ తనను తాను ఆపుకోలేకపోయాడు.

ఓ రాత్రి ఎంతో పొద్దు గడచిపోయిన తరువాత, అందరూ అక్కణ్ణుంచి వెళ్ళిపోయిన తరువాత, జీసస్ శిష్యులు కూడా నిద్రపోయిన తరువాత నికొడమస్ నెమ్మదిగా జీసస్ సామీప్యానికి నడుచుకుంటూ వచ్చి ఆయనను అడిగాడు "దైవసామ్రాజ్యంలోకి ప్రవేశించే అర్హత నాక్కూడా కలిగేందుకు నేనేం చెయ్యాలి?" అని.

అప్పుడు జీసస్ అన్నాడు "మరణిస్తే తప్ప ఏదీ కాదు సాధ్యం. మరణిస్తేనే దైవసామ్రాజ్యంలోకి నువ్వు ప్రవేశించగలుగుతావు. ఉన్నదున్నట్లుగా నువ్వు మరణించే తీరాలి. అప్పుడే ఉనికి స్థితిలో ఉన్న నీ నిజ అంతర్జీవికి యధాతథంగా ఓ పునర్జన్మ ఏర్పడగలుగుతుంది."

ఆవశ్యక జీవి పునర్ అవతరించేందుకు అహంకారం అంతరించి తీరాలి. 'ప్రజ్ఞాపారమితా వజ్రచ్ఛేదిక'కు అర్థం ఇదే. అది మెరుపులా ఛేదిస్తుంది. ఒకే వేటుతో మిమ్మల్ని అది నశింపజేస్తుంది. ఇది ఓ బుద్ధ ప్రబోధిత మహోపదేశం. ఆ శృతిలోకి మీరు రండి.

సూత్రంలోకి ప్రవేశించే ముందుగా, కొన్ని విషయాలను మనం అర్థం చేసుకుని తీరాలి... వీటిని అర్థం చేసుకుంటే సూత్రాన్ని అర్థం చేసుకోవడానికి మహా సహాయకారిగా ఉంటుంది. గౌతమబుద్ధుడు ఏ అణచివేతలనూ విధించని, ఏ మహాశయాలనూ ప్రతిపాదించని ఓ ఆధ్యాత్మికతకు ఆద్యుడయ్యాడు. ఓ మహాఅరుదైన సంభవం అది. సాధారణ వ్యవహారంలో దర్శనమిస్తున్న ఆధ్యాత్మికత, సాధారణ ఉద్యానవన తుల్యపు ఆధ్యాత్మికత, అణచివేతలను విపరీతంగా విధిస్తూ ఉంటుంది. ఆ ఆధ్యాత్మికతలు అణచివేతల మీదే ఆధారపడి ఉంటాయి. అణచివేతలన్నీ మానవులను అంగవిహీనుల్నిగానే చేసేస్తాయి. అవి ఏవీ మానవుడికి ఓ విముక్తిని ప్రసాదించవు. అవి మహావికారంగా ఉంటూ, మానవుణ్ణి బానిసత్వంలోనే ఉంచేస్తాయి. అణగద్రొక్కే ఉంచేస్తాయి.

'క్రీస్తు అనుకరణం' (Imitation of Christ) పుస్తక రచయిత థామస్ ఆ కెంపిస్ అంటున్న మాటలను వినండి. ఆయన ఇలా వ్రాశాడు : "మీరు ఎంత ఎక్కువగా ఆత్మహింసను చేసుకుంటారో, అంత ఉన్నతంగా మీ సౌందర్యపు ఎదుగుదల

ఉంటుంది. అనునిత్యమూ శుష్కించే పద్ధతి తప్ప మరే మార్గమూ లేదు. ఆత్మనిందా తత్త్వమే సర్వోత్కృష్ట మహోత్తమ మంత్రణం". థామస్ ఆ కెంపిస్‌తో నిర్ద్వంద్వంగా ఏకీభవించే సన్యాసులు యుగాల పర్యంతంలో ఉన్నారు. మరి ఆ థామస్ ఆ కెంపిస్సే మహారోగలక్షణ మహాసంపన్నుడు.

లేదా ఫ్రెంచ్ పూజారి బోస్యూ అంటున్న "ఈ భూమి శాపగ్రస్తంగానే ఉండిపోనీ! ఈ పృథ్వి శాపగ్రస్తంగానే ఉండాలి! ఈ పుడమి వెయ్యిశాపాలతో ఉండాలి" అన్న మాటల్ని ఒక్కసారి వినండి. ఎందుకు? ఈ భువికి శాపాలు ఎందుకు వుండాలి? జీవితం శాపగ్రస్తంగా వుండాలి. ఈ మనుష్యులు అందరూ 'దైవం జీవితవైరి' అని అనుకుంటూ ఉంటారు. జీవితం దేవుణ్ణి ద్వేషిస్తుందని. జీవితమే దైవం. అందులో ఏ వైరమూ ఉండదు. అది అన్యంగా సైతం ఉండదు. ఆ రెండూ విభిన్న విషయాలు కావు, ఒకే వాస్తవానికి ఉన్న ఉభయనామాలు అవి.

స్మరించండి దీన్ని : బుద్ధుడు అణచివేతలు ఏవీ లేకుండా ఉంటాడు. ఏ బౌద్ధ సన్యాసులైనా మీకు అణచివేతలు చేసుకుంటూ కనిపిస్తే, తక్షణం స్మరించండి, వాళ్ళు బుద్ధుణ్ణి అర్థం చేసుకోనేలేదని. తమకున్న రోగిష్టి లక్షణాలనే వాళ్ళు బుద్ధుని బోధనల్లోకి తీసుకొచ్చి చేర్చేస్తున్నారు. మరి బుద్ధుడు ఏ ఆశయాలూ ఉండకుండా ఉంటాడు. ఆయన ఏ ఆశయాలనూ బోధించడు, అన్ని ఆశయాలూ మనఃకల్పితాలే కాబట్టి. ఆశయాలు మనఃకల్పితాలుగానే ఉంటే అవి మనస్సును అధిగమింపజేయలేవు. ఏ ఆశయమూ మానస అతీతానికి మిమ్మల్ని చేర్చగలిగే వంతెన కాదు. అన్ని ఆశయాలనూ విడిచిపెట్టెయ్యాలి. అప్పుడు మాత్రమే మీ మనస్సు కూడా విడిచిపెట్టెయ్యబడుతుంది.

బుద్ధుడు కూడా ఏ ఆశయాలనూ నమ్మడు. మానవులలో అన్ని ఆశయాలూ ఉద్విగ్నతలనే, అంతఃస్సంఘర్షణలనే సృష్టిస్తాయి కాబట్టి. అవి విభజిస్తాయి, వ్యధలనే కలిగిస్తాయి. మీరు ఓ విధంగా వుంటే మరోవిధంగా మిమ్మల్ని అవి ఉండమంటాయి. ఆ రెండింటి మధ్యా మీరు చీలిపోతూ లాగబడే ఉంటారు. ఆశయాలు దైన్యాన్నే సృష్టిస్తాయి. ఆశయాలు వ్యక్తిత్వాలను చీల్చేస్తాయి. ఎంత ఎక్కువ ఆశయాలు మీకు ఉంటే అంత ఎక్కువగా మీరు చీలిపోయి పెక్కు వ్యక్తిత్వాల రుగ్మత (Schizophrenia) లో పడిపోయి వుంటారు. మిమ్మల్ని ఆ ఆశయాలే చీల్చేస్తాయి.

ఏ ఆశయాలూ ఉండని చైతన్యమే చీలిపోకుండా ఉండగలుగుతుంది. ద్వంద్వ ప్రవృత్తులతోనో, పెక్కు వ్యక్తిత్వాలతోనో చీలిపోయి ఉంటే మీరు సంతోషంగా ఎలా

ఉండగలుగుతారు? నిశ్శబ్దంగా ఎలా ఉండగలుగుతారు? మీకు ప్రశాంతత గురించీ, నిశ్చలత గురించీ ఎలా తెలిసొస్తుంది?

ఆశయాల మనిషి ఓ నిరంతర అంతఃసంగ్రామాన్నే చేస్తూ ఉంటాడు. తనతోనే ఎప్పుడూ పోట్లాడుకుంటూ ఉంటాడు. ఆ మనిషిలో ప్రతిక్షణమూ అంతఃసంఘర్షణే ఉంటుంది. ఆ మనిషి అంతర్యుద్ధంతోనే జీవిస్తూ వుంటాడు. ఆ మనిషి గందరగోళంతోనే జీవిస్తూ ఉంటాడు, నిజంగా తనెవరో స్వయంగా తెలుసుకోలేకపోతున్నాడు కనుక - ఆశయమా, వాస్తవమా? ఆ మనిషి తనను తానే నమ్మలేడు. తన గురించే భయపడుతూ ఉంటాడు. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతాడు. ఆత్మవిశ్వాసాన్ని పోగొట్టుకున్న వెంటనే నిజవైభవాన్ని కూడా పోగొట్టుకుంటాడు. ఎవరికో - ఏ పూజారికో, ఏ రాజకీయ మనిషికో బానిస అయిపోవడానికి సంసిద్ధుడై పోతాడు. ఓ ఉచ్చులో పడిపోవడానికి సర్వసంసిద్ధుడైపోయి ఉంటాడు.

ప్రజలెందుకు అనుయాయులు అయిపోతారు? మనుష్యులంతా ఎందుకు ఇరుక్కుపోతున్నారు? ఓ జోసెఫ్ స్టాలిన్‌కో, అడాల్ఫ్ హిట్లర్‌కో, మావో జెడాంగ్‌కో విధేయులు ఎందుకు అయిపోతున్నారు? దీనికంతా ఏది ప్రారంభం? వాళ్ళు తీవ్రంగా చలిస్తూ ఉంటున్నారు. వాళ్ళు ఆశయాల గందరగోళం వల్ల ఆత్మమూలాలలోంచే వణికిపోతున్నారు. ఇప్పుడు వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిల్చోలేకపోతున్నారు. ఎవరి మీదో వాలిపోయి నిల్చోవాలనుకుంటున్నారు. స్వంతంగా నడుచుకోలేకపోతున్నారు. తామెవరో తామే తెలుసుకోలేకపోతున్నారు. ఇప్పుడు వాళ్ళు ఎవరో వాళ్ళకు చెప్పాల్సి వస్తోంది. వాళ్ళు తమకు ఓ గుర్తింపు ఉండాలని ఉద్విగ్నులైపోతున్నారు. తమ ఆత్మనూ, నైజాన్నీ విస్మరించి - మరచిపోయి వున్నారు.

అన్ని ఆశయాలనూ మానవుడు వదిలిపెట్టేస్తే తప్ప అడాల్ఫ్ హిట్లర్లూ, జోసెఫ్ స్టాలిన్లూ, మావో జెడాంగ్‌లూ మళ్ళీ మళ్ళీ వస్తూనే ఉంటారు. 'అన్ని ఆశయాలనూ' అని నేను అంటున్నానంటే - మరచిపోకండి - 'అన్ని ఆశయాలనూ' అనే నేను అంటున్నాను. ఉత్తమ ఆశయాలకూ, పనికిరాని ఆశయాలకూ నేను ఏ వ్యత్యాసాన్నీ ఎంచను. అన్ని ఆశయాలూ ప్రమాదకరాలే. నిజానికి ఉత్తమ ఆశయాలే మరింత మహాప్రమాదకారకాలుగా ఉంటాయి, ఎందుకంటే వాటికి మహాఆకర్షణ ఉంటుంది కాబట్టే. మిమ్మల్ని అవి లొంగదీసేసుకుంటాయి. మిమ్మల్ని ఒప్పించేస్తాయి. కానీ ఉన్నదున్నట్లుగా ఆశయాలన్నీ రోగాలే. సరిగ్గా చెప్పాలంటే, అ-స్వస్థతలు. ఎందుకంటే మీరు ద్వంద్వాలుగా చీలిపోతారు కాబట్టి. మీరుగా, ఆశయంగా. మీరు

అయివున్న మీరు నిందార్హులైపోతున్నారు. మీరు కాని మీరు ప్రశంశార్హులైపోతున్నారు. ఇప్పుడు మీకు కష్టం వచ్చేస్తూ ఉంటుంది. అతిత్వరలోనే లేదా కాస్త ఆలస్యంగా మీకు నాడీమండల రుగ్మతలు వచ్చేస్తాయి, ఆధిరోగమో, ఇంకోటో వచ్చేస్తుంది.

బుద్ధుడు ఏ అణచివేతలూ ఉండని జీవితాన్నే అందించాడు. ఆ జీవితం ఆశయరహితంగా కూడా ఉంటోంది. అందువల్లే బుద్ధుడు ఏ దేవుణ్ణి గురించీ మాట్లాడడు. ఏ స్వర్గాన్ని గురించీ మాట్లాడడు. ఏ భవిష్యత్తు గురించీ మాట్లాడడు. మీరు పట్టుకోడానికి ఆయన దేన్నీ మీకు అందించడు. మీ దగ్గర్నుంచి అన్నిటినీ లాగేసుకుంటాడు. మీ ఆత్మను సైతం ఆయన తొలగించేస్తాడు. అన్ని విషయాలనూ ఆయన తీసేస్తూనే ఉంటాడు. చివరికి మీ 'ఆత్మభావాన్ని' కూడా మీలోంచి తొలగించేస్తాడు – మీ 'నేను'ను, మీ 'అహంకారాన్ని'. ఓ మహాశూన్యాన్ని మాత్రమే ఆయన మీలో నిలబెట్టి ఉంచుతాడు. అదెంతో కష్టంగా ఉంటుంది.

అదెంతో కష్టంగా ఎందుకు ఉంటుందంటే 'ఇవ్వడాన్ని' పూర్తిగా మనం మరచిపోయే ఉంటున్నాం కనుక. 'ఎలా తీసుకోవాలో' మాత్రమే మనకు తెలుసు. అన్నిటినీ మనం తీసేసుకుంటూనే ఉంటాం. నేనో పరీక్షను తీసుకుంటాను, నేనో భార్యను తీసుకుంటాను, మధ్యాహ్నంవేళలో ఓ కునుకును కూడా తీసుకుంటాను. మీరు తీసుకుంటూనే వుంటారు – కునుకును కూడా, తీసుకోలేని విషయాన్ని కూడా, దానికే మీరు లొంగిపోవాలి. మీరు లొంగిపోతేనే, మీకు కునుకు వస్తుంది. దానికి లొంగిపోతేనే, మీకు నిద్ర వస్తుంది. భార్యను కూడా, భర్తను కూడా మీరు తీసుకుంటూనే ఉంటారు. మీకు గౌరవం ఉండడం లేదు. భార్య ఓ ఆస్తి కాదు. మీరు ఓ ఇంటిని తీసుకోవచ్చు – మీరు ఓ భార్యనో, భర్తనో ఎలా తీసుకుంటారు? కానీ మన భాష మన బుద్ధినే చూపిస్తూ ఉంటుంది. ఇవ్వడం ఎలాగో మనకు తెలీనే తెలీదు – ఎలా లొంగిపోవాలో మనకు తెలీనే తెలీదు. ఎలా వదిలిపెట్టెయ్యాలో మనకు తెలీనే తెలీదు. విషయాలను ఎలా సాగనివ్వాలో మనకు తెలీనే తెలీదు.

బుద్ధుడు అన్ని ఆశయాలనూ తీసేసుకుంటాడు. భవిష్యత్తునంతటినీ తీసేసుకుంటాడు. చివరికి ఇచ్చుకోవడానికి మహాకష్టంగా ఉండే మన ఆత్మను కూడా ఆయన తీసేసుకుంటాడు. అంతా తీసేసుకుని ఓ మహాస్వచ్ఛమై ఉన్న, అమాయకంగా ఉన్న, మహాపవిత్ర శూన్యత్వాన్ని మాత్రమే మనలో వదిలిపెట్టేస్తాడు. ఆ మహాపవిత్ర మహాశూన్యత్వాన్నే ఆయన 'నిర్వాణం' అంటాడు. నిర్వాణం ఓ లక్ష్యం కాదు. అది కేవలం మీ శూన్యత్వం మాత్రమే. మీరు పోగుచేసుకుని ఉన్న అంతటినీ విడిచిపెట్టేస్తే,

దాచుకున్నవి ఏవీ అక్కడ మిగిలి ఉండకుండా ఉంటే, మీరు మహాపిసినారిగానో, మహామంకుపట్టు లేనివారుగానో మిగిలి ఉన్నప్పుడు, ఉన్నట్లుండి మీలోంచి ఓ శూన్యత్వమే పొంగుకొస్తుంది. అది ఎప్పటినుంచో అక్కడే ఉంటోంది.

హాక్యూన్ అంటున్నది సరైన మాటనే : “జనించి ఉన్న జీవాలన్నీ, ఆది నుంచీ బుద్ధుళ్ళే”. ఆ శూన్యత్వమే అక్కడుంది. మీలోకి ఎంతో చెత్తను తోసేసుకుని ఉన్నారు కాబట్టి ఆ శూన్యత్వం కనిపించడం లేదు. సరిగ్గా ఈ విధంగానే అది ఉంటుంది: మీరు ఇంట్లోకి వస్తువుల్ని చేర్చుకుంటూ ఉంటారు. కొంతకాలం వస్తువులు మీ ఇంట్లో పోగయ్యేసరికి ఎక్కడా మీకు స్థలమే కనిపించదు. మీ ఇంట్లో అప్పుడు స్థలమే ఉండదు. ఓ రోజు వచ్చేసరికి మీకు ఇంట్లో నడవడానికి కూడా స్థలం ఉండదు. మీకు మీ ఇంట్లో నడవడం ఎంతో కష్టమైపోతుంది. జీవించడానికే స్థలం ఉండడం లేదు కాబట్టి జీవితమే దుర్భరం అయిపోతుంది. కానీ ‘స్థలం’ ఎక్కడికీ వెళ్ళిపోలేదు. దీన్ని గురించి ఆలోచించండి. ధ్యానించి చూడండి. ఇంట్లో స్థలం ఎక్కడికీ పోలేదు, మీరే ఎన్నో సామానులను తీసుకొచ్చి అక్కడ పెట్టుకున్నారు – టీవీనీ, రేడియోనూ, రేడియోగ్రామ్‌నూ, పియానోనూ, అన్నిటినీ – కానీ స్థలం ఎక్కడికీ పోలేదు. అన్ని సామాన్లనూ అక్కణ్ణుంచి తొలగించండి. అప్పుడు అక్కడ స్థలం వుంటుంది. అది ఎప్పుడూ అక్కడే ఉంది. సరంజామా అంతా అక్కడ ఉంటూ ఉండడం వల్ల ఆ స్థలం మీకు కనిపించకుండా దాక్కుని ఉంటోంది, కానీ అది నాశనం అయిపోవడంలేదు. ఏ ఒక్క క్షణంలోనైనా అది మీ గదిలో నుంచి వెళ్ళిపోలేదు. మీ శూన్యత్వం కూడా ఆ విధంగానే ఉంటుంది. మీ నిర్వాణం కూడా. మీ ఏమీలేనితనం కూడా.

బుద్ధుడు మీకు నిర్వాణాన్ని ఓ ఆశయంగా ఇవ్వడు. ఆయన బలవంతాన్ని ఇచ్చేందుకు బదులుగా విముక్తినే ఇస్తాడు. బుద్ధుడు మీకు ఎలా జీవించాలో నేర్పిస్తాడు – ఏ లక్ష్యంకోసమో కాదు, ఏ విషయాన్నో సాధించడంకోసం కాదు, ఇప్పుడే ఇక్కడే ఆనంద తన్మయత్వంలో ఉండడానికోసం – ఎరుకతో ఎలా జీవించవచ్చునో దానికోసం – ఎరుక దేన్నో సాధించే సాధనం కాదు. అదే దానికి స్వయంగా అంతం. దానికి సాధనా, లక్ష్యమూ రెండూ ఒకటే. దానికి అంతర్గత విలువే వుంది.

బుద్ధుడు ఏ అలౌకికాన్నీ మీకు బోధించడు. దీన్ని అర్థం చేసుకుని తీరాలి. ప్రజలు ప్రాపంచికంగానే వుంటారు. పూజారులు మీకు అలౌకికాన్ని బోధిస్తూ ఉంటారు. ఆ అలౌకికం నిజంగా అలౌకికంగా ఉండదు. అది ఓ అలౌకికంగా ఉండగలగడం అసాధ్యం. ఎందుకంటే మెరుగుపెట్టబడివున్న ఈ ప్రపంచపు

ఊహాస్వరూపం మాత్రమే అది కాబట్టి. మీరు మరో ప్రపంచాన్ని ఎందులోంచి సృష్టించగలుగుతారు? ఈ ప్రపంచం గురించి మాత్రమే మీకు తెలుసు. దీనికే మెరుగులు దిద్దొచ్చు. ఈ మరో ప్రపంచాన్నే మీరు మెరుగుపెట్టొచ్చు. వికారంగా ఉంటున్న కొన్ని విషయాలను తొలగించేసి, ఉంటే బావుంటుందని మీకు అనిపిస్తున్న కొన్ని విషయాలను పట్టుకొచ్చి అక్కడ ఉంచొచ్చు. కానీ ఈ ప్రపంచంతో మీకున్న అనుభవాన్ని పురస్కరించుకునే ఉంటుంది మీరు ఇక్కడే దీని మీదే సృష్టిస్తూ ఉన్న ఆ మరోప్రపంచం. కాబట్టి మీ ప్రపంచం అప్పుడు మహావిభిన్న ప్రపంచంగా వుండదు. అక్కడికి కాలానుగుణంగా కనిపించే మార్పులు మాత్రమే వస్తాయి. అది మీ ఊహల్లోంచే వస్తుంది. అది మీ 'కల్పన ఆట'.

మీకోసం అక్కడ ఓ మహాఅందగత్తె ఉంటుంది – అవును మరి, ఇక్కడున్న అందగత్తెల కన్నా ఎక్కువ అందమే అక్కడ ఉండితీరాలి – ఇక్కడ మీరు అనుభవిస్తున్న సౌఖ్యాలే అక్కడ కూడా మీకు లభిస్తూ ఉంటాయి – కాకపోతే మరింత శాశ్వతంగా, స్థిరంగా – కానీ ఇక్కడ ఉన్న సౌఖ్యాల్లాంటివే అక్కడ కూడా ఉంటాయి. మీకు అక్కడ మరింత చక్కటి ఆహారం లభిస్తుంది – ఇంకా ఎక్కువ రుచి ఉన్న ఆహార పదార్థాలు – కానీ అక్కడ ఆహారం ఉంటుంది. మీకు ఇళ్ళు ఉంటాయి – అవి బంగారంతో నిర్మితమై ఉండొచ్చు – కానీ అవి ఇళ్ళలాగానే ఉంటాయి. ఇక్కడ సాగిస్తున్న వ్యవహారాన్నే అక్కడ కూడా మీరు సాగిస్తూ ఉంటారు.

ప్రాచీన ఉల్లేఖనాలలోకి వెళ్ళిచూడండి చాలు. ఆ స్వర్గాన్ని వాళ్ళెలా ఊహించి కల్పించుకున్నారో. ఆ స్వర్గం ఇక్కడున్న ప్రపంచానికే మెరుగులు దిద్దబడి కనిపిస్తుంది. ఇక్కడ కొంచెం మెరుగు, అక్కడ కొంచెం మెరుగు. కానీ అది ఏ విధంగానూ అలౌకికంగా ఉండదు. అందువల్లే అన్యమతాల వాళ్ళ అలౌకికత్వం మరింత అలౌకికంగా ఉండదని నేను అంటూ ఉంటాను; ఇప్పుడున్న ప్రపంచాన్నే భవిష్యత్తులోకి ప్రసారం చేస్తారు. ఈ ప్రపంచానుభవం మీదే ఆ స్వర్గం కూడా ఆధారపడి ఉంటుంది. దైన్యం, దరిద్రం, రోగం, పక్షవాతం, అంధత్వం, చెవిటితనం ఉండదు. ఇక్కడ మీకు నచ్చనివి ఏవీ ఉండవు అక్కడ. మీకు ఇక్కడ నచ్చుతున్న విషయాలన్నీ అక్కడ మహాసమృద్ధంగా ఉంటాయి. కానీ అక్కడ ఏ నవ్యత్వమూ ఉండదు.

మనస్సుకు నవ్యతను ఊహించే సామర్థ్యం ఉండదు. ఓ నవ్యతను పరికల్పించుకోవడానికి మనస్సుకు సామర్థ్యం ఉండదు. మనస్సు పాతలోనే జీవిస్తూ ఉంటుంది. మనస్సే పాతగా ఉంటోంది. ఏ నవ్యత్వమూ మనస్సులోంచి ఎప్పటికీ

ఆవిర్భవించదు. ఓ నవ్యత సంభవించగలిగేది మనస్సు పనిచేయకుండా ఉంటున్నప్పుడు మాత్రమే, మనస్సు మిమ్మల్ని అదుపులో ఉంచుకుంటూ ఉండనప్పుడు మాత్రమే, మీ మనస్సు పక్కకు వెళ్ళిపోయినప్పుడు మాత్రమే, మీ మనస్సు తన జోక్యాన్ని కల్పించుకోకుండా ఉన్నప్పుడు మాత్రమే ఓ నవ్యత్వం సంభవిస్తుంది.

అయినా ప్రాచీన ఉల్లేఖనాలన్నీ స్వర్గం గురించే మాట్లాడుతూ ఉంటాయి – హెవెన్ గురించే, పారడైజ్ గురించే, ఫిర్‌దౌస్ గురించే, స్వర్గం గురించే మాట్లాడుతూ ఉంటాయి అవన్నీ, కానీ అన్ని మాటలూ చెప్తున్నది అదే కథనే. అవి మరింత మేలైన కాగితాల మీద, ఇంకా మంచి సిరాతో ముద్రింపబడి, మరింత కొత్త ముద్రణా యంత్రంతో అచ్చొత్తింపబడి, మరింత ఎక్కువ వర్ణచిత్రాలతో కనిపించవచ్చు. కానీ కథ మాత్రం మారదు. మనకు తెలిసున్న కథే ఉంటుంది అక్కడ. అది మరోవిధంగా ఉండనే ఉండదు.

బుద్ధుడు ఎప్పుడూ అలౌకికాన్ని గురించీ, మరో ప్రపంచం గురించీ మాట్లాడనే మాట్లాడడు. కేవలం మీకు బోధిస్తాడు ఈ ప్రపంచంలో జీవించడం ఎలాగో; ఇక్కడ చురుకుగా ఎలా ఉండాలో, చైతన్యంతో ఎలా ఉండాలో, మనస్సుతో ఎలా మెసులుతూ ఉండాలో మాత్రమే చెప్తూ ఉంటాడు, మీ శూన్యత్వం మీదికి ఏదీ దూసుకొచ్చి కొట్టుకోకుండా; మీ శూన్యత్వం కలుషితం అయిపోకుండా, మీ శూన్యత్వం విషపూరితం అయిపోకుండా; ఇక్కడే జీవిస్తూ ఉన్నా కలుషితం కాకుండా అది ఉండగలగడానికి; ఈ ప్రపంచంలోనే మీరున్నా, ఈ ప్రపంచం మీ లోపలికి వచ్చేయకుండా ఉంచేందుకు.

మరో ప్రపంచపు ఆధ్యాత్మికత తప్పకుండా ఉంటుంది అణచిపెట్టబడే పద్ధతితోనే, విధ్వంసకరంగానే, ఆత్మను చిత్రహింసలపాలు చేసేదిగానే – ఒక్కమాటలో రోగిష్టిగా. బుద్ధుడి ఆధ్యాత్మికతకు ఓ విభిన్న సుగంధం ఉంటుంది – 'ఆశయరహితం' అన్న సుగంధం. భవిష్యత్తే ఉండని సుగంధం, ఏ అలౌకికమూ కాని సుగంధం. అది ఉంటుంది ఇక్కడి ఇప్పటి పువ్వులా. అది దేన్నీ అడగదు; ఇప్పటికే దానికి అన్నీ ఇవ్వబడ్డాయి. అది తయారవుతుంది అప్పుడు మరింత చురుకుగా, మరింతగా దాన్ని చూసేందుకు, మరింతగా దాన్ని వినేందుకు, మరింతగా మీరు ఉండడానికి.

జ్ఞప్తిలో ఉంచుకోండి. ఎంత చైతన్యంతో మీరుంటారో అంతగానే మీరుంటారు. మీరు మరింత ఎక్కువగా ఉండాలనుకుంటే, మరింత చైతన్యంగా మీరుండాలి. చైతన్యమే జీవిని అందిస్తుంది. అచైతన్యం జీవిని పట్టుకుపోతుంది.

మీరు తాగేసి ఉంటే, మీ జీవిని పోగొట్టుకుని ఉంటారు. గాఢనిద్రపోతూ ఉంటే మీ జీవి పోయి ఉంటుంది. మీరు ఎప్పుడూ దీన్ని గమనించనే లేదా? మీరు చురుకుగా ఉన్నప్పుడు, మీకు ఓ విభిన్న లక్షణం ఉంటుంది – మీరు కేంద్రంలో స్థితమై, వేళ్ళుపాతుకుని ఉంటారు. మీరు చురుకుగా ఉన్నప్పుడు మీ జీవి గరిమను మీరు తెలుసుకుంటారు. నిజంగానే దాదాపుగా దానికి ఏ ఘనమో ఉంటుంది. మీరు అచైతన్యంగా ఉన్నప్పుడు, ఈడ్చుకుంటూ సాగుతున్నప్పుడు, నిద్రలో ఉన్నట్లు మీ జీవి స్పృహ మీకు అతి తక్కువగానే ఉంటుంది. మీ జీవి స్పృహ ఎంత చేతనత్వంతో మీరు ఉంటారో అంతే ఎక్కువగా మీకు ఉంటుంది.

ఆ విధంగా బుద్ధుడి ఉపదేశం అంతా చైతన్యంగా మిమ్మల్ని ఉండమనే, మరే కారణంతోనూ కాదు ఆయన సందేశాన్ని ఇస్తున్నది. చైతన్యంగా మీరు ఉండడం కోసమే – చైతన్యమే జీవిని ఇస్తుంది కాబట్టి. చైతన్యమే మిమ్మల్ని సృష్టిస్తుంది. మీరు ఊహించలేనంతటి 'మిమ్మల్నే', ఇప్పుడు మీరున్నట్లు ఉండని 'మిమ్మల్నే' ప్రసాదిస్తుంది చైతన్యం – ఓ 'మిమ్మల్ని'– 'నేను' మాయమైపోయి ఉన్నవాణ్ణి. ఎక్కడ 'ఆత్మ' అన్న ఏ ఊహ కూడా ఉండదో దాన్ని. దేనితోనూ నిర్వచించబడలేనివాణ్ణి... ఓ నిర్మల శూన్యత్వంగా, ఓ అనంతత్వంగా, ఎల్లలు లేని మహాశూన్యత్వంగా.

దీన్నే బుద్ధుడు 'ధ్యానస్థితి' అని అంటాడు – సమ్మా సమాధి అని, సరిఅయిన ధ్యానస్థితి అని. మీరు మహా ఏకాంతంలో ఉన్నప్పుడు. కానీ గుర్తుపెట్టుకోండి – ఏకాంతం ఒంటరితనం కాదు. ఎప్పుడైనా ఈ 'ఏకాంతం' అన్న అందమైన పదం గురించి మీరు ఆలోచించి ఉన్నారా? 'సర్వస్వమూ ఒకటైపోయి ఉండడం' అనే ఈ పదానికి అర్థం. 'ALONE' అన్న ఈ పదంలో రెండు పదాలు ఉన్నాయి. ALL (అందరూ –సర్వస్వం) అనీ, ONE (ఒక్కడు) అనీ. ఏకాంతంలో మీరే సర్వస్వం అయిపోయి ఉంటారు.

ఏకాంతంలో ఏ ఒంటరితనమూ ఉండదు. మీరు ఏకాంతంలో ఉన్నప్పుడు మీరు ఒంటరిగా ఉండరు. మీరు ఏకాంతంగానే ఉంటారు, కానీ ఒంటరిగా మాత్రం ఉండరు – మీరు సర్వస్వంతో ఏకీభవించే ఉంటారు కాబట్టి. మీరు ఒంటరిగా ఎలా ఉండగలుగుతారు? మీరు ఎవరినీ పోగొట్టుకుని ఉండరు. సత్యం. వాళ్ళందరినీ మీరు మరచిపోయి ఉంటారు అన్నది కాదు అర్థం. వాళ్ళు ఎవరూ మీకు అక్కర్లేదని కాదు అర్థం. వాళ్ళను ఎవ్వరినీ మీరు పట్టించుకోరని కాదు అర్థం. మీకు ఎవరూ గుర్తుండరు. ఎందుకంటే మీరు అందరితోనూ ఏకీభవించే ఉంటున్నారు కాబట్టి.

అక్కడ స్వయానికీ, సర్వస్వానికీ ఉన్న తారతమ్యాలన్నీ పోగొట్టుకోబడ్డాయి. ఒక్కడే సర్వస్వం అయిపోయి ఉన్నాడు. సర్వస్వమే ఒక్కడిగా అయిపోయి ఉంటోంది. ఈ ALONE అన్న ఇంగ్లీషు పదం ఎంతో అందంగా ఉంటోంది.

బుద్ధుడు సమ్మాసమాధినే 'ఏకాంతం' అని అంటాడు. మహాఏకాంతంలో సర్వస్వంతో ఏకీభవించే మీరు ఉండడమే సరయిన ధ్యానం. దీన్ని మీకు బాగా అర్థం అయ్యేట్లు నన్ను చెప్పనీయండి. మీరు మహాశూన్యంగా ఉంటే మీ ఎల్లలన్నీ అదృశ్యం అయిపోయి ఉంటాయి, శూన్యత్వానికి ఏ ఎల్లలూ ఉండవు కాబట్టి. శూన్యత్వం మాత్రమే ఉండగలుగుతుంది అనంత విస్తృతత్వంతో. శూన్యత్వానికి ఏ బరువూ ఉండదు. శూన్యత్వానికి ఏ రంగూ ఉండడానికి వీలులేదు. శూన్యత్వానికి ఏ పేరూ ఉండడానికే వీలులేదు. శూన్యత్వానికి ఏ స్వరూపమూ ఉండడానికి వీలులేదు. శూన్యంగా మీరున్నప్పుడు, మిమ్మల్ని ఉలా విభజించుకోగలుగుతారు సర్వస్వం నుండి? అన్యులందరి నుండి? – మీకు ఏ రంగూ లేదు కనుక, మీకు ఏ పేరూ లేదు కనుక, మీకు ఏ స్వరూపమూ లేదు కనుక, మీకు ఏ ఎల్లలూ ఉండవు. అప్పుడు ఏ వ్యత్యాసాలనైనా మీరు ఎలా గుర్తించగలుగుతారు? మీరు శూన్యంగా ఉన్నప్పుడు సర్వస్వంగానే – అంతా మీరే అయిపోయి – ఉంటారు. మీరు ఓ ద్వీపంగా ఉండనప్పుడు, ఉనికి అంతా మీలో విలీనం అయిపోయే ఉంటుంది. ఓ అనంత మహావిస్తృత ఖండంగానే మీ 'ఉనికి' ఉంటుంది అప్పుడు.

బుద్ధుని బోధాసర్వస్వమూ ఈ 'సమ్మాసమాధి' అన్న మాటలోనే సంక్షిప్తీకరించబడి వినిపించింది. సమ్మాసమాధి, సరైన ధ్యానం. ఏది సరైన ధ్యానం? ఏది సరికాని ధ్యానం? ధ్యాని మిగిలి ఉంటే అప్పుడు అది సరైన ధ్యానం కాదు. ధ్యానంలో ధ్యాని కూడా అదృశ్యం అయిపోయి ఉంటే అదే అప్పుడు సరైన ధ్యానం. సరైన ధ్యానం మిమ్మల్ని శూన్యంలోకే, ఏకాంతంలోకే చేరుస్తుంది.

ఈ సూత్రం... ఈ సూత్రం మొత్తం మహాశూన్యంగా ఎలా తయారవ్వాలి అన్న విషయాన్నే ప్రబోధిస్తుంది. ప్రపంచానికి అందిన మహాప్రాథమిక కానుకే ఈ సూత్రం.

**అలా విన్నా ఒకప్పుడు నేను.**

ఈ సూత్రాలనన్నింటినీ బుద్ధుని మహాశిష్యుడైన ఆనందుడు గుర్తుపెట్టుకున్నాడు. ఒక్క విషయాన్ని మనం ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలి. బుద్ధుడి అన్ని సూత్రాలూ ఇలా ప్రారంభం అవుతాయి 'అలా విన్నా ఒకప్పుడు నేను'.

బుద్ధుడు మరణించిన తరువాత ఆయన శిష్యులు అందరూ కలుసుకున్నారు, ఆ నలభైఅయిదు ఏళ్ళలో బుద్ధుడు ఏమేం చెప్పాడో అంతటినీ సమగ్రంగా సంగ్రహించేందుకు. ఆ నలభైఅయిదు సంవత్సరాలలో ఆనందుడు బుద్ధుడితోపాటే ఉండేవాడు, ఆయనతో కలిసి సహజీవిస్తూ. ఆయన జ్ఞాపకాలను మహాప్రామాణికంగా మనం స్వీకరించవచ్చు. ఇంకా ఎందరో వీటిని విన్నారు కానీ వాళ్ళు వీటిని విన్నది వేరొకరి నుంచి. కొంతకాలం వాళ్ళు బుద్ధుడితోపాటే ఉండేవాళ్ళు. కొంతకాలం ఆయనకు దూరంగా ఉండేవాళ్ళు. ఆనందుడు ఒక్కడు మాత్రమే బుద్ధుడితోనే ఉండేవాడు, ఓ నీడలాగా.

ఆ విధంగా ఆనందుడు చెప్తున్నాడు, కానీ ఇందులో ఉన్న సౌందర్యం ఏమిటంటే ఆనందుడు ఎప్పుడూ చెప్పలేదు "బుద్ధుడు ఇలా అన్నాడు!" అని ఆయన అంటాడు "అలా విన్నా ఒకప్పుడు నేను" అని. ఎంతో గొప్ప వ్యత్యాసం ఉంది ఈ మాటలో. ఆయన "బుద్ధుడిలా అన్నాడు" అని చెప్పడు. ఎందుకంటే, ఆయన అంటాడు "బుద్ధుడు చెప్పిన మాటలను నేను ఎలా చెప్పగలుగుతాను? నేను చెప్పగలిగిందంతా ఇది మాత్రమే – దీన్నే నేను విన్నాను అని. బుద్ధుడు చెప్పిన మాటలను, ఆయనకు మాత్రమే తెలుసు. ఏ అర్థంతో ఆ మాటలను చెబుతున్నాడో, ఆయనకు మాత్రమే తెలుసు. నాకు వినిపించిన మాటలను మాత్రమే నేను గుర్తుపెట్టుకున్నాను. నా సామర్థ్యం పరిమితమే. ఆయన మరే అర్థంతోనో ఆ మాటలను చెప్పి ఉండవచ్చు. కొన్ని పదాలను నేను మరచిపోయి ఉండవచ్చు. నా స్వంత పదాలను కొన్నింటిని ఆయన మాటల్లో కలిపేసి ఉండవచ్చు."

అత్యంత నిజాయితీ ఉన్న గొప్ప మాట ఇది. ఆయన ప్రకటించుకుని ఉండవచ్చు – "ఈ మాటలనే బుద్ధుడు అన్నాడు. నేను అక్కడే ఉన్నాను. నేనే దీనికి సాక్షిని" అని. నిజంగానే ఆయన సాక్షిగా ఉండేవాడు. ఎవ్వరూ దాన్ని కాదనలేరు. కానీ ఆ మనిషిలో ఎంత వినమ్రత ఉందో గమనించి చూడండి. ఆయన అంటాడు "అలా విన్నా ఒకప్పుడు నేను. బుద్ధుడు చెబుతూ ఉండేవాడు. నేను వింటూ ఉండేవాణ్ణి... నేను విన్న మాటలను మాత్రం చెప్పగలుగుతాను. అది సరిగ్గా ఉండవచ్చు. నా మాటలు తప్పుగా కూడా ఉండవచ్చు. నేనే ఆ మాటలను ఊహించుకుని ఉండవచ్చు. నేనే ఆ మాటలను అన్వయించుకుని ఉండవచ్చు. కొన్ని మాటలను నేను మరచిపోయి ఉండవచ్చు. నా మనస్సులోని మాటలు కొన్ని బుద్ధుడి మాటలతో కలిసిపోయి ఉండవచ్చు – ఇవన్నీ సాధ్యాలే. జ్ఞానోదయాన్ని ప్రాప్తించుకోని

మనిషిని నేను" – ఆనందుడికి ఇప్పటికీ జ్ఞానోదయం కలుగలేదు. కాబట్టి ఆయన అంటాడు "ఇంతమాత్రమే నేను చెప్పగలుగుతాను, రూఢిగా."

> **అలా విన్నా ఒకప్పుడు నేను. ఆ భగవానుడు ఉండేవాడప్పుడు శ్రావస్తిలో... ఓ ప్రాతఃకాలంలో ఆ భగవానుడు భిక్షువలువలను ధరించాడు, భిక్షాపాత్రను తీసుకున్నాడు, భిక్షాన్ని స్వీకరించేందుకు శ్రావస్తీ మహానగరానికి చేరుకున్నాడు.**
>
> **ఆహారాన్ని భుజించి తన భిక్షా అవృత్తి నుండి వెనుదిరిగి వచ్చేసిన తరువాత, భగవానుడు భిక్షాపాత్రనూ, వలువలనూ యథాస్థానాల్లో పెట్టేసి, చేతులూ కాళ్ళూ కడుక్కుని, ఆయన కోసం తయారుచేసి ఉన్న ఆసనం మీద కూర్చుని, పద్మాసనం వేసుకుని, నిటారుగా శరీరాన్ని నిలిపి, తన ముందున్న స్థలం మీద దృష్టిని నిలిపి ఉంచాడు.**

ఇది మీకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఆనందుడు మాట్లాడుతున్నప్పుడు, ఎంతో సూక్ష్మమైన విషయాలను కూడా ఆయన గమనించి మాట్లాడుతూ ఉంటాడు. ఎవరికి తెలుసు – బుద్ధుని మాటలను మీరు చెప్తున్నప్పుడు, ఎంతో జాగ్రత్తగా మీరు ఉండాలి. ఉమ్? ఇంత మాటను కూడా విడిచిపెట్టకుండా పదే పదే చెప్తూ ఉంటాడు ఆనందుడు – ఇంత చిన్న విషయాన్ని కూడా.

> **ఓ ప్రాతఃకాలంలో ఆ భగవానుడు భిక్షువలువలను ధరించాడు, భిక్షాపాత్రను తీసుకున్నాడు, భిక్షాన్ని స్వీకరించేందుకు శ్రావస్తీ మహానగరానికి చేరుకున్నాడు.**

బుద్ధుణ్ణి ఆనందుడు అనుసరిస్తూనే ఉంటున్నాడు ఓ నీడలా. నిశ్శబ్దంగా నీడలా ఆయన్ని గమనించుకుంటూ. కేవలం బుద్ధుణ్ణి అలా గమనించుకుంటూ ఉండడమే ఓ గొప్ప ఆశీర్వాదం. ఆనందుడు బుద్ధుణ్ణి సాంతంగా గమనించుకుంటూ ఉంటున్నాడు.

> **ఆహారాన్ని భుజించి తన భిక్షా అవృత్తి నుండి వెనుదిరిగి వచ్చేసిన తరువాత, భగవానుడు భిక్షాపాత్రనూ, వలువలనూ యథాస్థానాల్లో పెట్టేసి, చేతులూ కాళ్ళూ కడుక్కుని, ఆయన కోసం తయారుచేసి ఉన్న ఆసనం మీద కూర్చుని...**

మొట్టమొదటిసారిగా బుద్ధుని సూత్రాలను పాశ్చాత్య భాషల్లోకి అనువాదాలు చేసుకుంటున్నప్పుడు అనువాదకులకు ఎంతో సందిగ్ధం కలిగింది. చెప్పబడిన విషయాలే మళ్ళీ పునర్వచింపబడుతున్నాయి. ఎందుకు? ఒకే మాట మళ్ళీ అనేకసార్లు పునరావృతం అవుతూనే ఉంటుంది. చెప్పిందే మళ్ళీ ఇంకోసారి, మళ్ళీ ఇంకోసారి చెప్పబడుతూనే ఉంటుంది. చిన్న చిన్న విషయాలను మళ్ళీ మళ్ళీ ఎందుకు చెప్పడం? వాళ్ళకు అర్థం కాలేదు. అవన్నీ అక్కడ అనవసరంగా ఉన్నాయని వాళ్ళకు అనిపించింది. అన్నిసార్లు ఆ మాటలనే పునరుద్ఘాటించాల్సిన అవసరమే లేదు అనిపించింది వాళ్ళకు. అన్నిసార్లు ఎందుకు చెప్పాలి? కానీ వాళ్ళు కనిపెట్టలేకపోయారు. ఆనందుడు ఏం చెబుతున్నాడంటే అతి స్వల్ప విషయాలను సైతం అతి గొప్ప విషయాలను ఎంతో జాగ్రత్తగా పట్టించుకున్నట్లే బుద్ధుడు పట్టించుకుంటూ ఉంటాడని. బుద్ధుడి దృష్టిలో ఏవీ అల్ప విషయాలు కావు, ఏవీ గొప్ప విషయాలూ కావు. అంతా సమానమే.

బుద్ధుడు ఓ భిక్షాపాత్రను తన చేతుల్లోకి తీసుకుంటున్నప్పుడు ఆ భిక్షాపాత్ర పట్ల ఎంతో గౌరవాన్ని ప్రదర్శిస్తాడు, ఓ దేవుడి పట్ల భక్తిని ప్రకటిస్తున్నట్లుగానే. దుస్తుల్ని ధరిస్తున్నప్పుడు కూడా మనస్సంతా పూర్తిగా దానిమీదే ఉంచుకుని చేస్తాడు. ఆయన ఎంతో స్పృహతో ఉంటాడు. యాంత్రికంగా ఉండనే ఉండడు. దుస్తుల్ని ధరిస్తున్నప్పుడు మీరు మహా యాంత్రికంగా ఉంటారు. యాంత్రికంగా ఆ దుస్తుల్ని ఎలా ధరించాలో మీకు బాగా తెలుసు. కాబట్టి ఆ పని మీద ధ్యాసపెట్టడం ఎందుకు? మీ మనస్సు అప్పుడు వెయ్యిదిశల్లో చరిస్తూ ఉంటుంది. నీటిజల్లుతో మీరు స్నానం చేస్తూ ఉంటారు – కానీ పడుతున్న నీటిజల్లు మీద మీకు ఏ గౌరవమూ ఉండదు. మీరు అక్కడ ఉండరు. మరెక్కడో ఉంటారు. మీరు భోంచేస్తారు, కానీ మీకు ఆహారం పట్ల గౌరవం ఉండదు. మీరు అక్కడ ఉండరు. ఆహారాన్ని లోపలికి తోసేసుకుంటూ, మింగుతూ ఉంటారు. అలవాటు ప్రకారమే యాంత్రికంగా మీ పనులన్నీ జరుగుతూ ఉంటాయి. ఓ బుద్ధుడు ఏ పనినైనా చేస్తూ ఉంటే సాంతంగా ఆయన అందులోనే పూర్తిగా నిమగ్నమై ఉంటాడు, ఇంకెక్కడో ఉండడు.

> **ఆహారాన్ని భుజించి తన భిక్షా అవృత్తి నుండి వెనుదిరిగి వచ్చేసిన తరువాత, భగవానుడు భిక్షాపాత్రనూ, వలువలనూ యథాస్థానాల్లో పెట్టేసి, చేతులూ కాళ్ళూ కడుక్కుని, ఆయన కోసం తయారుచేసి ఉన్న ఆసనం మీద కూర్చుని, పద్మాసనం వేసుకుని, నిటారుగా శరీరాన్ని నిలిపి, తన ముందున్న స్థలం మీద దృష్టిని నిలిపి ఉంచాడు.**

ఈ సూక్ష్మవిషయాల గురించి ప్రత్యేకించి చెప్పుకుంటే ఎంతో అర్థవంతంగా ఉంటుంది. ఎందుకంటే బుద్ధ లక్షణాలను అవి ఎత్తిచూపుతాయి కాబట్టి, ప్రతిక్షణంలోనూ బుద్ధుడు పూర్తి ఎరుకతోనే జీవిస్తూ ఉంటాడు. ఏ పని చేస్తున్నాడు అన్నది అసంగతం. ప్రతి క్షణంలోనూ తాను ఏ పనిచేస్తూ ఉన్నా శ్రద్ధతో చేస్తూ అందులోనే తన జాగృతాన్ని నింపుతూ ఉంటాడు పూర్ణంగా. తలపంకించినా, చెయ్యి ఆడించినా, ఏ అనుభూతిని ఏ విధంగా ప్రకటించినా, ఏ సంజ్ఞను చేసినా, ఏ చేష్ట చేసినా పూర్తిగా తనే అది అయిపోయి ఉంటూ చేస్తాడు. ఓ చిరునవ్వు నవ్వితే ఆయన ఆ నవ్వే అయిపోయి ఉంటాడు. మాట్లాడుతున్నప్పుడు మాటలే అయిపోయి ఉంటాడు. నిశ్శబ్దంగా ఉన్నప్పుడు ఆ నిశ్శబ్దమే తను అయిపోయి ఉంటాడు.

ఓ బుద్ధుణ్ణి గమనిస్తూ ఉండడం కూడా ఓ మహదాశీర్వాదమే – ఆయన ఎలా నడుస్తాడో, ఆయన ఎలా కూర్చుంటాడో, ఆయన ఎలా తన చేష్టలను చేస్తూ ఉంటాడో, ఎలా మిమ్మల్ని చూస్తూ ఉంటాడో. ప్రతిక్షణమూ ఎరుక వెలుగుల్ని చిమ్ముతూ ఉన్న క్షణమే అయి ఉంటుంది. అందువల్లే ఆనందుడు వాటన్నింటినీ వర్ణించి చెప్తూ ఉంటాడు. బుద్ధుడు తిరిగొచ్చిన తరువాత అక్కడ ఓ మహానిశ్శబ్దమే ఉండి ఉంటుంది - ఆయన భిక్షావలువలను విప్పి మడిచి జాగ్రత్తగా యధాస్థానంలో పెట్టుకుంటున్నప్పుడు, భిక్షాపాత్రను ఏ దుమ్మూ లేకుండా తుడిచి యధాస్థానంలో బోర్లించి పెడుతున్నప్పుడు, పద్మాసనం వేసుకుంటున్నప్పుడు, శరీరాన్ని నిటారుగా నిలిపి ఉంచుకుంటున్నప్పుడు, ముందున్న స్థలం మీద తన దృష్టిని నిలిపి ఉంచుకుంటున్నప్పుడు. 'ముందున్న స్థలం మీద మీ దృష్టిని నిలిపి ఉంచుకోవడం' అంటే ఏమిటి? అది ఓ ప్రత్యేక స్థితి. దాన్నే 'ఆనాపానసతి యోగం' అంటారు. మీ లోపలికి వస్తున్న, మీ నుంచి బయటికి వెళ్తున్న శ్వాసమీదే నిమగ్నితమైన ధ్యాసను ఉంచుకోవడం. 'ముందున్న స్థలం మీద మీ దృష్టిని నిలిపి ఉంచుకోవడం' అన్న మాటలకు అర్థం ఇదే.

బుద్ధుడు ఏ పనినైనా చేస్తూ ఉన్నప్పుడు, ఉదాహరణకోసం – దుస్తుల్ని వేసుకుంటూ ఉన్నప్పుడు ఆ పనిలోనే ఆయన తాదాత్మ్యం అయిపోయి ఉంటాడు. నడుస్తూ ఉన్నప్పుడు ఆ నడకే ఆయన అయిపోయి ఉంటాడు. ఆ నడక మీదే ఆయన ధ్యాస మొత్తం ఉంటుంది. ఆయన ఏ పనినీ చేయకుండా ఉంటూ ఉన్నప్పుడు ఆయన ధ్యాస అంతా శ్వాసక్రియ మీదే ఉంటుంది. ఆయన మహాధ్యాసాత్మకంగా ఉంటాడు. నిద్రపోతూ ఉన్నా ఆయనకు ఆ నిద్ర మీదే ధ్యాస ఉంటుంది.

ఆనందుడు ఒకసారి బుద్ధుణ్ణి అడిగాడు... పదేళ్ళ నుంచీ ఆనందుడు గమనిస్తూనే ఉన్నాడు. ఆయనకు ఓ విషయం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తూ ఉంది. నిద్రపోతూ వున్న బుద్ధుడి శరీరం రాత్రంతా ఒకే స్థితిలో నిశ్చలంగా ఉంటుంది. ఓ చేతిని రొమ్ము మీద పెట్టుకుని ఆయన పడుకుంటే, ఆ రాత్రంతా ఆ చెయ్యి అక్కడే ఉంటుంది. ఆనందుడు ఈ విషయాన్ని అనేక పర్యాయాలు తదేకంగా గమనించే ఉంటాడు. బుద్ధుడు నిద్రపోతున్నప్పుడు ఎన్నోసార్లు లోపలికి వచ్చి తొంగిచూసే ఉంటాడు ఆనందుడు. అలా చూడడం తనకు ఎంతో అర్థవంతమే అయి ఉంది. ఉమ్‌మ్? – బుద్ధుడు ఎలా నిద్రపోతాడు? ఆనందుడికి ఎంతో సందిగ్ధత, ఆశ్చర్యం కలిగాయి – ఒకే స్థితిలో ఆయన ఎలా నిద్రపోగలుగుతున్నాడు? ఆనందుడు తన కుతూహలాన్ని ఆపుకోలేకపోయాడు. ఒకరోజు బుద్ధుణ్ణి అడిగేశాడు "మీరు నిద్రపోతూ ఉంటే అస్తమానమూ వచ్చి మిమ్మల్ని చూస్తూ ఉండడం ఏమంత గౌరవపూరితంగా ఉండదు. మిమ్మల్ని తొంగిచూస్తూ ఉండడం ఓ మంచిపని కాదు. అటువంటి పనిని నేను చెయ్యనే కూడదు. కానీ నా కుతూహలాన్ని ఆపుకోలేకపోతున్నాను. నాలో మహాసందేహం కలుగుతూ ఉంటోంది. మీరు ఒకే స్థితిలో ఉంటూ కదలకుండా ఎలా నిద్రపోగలుగుతూ ఉన్నారు? నిద్రపోతూ ఉన్నప్పుడు కూడా ధ్యానాత్మకంగా ఉండే పనినే చేస్తున్నారా మీరు?"

అప్పుడు బుద్ధుడు ఇలా అన్నాడు "శరీరానికి నిద్ర కలుగుతుంది, నేను స్పృహలోనే ఉంటాను. ఇప్పుడు నిద్ర వచ్చేస్తూ ఉంది. ఇప్పుడు వచ్చేసి ఉంది. స్థితం అయిపోయింది. శరీరం ఇప్పుడు మహాసౌఖ్యంగా ఉంటోంది. చేతులూ, కాళ్ళూ పూర్తిగా సడలించుకుని సౌఖ్యంగా ఉంటూ ఉన్నాయి – కానీ ధ్యానను జాజ్వల్యమానంగా నిలుపుకునే ఉంటాను."

ధ్యానం ఓ ఇరవైనాలుగు గంటల నిరంతర వ్యాపకం. కాసేపు చేసి ఈ రోజుకు అయిపోయిందని మీరు అనుకునే విషయం కాదు ధ్యానం. ధ్యానమే మీ సుగంధం అయిపోవాలి. అదే మీ వాతావరణం అయిపోవాలి. అది మీరు ఎప్పుడూ, ఏం చేస్తూ ఉన్నా మిమ్మల్ని ఆవరించే ఉండాలి.

> ***...తన ముందున్న స్థలం మీద దృష్టిని నిలిపి ఉంచాడు. అప్పుడు సన్యాసులెందరో వచ్చి ఆ భగవానుణ్ణి దర్శించుకుని, ఆయన పాదాలకు తమ తలలు ఆనించి నమస్కారాలను సమర్పించుకుని, ఆయన చుట్టూ ముమ్మారు ప్రదక్షిణలు చేసి, వెళ్ళి ఓ ప్రక్కన కూర్చున్నారు.***

బుద్ధుణ్ణి ఏ ప్రశ్ననైనా అడగాలనుకుంటే మీకు ఓ సరైన తీరు ఉండాలి. ఆ లక్షణం మీలో ఉంటేనే బుద్ధుడి వద్ద నుండి ఓ సమాధానం వస్తుంది. బుద్ధుడు ఏ సమాధానాన్నీ మీకు చెప్పడని కాదు అర్థం. మీరే మర్యాద లేకుండా ఆయన్ను అడిగి ఉండవచ్చు - ఓ సమాధానాన్ని బుద్ధుడు ఇస్తాడు, కానీ ఆ సమాధానం మాత్రం మీకు అందదు. మీరు మర్యాదగా ప్రశ్నిస్తేనే ఆయన తన సమాధానాన్ని ఇస్తాడని కూడా కాదు దీనికి అర్థం. బుద్ధుడు ఓ సమాధానాన్ని తప్పకుండా ఇస్తాడు. కానీ మీరు అమర్యాదగా ఉండి ఉంటే, అణకువగా, స్వీకార భావంతో, ఓ స్త్రీ ఉన్నట్లు ఉండకపోతే ఆ సమాధానాన్ని మీరు అందుకోలేరు. మీరు ఏ ఉద్దేశ్యంతో ప్రశ్నను అడుగుతున్నారో అందుకు తగ్గట్టుగానే సమాధానం ఉంటుంది.

మీరు ఎలా అడుగుతున్నారు. ఏ వైఖరితో... సమాధానాన్ని స్వీకరించేందుకు సంసిద్ధంగా ఉన్నారా? కేవలం కుతూహలంతో మాత్రమే అడుగుతున్నారా? మీలో అప్పటికే ప్రోగుచేసుకున్న జ్ఞానాన్ని దృష్టిలో పెట్టుకుని అడుగుతున్నారా, ఏమీ నిజంగా తెలీకుండా అమాయకంగా ప్రశ్నిస్తున్నారా? ఆయనకు తెలుసో, తెలీదోనని పరీక్షించేందుకోసం అడుగుతున్నారా? జ్ఞానస్థితిలో ఉండి అడుగుతున్నారా, అజ్ఞానస్థితిలో ఉండి అడుగుతున్నారా? వినమ్రులై, శరణుజొచ్చి ఉన్నారా? మీకు లభించబోతున్న కానుకను స్వీకరించడానికి సంసిద్ధంగా ఉన్నారా? మీరు విచ్చుకుని, వస్తున్నదానిని ఆహ్వానిస్తూ, హృదయంలోకి గ్రహిస్తూ ఉంటున్నారా? ఓ విత్తనంగా మీ హృద్భూమిలో దాన్ని నిలుపుకుంటారా? ఓ బుద్ధుణ్ణి ప్రశ్నించడం ఓ విశ్వవిద్యాలయపు మహాఆచార్యుడిని ప్రశ్నిస్తున్న వ్యవహారంలాగా ఏ మాత్రమూ ఉండదు. ఓ మహాలక్షణ పాత్రత, యోగ్యత మీలో ఉండితీరాలి. అప్పుడే ఆ సమాధానం వల్ల ఓ మేలు మీకు కలుగ గలుగుతుంది.

**అప్పుడు సన్యాసులెందరో వచ్చి ఆ భగవానుణ్ణి దర్శించుకుని,**
**ఆయన పాదాలకు తమ తలలు ఆనించి నమస్కారాలను సమర్పించుకుని,**
**ఆయన చుట్టూ ముమ్మారు ప్రదక్షిణలు చేసి, వెళ్ళి ఓ ప్రక్కన కూర్చున్నారు.**

ఈ మూడు ప్రదక్షిణలూ చేయడం సంకేతంగా ఉంటోంది, మూడు శరీరాల చుట్టూ తిరిగి ప్రదక్షిణాలు చేయడానికి. మొదటి ప్రదక్షిణం భౌతిక శరీరానికి - మన జ్ఞానేంద్రియాలకు తెలుస్తున్న శరీరానికి. బుద్ధుని భౌతిక శరీరం కూడా ఎంతో అందంగా ఉంటుంది. ఆ ఆలయంలోనే దివ్యత్వం నెలకొని ఉంటోంది. కాబట్టి మొదటి ప్రదక్షిణం ఆ భౌతిక శరీరాన్ని అభివందనం చెయ్యడానికి. రెండవ ప్రదక్షిణం

పరమానంద శరీరానికి - రెండవ శరీరానికి. మూడవ ప్రదక్షిణం బుద్ధశరీరానికి. సత్యశరీరానికి.

ఈ మూడు ప్రదక్షిణాలూ మరో విశేష విషయానికి కూడా సంకేతాలు. బౌద్ధంలో మూడు ఆశ్రయాలు, మూడు శరణ్యాలు : "బుద్ధుణ్ణి నేను ఆశ్రయిస్తున్నాను, సంఘాన్ని నేను ఆశ్రయిస్తున్నాను, ధర్మాన్ని నేను ఆశ్రయిస్తున్నాను". ఈ మూడింటికి కూడా ఈ మూడు ప్రదక్షిణాలూ సంకేతాలు.

ఓ మనిషి బుద్ధుణ్ణి ఏమైనా అడగాలని వచ్చినప్పుడు, బుద్ధుని ఆశ్రయాన్ని ఆ మనిషి పొందితీరాలి. ఆ మనిషికి మనఃస్థిరత ఉండాలి : "బుద్ధుని శృతిలోకి నేను చేరిపోతున్నాను" అన్నదాన్ని, "బుద్ధ స్పందన స్థాయిలో అనుస్పందిస్తూ ఉండేందుకు సంసిద్ధుణ్ణయి పోతున్నాను" అన్నదాన్ని, "బుద్ధుణ్ణి ఆశ్రయిస్తున్నాను. మీరే నాకు శరణ్యం. ఓ శిష్యుడిగా మీ దగ్గరికొచ్చాను. తెలియనివాణ్ణి అని తెలుసుకుని మీ వద్దకు వచ్చాను. అమాయకంగా వచ్చాను మీ వద్దకు. విధేయుణ్ణై వంగి మీకు నమస్కరిస్తున్నాను. మీరు జ్ఞానులనీ, నేను అజ్ఞానిననీ గుర్తిస్తున్నాను - నా యోగ్యతకు తగినట్లు మీరు ఏం చెప్పినా స్వీకరించేందుకు సంసిద్ధుణ్ణై ఉన్నాను."

"సంఘాన్ని నేను ఆశ్రయిస్తున్నాను. బౌద్ధారామాన్ని - ఎందుకంటే ఒక బుద్ధుడు గతంలోని బుద్ధుళ్ళందరికీ, భవిష్యత్తులో రాబోయే బుద్ధుళ్ళందరికీ కూడా కేవలం ఓ ప్రతినిధి మాత్రమే కాబట్టి - ఒక్క బుద్ధుడే తక్కిన బుద్ధుళ్ళందరికీ మహాద్వారం. బుద్ధుళ్ళను మీరు క్రీస్తులు అనీ, కృష్ణుళ్ళు అనీ చెప్పుకోవచ్చు. ఆ మాటల వల్ల ఏ భేదమూ ఉండదు. అవన్నీ విభిన్న సాంప్రదాయాల్లో వాడబడ్డ విభిన్న నామాలు మాత్రమే.

కాబట్టి మీ మొదటి ఆశ్రయం మీ ముందే ఉన్న బుద్ధుడే. రెండవ ఆశ్రయం బుద్ధుళ్ళందరిలోనూ ఉంది; సంఘం, బౌద్ధారామం - గతానిదీ, ప్రస్తుతానిదీ, భవిష్యత్తుది కూడా. మూడవ ఆశ్రయం ధర్మం - ఓ మనిషిని ఏది ఓ బుద్ధుణ్ణిగా చేస్తుందో ఆ ఆవశ్యక జీవి. మహాప్రజ్ఞోదయపు కళే ధర్మం, మతం.

**ఆ రోజుల్లో మహాప్రాశస్త్యాన్ని పొంది ఉన్న సుభూతి**
**ఆ సమావేశానికి వచ్చి కూర్చున్నాడు.**

బుద్ధుని శిష్యుల్లో సుభూతి ఓ మహాశిష్యుడు. **'ఆ తరువాత తన ఆసనం మీద నుంచి లేచి'** అంటాడు ఆనందుడు - మళ్ళీ ఆయన అన్ని విషయాలనూ

మరోసారి చెప్తాడు. ఎందుకంటే సుభూతి కూడా ఓ మహా అసామాన్యుడు కాబట్టి. దాదాపుగా ఆయనే ఓ బుద్ధుడిలా ఉండేవాడు. ఏ క్షణంలోనైనా ఆయనకు బుద్ధత్వం ప్రాప్తించవచ్చు. ఆయన బుద్ధత్వపు అంచు మీదే ఉన్నాడు. కాబట్టి ఆనందుడు అన్నీ మళ్ళీ చెప్తున్నాడు.

> **ఆ తరువాత ఆయన తన ఆసనం మీద నుంచి లేచి, తన ఉత్తరీయాన్ని తీసి, ఓ భుజంమీదకు వేసుకుని, కుడిమోకాలును భూమిమీద నిలిపి, చేతులు జోడించి,  భగవానుడి ముందు వినమ్రుడై ప్రణమిల్లి, భగవానుడితో అన్నాడు. అద్భుతం! భగవాన్ ఇది పరమాద్భుతం! ఓ సుగతుడా, గతించిన బోధిసత్వులెందరో మహాజీవులెందరో, పొందే ఉన్నారు తథాగతుని మహాసహాయాన్ని...**
>
> **ఎలా భగవాన్? బోధిసత్వుని వాహనంలో బయల్దేరి వెళ్ళినవాడు అప్పుడెలా నిలబడాలి, ఎలా పురోగమించాలి. తన ఆలోచనలను ఎలా నియంత్రించుకోవాలి?**

సుభూతి బుద్ధత్వానికి మహాసామీప్యంలోనే ఉన్నాడు. ఆయన ఓ బోధిసత్వుడు. 'బోధిసత్వుడు' అంటే 'బుద్ధుడు అయ్యేందుకు సంసిద్ధంగా ఉన్నవాడు' అనే అర్థం, బుద్ధత్వాన్ని సమీపించి ఉన్నవాడు అనే అర్థం : ఇంకొక్క అడుగు ముందుకుపడితే బుద్ధుడు అయిపోతాడు. బోధిసత్వం అంటే బోధిసారం, బోధిజీవి, అప్పటికే తొంభైతొమ్మిది డిగ్రీల దాకా వచ్చేసి ఉన్నవాడు – నూరుడిగ్రీలు వచ్చేసిందంటే తప్పకుండా ఆవిరైపోతాడు. కానీ ఓ బోధిసత్వుడు ఎవరంటే తొంభైతొమ్మిది డిగ్రీల దగ్గరే ఇంకొంచెం కాలంపాటు ఉండాలనే ప్రయత్నాన్ని చేస్తూ మరికొంతమంది మనుష్యులకు సహాయపడాలి అనుకుంటున్నవాడే, అపార కరుణతో. ఎందుకంటే ఆయన నూరు డిగ్రీలను దూకేశాడంటే ఆ బోధిసత్వుడు పరంలోకి వెళ్ళిపోతాడు కనుక... గతే, గతే, పరాగతే, పరాసంగతే బోధిసత్వా. ఆ తరువాత ఆ బోధిసత్వుడు వెళ్ళిపోతాడు పరంలోకి, ఇంకా పరంలోకి, మరింత పరంలోకి, మరింత పరంలోకి. ఆ తరువాత మనుష్యులతో కలిసి ఉండడం మహాకష్టం అయిపోతుంది, ఈ ఒడ్డులో జీవిస్తూ ఉంటున్న మనుష్యులతో.

మహాగొప్ప సహాయం సాధ్యపడగలిగేది తొంభైతొమ్మిది డిగ్రీల వద్ద ఉంటున్న బోధిసత్వుల ద్వారానే. ఎందువల్ల? వాళ్ళకు ఇంకా సంప్రజ్ఞత్వం ప్రాప్తించలేదు కనుక. జ్ఞానం ఉదయించని మనుష్యులందరి తీరులనూ, వైఖరులనూ

వాళ్ళు గ్రహించి ఉంటారు. జ్ఞానోదయాన్ని పొందని మనుష్యుల భాష వాళ్ళకు తెలుసు. వాళ్ళతోపాటే ఇప్పటిదాకా వాళ్ళు జీవించే ఉంటున్నారు, కానీ మరో ప్రజ్ఞాతీరుతో వెళ్ళిపోతూ - తొంభైతొమ్మిది డిగ్రీల వద్ద. ఆ ఒక్క డిగ్రీ లంకెతోనే వంతెనతోనే వాళ్ళు మనుష్యులతో కలిసి ఉంటున్నారు.

కాబట్టి బోధిసత్వులు ఎవరంటే బుద్ధత్వానికి అతి సామీప్యంలోకి వచ్చేసి ఈవలి ఒడ్డు మీద ఇంకా కొంచెంసేపు ఉందామని అనుకుంటూ మనుష్యులకు సహాయపడదామని ప్రయత్నిస్తున్నవాళ్ళే. ఒడ్డు చివరిదాకా వచ్చేసి ఉన్నవాడు. తనకు లభించిన ఆహ్వానాన్ని అర్హులతో పంచుకోవాలని అభిలషిస్తూ ఉన్నవాడు. ఆయనకు తెలుసు. తనకు తెలిసి ఉన్నదాన్ని అందరికీ పంచాలని ఉంది ఆయనకు. మిగతా వాళ్ళందరూ పడుతూ, లేస్తూ అంధకారంలో ఉంటున్నారు. తాను ఎరిగి ఉన్న జ్ఞానప్రకాశాన్ని వాళ్ళకు పంచిపెట్టాలన్న అభిమతంతో ఆయన ఉన్నాడు. వాళ్ళంటే ఆయనకు ఎంతో ఇష్టం.

సుభూతి ఓ బోధిసత్వుడు. బుద్ధుణ్ణి వర్ణించినంత వివరంగానే సుభూతిని కూడా అతి నిశితంగా ఆనందుడు వర్ణించి చెబుతూ ఉంటాడు. ఆ తరువాత ఆయన తన ఆసనం మీద నుంచి లేచి... కొంచెం ఊహించి చూడండి. జరుగుతున్న సంభవాన్ని దృశ్యంగా ఊహించి చూడండి. ఓ బోధిసత్వుడు లేస్తూ ఉన్నాడు. పూర్ణ ఎరుక లేస్తూ ఉంది. ఓ యంత్రపు బొమ్మ లేచినట్లు ఆయన లేవడం లేదు. ఆయనకు ప్రతి శ్వాసా తెలుస్తూనే ఉంటోంది. ఆయనకు శ్వాస మొత్తం తెలుస్తూనే ఉంటోంది. ఆయనకు తెలీకుండా ఏమీ జరిగిపోదు. ఆయనలో మహాగమనిక ఉంటోంది. కాథలిక్ సాంప్రదాయపు మనుష్యులు పునఃగ్రహణత్వం (Recollectedness) అని దేన్ని అంటారో దాన్నే బౌద్ధులు 'సమ్మాసతి' అని అంటారు - సరైన ఏకాగ్రత. సరైన అవధానం. సరిమనఃస్థితి అన్నా, పునఃగ్రహణత్వం అన్నా, తక్షణమే అన్నిటినీ తెలుసుకుంటూ ఉండడం అన్నా, సద్యఃప్రకాశంతో జీవిస్తూ ఉండడం అన్నా, సమ్మాసతి అన్నా - అచేతనంగా ఒక్క పని కూడా జరగకుండా ఉంటూ ఉండడం అనే అర్థం.

> **ఆ తరువాత ఆయన తన ఆసనం మీద నుంచి లేచి, తన ఉత్తరీయాన్ని తీసి, ఓ భుజంమీదకు వేసుకుని, కుడిమోకాలును భూమిమీద నిలిపి, చేతులు జోడించి, భగవానుడి ముందు వినమ్రుడై ప్రణమిల్లి, భగవానుడితో అన్నాడు.**

మళ్ళీ జ్ఞాపకంలో ఉంచుకోండి. ఓ బోధిసత్త్వుడు కూడా, బుద్ధత్వపు మహాసామీప్యానికి వచ్చేసి ఉన్నవాడు సైతం, మహాకృతజ్ఞతాభావంతో ఓ బుద్ధుడి ముందు ప్రణమిల్లుతాడు.

***అద్భుతం! భగవాన్ ఇది పరమాద్భుతం! ఓ సుగతుడా...***

'సుగతుడు' అంటే 'ఆవలి ఒడ్డును చేరుకున్నవాడు' అని అర్థం. సుభూతి ఈ పక్కటి ఒడ్డు మీద ఉన్నాడు. బుద్ధుడు ఆ పక్కటి ఒడ్డు మీద ఉన్నాడు. ఆ అవగాహన దాకా సుభూతి ఇప్పటికే వచ్చేసి ఉంటూ ఉన్నాడు. ఆవలిఒడ్డు ఆయనకు కనబడుతూనే ఉంది. ఆవలి ఒడ్డు మీద ఉన్న బుద్ధుడు కూడా ఆయనకు కనిపిస్తూనే ఉన్నాడు. ***"ఓ సుగతుడా..."***

'సుగత' అన్నమాటకు అనేక అర్థాలు ఉన్నాయి. 'ఆవలి ఒడ్డును చేరుకున్నవాడు' అన్నది ఒక అర్థం. 'ధ్యానంలో పరమోత్తమ స్థితిని అందుకున్నవాడు' అన్నది ఇంకో అర్థం. ధ్యానంలో పరమోత్తమ స్థితికి ఎనిమిది మెట్లు ఉన్నాయని బుద్ధుడు అన్నాడు. ఆ పరమోత్తమ ధ్యానస్థితిలో ఉన్నవాడే సుగతుడు. అయినా ఇది సమానమే. సమాధిని అందుకున్నవాడు, పరమసమాధిస్థితిని అందుకున్నవాడు ఆవలి ఒడ్డును చేరుకున్నవాడే. ఆ మనిషి ఉండడు – అదీ 'సుగతుడు' అంటే. వెళ్ళిపోయినవాడు. పూర్తిగా వెళ్ళిపోయినవాడు. ఆ మనిషి ఇక ఏ మాత్రమూ లేదు. ఆయన ఓ శూన్యం మాత్రంగా ఉంటాడు. ఆయన ఆత్మ కూడా అదృశ్యం అయిపోయి ఉంటుంది. ఆవిరైపోయి ఉంటుంది.

**ఓ సుగతుడా... అద్భుతం! భగవాన్ ఇది పరమాద్భుతం!**
**గతించిన బోధిసత్త్వులెందరో మహాజీవులెందరో,**
**పొందే ఉన్నారు తథాగతుని మహాసహాయాన్ని...**

'తథాగతుడు' అన్నది ఓ బౌద్ధపు మాట. ఈ పదానికి అర్థం 'సుగతుడు' అనే. సుభూతి చెబుతున్నాడు "ఎంత సహాయాన్ని ఆయన చేశాడో! ఎంత అద్భుతం అది – పరమాద్భుతం అది. ఇంతటి మహాసహాయాన్ని మాకు అందించారంటే మేము అస్సలు నమ్మలేకపోతున్నాం. ఇంకా ఇప్పటికీ మీరు సహాయం చేస్తూనే ఉంటున్నారు. అంతటి మహాసహాయాన్ని స్వీకరించే అర్హత కూడా మాకు లేదు."

**అద్భుతం! భగవాన్ ఇది పరమాద్భుతం! ఓ సుగతుడా, గతించిన**
**బోధిసత్త్వులెందరో మహాజీవులెందరో, పొందే ఉన్నారు తథాగతుని**

**మహాసహాయాన్ని...**

**ఎలా భగవాన్? బోధిసత్త్వుని వాహనంలో బయల్దేరి వెళ్ళినవాడు...**

ఈవల ఒడ్డు మీదే నిలబడి మిగిలిన మనుష్యులకు సహాయపడాలని నిర్ణయించుకుని నిరీక్షిస్తున్నవాడు. ఆ బోధిసత్త్వుడు...

***...ఎలా నిలబడాలి, ఎలా పురోగమించాలి,***
***తన ఆలోచనలను ఎలా నియంత్రించుకోవాలి?***

ఏమడుగుతున్నాడు ఆయన? ఆయన అడుగుతున్న ప్రశ్న మీలో ఎందరికో అసంగతంగానే ఉండవచ్చు, ఎందుకంటే మీరు బోధిసత్త్వులు అయి ఉంటేనే మీకు అది ఉపయుక్తమవుతుంది కాబట్టి. కానీ ఏదో ఓ నాటికి, ఎప్పుడో ఒకప్పుడు మీరు బోధిసత్త్వులు అయితీరుతారు. ఏదో ఒక నాటికి ఈ ప్రశ్న మీకు పనికొచ్చి తీరుతుంది. దీన్ని గురించి ఆలోచించడం ఎంతో ఉత్తమం. దీన్ని గురించి చింతనా, ధ్యానమూ చెయ్యడం ఎంతో ఉత్తమం.

ఆయన అడుగుతున్నాడు "బోధిసత్త్వులు కావాలని నిశ్చయించుకున్నవారు 'ఎలా నిలబడి ఉండడం?' అని. ఆయన అంటున్నాడు "ఆవలితీరం మహాఆకర్షిస్తూ ఉంటుంది, ఆ ఒడ్డుకు మహాఆకర్షణ ఉంటుంది – ఎంతో బలీయంగా అది గుంజుతూ ఉన్నప్పుడు ఇవతలి ఒడ్డుమీద నిలబడి వాళ్ళు ఎలా ఉండాలి? మనుష్యులకు సహాయపడడం మనకు ఇష్టం. కానీ ఎలా? ఆ ఆకర్షణ, ఆ అయస్కాంత ఆకర్షణ మహాబలీయంగా ఉంటుంది – ఆవలితీరం పిలుస్తూనే ఉంటుంది. కాబట్టి ఈ ఒడ్డు మీద ఎలా ఉండగలగాలో, మరింత వేళ్ళు పాతుకుని ఎలా ఉండాలో బోధించండి. మేము సమూలంగా పెకలింపబడి ఉన్నాం. ఈ ప్రపంచంలో మాకు ఏ వేళ్ళూ లేవు. తొంభైతొమ్మిదిశాతం వేర్లు ఇప్పటికే ఊడిపోయి ఉన్నాయి."

ఓ వృక్షాన్ని ఊహించండి, దానికి తొంభైతొమ్మిదిశాతం వేళ్ళు నశించిపోయి ఉంటాయి. కేవలం ఒక్కశాతం వేర్లు మాత్రమే అక్కడ సజీవంగా ఉంటాయి. ఆ వృక్షం అడుగుతూ ఉంది "నేను ఎలా నిలబడాలి? నేను పడిపోబోతున్నాను. ఇంకొంతకాలంపాటు ఇక్కడే నిలబడి ఉండగలిగితే నా వల్ల మానవులకు మహోపకారం జరగవచ్చు. వాళ్ళకు ఆ సహాయం అత్యంత ఆవశ్యకం. నేను సహాయాన్ని ఆశించినప్పుడు మీరు మహోపకారాన్ని చేశారు. ఇప్పుడు మనుష్యులు నా సహాయాన్ని ఆశిస్తున్నారు – వాళ్ళకు నేను ఉపయోగపడాలి". అదే ఓ శిష్యుడికి గురు ఋణాన్ని

తీర్చుకోగలిగేందుకు ఉన్న ఏకైక మార్గం. మరే మార్గమూ లేదు. గురువు మీకు సహాయం చేశాడు; ఆ గురువుకు ఏ సహాయమూ అక్కర్లేదు – మరి ఆయన ఋణాన్ని ఎలా తీర్చుకోవడం? ఆ ఋణం తీరేందుకు ఏం చెయ్యాలి? అంధకారంలో పడుతూ, లేస్తూ వెతుక్కుంటూ తిరుగుతున్న వాళ్ళకు సహాయం చెయ్యడం మాత్రమే మీరు చేయగలిగిన ఏకైక కార్యం. మీ గురువు మీకు ఏమేం సహాయాలు ఎంతెంతగా చేశాడో అవే సహాయాలను మీరు ఆ మనుష్యులకు చెయ్యాలి, అప్పుడే మీ గురు ఋణం తీరుతుంది.

ఆయన అడిగాడు "ఎలా నిలబడాలి?" అని – నిలబడడం ఎంతో కష్టం, దాదాపు అసాధ్యం – మళ్ళీ "ఎలా పురోగమించాలి, ప్రజలకు ఎలా సహాయాన్ని చెయ్యాలి?" అని కూడా అడుగుతున్నాడు – ఎందుకంటే అది చెయ్యడం కూడా ఎంతో కష్టమే కాబట్టి. ఇప్పుడు మనకు ఆ మనుష్యుల దైన్యాలన్నీ శుద్ధ అబద్ధాలు మాత్రమే అని తెలుసు, ఆ మనుష్యులు పడుతున్నది పీడకలల బాధలను మాత్రమే అని మనకు అర్థం అవుతూనే ఉంది. వాళ్ళ బాధలూ, దైన్యాలూ అన్నీ అబద్ధాలే, నిజంగా లేవు. 'తాడును చూస్తూ పాము అనుకుని ఆ మనుష్యులు భీతిల్లుతూ ఉంటున్నారు' అని మనకు తెలుసు. అటువంటి మనుష్యులకు సహాయం చెయ్యాలంటే ఎంతో కష్టం. పరిహాస్యాస్పదంగానే ఉంటుంది. అయినా మనకు తెలుసు, వాళ్ళకు సహాయం అవసరమని. ఎందుకంటే మన గతం మనకు తెలుసు కాబట్టి. మనం కూడా గతంలో వాళ్ళలాగే వణుకుతూ, ఏడుస్తూ, కేకలు పెడ్తూ ఉండేవాళ్ళమే. అప్పుడు ఎన్ని బాధల్ని ఎంతగా పడున్నామో మనకు తెలుసు, ఆ బాధలన్నీ స్వప్నతుల్యాలు మాత్రమే అని మనకు ఇప్పుడు తెలిసొచ్చే ఉన్నా. అవన్నీ భ్రమలే. అంతా మాయ."

కొంచెం ఆలోచించండి. ఆ మరో మనిషి గోలపెట్టి చెప్తున్నవన్నీ మతిలేని మాటల్ని మాత్రమేనని మీకు బాగా అర్థం అయివున్నప్పుడు, ఆ మనిషికి నిజంగా ఆ బాధలన్నీ, దైన్యాలన్నీ ఉన్నాయా...?

ఒకప్పుడు నా దగ్గరికి ఓ మనిషిని తీసుకొచ్చారు. ఆ మనిషికి రెండు ఈగలు ఎలాగో తన పొట్టలోకి వెళ్ళిపోయి ఉన్నాయని తెలిసొచ్చింది – నోరు తెరుచుకుని నిద్రపోతాడు కాబట్టి. ఆ ఈగలు ఆ మనిషి కడుపులో ఎగురుతూనే ఉన్నాయి. సహజంగానే, ఈగలు పొట్ట లోపలికి వెళ్తే, ఎగుర్తూనే ఉంటాయి. ఎంతో చింతాక్రాంతుడు అయిపోయి ఉన్నాడు. ఓ చోట్లో స్థిమితంగా కూర్చోలేకపోతున్నాడు.

ఈ పక్కకూ ఆ పక్కకూ కదిలిపోతూ "ఇప్పుడు ఇటువైపు వచ్చాయి, అదో, ఆ ప్రక్కకు వెళ్తున్నాయి" అంటూ మహాబాధపడిపోతూ ఉంటున్నాడు. దాదాపుగా ఆ మనిషికి పిచ్చిపట్టేసినట్లే ఉంటోంది.

అప్పటికే అందరు డాక్టర్ల దగ్గరికీ ఆయన వెళ్ళి ఉన్నాడు. ఏ వైద్యుళ్ళూ ఆయనకు సహాయ పడలేకపోయారు. ఆ మనిషిని చూసి నవ్వుతూ "అంతా నీ భ్రమ" అనేశారు. ఓ మనిషికి తను ఊరికే ఊహించుకుని దైన్యాన్ని అనుభవిస్తున్నావని చెప్పినంత మాత్రాన ఏ ప్రయోజనమూ ఉండదు, ఆ మనిషి ఇంకా బాధపడుతూనే ఉంటున్నాడు కాబట్టి. ఆ మనిషి దాన్ని ఊహించుకుంటున్నాడని మీకు అనిపించవచ్చు, కానీ బాధపడ్తున్న ఆ మనిషికి ఏ వ్యత్యాసమూ ఉండదు. అది ఊహో, నిజమో. ఏదైతేనేం? తను బాధపడుతూనే ఉంటున్నాడు కదా? మీరు ఏం చెప్తున్నా ఆ మనిషిలో ఏ మాత్రం తేడా ఉండదు.

నేను ఆ మనిషి పొట్టను ముట్టుకుని – "ఔను. అవి ఇక్కడే ఉన్నాయి" అని అన్నాను. ఆ మనిషికి ఉల్లాసం వచ్చేసింది. నా కాళ్ళు పట్టేసుకున్నాడు. "మీరండీ మనిషి... డాక్టర్ల దగ్గరికీ, ఫిజిషియన్ల దగ్గరికీ ఎంతమంది దగ్గరికో వెళ్ళాను – ఆయుర్వేద, అల్లోపతీ, హోమియోపతీ వాళ్ళందరి దగ్గరికీ – అందరూ మూర్ఖులే! చెప్పిందే చెప్తూ ఉంటారు. నేను వాళ్ళతో అన్నాను 'మీ వద్ద మందు లేకపోతే, లేదని చెప్పండి. అంతేగానీ నేను ఊహించుకుంటూ ఉన్నానని ఎందుకు అంటారు?' ఇప్పుడు మీరు ఉన్నారు... మీకు కనిపించలేదా?"

నేను అన్నాను "చక్కగా కనిపిస్తున్నాయి – అవి అక్కడే ఉన్నాయి. నేను ఇటువంటి సమస్యలనే తీరుస్తూ ఉంటాను". నేను అన్నాను "నువ్వు రావాల్సిన మనిషి దగ్గరికే వచ్చావు. ఇదే నేను చేస్తున్న పని అంతా – నిజంగా ఉండని ఇటువంటి సమస్యలనే నేను పరిష్కరిస్తూ ఉంటాను. నిజంగా లేని సమస్యలను పరిష్కరించడంలో నేను నిపుణుణ్ణి". నేను అన్నాను "మీరు పడుకుని కళ్ళు మూసుకోండి. మీ కళ్ళకు నేను గంతలు కట్టెయ్యాల్సి వస్తుంది. ఆ తరువాత ఈగల్ని బయటికి తీసేస్తాను. మీరు నోరు తెరుచుకునే ఉండండి, వాటిని బయటకు రమ్మంటాను. అందుకోసం ఓ గొప్ప మంత్రాన్ని నేను ఉపయోగించాల్సి వస్తుంది."

ఆ మనిషికి ఎంతో సంతోషం కలిగింది. ఆయన అన్నాడు "ఇదీ పద్ధతి". ఆ మనిషికి కళ్ళకు గంతలు కట్టేశాను. ఆ మనిషికి నోరుతెరచుకునే ఉండమని

చెప్పాను. ఆ మనిషి అక్కడే పడుకున్నాడు, ఎంతో సంతోషంగా, ఈగలు బయటికి వచ్చేసేంతవరకూ నిరీక్షిస్తూ. నేను తక్షణం ఇంట్లోకి వచ్చేశాను, రెండు ఈగలను వెతికి పట్టుకునేందుకు.

ఆ పని చెయ్యడం ఎంతో కష్టం, ఎందుకంటే అప్పటిదాకా ఏ ఈగలనూ నేను పట్టుకోలేదు కాబట్టి. కానీ ఎలాగైతేనేం, రెండు ఈగలను పట్టేసుకున్నాను. ఆ మనిషి ఆ తరువాత తన కళ్ళు తెరిచి నా చేతిలోని సీసాలో ఉన్న రెండు ఈగలనూ చూశాడు. ఆయన అన్నాడు "ఆ సీసాను నాకు ఇచ్చేయండి. నేను ఆ మూర్ఖుల దగ్గరికి వెళ్ళొస్తాను". ఆ మనిషి చక్కగా కుదురుకున్నాడు. కానీ అటువంటి మనుష్యులకు సహాయం చెయ్యడం ఎంతో కష్టం. ఎందుకంటే వాళ్ళకున్న సమస్య అంతా అబద్ధమేనని మీకు తెలుసు కాబట్టి.

సుభూతి అడుగుతున్నాడు "భగవాన్, ముందుగా చెప్పండి మేం ఎలా నిల్చోవాలో. ఎందుకంటే మా వేళ్ళన్నీ పోయి ఉన్నాయి కాబట్టి. ఈ ప్రపంచానికి సంబంధించని వాళ్ళుగానే మేము తయారైపోయి ఉంటున్నాం కాబట్టి. మా అన్ని బంధాలూ తొలగిపోయాయి – ఆ బంధాలే వేళ్ళు. మరి మేం ఎలా పురోగమించాలి? ఏం పని చెయ్యాలి? – ఎందుకంటే మాకిప్పుడు ఇదంతా 'తలతిక్క మాత్రమే' అని తెలుసు కనుక. మానవులే తమ దైన్యాలను ఊహించి కల్పించుకుంటున్నారు. మరి మేము మా ఆలోచనలను ఎలా నియంత్రించుకోవాలి? ఎలా అదుపులో పెట్టుకోవాలి?"

ఆయన ఏమంటున్నాడు? – ఎందుకంటే బోధిసత్త్వుడికి సాధారణంగా ఏ ఆలోచనలూ ఉండవు, మీకు ఉన్న ఆలోచనలలాంటివి. వాళ్ళల్లో ఒక్క ఆలోచన మాత్రమే ఉంటుంది. 'ఆవలి ఒడ్డుకు చేరేది ఉలా?' అని. ఆ ఆవలితీరం ఆకర్షణ మహాబలీయంగా ఉంటుంది, లాగుతూనే ఉంటుంది అనుక్షణమూ. ద్వారం తెరచుకునే ఉంటుంది. మీరు ఇక పూర్ణపరమానందంలోకి వెళ్ళిపోవచ్చు, అయినా ఆ తలుపునే పట్టుకుని మీరు అక్కడే ఆగిపోయి ఉంటారు – ఆ తలుపు తెరుచుకునే ఉంటుంది.

ముందుగా ఎన్నో జన్మల నుంచీ మీరు అన్వేషిస్తూనే ఉండేవారు, ఆ తలుపు ఎక్కడుందో గుర్తించడానికోసం. ఆ తలుపును గుర్తించిన తరువాత, మరెన్నో జన్మల నుండీ ఆ తలుపును మీరు కొడుతూనే ఉండేవారు – ఇప్పుడు ఆ ద్వారం తెరుచుకుంది. మరి అప్పుడు అంటాడు బుద్ధుడు "మీరు నిరీక్షించండి. ఆ తలుపు బయటే వేచి ఉండండి. మీరు సహాయపడవలసినవాళ్ళు ఎందరో ఉన్నారు" అని. ఆ లోపలికి

ప్రవేశించాలన్న మహావాంఛ, తీవ్ర ఆవేశం సహజంగానే మీకు ఉంటుంది. సుభూతి అడుగుతున్నది దాన్నే.

***ఈ మాటల తదనంతరం భగవానుడు అన్నాడు సుభూతితో :***
***... కాబట్టి సుభూతీ, శ్రద్ధగా విను, విను అవధానంతో!***
***బోధిసత్త్వుని వాహనంలో బయలుదేరినవాళ్ళు***
***చెయ్యాలి ముందుగా ఈ ఆలోచనను ఈ విధంగా :***

ఆంగ్లానువాదం ఇక్కడ అందంగా కనిపించదు. ఈ ఆలోచనను ముందుగా ఈ విధంగా చెయ్యాలి... 'చిత్తముత్పాదయితవ్యం' అన్నదే సంస్కృత మూలం. బోధిసత్త్వ వాహనంలో బయల్దేరినవాడు 'అటువంటి మనస్సునే సృష్టించుకోవాలి'. అటువంటి నిర్ణయాన్నే తీసుకోవాలి. అంత గొప్ప నిర్ణయాన్నే తీసుకోవాలి – అంత నిశ్చితమే పట్టుదలే ఆయనకు ఉండాలి. చిత్తోత్పాదాన్ని – ఈ విధంగా.

***విశ్వంలోని యావన్మందినీ 'సమస్త జీవరాశి' అనబడుతున్న సర్వుల్నీ,***
***నిశ్చితంగా నిర్వాణంలోకి నేను నడిపించే తీరాలి...***

'ఒక్కరినో, ఇద్దరినో కాదు సుభూతీ! ఒక్కరినో, ఇద్దరినో కాదు. అన్ని జీవుల్నీ – పురుషులనూ, స్త్రీలనూ, జంతువులనూ, పక్షులనూ, వృక్షాలనూ, శిలలనూ – అన్నిటినీ. ఈ ప్రపంచంలో ఉన్న సర్వస్వాన్నీ. అంతగొప్ప మహానిశ్చిత నిర్ణయాన్ని బోధిసత్త్వుడు సృష్టించుకోవాలి. "నేను సర్వస్వాన్నీ నిర్వాణంలోకి నడిపించి తీరుతాను."

***...నిశ్శేషంగా ఆ నిర్వాణతలంలోకి.***
***లెక్కకు మిక్కిలి జీవులను ఆ రీతిన నిర్వాణంలోకి నడిపిస్తూనే ఉన్నా***
***ఏ జీవీ నడిపించబడలేదు, నిక్కముగా ఇప్పటికీ, ఆ నిర్వాణంలోకి***

అది కూడా మీరు జ్ఞప్తిలోనే ఉంచుకుని తీరాలి. మరచిపోకూడదు; మరచిపోయారంటే, అందరినీ నడిపిస్తూ, మీరు మళ్ళీ అజ్ఞానంలోకే పడిపోతారు. మీరు సర్వజీవ రాశుల్నీ ఆ ఒడ్డుకు నడిపించే తీరాలి. అయినా అప్పటికీ మీరు గుర్తుపెట్టుకునే ఉండాలి – వాళ్ళ దైన్యాలన్నీ అబద్ధాలని, నిజంగా లేనివేనని. మీ పరిసహాయాలు కూడా ఆ విధంగా అబద్ధాలే. ఇంకా మీరు గుర్తుపెట్టుకునే ఉండాలి, వాళ్ళకు ఏ ఆత్మలూ లేవని, మీకు కూడా ఆత్మ ఏదీ లేదు. కాబట్టి మరచిపోకండి. మీరు మనుష్యులకు సహాయపడుతున్నామని అనుకోకండి. మీరు గొప్ప సహాయకారులని

అనుకోకండి. ఇదీ అదీ అనుకోకండి. అనుకున్నారంటే మీరు మళ్ళీ పడిపోతారు. మళ్ళీ మీకు ఈ ఒడ్డు మీదే వేళ్ళు మొలిచేస్తాయి.

కాబట్టి రెండు విషయాలను జ్ఞప్తిలోనే ఉంచుకోవాలి. ఈ ఒడ్డు మీద మీరు మహా పట్టుదలతో ఉండాలి. లేకపోతే ఆవలి ఒడ్డుకు మీరు బలీయంగా ఆకర్షింపబడి లాక్కుపోబడతారు. ఆ ఒడ్డు మీద కూడా మీరు వేళ్ళు పాతుకుని స్థితం అయిపోకూడదు. అది జరిగిందంటే మీరు ఎవ్వరికీ ఏ విధంగానూ సహాయపడలేరు. మిమ్మల్ని మీరే నాశనం చేసేసుకుంటారు. మళ్ళీ స్వప్నంలో పడిపోతారు.

> **ఏమిటి కారణం అందుకు? ఓ బోధిసత్త్వుని మానసంలో తానో 'జీవిని' అన్న భావన కలిగితే ఓ 'బోధిజీవి' ని ఆ బోధిసత్త్వుణ్ణి చెప్పుకోకూడదు. ఎందుకు చెప్పుకోకూడదు 'బోధిజీవి' అని ఆ బోధిసత్త్వుణ్ణి? ఆత్మననీ, జీవిననీ అనుకుంటున్న వాడినీ లేదా, జీవాత్మననీ, వ్యక్తిననీ అనుకుంటున్న వాడిని ఎందుకనకూడదు ఓ 'బోధిజీవి' అని?**

"కాబట్టి సుభూతీ, రెండు విషయాలను స్మరించి తీరాలి మీరు. మొదటిది: జీవ సర్వస్వాన్నీ ఆవలి తీరంలోకి మీరు నడిపించాలి అన్న విషయం. అలా నడిపిస్తూ ఉన్నప్పుడు కూడా ఏ మనిషికీ ఓ 'జీవి' లేదు అని మీరు గుర్తుపెట్టుకునే ఉండాలి - 'జీవి' మీకూ లేదు, ఆ మనిషికీ లేదు. అన్ని అహంకారాలూ అబద్ధాలే, భ్రాంతులే. సదా దీన్ని స్మరిస్తూ చరించండి, మహాపట్టుదలతో. మనుష్యులకు ఆవలి ఒడ్డుకు చేరే సహాయాన్ని చేయండి. వాళ్ళు అప్పటికే అక్కడ ఉన్నారు. మీరు కేవలం వాళ్ళ ఆ అవధానంలో, ఎరుకలో ఉండేట్లు చేస్తే చాలు. కానీ మీరే దారితప్పి పోకండి, రక్షకులు కాకండి - ఇవే ఆ రెండు విషయాలు.

బుద్ధుడు ఈ సూత్రంలో బోధిసత్త్వ వాహనాన్ని గురించి మళ్ళీ మళ్ళీ అనేక పర్యాయాలు చెప్తూనే ఉంటాడు. మీరందరూ బోధిసత్త్వులు కావాలి అన్నదే నా వాంఛితం.

ఈ రోజుకు ఇది చాలు.

# ౨. ప్రేమ విడుదలైంది

## మొదటిప్రశ్న :

ప్రియ ఓషో,

ఏ సంఘర్షణా, వ్యధా, విస్ఫోటనా జరక్కుండా, సుత్తితో మోదుకోవడమూ, కత్తితో నరుక్కోవడమూ వంటి విపరీత చర్యలు లేకుండా, మనస్సే అమనస్కంగా పరిణమించే సహజ అవకాశం ఉందా?

మనస్సులోనే ఉన్నట్లూ, మనస్సుకు అతీతంగా కూడా ఉన్నట్లూ తోస్తూ, ఉంటున్న ఈ 'అమనస్కపుస్థితి' అన్న ఊహే స్వయంగా ఓ విత్తనమాత్రపు స్వరూపంతో ఉంటున్న అమనస్కస్థితా?

శాశ్వతత్వాన్ని గురించీ, నిర్వాణాన్ని గురించీ, మృత్యువును గురించీ ఈ విధంగా మనస్సును అధిగమించే ఆలోచనల చింతనా ధ్యానమూ జరిగితే అది ఆ అమనస్క స్థితి ఏర్పడడానికి ఉపయుక్తంగా ఉంటుందా?

వీటిని చేస్తూ ఉంటే నా మనస్సు పేలిపోతున్నట్లు ఉంటోంది. నా సామర్థ్యపు హద్దుల్ని అతిక్రమించి నా ప్రయత్నం సాగుతున్నట్లు నాకు అనిపిస్తూ ఉంటోంది. ఓ షీజోఫ్రినిక్ (మానసిక అస్థిమితత్వం)గా తయారవుతానేమోనని భయపడుతున్నాను.

ఓ మనస్సులోంచి అమనస్కం అవతరించదు. అది ఓ మానసిక అభివృద్ధి కాదు. అది మనస్సును అనుసరించి వచ్చే ఓ పరిణామం కాదు. అది మనస్సుతో లేకపోవడం మాత్రమే. ఓ రోగంతో సంబంధించనట్లు ఆరోగ్యం ఎలా ఉంటుందో అలాంటిదే అది. ఆరోగ్యం రోగంలోంచి అవతరించదు. రోగాన్ని తొలగించిన తరువాతనే ఆరోగ్యం అవతరిస్తుంది. రోగం ఆ ప్రదేశాన్ని ఆక్రమించుకుని ఉంటోంది. ఆరోగ్యం వికసించడానికి అది అనుమతించడం లేదు. ఆ రోగాన్నే ఆ ప్రదేశం నుంచి తొలగించాలి. ఓ ఊట పైకి రాకుండా అడ్డంగా పడున్న ఓ పెద్దరాయిలాంటిది

అది. ఆ రాయిని తొలగించేస్తే ఊట ఉబికి ప్రవహిస్తుంది. ఆ రాయిలో నుంచి ఆ ఊట ఉద్భవించడం లేదు. ఆ ఊటకు ఆ రాయే అడ్డుపడుతోంది. ఆ రాయే అడ్డు. మనస్సు కూడా అడ్డే. అమనస్కం ఆవిర్భవించకుండా ఉన్న అడ్డే మనస్సు.

అమనస్కం అంటే ఏది మనస్సు కాదో అది. ఓ మనస్సులోంచి ఓ అమనస్కం ఎలా ఆవిర్భవించగలుగుతుంది? ఓ మనస్సులో నుంచి అది ఆవిర్భవించగలిగితే అప్పుడు అది ఓ మహామనస్సు అయి ఉంటుంది, కానీ ఆ మహామనస్సు కాదు అమనస్కం అంటే. ఈ విషయంలోనే నేను అరబిందోతో విభేదిస్తూ ఉంటాను. ఆయన మహామనస్సు గురించి మాట్లాడుతూ ఉంటాడు. మహామనస్సు కూడా మరింతగా అలంకరింపబడిన మనస్సు మాత్రమే. ఆ మనస్సు మరింత సంస్కారాన్ని పొంది ఉంటుంది, అది మరింత నేర్చుకుని ఉంటుంది. మరింత మెరుగ్గా ఉంటుంది. మరింత బలంగా ఉంటుంది. మరింత సంఘటితంగా ఉంటుంది – ఎంత ఎదిగి ఉన్నా అది ఇదివరకు ఉన్న మనస్సే.

బుద్ధుడు చెబుతున్నది మహామనస్సు గురించి కాదు, అమనస్కాన్ని గురించే. మహా ఆత్మ గురించి ఆయన చెప్పడం లేదు, ఆయన అనాత్మ గురించే చెబుతున్నాడు - అనాత్త గురించి. ఆ విషయంలోనే బుద్ధుడు మహాప్రత్యేకంగా, మహాప్రగాఢ అవగాహనతో ఉంటాడు. ఓ మహామనస్సు ఓ అభివృద్ధి మాత్రమే. ఓ అమనస్కం మహాలంఘనంగా ఉంటుంది. అది ఓ పెద్ద దుముకు. అమనస్కానికి మనస్సుతో ఏ సంబంధమూ ఉండదు. ఆ రెండూ ఎప్పుడూ కలుసుకోవు కూడా. ఆ రెండూ ఒకదాన్ని ఒకటి ఎప్పుడూ ఎదుర్కోవు. ఓ మనస్సు అక్కడ ఉన్నప్పుడు ఓ అమనస్కం అక్కడ ఉండనే ఉండదు. ఓ అమనస్కం ఉన్న చోట్లో ఓ మనస్సు ఎప్పటికీ ఉండడం సాధ్యపడదు. ఆ రెండూ ఒకదాన్ని ఒకటి కనీసం పలుకరించుకోలేవు -అది అసంభవం, అసాధ్యం. అందులో ఒకటి ఉంటే రెండవది ఉండడానికి వీలు ఉండదు. కాబట్టి దీన్ని గుర్తుపెట్టుకోండి.

అందువల్లే అరవిందులవారికి జ్ఞానోదయం ప్రాప్తించలేదని నేనంటాను. ఆయన మనస్సుకు మెరుగుల్ని దిద్దుకుంటూనే ఉండిపోయాడు. ఆయన ఓ గొప్ప మనస్సు ఉన్న మానవుడు. కానీ ఓ గొప్ప మనస్సు ఉంటే జ్ఞానోదయం కలిగి ఉన్నట్లు కాదు. ఆ విధంగా బెర్ట్రాండ్ రస్సెల్ కూడా ఓ గొప్ప మనస్సు ఉన్నవాడే. ఓ మహామనస్సు ఉన్నంత మాత్రాన సంప్రజ్ఞత సంప్రాప్తించి ఉన్నట్లు కాదు. ఫ్రెడరిక్ నీషేకి కూడా ఓ గొప్ప మనస్సే ఉంది – అరవిందులవారికీ నీషేకూ ఎన్నో పోలికలు

ఉన్నాయి. నీషే శ్రేష్టమానవుడి గురించి మాట్లాడుతూ ఉంటాడు, అరవిందుడు కూడా శ్రేష్టమానవుడి గురించే మాట్లాడుతూ ఉంటాడు. కానీ ఈ శ్రేష్టమానవుడు అన్నవాడు ఓ ప్రసారిత ఊహామానవుడే. ఓ శ్రేష్టమానవుడు ఈ విధంగా ఉంటాడు : బలహీనతలన్నీ నశింపజేయబడి, బలాలన్నీ ప్రవృద్ధితం చేయబడి – కానీ ఈ మానవుడు, మనిషికన్నా పెద్దగా ఉన్న మానవుడు, మనిషికన్నా బలిష్టంగా ఉన్న మానవుడు, మనిషికన్నా ఉన్నతంగా ఉన్న మానవుడు, కానీ మానవుడి తరంగదైర్ఘ్యంలోనే ఉంటూ, మనిషి ఎక్కుతున్న ఆ నిచ్చెన మీదే ఉంటున్నవాడే. ఏ మౌలిక భేదమూ లేనివాడే. మానవ పరంపరాగతి క్రమంలో అవిచ్ఛిన్నంగా ఉంటున్నవాడే, ఏనాడూ ఆ క్రమంలోంచి దూరం కానివాడే.

అమనస్కం అంటే మీది అయి ఉన్న అన్నింటితో విచ్ఛిన్నమై అన్యంగా ఉన్న స్థితి అనే అర్థం. మీకు ఓ అమనస్కం ఉండాలంటే, మీరు మరణించే తీరాలి.

ఈ ప్రకారంగా మీరు అడుగుతున్న మొదటి విషయం “మనస్సే ఓ అమనస్కంగా పరిణమించే సహజావకాశం ఉందా?” లేదు. అదో పరిణామక్రమ ప్రాప్తం కాదు. అదో మహా పరివర్తన, పరిభ్రమణం. మనస్సు అంతర్ధానమై, మీకు అక్కడే అమనస్కం సాక్షాత్కరిస్తుంది. అది ఎప్పటినుంచో అక్కడే ఉంటోంది. అప్పటిదాకా మీ మనస్సే ఓ మబ్బులా దాన్నే ఆవరించి ఉంటోంది, మిమ్మల్ని గందరగోళంలో ఉంచుతూ, ఏది అక్కడ ఉందో దాన్ని మీకు అగోచరంగా నిలుపుతూ. కాబట్టి ఇదో పరిణామం కాదు.

వీరు ఇంకా అడుగుతున్నారు, “ఏ సంఘర్షణా, వ్యధా లేకుండా అది సాధ్యపడుతుందా?” అని. సంఘర్షణలతో వ్యధలతో దానికి ఏ సంబంధమూ లేదు. అమనస్కానికి సంఘర్షణలతో, వ్యధతో ఏ సంబంధమూ లేదు. సంఘర్షణల్లోంచీ, వ్యధల్లోంచీ అది అవతరించదు. సంఘర్షణల్లోంచీ, వ్యధల్లోంచీ పైకొచ్చేవి పుండ్లూ, గాయాలూ, వ్రణాలూ మాత్రమే. వాటిని మీరు చికిత్సతో మాన్చుకోగలిగినా వాటి మచ్చలూ, వాతలూ మీలో మిగిలే ఉంటాయి. అవే మీకు వస్తాయి మళ్ళీ. ఆ క్రమమే మళ్ళీ అనుసరింపబడుతుంది.

అమనస్కంలో ఏ సంఘర్షణలూ, వ్యధలూ ఉండవు. అవి మనస్సుకే ఉంటాయి, తన ఆధిపత్యాన్ని నిలిపి ఉంచుకోవాలని మనస్సే ఆ సంఘర్షణలను చేసుకుంటూ వ్యధలను పడుతూ ఉంటుంది కాబట్టి. ఆ యుద్ధాన్ని ఆ మనస్సే అందించుకుంటుంది. మనస్సుకు పోవాలని ఉండదు, దానికి ఉండాలనే ఉంటుంది.

మీ మనస్సు ఎంతటి శక్తివంతం అయిపోయి ఉందంటే, మిమ్మల్నే అది తన స్వంతం చేసేసుకుని ఉంటోన్నంత. అది అంటుంది "వీల్లేదు, నేను వెళ్ళిపోను ఏ బయటికీ, ఇక్కడే ఉండిపోతాను". మీ సంఘర్షణలన్నీ, వ్యధలన్నీ ఈ మనస్సు వల్లనే. అమనస్కానికి వీటితో ఏ సంబంధమూ ఉండదు. ఈ సంఘర్షణలనూ, వ్యధలనూ మీరు భరించే తీరాలి. వీటిని భరించి అనుభవిస్తే తప్ప, మీ మనస్సు మిమ్మల్ని వదిలిపెట్టిపోదు.

నన్ను మళ్ళీ చెప్పనీయండి. మీ సంఘర్షణల్లోంచి అమనస్కం జనించదు. మీ సంఘర్షణల్లోంచే మనస్సు తయారవుతుంది. అమనస్కం ఏ సంఘర్షణా లేకుండానే ఆవిర్భవిస్తుంది. ఓ రాయి మీకు సంఘర్షణను ఇస్తుంది, అది ఉన్న చోట్లోంచి కదిలేందుకు ఒప్పుకోదు. ఎన్నో శతాబ్దాల నుంచీ అది ఆ చోట్లోనే మహాస్థిరంగా ఉంది – ఎన్నో శతాబ్దాల పర్యంతం. మీరెవరు దాన్ని తొలగించడానికి? "ఏ ఊట గురించండీ మీరు మాట్లాడుతున్నదీ? ఏ ఊటలూ లేవు. నేనున్నాను ఇక్కడే శతాబ్దాల పర్యంతం. నాకు తెలుసు – ఏ ఊటా లేదు ఇక్కడ. మీరు దాన్నంతా మరచిపోండి!" అంటుంది. కానీ ఆ రాయిని అక్కణ్ణుంచి తొలగించాలని మీకు ఉంటుంది. అది ఉంటుంది మహాబరువుతో. భూమిలో స్థిరంగా కూరుకుపోయి ఉంటుంది అది. ఎంతోకాలం నుంచి అది అక్కడే ఉంది. ఆ చోట్లో దాని బంధాలు దానికి ఉన్నాయి. అది అక్కణ్ణుంచి లేవాలి అనుకోదు. ఏ ఊట గురించీ దానికి తెలీదు. కానీ ఆ రాయిని మీరు తొలగించే తీరాలి. ఆ రాయిని అక్కణ్ణుంచి తొలగించేస్తే తప్ప ఊట బయటికి రాదు.

మీరు అడుగుతున్నారు "...ఓ విస్ఫోటన జరక్కుండా, సుత్తితో మోదుకోవడమూ, కత్తితో నరుక్కోవడమూ వంటి విపరీత చర్యలు లేకుండా?" అని. మీ చేష్టలతో, చర్యలతో అమనస్కానికి ఏ సంబంధమూ లేదు. కానీ మీ మనస్సు మాత్రం పోదు. కాబట్టి మీరు సుత్తిపెట్టి కొట్టుకోవాల్సి వస్తుంది, కత్తి పట్టుకుని నరుక్కోవాల్సి వస్తుంది. వెయ్యిన్నొక్క చేష్టలు చెయ్యాల్సి వస్తుంది.

"మనస్సులోనే ఉన్నట్లూ, మనస్సుకు అతీతంగా కూడా ఉన్నట్లు తోస్తూ, ఉంటున్న ఈ 'అమనస్కస్థితి' అన్న ఊహే స్వయంగా ఓ విత్తన మాత్రపు స్వరూపంగా ఉంటున్న అమనస్కస్థితా?"

కాదు – మనస్సులో అమనస్కస్థితి విత్తనం ఉండనే ఉండదు. ఓ అమనస్కస్థితి విత్తనం మనస్సులో ఉండడానికే వీల్లేదు. అమనస్కం మహావిస్తృతంగా, ఆకాశంలాగా ఉంటుంది. మహాసంకుచితంగా ఉంటున్న మనస్సులో అంతటి మహావిస్తృత

అమనస్కం ఎలా పడుతుంది? ఆ ఉంటున్న మనస్సు కూడా మహాసాంద్రతతో పూర్తిగా నిండిపోయే ఉంటోంది – ఆలోచనలతో, కోరికలతో, అభూతకల్పనలతో, ఊహలతో, జ్ఞాపకాలతో. అందులో చోటే ఉండదు.

ముందుగా, మనస్సు మహాసూక్ష్మంగా ఉంటోంది – అందులో అమనస్కం పట్టదు. తరువాత ఆ మనస్సు ఇప్పటికే మహారద్దీతో, గోలతో పూర్తిగా నిండి ఉంటోంది. అమనస్కం మహానిశ్శబ్దంగా ఉంటుంది, మనస్సు హోరెత్తే శబ్దాలతో ఉంటుంది. మనస్సులో అమనస్కత పట్టదు. ఆ మనస్సే ఉండకుండా పోవాలి. ఆ మనస్సు లేని తెరపులోంచే ఆవిర్భవిస్తుంది ఓ నవ్యజీవనం, ఓ నవ్యజీవి, ఓ నవ్యప్రపంచం.

“శాశ్వతత్వాన్ని గురించీ, నిర్వాణాన్ని గురించీ, మృత్యువును గురించీ ఈ విధంగా మనస్సును అధిగమించే ఆలోచనల చింతనా, ధ్యానమూ జరిగితే అది ఆ అమనస్కస్థితి ఏర్పడడానికి ఉపయుక్తంగా ఉంటుందా?” అని మీరు అడుగుతున్నారు.

ఈ ‘మనస్సును అధిగమించే తలంపులు’ అనబడుతున్నవన్నీ ఇప్పటికీ తలంపులు మాత్రమే, అవన్నీ మనస్సులో నుంచే వస్తున్నాయి కూడా. శాశ్వతత్వాన్ని గురించి మీరు తలపోస్తూ ఉంటే, అప్పుడు మీరు చేస్తున్నది ఏమిటి? మీరు ఆలోచనను చేస్తూ ఉంటారు. మీరు నిర్వాణం గురించిన ఆలోచనను చేస్తూ ఉంటారు. అప్పుడు జరగబోయేది ఏమిటి? మీ మనస్సు అప్పుడు పురివిప్పుతూ, అల్లుతూ ఉంటుంది, నిర్వాణం గురించి ఎన్నో అందమైన ఊహలను మనస్సు మీకు అందిస్తూ ఉంటుంది – కానీ అదంతా మనస్సు చేస్తున్న పని మాత్రమే.

మృత్యువు గురించి మీరు ఏం ఆలోచిస్తారు? మృత్యువు గురించి యోచిస్తున్నప్పుడు మీరు ఆలోచించేది ఏమిటి? మీకు ఏమీ తెలీదని! మీకు తెలియని విషయాన్ని గురించి మీరేం ఆలోచించగలుగుతారు?

మనస్సుకు తనకు తెలిసున్నదాన్నే మళ్ళీ మళ్ళీ వల్లించే మహాసామర్థ్యం ఉంది; తనకు తెలియని విషయం వచ్చిందంటే అది నిర్వీర్యం అయిపోతుంది. శాశ్వతత్వాన్ని గురించి మీకు ఏమీ తెలీదు, మీకు తెలిసున్నదంతా కాలం గురించి మాత్రమే. శాశ్వతత్వాన్ని గురించి మీరు ఆలోచిస్తున్నదంతా సాగించి పెంచబడి ఉన్న సమయం గురించే, పొడిగింపబడుతూ ఉన్న కాలం గురించే – అయినా అది కాలం మాత్రమే. నిర్వాణాన్ని గురించి మీకేం తెలుసు?– దాన్ని గురించి మీరేం విని ఉన్నారో, చదివి ఉన్నారో అంతమాత్రమే కదా. అది కాదు నిర్వాణం అంటే. నిర్వాణం

అంటే 'నిర్వాణం' అన్న పదం కాదు. నిర్వాణపు సిద్ధాంతం కాదు నిర్వాణం. 'దేవుడు' అన్న పదం దేవుడు కాదు. ఇప్పుడు ఉన్న చిత్రాలన్నిటితో, శిల్పాలన్నిటితో, విగ్రహాలన్నిటితో ఆ దేవుడికి ఏ సంబంధమూ లేదు - ఎందుకంటే ఆ దేవుడికి ఏ పేరూ, స్వరూపమూ ఉండదు కనుక, ఆయన నామరహితుడూ, రూపరహితుడూ కాబట్టి.

కాబట్టి ఈ ఊహాసిద్ధాంతాల వల్ల ఏ ప్రయోజనమూ ఉండదు. వాటివల్ల మరింత సమాచారం సేకరింపబడడం జరిగి మీ మనస్సు బలం పెరగడానికి మాత్రమే అది అప్పుడు పనికొస్తుంది. ఎందుకంటే మనస్సు అప్పుడు చెప్పగలుగుతుంది "చూడు, నేనిప్పుడు మనస్సును అధిగమించే సిద్ధాంతాల్ని కూడా నీకు అందిస్తున్నాను. చూడు నీకోసం ఎంతెంత చేస్తున్నానో. నన్ను ఎప్పుడూ నీతోనే ఉంచుకో. నీకు జ్ఞానోదయం కలగడానికి నేను సహాయం చేస్తాను. నేను లేకపోతే నువ్వు ఎక్కడా ఉండలేవు. నేను లేకపోతే నువ్వు ఎలా ఆలోచించగలుగుతావు - మృత్యువు గురించీ, శాశ్వతత్వం గురించీ? నేను నిజంగా నీకు అత్యావశకుణ్ణి. నేను లేకపోతే నువ్వు ఉండలేవు" అని.

కాదు. ఈ ధ్యానచింతన ఎందుకూ పనికిరాదు. దీన్ని మీరు చూడాలి - మనస్సు వల్ల ఏ ఉపయోగమూ లేదని. మనస్సు వల్ల ఏ ఉపయోగమూ లేదు అన్న విషయం మీకు తెలిసొస్తే, ఆ నిస్సహాయస్థితిలోనే, ఆ పరిస్థితిలోనే, అక్కడ ఉంటుంది ఓ నిశ్శబ్దం; అన్నీ ఆగిపోయి ఉంటాయి. మనస్సు దేన్నీ చేయలేకుండా ఉన్నప్పుడు, అది చేసేందుకు ఏమీ మిగిలి ఉండదు. ఉన్నట్లుండి ఆలోచనలన్నీ స్తంభించిపోయి ఉంటాయి. ఆ ఆలోచనలకు అప్పుడు ఏ దిక్కూ, దిశా ఉండదు. మనస్సు అలా చచ్చుబడిపోయి ఉన్నప్పుడు ఓ క్షణమాత్రపు అమనస్కస్థితి దర్శనం మీకు కలుగుతుంది... మీ లోపల ఓ చిన్న కిటికీ మాత్రం తెరచుకుంటుంది. మనస్సు ఆగిపోయి ఉన్న ఆ పరిస్థితిలో మీకు తెలుస్తుంది అమనస్కపు రుచి. ఆ తరువాత అంతా కదలడం ప్రారంభమైపోతుంది. అనంతత్వంలో దారితప్పిపోవడానికి అప్పుడు మీకు అతి సులభంగా ఉంటుంది.

మీరు ధ్యానచింతనను చెయ్యలేరు, ధ్యానంలోకే మీరు ప్రవేశించాలి. ఆ విషయాన్ని గురించి 'ధ్యానిస్తూ ఉండడం' ఓ అబద్ధపు ఆచరణం, ఓ తప్పుడు వ్యవహారం; ఓ విధంగా అది తప్పించుకుపోతూ ఉండడమే. మృత్యువు అంటే మీకు భయం - చావు గురించి మీరు ఆలోచిస్తారు. 'నిర్వాణం' అంటే మీకు భయం - నిర్వాణం గురించి మీరు ఆలోచిస్తారు. ఆలోచిస్తూ ఉండడం వల్ల మృత్యువు గురించీ, నిర్వాణం గురించీ కూడా ఆలోచించగలిగే సామర్థ్యం వచ్చేసినట్లు మీకు అనిపిస్తూ ఉంటుంది.

"నా మనస్సు పేలిపోయేట్లు ఉంటోంది వీటిని చేస్తూ ఉంటే."

మనస్సు మహా జిత్తులమారి. అది తప్పకుండా మిమ్మల్ని మోసగిస్తూ ఉండవచ్చు- ఎందుకంటే ఆలోచనను చేస్తున్నప్పటి మనస్సుకు పేలిపోయే సామర్థ్యం లేదు కాబట్టి. ఏ విషయాన్ని గురించి మీ ఆలోచన జరుగుతున్నా ఆ సమస్య ఉండదు. ఓ ఆలోచన జరుగుతున్నప్పుడు మనస్సు పేలిపోదు. జరుగుతున్న ఆలోచనను మహా ఆనందంతో మనస్సు అనుభవిస్తూ ఉంటుంది. ఆ ఆనందం మనస్సులో సంభవిస్తున్నప్పుడే పేలిపోతున్నట్లు మీరు ఆలోచన చేస్తూ ఉంటారు.

"నా సామర్థ్యపు హద్దుల్ని అతిక్రమించి నా ప్రయత్నం సాగుతున్నట్లు నాకు అనిపిస్తూ ఉంటోంది. ఓ షీజోఫ్రినిక్ పిచ్చి పట్టేస్తుందేమోనని భయపడుతున్నాను."

షీజోఫ్రీనియా పట్టేస్తుందేమోనని మీరేం బెంగపెట్టుకోనక్కరలేదు. ఎందుకంటే ఇప్పటికే మీరు అది అయిపోయి ఉన్నారు కాబట్టి – ప్రతిఒక్కరూ అలాగే ఉంటున్నారు. మనస్సే అస్థిమితం. ఎందుకంటే మనస్సుకు ఐక్యత గురించి ఏమీ తెలియదు కాబట్టి. మనస్సు ఎప్పుడూ విభజింపబడే ఉంటుంది. మనస్సుకు ఎప్పుడూ ప్రత్యామ్నాయ అవకాశాలు ఉంటాయి. సంకల్ప వికల్పాలు. ఉండాలా పోవాలా, ఇది చెయ్యాలా అది చెయ్యాలా. ఎప్పుడూ మనస్సు అనిశ్చితంగానే ఉంటుంది. ఏ ఎంపికను మీరు చేసుకుంటూ ఉన్నా మీ మనస్సులో కొంతభాగం మాత్రమే మీ ఎంపికను చేస్తూ ఆమోదిస్తూ ఉంటుంది. తక్కిన మనస్సు భాగం ఆ ఎంపికను వ్యతిరేకిస్తూ ఉంటుంది.

మనస్సు ఎప్పుడూ మొత్తంగా ఉండదు. కాబట్టే అది బహుతత్వాలతో, ప్రవృత్తులతో ఉంటుంది. దాన్ని గురించి మీరు భయపడనక్కరలేదు. మనస్సుతో ఉంటేనే మీరు షీజోఫ్రినిక్‌గా ఉంటారు. బుద్ధుళ్ళు మాత్రమే అతీతంగా ఉంటారు. మానవత్వం మొత్తం బహు వ్యవహార వ్యక్తిత్వాలతో ఉంటోంది – కొంత ఎక్కువగానో, తక్కువగానో. ఏ వైపుకు మీరు అతిగా చరించినా మీరు ఓ మానసిక విశ్లేషకుడి దగ్గరికి వెతుక్కుంటూ, అన్వేషిస్తూ వెళ్ళవలసే వస్తుంది. కానీ తేడా ఉంటుంది అతితక్కువ డిగ్రీలలో : పరిమాణంలోనే తేడా ఉంటుంది కానీ లక్షణంలో కాదు. మీకూ మీ మానసిక విశ్లేషణకీ మధ్య ఉన్న తేడా పరిమాణం కూడా అత్యల్పంగానే ఉంటుంది.

గుర్తుంచుకోండి. మనస్సు సహాయం చెయ్యదు. మనస్సు సహాయం చెయ్యలేదు. అది ఓ ప్రతిబంధకంగానే ఉండగలుగుతుంది. దీన్ని దర్శిస్తే అమనస్కం వస్తుంది. దాన్ని మీరు పట్టుకునిరారు. తనంతట తనే వచ్చేస్తుంది అమనస్కం.

## రెండవప్రశ్న :

***ప్రియ ఓషో,***

***నిన్నటి సూత్రంలో బుద్ధుడు అన్నాడు; బోధిసత్త్వుని వాహనంలో బయలుదేరి వెళ్ళినవాడు 'సర్వజీవుల్నీ నిర్వాణంలోకి నేను నడిపించితీరాలి - నిశ్శేషంగా ఆ నిర్వాణతలంలోకి' అన్న నిశ్చితాన్ని పొందితీరాలని. దేన్నీ విడిచిపెట్టకుండా చేరిపోయే ఆ నిర్వాణతలం అంటే ఏమిటి?***

నిర్వాణాన్ని గురించి బుద్ధుడు రెండు రకాలుగా మాట్లాడాడు. మొదటిది మూలం మిగిలి ఉన్న నిర్వాణం. వృక్షం అదృశ్యమైపోయి ఉంటుంది. భూఉపరితలం మీది 'కోరికలు' అనే వృక్షం. ఆ వృక్షపు ఆకులన్నీ, కొమ్మరెమ్మలన్నీ, ఫల, పుష్పాలన్నీ-అదృశ్యం అయిపోయాయి. కానీ భూమి క్రింద ఆ వృక్షపు వేళ్ళు ఇంకా మిగిలే ఉంటున్నాయి, ఆ నల్లమట్టి క్రింద లోపల దాక్కుని. బాహ్యంలో ఉన్న వృక్షం తొలగించబడిపోయింది. కానీ ఆ వృక్షానికి మళ్ళీ పుట్టుకొచ్చే శక్తి ఇంకా మిగిలే ఉంది. భూమి క్రింద దాని వేళ్ళు ఇంకా మిగిలే ఉన్నాయి. ఆ వృక్షపు విత్తనం ఇంకా సజీవంగానే మిగిలి ఉంది. దీన్నే బుద్ధుడు 'సశేష నిర్వాణం' అన్నాడు - మూలం మిగిలి ఉన్న నిర్వాణం.

దీన్నే సరిగ్గా పతంజలి 'సబీజ సమాధి' అన్నాడు. విత్తనం ఇంకా సజీవంగానే ఉన్న సమాధి. బయటి నుంచి ఎంతో కష్టంగా ఉంటుంది. వృక్షం మొత్తం తొలగింపబడి ఉంటుంది, కానీ భూమి క్రింద వేళ్ళు సజీవంగానే ఉంటూ మళ్ళీ చిగురించేందుకు సరైన సమయంకోసం నిరీక్షిస్తూ ఉంటుంది. వర్షాలు కురిసిన వెంటనే ఆ వేళ్ళు అన్నీ మళ్ళీ చిగురిస్తాయి. ఋతువు మార్పుకోసం ఆ వేళ్ళు నిరీక్షిస్తూ ఉంటాయి, తమ సత్తాను మళ్ళీ ప్రకటించుకునే సరైన సమయంకోసం.

ఎన్నోసార్లు మీ మనస్సు మాయమైపోతున్నట్లు అనుభవంలోకి వస్తున్న పరిస్థితి సరిగ్గా ఇదే. మీరు ఓ అమనస్కపు స్థితిని గ్రహిస్తారు, కానీ మళ్ళీ ఆ మనస్సు తిరిగి వచ్చేస్తుంది, మళ్ళీ మొలకెత్తేస్తుంది మనస్సు. మీరు ఓ అత్యున్నత శిఖర స్థితిని అందుకుంటారు. ఆ శిఖరానుభూతి అనుభవంలో సర్వస్వం పూర్తయిపోయిందని మీకు అనిపిస్తుంది, మళ్ళీ అజ్ఞానపు లోయలోకి మీరు పడిపోరనే అనిపిస్తుంది. మళ్ళీ పరమవికారపు అతిదైన్యపు రోజుల్లోకి మీరు తిరిగిపోరనే అనిపిస్తుంది. మీ ఆత్మ కాళరాత్రి అంతం అయిపోయినట్లే అనిపిస్తుంది. ఆ శుభదినం వచ్చేసినట్లే అనిపిస్తుంది. ప్రజ్ఞాపూర్ణోదయం అయిపోయినట్లే ఉంటుంది.

కానీ మళ్ళీ ఆ గాడాంధకారంలోకే పడిపోతున్నట్లు అనిపించే రోజు ఉన్నట్లుండి వచ్చేస్తుంది - మళ్ళీ మీరు అగాధంలోనే పడిపోయి ఉంటారు. మళ్ళీ అక్కడ వెలుగు ఉండదు, మీ శిఖర ప్రజ్ఞానుభవం మళ్ళీ ఓ జ్ఞాపకంగానే మిగిలిపోయి ఉంటుంది. ఆ అనుభవం నిజంగా జరిగిందో, లేదో అని సందేహం వచ్చేసి ఉంటుంది. లేదా "నేనే ఊహించుకున్నానా? నేనే కలగంటున్నానేమో?" అని అనిపించవచ్చు. ఎందుకంటే... నిజంగానే అది సంభవించి ఉంటే, మరి ఇప్పుడది ఎక్కడికి పోయింది? సూర్యకిరణాలతో వెలుగులు చిమ్ముతున్న ఆ శిఖరం ఏదీ? ఎక్కడికి వెళ్ళిపోయాయి ఆ బ్రహ్మానంద పారవశ్యపు క్షణాలు? మళ్ళీ వచ్చేసి ఉంది దైన్యం, వ్యధ - మళ్ళీ ఈ నరకంలోకే పడిపోయి ఉన్నారు మీరు. ఎన్నోసార్లు ఇది జరుగుతుంది.

దీన్నే బుద్ధుడు 'సశేష నిర్వాణం' అని అంటాడు. దీన్నే పతంజలి 'సబీజ సమాధి' అని అంటాడు. సంభవించి ప్రత్యక్షంగా ఉన్న ప్రపంచం అదృశ్యం అయిపోయింది. సంభవించకుండా బీజప్రాయంగా అది ఉనికిలో మిగిలే ఉంది.

రెండవ నిర్వాణాన్ని బుద్ధుడు 'నిశ్శేష నిర్వాణం' అని అంటాడు. పతంజలి దీన్నే 'నిర్బీజ సమాధి' అంటాడు - విత్తనం మిగిలి ఉండని సమాధి. వృక్షం నాశనం అయిపోవడం మాత్రమే కాక విత్తనం కూడా మాడిపోయి ఉంటుంది. మాడిపోయిన విత్తనం మళ్ళీ మొలకెత్తదు. అన్ని ఆధారాలూ అంతరించిపోయాయి. అప్పుడు మీరు ఉంటారు ప్రజ్ఞాశిఖరం మీదే సదా, అక్కణ్ణుంచి మళ్ళీ పడిపోవడం జరగదు.

ఈ విషయాన్నే బుద్ధుడు నిన్నటి ఈ సూత్రంలో చెప్పాడు బోధిసత్త్వుని వాహనంలో బయలుదేరినవాడు ఈ విధంగా నిశ్చయించుకుని తీరాలి "జీవసర్వస్వాన్నీ నేను నడిపించి తీరుతాను నిర్వాణంలోకి... నిశ్శేష నిర్వాణతలంలోకి" - అన్ని జీవాధారాలనూ దేన్నీ మిగల్చకుండా; ఏ విత్తనాలనూ మిగల్చకుండా, ఏ వేళ్ళనూ మిగల్చకుండా.

## మూడవప్రశ్న:

*ప్రియ ఓషో,*

*లైంగికత్వం గురించి జెన్ ఎలా ఊహిస్తుంది, వ్యవహరిస్తుంది? లైంగికత్వాన్ని జెన్ ఎలా సమీపిస్తుంది? జెన్ మనుష్యులు ఓ నపుంసకత్వంతోనే ఉన్నట్లూ, అలైంగిక తేజః శరీరాలతో- ఆరాలతో - ఉన్నట్లే తోస్తుంది.*

లైంగికత్వం గురించి జెన్ ఏ వైఖరులనూ ప్రదర్శించదు. అదే జెన్‌లో ఉన్న సౌందర్యం. లైంగికత్వం పట్ల ఓ వైఖరి ఉంటున్నదంటే దానికి అర్థం ఒక వ్యామోహం మీకు ఈ వైపో, ఆ వైపో ఉన్నట్లే కనుక. ఎవరికో లైంగికత్వం పట్ల విముఖత ఉంటుంది. అది ఓ వైఖరి. మరి ఎవరికో లైంగికత్వం పట్ల సుముఖత ఉంటుంది. అది ఓ వైఖరి. ఈ సుముఖత్వ విముఖత్వ తత్వాలు రెండూ ఓ ఎద్దుబండికి ఉన్న రెండు చక్రాల లాంటివే. అవి రెండూ శత్రువులు కావు. స్నేహితులే అవి, ఒకే వ్యాపారంలో వ్యవహరిస్తున్న భాగస్వాములు.

జెన్‌కు లైంగికత్వం పట్ల ఏ వైఖరీ లేదు. ఎవరికైనా లైంగికత్వం పట్ల ఓ వైఖరి ఎందుకు ఉండాలి? అదే దాని సౌందర్యం – జెన్ తటస్థంగా ఉంటుంది. నీళ్ళు తాగటం గురించి మీకు ఏదైనా వైఖరి ఉందా? భోజనం చెయ్యడాన్ని గురించి మీకు ఏదైనా వైఖరి ఉందా? రాత్రిపూట నిద్రపోవడం గురించి మీకు ఏవైనా వైఖరులు ఉన్నాయా? ఏ వైఖరులూ లేవు.

ఈ విషయాల గురించి కూడా వైఖరులను ప్రదర్శిస్తూ ఉన్న పిచ్చివాళ్ళు ఉన్నారని నాకు తెలుసు. ఓ మనిషి అయిదుగంటలకంటే ఎక్కువ సమయం నిద్రపోకూడదు అని అంటూ ఉండేవాళ్ళు. నిద్ర కూడా ఓ విధమైన పాపమే, ‘తప్పకుండా అనుభవించి తీరాల్సిన హింస’ లాంటి విషయమే. కాబట్టి మనిషి అయిదుగంటలకంటే ఎక్కువగా నిద్రపోకూడదు; భారతదేశంలో కొంతమంది ఉన్నారు. వాళ్ళు మూడుగంటల నిద్ర మాత్రమే చాలు అనుకుంటూ ఉంటారు. ఓ పదేళ్ళపాటు నిద్రేపోని ఓ మనిషి నాకు తెలుసు – ఇందువల్లే ఆయన్ను ఎంతోమంది పూజిస్తూ ఉన్నారు. ఆయన దగ్గర ఇంకే మహిమలూ లేవు. ఏ సృజనాత్మక సామర్థ్యాలూ లేవు. ఆయనకున్న ఏకైక సామర్థ్యం నిద్రపోకుండా ఉండడం మాత్రమే. బహుశా ఆ మనిషికి ‘ఇన్సోమ్నియా’ (నిద్రపట్టకపోయే జబ్బు) ఉండవచ్చు. బహుశా ఇది కూడా ఆయన సామర్థ్యం కాకపోవచ్చు. బహుశా ఆయనకు నిద్రేపట్టదేమో. నరాల స్థిమితత్వం ఎంతగానో పోయి ఆ మనిషి కనీసం సౌఖ్యంగా కూడా ఉండలేకపోతూ, ఓ పిచ్చివాడిగా కనిపిస్తూ ఉంటాడు. ఓ పదేళ్ళు నిద్రపోకుండా ఉంటే ఓ మనిషికి పిచ్చే పడుతుంది. జనాలు వచ్చేస్తూనే ఉంటారు, గుంపులు గుంపులుగా ఆయన్ను పూజించడానికి : “ఏ మహత్వమో ప్రాప్తించింది ఆయనకు”. ఆయనకు ఏం ప్రాప్తించింది? ఆయనలో ఉన్న ఆ ప్రాప్తం ఏది? ఆయన కేవలం ఓ అసాధారణపు మనిషి. జబ్బుపడి ఉన్నవాడు. నిద్రపోవడమే సహజ లక్షణం. ఆ మనిషి మహాఉద్విగ్నంగానే!

ఉండితీరుతాడు – ఆయన మహాఉద్విగ్నంగా ఉంటున్నాడు. లోపల ఆయన ఉడికిపోతూ ఉండవచ్చు. కాస్త ఆలోచించండి. పదేళ్ళు నిద్రేపోలేదా! ఇప్పుడు అది ఆయనకు ఓ గొప్ప పెట్టుబడిగా తయారైంది, ఇప్పుడు ఆయన సంపాదిస్తున్నాడు. ఆయన పిచ్చే అయిపోయింది ఓ పెట్టుబడి. కొన్నివేలమంది ఆయనకు ప్రస్తుతం పూజలు చేస్తున్నారు – కేవలం ఇంతమాత్రానికేనా?

యుగాల పర్యంతం జరిగిన మహోపద్రవాల్లో ఇదొకటి – ఏ సృజనాత్మకతా ఉండని విషయాలను ప్రజలు పూజిస్తూ ఉండడం, కొన్నిసార్లు రోగిష్టి విషయాలను. ఇప్పుడు మీకు నిద్ర గురించిన ఓ వైఖరి ఉంటోంది. భోజనాన్ని గురించి ఓ వైఖరి తీరును ప్రదర్శిస్తున్న మనుష్యులు కూడా ఉన్నారు. ‘అది తినొచ్చు, ఇది తినకూడదు’ అనుకుంటూ; అంతమాత్రంగానే తినాలి, అంతకంటే ఎక్కువగా తినకూడదు. శరీరం చెబుతున్న మాటలను వాళ్ళు వినరు. శరీరానికి ఆకలి ఉంటోందో లేదో చూడరు. ఓ ఊహ ఉంటుంది వాళ్ళల్లో, దాన్నే ప్రకృతి మీద విధించేస్తారు.

జెన్‌కు లైంగికత్వం పట్ల ఏ వైఖరీ లేదు. జెన్ మహాసామాన్యంగా ఉంటుంది. జెన్ అమాయకంగా ఉంటుంది. అది ఓ పసిపాపలాగే ఉంటుంది. ఏ వైఖరులూ ఉండాల్సిన అవసరం లేదని జెన్ అంటుంది. ఎందుకు? ‘తుమ్మడం’ గురించి ఏ వైఖరి అయినా ఉంటోందా మీలో? – తుమ్మవచ్చుననో, తుమ్మకూడదనో? తుమ్మితే పాపమనో, పుణ్యమనో? మీకు ఏ వైఖరులూ ఉండవు. కానీ తుమ్ములంటే అసలు గిట్టని, అసలు పడని, వాటిని ద్వేషించే మనిషి ఒకడు నాకు తెలుసు. తుమ్ము వచ్చినప్పుడల్లా వెంటనే ఆయన ఓ మంత్రాన్ని పఠించేస్తాడు, తనను రక్షించుకునేందుకోసం, ఆయన ఓ చిన్న మూర్ఖపు శాఖకు చెందిన మనిషి. ఆ శాఖ అనుకుంటుంది తుమ్మినప్పుడు ఆత్మ బయటికి వెళ్ళిపోతుందని. తుమ్మితే ఆత్మ ఊడిపోతుంది. వెంటనే దేవుడి జ్ఞాపకం మీకు రాకపోతే బయటికి వెళ్ళిపోయిన ఆత్మ మళ్ళీ లోపలికి రాకపోవచ్చు. కాబట్టి మీరు దేవుణ్ణి స్మరించాలి, మీ ఆత్మ మళ్ళీ మీకు వచ్చేసేందుకు. తుమ్ముతూ చచ్చిపోతే మీరు నరకానికి వెళ్ళిపోతారు.

దేన్ని గురించి అయినా మీకు వైఖరులు ఉండవచ్చు. వైఖరులను స్వీకరించిన తక్షణం మీ అమాయకత్వం ధ్వంసం అయిపోయి, అప్పటినుంచి ఆ వైఖరులే మిమ్మల్ని శాసించడం ప్రారంభించేస్తాయి. జెన్ దేనితోనూ అనుకూలంగా ఉండదు, దేనితోనూ ప్రతికూలంగా ఉండదు. దేన్నీ సమర్థించదు, దేన్నీ వ్యతిరేకించదు. సహజంగా ఏది ఉన్నా, అదే మంచిది అంటుంది. సహజంగా ఉంటూ, సామాన్యంగా ఉంటూ,

ఎవరిగానో ఉండకుండా ఉంటూ, ఓ శూన్యంగానే ఉంటూ, ఏ ఆశయాలూ లేకుండా ఉంటూ, ఏ లక్షణాలూ లేకుండా ఉంటూ, అలక్షణికంగానే ఉంటూ...

ఓ వ్యక్తిత్వ లక్షణం మీకు ఉంది అంటే ఓ నాడీమండల అవలక్షణం మీకు ఉన్నట్లే. లక్షణం అంటే ఓ విషయం మీలో పూర్తిగా పాతుకుపోయిందనే అర్థం. లక్షణం అంటే మీ గతం అనే అర్థం. లక్షణం అంటే మీ వ్యక్తిత్వపు తీరేనని అర్థం. మీరు నేర్చుకున్నదే, అభ్యసించినదే అని అర్థం. మీకు ఓ లక్షణం ఉంటే, మీరు అందులోనే బంధింపబడి ఉంటారు. మీకు స్వాతంత్ర్యం ఉండదిక. ఓ లక్షణం మీకు ఉంటే, మీరు ఓ కవచాన్ని తొడుక్కునే ఉంటారు. మీరు స్వతంత్రులుగా ఉండరిక. మీరు ఓ కారాగారంలో ఇరుక్కుని దాన్నే మోసుకుంటూ తిరుగుతూ ఉంటారు. ఓ మహాసూక్ష్మమైన కారాగారం అది. ఓ నిజమైన మనిషికి ఏ లక్షణాలూ ఉండవు. ఏ శీలమూ ఉండదు.

ఏ శీలమూ ఉండదని నేనంటున్నప్పుడు ఆ మాటలకు అర్థం ఏమిటి? ఆ మనిషి గతం నుండి స్వాతంత్ర్యం పొంది ఉంటాడనే. ఆ క్షణంలో ఉంటున్న పరిస్థితికి తగ్గట్లు ప్రవర్తిస్తూ ఉంటాడు. సద్యఃఉనికితో ఉంటాడు. కేవలం ఆ మనిషి మాత్రమే స్వయంకృతుడై ఉండగలడు, స్వాధీనుడై. ఏ పనినైనా చేస్తున్నప్పుడు ఆ మనిషి గతంలోకి చూసుకోడు, ఏం చెయ్యాలో నిశ్చయించుకోవడానికి. ఓ పరిస్థితి ఏర్పడి ఉంటుంది, మీరు చూసుకుంటూ ఉంటారు గతంలోని జ్ఞాపకాలలోకి – అప్పుడు మీకు ఓ లక్షణం ఉంటుంది. అప్పుడు మీరు అడుగుతూ ఉంటారు మీ గతాన్ని "ఇప్పుడు నేనేం చెయ్యాలి?" అని. మీకు ఏ లక్షణాలూ లేకుండా ఉన్నప్పుడు, మీరు గమనిస్తారు ఉన్న పరిస్థితిని. ఆ పరిస్థితే నిర్ణయిస్తుంది ఏం జరగాలి అన్న కార్యాన్ని. అప్పుడు అది ఓ సద్యఃచర్యగా ఉంటుంది – అది సద్యఃస్పందనగానే ఉంటుంది తప్ప ప్రతిక్రియగా అది ఉండదు.

జెన్‌కు ఏ విశ్వాసాల వ్యవస్థా లేదు – లైంగికత్వానికి కూడా అదే స్థితి. జెన్ లైంగికతను గురించి ఏమీ చెప్పదు. అది ఓ పరమోత్తమ విషయంగా ఉండాలి. తంత్రవిద్యకు లైంగికత గురించిన ఓ వైఖరి ఉంది. అందుకు కారణం? – సంఘం పాడుచేసిన దానిని అది పునరుద్ధరిస్తుంది కనుక. తంత్రవిద్య స్వస్థతకు సంబంధించింది. అది చికిత్సాత్మకం. సంఘం లైంగికత్వాన్ని అణగద్రొక్కేసి ఉంది. తంత్రవిద్య ఆ లైంగికత్వాన్ని పునరుద్ధరిస్తుంది. మీకు సమానత్వాన్ని తెప్పిస్తుంది. మీరు ఎడమపక్కకు ఎక్కువగా తూలి ఉంటారు; తంత్రవిద్య తుల్యస్థితిని

పునరుద్ధరించడానికి మిమ్మల్ని కుడివైపుకు వాలేలా సహాయపడుతుంది. మీ సమతుల్యతను పునరుద్ధరించుకునేందుకోసం మీరు కుడిపక్కకు ఒక్కొక్కసారి ఎంతో ఎక్కువగా వాలిపోవాల్సి రావచ్చు. అప్పుడే మీకు సమస్థితి ఏర్పడుతుంది. మీరు తాడు మీద నడుస్తున్న మనిషిని చూడలేదా? ఎంతో ఎత్తులో బిగించి కట్టి ఉన్న ఓ తాడు మీద అలా నడుస్తూ ఉన్న ఆ మనిషి చేతుల్లో ఓ పెద్ద వెదురుకర్ర ఉంటుంది, సమతుల్యస్థితిని నిలిపి ఉంచుకోవడానికి. ఆ మనిషికి తను ఎడమపక్కకు ఎక్కువగా తూలిపోతున్నట్లు తెలుస్తున్నప్పుడు తక్షణం కుడివైపుకు వాలిపోవడాన్ని ప్రారంభించేస్తాడు. మరీ ఎక్కువగా కుడివైపుకు వాలిపోతున్నట్లు తెలుస్తున్న వెంటనే, ఎడమవైపుకు వాలడాన్ని ఆ మనిషి ప్రారంభిస్తాడు. ఈ విధంగానే తాడు మీద సరిగ్గా నిలబడి ఉంటాడు దానిమీద నడుస్తున్న మనిషి. తంత్రవిద్య ఓ చికిత్స.

సంఘం ఓ అణచిపెట్టేసే మనస్సును, ఓ జీవిత అపసవ్య మనస్సును, ఆనందాన్ని వ్యతిరేకించే మనస్సును సృష్టించింది. సంఘం లైంగికత్వాన్ని మహాఎక్కువగా ద్వేషిస్తూ ఉంటుంది – సంఘం లైంగికతకు వైరిగా ఎందుకు ఉంటోంది? – ఎందుకంటే లైంగిక ఆనందాన్ని ప్రజలకు అనుమతిస్తే వాళ్ళను మీరు బానిసలుగా మార్చలేరు కాబట్టి. అది అసాధ్యం – ఆనందంగా ఉంటున్న మనిషిని బానిసగా చేసెయ్యలేం. అదే కిటుకు. దుఃఖంతో ఉన్న మనుష్యులనే బానిసలుగా చేసెయ్యొచ్చు. ఆనందంగా ఉంటున్న మనిషి స్వతంత్రుడు. ఆ మనిషిలో ఓ విధమైన అపరాధీనత ఉంటుంది.

ఆనందంగా ఉంటున్న మనుష్ఘుల్ని మీరు యుద్ధంకోసం సైన్యంలోకి చేర్చుకోలేరు. అసాధ్యం. వాళ్ళు యుద్ధానికి ఎందుకు వెళ్తారు? కానీ ఓ మనిషి తన లైంగికత్వాన్ని అణచి పెట్టేసుకున్నాడంటే యుద్ధానికి వెళ్ళడానికి సంసిద్ధమై ఉంటాడు. యుద్ధంలోకి వెళ్ళేందుకు ఎంతో ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూ ఉంటాడు, జీవితాన్ని ఆనందిస్తూ సాగించలేక పోతున్నాడు కనుక. జీవితానందాన్ని అనుభవించే సామర్థ్యాన్ని ఆ మనిషి పోగొట్టుకున్నాడు. అప్పటినుంచి తన సృజనాత్మకతను కూడా ఆ మనిషి పోగొట్టుకునే ఉంటాడు. ఇప్పుడు ఆ మనిషి చేయగలిగేది ఒక్కటే – విధ్వంసం, ఆ మనిషిలో ఉన్న సర్వశక్తులూ విషపూరితం, విధ్వంసకరం అయిపోయి ఉంటాయి. యుద్ధానికి సంసిద్ధుడై ఉంటాడు – సంసిద్ధుడై ఉండడం మాత్రమే కాదు, ఆకాంక్షిస్తూ ఉరకలు వేస్తూ ఉంటాడు కూడా. చంపెయ్యాలి, నాశనం చేసేసెయ్యాలి. వాస్తవంలో ఆ మనిషి మనుష్యుల్ని చంపుతూ ఉన్నప్పుడు వాళ్ళ లోపలికి దూసుకుపోతున్నట్లు ఓ ప్రత్యామ్నాయ ఆనందాన్ని కూడా అనుభవిస్తూ ఉంటాడు. ఈ దూసుకుపోవడం

ప్రేమలో జరిగినప్పుడు అది అందంగా ఉండి ఉంటుంది. ప్రేమిస్తూ ఓ స్త్రీ శరీరం లోపలికి దూసుకుపోవడం ఒక విషయం. అది ఆత్మీయంగా ఉంటుంది. కానీ పరిస్థితులు విషమించి మీరే ఆ మనిషిలోకి దూరుతున్నట్లు ఓ కత్తితో ఆ మనిషి లోపలికి దూసుకువెళ్తే, ఓ శూలంతో పొడుస్తూ ప్రవేశిస్తూ ఉంటే, అది మహా వికారంగా ఉంటుంది. అది హింసాత్మకంగా ఉంటుంది. అది విధ్వంసకరంగా ఉంటుంది. కానీ ఆ దూసుకువెళ్ళే కార్యానికి ప్రత్యామ్నాయంగా ఈ ప్రవేశాన్ని మీరు అన్వేషిస్తున్నారు.

సంఘానికి ఓ పూర్తి స్వతంత్రాన్ని ఆనందంకోసం సమ్మతిస్తే, ఎవ్వరూ విధ్వంసకరంగా ఉండరు. అందంగా ప్రేమించగలిగేవాళ్ళు ఎవరూ విధ్వంసకరంగా ఉండరు. అందంగా ప్రేమించగలిగేవాళ్ళు ఎప్పుడూ విధ్వంసకరంగా లేరు. అందంగా ప్రేమించగలుగుతూ జీవితానందాన్ని పొందుతున్నవాళ్ళు ఏ పోటీల్లోనూ పాల్గొనరు కూడా. ఇవి సమస్యలు.

అందువల్లే ప్రాచీన మానవులు ఏ పోటీతత్వమూ ఉండకుండా ఉండేవాళ్ళు. వాళ్ళు తమ జీవితాలను ఆనందిస్తూ గడిపేవాళ్ళు. ఇంకా పెద్ద ఇల్లు ఎవరికి కావాలి? బ్యాంక్‌లో పొదుపు సొమ్ములు ఎంతో ఎక్కువగా ఎవరికి కావాలి? ఎందుకోసం ఆ ధనం అంతా? మీ స్త్రీతో మీరూ, తన పురుషుడితో ఆమె ఓ జీవితనాట్యాన్ని చేసుకుంటూ ఉంటున్నప్పుడు? అంగళ్ళలో పనిచేస్తూ గంటలకొద్దీ, రాత్రింబవళ్ళూ, ఏళ్ళ పర్యంతం, ఎంతో సంపదను అలా ప్రోగుచేసుకోవచ్చునీ, అప్పుడు పనిమానేసి ఆనందంగా జీవితాన్ని అనుభవించవచ్చుననీ ఎవరు అనుకుంటూ ఉంటారు? ఆ విశ్రాంతి మీకు ఏ రోజుకూ రాదు. రాలేదు కూడా, ఎందుకంటే ఓ సన్యాసిలా మీ జీవితాన్నంతా మీరు గడుపుకుంటూ వచ్చారు కాబట్టి.

గుర్తుపెట్టుకోండి, వ్యాపారాలు చేసుకుంటూ ఉండిపోతున్న మనుష్యులే సన్యాసుల్లాంటి వాళ్ళు. ఆ మనుష్యులు తమ సర్వస్వాన్నీ డబ్బుకే అంకితం చేసేసుకుని ఉంటారు. ప్రేమనూ, జీవితానందాన్నీ, ఆ ప్రేమ పారవశ్యాన్నీ అనుభవిస్తూ ఉన్న మనుష్యులు ఇప్పుడు పోటీపడుతూ ఉండరు. ఆ రోజుకు తిండి దొరికితే చాలు ఆ మనుష్యులకు, మహాసంతోష పడిపోవడానికి. ఇదే అర్థం జీసస్ చేస్తున్న ప్రార్థనకు : "ఈ రోజు రొట్టెను మాకు ఇవ్వు". ఈ రోజు తిండి దొరికితే అదే మహాభాగ్యం - ఆశిస్తున్న దానికంటే అది ఎక్కువే. ఇక్కడే జీసస్ కొంచెం మూర్ఖంగా కనిపిస్తూ ఉంటాడు. ఆయన "గొప్ప బ్యాంకు బ్యాలెన్సు ఇవ్వు" అని అడిగి ఉండాలి. రొట్టె దొరికితే సరిపోతుందా ఆయనకు? రొట్టె మాత్రమే ఇమ్మని అడుగుతాడా ఆయన?

కానీ ఆనందంగా ఉంటున్న మనిషి అంతకంటే ఎక్కువగా దేన్నీ ఆశించడు. అంతమాత్రంతోనే ఆ మనిషికి సాఫల్యం కలుగుతుంది.

ఆ సాఫల్యాన్ని అనుభవించలేని మనుష్యులే ఆ విధంగా పోటీపడుతూ ఉంటారు. ఎందుకంటే వాళ్ళు ఇప్పుడు జీవితం లేదని అనుకుంటారు కాబట్టే. జీవితం ఇప్పుడే ఉంటుంది. "నేను ఢిల్లీకి వెళ్ళి దేశాధ్యక్షుడిగా అయిపోవాలి" లేదా "వైట్‌హౌస్‌కు చేరి ప్రెసిడెంటుగా అయిపోవాలి". "అక్కడికి వెళ్తేనే, అక్కడే ఆనందం ఉంటుంది" – ఎందుకంటే ఇక్కడ ఏ ఆనందమూ ఉండడం లేదని వాళ్ళకు తెలుసు కనుక. కాబట్టి వాళ్ళు ఎప్పుడూ పోతూనే, పోతూనే, పోతూనే, పోతూనే ఉంటారు. ఎప్పుడూ వాళ్ళు పోతూనే ఉంటారు తప్ప, ఎప్పటికీ అక్కడికి చేరుకోలేరు. ఆనందం ఇప్పుడే ఇక్కడే ఉందని తెలుసుకుని ఉన్న మనిషి ఢిల్లీకి ఎందుకు వెళ్ళాలనుకుంటాడు? దేనికోసం? ఇక్కడే ఇప్పుడే మహదానందంగానే ఉంటున్నాడు కదా. ఆ మనిషి అవసరాలు అత్యల్పంగా ఉంటాయి. ఆ మనిషికి కోరికలు ఉండవు. అవసరాలను తీర్చుకోవాలి, కోరికలను కాదు. అవసరాలు సహజంగా ఉంటాయి, కోరికలు వక్రతతో ఉంటాయి.

ఇప్పుడు ఈ సంఘం అంతా ఒక్క విషయం మీదే ఆధారపడి ఉంది. అదే లైంగికత్వపు అణచివేత. అది ఉండకపోతే ఆర్థిక స్థితి అంతా అస్తవ్యస్తం అయిపోతుంది. అన్యాక్రాంతం అయిపోతుంది. యుద్ధాలు మాయమైపోతాయి. దానితోపాటు యుద్ధ యంత్రాంగం అంతా సర్వనాశనం అయిపోతుంది. రాజకీయాల సార్థకతే ఉండదు. అప్పటినుంచి రాజకీయనాయకుడికి ఏ ప్రాముఖ్యమూ ఉండదు. ప్రజలకంతా ప్రేమించుకునే అనుమతి లభిస్తే డబ్బుకు ఏ విలువా ఉండదు. ప్రేమించుకునే అనుమతి లేకపోవడం వల్లనే ధనం ప్రత్యామ్నాయంగా ఉండగలుగుతోంది. ధనమే ఆ మనుష్యుల ప్రేమ అవుతుంది. కాబట్టి ఇందులో ఓ మహాసూక్ష్మం ఉంటోంది. లైంగికత్వాన్ని అణచిపెట్టెయ్యాలి. లేకపోతే సంఘపు వ్యవస్థ అంతా తక్షణం కుప్పకూలిపోతుంది తప్పకుండా.

ప్రేమ విడుదల అయితేనే ప్రపంచంలోకి ఓ విప్లవం వస్తుంది. కమ్యూనిజం విఫలమైంది. ఫాసిజం విఫలం అయింది. కేపిటలిజం విఫలం అయింది. అన్ని 'ఇజాలూ' విఫలాలు అయ్యాయి; ఎందుకంటే తమ ప్రగాఢాంతరాల్లో అవన్నీ లైంగికత్వాన్ని అణచిపెట్టేసే అభిప్రాయాన్నే కలిగి ఉండేవి కాబట్టే. ఆ విషయంలో మాత్రం ఏ భేదమూ లేదు – ఆ విషయాన్ని గురించి వాషింగ్టన్‌లోనూ, మాస్కోలోనూ, బీజింగ్, ఢిల్లీల్లోనూ – భేదమే లేదు. అవన్నీ ఆ విషయాన్ని గురించిన ఏకాభిప్రాయాన్నే

కలిగివుంటున్నాయి - లైంగికత్వాన్ని అణచిపెట్టేయాలి, నియంత్రించాలి. ప్రజలకు లైంగికత్వంలో అమాయకమైన ఆ ప్రేమానుభవం అనుమతింపబడకూడదు.

ఈ అపసవ్యాన్ని సరిదిద్దేందుకే తంత్రవిద్య తయారైంది, ఓ తుల్యతను సాధించడం కోసం. తంత్రవిద్య ఓ నివారణే, చికిత్సే. కాబట్టి తంత్రవిద్య లైంగికత్వాన్ని మహాసమర్థిస్తుంది. ఈ మతాలు అనబడుతున్నవన్నీ లైంగికత్వాన్ని 'పాపం' అని అంటాయి; తంత్రవిద్య లైంగికత్వమే మహాపవిత్రసంభవం అని అంటుంది. తంత్రవిద్య ఓ చికిత్సే. జెన్ కాదు చికిత్స. అన్ని రోగాలూ అదృశ్యం అయిపోయిన తరువాత మిగిలి ఉండే స్వస్థ స్థితే జెన్. అంతేకదా మరి, రోగాలతోపాటు నివారణలూ, చికిత్సలూ కూడా వెళ్ళిపోతే మిగిలేది స్వస్థతే కాబట్టి. అదే జెన్. మీ రోగం నయం అయిపోయిన తరువాత మందుచీటీల్నీ, మందుల్నీ మీరు మోసుకుంటూ తిరగరు. అన్నిటినీ మీరు అవతల పారేస్తారు. చెత్తడబ్బాల్లోకే చేరిపోతాయి అవి.

సామాన్యంగా సంఘం లైంగికత్వానికి విముఖంగానే ఉంటుంది; తంత్రవిద్య మానవాళికి సహాయాన్ని చేస్తుంది. లైంగికత్వాన్ని వారికి పునఃసమర్పిస్తూ. ఆ లైంగికత్వాన్ని పునర్గ్రహించిన తరువాత, అప్పుడు ఆవిర్భవిస్తుంది జెన్. జెన్‌కు ఏ వైఖరులూ ఉండవు. సంపూర్ణ ఆరోగ్యమే జెన్.

## నాల్గవ ప్రశ్న:

***ప్రియ ఓషో,***

***సర్వస్వమూ ఉందా, ప్రపంచం సరిగ్గా ఉందా? ఉంటే ప్రేమతో దానికేం పని? ప్రపంచం బాగుందని మీరు అన్నప్పుడు అది బాగానే ఉన్నట్లు నాకు అనిపిస్తూ ఉంటుంది. కానీ ఆ మాటనే ఇంకెవరైనా, లేకపోతే నేనే, చెబుతున్నప్పుడు ఏ తప్పో వినిపిస్తూ ఉంటుంది.***

అది ఆధారపడి ఉంటుంది అంటున్నవాళ్ళ మీదే. ఈ ప్రపంచం బాగుందని నేను అంటున్నప్పుడు ఏ సిద్ధాంతాన్నో నేను పరిచర్చకోసం అందించడం లేదు. నా దృక్పథాన్నే పంచుకుంటూ ఉన్నాను. వాస్తవంలో 'థియరీ' అన్న పదం గ్రీకుమూలమైన 'థియోరియా' నుంచే వస్తుంది. 'థియోరియా' అంటే దృక్పథ దర్శనమే. నేను మీకు చెబుతున్నవన్నీ మనస్సుకు సంబంధించిన విషయాలు కావు. నా అనుభవాన్నే మీతో నేను పంచుకుంటున్నాను. ఆ క్షణాలలో, స్వీకరించేందుకు సంసిద్ధులై విప్పారి మీరు ఉంటే ఆ దర్శనమే మీకు కూడా కలుగుతుంది. నా దర్శనమే మీ జీవిలోకి కూడా

పొర్లి ప్రవహిస్తుంది. ఆ క్షణంలో మీ తలుపులన్నీ తెరుచుకుని ఉంటూ మీరు "ఔను. ఇలాగే ఉంది" అని అంటారు.

ఇంకెవరో ఈ మాటను చెబుతున్నప్పుడు, ఆ మనిషికి ఈ 'దర్శనం' కలిగి ఉండకపోతే... లేదా మీరే ఇంకొకరికి చెబుతూ ఉంటే అది మీ 'దర్శనం'గా ఉండదిక – అది మీ స్వంతంకాని, అరువుతెచ్చుకున్న 'దృష్టి'గా ఉంటుంది – ఆ మాటలు సత్యంగా, సవ్యంగా ధ్వనించవు. ఓ బుద్ధుడు అబద్ధాన్నే చెప్పినా, అది సత్యంగా వినిపిస్తుంది. సత్యాన్నే మీరు చెబుతున్నా అది ఓ అబద్ధంగా వినిపిస్తుంది.

ఆ మాటలు ఎక్కణ్ణుంచి వస్తాయి అన్నదాని మీదే మరింత ఎక్కువగా అది ఆధారపడి ఉంటుంది. మూలం మీద : మీరు చెబుతున్న దానిమీద కాదు, 'ఎవరు చెబుతున్నారు?' అన్నదాని మీద. జీసస్‌క్రైస్ట్ చెప్పిన అన్ని మాటలనూ మీరు అందరికీ చెబుతూ ఉండవచ్చు. అందుకని మీకు ఎవ్వరూ శిలువ వేసెయ్యరు. ఎందుకు? శిలువ శిక్ష మీకు ఎందుకు పడడం లేదు? ఓ కొండమీదకి ఎక్కి నుంచుని జీసస్ శిఖర ఉపదేశాన్నంతా మళ్ళీ మీరు ప్రవచించవచ్చు, ఇంకా నిలబడే ఉండవచ్చు. ప్రపంచంలో మనుష్యులు ప్రస్తుతం చేస్తున్నది ఇదే – క్రైస్తవ పూజారులూ, మతదూతలూ, యెహోవా సాక్ష్యులూ, మ్‌మ్? అన్నిరకాల మనుష్యూ చేస్తున్నది ఆ పనినే – కొత్త నిబంధన గ్రంథాన్ని పట్టుకుని, ఆ గ్రంథంలోని మాటల్నే ఉదహరిస్తూ, కొన్ని పదాలను చెప్పిందే మళ్ళీ మళ్ళీ మళ్ళీ చెబుతూ. కానీ ఎవ్వరూ వాళ్ళకు శిలువ వేసెయ్యడం లేదు. ఎందుకు? ఆ మాటలను జీసస్ అన్నప్పుడు ఏంటి అర్థం? అప్పుడు ఆ మాటలలో మంటలు ఉన్నాయి. జీసస్ తన 'దర్శనాన్ని' అప్పుడు అందరికీ పంచిపెడుతూ ఉన్నాడు. అవే మాటలను మీరు ఇప్పుడు చెబితే ఆ మాటల్లో ఆ 'దర్శనం' ఉండదు. కేవలం మీరు మాటలను మాత్రమే వల్లిస్తూ ఉంటారు. అందులో ఆవేశం ఉండదు, అందులో తీవ్రత ఉండదు, అందులో సత్యం ఉండదు. అనుభవంలో నుంచి మాత్రమే సత్యం బయటికి వస్తుంది.

మీరు అడుగుతున్నారు : "సర్వస్వమూ ఉందా, ప్రపంచం సరిగ్గా ఉందా?" అని. ప్రపంచం బాగానే ఉందని నేనంటే, నిజంగా అర్థం ఏమిటి? ఈ ప్రపంచం మాత్రమే ఉందనీ, మరే ప్రపంచమూ లేదనే. ఈ ప్రపంచాన్ని దేనితోనూ పోల్చిచూడలేం. అది బాగున్నా, బాగా లేకపోయినా అసంగతమే. ఉన్న ప్రపంచం ఇదొక్కటే : ఇంకే ప్రపంచాలూ లేవు. ఇది ఉత్తమంగా ఉందా, లేదా అని మనం దేనితోనూ పోల్చలేం. పోల్చడం కుదిరే పని కాదు. రెండు ప్రపంచాలు ఉంటేనే పోల్చిచూసేందుకు వీలు ఉంటుంది, కానీ అక్కడ రెండు ప్రపంచాలు లేవు.

కాబట్టి అది బాగుంది అంటే, అందులో పోల్చే విషయం ఏదీ లేదనే. కానీ మనుష్యులందరూ ఇది సరైన ప్రపంచం కాదని ఎందుకంటున్నారు? ఓ ఊహాప్రపంచాన్ని – ఉటోపియాను – వాళ్ళు మనస్సుల్లో కల్పించుకుని దాంతో ఈ ప్రపంచాన్ని పోల్చి చూసుకుంటున్నారు. విషయాలు ఎలా ఉండాలో వాళ్ళకు తెలుసు. కాబట్టి ఈ వాస్తవంలో ఏ విషయాలూ సవ్యంగా కనిపిస్తూ ఉండవు. ఎందుకంటే వాళ్ళ ఊహాప్రపంచంలో ఉన్నట్లు ఈ ప్రపంచం ఉండడం లేదు కనుక. ఓ మనిషికి నాలుగు కళ్ళు ఉండాలని మీరు అనుకుంటే... మహా సహేతుకంగానే ఉంటుంది మీ ఊహ : వెనుకకు చూసేందుకు రెండు కళ్ళు ఉండాలి. రెండు కళ్ళు ఉండడం సవ్యంగా తోచదు – వెనక్కు కూడా చూసేందుకు కళ్ళు ఉంటే ఎలా ఉంటుంది? ఎవరైనా వెనుక నుంచి వచ్చి మిమ్మల్ని కొడితే? దేవుడు ఈ విషయాన్ని ఆలోచించి ఉండడు... తలవెనుక రెండు కళ్ళను. అప్పుడు విషయాలు ఉండవు సరిగ్గా - మానవుడికి రెండే కళ్ళు ఉంటున్నాయి, మానవుడికి ఉండాలి నాలుగు కళ్ళు. అప్పుడు ఉన్నట్లుండి మానవుడు సరిగ్గా ఉండడం లేదు అనిపిస్తుంది. కానీ మనిషి సమానంగానే ఉంటాడు; ఓ ఊహను మీరే సృష్టించుకున్నారు. ఆ ఊహే దీన్ని ఆక్షేపిస్తూ ఉంటుంది.

మానవుడు డెబ్భై ఏళ్ళకన్నా ఎక్కువగా జీవించి ఉండాలి. ఎందుకు? మానవుడు ఏడువందల ఏళ్ళు జీవిస్తూ ఉండాలని ఒక్కసారి మీరు చెప్పారనుకోండి. అప్పుడు డెబ్భై ఏళ్ళు చాలా తక్కువగా కనిపిస్తాయి. కానీ ఎందుకు? ఏడువందల ఏళ్ళు ఇక్కడ బ్రతికి ఉండి మీరు ఏం చేస్తారు? డెబ్భై ఏళ్ళు చాలవా మీకు జరగాల్సినంత హాని జరగడానికి? విధ్వంసం జరగడానికి? మీకు ఏడువందల ఏళ్ళు కావాలా? ఒక్కసారి ఆలోచించండి, అడాల్ఫ్ హిట్లర్ ఏడువందల ఏళ్ళు బ్రతికి ఉన్నాడనుకోండి...

ఓ ఊహ మీలో ఏర్పడిన తరువాత, ఓ లక్ష్యం ఏర్పడిన తరువాత, అప్పుడు విషయాలు విభిన్నంగా ఉంటాయి. నాకు ఏ ఊహా లేదు. నా ఊహాలో ఏ ఊహా ప్రపంచమూ లేదు. నేనో పూర్తి వాస్తవికవాదిని. నాకు ఏ ఆశయాలూ ఉండవు. అప్పుడు నాకు ఉన్నది ఈ ఏకైక ప్రపంచం మాత్రమే. గులాబీలు ఎర్రగా ఉంటాయి, వృక్షాలు పచ్చగా ఉంటాయి, మనుష్యులు ఇలా ఉన్నట్లుగా – వాళ్ళు ఉన్నట్లు ఉంటారు – ఇది పరమ సౌందర్యంతో ఉంటుంది.

సర్వస్వమూ ఉందా, ప్రపంచం సరిగ్గా ఉందా? ఉంటే ప్రేమతో దానికేం పని?

ప్రేమతో దానికి ఎంతో పని ఉంది; ప్రపంచం సరిగ్గా ఉంటేనే, మీరు ప్రేమించ గలుగుతారు. ప్రపంచం సరిగ్గా ఉండకపోతే, మీరు రాజకీయం మనుష్యులుగా తయారైపోతారు, రాజకీయాలనే చేస్తూ. ప్రపంచం సరిగ్గా లేదన్న విషయం మీదే ఆధారపడి ఉంటాడు రాజకీయపు మనిషి. ఆ మనిషి ఓ విప్లవాన్ని తీసుకురావాల్సి వస్తుంది. విషయాలను పరివర్తించాల్సి వస్తుంది. విషయాలను తీర్చిదిద్దాల్సి వస్తుంది. దేవుణ్ణి మించిపోవాల్సి వస్తుంది. అదే రాజకీయపు మనిషి మానసం. మరి ఆ రాజకీయపు మనిషికి ప్రేమే ఉండదు. ఓ ఆక్షేపించే, నిందించే మనస్తత్వమే ఉంటుంది. ఎందుకంటే విషయాలను ఎంచి ఆ మనిషి తప్పొప్పుల్ని తీర్పుచెప్తున్నాడు కాబట్టి.

మత మానసాని (Religious Mind) కి ఏ తీర్పుచేసే తత్వమూ ఉండదు. జీసస్ అంటాడు "తీర్పు చెయ్యకండి" అని. మతం మనస్సు (Religious Mind) కు తీర్పుల్ని చేసే తత్వం ఉండదు, అది ఏ నిందలనూ చెయ్యదు, కాబట్టి అతనే ప్రేమించగలుగుతాడు. మరి మరచిపోకండి, మీ జీవితంలో కూడా, మీరు ఏ తీర్పుల్నీ చేయకుండా ఉన్నప్పుడే మీకు ప్రేమించడం సాధ్యపడుతుంది. తీర్పులు చేద్దామన్న విషయాలు మీ మనస్సులో కోకొల్లలుగా ఉన్నాయంటే, మీకు ఎప్పటికీ ప్రేమించడం సాధ్యపడదు. మీ ఊహలనే మీరు ప్రేమించాలి అనుకుంటున్నవాళ్ళ మీద విధించాలి అనుకుంటూ ఉంటారు, మీ ప్రేమ ఊహలతో బలి అయిపోబోయేవాళ్ళ మీద. మీ ప్రేమికుల మీద మీ ఊహలను మీరు బలవంతంగా విధిస్తూనే ఉంటారు. మీ ప్రేమ ఫలితంగా ఓ శిశువు మీకు జన్మించినా, వెంటనే మీరు ఆ శిశువు మీదకు లంఘించి ఆ శిశువును పరివర్తించే కార్యక్రమాన్నే ప్రారంభించేస్తారు. మీ దారిలోకి వాళ్ళను తెచ్చే ప్రయత్నాన్నే, మీ ఊహల ప్రకారం వాళ్ళను పెంచే ప్రయత్నాన్నే చేస్తూ ఆ జీవిని ధ్వంసం చేసేస్తారు. ఈ విధంగానే ప్రతిఒక్కరూ తల్లిదండ్రుల వల్ల, సంఘం వల్ల నాశనం అయిపోయి ఉంటున్నారు.

ఓ స్త్రీని మీరు ప్రేమిస్తూ ఉంటే, వెంటనే ఆమె ఎలా ఉండాలో ఆ అభివృద్ధిని ఆమెకు తెప్పించే ప్రయత్నాలనే మీరు చెయ్యడం ప్రారంభించేస్తారు. ఆ స్త్రీ కూడా, స్వయంగా ఆ పద్ధతిలోనే ఉంటుంది కాబట్టి, మీరు అనుకున్నట్లే ఎదుగుతుంది. ఆ స్త్రీ ప్రేమలో మీరు పడిపోయి చిక్కుకుపోయారంటే, ఆ తరువాత మీరు మీరుగా ఉండరు. ఆ స్త్రీ మిమ్మల్ని తనకు తగ్గట్టుగా మార్చుకుంటుంది. అందువల్ల అప్పుడు మీరు ఇంకెవరిగానో తయారైపోతారు. కొన్ని ఏళ్ళు అలా గడిచిపోయిన తరువాత మొదట్లో మీరు ఎలా ఉండేవారో మీరే గ్రహించలేనివారు అయిపోయి ఉంటారు.

మిమ్మల్ని ఆమె చెక్కుతూ, ఒలుస్తూ, తీర్చుతూ, అలంకరిస్తూ, రంగులు పూసేస్తూ ఉంటుంది. "ఈ విధంగా ప్రవర్తించు, ఈ విధంగా మాట్లాడు, ఈ విధంగా చెప్పు" అంటూ.

ఓ పడుచు పిల్ల ఓ మనిషి ప్రేమలో పడిపోయింది. ఆమె కాథలిక్, ఆ మనిషి యూదుడు. ఆ పిల్ల తల్లిదండ్రులు ఎంతో వ్యథ చెందారు. వాళ్ళు అన్నారు "ఈ ప్రేమను మేము ఒప్పుకోం. నువ్వు ఆ మనిషిని ప్రేమించడానికి వీల్లేదు". వాళ్ళది ఎంతో భోగభాగ్యాలతో ఉన్న మహాధనిక కుటుంబం. వాళ్ళు అన్నారు "నువ్వు గనుక ఆ మనిషినే పెళ్ళాడావో, ఈ ఆస్తిలో నీకు దేన్నీ పంచం", వాళ్ళకు ఆ అమ్మాయే ఏకైక సంతానం, కాబట్టి ఆ ఆస్తి అంతా ఆ పిల్లకే చెందాలి.

ఆ అమ్మాయి దీన్ని భరించలేకపోయింది. "అయితే నన్ను ఏం చెయ్యమంటారు?" అని అడిగింది వాళ్ళనే.

కాబట్టి వాళ్ళప్పుడు ఆ పిల్లకు ఓ సలహా ఇచ్చారు "ముందు ఆ మనిషిని మతం మార్చుకోమను. ఆ మనిషి కాథలిక్ మతాన్ని స్వీకరించాలి. ఆ తరువాత..."

కాబట్టి ఆ అమ్మాయి ప్రయత్నాలు ప్రారంభించింది, ఆ పిల్లకు ఎంతో సంతోషమే లభించింది. ఎందుకంటే ఆ యూదు మనిషి ఆ అమ్మాయికన్నా ఆ అమ్మాయి వెనుక ఉన్న ఆస్తినే ఎక్కువగా ప్రేమిస్తూ ఉన్నాడు కాబట్టి - ఎంతో ఇష్టంగానే మతం మార్చుకునేందుకు సమ్మతించాడు. బైబిల్ గ్రంథాన్ని పారాయణ చేస్తూ, చర్చికి వెళ్ళడం కూడా మొదలుపెట్టేశాడు. ఆ మనిషి ఎంతో ఉత్సాహాన్నే ప్రదర్శిస్తూ ఉండేవాడు. ఆ అమ్మాయి కూడా మహదానందపడిపోతూ ఉంది - అన్నీ ఆ అమ్మాయి అనుకున్నట్లుగానే జరిగిపోతూ ఉన్నాయి - ప్రతి నెలా ఆ అమ్మాయి తన ఇంటికి వెళ్ళి తన తల్లిదండ్రులకు ఆ నెలలో జరుగుతున్న అన్ని సంగతులనూ వివరించి చెబుతూనే ఉంది.

ఒకరోజు ఆ అమ్మాయి ఏడ్చుకుంటూ, శోకిస్తూ ఇంటికి తిరిగొచ్చింది. ఆ అమ్మాయి తండ్రి ఆ అమ్మాయిని ఓదారుస్తూ అడుగుతున్నాడు "ఏమైందమ్మా? ఏమిటీ సంగతి"

ఆ అమ్మాయి ఆ మనిషిని తనను పెళ్ళాడమని అడగడానికి వెళ్ళింది, ఆ వెళ్ళిన ఆ మనిషి సంసిద్ధుడై ఉంటాడనే ఆ అమ్మాయికి అనిపించింది కాబట్టి. ఆ అమ్మాయి తన తండ్రితో చెబుతోంది "ఆ మనిషి నన్ను పెళ్ళాడాలనుకుంటూనే ఉన్నాడు. కానీ ఆ మనిషిని మనకు కావాల్సినట్లు మార్చుకునే విషయంలో, నేనే

కొంచెం అతి ఎక్కువ చేసినట్లు ఉంది. ఆ మనిషిని మరీ ఎక్కువగా నేను మార్చేసినట్లున్నాను."

ఆ తండ్రికి తన కుమార్తె ఏం చెబుతూ ఉందో అర్థంకావడం లేదు. అయోమయంలో పడిపోయాడు. "నాకు నువ్వు అంటున్నది ఏమీ అర్థం కావడం లేదు. నువ్వు కొంచెం అతి ఎక్కువ చేశావా? నువ్వు ఏం చేశావు?"

ఆ అమ్మాయి అంటోంది "ఇప్పుడు ఆ మనిషి ఓ కాథలిక్ సన్యాసి అయిపోవాలి అనుకుంటున్నాడు. నేను ఆ మనిషిని మరీ ఎక్కువగా మార్చేశాను. "

మీరు 'ప్రేమ' అని అనుకుంటూ ఉంటున్నదంతా కొద్దో గొప్పో ఆ రెండవ మనిషిని మార్చేసే ప్రయత్నమే అయివుంటోంది. మీరు ఆ మనిషిని తప్పకుండా మార్చుకుంటామనే ఎప్పుడూ చెబుతూ ఉంటారు, మీరు ఆ మనిషిని ప్రేమిస్తున్నారు కాబట్టి. ఎంతో ప్రత్యేక వింత అబద్ధపు విషయం ఇది. మీరు ఓ మనిషిని ప్రేమిస్తూ ఉంటే, ఆ మనిషిని మీరు మార్చకూడదు. ప్రేమ ఉన్నది ఉన్నట్లుగానే స్వీకరిస్తుంది. ఆ స్థితిలో ఉన్న మనిషికి సముచిత గౌరవాన్నే ఇస్తుంది ప్రేమ, ఉన్నది ఉన్నట్లుగా.

ఇప్పుడు ఉన్నది ఉన్నట్లు ఉన్న ఈ ప్రపంచం సరిగ్గానే ఉంటే, అప్పుడు మాత్రమే దాన్ని మీరు ప్రేమించగలుగుతారు. విప్లవ భావాలు ఉన్నవాళ్ళూ, రాజకీయవేత్తలూ ప్రేమించలేరు. ఓ మత చైతన్యం మాత్రమే ప్రేమించగలుగుతుంది దాన్ని. మరి మీరు దాన్ని ప్రేమిస్తూ ఉన్నప్పుడు, మీకు అర్థం అవుతుంది - అది మీరు ఊహిస్తున్న దానికన్నా ఎంతో ఉత్తమంగానే ఉంటున్నదని. అప్పుడు మరింతగా దాన్ని మీరు ప్రేమిస్తూ ఉంటారు... క్రమక్రమంగా ఈ ప్రపంచం అదృశ్యం అయిపోతూ ఉన్నట్లు మీరు తెలుసుకుంటూ ఉంటారు - అదే స్వయంగా దైవం.

## అయిదవప్రశ్న :

*ప్రియ ఓషో,*

*మొట్టమొదటిసారిగా ఓ మానవ మృతదేహాన్ని మా అమ్మమ్మ మరణించినప్పుడే నేను చూశాను. ఆమె శరీరం మహాశ్వేతవర్ణంతో మహాప్రశాంతంగా ఉంది. ఎంతో నిశ్శబ్దంగా, ఎంతో సంతోషంతో మూసుకుపోయీ, తెరుచుకునే ఉన్నట్లుగా ఆమె దేహాన్ని అలా చూస్తూ ఉంటే నాలో అసూయ చెలరేగింది, భయం కూడా కలిగింది. ఆమె ఎంతో ఒంటరిది అయిపోయి ఉన్నట్లూ, ఆమెను నేనిక ఎప్పటికీ కలుసుకోలేనట్లూ అనిపించింది.*

**మీ పుట్టినరోజునాడు మిమ్మల్ని చూసినప్పటి నా దర్శనంలో ఆ అనుభవాలన్నీ మళ్ళీ నాలో పునరావృతం అయ్యాయి. ఈ గోల మధ్యా, ఈ విధ్వంసాల మధ్యా, ఈ తిరుగుళ్ళ మధ్యా మీరు కూడా ఎంతో ఎంతో ఒంటరితనంతో ఉన్నట్లు మీకు అనుభూతి కలుగుతూ ఉంటుందా? మీరు ఎక్కడో మహాదూరంలో ఉన్నట్లు ఉంటారు, మహా స్వచ్ఛమైన నిశ్శబ్దంలో, ఎప్పుడూ లేనంతగా, ఈ ప్రస్తుతంలో. మీరు జీవితాన్నీ, మృత్యువునూ కూడా ఏకకాలంలో అనుభవిస్తూ ఉంటున్నారా?**

ఈ ప్రశ్న మా ప్రేమ్ అరణ్యో నుంచి వచ్చింది.

మృత్యువు అందంగా ఉంటుంది, జీవితానికి ఉన్న అందంతో సాటిగా - మృత్యువుతో సంభాషించడం ఎలాగో మీకు కాస్త తెలిసుంటే. మృత్యువు మహా అందంగా ఎందుకు ఉంటుందంటే అది మహావిశ్రాంతి కాబట్టే. మహాఅందంగా మృత్యువు ఎందుకు ఉంటుందంటే ఆ మనిషి మళ్ళీ తన జన్మమూలంలోకి పడిపోయి ఉన్నాడు కాబట్టే – విశ్రమించేందుకూ, సౌఖ్యుడయ్యేందుకూ, మళ్ళీ వెనక్కు తిరిగి వచ్చేందుకు.

సముద్రంలో ఓ కెరటం లేస్తుంది, మళ్ళీ ఆ సముద్రంలోకే పడిపోతుంది, మళ్ళీ మరో కెరటం లేస్తుంది. మళ్ళీ ఆ కెరటానికి ఇంకోరోజు వస్తుంది. ఓ కొత్త స్వరూపంతో ఆ కెరటం మళ్ళీ జన్మిస్తుంది. మళ్ళీ కూలి ఆ సముద్రంలోకే అదృశ్యం అయిపోతుంది.

జన్మమూలంలోకి అదృశ్యమైపోవడమే మృత్యువు అంటే. అప్రత్యక్షంగా ఉన్న జన్మమూలంలోకి వెళ్ళిపోవడమే మృత్యువు. దివ్యత్వంలోకి పడిపోయి నిద్రించడమే మృత్యువు. మళ్ళీ మీరు జన్మించి వికసిస్తారు. మళ్ళీ మీరు సూర్యచంద్రుళ్ళను చూస్తారు. మళ్ళీ మళ్ళీ వాటిని మీరు దర్శిస్తూనే ఉంటారు ఓ బుద్ధుడిగా మీరు తయారయ్యేదాకా- సచేతనంగా మీరు మరణించేంతవరకూ, సచేతనంగా ఆ విశ్రాంతిలోకి మీరు వెళ్ళిపోయేవరకూ, ఎరుకతో ఆ దివ్యత్వంలోకి మీరు విలీనం అయిపోయేంతవరకూ. అప్పుడు మళ్ళీ మీరు తిరిగిరారు. అది మీ మహాసంపూర్ణ మరణం అయిపోతుంది. మామూలు మరణాలన్నీ తాత్కాలిక మరణాలు మాత్రమే; ఆ తాత్కాలిక మరణం తరువాత మళ్ళీ మీరు జన్మించాల్సి వస్తుంది. ఓ బుద్ధుడు మరణించినప్పుడు, ఆయన మరణం మహాసంపూర్ణంగా జరుగుతుంది. ఆ మరణం శాశ్వతం అయిపోతుంది. ఆయన మృత్యువుకు ఆ శాశ్వతత్వపు లక్షణం ఉంటుంది. అయినా మామూలు మరణాలు కూడా అందంగానే ఉంటాయి.

అరణ్యో, నువ్వు అంటున్నది సత్యమే. నేను ఏకకాలంలో జీవించీ, మరణించీ ఉంటాను. నేనుఓ స్వరూపుణ్ణిగా మరణించి ఉంటాను. నేను ఎవరిగానో మరణించి ఉంటాను. నేను ఎవరూ కానివాడిగా ఉంటాను, సజీవంగా.

నువ్వు అంటున్నావు "మొట్టమొదటిసారిగా ఓ మానవ మృతదేహాన్ని మా అమ్మమ్మ మరణించినప్పుడే నేను చూశాను. ఆమె శరీరం మహాశ్వేతవర్ణంతో, మహాప్రశాంతంగా ఉంది. ఎంతో నిశ్శబ్దంగా, ఎంతో సంతోషంతో, మూసుకుపోయీ, తెరుచుకునే ఉన్నట్లుగా. ఆమె దేహాన్ని అలా చూస్తూ ఉంటే నాలో అసూయ చెలరేగింది, భయం కూడా కలిగింది" అని.

జ్ఞాపకంలో ఉంచుకో, నా దగ్గర కూడా అదే సంబంధంతో నువ్వు ఉంటూ ఉండవచ్చు. అసూయపడుతూ, అదే సమయంలో భయపడుతూ. నీ భయాన్ని నువ్వు పక్కకు పెట్టేసుకోవాలి, ఎందుకంటే ఆ భయమే నిన్ను ఆపేయొచ్చు – నీకు ఇప్పుడు లభ్యమై ఉన్న అవకాశాన్ని అందుకుని ఆనందించకుండా అభ్యంతరం అయిపోయి. 'ఎవరూ కానివాణ్ణి' అన్వేషించి పట్టుకోవడం ఎంతో కష్టం; అటువంటి 'ఎవరూ కానివాణ్ణి' నువ్విప్పుడు గ్రహించగలిగి ఉన్నావు. నువ్వు కూడా 'ఎవరూ కానిదానివి'గా అయిపోతే తప్ప, ఎప్పుడూ మరిచిపోకు ఓ అవకాశాన్ని నువ్వు చేజార్చుకుంటూనే ఉంటున్నావని. నేను మరణించి ఉన్నట్లుగానే, నువ్వు కూడా మరణించే ఉండు. అప్పుడే నువ్వు ఉండగలుగుతావు నేను ఉంటున్నంత సజీవంగా.

మనిషితో ఏ సంబంధమూ లేని జీవితం ఒకటి ఉంది. ఆత్మతో ఏ సంబంధమూ లేని జీవితం ఒకటి ఉంది. ఓ శూన్యత్వపు జీవితం ఒకటి ఉంది – అమాయకంగా, పవిత్రంగా. దాన్ని నీకు అందుబాటులో ఉంచుతాను. నీ భయాన్ని విడిచిపెట్టి, నన్ను సమీపించు. నీ మృత్యువునూ, నీ పునరుత్థానాన్నీ నన్ను కానీ.

ఓ మహా జెన్ యోగి అయిన బ్యూనాన్ అన్నాడు ఇలా "బ్రతికి ఉన్నప్పుడు, ఉండు ఓ మృతుడిలా. పూర్తిగా మరణించి. నీ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించు. అప్పుడు ఉంటుంది సర్వస్వం సవ్యంగానే."

## చివరిప్రశ్న :

*ప్రియ ఓషో,*

*జ్ఞానం ఉంటుందా ఎప్పుడూ ప్రమాదకరంగా?*

కొన్ని సందర్భాల్లో. జ్ఞానం (Knowledge) ప్రమాదకరంగా ఉండదు, జ్ఞానత్వతే (Knowledgeability) ప్రమాదకరంగా ఉంటుంది. విషయపరిజ్ఞానాన్ని పొంది ఉండడం అత్యంత సవ్యమే. కానీ జీవిత రహస్యాన్ని విస్మరించి ఉండడమే ప్రమాదకరం. కాబట్టి జ్ఞానం ఎప్పటికీ ప్రమాదకరంగానే ఉండదు. అప్పుడప్పుడూ ఆ జ్ఞానం మహోపయోగకారిగా ఉంటుంది.

ఓ చిన్న కథ విందాం :

ఐర్లండ్ వాసి ప్యాడీ భార్య మౌరీన్‌ను ఆ రోజు పొద్దున్నే మహాతొందరపడుతూ తీసుకొచ్చి హాస్పిటల్‌లో చేర్చారు. ఆమె తొమ్మిదినెలల నిండుగర్భిణి. ఇప్పుడు ఆమెకు ప్రసవం నొప్పులు వస్తున్నాయి; ప్రసవం జరుగుతూ ఉంది. ఆమె ఇద్దరు కవలపిల్లల్ని-ఇద్దరు అమ్మాయిలను – ప్రసవించింది.

ఐరిష్ ప్యాడీ ఓ భవన నిర్మాణం జరుగుతున్న చోట్లో ఉదయం నుంచీ సాయంత్రం దాకా రాళ్ళు మోసే పనిని పూర్తిచేసుకుని శిశిరపు చలిగాలుల్లో హాస్పిటల్‌లో ఉన్న భార్యను చూసేందుకు అక్కణ్ణుంచి ప్రసూతి విభాగం దాకా నడుచుకుంటూ వచ్చి చేరాడు.

"ఓ, హెల్లో, స్వీట్ డార్లింగ్" అంటూ ఎంతో మురిపెంగా భార్యను పలకరిస్తున్నాడు ప్యాడీ, కుతూహలంతో మెరుస్తున్న కుడికంటితో ఇద్దరు పాపాయిలనూ పట్టుకొస్తూ ఉన్న నర్సుల వంక గమనించి చూస్తూ.

"మనకు ఇద్దరు అమ్మాయిలు పుట్టారండీ" అంటోంది మౌరీన్.

ఓ పదినిముషాలపాటు ప్యాడీ సంభ్రమాశ్చర్యాలకు లోనవుతూ తన భార్య పక్కనే మంచం మీద కూర్చున్నాడు నిశ్చలంగా, అప్పుడు ఏం చెయ్యాలో దాన్నంతా ఊహించుకుంటూ.

ఆ ప్రసూతి విభాగంలో ఉన్న ఓ గంట కాసేపు మోగింది. ప్యాడీ తన భార్యను ముద్దుపెట్టుకుని అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు. "ఆ క్రీస్తు తోడు!" అంటూ తనలో తానే గొణుక్కుంటూ చాలా పొడవు ఉన్న వరండాలో నడక ప్రారంభించాడు, లోలోపలే మండిపోతూ, "దొరికాడంటే ఆ రెండో వెధవను చంపేస్తాను."

ఈ రోజుకు ఇది చాలు.

# 3. ధర్మచక్రం

కానుకను ఇస్తున్న బోధిసత్వుడిలో వస్తువు నాదన్న భావన సైతం
ఉండకూడదు కాబట్టి, ఏ స్వంతభావనల ఆధారాలూ ఎక్కడా
ఆ బోధిసత్వునిలో ఉండకూడదు కాబట్టి... ఆ మహాజీవి తను
దానం చేస్తున్నానన్న సంజ్ఞ కూడా తనలో ప్రతిష్ఠింపబడని విధంగా
ఆ కానుకను అర్పించాల్సి ఉంటుంది. మరి ఎందుకు? ఎందుకంటే
నాది అన్న భావనే లేకుండా చేస్తున్న బోధిజీవుడి, ఆ దాన పుణ్యఫలరాశి
విలువ ఇంత అని వెలకట్టడం అత్యంత కష్టసాధ్యం కనుక...

భగవానుడు ఇంకా చెప్తున్నాడు : నీకేమని అనిపిస్తూ ఉంది, సుభూతీ,
ఓ తథాగతుణ్ణి ఆయనకున్న గుర్తులతో గుర్తించి చూడవచ్చునా?
సుభూతి బదులిచ్చాడు : ఆ విధంగా చూసి గుర్తించకూడదు. కానీ
ఓ భగవాన్, ఎందుకు గుర్తించకూడదు? ఏ గుర్తుల్ని వర్ణించి
దాన్ని ధరించి ఉన్న తథాగతుణ్ణి గుర్తించవచ్చో బోధించిన భగవానుడు,
ఎందుకు అన్నాడు ఆ గుర్తుల లక్షణాలను అవలక్షణాలేననీ?
భగవానుడు అన్నాడు : గుర్తులు ఎక్కడెక్కడ అయితే ఉంటున్నాయో,
అక్కడక్కడల్లా మోసం కూడా ఉంటూనే ఉంటోంది; ఎక్కడెక్కడ
ఏ గుర్తులూ ఉండడం లేదో, అక్కడే మోసం కూడా ఉండడం లేదు.
కాబట్టి ఆ గుర్తులు ఏవీ లేకపోతేనే గుర్తించాలి తథాగతుణ్ణి.
సుభూతి అడిగాడు : ఏ జీవులయినా ఉంటారా భవిష్యత్తులో,
కాలాంతంలో, చివరిశకంలో, చివరి అయిదువందల ఏళ్ళ అంతంలో,
మహాధర్మం భ్రష్టం అయిపోయి వున్న కాలంలో,
బోధింపబడితే వింటున్న ఎవరైనా, చేసుకోగలుగుతారా
సవ్యంగా ఈ సూత్రపు సత్యార్థాన్నీ?

> **భగవానుడు అంటున్నాడు : ఆ విధంగా మాట్లాడకు, సుభూతీ! నిజమే, అప్పుడు కూడా ఉంటారు జీవులు, ఈ సూత్రంలోని పదాలు వాళ్ళకు బోధింపబడితే, ఆ సూత్ర సత్యాన్ని అర్థం చేసుకోగలుగుతారు వాళ్ళు. అంతటి సమయంలో కూడా, సుభూతీ, ఉంటారు బోధిసత్వ్వాళ్ళు... ఆ బోధిసత్వ్వాలు, ఉందరు సుభూతీ ఒక్క బుద్ధుణ్ణే గౌరవిస్తూ, పూజిస్తూ, ఏ ఒక్క బుద్ధుడిలోనో వేళ్ళు పాతుకుని వాళ్ళుందరు.**
>
> **తద్వ్యతిరేకంగా, సుభూతీ, ఉంటారు ఆ బోధిసత్వ్వాలు, వాళ్ళకు, ఈ సూత్ర ప్రవచనాలు బోధింపబడి వినిపించినప్పుడు, కనీసం ఓ అతిపవిత్ర, అతినిర్మల ఆలోచనను అయినా అర్థం చేసుకుని గ్రహించగలిగిన ఆ బోధిసత్వ్వాళ్ళు కొన్నిలక్షల బుద్ధుళ్ళను గౌరవించి పూజించినవాళ్ళు అవుతూ, తమ అశేష పుణ్యఫల ప్రాప్తాన్ని కొన్ని లక్షల బుద్ధుళ్ళకు సమర్పించుకున్న వాళ్ళు కూడా అయివుంటారు.**
>
> **బుద్ధజ్ఞానంతో తథాగతుడికి వాళ్ళందరు తెలుసు. తథాగత బుద్ధనేత్ర ప్రజ్ఞతో ఆ బోధిసత్వ్వాలందరూ సుభూతీ, పూర్ణజ్ఞానులే తథాగతుడికి. వాళ్ళందరూ సుభూతీ, ఆర్జించుకుంటారు, ప్రాప్తించుకుంటారు లెక్కపెట్టలేనంత మహాపుణ్యఫలరాశిని.**

"కాబట్టి సుభూతీ, శ్రద్ధగా విను, అవధానంతో విను" అంటున్నాడు గౌతమబుద్ధుడు. ఇవి ఎంతో వింత మాటలుగా వినిపిస్తాయి – వింత. ఎందుకంటే ఓ బోధిసత్వుడితో బుద్ధుడు మాట్లాడుతున్నాడు కాబట్టి. ఏ సాధారణ జనాలను ఉద్దేశించో బుద్ధుడు మాట్లాడుతూ ఉంటే, అప్పుడు ఆ మాటలు వింతగా ఉండేవి కావు. ఓ మామూలు మనిషి ఎంతో శ్రద్ధగా విని తీరాలన్న విషయం మనకు అతిసులభంగానే అర్థం అవుతుంది. వినడం మహాకష్టంగా ఉంటుంది. వింటూ ఉండడం అంటే ఇప్పుడే ఇక్కడ ఉండడం అనే. వినడం అంటే ఏ ఆలోచనలూ ఉండకూడదనే అర్థం. వినడం అంటే ఎంతో చురుకుగా, అవధానంతో ఉండడం అనే అర్థం. ఇవన్నీ సరిగ్గా కుదిరి ఉన్నప్పుడు మాత్రమే మీరు వింటారు.

మనస్సు పిచ్చిగా పరుగులుతీస్తూ ఉంటుంది, మహారేగిన పిచ్చితనంతో. మనస్సు ఎప్పుడూ వెయ్యిన్నొక్క ఆలోచనలను అల్లుకుంటూనే ఉంటుంది. ప్రపంచ

సర్వస్వంలో పరుగులు తీస్తూనే ఉంటుంది – గతంలోకీ, భవిష్యత్తులోకీ. వినడం ఎలా కుదురుతుంది? మీరు ఎంతగా విన్నా, అది ఏ మాత్రమూ సరైన వినడంగా ఉండదు. మీరు మరిదేన్నో వింటారు, చెప్పని మాటను. చెప్పబడుతూ ఉన్నది మీకు అందకుండానే పోతూ ఉంటుంది – మీరు వినే శృతిలో ఉండడం లేదు కనుక. మీరు పదాలనన్నింటినీ వింటూనే ఉంటారు, అదే కదా జరుగుతున్నది మరి? మీకు చెవుడు ఏమీ లేదు కదా, కానీ అంతమాత్రంగా జరుగుతున్నది వినడం – శ్రవణం – మాత్రం కాదు.

అందువల్లే తన శిష్యులకు ఎప్పుడూ చెబుతూ ఉండేవాడు జీసస్ "మీకు చెవులు ఉంటే, వినండి. మీకు కళ్ళు ఉంటే, చూడండి" అని. ఆ శిష్యులు అంధులూ, బధిరులూ కారు. మీకు ఉన్నంత ఆరోగ్యపు కళ్ళే వాళ్ళకూ ఉండేవి. మీకు ఉన్నంత మంచి చెవులే వాళ్ళకు కూడా ఉండేవి. కానీ జీసస్ మాటలు అప్పుడు వింతగా వినిపించలేదు. అప్పుడు ఆ మాటలు సంగతంగానే వినిపించాయి. ఆయన అప్పుడు మామూలు మనుష్యులతో మాట్లాడుతూ ఉన్నాడు. వాళ్ళ ధ్యాసను తన మాటల మీదికి మళ్ళించాలి జీసస్. అందుకోసం ఆయన గట్టిగా అరచి చెప్పాల్సి వచ్చేది. కానీ బుద్ధుడి మాటలు ఇప్పుడు వింతగానే ఉంటున్నాయి – ఇప్పుడు ఆయన ఓ బోధిసత్త్వుడితో మాట్లాడుతూ ఉన్నాడు, ఓ మహాజీవితో, ఓ బోధిజీవితో, ఏ క్షణంలోనైనా బుద్ధుడు అయిపోగల స్థితిలో ఉంటున్నవాడితో.

"కాబట్టి సుభూతీ, శ్రద్ధగా విను, అవధానంతో విను" అని అంటున్న బుద్ధుడి మాటలకు సరైన ఉద్దేశ్య అర్థం ఏమిటి?

చక్కగా వినడం అంటే మామూలుగా స్వీకరించే స్వభావంతో ఉంటూ వినడం అని, ప్రగాఢ స్వీకారభావంతో ఉండడం అని. వింటున్నప్పుడు మీరు వాదించుకుంటూ ఉంటే, మీరు నిర్ణయాలు చేసుకుంటూ వింటూ ఉంటే, "ఔను ఇది సత్యమే. ఎందుకంటే నా స్వాభిప్రాయంతో ఏకీభవించి ఇది ఉంటోంది కాబట్టి; ఇది సత్యం కాదు, ఎందుకంటే నా స్వాభిప్రాయంతో విభేదించి ఇది వినిపిస్తూ ఉంది కాబట్టి, ఇది తార్కికంగా ఉండడం లేదు కాబట్టి. ఇది సత్యమే, ఇది కాదు సత్యం. దీన్ని నేను నమ్మొచ్చు, దీన్ని నేను నమ్మలేను..." అని నిరంతరంగా విషయాలను సర్దుకుంటూ, ఎంచుకుంటూ, స్వీకరిస్తూ, తిరస్కరిస్తూ, పోగుచేసుకుంటూ ఉంటే మీరు వింటూనే ఉంటారు కానీ, మీరు సరిగ్గా మాత్రం వింటూ ఉండరు.

మరి మీరు వింటూ ఉంటారు మీ మానసపు గత అభ్యంతరాలతోపాటు. ఎవరు ఈ నిర్ణయాలను అన్నింటినీ నిశ్చయించి తీర్చుతున్నది? అది మీరు కాదు. మీ గతమే చేస్తోంది వాటిని. కొన్ని విషయాలను మీరు చదివి ఉన్నారు, కొన్ని విషయాలను మీరు విని ఉన్నారు. కొన్ని విషయాల వల్ల మీరు సుశిక్షితులై తీరి ఉన్నారు. గతంతో నిరంతరంగా సాగే వ్యవహారం వల్లే ఇది జరుగుతూ ఉంటుంది. గతం మిమ్మల్ని నిర్దేశించాలని పూనుకుంటుంది. దానికి విరుద్ధంగా ఈ ప్రస్తుతంలో ఎదురయ్యే ఏ కొత్త విషయాన్నీ అది సమ్మతించదు. గతంతో అనుగుణ్యంగా ఉన్న విషయాలను మాత్రమే సమ్మతిస్తుంది అది. నిర్ణయాలను చేస్తున్నప్పుడు మీలో ఎప్పుడూ జరిగే వ్యవహారం ఇదే, మీరు విమర్శిస్తున్నప్పుడు ఎప్పుడూ జరిగే వ్యవహారం ఇదే, మీ లోపల మీరే ఎప్పుడూ చేసుకుంటున్న చర్చల, పరిచర్చల వ్యవహారం ఎప్పుడూ ఇదే.

సరిగ్గా వినడం అంటే మహా విధేయతతో వినడం అనే. ఈ 'విధేయత' అన్న పదం అందంగా ఉంటుంది. 'ఒబీడియన్స్'. ఈ 'ఒబీడియన్స్' అన్న పదం ఏ మూలంలోంచి వచ్చిందో తెలిస్తే మీకు ఎంతో ఆశ్చర్యం కలిగి తీరుతుంది. అది 'ఓబిడైర్' అనే మూలం నుండి వచ్చింది. దానికి అర్థం 'పరిపూర్ణంగా వినడం' అని. పరిపూర్ణంగా విన్నంత మాత్రాన విధేయత ఎందుకొస్తుంది? ఆ రెండు పదాలకూ అర్థం ఒకటేనా? ఔను. ఆ రెండు మాటలకూ ఒక్కటే అర్థం. మీరు పూర్తిగా, సంపూర్ణంగా వింటే, మీరు విధేయులై ఉంటారు. అందులో సత్యం ఉంటే, మీరు విధేయులై ఉంటారు. దానిపట్ల విధేయులై మీరు ఉండడానికి మీ నిర్ణయాలతో ఏ ప్రమేయమూ ఉండదు. సత్యం స్వయఃప్రామాణికంగా, ప్రత్యక్షసాక్షిగా ఉంటుంది. అది మీకు ఒక్కసారి వినిపించిందంటే, మీరు దాన్ని అనుసరించడం తప్పకుండా జరిగే తీరుతుంది. ఒక్కసారి మీకు సత్యం వినిపించిందంటే మీరు దానికి తక్షణం విధేయులు అయిపోతారు. కాబట్టి ఈ 'ఒబీడియన్స్' – విధేయత– అన్న పదం 'ఒబిడైర్' – విధాయకం అన్న మూలంలోంచే ఆవిర్భవించింది – 'సంపూర్ణంగా వినడం' అనే దానికి అర్థం. లేదా, యూదు సాంప్రదాయం వర్ణించినట్లు 'మీ చెవుల్ని అప్పగించి ఉండడం' అని అర్థం. నిజంగా మీ చెవులు పూర్తిగా అప్పగించబడి తెరచుకునే ఉంటే, మీ లోపల ఏ అడ్డులూ, అభ్యంతరాలూ, అలజడుల కలతలూ ఉండకపోతే, మీకు ఏ పరధ్యానమూ ఉండకపోతే, మీ చెవుల్ని మాత్రమే కాక మీ హృదయాన్ని కూడా మీరు విప్పుకునే ఉంటే; మరి మీ హృదయక్షేత్రంలో ఓ విత్తనం పడితే, అతిత్వరలోనో కాస్త ఆలస్యంగానో అది ఓ వృక్షంగా తయారైతీరుతుంది.

త్వరలోనో, కాస్త ఆలస్యంగానో అది పుష్పించే తీరుతుంది. ఓ వృక్షంగా తయారయ్యేందుకు కొంత సమయం పట్టవచ్చు. అనుకూలమైన ఋతు ఆగమనంకోసం వసంతం వచ్చేదాకా ఓ విత్తనం నిరీక్షించాల్సే ఉండవచ్చు. కానీ తప్పకుండా ఆ విత్తనం ఓ వృక్షంగా తయారై తీరుతుంది. ఓ సత్యాన్ని విన్న మీరు అవశ్యంగా దాన్ని అనుసరించి ఆచరించే తీరుతారు.

అందువల్లే ఆ విషయాన్ని వినడాన్ని మీ మనస్సు సమ్మతించదు. ఎందుకంటే సత్యం ఒక్కసారి వినిపించిందంటే దానినుంచి తప్పించుకుపోవడానికి ఏ మార్గమూ లేదన్న విషయ వాస్తవం దానికి ఎంతో బాగా తెలుసు కనుక. కాబట్టి సత్యం నుంచి పారిపోవాలని మీకు అనిపిస్తూ ఉంటే, మీరు దాన్ని వినకపోవడమే ఉత్తమం. ఒక్కసారి సత్యం వినిపించిందో, అందులోకే మీరు బందీలైపోతారు; అప్పుడు ఇక తప్పించుకోవడం అసాధ్యం. సత్యం అంటే ఏమిటో తెలిసిపోయిన మీరు ఆ సత్యం నుండి ఎలా తప్పించుకుపోగలుగుతారు? అప్పుడు సత్యాన్ని మీరు విన్న ఆ సంభవమే మీలో ఓ క్రమశిక్షణను సృష్టిస్తుంది. దాన్నే మీరు అనుసరించడం ఆరంభం అయిపోతుంది. దాన్ని మీ మీద విధించుకోనక్కరలేదు, మీలోంచి దానంతట అదే వస్తుంది.

చెవుల తాళంకప్పలు తొలగించివేయబడాలి. చెవుల తాళంకప్పలు అంటే ఏవి? మహా ప్రాథమిక తాళంకప్ప సత్యం అంటే మీకున్న భయం మాత్రమే. సత్యం అంటే మీకు భయం – ఏ మాటలను మీరు అంటూ ఉన్నా, మళ్ళీ మళ్ళీ ఎన్నోసార్లు “సత్యాన్ని నేను తెలుసుకోవాలి” అంటూనే ఉన్నా. మీకు సత్యం అంటే భయం ఎందుకంటే మీరు అబద్ధాలతోనే జీవిస్తూ ఉంటున్నారు కాబట్టే. ఎంతోకాలం మీరు ఆ అబద్ధాలతోనే జీవిస్తూ ఉంటున్నారు కాబట్టే ఆ అబద్ధాలకే సత్యం అంటే భయం, ఆ అబద్ధాలు వణికిపోతూ ఉంటాయి – మీరు సత్యాన్ని పొందితే ఆ అబద్ధాలన్నీ మీలోంచి వెళ్ళిపోక తప్పదు. అవే మిమ్మల్ని ఇప్పటిదాకా స్వంతం చేసేసుకుని ఉంటున్నాయి. అవే మీ యజమానులు. గాఢాంధకారానికి వెలుతురంటే ఎంత భయమో, అబద్ధాలకు సత్యం అంటే అంతే భయం. సత్యాన్ని మీరు సమీపించారంటే మీ మనస్సుకు కల్లోలం వచ్చేస్తుంది. మనస్సులో ఎంతో అలజడి రేగుతుంది. ఎంతో దుమ్ము పైకి లేస్తుంది. ఆ దుమ్ము మహామేఘం మిమ్మల్ని ఆవరిస్తుంది, సత్యాన్ని విని మీరు భరించలేనంతగా.

చెవుల తాళంకప్పలు తొలగించివేయబడాలి. మహా మౌలిక తాళంకప్ప భయమే. మీరు ఆ భయంలోనే బంధింపబడి ఉంటున్నారు. ధైర్యం ఉంటే తప్ప

సత్యం మీకు ప్రాప్తించదని బుద్ధుడు అన్నాడు. మరి మీ మతాలను చూసుకోండి, మీరు ఏం చేశారో చూసుకోండి. మీ 'మతాలు' అనబడుతున్నవన్నీ 'భయం' మీదే ఆధారపడి ఉంటున్నాయి. మరి ఆ భయాల్లోంచి సత్యానికి ఏ దారీ లేదు. సత్యార్థం ఓ నిర్భయత్వానికి మాత్రమే తెలుస్తుంది.

మీరు ఓ చర్చిలోనో, మసీదులోనో, ఆలయంలోనో వెళ్ళి మోకరిల్లుతారు. ఆ మోకరిల్లాలనే ప్రయత్నం ఎక్కణ్ణుంచి వస్తోంది? కొంచెం మీ లోపలికి తొంగి చూడండి – అక్కడ మీకు భయం, భయం, భయం దొరుకుతుంది. భయం లోంచి ఏ విశ్వాసమూ జనించదు, కానీ మీ విశ్వాసాలు అనబడుతున్నవన్నీ భయం మీదే ఆధారపడి ఉంటున్నాయి. అందువల్లే అతి అరుదుగానే మనకు ఈ ప్రపంచంలో విశ్వాసంతో ఉన్నవారు కనిపిస్తారు, ఎందుకంటే ఓ విశ్వాసం ఏర్పడగలిగేది భయం అదృశ్యం అయిపోయినప్పుడు మాత్రమే కాబట్టి. విశ్వాసం అవతరించేది భయం మృతి చెందినప్పుడు మాత్రమే.

విశ్వాసం అంటే నమ్మకం. భయపడుతూ ఉన్నవాడు ఎలా విశ్వసించగలుగుతాడు? ఆ మనిషి ఎప్పుడూ ఆలోచిస్తూనే ఉంటాడు. ఆ మనిషి ఎప్పుడూ కపటంతో ఉంటాడు. ఆ మనిషి ఎప్పుడూ సంరక్షించుకుంటూ, కాపాడుకుంటూ ఉంటాడు. ఆ మనిషి ఎలా విశ్వసించగలుగుతాడు? విశ్వసించాలంటే, మీకు ధైర్యం ఉండాలి. విశ్వసించాలంటే మీకు సాహసం ఉండాలి. విశ్వసించాలంటే మీకు ఓ అపాయాన్ని స్వీకరించే సామర్థ్యం ఉండాలి. విశ్వసించాలంటే మీరు ఓ ప్రమాదంలోకే ప్రవేశించగలగాలి.

సరిగ్గా మొన్నే సంకటాలను పోగొట్టే ఓ చైనీస్ లిపి ఉన్న రక్షబిళ్ళను నేను పట్టుకుని పరిశీలిస్తూ ఉన్నాను. కానీ దానిలో ఏ కుట్రో ఉన్నట్లు నాకు అనిపించింది. ఎందుకంటే ఆ ఐడియోగ్రామ్‌లో రెండు సంజ్ఞా లిపీ అక్షరాలు ఉన్నాయి : మొదటి సంజ్ఞకు అర్థం 'ప్రమాదం' అని. రెండో సంజ్ఞకు 'అవకాశం' అని అర్థం. ఔను. ఆ క్షణం మహాసంకటంతో ఉంటుంది, ఓ ప్రమాదాన్నీ, ఓ అవకాశాన్నీ ఏకకాలంలో మీరు ఎదుర్కొంటూ ఉన్నప్పుడు. మీరు అపాయంలోకి ప్రవేశించకపోతే, మీకు అవకాశం దక్కదు. మీకు ఆ అవకాశం లభించాలంటే, మీరు ఆ ప్రమాదంలోకే వెళ్ళాల్సి వస్తుంది. ప్రమాదభరితంగా ఎలా జీవించాలో తెలుసుకున్నవాళ్ళే నిజమైన మతం ఉన్న మనుష్యులు. భయమే మౌలిక తాళంకప్ప చెవికి. ఇంకా కొన్ని తాళంకప్పలు ఉన్నాయి కానీ, అవన్నీ భయంలోంచే తయారై పైకొస్తాయి – విచక్షించి

తీర్పులు చేస్తూ ఉండడం, వాదిస్తూ ఉండడం, గతాన్నే పట్టుకుని వేలాడుతూ ఉండడం, నవ్యతను మీ ఉనికిలోనికి రానీయకుండా ఉండడం.

ఎన్నోవిధాలుగా, ఎన్నో భాషల్లో 'విధేయత' అన్న పదానికి 'అతిసంపూర్ణంగా వింటూ ఉండడం' అన్న అర్థం వచ్చే పదాలే ఉంటూ ఉన్నాయి. హార్కెన్, గెహేర్కాన్, ఒబేయ్‌ర్, ఓబెడైర్, మొదలైనవి – ఈ పదాలన్నీ సవ్యంగానే చెప్తాయి, ఆవేశంతో, తీవ్రంగా, సంపూర్ణంగా వింటూ ఉండాలి అని. ఇంకొక్క విషయం. అబ్సర్డ్ – అయుక్తం అన్న పదం 'ఒబీడియన్స్' – విధేయత అన్న పదానికి సరిగ్గా వ్యతిరేకార్థంతో ఉంటూ ఉన్నదని గమనిస్తే మీకు ఎంతో ఆశ్చర్యం కలిగే తీరుతుంది. 'అబ్బర్డస్' అన్న లాటిన్ పదానికి అర్థం 'పూర్తిగా చెవుడు' అని. కాబట్టి మీరు ఎప్పుడైనా 'అబ్బర్డ్' అని ఏ విషయం గురించో అంటున్నారంటే, మరో మాటలో మీరు చెబుతున్నది "ఈ విషయాన్ని గురించి ఇక ఏం చెప్పబడబోతూ ఉన్నా, నేను విననే వినను" అనే అర్థం. ఓ అయుక్త వైఖరి నుండి మిమ్మల్ని పరివర్తించుకుని మీరు విధేయ వైఖరిని అలవరచుకోండి. అప్పుడు మీరు వినగలుగుతారు, అప్పుడు మీరు మీ చెవుల్ని అప్పగించి వినగలుగుతారు, అప్పుడు మీరు పరిపూర్ణంగా విచ్చుకుని ఉంటారు.

ఓ మామూలు మనిషితో "శ్రద్ధగా విను, అవధానంతో విను" అని చెబితే బాగానే ఉంటుంది. "అవధానంతో వినండి". కానీ బుద్ధుడు సుభూతితో అలా ఎందుకు అన్నాడు? అందులో ఏ మహాప్రాముఖ్యమో ఉంది, అర్థం చేసుకోవడానికి. అందులో ఒక పదానికి ఏ అర్థమూ ఉండదు. ఓ మనిషిని ఉద్దేశించి ఆ పదాన్ని ఉచ్చరించినప్పుడు ఆ పదానికి అర్థం ఆ మనిషిలోనే ఏర్పడుతుంది, సృజింపబడుతుంది. ఆ పదాన్ని విన్న మనిషే దాన్ని అర్థం చేసుకుంటాడు. కాబట్టి ఏ పదానికో నిఘంటువులో వెతికి ఏ అర్థాన్నీ గుర్తించలేం. ఎందుకంటే ఏ నిఘంటువులూ బోధిసత్త్వులకోసం వ్రాయబడలేదు కనుక. నిఘంటువులు అన్నీ సాధారణ మానవజీవులకోసం మాత్రమే ఉద్దేశించి వ్రాయబడుతూ ఉంటాయి.

కాబట్టి, ఈ "శ్రద్ధగా విను, అవధానంతో విను" అన్న మాటకు ఏమిటి అర్థం? కొన్ని విషయాలు ఉన్నాయి, వాటిని మీరు అర్థం చేసుకోవాల్సి ఉంటుంది – అని. ఒకటి : అక్కడ సుభూతి లాంటి మనిషి ఉంటే, అక్కడ చెవులకు తాళంకప్పలు ఉండవు. అక్కడ ఆ సమస్యే ఉండదు. బుద్ధుడి ముందు సంకోచించి ముడుచుకుపోయి ఉండేవాడా అంటే కాదు, బహిరంగంగానే, విచ్చుకునే ఉండేవాడు, నిస్సంశయంగా. మహాతెరవే ఉంది సుభూతిలో. బుద్ధుడితో ఆయన వాదించే మనిషి కూడా కానే

కాదు. పూర్తిగా తనను సమర్పించుకుని బుద్ధుడితోనే ఉంటున్నాడు. ఆయనతోపాటే వికసిస్తూ ఉన్నాడు. ఆయనతోపాటే ప్రవహిస్తూ ఉంటున్నాడు. కానీ ఓ మానవుడు బోధిసత్వస్థితిని అందుకున్నప్పుడు, బుద్ధత్వపు అతిసామీప్యానికి వచ్చేసి ఉన్నప్పుడు, ఆ బోధిసత్వుడికి కొన్ని సమస్యలు ఏర్పడి ఉంటాయి.

ప్రతి చైతన్యస్థాయికీ వాటికి ప్రత్యేకమైన సమస్యలు ఉంటాయి. ఇదే బోధిసత్వుడికి ఏర్పడే సమస్య : ఆయన పరిపూర్ణంగా విచ్చుకుని, సర్వస్వాన్నీ స్వీకరించేందుకు సంసిద్ధుడై ఉంటాడు. కానీ ఆ బోధిసత్వుడు తన శరీరంలోంచి పెకలింపబడే ఉంటాడు. ఆ మనిషి హృదయం విచ్చుకుని ఉంటుంది. ఆయన జీవి విచ్చుకుని ఉంటుంది. కానీ శరీరంతో ఏ సంబంధమూ ఉండకుండా తన మూలాలనన్నింటినీ పోగొట్టుకుని ఉంటాడు. ఆయన చుట్టూ కేవలం శరీరం వేలాడుతూ ఉంటుంది. ఆ మనిషి ఆ శరీరంలో జీవిస్తూ ఉండడు. ఆ శరీరంతో ఆ బోధిసత్వుడికి ఏకత్వమే, గుర్తింపే ఉండదు – అదే సమస్య.

ఎవరైనా మీతో "జాగ్రత్తగా వినండి" అన్నారంటే ఆ మాటకు అర్థం మీ శరీరం ఆ మాటల్ని వింటూనే ఉన్నా, మీరు మాత్రం వింటూ ఉండడం లేదనే. ఆ మాటను బుద్ధుడు ఓ బోధిసత్వుడితో అంటున్నప్పుడు "మీరు వింటూనే ఉన్నారు, కానీ మీ శరీరం వినడం లేదు" అని అర్థం. ఈ అర్థం పూర్తిగా విరుద్ధంగా ఉంటుంది. మీరు వింటున్నప్పుడు మీ శరీరం ఇక్కడ ఉంటుంది, మీరు ఇక్కడ ఉండరు. మాటలు చెవులను చేరుకుంటాయి, చెవి లోపల అవి శబ్దాల్నీ, నాదాల్నీ చేస్తాయి. కానీ ఇంకో చెవిలోంచి ఆ శబ్దాలూ, నాదాలూ బయటికి వచ్చేస్తాయి. మీ జీవుడిలోకి ఆ శబ్దాలూ, నాదాలూ పోనే పోవు. మీ జీవుడు ఆ శబ్దాలనూ, నాదాలనూ ముట్టుకోనే ముట్టుకోడు. సుభూతి లాంటి మనిషి దగ్గర పరిస్థితి తద్విరుద్ధంగా ఉంటుంది. ఆయన జీవుడు అక్కడే ఉంటాడు కానీ ఆయన శరీరం అక్కడ ఉండదు. ఆ బోధిసత్వుడు ఆ శరీరంతో అన్ని సంబంధాల్నీ పోగొట్టుకుని ఉంటాడు. ఆ శరీరాన్ని ఎప్పుడో ఆయన పట్టించుకోవడం మానేసి ఉంటాడు. మరచిపోయి ఉంటాడు, తనకు ఓ శరీరం ఉంది అన్న ఎరుకను కూడా ఆయన వదిలిపెట్టేసి ఉంటాడు. శరీరాన్ని గురించి ఆలోచించడాన్ని కూడా ఆయన ఎప్పుడూ చేయడు. ఆయన అక్కడే ఉంటాడు కానీ ఆయన శరీరం మాత్రం ఆయన దగ్గర ఉండదు. ఆ బోధిసత్వుడు అశరీరుడిగా తయారైపోయి ఉంటాడు.

కానీ దేన్నయినా వినాలంటే శరీరమూ, ఆత్మా రెండూ కలిసి ఉన్నప్పుడే సాధ్యం అవుతుంది. మీ విషయంలో మీ శరీరం ఉంటుంది కానీ మీ ఆత్మ ఇక్కడ

ఉండదు. సుభూతి విషయంలో ఆయన ఆత్మ ఇక్కడే ఉంటుంది కానీ ఆయన శరీరం ఇక్కడ ఉండదు. సుభూతికి దేహ స్పృహే ఉండదు. బుద్ధుడు అంటున్న "కాబట్టి సుభూతీ, శ్రద్ధగా విను", అన్న మాటకు అదే అర్థం. మీ శరీరాన్ని కూడా ఇక్కడికే తెచ్చుకోండి. మీ శరీరాన్ని కూడా మీకోసం పనిచెయ్యనివ్వండి. మీరు మీ శరీరానికి అంటుకునే ఉండండి. మీ శరీరంలోకి రండి. ఇక్కడే శరీరంలోనే వేళ్ళు పాతుకుని ఉండండి. మీ శరీరాన్ని వాహనంగా ఉంచుకోండి. శరీరమే మీ సాధనం, పరికరం. మీ మాధ్యమం.

ఇంకా అంటాడు బుద్ధుడు "...వినండి అవధానంతో". సుభూతి అవధానంతో, ధ్యాసతో ఉండడం లేదా? అది అసంభవం. అవధానంతో ఉండలేకపోతే ఆ సుభూతి ఓ బోధిసత్వుడే కాలేడు, ఓ బోధిజీవే కాలేడు. మహాఅవధానాన్ని ప్రాప్తించుకున్నవాడే బోధిజీవి. మహా ఎరుకతో ఉంటున్నవాడే బోధిజీవి. మహాచురుకుగా ఉంటున్నవాడే బోధిజీవి. మహాచైతన్యంతో ఉంటున్నవాడే బోధిజీవి. మహాయాంత్రికంగా ఏ మాత్రమూ ఉండనివాడే బోధిజీవి. మరి అటువంటప్పుడు బుద్ధుడు సుభూతితో ఎందుకు అంటున్నాడు "...శ్రద్ధగా వినండి, అవధానంతో వినండి" అని? ఇప్పుడు మనం ఇంకో అర్థాన్ని అర్థం చేసుకోవాలి.

ఓ సుభూతి లాంటి బోధిసత్వుడు తన అంతరంలోకే వెళ్ళిపోతూ ఉండే తత్వంతో ఉంటాడు. ఏ ప్రయత్నాన్నీ చెయ్యకుండా ఉన్నప్పుడు ఆ మనిషి తన జీవుడిలోకే మునిగిపోయి ఉంటాడు. అందులోనే కూరుకుపోయి దారి తెన్నూ లేకుండా ఉంటాడు. ప్రయత్నిస్తే తప్ప బాహ్య స్పృహలోకి, శరీరంలోకి రాలేడు. మీ ప్రవర్తన దీనికి పూర్తిగా విరుద్ధంగానే ఉంటుంది. ఓ మహాప్రయత్నం చేస్తే తప్ప మీ జీవుడి దగ్గరికి మీరు వెళ్ళలేరు. ఉన్నట్లుండి ఓ క్షణంలో మీ ఆలోచనలన్నీ ఆగిపోయి మీరు మీ అంతర్ వైభవంలో మునిగిపోతారు. కానీ మీకు అది అరుదుగానే జరుగుతుంది. ఎంతో విశ్వప్రయత్నాన్ని చేసిన తరువాత, ధ్యానాలనో, యోగాన్నో, దీన్నో దాన్నో చేస్తే – అప్పుడు కొన్ని క్షణాలపాటు మీరు ఆ సౌందర్యంలో, ఆ ఆశీర్వాదంలో ఉంటారు. ఆకాశం తెరుచుకుంటుంది. మేఘాలన్నీ అదృశ్యం అయిపోతాయి. అక్కడ వెలుగు ఉంటుంది. అక్కడ జీవితం ఉంటుంది. అక్కడ మహదానందం ఉంటుంది. కానీ కొన్ని క్షణాలపాటు మాత్రమే... మళ్ళీ మళ్ళీ మీకు అది తప్పిపోతూనే ఉంటుంది. మీరు అవధానంలో ఉండేందుకు ఓ మహాప్రయత్నాన్నే చేసినప్పుడు, మీకు ఆ మహానుభూతి మీ అంతరంలో ప్రాప్తిస్తుంది.

సుభూతి విషయంలో అది దీనికి పూర్తి విరుద్ధంగానే ఉంటుంది. ఆయన ఎప్పుడూ తనలోనే మునిగిపోయి ఉంటాడు. ఆనందంలో ఉబ్బితబ్బిబ్బు అయిపోతూ ఎక్కడ ఉన్నాడో తెలియని స్థితిలో ఉంటూ ఉంటాడు. ఓ ప్రయత్నాన్ని చేస్తే తప్ప బుద్ధుడు ఏం మాట్లాడుతున్నాడో వినలేడు. బుద్ధుడి నిశ్శబ్దాన్ని ఆ మనిషి సంపూర్ణంగా వినగలుగుతూ ఉంటాడు. ఓ బుద్ధుడు నిశ్శబ్దంగా ఉంటున్నప్పుడు అక్కడ ఓ సమావేశం ఉంటుంది - మహాసంగమం. కానీ ఆ బుద్ధుడు మాట్లాడుతూ ఉన్నప్పుడు ఆయన ఎంతో ప్రయత్నాన్ని చెయ్యాల్సే ఉంటుంది. ఆ బుద్ధుడు తన శరీరాన్ని తన దగ్గరికి లాక్కొచ్చి తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఆయన తనలో నుంచి బాహ్యంలోకి వచ్చేయాల్సి ఉంటుంది. ఆయన తన శరీరంలోకి రావాల్సి ఉంటుంది. అప్పుడు ఆయన మహా అవధానంలో ఉండాలి. ఆయన ఆత్మ మధుపాన మహామత్తులో ఉంటాడు.

అందువల్లే బుద్ధుడు ఈ వింత మాటలను అంటూ ఉన్నాడు, "కాబట్టి సుభూతీ శ్రద్ధగా విను, అవధానంతో విను". ఈ అర్థాన్ని మొట్టమొదటిసారిగా నేను ఇప్పుడు మీకు వర్ణించి చెబుతూ ఉన్నాను. ఇరవైఅయిదు శతాబ్దాలలో ఎవ్వరూ ఇప్పటిదాకా ఈ పదాల అర్థాన్ని విశదీకరించి చెప్పలేదు. ఈ మాటలను అందరూ ఉన్నది ఉన్నట్లుగా స్వీకరించారు, సాధారణంగానే, బుద్ధుడు అందరితోనూ చెప్తున్నట్లుగానే, "శ్రద్ధగా వినండి, అవధానంతో వినండి" అని. బుద్ధుడు ఓ మామూలు మానవజీవితో మాట్లాడడం లేదు.

ఇరవైఅయిదు శతాబ్దాల్లో ఎవ్వరూ ఈ మాటల సరైన అర్థాన్ని గురించి వ్యాఖ్యానించలేదు. ఆ మాటలు తమకు అర్థం అయ్యాయనే అందరూ అనుకున్నారు. పదాల అర్థాలు మారిపోతూ ఉంటాయి. ఎవరు ఆ పదాలను వాడుతున్నారో వాళ్ళమీదే అర్థం ఆధారపడి ఉంటుంది. ఎవరికోసం ఆ పదాలు ఉపయోగపడుతున్నాయో వాళ్ళ మీదే అర్థం ఆధారపడి ఉంటుంది. ఆ పదాల అర్థం సందర్భం మీద, పరిస్థితి మీద ఆధారపడి ఉంటుంది. ఆ పదాలకు స్వంతంగా ఏ అర్థమూ ఉండదు. పదాలు ఏ అర్థమూ ఉండకుండా ఉంటాయి. ఉపయోగింపబడుతున్న ఆ ప్రత్యేక పరిస్థితికి తగినట్లు ఆ పదాలకు అర్థాలు వస్తాయి.

ఇప్పుడు, ఈ పరిస్థితి అత్యంత అరుదుగానే ఉంది. ఈ పదాలను బుద్ధుడు కొన్నివేలసార్లు అంటూనే ఉండేవాడు. అందరితోనూ ప్రతిరోజూ బుద్ధుడు అంటూనే ఉండేవాడు "శ్రద్ధగా వినండి, అవధానంతో వినండి" అని. కాబట్టి వజ్రచ్ఛేదిక సూత్ర వ్యాఖ్యానాలు చేసినవాళ్ళు ఈ విషయాన్ని గుర్తించలేకపోయారు. వాళ్ళు జ్ఞానులు

కారు అనే నాకు అనిపిస్తూ ఉంటుంది. వాళ్ళకు భాష తెలుసు కానీ ఈ వింత పరిస్థితిని వాళ్ళు ఏ మాత్రమూ గ్రహించలేకపోయారు. బుద్ధుడు మాట్లాడుతూ ఉన్నది ఓ సామాన్య మానవజీవుడితో కాదు. ఆయన బుద్ధత్వానికి మహాసామీప్యంలో ఉంటున్న ఎవరితోనో, బుద్ధస్థితి ఎల్ల మీద దాదాపుగా ఉంటున్న మానవుడితో, బుద్ధత్వంలోకి ప్రవేశింపబోతున్న బోధిసత్త్వుడితో మాట్లాడుతూ ఉన్నాడు.

బుద్ధుడు తన మాటను 'కాబట్టి' అన్న పదంతో మొదలుపెడుతున్నాడు. "కాబట్టి సుభూతీ, శ్రద్ధగా విను, అవధానంతో విను" అంటున్నాడు. ఇప్పుడు ఈ 'కాబట్టి' కూడా ఎంతో అతార్కికంగానే ఉంటోంది. ఓ భాగంలో దాన్ని ఉపయోగించినప్పుడు మాత్రమే, విషయాంతపు భాగంలో ఓ తార్కికన్యాయంతో దాన్ని ఉపయోగించినప్పుడు మాత్రమే అది తార్కికంగా ఉంటుంది : మనుష్యులందరూ మరణిస్తారు. సోక్రటీసు ఓ మనిషి, కాబట్టి సోక్రటీసు మర్త్యుడే. అప్పుడు అక్కడ 'కాబట్టి' అన్న పదం సరిగ్గానే ఉపయోగింపబడింది. ఓ తార్కిక న్యాయం ఉన్న విషయాంతపు భాగంలోనే ఇది ఉంది. కానీ ఇక్కడ తర్కం లేదు. దీనికి ముందు ఏమీ లేదు. ఏ భావాంశమూ ముందుగా చెప్పబడలేదు. అయినా బుద్ధుడు లేని భావాంతం నుండే మాటను మొదలుపెడుతూ 'కాబట్టి' అన్న పదాన్ని ఉపయోగిస్తున్నాడు.

ఆ విధంగా మాటను మొదలుపెట్టడంలో ఓ వింతదనం ఉంది. మరి అదే బుద్ధుడి పద్ధతి. హృదయసూత్రంలో సారిపుత్రుడితో బుద్ధుడు ఈ విధంగానే మాట్లాడుతూ ఉంటాడు, "కాబట్టి, సారిపుత్రా..." అంటూ మొదలుపెడుతూ. ఇప్పుడు బుద్ధుడు అంటున్నాడు "కాబట్టి, సుభూతీ..." బుద్ధుడు 'కాబట్టి' అనే మాటను ఉపయోగించాల్సిన అవసరం ఏర్పడే ఏ భావం గురించీ సుభూతి ఏ మాటా చెప్పకపోయినా. బుద్ధుడు కూడా 'కాబట్టి' అన్న పదాన్ని ఉపయోగించాల్సిన అవసరం ఏర్పడే భావం ఉన్న ఏ మాటనూ అంతకుముందు చెప్పి ఉండలేదు. కానీ సుభూతి జీవి ఉనికిలోనే ఆ భావాన్ని ప్రకటిస్తూ ఉన్న ఏ విషయాంశమో ఉంది. ఆ విషయాంశాన్ని ఉద్దేశిస్తూనే బుద్ధుడు ఈ 'కాబట్టి' అన్న పదాన్ని ఉపయోగిస్తున్నాడు. కానీ పైన మాత్రం ఏ మాటలూ జరిగి ఉండవు.

ఓ మహాచార్యుడు మీలో ఉన్న ఆ లక్షణాంశంతోనే ప్రతిస్పందిస్తూ ఉంటాడు. ఆ మాస్టర్ మీ నిశ్శబ్దంతోనే మరింత ఎక్కువగా ప్రతిస్పందిస్తూ ఉంటాడు, మీ మాటలతో కన్నా. ఆ మాస్టర్ మీ 'తృష్ణ'తోనే మరింత ఎక్కువ ఉత్సాహంతో

ప్రతిస్పందిస్తూ ఉంటాడు, మీ ప్రశ్నలతో కన్నా. మీ 'ఆవశ్యకాల'తోనే మరింత ఉత్సాహంతో ఆయన ప్రతిస్పందిస్తూ ఉంటాడే తప్ప, మీ ప్రశ్నలతో కాదు. ప్రస్తుతం బుద్ధుడు ఉపయోగిస్తున్న ఈ 'కాబట్టి' సుభూతి మహాంతర్జీవిలో ఉన్న మహాసూక్ష్మ తృష్ణనే సూచించి ఉద్దేశిస్తుంది. బహుశా సుభూతికి కూడా తృష్ణ ఉందని తెలిసి ఉండకపోవచ్చు. అది ఆయనకు తెలిసొచ్చేందుకు మరింత సమయం పట్టవచ్చు.

ఓ గురువు నిరంతరంగా తన శిష్యుడి 'జీవి'ని పరిశీలించి చూస్తూనే ఉండాల్సి ఉంటుంది. ఆ శిష్యుడి మహావసరానికే ప్రతిస్పందిస్తూ ప్రవచించాల్సి ఉంటుంది. ఆ శిష్యుడు ఆ ప్రశ్నను అడిగినా, అడగకపోయినా. ప్రశ్న ఉందా లేదా అన్నది కాదు విషయం. తన మానాన తనను – ఆ శిష్యుణ్ణి – వదిలిపెట్టేస్తే, ఆ శిష్యుడికి అనేక నెలల సమయం పట్టవచ్చు, తన ఆవశ్యకాన్ని గుర్తించి తెలుసుకునేందుకు – కొన్ని సంవత్సరాలు కూడా చాలకపోవచ్చు, కొన్ని జన్మలు ఎత్తాల్సి రావచ్చు. కానీ ఓ మాస్టర్ మీ గతాన్నీ, వర్తమానాన్నీ, భవిష్యత్తునూ కూడా ఎప్పుడూ దర్శించి చూస్తూ ఉంటాడు. మీ ఇప్పటి ఆవశ్యకత ఏమిటో, మీ భవిష్యత్తులోని ఆవశ్యకత ఏమిటో కూడా, ఈ పరీక్షతో దర్శిస్తూనే ఉంటాడు. ఇప్పటి మీ జన్మనూ, మీ భవిష్య జన్మనూ. ఇప్పటి మీ జన్మ ఎలా ఉంది? మీ భవిష్య జన్మ ఎలా ఉంటుంది? – మాస్టర్ మీ సంపూర్ణ ప్రయాణపు ఆవశ్యకతలన్నింటికోసం సౌకర్యాలను అమర్చిపెడుతూ ఉంటాడు. ఈ 'కాబట్టి' అన్న మాట సుభూతిలో ప్రకటితం కాని ఆవశ్యకపు తృష్ణను తీర్చేందుకోసమే ఉద్దేశించి చెప్పబడుతున్న మాటే.

**ఇప్పుడు సూత్రాలు :**

> **కానుకను ఇస్తున్న బోధిసత్త్వుడిలో వస్తువు నాదన్న భావన సైతం ఉండకూడదు కాబట్టి, ఏ స్వంతభావనల ఆధారాలూ ఎక్కడా ఆ బోధిసత్త్వునిలో ఉండకూడదు కాబట్టి...**

బుద్ధుడు 'కాబట్టి'ని ఉపయోగించిన అవసరం ఇదే, "కాబట్టి సుభూతీ, శ్రద్ధగా విను, అవధానంతో విను". సుభూతి ప్రగాఢాంతరంగంలో ఎక్కడో ఈ భావన ఉండి ఉండవచ్చు, మహాసూక్ష్మ భావన : నేను ప్రాప్తించుకున్నదాన్ని అందరికీ ఇచ్చేస్తే, నాకు ఎంతో గొప్ప పుణ్యఫలం తప్పక లభిస్తుంది.

ఇవి సుభూతి మాటల్లో ఉండవు. ఆయనలో ఈ భావన అప్పటిదాకా కనీసం ఓ ఆలోచనగా కూడా తలెత్తి ఉండకపోవచ్చు; ఓ మహాసూక్ష్మానుభూతిగానే,

ఓ చిన్న అల గానే, ప్రగాఢాంతరంలో కదిలి ఉండవచ్చు. "ఈ మహాధర్మాన్ని కానుకగా ప్రజలకు సమర్పిస్తే..." సర్వోత్కృష్టమైన కానుక అది. బుద్ధుడు "ప్రజలందరికీ మీరు ఇవ్వగలిగిన సర్వోత్కృష్ట కానుక మీ సంప్రజ్ఞతను పంచిపెట్టడమే" అని అన్నాడు. తప్పకుండా సర్వోత్కృష్టమైన కానుకనే ఇచ్చితీరాలి. ఎవరో తమ సంపదను పంచిపెడతారు, అదేం గొప్ప కాదు-శూన్యమే అది. ఆ సంపదను ఆ మనిషి పంచిపెట్టకపోయినా, అదంతా ఈ భూమి మీద వదిలిపెట్టబడే ఉండిపోతుంది, ఆ మనిషి మరణించినప్పుడు. ఇంకెవరో మరిదేన్నో పంచిపెడతారు. కానీ సంప్రజ్ఞతను పంచిపెట్టడం అంటే శాశ్వతత్వాన్ని పంచిపెట్టడమే, దివ్యత్వాన్ని పంచిపెట్టడమే, మహాపరమాన్ని పంచిపెట్టడమే. బుద్ధుడు "సంప్రజ్ఞతను పంచిపెట్టడమే సర్వోత్కృష్ట దానం" అని అన్నాడు.

"మీరు ప్రాప్తించుకున్న సర్వస్వాన్నీ పంచిపెట్టేయండి" అని బుద్ధుడు ఇప్పుడు సుభూతితో చెబుతూ ఉన్నాడు. మీరు ఓ నిశ్చితాన్ని చేసుకోండి, చిత్తోత్పాదితవ్యులు కండి, మీ జీవిలో ఈ మహానిశ్చయాన్ని పొంది ఉండండి, సమస్త మానవాళినీ, సర్వజీవరాశినీ విముక్తి చెందించేదాకా ఈ ఒడ్డును వదిలిపెట్టనని, ఈ తీరంలోంచి తరించనని. ఈ మహాదృఢనిశ్చయ కార్యాన్ని మీ మహాఅంతర్‌జీవిలో సుస్థితం చేసుకోండి, మీరు అంతర్ధానం అయిపోవడం ఆరంభం కాకముందే, మీ తెప్ప ఆవలితీరం దిశలో కదలడం ప్రారంభం కాకముందే. ప్రజలందరికీ సహాయపడాలన్న మహావాంఛను పొంది ఉండండి. ఆ బలీయమైన మీ కోరికే ఓ శృంఖలంగా తయారై ఈ తీరం మీదే మిమ్మల్ని బంధించి నిలిపి ఉంచుతుంది. తరుణం మించిపోకముందే ఈ చిత్తోత్పాదాన్ని సృష్టించుకోండి. మీ సర్వశక్తుల్నీ దీనికోసం వినియోగించుకోండి - "ఎంత బలీయమైన మహాకర్షణ కలిగినా ఈ తీరాన్ని వదిలిపెట్టి అవతలి తీరానికి వెళ్ళిపోను."

మరి ఆ ఆకర్షణ మహావిపరీతంగా ఉంటుంది. సర్వస్వమూ పరివర్తింపబడిపోయి ఉంటూ, ఏ ప్రాప్తం కోసం అనేక లక్షల జన్మల పర్యంతమూ మీరు బహుశ్రమించి తపించారో, తత్‌ప్రాప్తి కోసం ఆవలి తీరానికి చేరిపోగల సామర్థ్యం మీకు మీ స్థితిలో సంప్రాప్తించి ఉన్నప్పుడు, మహాబలీయమైన మహాకర్షణే మీకు కలుగుతూ ఉంటుంది, ఇక ఇక్కడ ఉండనే ఉండకూడదని. ఇక్కడ ఎందుకోసం మిగిలి ఉండాలి? ఇప్పటిదాకా పడిన కష్టాలు చాలు. ఇప్పుడు నిర్వాణతలంలోకి వెళ్ళిపోయేందుకు మీకు పాస్‌పోర్టు కూడా వచ్చేసి ఉంది. మరి ఇప్పుడు బుద్ధుడు చెబుతూ ఉన్నాడు "ఆ పాస్‌పోర్టు వద్దని తిరస్కరించు. దాన్ని విసిరికొట్టి దూరంగా

పారేయ్. సమస్త జీవాళికీ విముక్తి తెప్పించేదాకా ఈ తీరం నుంచి కదిలేది లేదని భీష్మించుకు కూర్చునే దృఢనిశ్చితాన్నీ, చిత్తోత్పాదాన్నీ పొందు.”

దీన్ని వింటూ ఉన్నప్పుడు సుభూతి హృదయంలో, ఆ బోధి జీవుడి ప్రగాఢాంతరంగపు ఓ పొరలో, ఈ మహాసూక్ష్మవాంఛ మెదిలే ఉండవచ్చు “ఇది మహోత్కృష్టమైన విషయం. ఈ మహాదానాన్ని చేస్తే నాకు ఎంతటి మహోన్నత మహాలక్షణం వస్తుందో? నాకు ఎంతటి మహాపుణ్యం వచ్చి ఉంటుందో? నాకు ఎంత శ్రేయం, ధర్మం కలిగి ఉంటుందో?” అని. సుభూతిలో తప్పకుండా మహాసూక్ష్మమైన అలజడి మాత్రమే ఏర్పడి ఉండవచ్చు. దాన్ని చదివే శక్తి సుభూతికే ఉండి ఉండకపోయి ఉండవచ్చు. ఓ అతిసూక్ష్మమైన మెరుపు మెరిసి ఉండవచ్చు ఆయనలో. ఒక్క క్షణం లోనో, క్షణాంశం లోనో. కానీ బుద్ధ దర్పణంలో అది ప్రతిబింబించింది.

ఓ గురువు దర్పణంగా ఉంటాడు. మీలో ఉన్నవన్నీ ఆయనలో ప్రతిబింబిస్తాయి. కొన్నిసార్లు మీ ప్రశ్నకు ఆయన ఓ ప్రత్యుత్తరాన్ని ఇవ్వనే ఇవ్వడు. ఎందుకంటే మీ జీవుడికి అనావశ్యకం అయిన ఓ విషయాన్ని కేవలం తెలుసుకుందామన్న కుతూహలంతో మీరు ఆ ప్రశ్నను అడుగుతూ ఉండవచ్చు కాబట్టి. లేదా మీకున్న జ్ఞానాన్ని ప్రదర్శించుకోవడానికోసం ఆయనను మీరు ఆ ప్రశ్న అడుగుతూ ఉండవచ్చు కాబట్టి. లేదా “చూడండి నేను ఎంత గొప్ప సత్యాన్వేషినో, ఎంతో అందమైన ప్రశ్నలనే నేను ఎప్పుడూ అడుగుతూనే ఉంటాను” అని అందరికీ నిరూపించేందుకోసమే ఆ ప్రశ్నను అడుగుతూ ఉండవచ్చు. ఆ ప్రశ్న ఉనికిలో ఉండకపోవచ్చు. అది కేవలం మేధోపరంగా ఉండవచ్చు. అటువంటి సంభావ్యతల పరిస్థితులు ఉన్నప్పుడు గురువు మీకు ఏ సమాధానాలనూ ఇవ్వడు. మీ ప్రశ్నను పట్టించుకోనే పట్టించుకోడు.

మరి అప్పుడప్పుడు మీరు అడగని ప్రశ్నలకు కూడా ఆ గురువు సమాధానాలను ఇస్తూ ఉంటాడు. మీరు అడగని ప్రశ్నలకు మాత్రమే కాదు, కనీసం ఆ ప్రశ్నలు మీలో ఉన్నాయి అన్న ఎరుక కూడా మీకే ఉండని ప్రశ్నలకు. కానీ మీ మహాఅంతర్జీవుడి ఆవశ్యకతలను ఆ సమాధానాలు తృప్తి పరుస్తాయి; తీరుస్తాయి.

బుద్ధుడు అంటున్నాడు :

> **కానుకను ఇస్తున్న బోధిసత్త్వుడిలో వస్తువు నాదన్న భావన సైతం**
> **ఉండకూడదు కాబట్టి, ఏ స్వంతభావనల ఆధారాలూ ఎక్కడా**
> **ఆ బోధిసత్త్వునిలో ఉండకూడదు కాబట్టి...**

'ఆధారం' అంటే ఉద్దేశ్యం. ఆధారం అంటే "ఇది చెయ్యడం వల్ల నాకు ఏదో లభిస్తుంది'' అని. ఇది మీలో ఉంటే, మీరు విషయం మొత్తాన్నీ గ్రహించలేకపోయారనే. అప్పుడు అది మీలో ఓ బేరంగా తయారైపోయి ఉంటుంది; అప్పుడు అది మీరు ఇచ్చే కానుకగా, దానంగా ఉండదు. నిర్వాణాన్ని ఓ దానంగానే సమర్పించుకోవాల్సి ఉంటుంది, అది ఓ బేరంగా జరగకూడదు. అది వ్యాపారం కాదు. ఇస్తున్నప్పటి ఆనందాన్ని కేవలం అనుభవించేందుకోసం మాత్రమే మీరు దాన్ని దానం చేసి తీరాల్సి ఉంటుంది. దానం ఇస్తున్నప్పుడు మీరు ఏ ఉద్దేశ్యాన్నీ మోస్తూ ఉండకూడదు, అందులోంచి మీరు దేన్నీ ఆశిస్తూ ఉండకూడదు. ఆ దానం వల్ల దేన్నో పొందవచ్చని ఆశిస్తూ మీరు ఆ ఉద్దేశ్యాన్ని మోస్తూ ఉంటే, మీరు ఎవ్వరికీ ఏ సహాయాన్నీ చేయలేనివారే అయిపోయి ఉంటారు. వాస్తవంలో అప్పుడు మీకే ఓ సహాయం కావాల్సి వస్తుంది. మీకు ఇంకా ముక్తి ప్రాప్తించలేదు. నిర్వాణ తలంలోకి మిమ్మల్ని అనుమతిస్తున్న పాస్‌పోర్టు మీకు ఇంకా అందనే లేదు. అప్పుడు మీరు ఓ తప్పుడు మార్గదర్శకత్వాన్నే అందించగలుగుతారు. మీరు సవ్యమైన మార్గదర్శకత్వాన్ని వహించలేరు.

నిజమైన దానం మీలోంచి పొంగుకుంటూ బయటికి వస్తుంది. మీలో సంప్రజ్ఞత ఎంతగా నిండి ఉంటుందంటే, అది మీలోంచి ఉప్పొంగి ప్రవహించి, పొర్లిపోతూనే ఉంటుంది. ఎవ్వరైనా దాన్ని అందుకోవచ్చు. ఎవ్వరైనా దాన్ని స్వీకరిస్తూ ఉన్నప్పుడు మీలోనే మహాకృతజ్ఞతాభావం కలుగుతూ ఉంటుంది. ఎందుకంటే ఆ అర్హుడు మీ మహాప్రజ్ఞాభారాన్ని తగ్గిస్తూ తన మీదికి ఎత్తుకుని దాన్ని తను కూడా మోస్తూ ఉంటాడు కాబట్టి. ఓ జలధర మేఘం వర్షించినప్పుడు ఆ మేఘం భూమికి తన కృతజ్ఞతలను సంతోషంగా సమర్పించుకుంటుంది. ఎందుకంటే జలాన్ని స్వీకరించి ఆ మేఘం బరువును భూమి భరిస్తూ దాన్ని తేలికపడనిస్తుంది కాబట్టి. ఔను. సరిగ్గా అది కూడా ఇలాగే జరుగుతుంది.

ఓ సంప్రజ్ఞత మీలో ఆవిర్భవిస్తూ ఉన్నప్పుడు మీలో జాలువారుతూ, ఉప్పొంగుతూ, మీలో నిండి పొర్లిపోతూ అది తేలి వస్తుంది. దాన్ని మీరు ఎంతైనా పంచిపెట్టొచ్చు, ధారాళంగా మీ ఇష్టం వచ్చినంతగా పంచిపెట్టెయ్యవచ్చు. ఎంత పంచినా అది మీలోంచి చిమ్ముకుంటూ అనంతంగా బయటికి వస్తూనే ఉంటుంది. అది ఆగనే ఆగదు. అప్పుడు మీరు పిసినారులుగా ఉండకూడదు. అప్పుడు మీరు ఏ ఉద్దేశ్యాన్నో మోస్తూ, మరి దేన్నో ఆశిస్తూ ఉండకూడదు.

> **కానుకను ఇస్తున్న బోధిసత్త్వుడిలో వస్తువు నాదన్న భావన సైతం ఉండకూడదు కాబట్టి, ఏ స్వంతభావనల ఆధారాలూ ఎక్కడా ఆ బోధిసత్త్వునిలో ఉండకూడదు కాబట్టి... ఆ మహాజీవి తను దానం చేస్తున్నానన్న సంజ్ఞ కూడా తనలో ప్రతిష్ఠింపబడని విధంగా ఆ కానుకను అర్పించాల్సి ఉంటుంది.**

ఆ బోధిసత్త్వుడు "ఇది ఓ దానం" అని అనుకోడు. ఆయన "నేను ఇస్తున్నవాణ్ణి, నువ్వు పుచ్చుకుంటున్నవాడివి" అని అనుకోడు. కాదు, ఈ ఆలోచనలనూ, ఊహలనూ అన్నింటినీ విడిచిపెట్టెయ్యాలి. ఏ దాతా లేడు, ఏ దానమూ లేదు, ఏ గ్రహీతా లేడు. ఇది అంతా ఓ ఏకత్వమే. ఎవరికి మీరు సహాయపడుతూ ఉన్నారో ఆ మనిషి కూడా మీరే. ఏ మనిషికి మీరు సహాయం అందిస్తున్నారో ఆ మనిషి కూడా మీ మరో స్వరూపమే... మీ ఎడమచేత్తో ఇస్తూ మీ కుడిచేత్తో మీరే పుచ్చుకుంటూ ఉన్నట్టు. దాన్ని గురించి గొప్పగా అనుభూతిని పొందకూడదు. ఇస్తున్నవాడూ లేడూ, పుచ్చుకుంటున్నవాడూ లేడూ, దానమూ లేదు.

> ***ఆ మహాజీవి తను దానం చేస్తున్నానన్న సంజ్ఞ కూడా తనలో ప్రతిష్ఠింపబడని విధంగా ఆ కానుకను అర్పించాల్సి ఉంటుంది. మరి ఎందుకు? ఎందుకంటే నాది అన్న భావనే లేకుండా చేస్తున్న బోధిజీవుడి, ఆ దాన పుణ్యఫలరాశి విలువ ఇంత అని వెలకట్టడం అత్యంత కష్టసాధ్యం కనుక...***

ఇప్పుడు ఇది ఒక సమస్య. ఈ సమస్యనే ఎన్నోసార్లు మీరు మళ్ళీ మళ్ళీ ఎదుర్కోవాల్సి వస్తుంది. సమస్య ఏమిటంటే, ఆ దానం గురించి ఆలోచించకుండా ఉంటే ఆ పుణ్యం గొప్పగా ఉంటుంది. దాన్ని గురించి మీరు ఆలోచించారంటే ఆ పుణ్యం అదృశ్యం అయిపోతుంది. మీరు ఆ పుణ్యాన్ని ఆశిస్తే అది ఎప్పటికీ మీకు లభించదు. ఆ పుణ్యఫలాన్ని మీరు ఆశించకుండా ఉంటే, అది మీ మీద ఎప్పుడూ వర్షిస్తూనే ఉంటుంది.

దీనికంటే తక్కువ తలంలో, జీసస్ బోధనా వాక్యం ఒప్పుగా ఉంటుంది. ఈ మాటలను జీసస్ మామూలు మనుష్యులతోనే అన్నాడు "అడగండి, మీకు ఇవ్వబడుతుంది. వెతకండి, మీకు అది దొరుకుతుంది. తట్టండి, తలుపు తెరవబడుతుంది". కానీ బుద్ధుడు ఇప్పుడు సుభూతితో మాట్లాడుతూ ఉన్నాడు. ఆయన ఖచ్చితంగా ఏం చెప్తున్నాడంటే "అడిగారంటే, మీకు అది ఇవ్వబడదు. అన్వేషించారంటే

మీకు అది కనిపించదు. తట్టారంటే, ఆ తలుపు చైనా గోడ అయిపోతుంది, మీకోసం ఎప్పటికీ తెరుచుకోదు". ఇంకా, గుర్తుపెట్టుకోండి, వ్యత్యాసం వింటున్న శ్రోతల్లోంచే వస్తుంది. జీసస్ మామూలు మనుష్యులతో మాట్లాడుతున్నాడు. బుద్ధుడు ఓ అసాధారణ మానవుడితో మాట్లాడుతున్నాడు.

> ***భగవానుదు ఇంకా చెప్తున్నాడు : నీకేమని అనిపిస్తూ ఉంది, సుభూతీ, ఓ తథాగతుణ్ణి ఆయనకున్న గుర్తులతో గుర్తించి చూడవచ్చునా? సుభూతి బదులిచ్చాడు : ఆ విధంగా చూసి గుర్తించకూడదు. కానీ ఓ భగవాన్, ఎందుకు గుర్తించకూడదు? ఏ గుర్తుల్ని వర్ణించి దాన్ని ధరించి ఉన్న తథాగతుణ్ణి గుర్తించవచ్చో బోధించిన భగవానుడు, ఎందుకు అన్నాడు ఆ గుర్తుల లక్షణాలను అవలక్షణాలేననీ?***

అవి చిక్కుసమస్యలుగా కనిపిస్తాయి. కానీ అవి చిక్కుసమస్యలు కావు. అవి చిక్కుసమస్యల్లా కనిపిస్తాయే తప్ప, అవి చిక్కుసమస్యలు కావు . కానీ ఏ ఉన్నత తలంలో ఉంటూ బుద్ధుడు మాట్లాడుతూ ఉన్నాడో అక్కడ ప్రతి విషయమూ విరుద్ధంగా తయారైపోతుంది; అక్కడ వైరుధ్యాలే ప్రకటితాలు అవుతాయి. వైరుధ్యాల ప్రకటనే ఆ తలంలో సంభవించే ఏకైక వ్యక్తీకరణం. ఆ పరమోత్తమ పూర్ణత్వ జీవతలంలో ఆ మానవుడు పరస్పర వైరుధ్యాలతోనే ఉంటాడు. తర్కం తన అర్థాన్ని అంతా అక్కడ పోగొట్టుకుంటుంది. తర్కంతోనే అర్థంకావాలని పట్టుపడితే ఆ పూర్ణత్వ తలంలో ఓ మానవుడు చరించలేడు, సత్యాన్ని ప్రవచించలేడు. సత్యం వైరుధ్యంతోనే ఉంటుంది.

బుద్ధుడు అడుగుతున్నాడు "సుభూతీ ఓ తథాగతుణ్ణి... గుర్తులతో గుర్తించి చూడవచ్చునా?" అని. బౌద్ధ ఉల్లేఖనాలు మహాపురుష లక్షణాలతో ఉన్న మహోత్తమ మానవ జీవికి శరీరం మీద ముప్పైరెండు లక్షణాలు ఉంటాయని ప్రకటిస్తూ ఉన్నాయి. ఆ ముప్పైరెండు మహాపురుష లక్షణాలు శరీరం మీద ఉండడమే ఆ మహాపురుషుణ్ణి గుర్తించే నిశ్చితమా?

మామూలు మానవజీవులకు అది సరే. ఎందుకంటే మీకు వేరే కళ్ళు ఏవీ లేవు కాబట్టి. మీరు బాహ్యంలో కనిపించే గుర్తుల్ని మాత్రమే చూడగలుగుతూ ఉంటారు. మీరు ఎప్పుడూ గుర్తులతోనే, మచ్చలతోనే జీవిస్తూ ఉంటారు. కానీ సుభూతిలాంటి అంతరంలోకి చూడగలిగే మానవుడికి, ఓ బుద్ధుడి లోపలికి చూడగలిగే సామర్థ్యం ఉన్న మానవుడికి, ఆ లక్షణాలతో, గుర్తులతో ఏ సంబంధమూ ఉండకూడదు. మరి అంతకన్నా పైపెచ్చుగా దేన్నో పొంది ఉండడం కాదు ఓ బుద్ధుడి లక్షణం – ఈ

ముప్పైరెండు మహాపురుష లక్షణాలతో సహా. ఆ గుర్తులతో, లక్షణాలతో బుద్ధుడికి ఏ సంబంధమూ ఉండదు. అవి అసంగతాలు. ఓ బుద్ధుడు అత్యంత సాధారణంగా ఉండాలి. ఎందుకంటే ఆ బుద్ధుడి వద్ద ఏదీ ఉండదు కనుక. ఇదే ఆ బుద్ధుడికి నిజమైన గుర్తింపు – ఏమీ ఉండకపోవడం. దేన్నీ ఆయన ఆర్జించుకోడు, ఓ బుద్ధత్వాన్ని సైతం. అదే బుద్ధుడికి నిజమైన గుర్తింపు. ఈ విధంగానే విషయాలన్నీ వైరుధ్యాలు అయిపోతూ ఉంటాయి.

ఓ నిజమైన బుద్ధుడు తనను ఓ బుద్ధుణ్ణి అని కూడా చెప్పుకోడు. "నాకు బుద్ధత్వం ఉంది" అని చెప్పడు. ఎందుకంటే అటువంటి ప్రకటనలన్నీ, స్వాధికారికంగా ఉంటున్న మాటలన్నీ మోసపూరితాలే కాబట్టి. 'నాది' అని చెప్పుకుంటూ ఉండే మాటలన్నీ మోసాలే. బుద్ధుడు "ఇది నాది, ఇది నాకు ఉంది" అని ఎప్పుడూ చెప్పడు. "అది నాకు కావాలి" అని ఎప్పుడూ అడగడు. దేన్నీ ఆయన స్వంతం చేసుకోడు. ఆయనకు ఏ కోరికలూ ఉండవు. ఏ వాంఛితాలూ ఉండవు. తన గురించి వ్యక్తీకరించడానికి బుద్ధుడు ఏ మాత్రపు ఉత్సాహాన్నీ చూపించడు. తను ఎవరు అన్న విషయాన్ని నమ్మబలికి ఒప్పించే పనికి బుద్ధుడు ఎప్పుడూ పూనుకోడు. పూర్తిగా ఉంటాడు. సంపూర్ణంగా ఉంటాడు. ఆయనను మీరు పంచుకోవచ్చు. ఆయన నాట్యంలో మీరూ కలిసి నాట్యం చేయవచ్చు. ఆయన ఉత్సవాన్ని మీరు పంచుకోవచ్చు – కానీ ఆయన అక్కడ దేన్నో నిరూపిస్తూ ఉండడు. దేన్నో నిరూపించాలని మీరు పూనుకుంటే ఆ ప్రాప్తం మీకు ఇంకా దక్కనే లేదు అన్న విషయమే ఋజువు అయిపోతుంది. ఆయన రక్షించుకుంటూ ఉండడు.

బాహ్య లక్షణాలనూ, గుర్తులనూ బుద్ధుళ్ళు కానివారు కూడా సృష్టించుకోవచ్చు. దేన్నయినా సృష్టించుకోవచ్చు. ఉదాహరణకోసం. బుద్ధుడి శ్వాసక్రియ జరుగుతూ అత్యంత నిశ్శబ్దంగా ఉంటుంది, అది ఆయన శ్వాసించకుండా ఉన్నట్లే ఉంటుంది. కానీ ఆ పనిని బుద్ధుడు కాని ఏ యోగి అయినా చెయ్యవచ్చు. మీరే శ్వాసను అభ్యసించవచ్చు, మీరే అభ్యాసాలు చెయ్యొచ్చు. దాదాపుగా శ్వాస ఆగిపోయి ఉన్న స్థితిని కూడా సాధించవచ్చు. నిజమైన బుద్ధుణ్ణి మీరు ఓడించెయ్యొచ్చు.

ఆయన శ్వాస నెమ్మదిగా ఉంటుంది, ఎందుకంటే ఆయన వేగాన్ని వదిలిపెట్టేసి ఉంటున్నాడు కనుక. ఆయన నెమ్మదిగా ఉంటున్నది ఏ శ్వాసక్రియా అభ్యాసాలనో చేసినందువల్ల కాదు. ఆయన శ్వాస అత్యంత నెమ్మదిగా ఎందుకు ఉంటుందంటే ఆయన ఎక్కడికో వెళ్ళిపోవడం లేదు కాబట్టే, ఆయన అన్ని కోరికలూ

అంతర్థానం అయిపోయాయి కాబట్టే. అందువల్లే ఆయన శ్వాస అత్యంత నెమ్మదిగా, దాదాపుగా కనిపించకుండా ఉంటుంది. ఆయన ఓ గొప్ప యోగి కాబట్టి కాదు. ఆయనకు ఏ కోరికలూ లేవు కాబట్టే. ఆయనకు ఏ తొందరా ఉండదు. మామూలుగా తొలిసంధ్య నడకను చేస్తున్నాడు అంతే. ఆయన ఎక్కడికీ పోవడం లేదు. ఆయనకు ఏ భవిష్యత్తూ లేదు. ఆయనకు ఏ దిగుళ్ళూ లేవు.

మీరు గమనించారా? మీరు దిగులుపడుతూ ఉన్నప్పుడు మీ శ్వాస గతి తప్పుతుంది. మీరు కోపంగా ఉన్నప్పుడు మీ శ్వాస హింసాత్మకంగా తయారవుతుంది. మీరు ప్రేమిస్తూ ఉన్నప్పుడు మీ ఆవేశం ఎక్కువైతే, మీ శ్వాస ఎంతో గతి తప్పి సాగుతూ, జ్వరం వచ్చేసినట్లు ఉంటుంది. బుద్ధుడి ఆవేశం కరుణగా పరివర్తితం అయిపోయి ఉంటుంది. ఆయన కోరికలన్నీ రాలిపోయి ఉంటాయి, మాయమైపోయి ఉంటాయి... ఓ పండుటాకు ఓ వృక్షంలోంచి రాలి క్రిందికి పడిపోయినట్లుగా, ఆయన శ్వాస కూడా తగ్గిపోయి, తగ్గిపోయి, తగ్గిపోయి – ఉంటుంది.

ఇదే బుద్ధత్వపు గుర్తు అయితే, ఏ వేషగాడైనా ఈ గుర్తును చూపించేస్తాడు. బుద్ధుడు మహానిశ్శబ్దంగా కూర్చుంటాడు. ఏ స్థితిలోకి శరీరాన్ని నిలుపుతాడో ఆ స్థితిలోంచి ఆయన శరీరం ఏ మాత్రమూ కదలదు. ఆయన మహాస్థిరంగా, ఆ ఆసనంలోనే ఉంటాడు. కానీ ఈ పనిని ఎవరైనా అనుకరించి సాధించవచ్చు. కేవలం కొంచెం అభ్యాసం చేస్తే చాలు. కానీ ఆ అభ్యాసాలు చేసినంత మాత్రాన మీరు బుద్ధుళ్ళు అయిపోరు.

కాబట్టి బుద్ధుడు అంటున్నాడు :

*భగవానుడు అన్నాడు : గుర్తులు ఎక్కడెక్కడ అయితే ఉంటున్నాయో,*
*అక్కడక్కడల్లా మోసం కూడా ఉంటూనే ఉంటోంది;*

ఎవరో ఉన్నట్లుండి అంటారు "బుద్ధుడి లక్షణాలు అన్నీ నాకు కూడా ఉన్నాయి. ఇదో, చూసుకోండి, నేనే బుద్ధుణ్ణి!" అని. అప్పుడు అక్కడ జరుగుతూ ఉన్నది మోసం మాత్రమే – ఎందుకంటే ఆ మనిషి ఆ మాటలను చెప్పడమే ఆ మోసానికి ఋజువు కాబట్టి.

*ఎక్కడెక్కడ ఏ గుర్తులూ ఉండడం లేదో,*
*అక్కడే మోసం కూడా ఉండడం లేదు.*
*కాబట్టి ఆ గుర్తులు ఏవీ లేకపోతేనే గుర్తించాలి తథాగతుణ్ణి.*

బుద్ధుడు సుభూతిని ఉన్నట్లుండి ఈ ప్రశ్న ఎందుకు అడిగాడు? తప్పకుండా ఓ కోరిక సుభూతిలో తలెత్తే ఉండి ఉంటుంది. మ్‌మ్? – ఇవి అర్థం చేసుకోవాల్సిన విషయాలు. సుభూతిలో తప్పకుండా ఓ కోరిక తలెత్తే ఉండాలి. ఓ బుద్ధుడు అయిపోయే స్థితి అంచు మీద ఉన్నాడు సుభూతి. ఓ కోరిక ఆయనలో తలెత్తి ఉండాలి : "అతి త్వరలోనే ముప్పైరెండు గుర్తులూ నాలో ఏర్పడతాయి. త్వరలోనే నేను బుద్ధుణ్ణి అయిపోతాను. అప్పుడు నన్ను ఓ బుద్ధుడిగా ప్రకటిస్తారు. అప్పుడు నాకు ముప్పైరెండు లక్షణాలూ ఉంటాయి."

ఇది అచేతనంగానే ఆయనలో లేచిన కోరిక కావచ్చు. కానీ అది అతి చిన్న తొణుకు మాత్రమే – బుద్ధుడిలో ఉన్న ఆ ముప్పైరెండు మహాపురుష లక్షణాలనూ చూస్తూనే ఉన్న, ఆయన లావణ్యాన్ని పరికిస్తూనే ఉన్న, ఆయన సౌందర్యాన్ని దర్శిస్తూనే ఉన్నవాళ్ళలో ఎవరికి మాత్రం ఆ కోరిక ఉదయించదు? సుభూతి ఇప్పుడు అందుకు సమర్థుడే, ఆయన ఇప్పుడు బుద్ధత్వపు గడప మీదే నుంచుని ఉన్నాడు. మీరు ఏ దానాలనూ ఇవ్వనే ఇవ్వలేదన్నట్లు, బుద్ధుడు దానం ఎలా ఇవ్వాలో మీతో చెప్తూ ఉన్నప్పుడు, దాత, దానం, గ్రహీత అన్న ఏ భావాలూ మీలో ఉండకుండా ఓ దానాన్ని మీరు చేయగలిగితే మహాపుణ్యరాశి మీకు ప్రాప్తిస్తుందని బుద్ధుడు మీతో చెప్తున్నప్పుడు... ఇదంతా వింటూ ఉన్నప్పుడు ఆయనలో ఆశ కలిగి ఉండవచ్చు. మహాసూక్ష్మ విత్తనప్రాయంగా ఆయనలో ఆ ఆశ ఉండి ఉండవచ్చు. కానీ ఆ ఆశ ఆయనలో రేగే ఉంటుంది "ఆ మహాపుణ్యరాశివల్ల నేను ఓ బుద్ధుణ్ణి అయిపోతాను. ముప్పైరెండు మహాపురుష లక్షణాలూ నాకు వచ్చేస్తాయి – అప్పుడు బుద్ధుణ్ణి ఆవరించి ఉంటున్న సుగంధం నాకు కూడా ఉంటుంది. ఆ ఆశీర్వాదం ఉన్న లావణ్యమే, సౌందర్యమే అప్పుడు నాకు కూడా ఉంటుంది. అప్పుడు ఆయన వైభవమే నాకు కూడా ఉంటుంది. అప్పుడు ఆ ఆశీర్వాదమే నాకు కూడా ప్రాప్తించి ఉంటుంది. ఆహా!" సుభూతి ఆ కోరికను ఎప్పుడో సృష్టించుకునే ఉంటాడు.

ఆ కోరికను దర్శిస్తూ ఉన్న బుద్ధుడు అంటున్నాడు "నీకు ఏమని అనిపిస్తూ ఉంది సుభూతీ, ఓ తథాగతుణ్ణి ఆయనకు ఉన్న గుర్తులతో గుర్తించి చూడవచ్చునా?" అంతర్వాహినిగా సుభూతి చైతన్యంలోనో, అచైతన్యంలోనో ప్రవహిస్తూ ఉన్న ఈ కోరికను దర్శించగలిగితే తప్ప ఈ ప్రజ్ఞా పారమితా సూత్రం వజ్రచ్ఛేదికను మీరు అర్థం చేసుకోలేరు.

**సుభూతి అడిగాడు : ఏ జీవులయినా ఉంటారా భవిష్యత్తులో, కాలాంతంలో, చివరిశకంలో, చివరి అయిదువందల ఏళ్ళ అంతంలో,**

***మహాధర్మం భ్రష్టం అయిపోయి వున్న కాలంలో,***
***బోధింపబడితే వింటున్న ఎవరైనా, చేసుకోగలుగుతారా***
***సవ్యంగా ఈ సూత్రపు సత్యార్థాన్నీ?***

ఇప్పుడు మీకు ఆశ్చర్యం కలుగుతుంది. ఈ సమయాన్ని గురించే సుభూతి మాట్లాడుతూ ఉన్నాడు. మీరే ఆ మనుష్యులు. ఇరవైఅయిదువందల సంవత్సరాలు గడచిపోయి ఉన్నాయి. సుభూతి మీ గురించే అడుగుతూ ఉన్నాడు. బుద్ధుడు అన్నాడు, ఎప్పుడైనా ఓ మతం ఆవిర్భవిస్తే, ఎప్పుడైనా ఓ బుద్ధుడు ధర్మచక్రాన్ని తిప్పితే, సహజంగానే, నెమ్మది నెమ్మదిగా ఆ ధర్మచక్రభ్రమణ వేగం తగ్గిపోతూ ఆ చక్రం ఆగిపోవడం ప్రారంభమవుతుంది. ఆ చక్రం తన తిరిగే పరిభ్రమణా వేగాన్ని కోల్పోతూ ఉంటుంది. మీరు ఓ చక్రాన్ని తిప్పుతారు. ఆ చక్రం తిరగడం ప్రారంభమవుతుంది. అప్పుడు క్రమక్రమంగా, వేగం తగ్గిపోయి, ఆ చక్రం ఆగిపోయే క్షణం వచ్చేస్తుంది.

ఓ బుద్ధుడు ధర్మచక్రాన్ని తిప్పినప్పుడు, దాని పరిభ్రమణం పరిపూర్ణంగా ఆగిపోవడానికి రెండువేలా అయిదువందల సంవత్సరాలు పడుతుంది. ప్రతి అయిదువందల ఏళ్ళల్లో ఆ చక్రభ్రమణ వేగం తగ్గుతూ ఉంటుంది. అందువల్ల ధర్మానికి అయిదు తరాలు ఉంటాయి. ప్రతి అయిదువందల సంవత్సరాలలో ధర్మం కొంత క్షీణిస్తూ ఉంటుంది. తగ్గిపోతూ ఉంటుంది, తగ్గుతూ, ఇంకా తగ్గుతూ, మహాక్షీణించిపోతుంది. ఇరవైఅయిదు శతాబ్దాల తరువాత ఆ ధర్మచక్రం మళ్ళీ ఆగిపోతుంది. అప్పుడు ఆ ధర్మచక్రాన్ని మళ్ళీ తిప్పడానికి మరో బుద్ధుడు అవసరమవుతాడు, ఇంకో ఇరవైఅయిదు శతాబ్దాల పర్యంతం ఆ ధర్మచక్రం పరిభ్రమణం కొనసాగేందుకు.

ఇది ఎంతో అరుదైన సంభవం. సుభూతి బుద్ధుడిని ఈ ప్రశ్న అడగడంలో ఏ కుట్రో జరగబోతున్నట్లు అనిపిస్తుంది.

***సుభూతి అడిగాడు : ఏ జీవులయినా ఉంటారా భవిష్యత్తులో,***
***కాలాంతంలో, చివరిశకంలో, చివరి అయిదువందల ఏళ్ళ అంతంలో,***
***మహాధర్మం భ్రష్టం అయిపోయి వున్న కాలంలో,***
***బోధింపబడితే వింటున్న ఎవరైనా, చేసుకోగలుగుతారా***
***సవ్యంగా ఈ సూత్రపు సత్యార్థాన్నీ?***
***భగవానుడు అంటున్నాడు : ఆ విధంగా మాట్లాడకు, సుభూతీ! నిజమే,***
***అప్పుడు కూడా ఉంటారు జీవులు, ఈ సూత్రంలోని పదాలు***

> **వాళ్ళకు బోధింపబడితే, ఆ సూత్ర సత్యాన్ని అర్థం చేసుకోగలుగుతారు**
> **వాళ్ళు. అంతటి సమయంలో కూడా, సుభూతీ, ఉంటారు**
> **బోధిసత్వ్వాళ్ళు... ఆ బోధిసత్వ్వాలు, ఉండరు సుభూతీ**
> **ఒక్క బుద్ధుణ్ణే గౌరవిస్తూ, పూజిస్తూ, ఏ ఒక్క బుద్ధుడిలోనో**
> **వేళ్ళు పాతుకుని వాళ్ళుందరు.**
> **తద్వ్యతిరేకంగా, సుభూతీ, ఉంటారు ఆ బోధిసత్వ్వాలు,**
> **వాళ్ళకు, ఈ సూత్ర ప్రవచనాలు బోధింపబడి వినిపించినప్పుడు,**
> **కనీసం ఓ అతిపవిత్ర, అతినిర్మల ఆలోచనను అయినా**
> **అర్థం చేసుకుని గ్రహించగలిగిన ఆ బోధిసత్వ్వాళ్ళు కొన్నిలక్షల**
> **బుద్ధుళ్ళను గౌరవించి పూజించినవాళ్ళు అవుతూ, తమ**
> **అశేష పుణ్యఫల ప్రాప్తాన్ని కొన్ని లక్షల బుద్ధుళ్ళకు సమర్పించుకున్న**
> **వాళ్ళు కూడా అయివుంటారు.**
> **బుద్ధజ్ఞానంతో తథాగతుడికి వాళ్ళందరు తెలుసు. తథాగత**
> **బుద్ధనేత్ర ప్రజ్ఞతో ఆ బోధిసత్వ్వాలందరూ సుభూతీ, పూర్ణజ్ఞానులే**
> **తథాగతుడికి. వాళ్ళందరూ సుభూతీ, ఆర్జించుకుంటారు,**
> **ప్రాప్తించుకుంటారు లెక్కపెట్టలేనంత మహాపుణ్యఫలరాశిని.**

బుద్ధుడు మీ గురించే మాట్లాడుతూ ఉన్నాడు. ఈ సూత్రం మీకే చదివి వినిపించబడుతుంది. ఇరవైఅయిదు శతాబ్దాలు గడచిపోయి ఉన్నాయి. సుభూతి మీ గురించే అడిగాడు!

మొన్నటిరోజునే నేను చెప్పాను, మీలో ఎందరో బోధిసత్వ్వాలు అవుతారు అని. మీలో ఎందరో ప్రస్తుతం ఆ మార్గంలోనే ఉన్నారు. ఎంతో వింతగానే ఉంటుంది, సుభూతి ఇలాంటి ప్రశ్నను అడగడం. బుద్ధుడి సమాధానం కూడా మరింత వింతగానే ఉంటోంది. ఆయన అంటున్నాడు "అప్పటి మనుష్యులు, ఇరవైఅయిదు శతాబ్దాల తరువాత ఉన్న అప్పటి మనుష్యులు, మీకన్నా తక్కువ అదృష్టవంతులుగా ఉండరు, వాళ్ళు మీకంటే ఎక్కువ అదృష్టవంతులుగా ఉంటారు."

ఎందువల్ల? నేను ఎన్నోసార్లు మీతో చెప్తూనే ఉంటున్నాను, మీరే అత్యంత ప్రాచీనులని, మీరు ఈ భూమిమీద ఎన్నోసార్లు నడిచి ఉన్నవాళ్ళేనని, ఈ ధర్మాన్ని మొట్టమొదటిసారిగా వింటూ ఉన్నవాళ్ళు కారని, ఎందరో బుద్ధుళ్ళను కలుసుకుని ఉన్నవాళ్ళేనని - కొన్నిసార్లు శ్రీకృష్ణుడిని మీరు కలిసి ఉండవచ్చు, కొన్నిసార్లు

జీసస్‌క్రైస్ట్‌ను కలుసుకుని ఉండవచ్చు, కొన్నిసార్లు బహుశా మహావీరుణ్ణి కలిసి ఉండవచ్చు, అప్పుడప్పుడూ మహమ్మద్‌ను కలుసుకుని ఉండవచ్చు, కానీ మీరు ఎందరో బుద్ధుళ్ళను ఎన్నిసార్లో కలుసుకునే ఉన్నారు, ఎందరో సంప్రజ్ఞులను.

ఎంతోమంది బుద్ధుళ్ళను కలుసుకుని ఉన్న మీరు ఎంతో అదృష్టవంతులు, మరి మీరు కనుక కొంచెం చురుకుగా, ధ్యాసాత్మకంగా తయారైతే, ఎందరో బుద్ధుళ్ళు మీలో పాతిన విత్తనాలు అంకురించడం, తప్పకుండా ఆరంభం అవుతుంది. మీరు పుష్పించడాన్ని ప్రారంభించేస్తారు.

బుద్ధుడు అంటున్నాడు :

***బుద్ధజ్ఞానంతో తథాగతుడికి వాళ్ళందరు తెలుసు.***
***తథాగత బుద్ధనేత్ర ప్రజ్ఞతో ఆ బోధిసత్వులందరూ***
***సుభూతీ, పూర్ణజ్ఞానులే తథాగతుడికి.***

ఇది మహారహస్యంగా ఉంటోంది, కానీ ఇది సంభవసాధ్యమై ఉంటోంది. ఓ బుద్ధుడు భవిష్యత్ దర్శనాన్ని చెయ్యగలుగుతాడు. ఓ బుద్ధుడు భవిష్యత్తు పొగమంచు మబ్బుల్లోంచి చూడగలుగుతాడు. ఆయనకు అంతటి స్పష్టత ఉంటుంది, ఆయనకు అంతటి దర్శనం ఉంటుంది, ఆయనకు అగోచర భవిష్యత్తులోకి ఓ కాంతికిరణాన్ని ప్రసరింపజేసే సామర్థ్యం ఉంటుంది. ఆయన భవిష్యత్తును దర్శించగలుగుతాడు. ఈ వజ్రచ్ఛేదిక సూత్రాన్ని మీరు ఇప్పుడు వింటూ ఉండడాన్ని బుద్ధుడు దర్శిస్తూ ఉన్నాడు అన్న విషయం ఎంతో రహస్యంగానే కనిపిస్తుంది. మీ ఎరుక స్థితిలో ఇప్పుడు ఉంటున్న మీ జ్ఞాన దృక్పథంతో మీకు దాదాపుగా నమ్మశక్యం కాకుండా ఇది ఉంటుంది. ఎందుకంటే కనీసం ఈ వర్తమానాన్ని సైతం ఎలా చూడాలో మీకు తెలియకుండా ఉంటోంది కనుక. ఏ మనిషి అయినా భవిష్యత్తులోకి చూడగలుగుతాడంటే, ఎలా నమ్మగలుగుతారు?

మీకు కేవలం ఒకే ఒక్క సామర్థ్యం ఉంటోంది. అదే గతంలోకి చూసుకోగలిగే సామర్థ్యం. మీరు వెనక్కు చూసుకోవడంలో మాత్రమే సమర్థులు. మీరు గతంలోనే వేళ్ళూనుకుని ఉంటున్నారు. భవిష్యత్తు గురించిన మీ ఊహలు ఏవీ దర్శనాలు కావు. అవి కేవలం కొంచెం మార్పును చేసుకుని ఉన్న గత విషయాల ప్రసారాలై ఉంటాయి. మీ ఊహా ప్రసారాలు భవిష్యత్ దర్శనాలు కానే కావు. ఇప్పుడు ముందుకు పునఃప్రసారం, నిన్నటి గతమే రేపటి భవిష్యత్తుగా అవుతుంది. అది భవిష్యత్ దర్శనం కానే కాదు.

నిన్న మీరు ఏదో తిండి తినుంటారు. అది మహామధురంగా ఉంటుంది. ఆ రుచినే మళ్ళీ రేపటి రోజులో మీరు అనుభవించాలనుకుంటారు : ఇదే మీ భవిష్యత్తు. ఎవరినో మీరు ఇదివరకు ప్రేమించి ఉంటారు. భవిష్యత్తులో మళ్ళీ వాళ్ళను ప్రేమించాలనుకుంటారు. ఇదే మీ భవిష్యత్తు. మీ గతపు పునశ్చరణమే అది. అది భవిష్యత్తు కానే కాదు. భవిష్యత్తు అంటే ఏమిటో మీకు బొత్తిగా తెలియనే తెలియదు. భవిష్యత్తు అంటే ఏమిటో మీరు ఉందుకు తెలుసుకోలేకపోతున్నారంటే, వర్తమానం అంటే ఏమిటో కూడా కనీసం మీరు తెలుసుకోలేకపోతున్నారు కాబట్టే. కానీ ఇప్పుడు ప్రస్తుత వర్తమానం ఉంటోంది. కానీ మీలో ఎంతో అంధత్వం ఉంటూ ఇప్పటికే ఇక్కడ సంసిద్ధమై ఏది ఉంటోందో దాన్ని మీరు చూడలేకపోతూనే ఉన్నారు.

కానీ అప్పుడు, కళ్ళు తెరచుకుని, ఇక్కడ ఇప్పుడు ఈ వర్తమానంలో, ఏది లేదో, దాని లోపలికి కూడా, ఏది జరగబోతూ ఉందో కూడా, మీరు చూడగలుగుతారు. మీరు ఓ క్షణమాత్ర వీక్షణాన్ని పొందవచ్చు. భవిష్యత్తును దర్శించే మార్గం ముందుగా ఈ ప్రస్తుతాన్ని చూడగలగడమే. పరిపూర్ణంగా ఈ వర్తమాన క్షణంలో ఉండగలుగుతున్న మనిషికి భవిష్యత్తును దర్శించే సామర్థ్యం కూడా కలుగుతుంది.

ఈ వజ్రచ్ఛేదికా సూత్రాన్ని ఇప్పుడు వింటున్న మిమ్మల్ని బుద్ధుడు చూస్తూ ఉన్నాడు అన్న విషయాన్ని ఆలోచించడం సైతం బ్రహ్మానంద పారవశ్యాన్ని అనుభవిస్తున్నట్లుగా ఉంటుంది. ఈ వజ్రచ్ఛేదికా సూత్రంలో మీ గురించే చెప్పబడింది. అందువల్లనే నేను దీన్ని బోధించడానికి ఎంచుకున్నాను. ఈ సూత్ర వాక్యాలను నేను చదువుతున్నప్పుడు నేను అనుకున్నాను "ఈ విషయం నా మనుష్యులకోసమే. గౌతమబుద్ధుడు ఈ సన్యాసులను కూడా అప్పుడు చూశాడన్న విషయ విశేషాన్ని వాళ్ళు కూడా తప్పకుండా తెలుసుకోవాలి. ఈ సన్యాసుల గురించి ఏదో ఒక మాట ఇరవైఅయిదు శతాబ్దాలకు మునుపే నిజంగా వినిపించిందన్న, జ్యోస్యం చెప్పబడిందన్న అద్భుత విషయాన్ని ఆ సన్యాసులకు తప్పకుండా నేను చెప్పే తీరాలి."

బుద్ధుడు తిప్పిన ధర్మచక్రం ఆగిపోయింది. ఆ చక్రాన్ని మళ్ళీ తిప్పాల్సి ఉంది. అదే నా, మీ అందరి, జీవితకార్యం – ఆ ధర్మచక్రం మళ్ళీ తిరగాలి. ఆ చక్రం తిరగడం ఒక్కసారి ప్రారంభమైతే దానికి మళ్ళీ ఇరవైఅయిదు శతాబ్దాల జీవితం ఉంటుంది. ఆ చక్రభ్రమణం మళ్ళీ ప్రారంభమైతే అది కనీసం ఇరవైఅయిదు శతాబ్దాల పర్యంతం తిరుగుతూనే ఉంటుంది.

మరి ఈ ధర్మచక్ర పరిభ్రమణాన్ని ప్రారంభించే పని మళ్ళీ, మళ్ళీ, మళ్ళీ, జరగాలి. ఎందుకంటే ప్రతి విషయమూ వేగాన్ని కోల్పోతూనే ఉంటుంది కాబట్టి. అన్ని విషయాలూ ప్రకృతి న్యాయంతోనే పనిచేస్తాయి – కార్యవేగం శక్తి వినిమయానికి తగ్గట్టుగానే ఉంటుంది – ఎన్ట్రోపీ. మీరు ఓ రాయిని విసురుతారు. ఎంతో శక్తితో ఓ రాయిని మీరు విసురుతారు; కానీ ఆ రాయి కొన్నివందల అడుగుల దూరం పోయిన తరువాత క్రిందికి పడిపోతుంది. సరిగ్గా అదేవిధంగా, ధర్మాన్ని కూడా మనం మళ్ళీ మళ్ళీ పునర్జీవింపజేస్తూ ఉండాలి. అప్పుడు ఆ ధర్మం ఇరవైఅయిదువందల సంవత్సరాల ఊపిరి పోసుకుని జీవిస్తుంది, ఆ తరువాత మళ్ళీ మరణిస్తుంది. జన్మించినవన్నీ మరణించే తీరాలి.

కానీ బుద్ధుడు అంటున్నాడు “సుభూతీ, ఆ విధంగా మాట్లాడకు” అని. సుభూతి తప్పకుండా అప్పుడు ఆలోచిస్తూ ఉండే ఉంటాడు ఈ విధంగా “మేము మాత్రమే అదృష్టవంతులం. బుద్ధుడి మాటలను వింటూ ఉన్నాం. బుద్ధుడితోపాటే జీవిస్తూ ఉన్నాం. ఆయనతోపాటే నడుస్తూ ఉన్నాం. ఎంత అదృష్టవంతులమో మేము, ఆశీర్వదింపబడిన వాళ్ళం. ఇరవైఅయిదు శతాబ్దాల తరువాత ధర్మచక్ర పరిభ్రమణం ఆగిపోయినప్పుడు ఏం జరుగుతుందో?” సుభూతి దురదృష్టవంతులైన మీ గురించే ఆలోచిస్తూ ఉన్నాడు.

బుద్ధుడు అంటున్నాడు “అలా మాట్లాడకు సుభూతీ. మీరు మాత్రమే అదృష్టవంతులని అనుకోకండి”. అది ఓ మహాసూక్ష్మ అహంకారం, “మేమే అదృష్టవంతులం. ఇంకెవ్వరికీ అంత అదృష్టం లేదు” తక్షణం తన చేత్తో బుద్ధుడు సుభూతి నోరు మూసేస్తాడు.

> ***ఆ విధంగా మాట్లాడకు, సుభూతీ! నిజమే, అప్పుడు కూడా ఉంటారు జీవులు, ఈ సూత్రంలోని పదాలు వాళ్ళకు బోధింపబడితే, ఆ సూత్ర సత్యాన్ని అర్థం చేసుకోగలుగుతారు వాళ్ళు.***

మరి నాకు తెలుసు. ఇక్కడ ఆ సత్యాన్ని అర్థం చేసుకున్నవాళ్ళు ఉన్నారు. ఉదయం నెమ్మది నెమ్మదిగా ఏర్పడుతూ ఉంది. రాత్రి చీకటి అదృశ్యం అయిపోతూ ఉంది. క్రమక్రమంగా విత్తనం మీ హృదయక్షేత్రంలోకి చేరుకుంటూ ఉంది. మీ హృదయంలో అది మెల్లగా నాటుకుంటూ ఉంది.

> ***అంతటి సమయంలో కూడా, సుభూతీ, ఉంటారు బోధిసత్వాళ్ళు...***

ఇక్కడ బోధిసత్వుడు కాబోయేవాళ్ళు ఎంతోమంది ఉన్నారు. ఇంకా కొంచెం ఎక్కువ పని చేస్తే, కొంచెం ఎక్కువ ఆడుకుంటూ ఉంటే, కొంచెం ఎక్కువగా ధ్యానప్రయత్నాన్ని చేస్తే, కొంచెం ఎక్కువ శక్తిని ధారపోస్తే, కొంచెం ఎక్కువ ఏకాగ్రతను శక్తితో తెచ్చుకుంటే, కొంచెం ధ్యాస మళ్ళించే విషయాలవైపు వెళ్ళడం తగ్గిస్తే, అది తప్పకుండా సాధ్యం అవుతుంది. మరి అది ఇక్కడ ఎందరికో సాధ్యం కాబోతూ ఉంది. మరి మీరే ఆ అదృష్టవంతులు. బుద్ధుడు అంటున్నాడు

**ఆ బోధిసత్వులు, ఉండరు సుభూతీ ఒక్క బుద్ధుణ్ణే గౌరవిస్తూ, పూజిస్తూ,**
**ఏ ఒక్క బుద్ధుడిలోనో వేళ్ళు పాతుకుని వాళ్ళుండరు.**
**తద్వ్యతిరేకంగా, సుభూతీ, ఉంటారు ఆ బోధిసత్వులు,**
**వాళ్ళకు, ఈ సూత్ర ప్రవచనాలు బోధింపబడి వినిపించినప్పుడు,**
**కనీసం ఓ అతిపవిత్ర, అతినిర్మల ఆలోచనను అయినా**
**అర్థం చేసుకుని గ్రహించగలిగిన ఆ బోధిసత్వుళ్ళు**

ఈ వజ్రచ్ఛేదికా సూత్రంలోని ఒక్క పదాన్ని అయినా మీరు అర్థం చేసుకోగలిగితే, మీ కళ్ళలోకి నేను చూస్తున్న ఒక్క చూపునైనా మీరు అర్థం చేసుకోగలిగితే, నా అంతరంలో జరిగే నాట్యంలో ఓ భంగిమనైనా మీరు అర్థంచేసుకోగలిగితే.....

బుద్ధుడు అంటున్నాడు :

**...ఆ బోధిసత్వుళ్ళు కొన్నిలక్షల బుద్ధుళ్ళను గౌరవించి పూజించినవాళ్ళు**
**అవుతూ, తమ అశేష పుణ్యఫల ప్రాప్తాన్ని కొన్ని లక్షల బుద్ధుళ్ళకు**
**సమర్పించుకున్న వాళ్ళు కూడా అయివుంటారు.**
**బుద్ధజ్ఞానంతో తథాగతుడికి వాళ్ళందరు తెలుసు. తథాగత**
**బుద్ధనేత్ర ప్రజ్ఞతో ఆ బోధిసత్వులందరూ సుభూతీ, పూర్ణజ్ఞానులే**
**తథాగతుడికి. వాళ్ళందరూ సుభూతీ, ఆర్జించుకుంటారు,**
**ప్రాప్తించుకుంటారు లెక్కపెట్టలేనంత మహాపుణ్యఫలరాశిని.**

మరి మీ గురించే బుద్ధుడు మాట్లాడుతూ ఉన్నాడు. మీ మీదే నేను కూడా ఆధారపడి ఉంటున్నాను. ధర్మచక్రం ఇప్పుడు ఆగిపోయి ఉంది. దాన్ని మళ్ళీ తిప్పించాలి.

ఈ రోజుకు ఇది చాలు.

# 4. అతీతం లోంచి

## మొదటిప్రశ్న :

*ప్రియ ఓషో,*

**ఏం తప్పు జరుగుతోంది?**

**ఏదైనా కొత్తను మనుష్యులు అయిష్టంగా, భయపడుతూ ఎందుకు స్వీకరిస్తూ ఉంటారు?**

**కుతూహలంతో, ఉత్సాహంతో, ఆనందంగా ఎందుకు స్వీకరించరు?**

కొత్తదనం మీలోంచి రాదు, అతీతం లోంచి వస్తుంది. కొత్తదనం మీలో ఓ భాగం కాదు. మీ గతం అంతా మీ మీద పెట్టుబడి పెట్టబడి ఉంటుంది. నవ్యతకు మీతో ఏ సంబంధమూ లేదు. అది మిమ్మల్ని అనుసరించి ఉండదు. అందువల్లే మీకు అది అంటే భయం. మీరు ఒక పద్ధతిలో జీవిస్తూ ఉంటారు. మీరు ఒక పద్ధతిలో ఆలోచిస్తూ ఉంటారు. మీ నమ్మకాల వ్యవస్థకు తగినట్లు ఓ జీవనశైలిని అలవరచుకుని సౌకర్యవంతమైన పద్ధతితో జీవిస్తూ ఉంటారు. అప్పుడు ఏ నవ్యతో వచ్చి మీ తలుపు తడుతుంది. అది వచ్చిందంటే మీ గతపు సర్దుబాట్లు అన్నీ అస్తవ్యస్తం అయిపోతాయి. ఆ కొత్తదనాన్ని మీరు ఆహ్వానించారంటే మీరు ఇదివరకు ఉన్నట్లు ఉండరు. మిమ్మల్ని నవ్యత పరివర్తించేస్తుంది.

అది మీకు సంకటప్రాయంగా ఉంటుంది. దాన్ని స్వీకరిస్తే మీరు ఏమైపోతారో ఎక్కడికి వెళ్ళిపోతారో మీకే తెలీకుండా ఉంటుంది. పాత విషయాలన్నీ మీకు చక్కగా తెలుసు, మీకు గతంతో ఎంతో పరిచయమే ఉంటోంది. దానితోనే కలిసి ఎంతోకాలం నుండీ మీరు సహజీవనం చేస్తూ ఉన్నారు. మీలో దాని అనుభవజ్ఞానం ఉంది. కొత్తది అపరిచితంగా ఉంటుంది. అది స్నేహితుడిగా ఉండవచ్చు. అది శత్రువుగా ఉండవచ్చు. ఎవరికి తెలుసు? తెలుసుకునే ఏ దారీ ఉండదు కూడా. అదేమిటో తెలుసుకోవాలంటే దాన్ని స్వీకరించక తప్పదు. అందువల్లే ఈ సందిగ్ధత, భయాలు.

మీరు దాన్ని తిరస్కరిస్తూ కూడా ఉండలేరు. ఎందుకంటే ఆ గతం వల్ల మీరు ఆశించిన దాన్ని పొందలేక ఉంటున్నారు కనుక. గతం మీరు వాంఛితాన్ని పొందుతారని కేవలం ప్రమాణాలను మాత్రమే, వాగ్దానాలను మాత్రమే చేస్తూ ఉంటుంది. కానీ అవి ఏవీ ఇప్పటికీ మీకు ప్రాప్తించలేదు. గతం తెలిసే ఉన్నా కానీ దైన్యాలలోనే ఉంటున్నాం. ఈ నవ్యత సౌకర్యంగా ఉండకపోవచ్చు. కానీ అందులో ఓ సంభావ్యత ఉండవచ్చు – అది మీకు బ్రహ్మానంద పారవశ్యాన్నే తీసుకురావచ్చు. కాబట్టి దాన్ని మీరు తిరస్కరించలేరు, కానీ స్వీకరించనూ లేరు కూడా. అందువల్లే మీరు అటూ ఇటూ ఊగుతూ ఉంటారు. వణుకుతూ ఉంటారు, ఎంతో వ్యథ మీ జీవుడిలో రేగుతుంది. అది సహజమే. ఏ పొరబాటూ జరగలేదు. ఇది ఎప్పుడూ ఇలాగే ఉంటోంది. ఇది ఎప్పటికీ ఇలాగే ఉండిపోతుంది.

కనిపిస్తున్న కొత్తదనపు స్వరూపాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించండి. ప్రపంచంలోని ప్రతి మనిషీ నవ్యతతో ఉండాలనే అనుకుంటాడు. ఎందుకంటే పాతదనంతో తృప్తిపడి ఎవ్వరూ ఉండడం లేదు కాబట్టే. ఎవ్వరూ తమ గతంతో తృప్తిపడిపోయి ఉండడం లేదు. ఎందుకంటే అది ఎంతటిది అయినా దాని గురించి మనకు అది అంతా తెలిసిపోయి ఉంటున్న విషయమే కాబట్టి. ఒక్కసారి తెలిసివున్న విషయమే మళ్ళీ జరిగితే అది కేవలం పునశ్చరణ మాత్రమే అవుతుంది. తెలిసిపోయి ఉన్న విషయం మళ్ళీ ఎదురైతే మనకు విసుగుగానే ఉంటుంది. చేసిందే చేసినట్లు, ఎప్పటికీ అది పూర్తికాదేమో అన్నట్లు ఉంటుంది. దాన్ని వదిలించుకోవాలన్న ప్రయత్నాన్నే మీరు చేస్తూ ఉంటారు. దేన్నయినా అన్వేషించాలని మీరు అనుకుంటారు. మీకు ఓ సాహసకృత్యం కావాలి. మీకు ఓ నవ్యత కావాలి, అయినా ఆ కొత్తదనం మీ దగ్గరికి వచ్చి మీ ఇంటి తలుపు తట్టినా మీరు మీ లోపలికి ముడుచుకుపోతూనే ఉంటారు, మిమ్మల్ని మీరు వెనక్కు లాగేసుకుంటారు, గతంలోకి వెళ్ళి దాక్కోవాలని ప్రయత్నిస్తారు. ఇదే తెగని సమస్య.

నవ్యత మనకు ఎలా వస్తుంది? – ప్రతి ఒక్కరికీ నవ్యత కావాలి. ధైర్యం ఉండాలి అప్పుడు. మామూలు ధైర్యం కాదు. అసాధారణ మహాధైర్యం. మరి ఈ ప్రపంచంలో పిరికిపందలే నిండి ఉన్నారు. అందువల్లే మనుష్యుల్లో ఎదుగుదల ఆగిపోయి ఉంది. పిరికిపందగా ఉంటూ భయపడుతూ ఉంటే మీకు ఎదుగుదల ఎలా సాధ్యమవుతుంది? వస్తున్న ప్రతి అవకాశాన్నీ ముడుచుకుపోతూ మీరు వదిలిపెట్టేసుకుంటూనే ఉన్నారు. మీ కళ్ళను మూసేసుకుంటున్నారు. మీరు ఎలా

ఎదగగలుగుతారు? మీరు ఎలా ఉండగలుగుతారు? మీరు ఉంటున్నట్లు కేవలం నటిస్తూ మాత్రమే ఉంటారు.

నిజంగా మీరు ఎదగడం లేదు కాబట్టి మరేదో ప్రత్యామ్నాయపు ఎదుగుదలను మీరు వెతుక్కోవలసి వస్తుంది. మీరు ఎదగలేరు కాబట్టి మీ బ్యాంకు పొదుపు ఖాతాలో సొమ్మును పెంచుకోవచ్చు. అది ఒక ప్రత్యామ్నాయపు ఎదిగేమార్గం. దానికి ధైర్యం అక్కరలేదు. మీ పిరికితనానికి సరిగ్గా అది సరిపోతుంది. మీ సొమ్ము బ్యాంకులో ఎదుగుతూ ఉంటుంది. దాన్ని చూస్తూ మీరే ఎదుగుతున్నట్లు మీరు అనుకుంటూ ఉంటారు. మీకు గౌరవమర్యాదలు కలుగుతాయి. మీ పేరూ, ఖ్యాతీ పెరుగుతూ ఉంటాయి, అప్పుడు మీరు పెరుగుతున్నారు అనుకుంటారా? మిమ్మల్ని మీరే మోసం చేసుకుంటూ ఉంటారు. మీ పేరు మీరు కాదు. మీ ఖ్యాతి కూడా మీరు కారు. బ్యాంకులో ఉన్న మీ సొమ్ము మీ జీవుడు కాదు. మీ జీవుణ్ణి గురించి ఆలోచించి చూడండి. మీరు వణికిపోవడం ప్రారంభమైపోతుంది. ఎందుకంటే మీరు ఎదగాలంటే మీ పిరికితనాన్ని మీరు వదిలిపెట్టెయ్యాల్సి వస్తుంది కాబట్టి.

మీరు కొత్తగా ఎలా తయారవుతారు? మనంతట మనమే కొత్తగా అయిపోము. అతీతంలోంచే నవ్యత్వం వస్తుంది, దేవుడి దగ్గర్నుంచి వస్తుంది అనుకుందాం. నవ్యత్వం సర్వస్వంలోంచి వస్తుంది. సృష్టిలోంచి. ఉనికిలోంచి. మనస్సు ఎప్పటికీ పాతదిగా ఉంటుంది. మనస్సు ఎప్పుడూ కొత్తగా ఉండదు. మనస్సు గతాల కుప్పగా ఉంటుంది. నవ్యత్వం అతీతంలోంచి వస్తుంది. అది దైవం నుంచి అందుతున్న ఓ కానుక. అది అతీతానికే సంబంధించినది. అది అతీతంలోంచే వస్తుంది.

అజ్ఞాతమూ, అజ్ఞేయమూ, అతీతమూ మీలోకి ఎప్పుడూ ప్రవేశిస్తూనే ఉంటాయి. అవి ఎప్పటికీ మీ లోపలికి ప్రవేశిస్తూనే ఎందుకు ఉంటాయి అంటే మీరు మూసుకుపోయి ఉండడం లేదు కాబట్టే, అన్యంగా ఉండడం లేదు కాబట్టే. మీరు ఓ ద్వీపంలాగా ఉండరు. మీరు అతీతాన్ని మరచిపోయి ఉండవచ్చు కానీ ఆ అతీతం మిమ్మల్ని ఎప్పటికీ మరచిపోదు. ఓ పసిపాప తన తల్లిని మరచిపోవచ్చు కానీ ఆ తల్లి తన పాపను ఎప్పటికీ మరచిపోదు. ఓ అంశాన్ని ఆలోచించడం మొదలుపెట్టవచ్చు "నేను ప్రత్యేకంగా ఉన్నాను" అని. కానీ సర్వస్వానికి తెలుసు మీరు విభిన్నంగా, ప్రత్యేకంగా, అన్యంగా లేరని. సర్వస్వం ఎప్పటికీ మీలోకి ప్రవేశిస్తూనే ఉంటుంది. మీతో దానికి ఓ సంబంధం ఎప్పటికీ ఉంటుంది. అది మీతో ఎప్పుడూ కలిసే ఉంటుంది. అందువల్లే మీలోకి ఓ నవ్యత వస్తూనే ఉంటుంది మీరు స్వీకరిస్తున్నా, తిరస్కరిస్తున్నా, ఆహ్వానిస్తూ ఉన్నా, ఆహ్వానించకపోతున్నా ప్రతి ఉదయమూ, ప్రతి

సాయంత్రమూ అది వస్తుంది. మీలోకి వెయ్యిన్నొక్క విధాల్లో అది వస్తుంది. చూసే కళ్ళు మీకు ఉంటే అది ఎప్పుడూ మీలోకి వస్తూ ఉండడాన్ని చూడగలుగుతారు.

ఉనికి మీ మీద ఎప్పుడూ వర్షిస్తూనే ఉంటుంది. కానీ మీరు మీ గతంలో ఇరుక్కుపోయి ఉంటారు. మీరు దాదాపుగా ఓ విధమైన సమాధి లోపలే ఉంటారు. మీరు అసున్నితంగా తయారైపోయి ఉన్నారు. మీ పిరికితనం వల్లనే మీ సున్నితత్వాన్ని మీరు పోగొట్టుకుని ఉంటున్నారు. సున్నితంగా ఉండడం అంటే నవ్యతను గుర్తించగలగడమే. అనుభూతితో తెలుసుకోగలగడమే – మీరు నవ్యతలో ఉన్న పులకరింతను తెలుసుకోవాలి. నవ్యతలో ఉన్న ఆవేశాన్ని. అప్పుడు మీ సాహసం పెరిగి మొదలవుతుంది అజ్ఞాతంలోకి మీ ప్రవాసం, ఎక్కడికి మీరు వెళ్తున్నారో మీకే తెలియకుండా.

మనస్సు దాన్ని ఒక పిచ్చిగా అనుకుంటుంది. మనస్సు పాతను వదిలిపెట్టెయ్యడం తార్కికంగా ఉండడం లేదని అనుకుంటుంది. కానీ దివ్యత్వం ఎప్పటికీ కొత్తగా ఉంటుంది. అందువల్లే దేవుడి గురించి చెప్తున్నప్పుడు భూతకాలాన్నీ, భవిష్యత్ కాలన్నీ సూచించే మాటలను చెప్పం. మనం "దేవుడు ఉండేవాడు" అని చెప్పం. మనం "దేవుడు ఉంటాడు" అని చెప్పలేం. మనం దేవుణ్ణి వర్తమానంలోనే చెప్పుకోవాల్సి వస్తుంది. మనం "దేవుడు ఉన్నాడు" అనే చెప్పాలి. ఆ దేవుడు ఎప్పటికీ తాజాగా, పవిత్రంగా ఉంటాడు. ఆ దివ్యత్వం మీలో ఎప్పటికీ ప్రవేశిస్తూనే ఉంటుంది.

గుర్తుంచుకోండి. మీ జీవితంలోకి వస్తున్నవన్నీ దివ్యత్వం నుండి వస్తున్న సందేశాలే. మీరు దాన్ని స్వీకరిస్తూ ఉంటే మీరు మతంలో ఉంటారు. మీరు దాన్ని తిరస్కరిస్తే మీరు మతంలేని మనిషిగా ఉంటారు. మనిషి కొంచెం విశ్రమించి సౌఖ్యంగా ఉండాలి, కొంచెం విచ్చుకుని ఉండాలి, మీలోకి నవ్యత్వం ప్రవేశించేందుకు. మీలోకి దివ్యత్వం ప్రసరించేందుకోసం మీ తలుపుల్ని మీరు తెరచే ఉంచుకోవాలి.

ప్రార్థనకూ, ధ్యానానికీ ఉన్న మొత్తం అర్థం ఇదే – మిమ్మల్ని మీరే తెరచేసుకుని ఉంటారు. రమ్మంటారు. "రండి లోపలికి" అంటారు. మీరు అంటారు "నేను మీ కోసమే ఎదురుచూస్తూ ఉన్నాను. నేను మీకోసం నిరీక్షిస్తూనే ఉంటున్నాను. మీరు వచ్చినందుకు నా కృతజ్ఞతలు. రండి". మీరు ఎప్పుడూ నవ్యత్వాన్ని ఎంతో ఆనందంగా స్వీకరించాలి. ఆ నవ్యత వల్ల మీకు అప్పుడప్పుడూ ఇబ్బందీ, అసౌకర్యమూ కలిగినా, అది ఆ లోటును తీరుస్తూ ఉంటుంది, విలువైనదిగానే. ఆ నవ్యత వల్ల అప్పుడప్పుడూ మీరు గుంటల్లోకి పడిపోవడం జరిగినా, మీకు మేలే కలుగుతుంది. ఎందుకంటే

మనం తప్పులు చేస్తూ, దిద్దుకుంటూ నేర్చుకుంటాం కాబట్టి. కష్టపడినప్పుడే మన ఎదుగుదల సంభవిస్తుంది. నవ్యత కష్టాలనే వెంటబెట్టుకొస్తుంది. అందువల్లే మీరు పాతదాన్నే ఎంచుకుంటూ ఉంటారు, స్వీకరిస్తూ ఉంటారు – అది ఏ కష్టాలనూ పట్టుకురాదు కాబట్టి. అది ఓ కంటితుడుపుగా, ఓ ఓదార్పుగా ఉంటుంది. అది మీకు ఓ ఆశ్రయంగా ఉంటుంది.

కేవలం నవ్యత్వాన్ని మాత్రమే, ప్రగాఢంగా, సంపూర్ణంగా స్వీకరించినప్పుడే, అది మిమ్మల్ని పరివర్తింపగలుగుతుంది. మరే ఇతర పరివర్తించే మార్గాలు లేవు. కానీ గుర్తుపెట్టుకోండి, మీతో, మీ ప్రయత్నాలతో ఆ నవ్యతకు ఏ సంబంధమూ లేదు. కానీ ఏమీ చెయ్యకుండా ఉండడం అంటే చేస్తున్న పనులన్నిటినీ మానేసెయ్యమని కాదు. నవ్యత్వం కోసం చేసే అన్వేషణ ఓ సాధారణ అన్వేషణగా ఉండకూడదు, అది ఓ నవ్యత్వం కోసం చేస్తున్న అన్వేషణ కాబట్టి. ఆ నవ్యత్వాన్ని మీరు ఎలా అన్వేషించగలుగుతారు? మీకు దాన్ని గురించి తెలియదు. మీరు దాన్ని ఎప్పుడూ కలుసుకోలేదు. నవ్యత్వం కోసం చేసే అన్వేషణ మహాతెరుచుకుని చేస్తున్న ప్రయత్నమే అయి ఉండితీరుతుంది. మనిషికి ఏమీ తెలీదు. పూర్తి అజ్ఞాన స్థితిలో నుంచే మనిషి ఆ అన్వేషణను ప్రారంభించాల్సి వస్తుంది. ఓ చిన్నపిల్లవాడిలాగా మహాఅమాయకంగా ఆ దారిలో నడవాల్సి వస్తుంది. పులకరింతలకూ, సంభ్రమాశ్చర్యాలకూ లోనయ్యే సంభవాలను ఎదుర్కొంటూ – అక్కడ ఆ అవకాశాలు అనంతంగా ఉంటాయి.

నవ్వత్వాన్ని సృష్టించడానికోసం మీరు ఏమీ చెయ్యలేరు. ఎందుకంటే మీరు ఏం చేస్తూ ఉన్నా అవన్నీ మీ గతపు అనుభవాలకు అనుగుణ్యంగానే జరుగుతూ ఉంటాయి కాబట్టి. ఇప్పటి మీ పనులన్నీ ఆ మీ గతంలోంచే వస్తాయి. దీనికి అర్థం మీరు ఏ పనులనూ చెయ్యకూడదని కాదు. అన్ని పనుల్నీ ఆపేసెయ్యాలని కాదు. మీ ఇచ్ఛాశక్తితో పనిచెయ్యకూడదనే, మీరు కోరుకుంటున్న దిశలో చరించకూడదనే, గతానుభవ ప్రేరితాలైన పనులను చెయ్యకూడదనే – అప్పుడు మీరు ధ్యానాత్మకంగానే పనిచెయ్యాల్సి వస్తుంది. సద్యఃప్రేరిత ప్రతిస్పందనల కార్యాలే చెయ్యాల్సి వస్తుంది. మీ కార్యాలను ఈ వర్తమాన క్షణమే నిర్దేశించాలి.

మీ నిర్ణయాలతో ఆ కార్యాలను మీరు శాసించుకుంటూ చెయ్యకూడదు. ఎందుకంటే ఆ నిర్ణయాలన్నీ మీ గతానుభవ ప్రేరితాలు అయివుంటాయి కాబట్టి, అవి నవ్యత్వాన్ని ధ్వంసం చేస్తాయి కాబట్టి. మీ కార్యాలు ఓ పసిపాప ప్రతిస్పందిస్తున్నట్లు చెయ్యాలి. ఈ క్షణంలో మిమ్మల్ని మీరు పూర్తిగా వదిలిపెట్టేసుకున్నవాళ్ళు అయిపోయి ఉండాలి – అప్పుడు ప్రతిరోజూ ఎన్నో కొత్తలు మీకోసం తెరుచుకుంటూ ఎదురవుతూ

ఉంటాయి. ఎన్నో కొత్త ప్రవేశాలు మీకు లభిస్తూ ఉంటాయి. కొత్త వెలుగు మిమ్మల్ని సమీపిస్తూ ఉంటుంది. మీ అంతర్‌దృష్టి పెరుగుతూ ఉంటుంది. అందువల్ల హఠాత్తుగా మీలో ఓ అనుక్షణ నిత్యత్వం సంభవిస్తూ ఉంటుందని మీరు తెలుసుకుంటారు. మీ గతం అప్పుడు మీ ముందు వ్రేలాడుతూ ఉండదు, తారట్లాడుతూ ఉండదు. మీ గతం అప్పుడు ఓ మబ్బులాగా మీ ముందు ఉండదు. అప్పుడు మీరు ఓ హిమబిందువులాగా ఉంటారు. అత్యంత తాజాగా, పడుచువాళ్ళుగా.

గుర్తుంచుకోండి. బుద్ధుడు ఎప్పుడూ క్షణక్షణ నిత్యత్వంతో జీవిస్తూ ఉంటాడు. అది సముద్రంలో ఓ కెరటం లేచినట్లు ఉంటుంది, ఓ అద్భుత కెరటంలా. ఎంతో సంతోషంతో నర్తిస్తూ ఆ కెరటం పైకి లేస్తుంది, ఎన్నో ఆశలతో, స్వప్నాలతో, తారలను అందుకోవాలన్నంత ఉత్సాహంతో. ఓ క్షణంపాటు ఆ ఆట జరుగుతుంది. ఆ తరువాత ఆ కెరటం అదృశ్యం అయిపోతుంది. మళ్ళీ మరో కెరటం ఉప్పొంగుతూ వస్తుంది, దానికి ఓ కొత్తరోజు వచ్చి ఉంటుంది. మళ్ళీ ఓ నాట్యాన్ని చేసి మళ్ళీ అది అదృశ్యం అయిపోతుంది. దివ్యత్వం కూడా సరిగ్గా ఇలాగే ఉంటుంది... వస్తూ ఉంటుంది, మాయమైపోతూ ఉంటుంది. మళ్ళీ వస్తుంది, మళ్ళీ మాయం. సరిగ్గా ఈ విధంగానే బుద్ధ–చైతన్యం కూడా ఉంటుంది. అనుక్షణం అది పైకి వస్తుంది. కార్యాన్ని చేస్తుంది, ప్రతిస్పందిస్తుంది, మళ్ళీ వెళ్ళిపోతుంది. మళ్ళీ లేచి మళ్ళీ పోతూ ఉంటుంది. అది పరమాణువులాగా ఉంటుంది.

రెండు క్షణాల మధ్య ఓ వ్యవధి ఉంటుంది; ఆ వ్యవధిలో బుద్ధుడు అదృశ్యం అయిపోతాడు. నేను ఓ పదాన్ని అంటాను, తరువాత మాయమైపోతాను. మళ్ళీ ఇంకో పదాన్ని అంటున్నప్పుడు అక్కడ నేను ఉంటాను, మళ్ళీ మాయం అయిపోతాను. మీతో ప్రతిస్పందించగానే మరి నేను ఉండను. మళ్ళీ ఇంకో ప్రతిస్పందన – ఆ తర్వాత మళ్ళీ నేను ఉండను. ఆ వ్యవధుల విరామాలు, ఆ శూన్యత మనిషిని అత్యంత తాజాగా చేస్తుంది. ఎందుకంటే మృత్యువు మాత్రమే మిమ్మల్ని మహాసజీవంగా ఉంచగలుగుతుంది కాబట్టి.

మీరు డెబ్బైఏళ్ళకు ఒక్కసారి మరణిస్తూ ఉంటారు. సహజంగానే, డెబ్బైఏళ్ళ చెత్తను మీరు పోగు చేసుకుంటారు. ఓ బుద్ధుడు ప్రతిక్షణంలోనూ మరణిస్తూ ఉంటాడు – ఆయనలో ఏ చెత్తా ఉండదు. ఏదీ పోగు కాదు. అందువల్లే బుద్ధుడు ఒకసారి అన్నాడు ఏ సంజ్ఞలనో ఆర్జించుకుని ఉంటే అది మోసమేనని. ఎందుకంటే ఆర్జితాలన్నీ గతాలవే కాబట్టి. ఏ లక్షణాలూ ఉండకపోవడమే బుద్ధత్వం.

కేవలం దీన్ని గురించి ఆలోచించండి చాలు – ప్రతిక్షణమూ లేస్తూ ఉంటుంది, ఓ శ్వాసలాగా. దాన్ని మీరు లోపలికి తీసుకుంటారు, బయటకు వదిలేస్తారు.

మళ్ళీ మీరు ఉచ్ఛ్వసిస్తారు, మళ్ళీ మీరు నిశ్వసిస్తారు, ప్రతి ఉచ్ఛ్వాసంలో లోపలికి వస్తూ ఉన్నది జీవితం, ప్రతి నిశ్వాసంలోనూ బయటికి వెళ్ళిపోతూ ఉన్నది మృత్యువు. ప్రతి ఉచ్ఛ్వాసంలో మీరు జీవిస్తూ ఉంటారు, ప్రతి నిశ్వాసంలో మీరు మరణిస్తూ ఉంటారు. ప్రతిక్షణంలో జన్మిస్తూ, మరణిస్తూ ఉండండి. అప్పుడు మీరు కొత్తగా ఉంటారు.

కానీ ఈ కొత్తకు మీ గతంతో, మీ ఇచ్ఛాశక్తితో, మీ దిశతో, మీ ప్రేరితాలతో ఏ సంబంధమూ ఉండదు. అది ప్రతిస్పందిత కార్యాలతో ఉంటుంది. అవి ప్రతిచర్యలుగా ఉండక ప్రతిస్పందనలుగానే ఉంటాయి. గతంలోని ప్రేరణల వల్ల జరిగే కార్యాలన్నీ పాతవే. కాబట్టి స్వంతంగా తనంతట తానుగా మనిషి ఏ కొత్త పనుల్నీ చెయ్యలేడు. దీన్ని మీరు దర్శించగలిగితే మీరు గతాన్ని వదిలిపెట్టేసిన వాళ్ళై ఉంటూ, మీరు మీతోనే ఉంటారు. మనం చెయ్యగలిగిందంతా ఇంతే. కానీ అదే సర్వస్వం. అదే అంతా. పాత ముగిసిపోయిన తరువాత కొత్తదాన్ని అనుసరించవచ్చు, అనుసరించకపోనూవచ్చు. ఏం జరిగినా ఫర్వాలేదు. నవ్యతను వాంఛించడం కూడా అప్పుడు పాత వాంఛే. అప్పుడు మనిషి అత్యంత తెరచుకుని ఉంటాడు. కొత్తదనాన్ని ఆశించడం కూడా అప్పుడు పాత కోరికే.

ఓ బుద్ధుడు కనీసం ఓ నవ్యతను కూడా ఆశించడు. ఆయనకు దేనికోసం కోరికలూ ఉండవు – " ఇది ఇలా ఉండాలి" వంటివి కూడా. ఓ కోరిక మీలో ఉంటే, అప్పుడు మీ నిర్వహణ ఆ విధంగా ఉంటుంది. ఆ విధంగా పని జరిగేటట్లు మీరు చూస్తారు. జీవితాన్ని ఏ కోరికలనో పెట్టుకుని చూడకండి. ఏ నియమాలనూ ఉంచుకోకుండా జీవితాన్ని చూడండి. ఉన్నదున్నట్లుగా జీవితాన్ని చూడండి – యధాభూతం – అప్పుడు మీరు నిరంతర నిత్యతతో, పునరుజ్జీవాన్ని పొందుతూ ఉంటారు.

ఇదే పునరుజ్జీవనానికి నిజం అర్థం. దీన్ని మీరు అర్థంచేసుకుంటే మీరు జ్ఞాపకాల నుండి విముక్తులై ఉంటారు, అవే మీ మానసిక జ్ఞాపకాల నుండి. జ్ఞాపకాలు చచ్చిపోయి ఉన్న విషయాలుగా ఉంటాయి. జ్ఞాపకాలు సత్యం కావు. జ్ఞాపకాలు ఎప్పటికీ సత్యం కాలేవు. ఎందుకంటే సత్యం ఎప్పుడూ సజీవంగానే ఉంటుంది కాబట్టే. సత్యమే జీవితం. జ్ఞాపకం కేవలం గతించిన విషయపు మంకుపట్టు మాత్రమే. అది ఓ దెయ్యాల ప్రపంచంలో జీవించడం మాత్రమే. కానీ అదే మనల్ని దానిలో పట్టేసుకుని ఉంటుంది. అవే మన చెరసాలలు. వాస్తవంలో అవే మనం. జ్ఞాపకమే బంధాన్ని సృష్టిస్తుంది. సంక్లిష్టంగా ఉన్న 'నేను' అన్న బంధాన్ని, అహంకారాన్ని.

సహజంగానే ఈ అబద్ధపు స్థితి అయిన ఈ 'నేను' అన్నది ఎప్పుడూ మృత్యువుకు భయపడుతూనే ఉంటుంది. అందువల్లే కొత్త అంటే మీకు భయం.

ఈ 'నేను'కే భయం, మీరు కాదు భయపడుతూ ఉన్నది. మీ జీవుడికి ఏ భయమూ లేదు. కానీ మీ అహంకారానికి ఉంటుంది ఎంతో ఎంతో మృత్యుభయం. అది కృత్రిమంగా ఉంటుంది, అది ఉంటుందో పోతుందో అన్నట్లు ఉంటుంది. అది కలిపి ఉంచబడి ఉంటుంది. అది ఏ క్షణంలోనైనా పడిపోవచ్చు. ఓ కొత్త సమీపంలోకి రాగానే ఓ భయం కూడా వచ్చేస్తుంది. అహంకారం భయపడుతుంది, అది పోతుందేమోనని. ఎలాగో అది తనను తాను కూడగట్టుకుని ఉంటోంది. ఒక్కటిగా ఉండడానికి అన్ని ప్రయత్నాలనూ చేసుకుంటూ ఉంటోంది. అప్పుడు ఏ కొత్తో అక్కడికి వస్తుంది – అది బద్దలు కొట్టేసే విషయంగా ఉంటుంది. అందువల్లే మీరు ఏ నవ్యతనూ ఆనందంతో సమ్మతించరు. ఓ అహంకారం తన మృత్యువును తానే ఆనందంగా ఆహ్వానించుకోదు – అహంకారం మృత్యువును ఆనందంగా ఎలా స్వీకరించ గలుగుతుంది?

మీరు మీ అహంకారం కాదని అర్థం చేసుకోగలిగేంతవరకూ, కొత్తను మీరు స్వీకరించలేరు. ఒక్కసారి మీరు గత జ్ఞాపకాల సముదాయమే తప్ప అహంకారం అంటే మరేమీ కాదనీ, మీ జ్ఞాపకాలు మీరు కారనీ, మీ జ్ఞాపకాలన్నీ ఓ సజీవ కంప్యూటరు మాత్రమేననీ, అదొక యంత్రం మాత్రమేననీ, ఓ సాంకేతిక పరికరం మాత్రమేననీ, ఉపయోగంకోసం ఉన్నది మాత్రమేననీ, దానికంటే అతీతంగా మీరు ఉన్నారనీ గ్రహిస్తే... మీరు చైతన్యంగా, జ్ఞాపకంగా ఉండకుండా ఉంటారు . జ్ఞాపకం మీ చైతన్యంలో ఓ అంశం. మీరే స్వయంగా చైతన్యం.

ఉదాహరణకు, వీధిలో నడుస్తూ ఉన్న ఏ మనిషినో మీరు చూస్తారు. ఆ మనిషిని మీరు గుర్తుపట్టేస్తారు కానీ, ఆ మనిషి పేరు మీకు గుర్తుండదు. మీరే జ్ఞాపకం అయివుంటే ఆ మనిషి పేరు కూడా మీకు గుర్తొచ్చి ఉండాలి. కానీ మీరు అంటారు "ఆ మనిషి ముఖాన్ని నేను గుర్తుపట్టే ఉన్నాను, కానీ ఆ మనిషి పేరు నాకు గుర్తురావడం లేదు" అప్పుడు మీరు ఆ మనిషి పేరుకోసం వెతుకుతారు, మీ జ్ఞాపకాల లోపలికి ప్రవేశిస్తారు, ఈ పక్కా, ఆ పక్కా వెతికి చూస్తారు. ఉన్నట్లుండి ఆ మనిషి పేరు పొంగి పైకి వస్తుంది. వెంటనే మీరు చెప్పేస్తారు "ఔను. ఇదే ఆ మనిషి పేరు" అని. జ్ఞాపకం మీ చరిత్ర నిక్షిప్తం మాత్రమే. ఆ నిక్షిప్తాలలోకి మీరే వెతికి చూస్తారు. మీరు స్వయంగా ఆ నిక్షిప్తాలు కారు.

దేన్నో జ్ఞాపకం తెచ్చుకోవాలనే మరీ ఉత్కంటతో మీరు ఉంటే ఆ జ్ఞాపకం రావడానికి ఎంతో కష్టమైపోతూ ఉండడం ఎన్నోసార్లు జరుగుతూ ఉంటుంది. సరిగ్గా ఆ ఉత్కంట మీలో ఉండడం వల్లనే, ఆ బిగువు మీ జీవుడి మీద ఉంటున్నందువల్లనే, మీరు అన్వేషిస్తున్న సమాచారం మీ జ్ఞాపకం లోంచి విడుదల అయ్యేందుకు అభ్యంతరంగా తయారైపోయి ఉంటుంది. మీరు మరీ గింజుకుంటూ ఉంటారు, ఏ మనిషి పేరునో జ్ఞాపకం తెచ్చుకునేందుకు కానీ ఆ జ్ఞాపకం మీకు రానే రాదు, ఆ మనిషి పేరు మీ నాలుక చివరలోనే ఉంటూ ఉందని మీరు అంటూనే ఉన్నా. ఆ మనిషి పేరు మీకు తెలుసని తెలుసు మీకు, కానీ అది మాత్రం గుర్తుకు రానే రాదు.

అప్పుడు అది ఓ మహావింతగా ఉంటుంది. జ్ఞాపకం మీరే అయితే, ఆ సమాచారం బయటికి రావడానికి ఎవరు అడ్డుపడుతున్నారు? మరి ఈ మాటలను అంటున్నవారు ఎవరు? “నాకు తెలుసు. అయినా అది బయటికి రావడం లేదు” అని? అప్పుడు మీరు ఎంతో కష్టపడుతూ ప్రయత్నిస్తారు; మీరు ఎంత కష్టపడుతూ ఉంటారో అంతగా కష్టం అయిపోతూ ఉంటుంది ఆ జ్ఞాపకం మీకు రావడానికి. అప్పుడు, మీకు ఆ విషయంతో పూర్తిగా విసుగొచ్చేసి, ఆ ప్రయత్నాన్ని వదిలిపెట్టేసి, ఏ తోటలోకో వెళ్ళిపోతూ కాస్త అటూ ఇటూ నడిచి వద్దామనుకుంటారు. ఉన్నట్లుండి ఏ రోజా పువ్వు పొదనో మీరు చూస్తున్నప్పుడు, అది మీకు వచ్చేస్తుంది, ఆ జ్ఞాపకం ఉన్నట్లుండి పైకి తేలి వచ్చేస్తుంది.

మీ జ్ఞాపకాలు మీరు కాదు. మీరే చైతన్యం. జ్ఞాపకం చైతన్యంలో ఓ అంశం. కానీ ఆ జ్ఞాపకమే అహంకారానికి మొత్తం జీవశక్తి. జ్ఞాపకాలు మరి పాతవిగానే ఉంటాయి. ఆ జ్ఞాపకాలకే నవ్యత అంటే భయం. ఆ కొత్తదనం జ్ఞాపకానికి ఇబ్బందిని కలిగిస్తుంది. ఆ కొత్త ఈ జ్ఞాపకానికి మింగుడు పడదు, జీర్ణం కాదు. ఆ కొత్త ఏ కష్టాన్నో పట్టుకురావచ్చు. అప్పుడు మీరు ఎంతగానో అటూ ఇటూ సర్దుకుని కుదరాల్సి వస్తుంది. ఎన్నో కట్టుదిట్టాలను మీలో ఏర్పాటు చేసుకోవాల్సి వస్తుంది. అది మనకు మహాశ్రమగా అనిపిస్తుంది.

ఓ నవ్యతను స్వీకరించాలంటే ఆ మనిషి తన అహంకారంతో సంబంధాన్ని కాస్త పక్కకు నెట్టేయాల్సి వస్తుంది. ఆ అహంకారాన్ని ‘అది నేను కాను’ అనుకుని ఒక్కసారి మీరు బయటికి వచ్చారంటే ఆ తరువాత అది చచ్చిపోయినా, బ్రతికున్నా మీరు పట్టించుకోనే పట్టించుకోరు. ఆ అహంకారం ‘చచ్చిపోయిందా? బ్రతికే ఉందా?’ అని మీరు చూసేసరికే అది అప్పటికే మృతి చెంది ఉంటుంది. అది కేవలం ఓ యంత్ర విశేషం మాత్రమే. దాన్ని ఉపయోగించుకోండి. కానీ మీరే దానికి

ఉపయోగపడిపోకండి. అహంకారానికి ఎప్పుడూ చావు అంటే భయమే ఎందుకంటే అది నామమాత్రంగా ఉంటుంది కాబట్టి. అందుకే ఆ భయం. అది మీ జీవుడిలో నుంచి ఉదయించదు, ఉదయించలేదు. ఎందుకంటే జీవుడే జీవితం కనుక. జీవితానికి మృత్యువు అంటే భయం ఎందుకు ఉంటుంది? జీవితానికి మృత్యువు గురించి ఏమీ తెలియదు.

అహంకారం అకారణంగానే జన్మిస్తుంది. కృత్రిమంలోంచే. అది ఎలాగో కలపబడి ఉంటుంది. అబద్ధంగా, కాపట్యంగా. అయినప్పటికీ... అయినప్పటికీ... అది కేవలం వదిలిపెట్టబడేసే ఉన్నట్లే ఉంటుంది. మృత్యువు కనిపించగానే మనిషికి మరింత ప్రాణం లేచి వచ్చినట్లు, మరింత సజీవంగా తయారైనట్లు. అహంకారంలో మరణిస్తే మీ జీవుడిలో మీరు జన్మిస్తారు. దివ్యత్వంలోకి జన్మిస్తారు.

నవ్యత ఉనికిలో నుంచి వస్తున్న దూత. నవ్యత సృష్టి సర్వస్వంలోంచి వస్తున్న దివ్యసందేశం. అదే ఓ ప్రవచనం. ఆ కొత్త తెస్తున్న సందేశాన్ని వినండి. ఆ నవ్యతతోనే నడవండి. నాకు తెలుసు మీరు భయపడుతున్నారని. భయపడుతున్నా సరే, మీరు నవ్యత్వంలోకే చరించండి. అప్పుడు మీ జీవితం మరింత సంపద్వంతం, మరింత భాగ్యవంతం అవుతుంది, అప్పుడు మీకు సామర్థ్యం కలుగుతుంది - చెరపట్టబడి ఉన్న మీ మహావైభవాన్ని విడుదల చేసే సామర్థ్యం.

## రెండవప్రశ్న :

*ప్రియ ఓషో,*

*'జీవితం సరిగ్గానే ఉంది' అని మీరు అంటున్నప్పుడు, ఏమిటి మీ మాటలకు అర్థం?*

సరిగ్గా అదే అర్థమే. జీవితం ఉన్నది ఉన్నట్లుగా ఉంది. కానీ ఈ ప్రశ్నను మీరు ఎందుకు అడుగుతున్నారో నాకు అర్థమైంది. ఈ ప్రశ్న మీలో ఎందుకు ఉదయించిందంటే 'సంపూర్ణత్వం' గురించి మీకు కొన్ని నిశ్చితాభిప్రాయాలు ఉన్నాయి కాబట్టే. మీ అభిప్రాయాలకు అనుగుణ్యంగా జీవితం ఉండడం లేదు కాబట్టే. అందువల్లే ఈ జీవితం సరిగ్గా ఉండడం లేదని మీరు అంటున్నారు.

నేను 'జీవితం సరిగ్గా ఉంది' అని అంటున్నప్పుడు, నా అభిప్రాయాలకు తగ్గట్టుగా జీవితం ఉంటోందని కాదు అర్థం – నాకు ఏ అభిప్రాయాలూ లేవు. జీవితం సరిగ్గా ఉంటోందని నేను అంటున్నప్పుడు దాన్ని పోల్చి చూసి చెప్పేందుకు

మరేదీ ఉండడం లేదనే అర్థం. పోల్చి చూసేందుకు ఏ ఆశయమూ లేదు. ఉంటున్నదంతా ఇంతే; అది సరిగ్గానే ఉండితీరాలి.

మీరు ఊహిస్తున్న సంపూర్ణత ఎప్పుడూ ఓ పోలిక మాత్రమే. నేను మాట్లాడుతున్న సంపూర్ణత కేవలం ఉంటున్న స్థితిని ఉన్నది ఉన్నట్లుగా చెప్తున్న ప్రకటనా వాక్యం మాత్రమే. దేనితోనో పోల్చి చూసి చెబుతున్న మాట కాదు అది. మీరు పోల్చి చూస్తూ అంటున్నారు “ఔను. ఇది ఉంది సరిగ్గా, అది లేదు సరిగ్గా” అని. ‘సరిగ్గా’ ఉండడం, ‘సంపూర్ణం’గా ఉండడం అంటే ఏమిటో చూపించే ఓ అభిప్రాయ హేతుప్రమాణం ఏదో మీలో ఉంటోంది.

ఓ సూఫీమాస్టర్ గురించి నేను విన్నాను. ఆయన ఓ హోటల్‌లో కూర్చుని కాఫీ తాగుతూ అక్కడ ఉన్న మనుష్యులతో ఓ ప్రాచీన సూఫీ నానుడి గురించి చెబుతూ “జీవితం సరిగ్గా ఉంది, అన్నీ సరిగ్గా ఉన్నాయి, అందరూ సరిగ్గానే ఉన్నారు” అన్నాడు.

ఆ మాటల్ని వింటూ ఉన్న ఓ గూనిమనిషి లేచి నుంచున్నాడు. సూఫీ మాస్టర్‌తో “నన్ను ఒకసారి చూడండి! ఈ జీవితం సరిగ్గా ఉండడం లేదు అన్నదానికి నేనే బుజువును అన్నాడు. నన్ను చూడండి! నన్ను చూస్తే మీకు అర్థమైపోవడం లేదా జీవితం సరిగ్గా ఉందని మీరు అంటున్న మాట తప్పేనని? నన్ను చూడండి – ఎంత అసహ్యంగా ఉన్నానో, ఎంత కష్టపడుతున్నానో. నేను గూనివాడిగా ఉన్నాను”.

ఆ సూఫీయోగి ఆ గూనివాణ్ణి చూస్తూ అన్నాడు “నేను ఇంత చక్కటి గూనిని ఇంకెక్కడా చూడనే లేదు”. మహాసంపూర్ణమైన గూనిని...

ఉన్నది ఉన్నట్లుగా జీవితాన్ని చూడడం ప్రారంభమైతే, జీవితం ఎలా ఉండాలన్న ఊహ మీలో ఉండకపోతే, సర్వస్వమూ అత్యంత సవ్యంగానే ఉంటుంది. అప్పుడు అపసవ్యత కూడా సవ్యంగానే కనిపిస్తుంది. జీవితం సవ్యంగా ఉందని నేను ఓ అతిమామూలు మాటనే చెప్పాను. మీ ఊహలను వేటినీ నా మాటల మీదకు తీసుకురాకండి. తీసుకొచ్చారంటే మీరే ఈ జీవితాన్ని అపసవ్యం చేసేస్తారు. ఎందుకంటే ఓ అభిప్రాయాన్ని అక్కడికి పట్టుకొచ్చేసరికే ఓ అపసవ్యాన్ని అక్కడ మీరు సృష్టించేస్తారు కాబట్టి.

ఓ మనిషికి ఏడు అడుగుల ఎత్తు ఉండాలని మీరు చెబుతూ ఆ మనిషి ఆరు అడుగుల ఎత్తే ఉంటే, అక్కడ కష్టం ఉంటుంది. లేదా ఓ మనిషి ఎత్తు నాలుగు అడుగులు మాత్రమే ఉండాలనే ఊహ మీలో ఉంటే, ఆ మనిషి అలా ఉండకుండా

ఉంటే, అప్పుడు అక్కడ కష్టం ఉంటుంది. జీవితం యధాలాపంగా ఉంటుంది. ఎవరో ఏడడుగుల పొడవుతో ఉంటారు, మరెవరో నాలుగు అడుగుల ఎత్తుతో ఉంటారు. ఓ వృక్షం ఆకాశాన్ని అందుకుంటూ ఎదుగుతుంది. ఇంకో మొక్క ఎత్తుగా పెరగనే పెరగదు, పొట్టిగానే ఉంటుంది. కానీ అన్నీ బాగానే ఉంటాయి. అవన్నీ ఉండాల్సినట్లుగానే ఉంటున్నాయి – 'ఏది ఎంత ఉండాలి?' అన్న ఏ అభిప్రాయాలూ నాలో లేవు కాబట్టి. నేను వింటూ, చూస్తూ జీవితాన్ని ఉన్నది ఉన్నట్లుగానే చూస్తున్నాను. ఏది ఎలా ఉండాలో నాకు తెలియదు. అందువల్లే నేను అంటాను అది ఉండాల్సినట్లే ఉంటోందని, మరే జీవితమూ లేదు.

సందేశం ఏమిటంటే, మీరు పోల్చి చూడడాన్ని మానెయ్యాలనే. తీర్పులు చెయ్యడం మానండి. అలా కాకపోతే మీరు దైన్యంలోనే మిగిలి ఉంటారు – మీరు తీర్పుల్నీ, పోల్చి చూడడాన్నీ చేస్తున్నందువల్ల. ఏ న్యాయాధికారి లాగానో ఉండకుండా ఉంటూ చూడండి జీవితాన్ని ఉన్నది ఉన్నట్లుగా. మీరు ఎవరండీ తీర్పులు చెప్పడానికి? జీవితాన్ని గురించి మీకేం తెలుసు? మీ గురించి అయినా మీకేం తెలుసు? ఎవరు మీరు తీర్పు చేయడానికి? ఓ తీర్పు చెయ్యడం మీ ఊహకు అనుగుణ్యంగా మాత్రమే జరుగుతుంది. మీకు తెలుసు అన్న ఊహకు అనుగుణ్యంగా మాత్రమే జరుగుతుంది; తీర్పులు చెయ్యడం కాదు జ్ఞానం ఉంది అంటే.

ఏమీ తెలుసుకుని ఉండకుండా ఉన్న స్థితిలో ఉంటూ, ఓ అజ్ఞాన స్థితిలో ఉంటూ జీవితాన్ని చూడండి. ఆశ్చర్యంలో ఉంటూ జీవితాన్ని చూడండి – ఉన్నట్లుండి అంతా అతిసవ్యంగా ఉన్నట్లు మీకే కనిపిస్తుంది. ఔను, అది అప్పుడప్పుడూ మబ్బులు కమ్మి ఉంటుంది, కానీ అది సవ్యంగా ఉంటుంది. అప్పుడప్పుడూ అది ఎండ కాస్తూ ఉంటుంది, కానీ అది సవ్యంగా ఉంటుంది. కొన్నిసార్లు వర్షాలు పడుతూ ఉండవచ్చు, కొన్నిసార్లు వర్షాలే లేకుండా ఉండవచ్చు, కానీ అది సవ్యంగా ఉంటుంది. ఉన్నది ఉన్నట్లుగా అది ఉండడం కూడా ఓ ఆశీర్వాదమే. ఆ ఆశీర్వాదంతో శృతిలో ఉండడమే ప్రార్థనతో ఉండడం అంటే.

## మూడవప్రశ్న :

ప్రియ ఓషో,

మీరు అప్పుడప్పుడూ చెబుతూ ఉంటారు, ఎవరో మళ్ళీ పోగొట్టుకున్నారనో, వ్యర్థంగా జీవించారనో. ఆ మాటలను వింటూ ఉన్నప్పుడు ఏ లక్ష్యమో, ఏ స్థానమో

**ఉన్నట్లూ, దాన్ని పోగొట్టుకోవడమో, పొందడమో జరగవచ్చు అన్నట్లూ వినిపిస్తూ ఉంటుంది. అయినా మళ్ళీ మీరు ఏ లక్ష్యమూ లేదనే, ఉన్నది ఉన్నట్లుగా అన్నీ ఉన్నాయనే, చెబుతూ ఉంటారు. అటువంటప్పుడు దేన్నయినా నేను ఎలా పోగొట్టుకోగలుగుతాను?**

దినేష్, మళ్ళీ నువ్వు పోగొట్టుకున్నావు! ఏ క్షణంలో 'ఎలా' అని అడుగుతావో, ఆ క్షణంలోనే దాన్ని నువ్వు పోగొట్టుకుంటావు. ఓ విషయం ఉంటుంది, ప్రాప్తించుకునేందుకోసం కాదు, గుర్తించడం కోసమే. 'ఎలా' అన్నదే ఉండదు. ఎందుకంటే అప్పటికే అది ఉంది కాబట్టి. దాన్ని నువ్వు అలా చూస్తే చాలు. దాన్ని చూడగలిగేందుకు ఓ నిశ్శబ్ద ప్రదేశంలో నువ్వు ఉంటే చాలు. ఏ పనులూ జరగకుండా ఉంటున్న ఓ క్షణంలో నువ్వు ఉంటే చాలు. ఎక్కడికీ పోకుండా నువ్వు ఉంటున్న క్షణంలో నువ్వు ఉంటే చాలు, ఉన్నదానికి ఏ మెరుగుల్నీ పెట్టకుండా, దానికి ఏ అభివృద్ధినీ చెయ్యకుండా ఉంటే చాలు, నువ్వు మహాసౌఖ్యంగా ఉంటే చాలు – ఆ విరామంలో, ఆ సౌఖ్యంలో, అది ఉంటుంది అక్కడ. అది ఓ గుర్తింపు మాత్రమే. ప్రాప్తం కాదు గుర్తింపు మాత్రమే. ఎందుకంటే అప్పటికే నువ్వు ప్రగాఢ స్థితిలో అదే కాబట్టి, నువ్వు ఎప్పుడూ ఉంటున్నది దానిగానే కాబట్టి.

'ఎలా' అని అడిగితే, మళ్ళీ నువ్వు పోగొట్టుకుంటావు. ఎందుకంటే 'ఎలా' అంటే దానికోసం ఏదో చేసితీరాల్సి ఉంటుందనే అర్థం కాబట్టి. ఏ పద్ధతీ అవసరంలేదు, ఏ మార్గమూ అక్కర్లేదు, ఏ తంత్రమూ అవసరం లేదు. అన్ని తంత్రాలనూ, అన్ని మార్గాలనూ, అన్ని పద్ధతులనూ తప్పకుండా విడిచిపెట్టేయాలి. నువ్వు మహానిశ్శబ్ద స్థితిలో, నీ లోపలి మహాస్తబ్ధ అంతర్వాణిని వినగలిగేలా ఉండాలి. ఆ అంతర్వాణి నీ లోపలే శాశ్వతంగా ఉంది. కానీ నువ్వు నీ కోరికలతో శబ్దాల గోలచేస్తూ ఉంటున్నావు. అందువల్లే నీ స్వీయసంగీతాన్నే నువ్వు వినలేకపోతున్నావు.

'ఎలా' అని అడగకు. ఎలా అని అడుగుతూ ఇప్పటిదాకా నువ్వు పోగుచేసుకుని ఉన్న అన్ని పద్ధతులనూ విడిచిపెట్టేయ్. పడిపో ఓ నిశ్శబ్ద ఆవరణంలోనే. ఇది ఒక కిటుకు మాత్రమే, పద్ధతి కాదు. ప్రభాతంలో ఉదయిస్తూ ఉన్న సూర్యుణ్ణి నిశ్శబ్దంగా కూర్చుని చూడు, చాలు. ఏముంది అక్కడ చెయ్యడానికి? చంద్రబింబం కూడా ఆ ఆకాశంలోనే ఉంది. ఆ పచ్చిక బయలు మీదే వెనక్కు వాలిపోయి పడుకుని ఆ చంద్రుడితోపాటే ఉండు. ఆ ఆకాశంలో తెల్లమబ్బులు కూడా ఉన్నాయి తేలుతూ... ఆ మబ్బులతో కూడా ఉండు. అక్కడ పక్షులు పాటలు పాడుకుంటూ ఉంటాయి, చిన్నపిల్లలు అక్కడే ఆడుకుంటూ ఉంటారు... మరి నువ్వు ఏమీ చెయ్యకు.

నిశ్చేష్టితంగా ఉండిపో. నీ నిశ్చేష్టితంలో నువ్వు ఉన్నప్పుడు, దివ్యత్వం ప్రవేశిస్తుంది. నువ్వు స్త్రీతత్వంతో ఉండు. నువ్వు స్త్రీత్వంతో ఉంటే, దివ్యత్వం ప్రవేశిస్తుంది. దీన్ని నువ్వు గమనించలేదా? బుద్ధుడు స్త్రీత్వంతోనే ఉంటాడు. ఆయన స్త్రీత్వంతోనే కనిపిస్తాడు. శ్రీకృష్ణుడు కూడా స్త్రీత్వంతోనే కనిపిస్తాడు. ఎందువల్ల? - కేవలం ఇది ఓ రూపకాలంకారం మాత్రమే కనుక. వాళ్ళను స్త్రీత్వంతోనే పోల్చి చూపించారు, వాళ్ళ అంతరం ఆ లక్షణంతోనే ఉంటుందని సూచించడం కోసం... స్వీకారతత్వాన్ని.

మీరు దేన్నో చేస్తున్నప్పుడు మీరు దూకుడుగా ఉంటారు. మీరు ఏమీ చెయ్యకుండా ఉన్నప్పుడు మీరు ఏ దూకుడూ లేకుండా ఉంటారు. పరమోత్తమాన్ని జయించగలగడం అసాధ్యం; మిమ్మల్ని ఆయన జయించడానికి మీరు ఒప్పుకోవాలి.

## నాల్గవప్రశ్న :

*ప్రియ ఓషో,*

*ఓ మాస్టర్‌కు 'గౌరవం' అంటే ఏమిటి?*
*మిమ్మల్ని మేము ఎలా గౌరవించాలి? ఓ గురువును గౌరవించడానికి*
*ఆచారక్రమాలు ఉంటాయా ? మీతో మేము పరిహాసాలు ఆడవచ్చునా?*
*సూఫీ నాట్యాలలో మేము నవ్వుతూ ఉండడానికోసం*
*దేన్ని గురించి అయినా ఆలోచిస్తూ ఉండమని చెప్తారు.*
*మీరు ఓ అరటితొక్క మీద జారి పడుతున్నట్లు నేను ఊహించుకున్నాను.*
*అది మిమ్మల్ని గౌరవించకపోవడమా, ఫర్వాలేదా?*

నా దగ్గర ఫర్వాలేదు. కానీ నువ్వు అరటితొక్కతో అమర్యాదగానే ప్రవర్తించావు. కానీ గుర్తుంచుకో, అరటిపళ్ళు బుద్ధుళ్ళు కావు – అవి నిన్ను ఎప్పటికీ క్షమించవు.

## ఐదవప్రశ్న :

*ప్రియ ఓషో,*

*ధ్యానం ఆవేశపూరితంగా ఉండవచ్చునా?*

ఔను. ధ్యానం ఆ విధంగా మాత్రమే ఉండాలి. ఆవేశమే శక్తి, ఆవేశమే అగ్ని, అవేశమే జీవితం.

ధ్యానాన్ని మీరు చేసీ చెయ్యకుండా చేస్తూ ఉంటే, ఏ ఆవేశమూ లేకుండా చేస్తూ ఉంటే, ఏ తీవ్రతా లేకుండా చేస్తూ ఉంటే, నిప్పు లేకుండా చేస్తూ ఉంటే, అందువల్ల ఏమీ జరగదు. మీరు ఆచారం కోసం ఓ ప్రార్థనను చేస్తూ ఉంటే, మీ హృదయంలో అప్పుడు ప్రేమ ఉదయించకుండా ఆ ప్రార్థన జరుగుతూ ఉంటే, ఆ ప్రార్థనకు అర్థమే ఉండదు. అది నిరర్థకం. మూర్ఖం.

ఓ ఆవేశం లేకుండా మీరు దేవుణ్ణి ప్రార్థిస్తూ ఉంటే మీకూ దేవుడికీ మధ్య ఏ సంబంధమూ ఉండదు. కేవలం ఆవేశం మాత్రమే ఓ వారధి, ఓ దప్పిక, ఓ ఆకలి కాగలుగుతుంది. మీకు ఎంత దప్పిక ఉంటే అంత ఎక్కువగా సంభావ్యత ఉంటుంది. మహాదాహం మీకు ఉంటే, మీరు దప్పికే అయిపోయి ఉంటే, మీ జీవి సర్వస్వమూ మీ ఆవేశంతో ఖర్చు అయిపోతూ ఉంటుంది. అప్పుడు మాత్రమే ఏదో ఒకటి సంభవించగలుగుతుంది – ఆ తీవ్రతలో, ఆ వంద డిగ్రీల ఆవేశపు ఉష్ణోగ్రతలో.

మందకొడిగా ఉండకండి. మనుష్యులందరూ మందకొడిగానే జీవిస్తూ నీరసంగా ఉంటారు. వాళ్ళు ఈ వైపూ ఉండరు, ఆ వైపూ ఉండరు. వాళ్ళు మధ్యస్థంగానే, సామాన్యతలోనే ఉంటారు. మీరు అసామాన్యంగా జీవించాలనుకుంటే, మీరు ఆవేశభరితమైన జీవితాన్నే సృష్టించుకోండి. మీరు ఏ పనిని చేస్తూ ఉన్నా, ఆవేశపూరితంగానే ఉంటూ చెయ్యండి. మీరు ఓ పాటను పాడుతూ ఉంటే, ఆవేశంతోనే పాడండి. మీరు ప్రేమిస్తూ ఉంటే, ఆవేశంతోనే ప్రేమించండి. మీరు ఓ వర్ణచిత్రాన్ని గీస్తూ ఉంటే, ఆవేశంతోనే గీయండి. మాట్లాడుతూ ఉంటే, ఆవేశంగానే మాట్లాడండి. వింటూ ఉంటే, ఆవేశంతోనే వినండి. ధ్యానం చేస్తూ ఉంటే, ఆవేశపూరితులై ఉంటూనే ధ్యానాన్ని చెయ్యండి.

అప్పుడు ప్రతి చోట్లో నుండీ మిమ్మల్ని పరమోత్తమం సమీపిస్తూనే ఉంటుంది– ఆవేశం ఉన్నచోటులోకే. మీరు అత్యంత ఆవేశంతో ఓ వర్ణచిత్రాన్ని గీస్తూ ఉంటే అప్పుడు మీరు చేస్తున్నది ఓ ధ్యానాన్నే. మరే ధ్యానాలనూ మీరు చెయ్యనక్కరలేదు. పరిపూర్ణ ఆవేశంతో ఓ నాట్యాన్ని, నాట్యం చేస్తున్నవాడు మాయమైపోయి ఉన్నట్లు, మీరు చేస్తూ ఉంటే మీరు అప్పుడు చేస్తున్నది ధ్యానాన్నే – మీకు ఇంకేమీ అవసరం ఉండదు. మీరు ఎక్కడికీ పోనక్కరలేదు, ఏ యోగాసనాలనూ వెయ్యనక్కరలేదు... మీరు ఉంటున్నది యోగభంగిమల్లోనే : నర్తకుడు మాయమైపోయి ఉంటాడు, అక్కడ నాట్యం మాత్రమే జరుగుతూ ఉంటుంది. అది స్వచ్ఛమైన శక్తి – ప్రకంపిస్తున్న శక్తి.

ఆ స్థితిలో మీరు స్పర్శను, సంబంధాన్ని పొందుతారు. అప్పుడే కలయిక జరుగుతుంది. ఆ కలయిక ఆ స్థితిలోనే ఎందుకు కలుగుతుంది? – ఆవేశం

మహాఎక్కువగా ఉంటే అహంకారం మరణిస్తుంది కాబట్టే. అహంకారం సామాన్య మానసాల్లో మాత్రమే ఉండగలుగుతుంది : మామూలు మనుష్యులు మాత్రమే అహంకారాలతో ఉంటారు. నిజమైన గొప్పవాళ్ళు అహంకారపూరితులై ఉండరు. వాళ్ళు అహంకారంతో ఉండలేరు. కానీ వాళ్ళ జీవితాలకు ఓ విభిన్న పరిధి ఉంటుంది. మహావిభిన్న పరిధి – ఆవేశ పరిధి.

ఈ రెండు పదాలనూ మీరు ఎప్పుడైనా గమనించారా? ఆవేశం, కరుణ (Passion, Compassion). ఆవేశమే కరుణగా పరివర్తితం అవుతుంది. ఆవేశం నుండి కరుణలోకి ఓ మహాలంఘనం జరుగుతుంది – కానీ ఆ మహాలంఘనం సంభవించేది మీరు ఆవేశంలో వంద డిగ్రీల ఉష్ణోగ్రతతో మరిగిపోతున్నప్పుడు మాత్రమే. అప్పుడు నీరు ఆవిరి అయిపోతుంది. అదే శక్తి మరో రూపంతో మీ ఆవేశంలో ఉంటోంది. అదే కరుణగా ఓ నాటికి పరివర్తితం అవుతుంది. కరుణ ఆవేశానికి శత్రువు కాదు; వయసొచ్చిన ఆవేశమే కరుణగా పరివర్తితం అవుతుంది. వికసించిన ఆవేశమే కరుణ. ఆవేశానికి వసంత ఋతువే కరుణ. నేను ఆవేశాన్నే సమర్థిస్తాను. మీరు ఏదైనా చెయ్యండి. కానీ అందులో మీరు తప్పిపోవాలి. మిమ్మల్ని మీరే అందులో పోగొట్టుకోవాలి. మీరు ఆవేశంలోనే కరిగిపోవాలి. పరమవిలీనమే విమోచనం.

## ఆరవప్రశ్న :

*ప్రియ ఓషో,*

*ఈ రోజు ఉదయం, మీ ఉపన్యాసం పూర్తయిన తర్వాత, నేను ఆ వేదిక పక్కనే కూర్చుని ఉన్నప్పుడు, నేను మీ పాదాల ముందే కూర్చుని ఉన్నట్లు, మీరు జలపాతాల గురించీ, వృక్షాల గురించీ, సంతోషం గురించీ ఓ అందమైన కథను నాకు చెప్తున్నట్లూ అనుభూతిని పొందాను. అప్పుడు మీరు నవ్వుతుంటే ఎంతో సంతోషంగా అనిపించింది, కానీ అంతకు కొద్ది నిముషాల ముందు మీరు లేచి వెళ్ళిపోతున్నప్పుడు ఓ దుడ్డుకర్రతో దిమ్మతిరిగేట్లు నా తల మీద గట్టిగా కొట్టినట్లే నాకు అనిపించింది.*

*ఓషో, మీరు మాకు చేస్తున్నది ఏమిటి? మాకు అందమైన కథలను చెప్తున్నారా, మా నెత్తి మీద కొడుతున్నారా, మరేదయినా చేస్తున్నారా?*

సమతా, ఈ కథలన్నీ మిమ్మల్ని సన్నద్ధం చెయ్యడానికే, ఆ తరువాత మీ నెత్తి మీద కొట్టడానికే. నేను ఈ రెండూ చేస్తూ ఉంటాను. అందుకోసం ముందుగా

నేను కథలు చెప్పాల్సి వస్తుంది - ఎంతో అందమైన కథలను జలపాతాల గురించీ, వృక్షాల గురించీ మరి మేఘాల గురించీ, ఎంతో అందమైన కథలను ఆవలితీరం గురించీ. ఎంతో అందమైన కథలను బుద్ధత్వ ప్రాప్తి గురించీ, బోధిసత్వ ప్రాప్తి గురించీ చెప్పాల్సి వస్తుంది. ఈ కథలతో మీరు ఎక్కడ ఉన్నారో తెలుసుకోలేనంతగా, ఏం జరుగుతూ ఉందో తెలుసుకోలేనంతగా మునిగిపోయి ఉన్నారని నాకు తెలిసినప్పుడు, మిమ్మల్ని కొట్టినా మీకు కోపాలు రావని నాకు అనిపించినప్పుడు, అప్పుడు కొడతాను మిమ్మల్ని నేను. ఈ కథలన్నింటినీ నేను చెబుతున్నది మిమ్మల్ని అందుకోసం సమాయత్తం చెయ్యడానికే, ఆ దెబ్బకోసం పూర్వభూమిని తయారుచెయ్యడానికే. కానీ నేను చెయ్యాల్సిన మౌలిక కార్యం మీ నెత్తి మీద ఒక్కటి ఇచ్చుకోవడమే. మిమ్మల్ని నేను విధ్వంసం చేసెయ్యాలి.

సహజంగా నేను చెయ్యాల్సిన పని ఆ విధంగానే ఉంటుంది. ముందుగా నేను మిమ్మల్ని బ్రతిమాలుకోవాల్సి ఉంటుంది. మిమ్మల్ని నమ్మించాల్సి వస్తుంది. మిమ్మల్ని మరులు గొల్పించి మీరే నా దగ్గరికి వచ్చేట్లు చేసుకోవాల్సి వస్తుంది. అప్పుడు మీరు నా దగ్గరికి, ఇంకా దగ్గరికి, ఇంకా దగ్గరికి వస్తారు. అప్పుడు మాత్రమే సుత్తిదెబ్బ పడగలుగుతుంది మీ నెత్తి మీద, లేకపోతే మీరు తప్పించుకుని పారిపోతారు. ఈ కథలు అన్నీ మిమ్మల్ని పారిపోనీయకుండా ఆపగలుగుతూ ఉంటాయి. మిమ్మల్ని నా సామీప్యంలోనే నిలిపి ఉంచుతూ ఉంటాయి. ఈ అందమైన కథలన్నీ బలమైన జిగురులాగా పనిచేస్తూ మీకూ నాకూ మధ్య ఉంటాయి. అనుకూల సమయం ఆసన్నం కాగానే వెంటనే నా దెబ్బ పడిపోతుంది. మరి ఆ దెబ్బను నేను మహాఆవేశంతోనే కొడతాను.

## ఏడవప్రశ్న :

*ప్రియ ఓషో,*

*మీరు మమ్మల్ని అందరినీ బోధిసత్వులు అవ్వాలని కోరుకుంటున్నారు. దానికి అర్థం బోధిసత్వుడు అందరినీ ఆవలితీరానికి తప్పకుండా చేర్చితీరుతానన్న దృఢనిశ్చితాన్ని ప్రమాణ పూర్వకంగా చేసుకుని తీరాలనే. ఎటొచ్చీ, అటువంటి దృఢనిశ్చితాన్ని చేసుకోలేను అనిపిస్తోంది. అప్పుడప్పుడూ నాకు మిగతా మనుష్యుల మీద ఇష్టం పుడుతూ ఉంటుంది. అప్పుడప్పుడూ నా వ్యవహారాలలోనే నేను తలమునకలైపోతూ ఉంటాను. కాబట్టి నేను ఇంకా కొంతకాలం నిరీక్షిస్తూనే ఉండాలా అటువంటి నిర్ణయాన్ని తీసుకోవడానికీ, లేకపోతే అది నిశ్చయించి చెప్పుకోవాల్సిన*

**ప్రమాణంగా కాక ఓ కాయ తనంతట తానే పక్వానికి వస్తూ పండినట్లు జరిగే సంభవమా? అదే జరిగేట్టయితే బుద్ధుడు ఓ బోధిసత్వుడిగానే ఉండిపోకుండా బుద్ధుడు ఎందుకు అవుతున్నాడు?**

ముందుగా, ఈ మూడు విషయాలనూ అర్థంచేసుకుని తీరాలి. మొదటిది - సాధారణ మానవుడి మనఃస్థితిని – ఓ ప్రపంచాన్ని బలంగా అంటిపెట్టుకుని, మీరు ఈ తీరాన్నే గట్టిగా పట్టుకుని ఉంటే, ఆ 'ఆవలితీరం' అన్నది ఓ కట్టుకథలాగా మాత్రమే తోస్తుంది. మీరు ఆ ఆవలి ఒడ్డును నమ్మలేకపోతారు. ఎంతో బలంగా మీరు ఈ ఒడ్డునే పట్టేసుకుని ఉంటూ ఉన్నప్పుడు ఉంటున్న ఏకైక సమస్య, దీనినుంచి మిమ్మల్ని తప్పించే సహాయాన్ని ఎలా చెయ్యాలి అనేదే.

సరిగ్గా ఇప్పుడే, సందేహా, ఓ బోధిసత్వుణ్ణి కావాలని నువ్వు అనుకుంటే అందువల్ల ఏ ప్రయోజనమూ ఉండదు. సహాయపడే మాట అటుంచి, ఎంతో ప్రమాదకరం కూడా. అలా అనుకోవడం కేవలం ఈ ఒడ్డుకే అంటిపెట్టుకుని ఉండడానికి ఓ వ్యూహం అయి ఉంటుంది. నీకు ఇంకా ఈ తీరం నుండి విముక్తి ప్రాప్తించలేదు. అందువల్ల ఈ ప్రపంచానికే అంటుకుని ఉండడానికి ఇది నీకు ఓ పద్ధతిగా తయారవుతుంది. అప్పుడు ఇది ఓ జిత్తు పన్నాగంగా ఉంటుంది – అది మతం, కరుణ, సర్వజన ప్రేమ, సేవ పేర్లు పెట్టుకుని ఉంటుంది. అప్పుడు దానికి ఒక మహాశయం ఉంటుంది. "నేను ఇక్కడ ఉంటున్నది ప్రజలకు సహాయపడేందుకే. అందువల్లే నేను ఇంకో తీరానికి వెళ్ళిపోవడం లేదు". కానీ మీరు ఆ ఆవలితీరానికి వెళ్ళిపోవాలని నిజంగా అనుకుంటూ ఉండనే ఉండరు. అసలు ఆ రెండవ తీరం ఉంది అన్న ఎరుక కూడా మీకు అప్పుడు ఉండదు. ఆవలితీరం ఒకటి ఉందన్న నమ్మకం కూడా మీకు అప్పుడు ఉండదు. మీరు అప్పుడు ఓ మహాసూక్ష్మమైన ఉచ్చులో చిక్కుకుపోయి ఉంటారు.

ఇదే సాధారణ మానవ మనస్తత్వానికి మొదటిస్థాయి : అది ఈ ప్రపంచాన్నే అంటిపెట్టుకుని ఉంటుంది. ఈ ప్రపంచాన్నే అంటిపెట్టుకుని ఉండడానికి ఎన్నో కారణాలను అది ఎప్పుడూ వెతికి పట్టుకునే ప్రయత్నాలనే చేస్తూ ఉంటుంది. రెండవస్థాయి మనస్తత్వం బోధిసత్వుడిది – ఈ ప్రపంచంతో సంబంధాన్ని వదిలించేసుకుని ఉన్న స్థితితో ఇంకో ఒడ్డుకు ఎగిరిపోయేందుకు సర్వసంసిద్ధంగా ఉంటున్న స్థాయి. ఈ ప్రపంచంలో ఆయనకు ఏ వేళ్ళూ ఉండవు. మొదటి మనఃస్థాయిలో ప్రపంచాన్ని వదిలిపెట్టెయ్యడం ఎంతో కష్టం, రెండవ మనఃస్థాయిలో ప్రపంచాన్ని పట్టుకుని ఉండడం ఎంతో కష్టం.

ఈ వజ్రచ్ఛేదికా సూత్రం ద్వితీయస్థాయిలో ఉంటున్న బోధిసత్త్వులకోసం మాత్రమే, మొదటిస్థాయి మానవులకోసం కాదు. ముందు మీరు ప్రపంచ బంధాన్ని వదిలించుకోవాలి. ముందు మీరు ఈ ప్రపంచంలోని మీ వేళ్ళనన్నిటినీ నశింపజేసుకోవాలి. మీ అన్ని వేర్లూ నశించిపోయిన తరువాత, అప్పుడు మాత్రమే తక్కిన మనుష్యులకు మీరు సహాయం చెయ్యగలుగుతారు. అది జరగకపోతే మీ వల్ల ఎవ్వరికీ ఏ ఉపయోగమూ ఉండదు. మీ దగ్గర అప్పుడు పంచిపెట్టడానికి ఏమీ ఉండదు. మీరు అనుకుంటూనే ఉండవచ్చు "ఈ మనుష్యులు అంటే నాకు ఎంతో ప్రేమ" అని. కానీ ఆ ప్రేమ కూడా అప్పటికీ మీ దగ్గర ఉండదు. ఇంకా అందరూ మిమ్మల్ని ప్రేమిస్తూ ఉండాలనే మీరు అనుకుంటూ ఉంటారు. మీరు అప్పటికీ భిక్షగాళ్ళుగానే ఉంటారు. ఏ కారణమూ లేకుండా మీ ప్రేమను పంచుకునే స్థితిలో మీరు ఉండరు. ఇవ్వడంలోని ఆనందాన్ని అనుభవించడంకోసమే ప్రేమను పంచుకునే స్థితిలో మీరు ఉండరు.

ముందుగా మీరు ద్వితీయస్థాయిని చేరుకోవాలి. అందుకోసం ముందుగా మీ అహంకారాన్నంతా మీరు వదిలిపెట్టేసుకోండి. ప్రపంచంలో పాతుకుని ఉన్న మీ అన్ని వేర్లనూ తెంపుకుని నాశనం చేసేసుకోండి. మీకు ఏ స్వంతాలూ ఉండకూడదు. మీ వద్ద ఏ ఆర్జితాలూ ఉండకూడదు. అప్పుడు మాత్రమే బుద్ధుడు ఏం చెప్తున్నాడో అది మీకు సంగతంగా ఉంటుంది : అప్పుడు వస్తుంది సమస్య. ముందు ఉన్న సమస్య బంధాలను ఎలా తెంపుకోవాలి అన్నది, ఎలా అన్ని వేర్లనూ తెంపుకోవాలి అన్నది. తరువాత వస్తుంది మీకు ఈ రెండవ అసలు సమస్య. 'ఈ ప్రపంచాన్ని పట్టుకుని ఎలా ఉండాలి?' అని.

బుద్ధుడు అంటాడు ఈ ప్రపంచంలో మీకు ఏ వేర్లూ ఉండనప్పుడే, మీ అవసరం ఇక్కడ ఉంటుంది అని. అప్పుడు మీలో పంచిపెట్టేందుకు ఏదో ఉంటుంది. అప్పుడు మీ దగ్గర పంచిపెట్టడానికి వజ్రాలు ఉంటాయి. అప్పుడు, మీరు వెళ్ళిపోయే ముందే మీరు వాటిని అన్నిటినీ పంచిపెట్టేసెయ్యాలి. అన్నిటినీ పంచిపెట్టేసిన తరువాత మీరు ఇక్కడ మీకు సాధ్యపడినంత సమయంపాటు ఉండవచ్చు. ఇదే రెండవస్థాయి. మూడవస్థాయి బుద్ధుడిది, ఆ ఒడ్డుకు అప్పటికే చేరిపోయి ఉన్నవాడిది.

ఇప్పుడు నువ్వు అడుగుతున్నావు "బుద్ధుడు ఎందుకు ఉన్నాడు బుద్ధుడిగా, బోధిసత్త్వుడిగా మిగిలి ఉండక?" అని. ఆ తృతీయస్థాయి మరింత కష్టంగా ఉంటుంది. ఆ రెండవ తీరంలోకి చేరిపోయి అక్కడే ఉంటూ, ఈ తీరం మీద కూడా ఉండడం మహాకష్టమైన విషయం. రెండవ తీరాన్ని చేరిపోయి కూడా మొదటితీరం

మీద ఉంటూ మానవులకు సహాయాలు చేస్తూ ఉండడం మహాకష్టతరమైన విషయం. కాబట్టి ఇవే ఆ మూడు కష్టాలు. మొదటిది ప్రపంచంతో బంధాలను తెంచుకోవడం, రెండవది ప్రపంచంలోని వేర్లు అన్నీ నశించిపోయిన తరువాత కూడా అక్కడే ఈ తీరం మీదే ఉండడం. చివరగా మూడవది, ఈ తీరం మీద ఇక ఉండలేకపోవడం... ఎందుకంటే ఇక ఏ మాత్రం ఆగి ఉండలేని, తప్పకుండా వెళ్ళిపోయి తీరాల్సిన క్షణం వచ్చేస్తుంది కాబట్టి. అప్పుడు అది అసాధ్యంగా ఉంటుంది.

ప్రతి బోధిసత్త్వుడూ తప్పకుండా ఓ బుద్ధుడు అయ్యే తీరుతాడు. మీరు ఈ ఒడ్డునే పట్టుకుని ఉండలేరు. అది అన్యాయంగా ఉంటుంది. మీరు తప్పకుండా అక్కడి నుంచి వెళ్ళిపోవాల్సిన క్షణం ఒకటి వచ్చేస్తుంది. మహాకష్టపడితే ఒక్క అవకాశం మాత్రం దొరకవచ్చు. ఇంకొక్క జన్మను పొందవచ్చు. అంతకుమించి అసాధ్యం. అప్పుడు మీరు తప్పకుండా వెళ్ళిపోయే తీరాలి. ఇంకో జన్మతో మీరు ఈ ప్రపంచాన్ని అంటిపెట్టుకుని ఉండవచ్చు, మీ అన్ని వేర్లూ శిధిలం అయిపోయి ఉన్నాయి కాబట్టి, కానీ మీకు ఇంకా ఓ శరీరం మిగిలే ఉంది కాబట్టి. కాబట్టి మీరు శరీరంలో ఉండవచ్చు. ఇంకో జన్మపాటు మీరు శరీరంతో అతుక్కుని ఉండవచ్చు. ఆ తరువాత మీరు వెళ్ళిపోయే తీరాలి.

అప్పుడు తృతీయస్థాయి బుద్ధత్వం వస్తుంది. బుద్ధుడు ఎవరంటే అప్పటికే వెళ్ళిపోయి ఉన్నవాడూ, అయినా ఇంకా సహాయాన్ని చేస్తూనే ఉన్నవాడు. కానీ గుర్తుపెట్టుకోండి, ముందుగా మీరు బోధిసత్త్వుళ్ళు అయి ఉంటేనే, బుద్ధత్వం వచ్చిన తరువాత కూడా సహాయాలు చెయ్యగల సమర్థులు అయివుంటారు. అది జరిగి ఉండకపోయి ఉంటే, ఎవ్వరికీ మీరు ఏ సహాయాలనూ చెయ్యలేరు.

ఈ రెండు పదాలనూ మీరు అర్థం చేసుకోవాలి. మొదటిది 'అర్హతుడు', రెండవది 'బోధిసత్త్వుడు'. అర్హతుడు ఎవరంటే... ఇది అదే సమానస్థాయి – ప్రపంచం నాశనం అయిపోయి ఉంటుంది, ఆ మనిషికి ఏ బంధాలూ ఉండవు, అహంకారం మొత్తం వెళ్ళిపోయి ఉంటుంది – కానీ వెంటనే ఆ మనిషి ఆవలి ఒడ్డుకు వెళ్ళిపోతాడు. ఆ మనిషే 'అర్హతుడు'. ఆ అర్హతుడు ఇంకెవ్వరినీ పట్టించుకోడు. సంసిద్ధంగా ఉంటూ సమయం రాగానే ఆ ఒడ్డుకు వెళ్ళిపోతాడు. అవతలి ఒడ్డు మీది నుంచి ఏ సహాయాన్ని ఆ మనిషి చెయ్యలేడు ఎందుకంటే ఎలా సహాయపడవచ్చో ఆ మనిషికి తెలియదు కాబట్టి. సహాయం చేసే ఏ శిక్షణనూ ఆ మనిషి పొంది ఉండడు. ఓ బోధిసత్త్వుడు కూడా అర్హతుడి స్థాయిలోనే ఉంటాడు. ఆ బోధిసత్త్వుడు తెలుసుకున్నాడు, చూశాడు, స్వయంగా సత్యమే అయిపోయాడు, కానీ ఆయన ఈ ఒడ్డు మీదే నిలబడి

మరికొంత సమయంపాటు ఉంటాడు. తన శక్తికొద్దీ మనుష్యులకు సహాయాలను చేస్తూ ఉంటాడు. ఆ బోధిసత్వుడు ఏ విధమైన సహాయాలనైనా చేస్తూ ఉంటాడు. ఎలా సహాయాలు చెయ్యాలో బోధిసత్వుడు నేర్చుకుని ఉంటాడు.

మీరు ఓ బోధిసత్వుడు అయివుంటే మీరు ఆవలి ఒడ్డుకు చేరుకున్నప్పుడు, ఆ ఆవలి ఒడ్డులో ఓ అర్హతుడు కూడా బుద్ధుడు అవుతాడు, బోధిసత్వుడు కూడా బుద్ధుడు అవుతాడు – ఆ ఆవలితీరం బుద్ధత్వప్రాప్తి తీరంగా ఉంటుంది – కానీ ఈ ఒడ్డు మీద ఓ బోధిసత్వుడై ఉన్నవాడు ఆవలితీరంలో నుంచి కూడా సహాయాలు చెయ్యగలుగుతాడు. ఆయనకు తెలుసు ఏ సహాయాలను ఎలా చెయ్యాలో. ఓ బుద్ధుడు సహాయాలను చేస్తూనే ఉంటాడు శతాబ్దాల పర్యంతమూ.

ఇప్పుడు కూడా, మీరు బుద్ధుణ్ణి స్వీకరిస్తూ ఉంటే, ఆ సహాయాలు తప్పకుండా అందుతాయి. ఇప్పుడు కూడా, మీరు బుద్ధుడి ప్రేమావేశంతో ఉంటే, ఆ సహాయాలు మీకు అందుతూనే ఉంటాయి. ఆవలితీరం నుండి బుద్ధుడు ఇంకా ఘోషిస్తూనే ఉన్నాడు, కానీ ఆవలితీరం నుండి వినిపిస్తున్న ఆ ఘోష ఎంతో దూరంలో నుండే వినిపిస్తోంది. మీరు ఎంతో మహావధానంతో దాన్ని వినాల్సి ఉంటుంది, నా మాటలను వింటున్న మీ అవధానం కన్నా ఎంతో ఎక్కువగా, ఎందుకంటే ఆ మాటలు ఆవలితీరం నుండి వినిపిస్తున్నాయి కనుక.

త్వరలోనో, కాస్త ఆలస్యంగానో నేను వెళ్ళిపోతాను. ఇప్పుడు నా మాటలను మీరు శ్రద్ధగా అవధానంతో వింటూ ఉండగలుగుతూ ఉంటే, ఆవలి ఒడ్డు నుంచి నేను చెప్పబోయే మాటలను కూడా తప్పకుండా మీరు వినగలుగుతారు.

బుద్ధత్వమే చైతన్యత్వపు పరమోత్తమ స్థాయి. కానీ మీరు ఓ బోధిసత్వ స్థాయిని అందుకుని చైతన్య పరమస్థాయికి చేరుకుంటే మీరు ప్రపంచంలోని సహాయార్థులకు అందుబాటులోనే ఉంటారు. మీరు దివ్యత్వానికి శాశ్వత గవాక్షంగా ఉంటారు. బోధిసత్వ స్థాయిలో నుంచి మీరు అక్కడికి చేరకపోతే మీరు సర్వస్వంలోకే అదృశ్యం అయిపోతారు. కానీ మీ వల్ల ఏ సహాయాలూ జరగవు.

## చివరిప్రశ్న :

*ప్రియ ఓషో,*

*ఓ మానవుడు తన బుద్ధత్వస్థాయిని ప్రాప్తించుకుని తీరాలని మీరు చెప్తున్నప్పుడు, మీరు ఓ హఠాత్ మెరుపులాగా ఓ క్షణంలో అది ప్రాప్తిస్తుందనీ, క్రమేపీ*

*సంభవించే ప్రాప్తం కాదనీ అంటారు. కానీ, నాలో ఏం జరుగుతూ ఉందో గమనించి చూసుకుంటున్నప్పుడు ఎంతో నెమ్మదిగా మరింత ఎక్కువ తృప్తిని పొందుతూ, నా అహంకారం నుండి మరింత ఎక్కువగా బయటపడుతూ ఉన్నట్లే అది నాలో జరుగుతూ ఉందని నాకు తెలుస్తోంది. ఈ విధంగా క్రమేపీ ప్రాప్తించే ప్రాప్తానికీ, 'హఠాత్ తటిల్లత'లాగా మీకు ప్రాప్తించిన ప్రాప్తానికీ మధ్య ఉన్న తారతమ్యాన్ని స్పష్టంగా వివరించి చెప్తారా? ఇలా నిదానంగా సంభవించే ప్రాప్తంతోనే తృప్తిపడి ఉండడంలో ఏ ప్రమాదమైనా ఉందా?*

లేదు, దీప్తా, ఏ ప్రమాదమూ లేదు. సంప్రజ్ఞత ఎప్పుడూ ఓ హఠాత్ మెరుపులాగే ప్రాప్తిస్తుంది. అది చట్టుక్కున ఓ మెరుపులో, ఓ విస్ఫోటనంలో ప్రాప్తిస్తుంది. అది ఓ క్రమంలో రాదు. అది సావధానంగా, నెమ్మదిగా ఎందుకు రాదంటే ఆ సంప్రజ్ఞతను చిన్నచిన్న ముక్కలుగా విభజించడం అసాధ్యం కనుక. ఆ సంప్రజ్ఞతను నువ్వు చిన్నచిన్న ముక్కలుగా పొందలేవు.

అప్పుడు దీప్తాకు ఏం జరుగుతూ ఉంటుంది? ఆమె మరింత తృప్తురాలై తాను తయారవుతున్నానని అనుకుంటూ ఉంటోంది. అది కాదు సంప్రజ్ఞతను ప్రాప్తించుకోవడం అంటే. అక్కడ జరుగుతున్నది సంప్రజ్ఞతా ప్రాప్తానికి అనుకూలమైన పూర్వభూమి నిర్మాణం మాత్రమే. ఆ సంప్రజ్ఞత ప్రాప్తించగలిగే పూర్వభూమి నిర్మాణం నెమ్మదిగా, క్రమక్రమంగానే జరుగుతుంది. అతి నిదానంగానే వాస్తవంలో అది జరిగితీరాలి. ఓ మెరుపు మెరిసినంత వేగంగా ఆ పూర్వభూమి నిర్మాణాన్ని మీరు చెయ్యలేరు. ఆ పూర్వభూమి నిర్మాణం పూర్తవడానికి అప్పుడప్పుడూ కొన్ని జన్మలు పట్టవచ్చు.

బుద్ధత్వ ప్రాప్తాన్ని సాకారం చేసే పూర్వభూమి నిర్మాణం క్రమక్రమంగానే జరుగుతుంది. కానీ ఆ బుద్ధత్వ ప్రాప్తి మాత్రం హఠాత్తుగా ఓ క్షణం లోపలే మీలో విస్ఫోటించి జరుగుతుంది. కాబట్టి నువ్వు భయపడకు. నువ్వు సరైన మార్గంలోనే చరిస్తున్నావు. నువ్వు మరింత ఎక్కువ తృప్తినే పొందుతూ ఉండు.

ఆ సంప్రజ్ఞతా తటిల్లత మహాతృప్తితోపాటు వస్తుంది.

ఈ రోజుకు ఇది చాలు.

# 5. సంప్రజ్ఞత రుచి

మరి ఎందుకు? ఎందుకంటే, సుభూతీ, ఈ బోధిసత్త్వాళ్ళలో
'నేను' అన్న గ్రహణం ఏర్పడదు కనుక,
'జీవిని' అన్న గ్రహణం ఏర్పడదు కనుక,
'ఆత్మను' అన్న గ్రహణం ఏర్పడదు కనుక,
'వ్యక్తిని' అన్న గ్రహణం ఏర్పడదు కనుక.
ఉండవులే మరి ఉండబోవు ఈ బోధిసత్త్వాలకు
'ధర్మం ఇది' అన్న గ్రహణం,
'ధర్మం కాదిది' అన్న గ్రహణం.
గ్రహణమూ ఉండదు, అగ్రహణమూ ఉండదు బోధిసత్త్వాళ్ళలో.
మరి ఎందుకు? ఎందుకంటే, సుభూతీ, ఈ బోధిసత్త్వాళ్ళలో,
ధర్మం ఇదన్న, ధర్మం ఇది కాదన్న, జ్ఞానం కనుక ఏర్పడి ఉంటే,
ఓ 'ఆహాన్ని' అన్న భావాన్ని, ఓ 'జీవిని' అన్న భావాన్ని,
ఓ 'ఆత్మను' అన్న భావాన్ని, ఓ 'వ్యక్తిని' అన్న భావాన్ని
వాళ్ళు లాక్కుని దొరకబుచ్చుకుంటారు కనుక.
మరి ఎందుకు? బోధిసత్త్వాళ్ళు ఏ ధర్మాన్నీ, ఏ ధర్మశూన్యతనూ
దొరకబుచ్చుకుని పట్టుకోకూడదు కనుక.
అందువల్లే పరిబోధింపబడింది ఈ తథాగత ప్రవచనం ఓ రహస్య
అంతరార్థంతో : 'ఈ ధర్మబోధను విన్నవాళ్ళు వదిలిపెట్టెయ్యాలి దీన్ని
ఓ తెప్పలా వాడుకుని, అన్ని ధర్మాలూ విడిచిపెట్టెయ్యబడాలి,
అన్ని ధర్మశూన్యతలూ విడిచిపెట్టెయ్యబడాలి అంతకంటే ఎక్కువగా.'

భగవానుడు అడిగాడు : నువ్వేమనుకుంటున్నావు, సుభూతీ,
'ఇదే పరమధర్మం, ఇదే సరైన సర్వోత్కృష్ట సంప్రజ్ఞత' అని తథాగతుడు

> **సంపూర్ణంగా పరిగ్రహించింది కానీ, తథాగతుడు ఆచరించి పరిబోధించిన ధర్మం కానీ ఉందా ఏదయినా?**
>
> **సుభూతి ఇచ్చాడు ప్రత్యుత్తరాన్ని : లేదు. భగవానుడి ప్రవచనాల పరిబోధలో నేను అర్థంచేసుకున్న ఏ ధర్మమూ లేదు. మరి ఎందుకు లేదు? తథాగతుడు సంపూర్ణంగా పరిగ్రహించిన, ఆచరించి పరిబోధించిన ఈ ధర్మం - కాదు గ్రాహ్యసాధ్యం, కాదు బోధింప సాధ్యం. అది ధర్మమూ కాదు, ధర్మశూన్యతా కాదు. మరి ఎందుకు? ఎందుకంటే ఓ పరమం పవిత్రుళ్ళను పరమస్థాయిలో పరిస్థాపించి ఉంచుతోంది కాబట్టి.**

మళ్ళీ సంగ్రహంగా చెప్పుకోవడానికి... మనం నేర్చుకున్న చివరి సూత్రంలో సుభూతి అడిగాడు :

చివరిశకంలో ఏ జీవులైనా ఉంటారా, మహాధర్మం భ్రష్టం అయిపోయివున్న కాలంలో, ఈ ధర్మాన్ని అర్థంచేసుకోగలిగినవాళ్ళు?

బుద్ధుడు అన్నాడు : ఆ విధంగా మాట్లాడకు సుభూతీ, నిజమే. అప్పుడు కూడా సత్యాన్ని అర్థం చేసుకోగలిగే జీవులు ఉంటారు. కనీసం ఒక్క అతిపవిత్ర, అతినిర్మల విశ్వాసం అయినా చాలు, ఓ మనిషిని పరివర్తించేందుకు.

> ***బుద్ధజ్ఞానంతో తథాగతుడికి వాళ్ళందరు తెలుసు.***
> ***తథాగత బుద్ధనేత్ర ప్రజ్ఞతో ఆ బోధిసత్త్వులందరూ సుభూతీ,***
> ***పూర్ణజ్ఞానులే తథాగతుడికి.***

కొన్ని విషయాలను అర్థం చేసుకోవాలి. అప్పుడు ఈనాటి సూత్రంలోకి ప్రవేశించడానికి ఎంతో సులభంగా ఉంటుంది. ముందుగా, మహాధర్మం, సద్ధర్మం. బుద్ధుడు అంటాడు ఓ సిద్ధాంతాన్ని మంచి సిద్ధాంతమని, అది ఏ సిద్ధాంతమూ కాకుండా ఉన్నప్పుడు. అది ఓ సిద్ధాంతం అయివుంటే అప్పుడు అది మంచి సిద్ధాంతం కాదు. బుద్ధుడు అంటాడు వేదాంతాన్ని ఓ మంచి వేదాంతం అని, అది ఏ వేదాంతమూ కాకుండా ఉన్నప్పుడు. అది ఓ వేదాంతంగా ఉంటే అప్పుడు అది మంచి వేదాంతం కాదు.

'సిద్ధాంతం' అన్నది ఓ కూర్పు, ఓ నిశ్చితమైన సంభవం. విశ్వం అతలాకుతలంగా ఉంటోంది. అది ఏ సిద్ధాంతంలోకీ ఇమడదు. ఏ సిద్ధాంతమూ

దాన్ని తనలో ఇమిడ్చి ఉంచుకోలేదు. ఏ సిద్ధాంతమూ ఆ విశ్వసర్వస్వానికి, ఆ ఉనికికి న్యాయం చెయ్యలేదు. ఏ సిద్ధాంతమూ చాలదు.

కాబట్టి బుద్ధుడు అంటాడు "నా మతసిద్ధాంతం సిద్ధాంతం కాదు, నా దర్శనం మాత్రమే. ఈ నియమాల వ్యవస్థను నేను మీకు అందించడం లేదు". ఆయన అంటాడు "వాస్తవం వైపుకు చేర్చే దారిని మాత్రం నేను సూచిస్తున్నాను. ఓ తలుపును తెరిచే తాళంచెవిని మాత్రం మీకు అందిస్తున్నాను. ఆ తలుపును తెరచిన తరువాత మీకు ఏం కనిపిస్తుందో మాత్రం నేను చెప్పడం లేదు. దాన్ని గురించి ఏమీ చెప్పలేం."

ఒక్కసారి ఎప్పుడూ ఓ చీకటి గుహలోనే జీవించిన ఓ మనిషిని ఊహించుకోండి. ఆ మనిషికి ఏ వెలుతురు గురించీ తెలియదు. ఏ రంగుల గురించీ తెలియదు. ఆ మనిషి ఎప్పుడూ సూర్యచంద్రుళ్ళను సైతం చూసి ఉండడు. ఆ మనిషికి మీరు ఇంద్రధనుస్సు గురించి ఏం చెప్పగలుగుతారు? ఆ మనిషితో మీరు నక్షత్రాల గురించి ఏం మాట్లాడగలుగుతారు? ఓ రోజాపువ్వు గురించి ఎలా వర్ణించి చెప్పగలుగుతారు? అది అసాధ్యం. మీరు ఏం చెప్పినా, ఆ మనిషికి ఏం అర్థమైనా, అదంతా తప్పుగానే ఉంటుంది. ఆ మనిషి ఓ సిద్ధాంతాన్ని సృష్టించుకుంటాడు. అది తప్పుగా ఉంటుంది.

కాబట్టే బుద్ధుడు అంటాడు : "నేను ఏ సిద్ధాంతాన్నీ అందించడం లేదు. ఓ తలుపును తెరిచే తాళంచెవిని మాత్రం మీకు అందిస్తున్నాను. మీరు ఆ తలుపును తెరిచి ఉంటూ ఉన్న మీ జీవుడి చీకటి గుహలో నుంచి బయటికి వచ్చి స్వయంగా దర్శించి విషయాన్ని, ఉన్నదాన్ని తెలుసుకోండి – యధాభూతం, ఏది ఉందో దాన్ని. బుద్ధుడు ఓ వేదాంతి కాదు, ఆయన ఓ వైద్యుడు. ఆయన సరిగ్గా ఆ మాటనే అన్నాడు "నేను వైద్యుణ్ణి, వేదాంతిని కాను" అని.

రంగుల గురించీ, వెలుతురు గురించీ ఓ గుడ్డివాడికి ఎప్పుడూ చెబుతూ ఉండేవాడే వేదాంతి. ఈ వేదాంతి ఆ మనిషిని మరింత గందరగోళంలో పడేస్తూ ఆ మనిషిలో మరింత భ్రమనే కలిగిస్తూ ఉంటాడు. ఆ గుడ్డిమనిషికి వెలుతురు గురించి ఏ మాత్రమూ అర్థం చేసుకునే సామర్థ్యం ఉండదు. బుద్ధుడు అంటాడు "నేను వెలుతురు గురించి సిద్ధాంతీకరించి ఏమీ చెప్పను. కేవలం మీకు ఓ ఔషధాన్ని మాత్రమే అందిస్తాను, మీ అంధత్వం పోయేందుకోసం మాత్రమే ప్రయత్నిస్తాను. ఆ తరువాత

మీ కళ్ళతో మీరు చూడవచ్చు". ఇదే ఆయన అంటున్న మంచి సిద్ధాంతం. ఇదే ఆయన అంటున్న మంచి ధర్మం. ఇది ఓ పూర్తివిభిన్న దర్శనమై ఉంటుంది.

అర్థం చేసుకోవాల్సిన రెండవ విషయం : బుద్ధుడు సుభూతితో అంటున్నాడు "ఆ విధంగా మాట్లాడకు సుభూతీ" అని. ఎందుకు? – ఎందుకంటే అప్పుడు శిష్యులందరిలో సర్వత్రా అదే ఆలోచన ఉంది కనుక, సుభూతి వంటి మనుష్యుల్లో కూడా, ఎన్నో ఆధ్యాత్మిక లక్షణాలు ఉన్నవాళ్ళల్లో కూడా... తామే ఎంతో ప్రత్యేకమైన వాళ్ళమని, అప్పటి సమయమే అత్యంత ప్రత్యేకమైన కాలమని, ఆ శకమే గొప్ప శకమని, అప్పుడున్న ఔన్నత్య స్థితిని ఇక ఎప్పటికీ ఎవ్వరూ అందుకోలేరని. ఇది అహంకారపూరిత, ఇది ఓ మహాసూక్ష్మ అహంకారపూరిత వైఖరే. ఈ వైఖరి సుభూతి గురించి చాలావరకు తెలియజేస్తుంది. ఆయనలో ఇంకా ఆ మహాసూక్ష్మపు అహం ఉంది.

యుగాల పర్యంతం దాదాపుగా మనుష్యులందరూ ఈ అస్వస్థత వల్ల ఎన్నో బాధలుపడ్డారు; వాళ్ళు ఉంటున్న కాలమే ఏ ప్రత్యేకతతోనో నిండి ఉన్న కాలమని వాళ్ళు అనుకుంటారు. ఏ కాలమూ ప్రత్యేకంగా ఉండదు. దివ్యత్వం అన్ని కాలాలలోనూ అందుతూ ఉంటుంది. భారతదేశంలో హిందువులు అంటారు, ఈ సమయంలో ఎవ్వరూ సంప్రజ్ఞులు కాలేరని; ఎందుకంటే ఇది కలియుగం కాబట్టి. ఇదే ఆఖరియుగం. ఈ యుగం మహాచండాలంగా ఉంటుంది – ఈ యుగంలో ఎవ్వరూ సంప్రజ్ఞులు కాలేరు. జైనులు అంటారు ఎవ్వరూ జ్ఞానోదయాన్ని పొందలేరని ఎందుకంటే ఇది పంచమకాలం, అయిదవశకం కనుక. బౌద్ధులు కూడా, ఈ వజ్రచ్ఛేదికా సూత్రం వాళ్ళకు తెలిసే ఉన్నా, ఎప్పుడూ చెబుతూ ఉంటారు, ఈ యుగంలో ఎవ్వరికీ సంప్రజ్ఞత్వం రాదని. వాళ్ళు కూడా బుద్ధుడి మాటలను ఎవ్వరికీ ఈ కాలంలో సంప్రజ్ఞత్వం రాదని అర్థం వచ్చేట్లు కనిపించే అన్వయం చేసుకునే ప్రయత్నాలనే చేస్తూ ఉంటున్నారు.

సరిగ్గా మొన్న రాత్రే నేను వజ్రచ్ఛేదికా సూత్రపు ఓ వ్యాఖ్యానాన్ని చదువుతూ ఉన్నాను. ఆ వ్యాఖ్యాత అంటాడు "ఔను. బుద్ధుడు అంటాడు. అప్పుడు కూడా కొంతమంది మనుష్యులు ఉంటారు. వాళ్ళకు ఈ సత్యంలో ఒక చిన్నభాగం అర్థం అవుతుంది. వాళ్ళకు మహాపుణ్యం వస్తుంది – కానీ 'సంప్రజ్ఞత' అంటే పుణ్యం కాదు. ఆ పుణ్యం కేవలం పూర్వభూమి మాత్రమే" అని.

ఆ విధంగా ఆ అన్వయకారుడు, ఆ వ్యాఖ్యాత అంటాడు "ఈ యుగంలో ఎవ్వరూ జ్ఞానోదయాన్ని పొందలేరు. మహాఅయితే, కొంత పుణ్యాన్ని సంపాదించుకోవచ్చు, అంతే. మీరు ఆ జ్ఞానోదయం కోసం యుక్తసమయం కోసం నిరీక్షిస్తూనే ఉండాల్సి వస్తుంది. మీ పుణ్యం అందుకోసం ఎంతో సహాయపడుతుంది, అది ఓ అస్థి భారాన్ని నిర్మిస్తుంది, కానీ ఆలయాన్ని మాత్రం మీరు నిర్మించుకోలేరు". ఈ విధంగానే అందరూ ఆలోచిస్తూ ఉంటారు, చెప్పుకుంటూ ఉంటారు.

బుద్ధుడు ఏదైతే చెప్తున్నాడో అది కేవలం ఈ సంగతినే, అన్ని సమయాలూ సత్యాన్వేషికి అంతా సమానమని – అది సత్యాన్వేషులు కానివారికి కూడా సమానంగానే ఉంటుంది. బుద్ధుడి జీవిత సమయంలో ఎన్నో లక్షలమంది మనుష్యులు ఉండేవారు, సంప్రజ్ఞత్వాన్ని ఎప్పటికీ పొందనివాళ్ళు. ఆ కాలం వసంత ఋతువులాగా ఉండేది కాదు – వసంతం వస్తే అన్ని మొక్కలూ పుష్పించేట్లుగా. అదే యుక్తసమయం అయివుంటే, అప్పుడు బుద్ధుడితోపాటు ఎన్నో లక్షలమందికి జ్ఞానోదయం కలిగి ఉండాల్సి వచ్చేది. అప్పుడు అతికొద్దిమందికి మాత్రమే సంప్రజ్ఞత ప్రాప్తించింది. కాబట్టి ఆ కాలం వసంతఋతువులా ఉండేది కాదు, అది వాతావరణం సమస్య కాదు; ఏ మహాప్రత్యేక శుభవేళలూ మానవులను సంప్రజ్ఞులుగా చెయ్యవు.

ఎవరు వెతుకుతారో, ఎవరు అన్వేషిస్తారో, వారికే ప్రాప్తం వస్తుంది. వెతకనివాళ్ళకూ, అన్వేషించనివాళ్ళకూ సంప్రజ్ఞత్వం ప్రాప్తించదు. అప్పుడు మహా శుభవేళే ఉన్నా, దానికి ఏ అర్థమూ ఉండదు. కాలం సమానంగా ఉంటుంది. ఆ కాలం మంచిదిగానూ ఉండదు, చెడ్డదిగానూ ఉండదు. కాలం సంప్రజ్ఞతకు అనుకూలంగానూ ఉండదు, ప్రతికూలంగానూ ఉండదు. మీ జీవితం మీరు ఏం కావాలని అనుకుంటూ ఉంటారో దానికే కాలం అవకాశాన్ని మీకు అందిస్తూ ఉంటుంది.

కాలానికి ఏ పక్షపాతమూ ఉండదు. అది మీ మీద దేన్నీ శాసించదు. అది మీకు స్వాతంత్ర్యాన్నే ఇస్తుంది. మీరు సంప్రజ్ఞులు అయిపోవచ్చు, మీరు కోరుకున్నంతగా లేదా మీరు సంప్రజ్ఞతను పొందకుండానే ఉండవచ్చు, మీరు నిర్ణయించుకున్నట్లుగానే. ఉనికి సర్వస్వం మీతో సహకరిస్తూనే ఉంటుంది. కానీ ఈ సంశయపు ఊహ ఎప్పుడూ మళ్ళీ మళ్ళీ తలెత్తుతూనే ఉంటుంది. ప్రపంచంలోని ఎన్నో వాఙ్మయాల్లో ఈ శంక నాకు ఎన్నో చోట్లలో కనిపించింది. మనుష్యులు అనుకుంటూ ఉంటారు 'తక్కిన మనుష్యులకు ఏమైపోతుందో భవిష్యత్తులో' అని.

ఈ శంకే మామూలు మానవులకు కూడా ఎప్పుడూ కలుగుతూనే ఉంటుంది. మీరు ఏ వృద్ధుడి వద్దకు అయినా వెళ్ళి చూడవచ్చు, ఆ వృద్ధుడు ఎప్పుడూ తన పాతరోజుల గురించే మాట్లాడుతూ ఉంటాడు. ఎంత అందమైన రోజులు అవి? బంగారు రోజులు. ఆ రోజులు ఎంతో ప్రత్యేకంగా ఉండేవి. అవి ఎంత గొప్పగా ఉండేవి! ఇప్పటి రోజుల్లో ఏమీ ఉండడం లేదు. మరి మరచిపోకండి. మీకు కూడా వృద్ధాప్యం వచ్చేసిన తరువాత మీరు కూడా మీ చిన్నపిల్లలకు ఇలాంటి పెద్ద పెద్ద కథలనే చెప్తారు, ఇంకా ఇంకా కథలు చెబుతూ, చివరిలో "అవీ, రోజులంటే" అని తప్పకుండా అంటారు.

ఇది నేను విన్నాను. ఒకాయన తన ఎనభైఏళ్ళ వయస్సులో పారిస్ నగరానికి వచ్చాడు, డెబ్బైఎనిమిదేళ్ళ భార్యను కూడా వెంటబెట్టుకుని. వాళ్ళు ఆ నగరమంతా తిరిగి చూశారు. అప్పుడు ఆ పెద్దాయన ఇలా అన్నాడు "అన్ని విషయాలూ మారిపోయాయి. పారిస్ నగరం ఇదివరకటి పారిస్‌గా ఉండడం లేదు. యాభైఏళ్ళక్రితం నేను ఇక్కడికి వచ్చాను. అప్పుడు నాకు వయస్సు ముప్పైఏళ్ళే. అప్పుడు పారిస్ అద్భుతంగా ఉండేది, అదే నిజం పారిస్".

ఆయన భార్య నవ్వింది, ఆడవాళ్ళు అన్నింట్లోనూ కల్పించుకుంటూ భూమికి ఎంతో దగ్గరగా ఉంటారు. ఆమె అంది "నేను అలా అనుకోవడం లేదు. మీరు అప్పటిలాగా ఉండటం లేదు. అంతే. పారిస్ నగరం ఉన్నది ఉన్నట్లుగానే ఉంటుంది. అక్కడ చూడండి, ఆ యువతీ యువకుల్ని – ఎంత ఆనందంగా ఎగురుతున్నారో. మీరు కూడా అప్పుడు వీళ్ళ లాగానే ఉండి ఉంటారు. ఇలాగే ఆనందిస్తూ ఉండి ఉంటారు."

ఇప్పుడు ఆ ఎనభైఏళ్ళ మనిషికి, పారిస్ నగరంలో ఏం మిగిలి ఉండదు. పారిస్ నగరం రాత్రిపూట మహాసజీవంగా ఉంటుంది. ఎనభైఏళ్ళ మానవుడికి, అది అసంబద్ధంగా ఉంటుంది. ఆ మనిషి ఆ జీవ వ్యాపారంలో ఆనందిస్తూ, పిచ్చివాడిలా ఉండడు. ఆ మనిషి యవ్వనంలో ఉండడం లేదు, అలా పిచ్చివాడై ఉండేందుకు. కలలన్నీ అదృశ్యం అయిపోయాయి. ఆ మనిషి భార్య చెప్తున్నదే సత్యమని నాకు అనిపిస్తూ ఉంది. "మీరు అప్పటిలాగా ఉండటం లేదు, పారిస్ నగరం ఉన్నది ఉన్నట్లుగానే ఉంటుంది."

ఇదే మీకు కూడా జరుగుతుంది. మీరు కూడా మీ బాల్యంలోని రోజులే బాగుండేవి అని ఆలోచించడం మొదలుపెట్టేస్తారు; ఇప్పటి పరిస్థితులు అప్పటిలా

ఉండడం లేదు. ఇప్పటి పిల్లల్ని చూస్తూ ఉంటే మీకు ఎంతో జాలి కలుగుతుంది. మీకు తెలియదు - ఈ పిల్లలు కూడా ఏదో ఒకనాటికి ఇతర పిల్లల్ని చూస్తూ జాలిపడతారు మీరు ఇప్పుడు పడుతున్నట్లుగానే. ఇది ఎప్పుడూ ఇలాగే జరుగుతూ ఉంటుంది. ప్రతిమనిషీ తన గతంలోని రోజులే బాగుండేవి అనీ, ఏ ప్రత్యేకతో ఆ కాలానికి ఉండేదనీ అనుకుంటాడు. ఇది విప్లవాత్మకంగా ఉంటుంది.

మరి నేను దీన్ని కూడా విన్నాను. ఈ మాటలను ఆడమ్ అన్నాడు, ఆడమ్ ఈవ్‌లను ఈడెన్ ఉద్యానవనం నుండి బయటకు తోసేసినప్పుడు. ఆడమ్ అన్నాడు ఈవ్‌తో "చూడు, మనం జీవిస్తూ ఉన్న, మనం గడుపుకొస్తున్న ఈ రోజులు మహా గడ్డురోజులు" అని. అది సహజం. ఈడెన్ వనంలోంచి బహిష్కరింపబడడం వాళ్ళకు మహాసంకట పరిస్థితిగానే ఉండితీరుతుంది. అంతటి మహాకష్టాన్ని మళ్ళీ ఎవ్వరూ పొందలేరు.

బుద్ధుడు అంటున్నాడు **"అలా మాట్లాడకు సుభూతీ"** అని. ఎందుకు అంటున్నాడు? - ఎందుకంటే కాలమంతటికీ ఉన్న లక్షణం ఎప్పుడూ ఒక్కటే కాబట్టే. కాల స్థలావరణాలు మీ చేతల వల్ల ఎప్పటికీ పాడు కావు. కాలావరణాన్నీ, స్థలావరణాన్నీ మీరు ఎప్పటికీ పాడుచెయ్యలేరు. కనీసం కాలాన్ని పట్టుకోలేకపోతున్న మీరు, దాన్ని ఎలా భ్రష్టుపట్టించగలుగుతారు? కాల స్థలావరణాలు అకలుషితంగా ఉంటాయి. గాలినీ, సముద్రాన్నీ మీరు కలుషితం చేసెయ్యొచ్చు, కానీ మీరు కాలాన్ని ఎలా కలుషితం చెయ్యగలుగుతారు? ఎలాగైనా చేసేస్తాం అంటారా?

మీరు కాలాన్ని కలుషితం ఎలా చెయ్యగలుగుతారు? కనీసం దాన్ని మీరు పట్టుకోనైనా లేరు. మీరు దాన్ని పట్టుకునేసరికే, అది మీ చేతుల్లోంచి ఎప్పుడో జారిపోయే ఉంటుంది. ఈ క్షణాన్ని గురించిన ఎరుక మీకు ఏర్పడే లోపలే అది అక్కడ ఉండదు. అది అప్పటికే గతంగా అయిపోయి ఉంటుంది. అది అప్పటికే చరిత్రగా అయిపోయి ఉంటుంది. మీరు కాలాన్ని కలుషితం చెయ్యలేరు. కాలం ఓ అత్యంత మహాస్వచ్ఛమైన విషయంగా ఉంటుంది. అది ఎప్పటికీ శుద్ధంగా ఉంటుంది.

అందువల్లే బుద్ధుడు అంటున్నాడు "అలా మాట్లాడకు సుభూతీ, ఔను, అప్పుడు కూడా ఉంటారు జీవులు, ఈ సత్యాన్ని అర్థం చేసుకునేవాళ్ళు". ఎందుకంటే కాలం అన్నది అప్పుడప్పుడూ సంభవిస్తూ అప్పుడప్పుడూ సంభవించకుండా పోయే లక్షణంతో ఉండదు కనుక. సత్యం శాశ్వతంగా ఉంటుంది. దాన్నే అంటారు 'సత్యం' అని - ఏది శాశ్వతంగా ఉంటుందో దాన్ని.

సత్యానికి కాలంతో ఏ సంబంధమూ ఉండదు, అది శాశ్వతమై ఉంటుంది. ప్రభాతంలో మీకు ఆ సత్యప్రాప్తి కలుగవచ్చు. మీరు అర్థరాత్రివేళ ఆ సత్యప్రాప్తిని పొందవచ్చు. మీకు ఆ సత్యప్రాప్తి వాణిజ్య వర్తక స్థలాల్లో ప్రాప్తించవచ్చు. మీరు ఆ సత్యప్రాప్తిని హిమాలయాల్లో పొందవచ్చు, మీరు ఓ పురుషుడై ఉన్నా, మీరు ఓ స్త్రీ అయి ఉన్నా, ఓ బాలుడై మీరు ఉన్నా, మీరు ఓ యువకుడిగా ఉన్నా, మీరు ఓ వృద్ధుడిగా ఉన్నా మీరు సత్యప్రాప్తిని పొందవచ్చు. మీరు సత్యప్రాప్తిని ఏ క్షణంలోనైనా, ఏ చోట్లోనైనా పొందవచ్చు, అది సర్వస్వంలోనూ ఉంటుంది కాబట్టి, అది ఎప్పుడూ ఉంటోంది కాబట్టి. మీరే దానికి అందుబాటులో ఉండాలి.

బుద్ధుడు ఇంకా అంటున్నాడు “కేవలం ఒక్క అతిపవిత్ర, అతినిర్మల ఆలోచన అయినా చాలు, ఓ మనిషిని పరివర్తించేందుకు...” అని. బుద్ధుడి అనుభూతిలో ‘అతిపవిత్ర, అతినిర్మల విశ్వాసం’ అన్న మాటకు ఏమిటి అర్థం? సాధారణంగా విశ్వాసం భయపూరితం అయివున్నదిగానే ఉంటుంది. ‘విశ్వసించడం’ అంటే భయపడడం తప్ప మరొక్కటి కాదు. మీరు చర్చీలకూ, దేవాలయాలకూ, గురుద్వారాలకూ వెళ్ళి చూస్తే అక్కడ అంతా మీకు భయం మనుష్యులే, హడలెత్తి ఉన్న మనుష్యులే కనిపిస్తారు. జీవితానికీ మృత్యువుకూ భయపడుతూ, ఏ దేవుడి ఆశ్రయాన్నో పొందాలనుకుంటున్న, ఏ రక్షణనో ఎక్కడో పొందాలనుకుంటున్న, తల్లిదండ్రుల్ని పోగొట్టుకుని ఊహాప్రసారాలతో ఏ స్వర్గంలోనో ఓ తండ్రినీ తల్లినీ సృష్టించుకుని చూసుకుంటున్న మనుష్యులే మీకు అక్కడ తారసించి కనిపిస్తూ ఉంటారు.

వాళ్ళు పరిణితితో ఉండరు, వాళ్ళు తండ్రిచాటు, తల్లిచాటు బిడ్డలు. వాళ్ళు తల్లిదండ్రులు లేకుండా ఉండలేరు. తండ్రి మరణించి ఉండొచ్చు, తల్లి జీవితురాలై ఉండకపోవచ్చు; అయినా వాళ్ళు ఇప్పటికీ పిల్లలే, వాళ్ళకు ఏ తల్లి కొంగో ఉండాలి, పట్టుకుని ఉండేందుకు. వాళ్ళు స్వంతంగా తమ కాళ్ళ మీద నిలబడలేరు. వాళ్ళు తమను తామే విశ్వసించుకోలేరు. వాళ్ళను వాళ్ళే నమ్ముకోలేరు.

మీరు భయపడుతూ ఉన్నప్పుడు, ఆ భయం ఉంటున్నందువల్లే మీరు మతజీవనులుగా తయారైపోతారు. ఇటువంటి మతం మోసంగా ఉంటుంది. అది ఓ కోతిమతంగా, మర్కటమతంగా, దేన్నో అనుకరించే మతంగా ఉంటుంది. భయంలోంచే జన్మిస్తుంది అనుకరించే తత్వం. బుద్ధుడు ‘విశ్వాసం’ అన్న మాటను అంటూ ఉన్నప్పుడు ఆ మాటకు అర్థం ఏమిటి? ఆయన మాట ‘షద్ద’. ఆ మాటకు సంస్కృత రూపం ‘శ్రద్ధ’. ఈ శ్రద్ధకు నిజంగా ‘విశ్వాసం’ అన్న అర్థం ఉండదు. ఆ మాటకు ‘ఓ నమ్మకం’ అన్న అర్థం మాత్రమే ఉంటుంది – తన మీద

తనకే నమ్మకం, ఆత్మవిశ్వాసం. అది ఓ పూర్తి విభిన్న మతం. దీన్నే 'సరైన మతం' అనీ, మరో మతాన్ని 'తప్పు మతం' అనీ బుద్ధుడు అంటాడు.

వాస్తవాన్ని మీరు భయపడుతూ, వణికిపోతూ సమీపిస్తూ ఉంటే తప్పు మార్గంలోనే దాన్ని మీరు సమీపిస్తూ ఉంటారు. అలా తప్పు పద్ధతితో ఆ వాస్తవాన్ని సమీపిస్తున్న మీకు అక్కడ ఏం కనిపించినా, మీకు ఏ అనుభూతి కలిగినా అది తప్పుగానే ఉంటుంది. మీవి తప్పు కళ్ళు. మీది తప్పు హృదయం. భయంతో చూసే చూపుతో సత్యం మీకు కనిపించదు. మీకు భయంలోంచి సత్యజ్ఞానం ఏర్పడదు. నిర్భయత్వంలోంచే సత్యజ్ఞానం ప్రాప్తిస్తుంది. మీకు షద్ద ఉండాలి, మీలోనే ఓ ఆత్మవిశ్వాసం ఉండాలి. మీ 'జీవుణ్ణి' మీరే నమ్మి విశ్వసించడమే ఆవశ్యకం.

సత్యాన్ని విశ్వాసంతోనే సమీపించాలి, భయపడుతూ కాదు. నమ్మకాల, విశ్వాసాల మూలసారం 'మిమ్మల్ని మీరు పూర్తిగా వదిలిపెట్టేసుకోవడం' మాత్రమే. నమ్మకం పట్ల, విశ్వాసం పట్ల 'ఆత్మార్పణం చేసేసుకోవడం' మాత్రమే. 'తన 'పట్టు'ను పూర్తిగా వదిలిపెట్టెయ్యడం' మాత్రమే. భయపడుతూ ఉంటున్న మనిషి ఎప్పుడూ తన 'పట్టు'ను విడిచిపెట్టడు, ఎప్పుడూ తనను తానే సంరక్షించుకుంటూ, ఎప్పుడూ తనను కాపాడుకుంటూ ఉంటాడు. ఎప్పుడూ పోట్లాడుతూనే ఉంటాడు. ఎప్పుడూ 'ప్రతిపక్షం'లోనే ఉంటాడు. ఆ మనిషి ప్రార్థన సైతం, ధ్యానం సైతం కేవలం తనను తాను రక్షించుకునే వ్యూహంగానే ఉంటుంది.

విశ్వాసం ఉంటున్న మనిషికి తనను తాను వదిలిపెట్టేసుకుని ఎలా ఉండాలో తెలిసి ఉంటుంది. ఆ మనిషికి ఎలా లొంగిపోయి ఉండాలో తెలిసి ఉంటుంది. ఓ నదితోపాటు ఎలా ప్రవహించాలో, దాన్ని ఎలా ఎదురీదకూడదో విశ్వాసం ఉంటున్న మనిషికి తెలుసు. ఆ నది తనను ఎక్కడికి తీసుకెళ్ళిపోయినా ఆ మనిషి నిరభ్యంతరంగా వెళ్ళిపోతాడు. ఆ మనిషికి నదితోపాటు ప్రవహించే ధైర్యం, నమ్మకం ఉంటుంది.

ఇదే నా అనుభవమూ, దర్శనమూ కూడా. ఎంతోమంది భయపడుతూ నా సామీప్యానికి వస్తూ ఉంటారు కానీ వాళ్ళు నాకు లొంగిపోలేరు, నన్ను శరణుజొచ్చులేరు. నన్ను ఆశ్రయించే సామర్థ్యం వాళ్ళకు ఉండదు. వాళ్ళు తమకు ఎంతో బలం ఉన్నట్లు అనుకుంటూ నా ముందు అణగి ఉండలేరు. అది వాళ్ళకు అసాధ్యం అయిపోతుంది. బలహీనులుగా మరొకరి ముందు ఉండాలని ఎవరికీ ఉండదు – ముఖ్యంగా బలహీనులకు. తాము బలహీనులం అన్న జ్ఞానాన్ని, తాము పిరికిపందలం అన్న జ్ఞానాన్ని పొందాలని వాళ్ళు అనుకోరు. వాళ్ళు అనుకుంటారు మహాబలవంతులమని – వాళ్ళు లొంగిపోలేరు.

నా అనుభవం ప్రకారం బలవంతులే సులభంగా ఎంత బలం ఎక్కువ ఉంటే అంత సులభంగా లొంగిపోగలుగుతూ ఉంటారు. కేవలం ఓ బలవంతుడు మాత్రవే లొంగిపోగలుగుతాడు, ఎందుకంటే ఆ మనిషి తనను తాను విశ్వసించగలుగుతాడు కనుక, తనను తాను నమ్ముకోగలుగుతాడు కనుక. ఆ మనిషి తనను తానే అందువల్ల విడిచిపెట్టేసుకోగలుగుతాడు. లొంగిపోయేందుకు భయపడడు. తనకు తెలియకుండా ఉంటున్నదాన్ని అన్వేషించేందుకు ఆ మనిషి సంసిద్ధుడై ఉంటాడు. ఏ అజ్ఞాతంలోకి అయినా ప్రవేశించేందుకు సిద్ధపడి ఉంటాడు. అజ్ఞాతంలోకి పయనించేందుకు ఆ మనిషిలో తుళ్ళింత కలుగుతూ ఉంటుంది. దాని రుచిని తెలుసుకుందామని ఆ మనిషి ఉవ్విళ్ళూరుతూ ఉంటాడు. దానికోసం దేన్ని ఫణంగా పెట్టాల్సి వచ్చినా, దానివల్ల ఏ ప్రమాదాన్ని ఎదుర్కోవాల్సి వచ్చినా ఆ మనిషి సమ్మతిస్తూ ఉంటాడు. ప్రమాదభరితంగా ఉన్నా అందులోనే జీవించాలనుకుంటాడు.

విశ్వాసి ఎప్పుడూ ప్రమాదంలోనే జీవిస్తూ ఉంటాడు. ప్రమాదమే ఆ మనిషికి ఆశ్రయం, అభద్రతే ఆ మనిషికి భద్రత, అతి తీవ్ర జిజ్ఞాసే ఆ మనిషికి ఉండే ఏకైక ప్రేమ. ఆ మనిషి ఎప్పుడూ అన్వేషణాత్మకంగా ఉండాలనుకుంటూ ఉంటాడు, ఆ మనిషి విశ్వపు అంచు చివరిదాకా వెళ్ళిపోవాలని అనుకుంటూ ఉంటాడు, లేదా సృష్టిలోతుల్లోకే వెళ్ళిపోవాలని అనుకుంటూ ఉంటాడు, లేదా ఉనికి మహోౌన్నత్యంలోకే చేరుకోవాలని అనుకుంటూ ఉంటాడు. ఆ మనిషి ‘అది ఏమిటో’ తెలుసుకోవాలని అనుకుంటాడు – “నన్ను ఆవరించి ఏది ఉంది ?” “ఏమిటి ‘నేను’ అని అనుకుంటున్న ఈ ‘నేను’?”, “నేను ఎవరిని?”

బలవంతుడే లొంగిపోయేందుకు సంసిద్ధంగా ఉంటాడు. తను భయపడనక్కర లేదని ఆ మనిషికి తెలుసు. “నేను ఈ ఉనికికి సంబంధించి ఉన్నాను, నేను ఈ ఉనికికి అపరిచితుణ్ణి కాను. ఈ ఉనికే తల్లి అయి నాకు ఈ జన్మను ఇచ్చింది. ఈ ఉనికి నాతో వైరంతో ఉండదు. ఆ ఉనికే నన్ను ఇక్కడికి తీసుకువచ్చింది. ఈ ఉనికి నిర్మించిన వస్తువునే నేను. ఈ ఉనికికే నా ద్వారా సాధించుకోవాల్సిన ఏ విధో ఉంది.”

బలవంతుడు ఎప్పుడూ ఆ విధినే అనుభూతితో తెలుసుకుంటూ ఉంటాడు. “ఉనికికి కావలసిన దేన్నో చెయ్యడానికోసమే నేనిక్కడ ఉన్నాను, నేను తప్ప ఇంకెవ్వరో చెయ్యలేని దేన్నో. కాకపోతే ఎందుకు జరుగుతుంది నా ఈ జన్మ సృష్టి?” ఆ విధంగా ఆ మనిషి ఎప్పుడూ అంధకారం లోపలికి వెళ్ళేందుకు సంసిద్ధుడై, వెతుకుతూ, అన్వేషిస్తూ ఉంటాడు. దీన్నే బుద్ధుడు ‘షద్ధ’ అని, ‘నమ్మకం’ అని అంటాడు; దీన్నే మరింత చక్కగా అనువదించుకుంటే అది ‘విశ్వాసం’ అవుతుంది.

**కనీసం ఒక్క అతిపవిత్ర, అతినిర్మల విశ్వాసం అయినా చాలు...** బుద్ధుడు ఇప్పుడు మరో నియమాన్ని కూడా జతచేసి చెప్తున్నాడు. **అతినిర్మలం, అతిపవిత్రం** అయిన విశ్వాసం. మీకు ఏదో ఓ విధమైన విశ్వాసం ఉండి ఉండవచ్చు. ఆ విశ్వాసం నిర్మలమైందీ, పవిత్రమైందీ కాకపోవచ్చు. ఆ విశ్వాసం అత్యంత సంకులంగా ఉండవచ్చు. అటువంటి విశ్వాసం వల్ల ఏ ఉపయోగమూ ఉండదు. ఆ విశ్వాసంతో మీరు ఎక్కడికీ పోలేరు. మీ విశ్వాసం నిర్మలంగా, పవిత్రంగా ఉండాలి. ఆ విశ్వాసం మీ మహానిస్తబ్ధతలోంచే జన్మించి ఉండాలి. మీ మనస్సు గోలలోంచి అది జన్మించి ఉండకూడదు. విశ్వాసం ఒక నమ్మకంగా ఉండదు. నమ్మకం ఎప్పుడూ ఒక గోలలో ఉంటుంది.

ఎన్నో విశ్వాసాలలో నుంచి ఒక్క విశ్వాసాన్ని మాత్రమే మీరు ఎంచుకుని స్వీకరిస్తారు, సహజంగానే అప్పుడు అక్కడ మీలో ఓ అంతర్యుద్ధం ఉంటుంది. మీ ఒక్క ఎంపిక అది. ఎన్నో విశ్వాసాలు మిమ్మల్ని అన్నివైపులలో నుంచి ఆవరించి ఉంటూ మీ అవధానాన్ని తమపై పెట్టమని గోజారుతూ, గోలపెడుతూ ఉంటాయి – క్రైస్తవమూ, హైందవమూ, మహమ్మదీయమూ, బౌద్ధమూ, జైనమూ – కొన్నివేల విశ్వాసాలు. ఈ ప్రపంచంలో మతాలు ఉన్నాయి. ఆ మతాలన్నింటిలోనూ శాఖలు ఉన్నాయి. అవన్నీ మిమ్మల్ని ఆకర్షించి పట్టుకోవాలని ఆశపడుతూ మిమ్మల్ని బలవంతపెడుతూ ఉంటాయి. మిమ్మల్ని స్వంతం చేసుకోవాలని కోరుకుంటూ ఉంటాయి. అందువల్ల సహజంగానే మీ మనస్సులో ఎంతో కంపన ఉంటుంది. నిరంతరంగా అది అటూ, ఇటూ, ఎటూ ఎంచుకోలేక చంచలిస్తూనే ఉంటుంది, ఊగుతూనే ఉంటుంది. అన్నివైపులకూ వాలిపోతూనే ఉంటుంది. దేన్ని ఎంచుకోవాలి? దేన్ని స్వీకరించాలి? దేన్ని ఎంచుకోకూడదు? ఏ ఆశయాన్ని అనుసరిస్తూ వెళ్ళాలి?

ఎలాగో ఏ విశ్వాసాన్నో మీరు ఎంచుకున్నా వెంటనే మీ మనస్సులో మరో భాగం దాన్ని ఆక్షేపిస్తూనే ఉంటుంది "నువ్వు సరిగ్గా ఎంచుకోవడం లేదు. తప్పు చేస్తున్నావ్". ఆ మనస్సు భాగం మీ మీద కక్ష సాధిస్తుంది. తన పగను తీర్చుకుంటుంది. ఏదో ఒకరోజు అది పైకొచ్చి తన పంతాన్ని నెగ్గించుకుంటుంది. మీ జీవుడు అప్పుడు అల్లకల్లోలంలో పడిపోతాడు. మీరు చీలిపోతున్న అనుభూతి మీకు తెలిసొస్తుంది.

బుద్ధుడు ఓ అతి పవిత్ర, అతి నిర్మల విశ్వాసం మీకు ఆవశ్యకమని అంటాడు. ఏమిటి ఆ నిర్మల పవిత్ర విశ్వాసం? ఆ విశ్వాసం మీరు చేసుకుంటున్న ఎంపికలలో నుంచి కాక మీ అవగాహనలోంచి వచ్చినదైన విశ్వాసం అయివుండాలి. నిన్ననే చింతన నుంచి నాకు ఓ ఉత్తరం వచ్చింది. ఆ అమ్మాయి ఓ క్రైస్తవ నన్ (బ్రహ్మచారిణి)గా

ఉండేది. ఇప్పుడు ఆ అమ్మాయి ఎటూ తేల్చుకోలేక చీలిపోతూ ఉంది. ఆ అమ్మాయికి ఇప్పుడు ఈ ఆశ్రమానికే వచ్చేసి ఉండిపోవాలా, లేకపోతే తను ఇదివరకు ఉన్న క్రైస్తవ మతానికి తిరిగి వెళ్ళిపోయి ఉండాలా అన్నదే తేల్చుకోలేకపోతున్న సమస్య. ఇప్పుడు ఆ అమ్మాయి ఏ నిర్ణయాన్ని చేసుకున్నా ఆ నిర్ణయం ఓ అతలాకుతలంలోనే, అల్లకల్లోలంలోనే జరుగుతుంది. తను ఈ ఆశ్రమానికి వచ్చి ఉండాలంటే ఆమె మనస్సులో ఓ భాగం ఒప్పుకోదు. ఆ అమ్మాయితో యుద్ధం చేసేస్తుంది. పోనీ, క్రైస్తవ మతానికి వెళ్ళిపోదాం అనుకుంటే ఆమె మనస్సులోని మరో భాగం 'వద్దు, ఈ రజనీష్‌పురంలోని ఆశ్రమంలోనే ఉండు' అని కోరుకుంటూ ఉంటుంది.

ఆమె ఏ ఎంపికను చేసుకున్నా అప్పుడు అది తప్పే అవుతుంది, ఆ ఎంపిక ఆ అల్లకల్లోలంలోంచే జరుగుతుంది కాబట్టి, ఆ అమ్మాయి దిగులులోంచే జరుగుతుంది కాబట్టి. ఆమెకు అప్పుడు అది ఓ అణచివేత అయిపోతుంది, ఆమె క్రైస్తవ మతాన్ని ఎంచుకుంటే. అప్పుడు తను నా మీద ఉన్న ప్రేమను అణచిపెట్టేసుకోవాల్సి వస్తుంది. ఈ ఆశ్రమంలోనే ఉండేందుకు నిశ్చయించుకుంటే క్రైస్తవ మతంలో ఉండాలన్న కోరికను అణచిపెట్టేసుకోవాల్సి వస్తుంది – క్రైస్తవమతంలో లభించే ఏకాంతవాసం, ప్రత్యేకవాసం, రక్షణ, సౌకర్యం, వసతి అంతా వదులుకోవాల్సి వస్తుంది.

ఇప్పుడు బుద్ధుడు ఆ అమ్మాయి చింతనకు ఏం సలహా ఇస్తాడు? బుద్ధుడు అంటాడు "ధ్యానం చెయ్యి' అని. "దేన్నీ ఎంచుకోవద్దు. తొందర ఏం లేదు. ఏ ఎంపికలూ లేకుండా ఉండు. ధ్యానం చెయ్యి. ప్రార్థించు. మరింత మరింత నిశ్శబ్దం అయిపో. అలా ఉంటూ ఉన్నప్పుడు ఓ అతినిర్మల, అతిపవిత్ర క్షణం ఒకటి వస్తుంది. ఆ పవిత్రక్షణంలోంచే ఎంపిక పైకి వస్తుంది. నువ్వు ఏ ఎంపికనూ చేసుకోవు. నువ్వు వేటిల్లోంచో ఆ ఎంపికను చేసుకోవు. ఆ క్షణపు పవిత్రంలోంచే ఆ ఎంపిక అన్న పద్మం ప్రభవించి పుష్పిస్తుంది. అది పూర్ణవికాసమై ఉంటుంది. నీ అంతర్ జీవి మొత్తం అందులోనే ఉంటుంది. ఏ ప్రత్యామ్నాయాల లోంచో ఎంచుకుని జరిగే ఎంపిక కాదు అది. అప్పుడు నీ సౌగంధ సౌరభమే పైకి వస్తుంది. అప్పుడు నువ్వు చీలిపోతూ" ఉండవు. దీన్నే బుద్ధుడు 'పవిత్ర విశ్వాసం' అని అంటాడు. ఇంకా ఆయన 'కేవలం అటువంటి నిర్మల పవిత్ర విశ్వాసం ఒక్కటి ఉన్నా ఓ మానవుడు పరివర్తింపబడేందుకు అదే చాలు' అని అంటున్నాడు.

ఇదే చింతనకు నా సలహా కూడా. ఈ రోజు ఆ అమ్మాయిలో ఇంకా ఎక్కువ వేదన కలుగుతూ ఉండవచ్చు. ఈ రోజు డిసెంబర్ నెలలో ఇరవైఅయిదవ రోజు – ఆ అమ్మాయి ఇప్పుడు ఇంకా ఎక్కువగా చీలిపోతుంది. కానీ ఈ ఆశ్రమానికి

తిరిగిరమ్మని కానీ, క్రైస్తవ మతంలోనే ఉండిపొమ్మని కానీ ఆమెకు సలహా ఇవ్వనే ఇవ్వను. దేన్నీ సూచించనే సూచించను. దేన్నీ ఎంచుకోకు. నిరీక్షించు. ఓర్పుతో ఉండు. ఆ దైవాన్నే ఆ నిర్ణయాన్ని తీసుకోనివ్వు. నువ్వు ధ్యానం చెయ్యి. నువ్వు ఎలా ఎంచుకోగలుగుతావు? ఎంచుకోవడానికి తగినంత వివేకం నీలో ఇంకా ఏర్పడలేదు కదా? కాబట్టి ప్రార్థించు. నిరీక్షించు.

మరి ఏ ఉపాయాలనూ ప్రదర్శించకు, ప్రయోగించకు – ఎందుకంటే అటువంటి ప్రయోగాలను నీ మనస్సుతో మాత్రమే నువ్వు చేసుకోవచ్చు కనుక. నీ ఊహల ఉపాయాలు నీకు ఉండవచ్చు – నిజంగానే దేన్నో ఒకదాన్ని నువ్వు ఎంచుకునే ఉన్నావు – కాబట్టి ఇక నువ్వు నిరీక్షించవచ్చు. తరువాత వెనుక తలుపు తెరిచి నీ ఎంపికను బయటికి తోసెయ్యొచ్చు, అలా తోసేస్తూ ఆ ఎంపికను భగవంతుడే నీకు చేశాడని నమ్ముతూ ఉండవచ్చు. కాదు, నువ్వు అది చెయ్యకూడదు, నువ్వు ఇప్పుడు ఏ ఎంపికలనూ చెయ్యకూడదని నేను చెప్తే, నువ్వు ఏ ఎంపికలనూ చేసుకోకూడదు. అంతే. ఇక ఎంపిక చేసుకోవడాన్ని మరచిపో. నువ్వు ఎలా ఎంచుకుంటావు?

ధ్యానం చెయ్యి. నిర్మల ప్రశాంతత్వాన్ని పొందు. నిశ్చలంగా, నిశ్శబ్దంగా ఉండు. ఏ ఆలోచనలూ ఉండని ఓ రోజులో ఉన్నట్లుండి నువ్వు చేసుకోని ఆ నిర్ణయం నీ కోసం నిర్ణయింపబడి నీకు అందుతుంది. అదే దైవ నిర్ణయం. ఆ నిర్ణయం వల్ల ఏం సంభవించినా అది మహత్తరంగానే ఉంటుంది.

***బుద్ధజ్ఞానంతో తథాగతుడికి వాళ్ళందరు తెలుసు.***
***తథాగత బుద్ధనేత్ర ప్రజ్ఞతో ఆ బోధిసత్వులందరూ సుభూతీ,***
***పూర్ణజ్ఞానులే తథాగతుడికి.***

ఇప్పుడు ఈ రెండు విషయాలనూ అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకోవాల్సిన మొదటి విషయం 'తథాగతుడు' అన్న పదాన్ని. ఇది ఎంతో అద్భుతమైన మాట. దీనికి రెండు అర్థాలు ఉన్నాయి. ఈ పదానికి రెండు పరస్పర విరుద్ధాలైన అర్థాలు ఉన్నాయి. ఈ పదానికి రెండు పరస్పర వ్యతిరేక అర్థాలు ఉన్నాయి. ఇదో అద్భుతమైన పదం. మొదటి అర్థం తత్–ఆగతుడు; అంటే 'ఆ విధంగా వచ్చినవాడు' అని. రెండవ అర్థం తథా–గతుడు; అంటే 'ఆ విధంగా వెళ్ళిపోయినవాడు' అని. ఒక అర్థం 'అలా వచ్చినవాడు' అనీ, రెండవ అర్థం 'అలా వెళ్ళిపోయినవాడు' అని. కొంతమంది మొదటి అర్థాన్ని స్వీకరించారు – 'అలా వచ్చినవాడు' అని. అప్పుడు ఆ మాటకు అర్థం 'స్వయంగా తనంతట తాను వచ్చినవాడు కాడనే'. ఇక్కడికి రావడానికి ఏ ఉద్దేశ్యమూ

లేనివాడనే. మ్మ్? ఆ విధమైన అర్థంతోనే ఏసుక్రీస్తు భూమి మీదకు వచ్చాడని చెప్పుకుంటే ఎంతో బాగుంటుందని క్రైస్తవులు అనుకుంటారు – ఏసుక్రీస్తును దైవమే భూమి మీదకు పంపించాడు. ఏసుక్రీస్తుకు భూమి మీదకు రావాలనే ఉద్దేశ్యం ఏదీ ఉండదు. ఆయన తీర్చుకోవాల్సిన ఏ కోరికా ఈ భూమి మీద లేదు. ఆయన ఈ భూలోకం మీదికి ఓ దేవదూతగానే, దైవసందేశాన్ని పట్టుకుని వచ్చినవాడిగానే వచ్చాడు.

మహమ్మదీయులకు కూడా మహమ్మద్ గురించి ఆ విధంగా అనుకోవడమే ఇష్టం. వాళ్ళు ఆయనను 'పైగంబరుడు' అంటారు. అంటే దేవదూత. ఆయన తన స్వంత కోరికలను వేటినో ఇక్కడ తీర్చుకోవడానికోసం రాలేదు. ఆయన మహాతృప్తుడై ఉంటాడు. ఆయన ఇక్కడ ఉండడానికి ఏ కారణమూ ఉండదు. మిగతా అందరికీ ఇక్కడ ఉంటున్నందుకు ఒక కారణం ఉంటుంది. వాళ్ళు ఊరికే అలా రారు. వాళ్ళు తమ ఏవో కోరికలను తీర్చుకోవడానికి వస్తారు. ఇక్కడికి రావాలని వాళ్ళు అనుకున్నారు కాబట్టే వాళ్ళు ఇక్కడికి వచ్చారు.

బుద్ధుడు వచ్చాడు, 'ఇక్కడికి రావాలి' అని అనుకుని కాదు. సృష్టే ఆయన్ని ఇక్కడికి పంపించింది. ఆయనలో సృష్టే రూపాన్ని ధరించింది. అందుకు ఏ కారణమూ లేదు, అందుకు ఏ ఉద్దేశ్యమూ లేదు, ఏ స్వీయకోరికలూ లేవు. ఇదీ మొదటి అర్థం – 'తథాగతుడు' అన్న పదానికి, 'అలా వచ్చినవాడు'.

కొంతమంది రెండవ అర్థాన్ని ఎంచుకుని స్వీకరించుకున్నారు – 'అలా వెళ్ళిపోయినవాడు' అని. దానికి అర్థం 'ఇక్కణ్ణుంచి ఇప్పటికే వెళ్ళిపోయి ఉన్నవాడు' అని. బుద్ధుడి లోపలికి మీరు ప్రగాఢంగా దర్శిస్తే మీకు అక్కడ ఎవ్వరూ కనిపించరు. ఆ నివాసం ఖాళీ అయిపోయి ఉంటూ కనిపిస్తుంది. ఆ మనిషి ఆ ఇంటిని ఖాళీచేసి ఎప్పుడో వదిలి వెళ్ళిపోయి ఉంటాడు. ఆయనే ఖాళీ అయిపోయి ఉంటాడు. ఆయనే బుద్ధిగా వెళ్ళిపోయి ఉంటాడు. మహత్తరంగా ఆవలి ఒడ్డుకు చేరిపోయి ఉంటాడు. ఆయన ఉనికి నిజంగా ఆ అవతలితీరం మీదే ఉంటుంది. ఈవలితీరం మీద కేవలం ఆయన ఛాయ మాత్రం చరిస్తూ ఉంటుంది.

కానీ నేను ఈ రెండు అర్థాలనూ ఎంచుకుని స్వీకరిస్తాను, పూర్తిగా, సంఘటితంగా. 'అలా వచ్చి, అలా వెళ్ళిపోయినవాడు' అని అర్థం చేసుకుంటే బాగుంటుందన్నదే నా అభిప్రాయం. 'అలా వచ్చి, అలా వెళ్ళిపోతాడు'... గాలి వీచి ఊరుకున్నట్లు. గాలి వీచడానికి దానికి స్వంతమైన ఏ కారణమూ ఉండదు. అది ఏ స్వంత ఉద్దేశ్యంతోనూ వీచదు. అది పూర్తిగా ఈ సృష్టి ఉనికికి లొంగిపోయి, పూర్ణార్పణతో వీస్తూ ఉంటుంది. ఆ సృష్టి పంపించినప్పుడల్లా అది వస్తుంది. ఎక్కడ

ఎక్కడ దాని అవశ్యకత ఉంటుందో, అక్కడ అక్కడికే వస్తుంది. దానికి ఏ స్వంత లక్ష్యాలూ ఉండవు. అది చెప్పదు – "నేను ఉత్తరం దిశలో మాత్రమే వెళ్తాను, దక్షిణం దిశలోకి పోను, ఆ దిశలో వీచి వీచి విసుగొచ్చేసింది" అని కానీ, "తూర్పు దిశకు మాత్రమే వెళ్తాను. సన్మత ప్రవృత్తి నాది. నేను తూర్పుకు మాత్రమే తిరుగుతాను" అని కానీ, "పడమటికి మాత్రమే పయనిస్తాను, జీవితాన్ని నేను అనుభవించాలి" అనదు. గాలి ఏ మాటలనూ అనదు. ఎక్కడ ఎక్కడ దాని ఆవశ్యకత ఉంటుందో అక్కడ అక్కడికల్లా అది వెళ్తూ ఉంటుంది. అలా వచ్చి, అలా వెళ్ళిపోతూ ఉంటుంది.

మరి అది ఓ ప్రదేశానికి వెళ్ళిందంటే, అది ఆ చోటునే పట్టుకుని కూర్చోదు. ఓ పవనం వీచి వెళ్ళిపోతూ ఉంటుంది. పవనం పలుకదు "ఇప్పుడు నేను వచ్చాను. ఇక్కడికి రావడానికి నేను ఎంతో కష్టపడాల్సి వచ్చింది. ఇక్కడే ఉంటాను. ఇక్కణ్ణుంచి కదలను. ఇక్కడే ఉంటాను. ఓ మహాప్రయాణాన్ని చేసి, ఎన్నో సముద్రాలనూ, పర్వతాలనూ దాటుకుంటూ ఇక్కడికి వచ్చాను. నేను ఇక పోను. ఇక్కడే ఉంటాను. ఉండకపోతే ఇక్కడికి వచ్చినందుకు లక్ష్యం ఏమిటి?" ఈ మాటలను వేటినీ పవనాలు పలుకవు. గాలి వస్తుంది, పోతుంది.

బుద్ధుడు కూడా ఆ పవనంలాగే ఉంటాడు. అలా వస్తాడు, అలా వెళ్ళిపోతాడు. ఎక్కడా పట్టుకుని ఉండడు. ఆయన రాకపోకలు రహస్యంగానే ఉంటాయి. ఆయన ఎప్పుడు వస్తాడో, ఎప్పుడు వెళ్ళిపోతాడో జ్యోస్యం చెప్పుకునేందుకు కుదరదు, కారణాలు చెప్పుకోవడం కుదరదు. ఎందుకంటే మనం ఉద్దేశ్యాలను మాత్రమే కారణాలతో చెప్పుకోగలుగుతాం కాబట్టి. ఆ మహా అతి ఉత్కృష్ట మహాప్రజ్ఞోదయ స్థితిలో, ఆ అతిపవిత్ర స్థితిలో, ఆ సంపూర్ణ స్థితిలో, విషయాలు పరమరహస్యంగా ఉంటాయి. ఏ సంగతులో యథాలాపంగా సంభవిస్తాయి. అవి ఎందుకు జరుగుతాయో మనిషికి అర్థం కాదు. అవి ఎందుకు జరిగాయి అన్న ప్రశ్నను అడిగే అవసరం కూడా ఉండదు. ప్రతి సంగతీ మహాసౌందర్యంతో, మహాఆశీర్వాదంగా ఉంటుంది. రావడం ఆశీర్వాదంగా ఉంటుంది, పోవడం ఆశీర్వాదంగా ఉంటుంది. ఓ శరీరంలో ఆ జీవి ఉండడమే ఆశీర్వాదంగా ఉంటుంది. ఆ జీవి ఆ శరీరంలోంచి వెళ్ళిపోవడం కూడా ఓ ఆశీర్వాదంగా ఉంటుంది. ఓ జీవి ప్రత్యక్షమే ఓ ఆశీర్వాదం, ఓ జీవి అంతర్ధానమే ఓ ఆశీర్వాదం. సర్వస్వం ఓ ఆశీర్వాదం.

ప్రజ్ఞోదయపు రుచే ఆశీర్వాదం. ఏం సంభవించినా, ఏ వ్యత్యాసమూ ఉండదు. అది అనభ్యంతరంగా ఉంటుంది. అక్కడ ఏ ఎంపికలూ ఉండవు. అక్కడ ఏ ఉద్దేశ్యాలూ ఉండవు. అక్కడ ఏ కోరికలూ ఉండవు. సంగతులు వాటంతట అవే

జరుగుతాయి. అవి ఎంతో సరహస్యాలై జరుగుతాయి. అందువల్లే ఓ బుద్ధుణ్ణి మనం స్పష్టీకరించి వర్ణించి చెప్పలేం. ఓ బుద్ధుణ్ణి మనం అనుభవించి మాత్రమే గ్రహించగలగవచ్చు. అందువల్లే ఓ శిష్యరికం చెయ్యాల్సిన అవసరం మనకు ఏర్పడుతుంది.

అప్పుడప్పుడూ కొందరు వచ్చి నన్ను అడుగుతూ ఉంటారు "ఓ సన్యాసి అవ్వాల్సిన అవసరం ఏముంటుందండీ?" అని. ఆ అవసరం ఏమిటంటే ఓ సన్యాసి కాకుండా నా రుచిని మీరు అనుభవించి తెలుసుకోలేరు అన్నదే. ఆ అవసరం ఏమిటంటే ఓ సన్యాసి కాకుండా మీరు ఎప్పటికీ నన్ను సమీపించలేరు అన్నదే. మీకు ఎప్పటికీ ఆ జీవ భావప్రాప్తి అనుభవం కలుగదు, ఓ ప్రగాఢ సామరస్య శరణ్యభావం మీ అనుభూతిలో కలుగకపోతే.

సన్యాసమే ప్రగాఢంగా సామరస్యాన్ని అనుభవించే దీక్ష - నాతోనే సంపూర్ణంగా ఉండడం, పూర్తిగా నా ప్రగాఢ సాహచర్యంతో ఉండడం. మీ అన్ని రక్షణలనూ విడిచిపెట్టేసి నాతో ఉండడం. మీరు నాతో ఎంత సామీప్యానికి రావాలంటే నాలోని శూన్యత్వం పెల్లుబికి మీలోకి ప్రవహించేంత, మీకు సామీప్యంలో ఏ ఎల్లలూ ఉండనంత, నాతో ఉండేటంత, నాతో మీరూ, మీతో నేనూ పరస్పర విలీనం అయిపోయేంత. ఆ అనుభవంకోసం మీకు సన్యాసం అవసరం, ఆవశ్యకం అవుతుంది. ఓ బుద్ధుణ్ణి గ్రహించడానికి ఇది తప్ప మరే మార్గాంతరమూ, ప్రత్యామ్నాయమూ లేదు.

మరో విషయాన్ని కూడా మనం అర్థం చేసుకుని తీరాలి. బుద్ధుడు అంటాడు "బుద్ధ నేత్రంతో నేను చూశాను. బుద్ధనేత్ర ప్రజ్ఞతో నేను తెలుసుకున్నాను" అని. ఏమిటి బుద్ధనేత్రం, ఏమిటా బుద్ధనేత్ర ప్రజ్ఞ? దేన్ని యోగశాస్త్రం 'మూడవకన్ను' - 'జ్ఞాననేత్రం' అంటుందో, దేన్ని హిందువులు 'శివనేత్రం' - శివుడి మూడవకన్ను అంటున్నారో, ఆ ప్రజ్ఞా నేత్రాన్నే బౌద్ధ వాఙ్మయం 'బుద్ధనేత్రం' అని అంటోంది.

మీకు రెండు నయనాలు ఉన్నాయి. ఆ రెండు కళ్ళూ ద్వంద్వత్వానికి ప్రతీకలుగా ఉన్నాయి. మీరు ద్వంద్వాలతో విభజింపబడి ఉంటున్నారు. మీకు ఓ ఏకైక దృష్టి ప్రాప్తించగలిగితే, మామూలుగా మీకు ఉండని ఆ మూడవ కంటిచూపు మీలో ఏర్పడగలిగితే, అప్పుడు మీరు ఈ సృష్టిలోని ఏకత్వాన్ని చూడగలుగుతారు. ఓ అద్దం పగిలిపోయి ఆ పెక్కు అద్దం ముక్కలలో అనేక ముఖాలు కనిపిస్తున్నట్లు ఉంటోంది ఇది. మీకు ఒక్కటే ముఖం ఉంటుంది. కానీ ఆ అద్దం ముక్కలు వెయ్యి

జరుగుతాయి. అవి ఎంతో సరహస్యాలై జరుగుతాయి. అందువల్లే ఓ బుద్ధుణ్ణి మనం స్పష్టీకరించి వర్ణించి చెప్పలేం. ఓ బుద్ధుణ్ణి మనం అనుభవించి మాత్రమే గ్రహించగలగవచ్చు. అందువల్లే ఓ శిష్యరికం చెయ్యాల్సిన అవసరం మనకు ఏర్పడుతుంది.

అప్పుడప్పుడూ కొందరు వచ్చి నన్ను అడుగుతూ ఉంటారు "ఓ సన్యాసి అవ్వాల్సిన అవసరం ఏముంటుందండీ?" అని. ఆ అవసరం ఏమిటంటే ఓ సన్యాసి కాకుండా నా రుచిని మీరు అనుభవించి తెలుసుకోలేరు అన్నదే. ఆ అవసరం ఏమిటంటే ఓ సన్యాసి కాకుండా మీరు ఎప్పటికీ నన్ను సమీపించలేరు అన్నదే. మీకు ఎప్పటికీ ఆ జీవ భావప్రాప్తి అనుభవం కలుగదు, ఓ ప్రగాఢ సామరస్య శరణ్యాభావం మీ అనుభూతిలో కలుగకపోతే.

సన్యాసమే ప్రగాఢంగా సామరస్యాన్ని అనుభవించే దీక్ష - నాతోనే సంపూర్ణంగా ఉండడం, పూర్తిగా నా ప్రగాఢ సాహచర్యంతో ఉండడం. మీ అన్ని రక్షణలనూ విడిచిపెట్టేసి నాతో ఉండడం. మీరు నాతో ఎంత సామీప్యానికి రావాలంటే నాలోని శూన్యత్వం పెల్లుబికి మీలోకి ప్రవహించేంత, మీకు సామీప్యంలో ఏ ఎల్లలూ ఉండనంత, నాతో ఉండేటంత, నాతో మీరూ, మీతో నేనూ పరస్పర విలీనం అయిపోయేంత. ఆ అనుభవంకోసం మీకు సన్యాసం అవసరం, ఆవశ్యకం అవుతుంది. ఓ బుద్ధుణ్ణి గ్రహించడానికి ఇది తప్ప మరే మార్గాంతరమూ, ప్రత్యామ్నాయమూ లేదు.

మరో విషయాన్ని కూడా మనం అర్థం చేసుకుని తీరాలి. బుద్ధుడు అంటాడు "బుద్ధ నేత్రంతో నేను చూశాను. బుద్ధనేత్ర ప్రజ్ఞతో నేను తెలుసుకున్నాను" అని. ఏమిటి బుద్ధనేత్రం, ఏమిటా బుద్ధనేత్ర ప్రజ్ఞ? దేన్ని యోగశాస్త్రం 'మూడవకన్ను' - 'జ్ఞాననేత్రం' అంటుందో, దేన్ని హిందువులు 'శివనేత్రం' – శివుడి మూడవకన్ను అంటున్నారో, ఆ ప్రజ్ఞా నేత్రాన్నే బౌద్ధ వాజ్మయం 'బుద్ధనేత్రం' అని అంటోంది.

మీకు రెండు నయనాలు ఉన్నాయి. ఆ రెండు కళ్ళూ ద్వంద్వత్వానికి ప్రతీకలుగా ఉన్నాయి. మీరు ద్వంద్వాలతో విభజింపబడి ఉంటున్నారు. మీకు ఓ ఏకైక దృష్టి ప్రాప్తించగలిగితే, మామూలుగా మీకు ఉండని ఆ మూడవ కంటిచూపు మీలో ఏర్పడగలిగితే, అప్పుడు మీరు ఈ సృష్టిలోని ఏకత్వాన్ని చూడగలుగుతారు. ఓ అద్దం పగిలిపోయి ఆ పెక్కు అద్దం ముక్కలలో అనేక ముఖాలు కనిపిస్తున్నట్లు ఉంటోంది ఇది. మీకు ఒక్కటే ముఖం ఉంటుంది. కానీ ఆ అద్దం ముక్కలు వెయ్యి

ముఖాలను మీకు ప్రతిబింబించి చూపిస్తాయి. ఆ వెయ్యి అద్దం ముక్కలనూ సరిగ్గా కూర్చి చూసుకుంటే, మళ్ళీ మీకు ఒక్క మొహం మాత్రమే సాక్షాత్కరించి కనిపిస్తుంది.

వాస్తవం ఒక్కటిగా ఉంటోంది. కానీ మనకు రెండు కళ్ళు ఉన్నాయి. అందువల్లే ప్రతిచోటా వాస్తవం విభజింపబడి కనిపిస్తుంది. ఉదాహరణకోసం, ఒక విషయాన్ని మీరు 'ప్రేమ' అంటూ ఉంటారు. మరో విషయాన్ని మీరు 'ద్వేషం' అంటూ ఉంటారు. కానీ నిజంగా అది ఒకే విషయమే. 'ప్రేమ', 'ద్వేషం' అన్న పదాలు ఆ విషయాన్ని వర్ణించేందుకు సరిగ్గా సరిపోవు. రెండింటిలోనూ ఆ సమాన శక్తే ఉంటుంది – ఆ శక్తి 'ప్రేమద్వేషం'గా ఉంటుంది. 'ప్రేమ మరియు ద్వేషం' అని ఎప్పుడూ మాట్లాడుకోకూడదు. మీ మాటల్లోని ఆ 'మరియు'ను మీరు పీకి పారెయ్యాలి. నిజానికి ఆ రెండు పదాల మధ్య ఓ హైఫన్‌ను కూడా మీరు పెట్టుకోకూడదు, 'ప్రేమ–ద్వేషం' అన్న జంటపదంలో. 'రాత్రింబవళ్ళు' ఒక్కటే పదం, 'జీవమృత్యువులు' ఒక్కటే పదం, 'దైన్యంబ్రహ్మానందం' ఒక్కటే పదం, 'బాధాసౌఖ్యం' ఒక్కటే పదం, 'పదార్థమానసం' ఒక్కటే పదం. కానీ మనకు రెండు కళ్ళు ఉంటున్నాయి కాబట్టి, ప్రతి విషయమూ మనకు రెండుగా విభజింపబడి కనిపిస్తుంది. అందువల్ల మనం శతాబ్దాల పర్యంతం ఆ విషయం గురించే వాదించుకుంటూ ఉంటాం.

ఇప్పటికి అయిదువేల సంవత్సరాల నుండీ మనం శరీరాన్ని గురించీ, ఆత్మ గురించీ వాదించుకుంటూనే ఉన్నాం. అవి రెండు విషయాలు కాదు. ఆత్మకు బాహ్యావరణమే శరీరం. శరీరపు మహాప్రగాఢ మూలమే ఆత్మ. అవి రెండు విషయాలు కాదు. ప్రపంచమూ, దేవుడూ రెండు విషయాలు కావు. సృష్టికర్తా సృష్టీ రెండూ ఒక్కటే.

ఇదే 'బుద్ధనేత్రం' అని చెప్పబడుతూ ఉంది – రెండు కళ్ళూ ఓ స్థలంలో కలిసిపోయి కరిగిపోయి ఒక్కచూపే, అద్వైత దర్శనమే ఉంటుంది. జీసస్ అంటూ ఉంటాడు "మీ రెండు కళ్ళూ ఒక్కటిగానే ఉంటే, మీ జీవసర్వస్వమూ నిండువెలుగుతో ఉంటుంది" అని. అదే ప్రజ్ఞోదయం అంటే.

జీసస్ మాటలు కొన్ని మహాద్భుతంగా ఉంటాయి : "రెండింటిని మీరు ఒకటి చేస్తే, అంతరాన్ని బాహ్యంగానూ బాహ్యాన్ని అంతరంగానూ చేసుకుంటే, పైనను క్రిందగా చేసుకుంటే, పురుషుడు పురుషుడుగానూ ఉండక స్త్రీ స్త్రీగానూ ఉండనంతగా పురుషుణ్ణీ, స్త్రీనీ ఒక్కటి చేసేస్తే, అప్పుడు మీరు దైవసామ్రాజ్యంలోకి ప్రవేశిస్తారు."

లేదా, ఇంకా ఆయన అంటాడు "ఓ మనిషికి రెండు గుర్రాలను స్వారీ చెయ్యడం అసాధ్యం. రెండు విల్లులను సంధించడం అసాధ్యం. ఓ సేవకుడు యజమానులు ఇద్దరిని సేవించడం అసాధ్యం – ఒకరిని సేవిస్తూ, మరొకరికి కోపాన్ని తెప్పించవచ్చు కాబట్టి. కానీ మీ రెండు కళ్ళూ ఒక్కటిగానే ఉంటే, మీ జీవసర్వస్వమూ నిండువెలుగుతో ఉంటుంది" అని.

బౌద్ధ సాంప్రదాయంలో ఆ ఏకత్వ దర్శనాన్నే, ఆ అవిభాజ్య దర్శనాన్నే, ఆ పూర్ణ దర్శనాన్నే, ఆ సర్వస్వ దర్శనాన్నే 'బుద్ధనేత్రం' అంటారు. ఆ బుద్ధనేత్రంతో ఏం దర్శింపబడుతుందో అదే అవుతుంది బుద్ధనేత్ర ప్రజ్ఞ. సత్యగ్రహణ ప్రజ్ఞ. ఆ బుద్ధనేత్రం మీకు ఉండి ఆ కంటితో మీరు జీవితాన్ని దర్శిస్తే అదే సర్వస్వాన్ని ఒక్కటిగా కలిపేస్తుంది. అప్పుడు మీకు పరిపూర్ణ జ్ఞానం కలుగుతుంది. అంతకుముందు మాత్రం కాదు. అంతకుముందు, మీ జ్ఞానం అంతా ఎప్పుడూ పాక్షికంగా, విభజితంగా, ఏవైపో మొగ్గుతూ ఉంటుంది.

ఇప్పుడు సూత్రం :

***మరి ఎందుకు? ఎందుకంటే, సుభూతీ, ఈ బోధిసత్త్వుళ్ళలో***
***'నేను' అన్న గ్రహణం ఏర్పడదు కనుక,***
***'జీవిని' అన్న గ్రహణం ఏర్పడదు కనుక,***
***'ఆత్మను' అన్న గ్రహణం ఏర్పడదు కనుక,***
***'వ్యక్తిని' అన్న గ్రహణం ఏర్పడదు కనుక.***
***ఉండవులే మరి ఉండబోవు ఈ బోధిసత్త్వులకు***
***'ధర్మం ఇది' అన్న గ్రహణం,***
***'ధర్మం కాదిది' అన్న గ్రహణం.***
***గ్రహణమూ ఉండదు, అగ్రహణమూ ఉండదు బోధిసత్త్వుళ్ళలో.***

ఈ ఎనిమిది విషయాలనే వివేకానికి హద్దులు అంటారు. వీటిని అర్థంచేసుకుని తీరాలి. ముందుగా, ఓ బోధిసత్త్వుడికి నిర్వచనం ఇదే. ఎవరు బోధిసత్త్వుడు? ఈ ఎనిమిది వివేకపు హద్దులనూ, ఈ ఎనిమిది తప్పు వైఖరులనూ, ఈ ఎనిమిది జీవితపు తప్పుదార్లనూ దాటి వెళ్ళినవాడు.

అర్థం చేసుకుని తీరాల్సిన మొదటి విషయం. ***'నేను' అన్న గ్రహణం ఏర్పడదు.*** ఈ నాలుగు పదాలనూ జాగ్రత్తగా అర్థం చేసుకుని తీరాలి – అవి దాదాపుగా సమాన అర్థాలతోనే ఉంటాయి. కానీ దాదాపుగా మాత్రమే : నేను, జీవి, ఆత్మ,

వ్యక్తి. నిఘంటువుల్లో ఈ నాలుగు పదాలకు ఉన్న అర్థాలన్నీ దాదాపుగా సమానంగానే కనిపిస్తూ ఉంటాయి. కానీ బుద్ధుడు ఈ నాలుగు పదాలకూ రంగులను అద్ది అందిస్తాడు. ఆ అన్ని పదాలకూ రంగులు ఉంటాయి, అత్యల్ప వ్యత్యాసాలు ఉంటాయి.

మొదటిది, 'నేను'. 'నేను' అంటే అహంకారం – నా, నాది, నేను – నన్ను నిర్మించిన పంచభూతాలకన్నా ప్రత్యేకంగా ఉన్నవాడిని. మానవుడు పంచభూతాలతోనే తయారుచేయబడతాడు. పంచభూతాల విభిన్న సమ్మిశ్రితాలతోనే మానవుడు నిర్మింపబడతాడు. ఆ మానవుడిలోని పంచభూతాలనూ తొలగించేస్తే ఆ మానవుడు అదృశ్యం అయిపోతాడు. పంచభూతాలకంటే ఎక్కువ మానవుడిలో ఏదీ లేదని బుద్ధుడు అంటాడు. ఆ శరీరం ఓ రథంలా తయారవుతుంది; మీరు ఓ రథంలోని భాగాలను తొలగిస్తూ ఉంటారనుకోండి. మీరు దాని చక్రాలను తొలగించేస్తారు. మీరు రథాశ్వాలను విప్పి తొలగిస్తారు. ఆ రథంలోని అన్ని భాగాలనూ ఒక్కొక్కటే తొలగించేస్తారు. అంతా అయిపోయిన తరువాత ఆ రథం ఎక్కడుందో తెలుసుకోవాలి అనుకుంటారు. ఆ రథం అప్పటికే అదృశ్యం అయిపోయి ఉంటుంది. ఎందుకంటే కేవలం అనేక భాగాల కలయిక వల్ల మాత్రమే ఆ రథం తయారవుతుంది కనుక.

బుద్ధుడి మహాప్రజ్ఞలలో ఇదొకటి. మరే మతమూ బౌద్ధమతం అందుకున్న ఎత్తును అందుకోలేకపోయింది. అన్ని మతాలూ 'ఆత్మ' గురించిన, అహంకారాన్ని గురించిన ఒక అవగాహనను సంపాదించుకుని అక్కడితో ఆగిపోయాయి. ఆ అవగాహనలు ఎంతగా శుద్ధిని పొంది ఉన్నా, ఎంతటి పవిత్రమైనవి అయినా, ఎంత సుగుణత్వాన్ని పొంది ఉన్నా, అహంకారానికి ఉన్న ఒక ఊహ అపరిష్కృతంగానే మిగిలిపోయింది తక్కిన అన్ని మతాలలో. దాన్ని మీరు 'అహంకారం' అనొచ్చు; 'ఆత్మ' అనొచ్చు; 'జీవాత్మ' అనొచ్చు: ఏ పేరుతోనైనా అది గుర్తింపబడుతూ ఉండవచ్చు. కానీ దాన్ని గురించిన అత్యంత మహాస్పష్టమైన అవగాహన కేవలం బుద్ధుడిలో మాత్రమే ఉంది – మీ మహాప్రగాఢ అంతర్భాగంలో మీలో 'శూన్యత్వం' తప్ప మరేమీ లేదని; ఏ అహంకారం అన్నదీ లేదని. ఏ అహంకారమూ లేదు.

ఈ 'నేను' అన్న మాట కేవలం ఉపయోగార్థం వినియోగించుకుంటున్న మాట మాత్రమే. అది ఏ సత్యానికీ ప్రతీక కాదు. అది నిజంగా లేదు. కానీ దాని అవశ్యకత మాత్రం ఉంది – బుద్ధుడు కూడా ఈ 'నేను'ను ఉపయోగించాల్సి ఉంటుంది. సమాచారం సవ్యంగా ప్రసరింపబడి అర్థం కాగలిగేందుకు అది ఉంటుంది. ఆ 'నేను' అన్నమాట సూచిస్తుందే తప్ప దానికి నిజమైన సత్యస్థితి లేదు.

కాబట్టి మొదటిదైన 'నేను'కు అర్థం "నేను ఈ పంచభూతాల సంఘటితం కన్నా ప్రత్యేకిని". బుద్ధుడు అంటాడు మీరు అక్కడ లేరు అని. బుద్ధుడు అంటాడు పంచభూతాల ధాతువులు మాత్రమే అక్కడ ఉన్నాయి అని. మీరు మహాశూన్యతే. రెండవ విషయం 'జీవి' – 'జీవి' అంటే మూర్తిమత్వంతో ఉండడం. విభిన్న సమయాలలో స్వయంతో సాకారంగా స్థితమై ఉంటున్న ఊహా ఆలోచన. మీరు అంటారు "నేను ఒకప్పుడు శిశువుగా ఉండేవాణ్ణి, ఇప్పుడు నేను యువకుడిగా ఉంటున్నాను, త్వరలోనే నేను ఒక వృద్ధుణ్ణి అయిపోతాను". అన్ని దశలలోనూ మీరే ఉండితీరుతారు అన్న ఓ ఊహ మీలో ఎప్పుడూ నిలిచే ఉంటుంది. ఒక సమయంలో మీరు శిశువుగా ఉండేవారు. తరువాత మీకు యవ్వనం వస్తుంది – అయినా అప్పటికీ మీరు మీరే. ఆ తరువాత మీరు వృద్ధులు అవుతారు. అయినా మీరు మీరుగానే ఉంటారు. బుద్ధుడు అంటాడు ప్రతి క్షణంలో మీరు మారుతూ ఉంటారని.

బుద్ధుడు సరిగ్గా హెరాక్లిటస్‌తో ఏకీభవిస్తూ ఉన్నాడు. ఒకే నదిలోకి మీరు రెండుసార్లు కాలు పెట్టలేరు. ఆ నది ప్రవహిస్తూనే ఉంటుంది. మీరు ఓ శిశువుగా ఉన్నప్పుడు మీకు ఓ ప్రత్యేక వ్యక్తిత్వం విభిన్నంగా ఉంది. ఇప్పుడు మీరు మరింత విభిన్నంగా ఉంటున్నారు. వృద్ధాప్యం వచ్చేసిన తరువాత మీకు అప్పుడు మరింత విభిన్న వ్యక్తిత్వం ఉంటుంది. వాస్తవంలో ప్రతి రోజులోనూ మీరు విభిన్నంగానే విభిన్నంగానే ఉంటారు. ప్రతి క్షణంలోనూ మీరు మారిపోతూ ఉంటారు.

ఎందుకు మిగిలి ఉంటుంది ఈ "అంతే సమానంగా నేనున్నాను" అన్న అభిప్రాయం? అది ఎందుకు ఉంటుందంటే ఆ మార్పు మహాసూక్ష్మంగా ఉంటూ, అంత సూక్ష్మంగా మీ దర్శనం ఉండదు కాబట్టే. ఇది ఎలా ఉంటుందంటే ఓ రాత్రిపూట ఓ మైనపు వత్తిని మీరు వెలిగిస్తే, అది రాత్రంతా వెలుగుతూ, తెల్లారిన తరువాత మీరు ఆ మంటను ఊది ఆర్పేసి "రాత్రి నేను అంటించిన వెలుగుశిఖనే ఇప్పుడు ఆర్పేశాను" అని చెప్పుకుంటున్నట్లు. అది కాదు. మీరు అంటించిన వెలుగుశిఖ అనుక్షణమూ మారిపోతూనే ఉంటుంది, మాయమై పోతూనే ఉంటుంది, ప్రతి క్షణంలో కొత్త మంట మళ్ళీ తయారవుతూనే ఉంటుంది. కానీ రెండు వెలుగుల మధ్య, ఒక వెలుగు మాయమైపోతూ మరో వెలుగు పుట్టుకొస్తున్నప్పటికీ ముందున్న వ్యవధి మహాసూక్ష్మంగా, అత్యల్పంగా ఉంటూ, దాన్ని మీరు చూడలేకపోతూ ఉంటారు. అందువల్లే 'అంతే సమానంగా నేనుంటున్నాను' అన్న అభిప్రాయం మీ జీవి వ్యక్తిత్వంలో మిగిలే ఉంటుంది.

బుద్ధుడు అంటాడు జీవితం ఓ పద్ధతి క్రమమని. జీవితం ఓ వస్తువులాగా ఉండదు. అది నిరంతరంగా ప్రవహిస్తూ ఉంటుంది. జీవితం ఓ నది. మనం సత్యాన్నే

మాట్లాడుతూ ఉండాలంటే అన్ని నామవాచక శబ్దాలనూ మన భాషలోంచి తొలగించెయ్యాలని బుద్ధుడు అంటాడు. క్రియాత్మక శబ్దాలు మాత్రమే ఉంటాయి సత్యంగా. 'నది' అన్న పదం సత్యం కాదు. 'నదిస్తూ' అన్న పదం సత్యంగా ఉంటుంది. 'వృక్షం' అన్న పదం సత్యంగా ఉండదు. 'వృక్షిస్తూ' అన్న పదమే సత్యంగా ఉంటుంది. 'ప్రేమ' అన్న పదం సత్యంగా ఉండదు. 'ప్రేమిస్తూ' అన్న పదం సత్యంగా ఉంటుంది. జీవితంలో క్రియలే ఉంటాయి. నామవాచకాలు ఉండవు.

అర్థం చేసుకుని తీరాల్సిన మూడవ విషయం : 'ఆత్మ'. ఓ అతీతశక్తి మీ శరీరంలో ఉందన్న ఊహ ఈ శరీరాన్ని కలిపి ఉంచుతూ, దానికి ప్రాణం పోస్తూ, తక్కిన సర్వస్వంతో ప్రత్యేకంగా ఉన్న అతీతశక్తి విశేషం. అది కూడా – బుద్ధుడు అంటాడు ఏ అతీతశక్తి విశేషమూ లేదని. బుద్ధుడు మీ లోపల నివసిస్తూ 'ఏమీలేదు' అని అంటాడు. మీ లోపల ఓ 'శూన్యం' మాత్రమే ఉంటుంది. మీరే ఇల్లు అనీ, ఆ ఇంట్లో ఎవరో నివసిస్తూ ఉన్నారనీ, ఓ నివాసి ఉంటున్నాడనీ కాదు అర్థం. మీ లోపల నివసిస్తూ ఉన్నది మహానిర్మల శూన్యత్వం మాత్రమే.

అర్థం చేసుకోవాల్సిన నాలుగవ విషయం : వ్యక్తిత్వం. మీ జీవుడి ఉనికి. ఓ శాశ్వతవాసి పునర్జన్మలను తీసుకుంటూ ఒక జన్మ నుండి మరొక జన్మకు వలసపోతూ ఉన్నవాడు అన్న ఓ నమ్మకం. ఆ శాశ్వతవాసినే బుద్ధుడు 'వ్యక్తి' అని అంటాడు – మీరు మరణిస్తారు. తక్షణం మీలో ఉన్న ఆ శాశ్వత జీవి ఇంకో గర్భంలోకి ప్రవేశించి మళ్ళీ జన్మిస్తాడు. కొనసాగింపు జరుగుతుంది కానీ అక్కడ 'వ్యక్తి' ఉండదు. కొనసాగింపు జరుగుతుంది కానీ అక్కడ 'అహం' ఉండదు. కొనసాగింపు జరుగుతుంది కానీ అక్కడ 'జీవి' ఉండడు. కొనసాగింపు జరుగుతుంది కానీ అక్కడ 'ఆత్మ' ఉండదు.

ఈ బుద్ధ దర్శనం మహా అత్యంత విభిన్నంగా ఉంటున్నందువల్ల, ఈ భారతదేశం అంతటి మతధార్మిక దేశంలో కూడా, అది మింగుడుపడకపోయింది. మతపు పునాదులను విధ్వంసం చెయ్యడానికే బుద్ధుడు కంకణం కట్టుకున్నాడన్న అభిప్రాయం భారతదేశంలో కలిగింది. ఆయన అందిస్తున్న దర్శనం అత్యంత నవ్యం. ఆత్మపరిధి కన్నా పరమోత్తమస్థాయిలో ఉన్న దృక్పథ దర్శనం. ఆత్మ, జీవి, వ్యక్తిత్వం, ఇలాంటి అభిప్రాయాలన్నీ మీ అహంకారం దాక్కునే ఉపాధులు. ఏదో ఓ విధంగా మీ అహంకారం దాక్కుని తనే శాశ్వతుణ్ణి అని, తను కొనసాగుతూనే ఉంటానని అనుకుంటూ ఉంటుంది.

బుద్ధుడు అంటున్నాడు :

**మరి ఎందుకు?**
**ఎందుకంటే, సుభూతీ, ఈ బోధిసత్త్వుళ్ళలో**
**'నేను' అన్న గ్రహణం ఏర్పడదు కనుక...**

ఓ మనిషి తన అంతరంగం లోపలికి మళ్ళినప్పుడు, మీ చైతన్యం అంతర్ముఖం అయినప్పుడు మీ జీవిలోకి చూసుకున్నప్పుడు, అక్కడ శూన్యం మాత్రమే కనిపిస్తుంది కనుక.

**...'నేను' అన్న గ్రహణం ఏర్పడదు కనుక,**
**'జీవిని' అన్న గ్రహణం ఏర్పడదు కనుక,**
**'ఆత్మను' అన్న గ్రహణం ఏర్పడదు కనుక,**
**'వ్యక్తిని' అన్న గ్రహణం ఏర్పడదు కనుక.**

ఈ నాలుగు విషయాలూ తక్షణం అదృశ్యం అయిపోతాయి.

**ఉండవులే మరి ఉండబోవు ఈ బోధిసత్త్వులకు**
**'ధర్మం ఇది' అన్న గ్రహణం...**

'ధర్మం' అంటే జీవితపు సవ్యమైన మూలకం అని అర్థం; 'ధర్మం కాదు ఇది' అంటే జీవిత అపసవ్యమూలకం అని అర్థం. సవ్యం మరి అపసవ్యం – బుద్ధుడు అంటాడు ఇవి కూడా సత్యం కాదు అని, అవి కూడా మాయమైపోతాయి అని. 'ఇది ధర్మం' అన్న ఎరుక మీలో ఏర్పడదు. 'ఇది ధర్మం' అన్న గ్రహణం మీలో ఏర్పడదు. మీ అంతరంగంలో ఓ సవ్యమైన సత్యస్థితి కనిపించదు. అదేవిధంగా మీ అంతరంగంలో ఓ అపసవ్యమైన సత్యస్థితి కూడా కనిపించదు. అక్కడ మీరు కేవలం పరిపూర్ణ నిర్మల శూన్యత్వాన్ని మాత్రమే గుర్తిస్తారు.

కానీ స్మరించండి, ఆ శూన్యత్వాన్ని మీరు సత్యంతో సమీకరించేసుకునే ఆలోచనను మాత్రం చెయ్యకూడదు. శూన్యత్వం అంటే అక్కడ ఏ సవ్యతా, అపసవ్యతా కూడా లేదనే. ఏ ధనావేశమూ (Positive) లేదనే, అక్కడ ఏ ఋణావేశమూ (Negative) లేదనే – ఆ రెండూ అదృశ్యం అయిపోయి ఉంటాయి. అక్కడ ఏ ద్వంద్వాలూ ఉండవు. అక్కడ సంపూర్ణ నిశ్శబ్దం మాత్రం ఉంటుంది. అక్కడ మీకు ఏమీ దొరకకపోతే, అక్కడ మీకు మీరు కూడా కనిపించకపోతే, అప్పుడు మీరు ముక్తులు అయిపోతారు. మీకు ఓ విముక్తి వచ్చేస్తుందని కాదు, మీ నుంచి మీరే ముక్తులైపోతారు అప్పుడు.

స్వతంత్రం గురించి వేరే ఎవరైనా మాట్లాడుతూ ఉన్నప్పుడు, వాళ్ళ అర్థంలో మీరు అక్కడ స్వేచ్ఛులై ఉంటారు. కానీ స్వతంత్రం గురించి బుద్ధుడు మాట్లాడుతున్నప్పుడు ఆయన అంటాడు, మీకు ముక్తి లభిస్తుంది – మీరు అక్కడ ఉండరు. మీరు స్వాతంత్రంలో ఎలా ఉంటారు? మీరు ఓ స్వాతంత్ర్యంలో ఉంటే, అందులో కూడా మీకు ఒక విధమైన చెరవాసం ఉంటుంది. మీరే ఆ చెరవాసం. మీరు స్వతంత్రంగా ఉండలేరు. మీరు ఉండకపోతేనే స్వాతంత్ర్యం ఉంటుంది. మీరు ఉంటే, స్వాతంత్ర్యం ఉండదు.

ఇక ఏడవ విషయం : ***గ్రహణం ఉండదు***. అక్కడ చూడడానికి ఏమీ లేకుండా ఉన్నప్పుడు, మీరు చూసి స్వీకరించే గ్రహణం అక్కడ ఏముంటుంది? అక్కడ ఆత్మ ఉండదు, సవ్యత్వం ఉండదు, అపసవ్యత్వం ఉండదు – అక్కడ దర్శించడానికి ఏమీ ఉండదు. చూడడానికి అక్కడ ఏమీ లేకుండా ఉన్నప్పుడు, మీరు దేన్నో గ్రహించారు అన్న జ్ఞానం కూడా మీకు అప్పుడు కలగదు. దేన్నయినా మీరు గ్రహించాలంటే మీరు చూస్తున్న ఆ చోటులో ఏమైనా ఉండాలి. కాబట్టి మీరు అర్థంచేసుకోవాల్సిన ఏడవ విషయం, ఏ గ్రహణాన్నీ మీరు పొందరనే – ఏ గ్రహణానికీ ఉనికి లేదని. కానీ మీరు అప్పుడు అడగగలుగుతారు "అయితే అగ్రహణానికి అక్కడ ఉనికి ఉంటుందా?" అని.

బుద్ధుడు అంటున్నాడు, చూస్తున్నవాడే ఉండకపోతున్నప్పుడు, చూడడానికి అక్కడ ఏమీ లేకుండా ఉన్నప్పుడు, అగ్రహణానికి అక్కడ ఓ ఉనికి ఎలా ఉండగలుగుతుంది? ఆ మనిషి తన అహంకారపు అన్ని వేర్లనూ నాశనం చేసేసుకుంటూ ఉంటున్నాడు. అహంకారం ప్రవర్తించే మార్గాలనన్నిటినీ నాశనం చేసేసుకుంటూ ఉంటున్నాడు. ఇవే ఆ ఎనిమిది హద్దులు. ఇవన్నీ అదృశ్యం అయిపోయిన తరువాత ఆ మనిషే ఓ బోధిసత్వుడు.

అప్పుడు ఇంకో సమస్య తలెత్తుతుంది – "ఈ తీరం మీదే నిలబడి ఎలా ఉండాలి?" అప్పుడు మాత్రమే... అప్పుడు మీ దగ్గర పంచిపెట్టడానికి ఏదో ఉంటుంది – మీ శూన్యత్వాన్నే. అప్పుడు మీ దగ్గర పంచిపెట్టడానికి ఏదో ఉంటుంది – మీ స్వర్గాన్నే. అప్పుడు మీ దగ్గర పంచిపెట్టడానికి ఏదో ఉంటుంది – మీ ఉనికినే. కానీ అప్పుడు ఈ తీరం మీదే నిలబడి ఎలా ఉండాలి? మరికొంత సమయంపాటు ఈ తీరం మీదే నిలబడి ఉండడం ఎలా?

బుద్ధుడు అంటున్నాడు :

> **మరి ఎందుకు? ఎందుకంటే, సుభూతీ, ఈ బోధిసత్త్వుళ్ళలో, ధర్మం ఇదన్న, ధర్మం ఇది కాదన్న, జ్ఞానం కనుక ఏర్పడి ఉంటే, ఓ 'ఆహాన్ని' అన్న భావాన్ని, ఓ 'జీవిని' అన్న భావాన్ని, ఓ 'ఆత్మను' అన్న భావాన్ని, ఓ 'వ్యక్తిని' అన్న భావాన్ని వాళ్ళు లాక్కుని దొరకబుచ్చుకుంటారు కనుక.**

మీ లోపల మీకు ఏమైనా కనిపించిందంటే, గుర్తుతెచ్చుకోండి, మీరు ఇంకా బయటే ఉన్నారని. మీకు ఏదైనా కనిపిస్తే, కృష్ణుడు పిల్లనగ్రోవి వాయించుతూ కనిపించినా, శిలువపడి తాజాగా నెత్తురోడుతున్న జీసస్‌క్రైస్ట్ కనిపించినా, బోధివృక్షం క్రింద నిశ్శబ్దంగా కూర్చున్న బుద్ధుడే కనిపించినా సరే. లోపల మీకు ఏం కనిపించినా, గుర్తుతెచ్చుకోండి, మీరు ఇంకా బయటే ఉన్నారని. అందువల్లే బుద్ధుడు అంటాడు "దారిలో మీకు కనిపిస్తే, తక్షణం నన్ను చంపేసెయ్యండి" అని.

ఓ మనిషి ఎక్కడ ఏమీ కనిపించదో ఆ స్థానంలోకి, తన అంతరం లోపలికి చేరుకోవాలి. చూడడానికి అక్కడ దర్శనం ఏమీ లేకపోయినప్పుడు, దర్శి కూడా అదృశ్యమైపోతాడు. ఈ విషయాన్ని ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలి. ఇది అర్థం చేసుకోవడానికి ఎంతో కష్టమైన విషయం. దర్శి ఉనికి ఉండగలిగేది ఓ దర్శనం ఉన్నప్పుడు మాత్రమే. అందువల్లే కృష్ణమూర్తి ఎప్పుడూ చెబుతూనే ఉంటాడు మళ్ళీ మళ్ళీ "దర్శిస్తున్నవాడే దర్శింపబడుతున్నవాడు" అని. దర్శించడానికి అక్కడ ఏమీ ఉండనప్పుడు, అక్కడ ఓ దర్శి ఎలా ఉడగలుగుతాడు? పదార్థమే ఉండకుండా అదృశ్యం అయిపోతే పాత్ర కూడా అదృశ్యం అయిపోతుంది. ఉనికిలో ఆ రెండూ కలిసే ఉంటాయి. అవి ఓ నాణానికి ఉన్న రెండు పార్శ్వాలే.

బుద్ధుడు అంటాడు, ఓ 'ఆధ్యాత్మికానుభవం' అన్నదే లేదు అని. అన్ని అనుభవాలూ అనాధ్యాత్మికానుభవాలు మాత్రమే. మ్మ్? ఎవరో వచ్చి చెప్తారు "నా కుండలినీ లేస్తోంది" అని – కాశ్మీర్‌లో ఉంటున్న గోపీకృష్ణ ఇప్పుడు అంటున్నాడు తన కుండలినీశక్తి జాగృతమై లేస్తూ ఉందని. అది ఆధ్యాత్మికానుభవం కాదు. ఏ కుండలినీ జాగృతమూ ఆధ్యాత్మికం కాదు. అది ఓ భౌతిక సంభవం మాత్రమే. ప్రాపంచిక సంభవం మాత్రమే. కుండలినీ ఉద్వర్తనం వల్ల మీకు సుఖానుభవం కలుగుతుంది రతీసౌఖ్యం కలిగినట్లుగానే. అదే శక్తి ఉద్వర్తనం అది. ఆధ్యాత్మికంతో

దానికి ఏ సంబంధమూ లేదు. ఆధ్యాత్మికత గురించి బుద్ధుడు మాట్లాడే అర్థంతో కనీసపక్షంగా సైతం అది సమానంగా ఉండదు.

తనకు కుండలినీ జాగృతమై పైకి లేచింది కాబట్టి తనకు మహాప్రజ్ఞ ప్రాప్తించిందని అనుకుంటున్నాడు గోపీకృష్ణ. గిలిగింతలు పెడుతూ తన వెన్నుపాములో ఆ శక్తి పైకి లేస్తూ ఉండడం అనుభవం అయిందని అంటున్నాడు. కానీ వెన్నుపాము వెన్నుపాముగానే ఉంటుంది. ఇప్పుడు ఆ మనిషి ఆ కుండలినీశక్తి తన సహస్రారంలోకి చేరిందని, తన సప్తమచక్రంలోకి అనుకుంటున్నాడు. అందువల్ల తనకు సృజనాత్మకత వచ్చేసింది. ఇప్పుడు ఆ మనిషి కవిత్వం రాయడం ప్రారంభించేశాడు. ఆ పద్యాలు పరమచెత్తగా ఉంటాయి. అవి దేన్నీ నిరూపించవు. అవి కుండలినీశక్తిని నిరూపించవు. ఇప్పటిదాకా అంత చెత్త కవిత్వాన్ని నేను ఎప్పుడూ చదవలేదు – అది చిన్నపిల్లల కవిత్వంలాగా ఉంటోంది. చిన్నపిల్లలే అప్పుడప్పుడూ మరింత ఉత్తమకవితలు వ్రాయగలుగుతారు.

ఒక్క విషయంతో మాత్రం దాన్ని సరిపోల్చవచ్చు, శ్రీ చిన్మయ్ కవిత్వంతో. ఆయన కూడా పద్యాలు వ్రాస్తాడు. ఒక్క రాత్రిలో వెయ్యి పద్యాలు వ్రాయగలుగుతాడు. వాటిని 'పద్యాలు' అని చెప్పుకోవడం కూడా అతిశయోక్తే అయిపోతుంది. కనీసం అది గద్యం లాగా కూడా ఉండదు. ఆ మాటలలో ఏ కవిత్వమూ ఉండదు.

కానీ ఈ మనుష్యులు తమకు ఆధ్యాత్మిక సృజనాత్మకత ప్రాప్తించేసిందని అనుకుంటూ ఉంటారు, కుండలినీ జాగృతం జరిగింది కాబట్టి. ఎవరికో తల లోపల కాంతి కనిపిస్తుంది, వెంటనే ఆ మనిషి తనకు ప్రజ్ఞోదయం అయిపోయిందని అనుకునేస్తాడు – "ఎందుకంటే నేను వెలుగును చూశాను కనుక. నేను కళ్ళుమూసుకోగానే ఓ గొప్ప వెలుగు కనిపిస్తుంది నా తల్లో". తల లోపల ఏ వెలుతురూ కనిపించదని కాదు నేను అంటున్నది, కుండలిని జాగృతం కాలేదని కాదు నేను చెబుతున్నది – ఎంతో సులభంగా కుండలిని పైకి లేస్తుంది. ఇక్కడ మీరు చూడవచ్చు; గోపీకృష్ణ పొందిన ఆ అనుభవాన్ని పొందినవాళ్ళు ఇక్కడ ఎంతోమంది ఉన్నారు. అదేమీ గొప్పలు చెప్పుకోవాల్సిన విషయం కాదు.

అన్ని అనుభవాలూ బాహ్యంలోనే జరిగితీరుతాయి. ఎందుకంటే అనుభవం పొందుతున్నవాళ్ళు మీరు కనుక, ఆ అనుభవం మీ ఎదురుగానే ఉంటోంది కనుక, మిమ్మల్నే చూస్తూ. అన్ని అనుభవాలూ అదృశ్యం అయిపోయిన వెంటనే అనుభవిస్తున్న

వాడు కూడా అయిపోయి అదృశ్యం ఉంటాడు. అనుభవం ప్రత్యక్షం కాగానే, అది అంతర్ధానం అయిపోతుంది. ఎందుకంటే దానికి 'ఉనికి' ఉండడానికే వీలులేదు కనుక. అనుభవాలు ఉండకపోతే అది బ్రతికి ఉండదు కనుక. అనుభవాలే అనుభవిస్తున్నవాణ్ణి పోషిస్తూ ఉంటాయి. అనుభవిస్తున్నవాడు అనుభవాల ఉనికిలో ఉంటాడు. అనుభవమూ అనుభవిస్తున్నవాడూ రెండూ వెళ్ళిపోయిన తరువాత వల్లే మాత్రమే మీరు బోధిసత్త్వులై మిగిలి ఉంటారు.

> **మరి ఎందుకు? బోధిసత్త్వుళ్ళు ఏ ధర్మాన్నీ, ఏ ధర్మశూన్యతనూ**
> **దొరకబుచ్చుకుని పట్టుకోకూడదు కనుక.**
> **అందువల్లే పరిబోధింపబడింది ఈ తథాగత ప్రవచనం ఓ రహస్య**
> **అంతరార్థంతో : 'ఈ ధర్మబోధను విన్నవాళ్ళు వదిలిపెట్టెయ్యాలి దీన్ని**
> **ఓ తెప్పలా వాడుకుని, అన్ని ధర్మాలూ విడిచిపెట్టెయ్యబడాలి,**
> **అన్ని ధర్మశూన్యతలూ విడిచిపెట్టెయ్యబడాలి అంతకంటే ఎక్కువగా.'**

బుద్ధుడు సర్వస్వమూ త్యజింపబడాలని అంటున్నాడు – ధర్మాలను, ధర్మశూన్యతలను, అనుభవాలను, మహానుభవాలను, ఆధ్యాత్మికానుభవాలను, చివరికి అనుభవాలను పొందుతున్నవాణ్ణి కూడా. సర్వస్వమూ పరిత్యజింపబడాలి. ఎప్పుడు ఏదీ మిగిలి ఉండదో, ఎప్పుడు కనీసం ఏ జాడ అయినా కనిపించదో, ఎప్పుడు అక్కడ ఏదీ లేదు అన్న జ్ఞానం కూడా మిగిలి ఉండదో... ఓ ఊహ మిగిలున్నా - అక్కడ ఏమీ లేదని – సర్వస్వమూ అక్కడ ఉన్నట్లే. ఆ ఊహ ఒక్కటే చాలు, ప్రపంచాన్నంతా తనతో కలిపేసి ఉంచుకోవడానికి. మీరు "ఇప్పుడు ఇక్కడ ఏమీలేదు" అని అనుకున్నారనుకోండి. అప్పుడు విషయం మీ చేజారిపోయిందనే అర్థం. విషయం మీకు ఏ మాత్రమూ అర్థం కాలేదనే అర్థం. మీరు ఆ మాటను కూడా చెప్పుకోవడం జరగబడకూడదు – అక్కడ ఏమీ లేదన్న మాటను – ఎవరు ఉంటారు అక్కడ ఆ మాటను చెప్పడానికి? ఎవరు ఉంటారు అక్కడ దాన్ని గమనించడానికి? మహానిశ్శబ్దం మాత్రమే ఉంటుంది. పరిపూర్ణ నిశ్శబ్దం.

కాబట్టి బుద్ధుడు అంటాడు ధర్మమూ, మతమూ ఓ తెప్పలాగే ఉంటుందని. ఎంతో ప్రాశస్త్యం ఉన్న బుద్ధుని ప్రవచనం ఇది. మజ్జిమ నికాయంలో బుద్ధుడు అంటాడు "ఓ తెప్ప రూపాన్నే ఉపయోగిస్తూ, తమ్ముళ్ళూ, ఆ ప్రమాణాన్నే వదిలిపెట్టెయ్యాలని నేర్పిస్తాను. దాన్ని మీతోపాటు పట్టుకుపోకూడదు. ఓ మనిషి ఆ

తెప్పతో ఓ పెద్ద వాగును దాటితే, ఈవలి ఒడ్డు సంశయాలతో, భయాలతో నిండి ఉండినదై ఉన్నా, ఆవలి ఒడ్డు క్షేమంగా అభయంగా ఉన్నా, ఆ మనిషి ఆ తెప్పను భుజాల మీదికి ఎత్తుకుని మోసుకుని తనతోపాటు తీసుకుపోడు, అది తనకు ఎంతో ఉపయోగపడినప్పటికీ. ఆ విధంగానే, తమ్ముళ్ళూ, మనం సన్మార్గాలను సైతం వదిలిపెట్టాలి, దుర్మార్గాలను గురించి ఏమీ అనుకోకుండా."

అన్ని పద్ధతులు - యోగాలూ, తంత్రాలూ - అన్ని సాధనలూ, అన్ని ధ్యానాలూ, అన్ని ప్రార్థనలూ వ్యూహాలే ఆవలి ఒడ్డు చేరుకునేందుకు. మీరు ఒక్కసారి ఆ తీరానికి చేరుకున్నారంటే, వాటన్నింటినీ మీరు వదిలిపెట్టాలి. కృతజ్ఞులై ఉండండి, కానీ వాటిని మోసుకుంటూ తిరిగే ప్రయత్నాన్ని ప్రారంభించకండి. అది జరిగిందంటే, మీరు మూర్ఖులై ఉంటారు.

లేదా బుద్ధుడు మళ్ళీ అంటాడు "ఈ తెప్ప ఉదాహరణ ధర్మాలను ఉపయోగార్థ వినిమయ అంశాలుగానే పరిగణించాలి అన్న విషయాన్నే దర్శింపజేస్తుంది, ఓ గమ్యాన్ని చేర్చే సాధనాంశాలే అవి. శూన్యత్వానికి కూడా, ధర్మాలకు కూడా ఇదే వర్తిస్తుంది. ఈ తత్వమే మరోచోట సోదాహరణంగా చెప్పబడి ప్రకటితం అవుతుంది ఏ రోగాన్నో నయంచేసే ఔషధ ఉపయోగ ఉపమాలంకారంతో. ఓ రోగం నుండి ఉపశమనం లభించి స్వస్థత చేకూరిన తరువాత ఆ రోగంతోపాటే ఆ ఔషధాన్ని కూడా వదిలిపెట్టెయ్యాలి, ఆ ఔషధ పునఃసేవనం ఆ రోగాన్నే పునఃప్రాప్తింపజేస్తుంది కాబట్టి."

బుద్ధుడు అంటాడు : అదేవిధంగా, ఈ 'శూన్యత్వం' అన్న ఔషధం 'ఉనికితో ఉన్నాను' అన్న రోగాన్ని నయం చేసేసిన తరువాత, ఈ శూన్యత్వాన్నే ఇంకా పట్టుకుని ఉండడం కూడా ఓ రోగమే అయిపోతుంది, ఉనికిని పట్టుకుని ఉండడంలాగే. ఈ 'శూన్యత్వం' అన్న ఔషధాన్ని ఆరోగ్యాన్ని పొందిన తరువాత కూడా పట్టుకుని ఇంకా ఉపయోగించుకుంటూ ఉంటున్నవాళ్ళు, తమకు తామే ఆ రోగాన్నే మళ్ళీ తెప్పించేసుకుంటారు."

గుర్తుంచుకోండి. ఓ మనిషి సర్వస్వాన్నీ వదిలిపెట్టేసి శూన్యుడు అయిపోవాలి. ఆ తరువాత ఆ శూన్యత్వాన్ని కూడా వదిలిపెట్టేసెయ్యాలి. ఆ శూన్యత్వం కేవలం ఓ ఔషధం మాత్రమే. బుద్ధుడు సరైన మాటనే అంటూ ఉన్నాడు ఇలా అంటున్నప్పుడు "నేనో వైద్యుణ్ణి, వేదాంతిని కాను". ఆయన మీరు అంటిపెట్టుకునేందుకు ఏ సిద్ధాంతాన్నీ

అందించదు. ఆయన మీకు అందిస్తూ ఉన్నవన్నీ ఉపయోగార్థం, స్వతంత్రంగా వినియోగించుకోవాల్సిన విషయాలు మాత్రమే. ఏదో ఒకనాటికి మీరు వాటిని కూడా వదిలిపెట్టాల్సే వస్తుంది, మరచిపోవాల్సే వస్తుంది.

అన్నీ అదృశ్యం అయిపోయిన తరువాత – ప్రపంచమూ, దేవుడూ, పదార్థమూ, మనస్సూ, శరీరమూ, ఆత్మా, నువ్వూ, నేనూ అన్నీ – అన్నీ అదృశ్యం అయిన తరువాత 'అన్నీ అదృశ్యం అయిపోయాయి' అన్న ఆలోచన కూడా అదృశ్యం అయిపోయిన తరువాత, చేరాల్సిన చోటుకు మీరు చేరుకున్నవాళ్ళు అవుతారు, మీరు ఓ బోధిసత్వుడిగా అయిపోయి ఉంటారు. అప్పుడు మీకు సమస్య తయారవుతుంది. ఈ ఒడ్డు మీదే నిలబడి ఉండడం ఎలా? ఓ క్షణమైనా ఈ తీరం మీదే నిలబడి ఉండడం ఎలా?

మీరు ఓ చిత్తోత్పాదాన్ని చేసుకోవాలి, మీరు ఓ మహానిర్ణయాన్ని తీసుకోవాలి "మిగతావాళ్ళందరూ చీకట్లో తట్టుకుని పడుతూ లేస్తూ ఉంటున్నారు. నాకు ప్రాప్తించింది – నేను దీన్ని అందరితో పంచుకునే తీరాలి". ఆ చిత్తోత్పాదంలోంచి, ఆ సృష్టించుకున్న కొత్త మనస్సులోంచి... ఎందుకంటే మీ పాతమనస్సు వెళ్ళిపోయి ఉంటుంది కనుక, ఆ పాత మనస్సుతో మీరు ఈ తీరం మీద నిలబడి ఉండలేరు. మీరు ఓ కొత్త మనస్సును సృష్టించుకోవాలి.

రెండు పదాలను అర్థంచేసుకోవాలి : ఆవేశం (Passion); కరుణావేశం (Compassion). ఈ రెండు పదాలలోనూ ఆవేశం ఉంటుంది. ఆవేశం పాత మనస్సుది; కోరికలు కోరుకునే మనస్సుది, కోరికలతో నిండి ఉన్న మనస్సుది. ఆ అన్ని కోరికలూ అదృశ్యం అయిపోయిన తరువాత, ఆ పాత మనస్సు వెళ్ళిపోయిన తరువాత, వెంటనే మీరు కరుణావేశాన్ని సృష్టించుకోవాలి, అందువల్ల మీరు ఈ తీరం మీదే నిలబడి ఉండగలుగుతారు కాబట్టి. మరికొంత సమయంపాటు మీరు అక్కడే ఉంటూ మరికొంతమందికి సహాయపడుతూ, వాళ్ళు ఆవలితీరం మీదికి తమ కళ్ళను ఎత్తి చూసేలా చెయ్యవచ్చు. మరికొంతకాలం మీరు వాళ్ళకు ఆ మార్గదర్శకత్వాన్ని వహిస్తూ ఉండవచ్చు. ఆ మార్గాన్ని సూచిస్తూ ఉండవచ్చు.

> ***భగవానుడు అడిగాడు : నువ్వేమనుకుంటున్నావు, సుభూతీ,***
> ***'ఇదే పరమధర్మం, ఇదే సరైన సర్వోత్కృష్ట సంప్రజ్ఞత' అని తథాగతుడు***
> ***సంపూర్ణంగా పరిగ్రహించింది కానీ, తథాగతుడు ఆచరించి పరిబోధించిన***
> ***ధర్మం కానీ ఉందా ఏదయినా?***

బుద్ధుడు వ్యవహరించే పద్ధతులలో ఇది ఒకటి – ఆయన అప్పుడప్పుడూ ఈ విధంగా అడుగుతూ ఉంటాడు "నువ్వు ఏమనుకుంటున్నావు, సుభూతీ? సత్యం నాకు ప్రాప్తించిందా? ధర్మం నాకు ప్రాప్తించిందా? లేకపోతే ఊరికే సత్యాన్ని అందరికీ బోధిస్తూ ఉంటున్నానా? నీకు ఏమనిపిస్తోంది?"

> ***భగవానుడు అడిగాడు : నువ్వే ఏమనుకుంటున్నావు, సుభూతీ, 'ఇదే పరమధర్మం, ఇదే సరైన సర్వోత్కృష్ట సంప్రజ్ఞత' అని తథాగతుడు సంపూర్ణంగా పరిగ్రహించింది కానీ, తథాగతుడు ఆచరించి పరిబోధించిన ధర్మం కానీ ఏదైనా ఉందా?***
>
> ***సుభూతి ప్రత్యుత్తరాన్ని ఇచ్చాడు : లేదు...***

బుద్ధుడి ఉచ్చులోకి ఇరుక్కుపోవడం అతిసులభంగానే జరిగిపోతుంది. ప్రశ్న మహాకష్టంగా ఉంటుంది. ఆ ప్రశ్న ఎలా ఉంటుందంటే ఎవరికైనా 'ఔను' అన్న సమాధానాన్నే చెప్పేవిధంగా. "ఔను. బుద్ధుడికి ఆ సర్వోత్కృష్ట సంప్రజ్ఞత ప్రాప్తించింది. కాకపోతే సంప్రజ్ఞత వచ్చింది ఎవరికి?" కానీ 'ఆ సంప్రజ్ఞతను ప్రాప్తించుకోవడం' అన్నమాటే అనాధ్యాత్మికంగా ఉంటుంది. కానీ బుద్ధుడు ప్రాప్తించుకున్నది ఏదీ లేదనీ, ప్రాప్తించుకున్నవాడు ఎవడూ లేదని అంటున్నాడు.

మరి అతిసామాన్యంగానే ఎంతో ఎంతో సులువుగా సుభూతి బుద్ధుడితో చెప్పేసి ఉండొచ్చు "ఔను, భగవాన్. మీరు బోధించినట్లు ఇంకెవ్వరూ బోధించలేదు. మీరు ఆచరించి ప్రకటించినట్లు ఇంకెవ్వరూ ప్రకటించలేదు", అని. కానీ ప్రాప్తించుకోవడానికి అక్కడ ఏమీ లేకుండా ఉంటున్నప్పుడు, ఆచరించి ప్రకటించడానికి ఏమి ఉంటుంది? ప్రాప్తించుకునేదీ ఏదీ ఉండక, ప్రాప్తించుకున్నవాడు కూడా ఎవరూ ఉండకపోతే, ఆచరించి ప్రకటించడానికి ఏమి ఉంటుంది? ఆచరించి ప్రకటించడానికి ఎవరు ఉంటారు?

కానీ సుభూతి బుద్ధుడి ప్రశ్నతో మోసపోలేదు, ఆ ప్రశ్న ఉచ్చులో ఇరుక్కుని.

> ***సుభూతి ప్రత్యుత్తరాన్ని ఇచ్చాడు : లేదు. భగవానుడి ప్రవచనాల పరిబోధలో నేను అర్థం చేసుకున్న ఏ ధర్మమూ లేదు. మరి ఎందుకు లేదు? తథాగతుడు సంపూర్ణంగా పరిగ్రహించిన, ఆచరించి పరిబోధించిన ఈ ధర్మం – కాదు గ్రాహ్య సాధ్యం, కాదు బోధింప సాధ్యం. అది ధర్మమూ కాదు, ధర్మశూన్యతా కాదు.***

కాబట్టి ముందుగా సుభాతి అంటున్నాడు : "లేదు. మీరు దేన్నీ ప్రాప్తించుకోలేదు. ఎందుకంటే, మీ బోధను నేను సరిగ్గా అర్థం చేసుకునే ఉంటే, ప్రాప్తించుకోవడానికి అక్కడ ఏమీ ఉండదు కనుక. మరి మీరు ఎలా ఆచరించి పరిబోధించగలుగుతారు దేనికన్నా అతీతంగా ఉంటున్న దేన్నో, శూన్యత్వానికి కూడా అతీతంగా ఉంటున్నదాన్ని? మీరు దాన్ని ఎలా ప్రకటిస్తారు? దాన్ని పట్టుకునే ఏ మార్గమూ లేదు. దాన్ని బోధించే ఏ మార్గమూ లేదు. ఎందుకంటే అది సవ్యంగానూ ఉండడంలేదు, అది అపసవ్యంగానూ ఉండడంలేదు కాబట్టి". భాష సవ్యాన్ని గానీ అపసవ్యాన్ని గానీ పట్టుకోగలుగుతుంది; ఆ రెండిటికీ అతీతంగా ఉంటున్నదాన్ని గ్రహించగలగడం అసాధ్యం.

ఇంకా, మళ్ళీ, ఓ చివరి విషయాన్ని సుభూతి అంటూ ఉన్నాడు :

> **మరి ఎందుకు? ఎందుకంటే ఓ పరమం పవిత్రుళ్ళను**
> **పరమస్థాయిలో పరిస్థాపించి ఉంచుతోంది కాబట్టి.**

'పరమం' అంటే 'అతీతంగా ఉన్నదే' అని. సర్వోత్కృష్టమైనది. రాగద్వేషాలకు అతీతంగా ఉన్నది. జీవన్మరణాలకు అతీతంగా ఉంటున్నది. రాత్రింబవళ్ళకు అతీతంగా ఉంటున్నది. స్త్రీ పురుషులకు అతీతంగా ఉంటున్నది. స్వర్గ నరకాలకు అతీతంగా ఉంటున్నది. అన్ని ద్వంద్వాలకూ అతీతంగా ఉంటున్నది. అదే పరమం – **పరమం పవిత్రుళ్ళను పరమ స్థాయిలో పరిస్థాపించి ఉంచుతోంది.** ఓ పరమం, ఆ సర్వోత్కృష్టం, ఆ సర్వద్వంద్వాతీతం, మిమ్మల్ని ఆవహించి ఉంటోంది.

సంస్కృతభాషలో దీనికి ఎంతో సంపద్వంతంగా పదం ఉంటుంది. అదే 'ప్రభావీత'. ఈ పదానికి ఎన్నో అర్థాలు ఉన్నాయి. దీనికి మహాసంపద ఉన్న ఎన్నో అర్థాలు ఉన్నాయి. 'ప్రభావితమైన' అన్నది ఒక అర్థం. 'శోభనొందిన' అన్నది ఇంకొక అర్థం. 'అందులోంచి శక్తిని పొందుతూ ఉన్న' అన్నది ఇంకో అర్థం. 'అందులోంచి ప్రజ్ఞాకాంతిని పొందుతూ ఉన్న' అన్నది మరో అర్థం. చంద్రుడు సూర్యుడి వద్ద నుండి కాంతిని గ్రహిస్తూ ఉంటాడు, ఆ సూర్యకాంతిని ప్రతిఫలిస్తూ ఉంటాడు. చంద్రుడు సూర్యుడి వల్ల ప్రభావితుడై ఉంటాడు – ఇదే 'ప్రభావీతం' అంటే. చంద్రుడు కేవలం ఓ దర్పణంగా ఉంటాడు.

బుద్ధుడు కూడా ఆ విధంగానే ఉంటాడు. బుద్ధుడు ఓ ఖాళీ దర్పణంలాగా ఉంటాడు. ఆయన ఉనికిని ప్రతిఫలిస్తూ ఉంటాడు, ఉన్నది ఉన్నట్లుగా – యధాభూతమ్.

ఆయన ఏమీ చెప్పడు. ఓ దర్పణం ఏమీ చెప్పదు. ఓ దర్పణానికి చెప్పేందుకు ఏమీ ఉండదు. అది కేవలం ఉన్నదాన్ని ప్రతిబింబిస్తూ ఉంటుంది. ఏది ఉంటున్నదో దాన్ని. దర్పణం ఏమీ చెయ్యదు. ఉన్నదాన్ని ఉన్నట్లుగా ప్రతిబింబిస్తుంది అంతే - యధాభూతంగా.

బుద్ధుడిలో ఉనికే ప్రతిబింబిస్తూ ఉంటుంది. పరమమే ప్రభావించి ఉంటుంది. పరమమే బుద్ధుడిలో ప్రతిఫలిస్తూ ఉంటుంది. బుద్ధుడు ఏమీ చేస్తూ ఉండడు.

ఓ నిజమైన గురువు దర్పణంలాగే ఉంటాడు, ఆయన ఉనికినే ప్రతిబింబిస్తూ ఉంటాడు, ఏది ఉందో, దాన్నే. ఆయన బోధించే ఏ వేదాంతమూ ఉండదు. ఏ సిద్ధాంతాన్నీ ఆయన వర్ణించడు, ప్రతిపాదించడు. ఉనికే ఆయన వేదాంతం. జీవితమే ఆయన సిద్ధాంతం. ఆయన రుబ్బేందుకు ఏదీ ఉండదు. ఆయన పిండికొట్టేందుకు ఏదీ ఉండదు. ఆయన దేన్నీ రుద్దడు. ఆయనకు ఎక్కడా ఏ ఉద్దేశ్యమూ ఉండదు. ఆయనే ఉండడు. అలా ఉంటూ ఉండడం వల్లే ఆయన ఓ దర్పణంగా ఉండగలుగుతున్నాడు.

ఓ బోధిసత్త్వుడు ఓ దర్పణం కాగలిగే స్థితిలోకి చేరిపోబోతూ ఉంటాడు. ఆ బోధిసత్త్వుడు ఓ కొత్త మనస్సును సృష్టించుకోగలిగితే, ఓ నవ్యమార్గాన్ని - చిత్తోత్పాదాన్ని - ఓ కరుణావేశాన్ని పొందగలిగాడంటే, ఈ ఒడ్డు మీదే, ఈ తీరం మీదే మరికొంత సమయం పాటు ఆయన ఇక్కడే ఉండగలుగుతాడు. ఆ ఉండడం ఓ అద్భుతంగా ఉంటుంది. ఎందుకంటే ఆయన ఈ లోకం మనిషి కాడు కనుక. ఆయనకు ఈ ప్రపంచంతో ఏ సంబంధమూ ఉండదు. ఆయనకు ఈ ప్రపంచం ఇక ఉండదు. అయినా ఆయన ఇక్కడే మిగిలి ఉండడం జరుగుతుంది. అప్పుడు ఓ అద్భుతమే జరుగుతూ ఉంటుంది.

ఓ బోధిసత్త్వుడు ఈ ఒడ్డు మీద కొన్నిరోజులు నిలబడి ఉండడం, లేదా కొద్ది సంవత్సరాలపాటు ఉండడం ఓ అద్భుతమే. మహాద్భుతం అది.

ఎప్పుడో ఓ మనిషి బుద్ధుడి వద్దకు వచ్చి ఇలా అడిగాడు "మీరు కొన్ని అద్భుతాలను ఎందుకు ప్రదర్శించరు?"

అప్పుడు బుద్ధుడు అన్నాడు "నేనే అద్భుతాన్ని".

ఈ రోజుకు ఇది చాలు.

# ౬. బోధిసత్వత్వం

## మొదటిప్రశ్న :

*ప్రియ ఓషో,*

*ఏమిటీ బోధిసత్వుల సత్తా అంతా?*
*వీళ్ళ గురించిన ఒక్కమాటను కూడా నేను నమ్మను.*
*అటువంటి విషయమే లేదు.*

ఔను. సోమేంద్రా, ఇవన్నీ మతిలేని మాటలే. కానీ నువ్వు ఈ 'మతిలేని' అనే మాటను అర్థంచేసుకోవాలి. అర్థం అయ్యేదానికన్నా అతీతంగా ఉంటుంది అది. నువ్వు దీన్ని నమ్మక్కరేదు. దీన్ని నవ్వు నమ్మలేవు – కేవలం అనుభవంతో మాత్రమే నువ్వు దీన్ని తెలుసుకోగలుగుతావు. ఇది ఓ మతిలేని అనుభవంగానే ఉంటుంది. కానీ అది సత్యంగా ఉంటుంది. అదే పరిపూర్ణ సత్యంగా సంభవిస్తుంది. అది సంభవించేంతవరకూ దాన్ని నమ్మేందుకు ఏ మార్గమూ ఉండదు. ఉండాల్సిన అవసరం కూడా లేదు. బుద్ధుడు ఎటువంటి నమ్మకాలనైనా సమర్ధించడు. ఆయన ఏం చెబుతూ ఉన్నా, అది ఓ అనుభవంగా ఉంటుంది. అది ఉనికితత్వంతో ఉంటుంది. అది మనస్సుకు అతీతంగానే ఉంటుంది.

మామూలుగా మనం ఈ 'మతిలేని' అన్న మాటను మనస్సు కంటే తక్కువగా ఉన్న విషయాన్ని గురించే చెప్పుకుంటూ ఉంటాం. కానీ మనస్సుకు అతీతంగా కూడా ఏదో ఉంది – అది కూడా 'మతిలేని' విషయమే. మనస్సు దాన్ని విని ఏ అర్థాన్నీ చేసుకోలేకపోతుంది. నీ మనస్సు మాయమైపోతే తప్ప ఈ బోధిసత్వుడు అంటే ఎవరో ఏమిటో నువ్వు అర్థంచేసుకోలేకపోతావు. అది ఒక విషయం కాదు, సత్యమే. అది ఓ అనుభవిస్తూ ఉండడంగా ఉంటుంది.

నీకు కోరిక తెలుసు. నీకు ఆవేశం తెలుసు. నీకు లైంగికత్వం తెలుసు. నీకు ప్రేమ తెలుసు. దీన్ని గురించి కామపు కోరిక ఇంకా తలెత్తని ఓ చిన్నపిల్లవాడికి

చెప్పేందుకు నువ్వు ప్రయత్నించి చూడు, అప్పుడు ఆ పిల్లవాడు అంటాడు అవన్నీ 'మతిలేని' మాటలు అని. కేవలం ఓ నాలుగేళ్ళ కుర్రాడితో ప్రేమ గురించి చెప్పేందుకు ప్రయత్నించు, చాలు – నువ్వు ప్రేమలో పడ్డావని చెప్పు – అప్పుడు ఆ కుర్రాడు మిమ్మల్ని తన నమ్మలేని కళ్ళు పెట్టుకుని మరీ చూస్తాడు. నువ్వు ఏం మాట్లాడుతూ ఉన్నావు? ఈ ప్రేమ సత్తా ఏమిటి?

మరి నీలో ఎంత శృంగారం ఉన్నా, ఎంత కవిత ఉన్నా, నీ గుండెల్లో స్పందన ఎంత గొప్పగా ఉన్నా ఆ చిన్నపిల్లవాడికి దాన్ని వర్ణించి చెప్పడం అసాధ్యం అయిపోతుంది. ఆ కుర్రవాడికి ఆ ప్రేమరుచి అనుభవం ఉండదు. వాడికి దాన్ని గురించిన ఎరుకే ఉండదు. ఆ కోరిక వాడిలో తలెత్తి ఉండదు. బుద్ధుడు ఆ కోరికను 'వాసన' అని అంటాడు. ఆ వాసన ఆ పిల్లవాడిలో ఉండదు. అది లేచేవరకూ ఏ విధంగానూ ప్రేమ గురించి ఆ పిల్లవాడితో మాట్లాడేందుకు వీలే ఉండదు.

అదే వాసన, కోరికలో ఏ శక్తి ఉందో అదే లైంగికత్వంలోనూ, ప్రేమలోనూ ఉంటూ, ఏదో ఓ నాటికి ఆ కోరిక నుండి విముక్తం అయిపోతుంది. ఏదో ఒకనాటికి ఆ లైంగిక వాంఛ రాలిపోతుంది. ఓ రోజులో అది ఎలా లేచిందో, మరోనాటికి అది పడిపోతుంది కూడా. జన్మించినవన్నీ మరణించే తీరాలి. ప్రారంభమైన ప్రతిదానికీ, అంతం కూడా ఉంటుంది. జీవితం కూడా అతిసహజంగా సద్యఃజీవనంతో జరుగుతూ ఉంటే అప్పుడు అక్కడ ప్రత్యేకంగా గుర్తించగల ఓ స్థాయి దానికి ఏర్పడుతుంది.

లైంగికత్వం పద్నాలుగేళ్ళ ప్రాయంలో తలెత్తుతుంది – లైంగిక పరిణితి – అప్పుడు ఆ పిల్లవాడి ఉల్లం జల్లుమంటుంది, ఏదో అర్థంకాని ఆ అజ్ఞాత కొత్తదనంతో. ఇప్పుడు ఆ కుర్రవాడి మీద కోరిక పవనాలు వీస్తూ ఉంటాయి – ఆ కుర్రవాడిలో ఓ గొప్ప ఆవేశం, ఓ మంట రేగుతూ ఉంటుంది. ఆ తరువాత అప్పటిదాకా ఆ కుర్రవాడిలోనే ఉంటూ ఉన్న అమాయకత్వం ఆ కోరిక తలెత్తిన తరువాత ఉండనే ఉండదు. ఇక ఆ తరువాత మళ్ళీ ఆ కుర్రాడు దేన్నీ అమాయకంగా చూడలేడు.

మీ జీవితం సవ్యంగా, సజావుగా, సహజత్వంతో, సద్యఃజీవనంతో సాగుతూ ఉంటే సరిగ్గా పద్నాలుగేళ్ళ ముందు మృత్యువు మీకు ప్రాప్తించక ముందు సమయంలో మీ లైంగిక వాంఛ కూలిపోతుంది. సరిగ్గా మృత్యువుకు పద్నాలుగేళ్ళ ముందు మీ లైంగికవాంఛ మీకు అసంగతం అయిపోతుంది. ఉన్నట్లుండి మీకు అర్థమైపోతుంది ఆ మీ కామ స్వప్నం అదృశ్యమైపోయింది అని. అప్పుడు అక్కడ నిశ్శబ్దం ఉంటుంది, మహా నిశ్శబ్దం, తుఫాను మాయమైపోయి ఉంటుంది. కానీ ఆ లైంగికత్వంకోసం

వినియోగింపబడుతూ ఉన్న శక్తి ఉంటుంది, కానీ ఆ కోరిక మాయమైపోయి ఉంటుంది. అప్పుడు ఆ శక్తి ఎక్కడికి పోవాలి?

మీరు ఇంకా తిండి తింటూ శక్తిని సృష్టించుకుంటూనే ఉంటారు. శ్వాసిస్తూ, శారీరిక అభ్యాసాలను చేస్తూ, జీవిస్తూ. మీరు నిరంతరంగా ఎప్పుడూ దైవశక్తిని మానవశక్తిగా మార్చుకుంటూ ఉంటారు. ఈ శక్తి అంతా ఎక్కడికి వెళ్తుంది? మీకు ఆ శక్తి ఖర్చు అయ్యే పాతదారి మూసుకుపోయి ఉంటుంది. లైంగికత్వం దిశలోకి ఆ శక్తి ప్రవహించేందుకు దారే ఉండదు. అప్పుడు ఆ శక్తి ఎక్కడికి కదులుతుంది? దాన్ని చెప్పడానికి బుద్ధుడి వద్ద మరో పదం ఉంది. దాన్నే ఆయన 'కరుణ' అంటాడు. కరుణావేశం.

మీ ఆవేశానికి అప్పుడు ఏ ప్రాముఖ్యమూ ఉండదు. మీ వద్ద శక్తి ఉంటుంది. మీలో ఎంతో శక్తి ఉంటుంది. ఆ శక్తి ఎక్కడికైనా ఒకచోటికి వెళ్ళితీరాలి. ఎందుకంటే శక్తి స్తబ్ధంగా ఒక్కచోటులోనే ఉండిపోదు కనుక. శక్తికి ఉన్న సహజ స్వభావమే ప్రవహిస్తూ ఉండడం. ఆ శక్తి మీలో పొంగి పొరలుతూ మీ కరుణలో నుంచి బహిర్గతమవుతుంది. అదే బోధిసత్వుడి ఉనికి స్థితి. లైంగికత్వం అదృశ్యం అయిపోయిన తరువాత, కోరిక అదృశ్యం అయిపోయిన తరువాత, మీ దగ్గర బోలెడు శక్తి ఉంటుంది. దాన్ని మీరు నిలిపి ఉంచుకోలేరు. అది ప్రవహిస్తూ ఉంటుంది. మీ పాత్రలోంచి అది పొంగిపొర్లుతూ ఉంటుంది. అదే కరుణావేశం.

ఇదే బోధిసత్వుడి స్థితి. ఇది ఒక విషయం కాదు. మామూలుగా ఇది సంభవించదు, ఎందుకంటే ఇప్పుడు మానవులు అందరూ అసహజంగానే తయారైపోయి ఉంటున్నారు కాబట్టి. అందువల్లే, ప్రపంచంలో ఉన్న అన్ని భాషలలో, ఓ వృద్ధుడికి కామవికారాలు కలుగుతూ ఉంటే, అదొక చండాలపు విషయమని చెప్పబడుతూ ఉంటోంది. అది మహామాలిన్యంగా ఉంటుంది. మహామాలిన్యపు వృద్ధుడు. మాలిన్యంగా ఎందుకు ఉంటాడు? ఓ యువకుణ్ణి మాలిన్యంతో ఉన్నాడని మనం అనుకోము, మరి వృద్ధుణ్ణి మాలిన్యంతో ఉన్నాడని ఎందుకు అంటున్నాం? 'డర్టీ ఫెలో' అనీ? 'డర్టీ ఓల్డ్ మేన్' అనీ?

అనేక యుగాలకు ముందు అటువంటి విషయాలు జరగకుండా ఉన్నప్పటి ప్రాచీన గతపు రోజుల నుంచే ఆ మాట పుట్టుకొచ్చింది. ఆ మనిషి ఉంటున్నది సవ్యమైన పరిస్థితుల వ్యవహారంతో కాదు. అది సహజంగా ఉండడం లేదు. అది సహజత్వానికి అతీతంగా ఉంటోంది – ఎక్కడో ఏదో తప్పు జరిగింది. కాకపోతే,

మీకు మృత్యువు వాటిల్లక మునుపే ఆ కోరిక మీకు ఎప్పుడో అంతరించిపోయి ఉండాలి. అలా కాకపోతే మీ జీవితంలో మీరు ఏం చేస్తూ ఉన్నారు మీ కామపు కోరిక మాయమైపోయే స్థితికి ఇంకా చేరుకోకుండా? మీరు ఓ గొప్ప జీవిత అవకాశాన్ని పోగొట్టుకునే ఉన్నారు.

మళ్ళీ మరచిపోకండి. కామపు కోరికలు మీకు ఉండకూడదని నేను చెప్పడం లేదు. మీకు అందరికీ అవి ఉండాలనే నేను కోరుకుంటాను. యుక్తసమయంలో మీరు అందులోకి ప్రవేశించండి. ఇష్టంగా మీరు పూర్తిగా కామంలోకి చరిస్తే సులభంగా అందులోంచి బయటపడే సమయం కూడా మీకు తప్పక వచ్చితీరుతుంది. పూర్తిగా అందులోకి ప్రవేశించగలిగినవాడే అందులోంచి పూర్తిగా బయటపడగలుగుతాడు. నిరుత్సాహంతో, హృదయపూర్వకంగా కాకుండా, అసంపూర్ణంగా, అణచిపెట్టుకుంటూ వెళ్ళే పద్ధతిలో వెళ్తే ఆ బంధం చిక్కులోంచి ఆ మనిషి ఎప్పటికీ తప్పించుకోలేడు, ఆ చర్యలో ఉన్న మూర్ఖత్వాన్ని ఎప్పటికీ తెలుసుకోలేడు, ఆ మాయలోంచి ఎప్పటికీ బయటపడలేడు.

కాబట్టి నేను కోరికను ద్వేషిస్తూ ఉండను. ఆ కామావేశం ఉండాలనే నేను అంటాను. కామంలోకి వెళ్ళండి. పూర్తిగా, హృదయపూర్వకంగా వెళ్ళండి. సమయం ఉన్నప్పుడు ఆ కామంలో ఏముందో అంతా చూడండి. అటువంటి చూపుతోనే ఆ కామబంధం నుండి మీరు బయటపడగలుగుతారు. బాగా పండిన ఫలమే నేలరాలిపోతుంది. పక్వానికి వచ్చిన పండు రాలిపడిపోతే ఆ వృక్షానికి కూడా ఎంతో హాయిగా ఉంటుంది. ఆ హాయి వచ్చిన తరువాత మీరు ఏం చేస్తారు? కానీ ఆ శక్తి మీ లోపల ఇంకా మిగిలే ఉంటుంది - ఇంకా ఎక్కువగానే మిగిలి ఉంటుంది. ఎందుకంటే అంతకుముందు దాకా అది ఎన్నో విషయాలలో జోక్యం కల్పించుకుంటూనే ఉండేది; ఇప్పుడు ఏ విషయాలతోనూ దానికి ఏ మాత్రమూ ప్రమేయం ఉండడం లేదు. ఉసూరుమని చతికిలబడి సౌఖ్యులు అయిపోయిన తరువాత మీలో భోషాణం అంత శక్తి ఉంటుంది. ఆ శక్తే మీలోంచి ఏ కారణమూ లేకుండానే ఉబికి పొంగి పొర్లిపోతూ ఉంటుంది.

ఓ బోధిసత్వుడు ఎవరంటే ఎవరిలో అది మరీ ఎక్కువగా పొంగుతూ దాన్ని పంచిపెట్టి తీరాల్సిన అవసరం ఉన్న మనిషే. ఎవరి వద్ద మహాఎక్కువగా ఉంటూ ఆ ప్రేమను స్వీకరించేందుకు మీరు సమ్మతిస్తే, ఆ జీవుడు, ఆ ప్రాజ్ఞుడు, కృతజ్ఞుడు అవుతాడు. ఆయన సుగంధాలను విరజిమ్ముతున్న ఓ పుష్పంలాగా ఉంటాడు... ఆ సుగంధం పవనాలలోకి చేరి విడుదల అయిపోవాలని పరితపిస్తూ

ఉంటుంది లేదా ఆ మానవుడు ఓ మహాభారం ఉంటున్న జలధర మేఘంలాగా, దప్పికతో నోళ్ళు చాచుకుని బీటలువారి ఆకర్షిస్తూ తృప్తి చెందడానికి సంసిద్ధంగా ఉన్న ఓ భూక్షేత్రాన్ని వెతుక్కుంటూ ఉంటాడు. ఓ బోధిసత్త్వుడు ఆ విధంగానే ఉంటాడు... ఓ మహాభార జలధర మేఘంలాగా, దప్పికతో తల్లడిల్లుతున్న ఓ ఆత్మ కోసం వెతుక్కుంటూ, తనను స్వాగతించి స్వీకరించేందుకు సంసిద్ధుడు అయివున్న సాధకుడి కోసం, మనిషి కోసం అన్వేషిస్తూ. మీరు కానుకను స్వీకరిస్తే ఆయన కృతజ్ఞుడై ఉంటాడు.

బోధిసత్వత్వం ఓ చైతన్య స్థితే. అది మతి లేకుండా ఉంటుంది. సత్యమే. అది ఒక విషయం కాదు, సత్యమే. సోమేంద్రా – కానీ ఇది సంభవిస్తుంది. ఇది మహా అతార్కికంగా ఉంటుంది. ఇది మహా అతార్కికం. అది కనిపిస్తుంది మతి లేనట్లుగానే. కానీ ఆ అనుభవాన్ని పొందని మీతో అది ఇప్పటికీ సంబంధించి ఉండదు. కానీ శీఘ్రంగానే మీలో ఎందరో ఆ బోధిసత్వ స్థితిని అందుకోబోతున్నారు. మీలో ఎందరో ప్రస్తుతం ఆ స్థితి అంచు మీదే నిలబడి నాకు కనిపిస్తూ ఉంటున్నారు. ఆ స్థితి మీకు కనిపించదు. నాకు కనిపిస్తూ ఉంది ఆ అంచు మీద నిలబడి అంతిమ లంఘనాన్ని చేసేందుకు సంసిద్ధులై ఉంటున్న మీ బోధిసత్వ స్థితి. ఆ దుముకును మీరు దూకేస్తే అప్పుడు అర్థం అవుతుంది మీకు బుద్ధుడు దేన్ని గురించి మాట్లాడుతూ ఉంటున్నాడో.

ఈ వజ్రచ్ఛేదికా సూత్రం బోధింపబడుతున్నది మామూలు లౌకికుల కోసం కాదు. ఈ బోధ జరుగుతూ ఉన్నది సన్యాసులకు మాత్రమే – బోధిసత్వ స్థితిని సమీపిస్తున్నవారికీ, ఆ స్థితిని ఇప్పటికే అందుకుని ఉన్నవాళ్ళకూ. వాస్తవంలో ఈ బోధను జరపాల్సింది ఓ మానవుడు బోధిసత్వ స్థితిని అందుకోబోయేందుకు ముందుగానే. ఎందుకంటే బోధిసత్వ స్థితిని అందుకున్న ఆ క్షణంలో, అప్పుడు ఏం చెయ్యాలో మీకు ఏ విషయమూ తెలిసుండకపోతే, మీ భారాన్ని దించుకునే ఏ మార్గమూ మీ ఎరుకలో ఉండకపోతే – మీ బ్రహానంద పారవశ్యాన్ని విడుదల చేసుకోగలగవచ్చు అన్న విషయం మీకు తెలిసి ఉండకపోతే, ఆ పారవశ్యాన్ని మీలోనే నిలిపి ఉంచుకోనక్కరలేదు అన్న విషయం మీకు తెలిసి ఉండకపోతే – దాన్ని గురించి ఏ విషయమూ మీకు తెలిసి ఉండకపోతే, అది మీకు కష్టంగా, మహాకష్టంగా ఉంటుంది. ఆ ఆనంద పారవశ్యమే మీకు ఛాతీలో నొప్పిగా పరిణమించవచ్చు, మీకు అది గుండెనొప్పిగా తయారవవచ్చు. ఓ నృత్యం లాగా, సంగీతం లాగా ఉండవలసిన ఆ స్థితి మహాబాధాకరంగా రూపుదాల్చవచ్చు.

మీకు తెలుసా, ఆనంద పారవశ్యపు తీవ్రత మరీ ఎక్కువైతే అది మహాబాధాకరంగా పరిణమించగలదని? మిరుమిట్లు గొల్పుతున్న కాంతి ప్రజ్వలనం మరీ ఎక్కువ అయిపోతే, దాదాపుగా మీకు అంధత్వం వచ్చేస్తుంది. మీ ప్రేమ తీవ్రత మరీ ఎక్కువైపోతే మీరు భరించలేరు. మీ ఆనందం మరీ ఎక్కువైపోతే మీ గుండె ఆగిపోవచ్చు. అది మహా బాధాకరంగా పరిణమించవచ్చు. మరి మీకు ఏమీ తెలిసి ఉండదు. బోధిసత్వ స్థితి ప్రాప్తించినప్పుడు ఎంత ఆనందం ఉంటుందంటే, ఆ ఆనంద పారవశ్యపు తీవ్రత ఎంత హెచ్చుగా ఉంటుందంటే, ఆ పారవశ్య సౌఖ్యం ఎంత ఎక్కువగా ఉంటుందంటే, ఎంత ఉధృతంగా ఉంటుందంటే, ఆ ఆనందంతోనే మీరు మరణించగలిగేంత, లేదా మీకు పిచ్చిపట్టిపోయేటంత.

ఈ ప్రపంచంలోని అన్ని సాంప్రదాయాల్లో బోధిసత్వ స్థితిలో మనిషికి పిచ్చిపట్టిపోని ఏకైక సాంప్రదాయం బౌద్ధం మాత్రమే. ఎందువల్ల? సూఫీ సాంప్రదాయపు మనుష్యులకు ఎందరికో పిచ్చిపట్టిపోతూ ఉంటుంది . హైందవంలో ఎంతోమందికి పిచ్చిపట్టిపోతూ ఉంటుంది. సూఫీలలో అటువంటి పిచ్చిపట్టిపోయిన వాళ్ళకు ఓ పేరు కూడా ఉంది. ఆ పిచ్చోళ్ళను 'మస్తాలు' అంటారు. కానీ అటువంటి పిచ్చి బౌద్ధ సాంప్రదాయంలో ఉండదు. ఎందువల్ల? బుద్ధుడు సర్వావకాశాల ఎరుకనూ పొంది ఉంటాడు, ఓ మహావైజ్ఞానిక సాధనా మార్గాన్ని సాంతమూ తీర్చి, ఎన్నో సూచనలను మీకు అందిస్తూ, ఎన్నో దిశలలో మార్గదర్శకత్వాన్ని వహిస్తూ, ఎన్నో జాగ్రత్తలు చెబుతూ, ఎన్నో హితవులను బోధిస్తూ, సంభవింపగల సర్వావకాశాల క్షణాలనూ సమగ్రంగా మీకు స్పష్టం చేస్తూ.

కాలగమన క్రమంలో, ఈ ఇరవైఅయిదువందల సంవత్సరాలలో, ఏ బౌద్ధసన్యాసికీ పిచ్చిపట్టిపోయిన దాఖలాలు లేవు. మహాఅరుదు అది. సూఫీ సన్యాసులు ఎందరికో ఈ పిచ్చిపట్టిపోతూ ఉంటుంది. హైందవంలో ఎందరికో ఈ పిచ్చిపడుతూ ఉంటుంది. ఎందుకంటే బోధిసత్వ స్థితిని పోలిన ఏ స్థితీ ఆ సాంప్రదాయాల్లో లేవు కనుక; ఈ సాంప్రదాయాలలో ఏ సూచనలూ, బోధలూ ఇవ్వబడవు. పాశ్చాత్యంలో ఈ సమస్య మరీ సంక్లిష్టంగా ఉంటోంది. క్రైస్తవానికి దీన్ని గురించి ఏమీ తెలియదు. అందువల్ల క్రైస్తవంలో ఏ విధంగానూ సన్యాసులు కాని సాధారణపు మనుష్యులే సన్యాసులుగా కీర్తింపబడడమూ, నిజమైన సన్యాసులు పిచ్చివాళ్ళుగానో, దెయ్యంపట్టిన వాళ్ళుగానో ప్రకటింపబడడమూ జరిగింది.

ఎన్నో పశ్చిమ ఆశ్రయాల్లో నిజంగా పిచ్చిపట్టని మనుష్యులు, కానీ బోధిసత్వ స్థితి ఏర్పడినందువల్ల ఉన్మాదులైన మనుష్యులు ఎంతోమంది ఉన్నారు. వాళ్ళకు మానసిక వైద్య చికిత్సలు ఏమీ చెయ్యనే అక్కరలేదు, వాళ్ళకు విద్యుద్ఘాతాలను ఇవ్వనే అక్కరలేదు. అపస్మారకం తెప్పించే ఏ మందుల్నీ వాళ్ళకోసం వాడనక్కరలేదు. వాళ్ళను అనవసరంగా ఏ హింసలూ పెట్టనక్కరలేదు. ఏ మానసిక విశ్లేషణలనూ వాళ్ళకు జరపనక్కరలేదు. కరుణావేశపూరితుడైన ఓ బుద్ధుడి ఆవరణలో వాళ్ళను ఉంచితే చాలు. ఓ బుద్ధుని సమక్షం – మొత్తం అదే వాళ్ళకు కావాల్సింది. ఓ బుద్ధుడు వాళ్ళముందు ఉంటే చాలు, వాళ్ళందరూ వెనక్కు వచ్చేస్తారు. ఆ బుద్ధుడే వాళ్ళకు మహా ఆకర్షణ అవుతాడు. ఆ అయస్కాంత క్షేత్రమే వాళ్ళను వెనక్కు లాక్కొస్తుంది, వాళ్ళ చైతన్యంలోకి వాళ్ళు తిరిగొచ్చేస్తారు. కానీ వాళ్ళు ఇప్పుడు చిత్రహింసలకే గురి అవుతున్నారు, అనవసరపు విషయాలలోకి వాళ్ళను బలవంతంగా లాక్కొస్తున్నారు. ఎందుకంటే ఎవరినైనా మీరు పిచ్చివాళ్ళు అని అనుకుంటే వెంటనే ఆ పిచ్చి తగ్గించే చికిత్సలనే ప్రారంభించేస్తారు కనుక.

బౌద్ధం అత్యంత వైజ్ఞానిక ప్రామాణికతతో ఉంటున్న మతం. బౌద్ధంలో మానవ చైతన్యాభివృద్ధికోసం మానవచైతన్యపు సర్వస్థాయిలనూ చిత్రించుకున్న పటాలు ఉన్నాయి. ఓ బోధిసత్వస్థితి అత్యంత ఆవశ్యకం. బుద్ధత్వం ప్రాప్తించేందుకు ముందుగా మానవుడు ఈ బోధిసత్వస్థితిని పొంది తీరాల్సే వస్తుంది. కానీ సోమేంద్రా, ఇది మతిలేని మాటగానే ఉంటుంది. అదే సత్యం.

## రెండవప్రశ్న :

***ప్రియ ఓషో,***

***అన్యుల పట్ల శ్రద్ధ తీసుకోవడం ఇతరుల విషయాల్లో జోక్యం కల్పించుకుని అడ్డుపడడంగా ఎప్పుడు తయారవుతుంది?***

ఏ క్షణంలో ఓ ఆశయం ప్రవేశిస్తుందో, అప్పటినుంచే అది అభ్యంతరకరంగా, అనవసరపు జోక్యంగా, వాళ్ళకు అడ్డుగా తయారైపోతుంది. ప్రేమ చేదు అయిపోతుంది, అప్పుడు అది దాదాపుగా ఓ ద్వేషంగానే తయారైపోతుంది. వాళ్ళకు మీ సంరక్షణే ఓ కారాగారం అయిపోతుంది. ఆశయ ప్రవేశమే ఈ పరిణామానికి వ్యత్యాసం.

ఉదాహరణకోసం, మీరు ఓ తల్లి అయివుంటే బిడ్డ సంరక్షణ బాధ్యతను తీసుకోండి. ఆ బిడ్డడికి మీరు కావాలి. మీరు లేకుండా వాడు బ్రతికి ఉండలేదు. మీరే ఓ విశ్వాసం.

ఆ పిల్లవాడికి తిండి కావాలి. ప్రేమ కావాలి. రక్షణ కావాలి – కానీ మీ ఏ ఆశయాలూ వాడికి అక్కరలేదు. మీ లక్ష్యాలు ఏవీ వాడికి అక్కరలేదు. మీ క్రైస్తవం వాడికి అక్కరలేదు, మీ హైందవమూ, మీ ఇస్లామూ, మీ బౌద్ధమూ వాడికి అక్కరలేదు. మీ ఉల్లేఖనాలు ఏవీ, శ్లోకాలు ఏవీ వాడికి అక్కరలేదు. మీ నమ్మకాలు ఏవీ, విశ్వాసాలు ఏవీ వాడికి అక్కరలేదు. ఏ ఆశయాలూ వాడికి అక్కరలేదు, తను ఎలా ఉండాలి అన్నదానికి. మీరు మీ అన్ని ఆశయాలనూ, లక్ష్యాలనూ, గమ్యాలనూ, అంత్యాలనూ వదిలి పెట్టేసెయ్యండి. అప్పుడు మీ సంరక్షణ సౌందర్యంగా ఉంటుంది. అప్పుడు మీ శ్రద్ధ అమాయకంగా ఉంటుంది. అలా ఉండనప్పుడు మీ సంరక్షణ ఓ జిత్తుగా, కపటంగా ఉంటుంది.

మీ సంరక్షణలో ఏ ఆశయమూ ఉండకపోతే – మీ అబ్బాయిని ఓ క్రైస్తవుడిగా చెయ్యాలనుకోకపోతే, మీ అబ్బాయిని వాణ్ణిగానో, వీణ్ణిగానో చెయ్యాలనుకోకుండా ఉంటే, కమ్యూనిస్టుగానో, ఫాసిస్టుగానో, వర్తకుడిగానో, వైద్యుడిగానో, ఇంజనీరుగానో చెయ్యాలనుకోకుండా ఉంటే... మీ అబ్బాయి ఏమీ కావాలని కోరుకోకండి. మీరు అనుకోండి "నేను ప్రేమిస్తాను. నువ్వు పెద్దయ్యాక, నువ్వే ఎంచుకో – సహజంగా నువ్వు ఏం కావాలనుకుంటావో అదే అవ్వు. నా దీవెనలు నీకు ఉంటాయి... నువ్వు ఏమైనా; ఎలా తయారైనా నా దీవెనలు నీకు ఉంటాయి. నిన్ను నిన్నుగానే స్వాగతిస్తాను, ఆహ్వానిస్తాను. నువ్వు దేశాధ్యక్షుడివి అయితేనే ప్రేమిస్తాను, ఓ వడ్రంగిగా తయారైతే ప్రేమించను, అప్పుడు నిన్ను కన్నందుకు సిగ్గుపడతాను అని కాదు. ఓ యూనివర్సిటీ గోల్డ్‌మెడల్‌ను సాధించుకొచ్చినప్పుడే ప్రేమిస్తాను, పరీక్షలో ఫెయిలై ఇంటికొస్తే నిన్ను ప్రేమించను, నీలాంటి వాడికి తల్లిని అయినందుకు అవమానపడతాను అని కాదు. నువ్వు మంచివాడిగా, నైతికంగా, ఇలా అలా ఉంటేనే ప్రేమిస్తాను, అప్పుడే నువ్వు నా కొడుకు అవుతావు లేకపోతే నీకూ నాకూ ఏ సంబంధమూ ఉండదు, అని కాదు."

ఏ ఊహను మీ ప్రేమలోకి మీరు ప్రవేశపెట్టినా, వెంటనే మీ సంబంధంలోకి విషాన్ని మీరు పట్టుకొచ్చేస్తారు. సంరక్షణ సౌందర్యంతో ఉంటుంది. కానీ ఆ సంరక్షణలోకి ఏ ఊహ అయినా ప్రవేశించిందంటే, అప్పుడు అది ఓ కాపట్యంగా అయిపోతుంది, అప్పుడు అది ఓ బేరంగా తయారైపోతుంది. అప్పుడు అందులోకి నియమాలూ, షరతులూ వచ్చేస్తాయి. మరి మన ప్రేమ అంతా కాపట్యంతోనే ఉంటోంది. అందువల్లే ఈ ప్రపంచంలో ఇంత దైన్యం ఉంటోంది. ఇక్కడ ఓ నరకమే

ఉంటోంది. ఇక్కడ సంరక్షణ ఉండడం లేదు అని కాదు – సంరక్షణ ఉంటోంది, కానీ అది ఎంతో కాపట్యంతో ఉంటోంది. తల్లి సంరక్షిస్తుంది, తండ్రి సంరక్షిస్తాడు, భర్త సంరక్షిస్తాడు, భార్య సంరక్షిస్తుంది. అన్నలూ, అక్కలూ – ప్రతిఒక్కరూ సంరక్షిస్తూనే ఉంటారు. ఎవ్వరూ ఎవ్వరినీ సంరక్షించడం లేదని నేను చెప్పడం లేదు – అందరూ నిజంగా మహాసంరక్షిస్తూనే ఉంటున్నారు. కానీ ఇంకా ఈ ప్రపంచం ఓ నరకంగానే ఉంటోంది.

ఏదో తప్పుగా ఉంటోంది. మౌలికంగా ఏ తప్పో జరుగుతోంది. ఆ జరుగుతున్న మౌలిక తప్పు ఏమిటి? ఆ పొరబాట్లు ఎక్కడ జరుగుతున్నాయి? సంరక్షణలో షరతులు ఉంటున్నాయి : “ఇది చెయ్యి! అది చెయ్యకు!” ఏ షరతులనూ విధించకుండా మీరు ఎప్పుడైనా ప్రేమించారా? ఉన్నది ఉన్నట్లుగా ఎవరినైనా మీరు ప్రేమించారా? మీరు ఎదగాలని అనుకోవడం లేదు. మీరు మారాలని అనుకోవడం లేదు; మీరు ఉన్నది ఉన్నట్లుగా, సంపూర్ణంగా, నిండుగా స్వీకరించండి. అప్పుడు మీకు సంరక్షించడం అంటే, శ్రద్ధవహించడం అంటే ఏమిటో అర్థమవుతుంది. ఆ విధమైన సంరక్షణను సాధించినప్పుడే మీకు సాఫల్యం కలుగుతుంది. మీరు సహాయపడాలనుకుని ప్రయత్నాలు చేస్తున్న ఆ మనిషికి సరిగ్గా అప్పుడే తక్షణం ఆ సహాయం లభిస్తుంది.

మరచిపోకండి. మీ సంరక్షణా వ్యవహారంలో ఏ వ్యాపారమూ ఉండకపోతే, ఏ అభ్యుదయ ఇచ్ఛలూ ఉండకపోతే మీరు సంరక్షిస్తున్న శ్రద్ధవహిస్తున్న మనిషి మిమ్మల్ని శాశ్వతంగా ప్రేమిస్తాడు. కానీ మీ సంరక్షణలో ఏ వాంఛితాల ఊహలో ఉంటే, మీరు సంరక్షిస్తున్న ఆ మనిషి ఎప్పటికీ మిమ్మల్ని క్షమించడు. అందువల్లే ఏ పిల్లలూ తమ తల్లిదండ్రుల్ని క్షమించలేకపోతున్నారు.

మీరు వెళ్ళి మానసిక వైద్యులనూ, మానసిక విశ్లేషకులనూ అడిగి చూడండి - వాళ్ళ దగ్గరికి వస్తున్న రోగులందరిలో అతిసంరక్షణకు గురైన పిల్లలే మీకు ఎక్కువగా కనిపిస్తారు. వాళ్ళ తల్లిదండ్రుల అతిప్రేమలూ, గారాబాలూ వ్యాపారాత్మకంగానే ఉంటాయి. అవి లెక్కలు వేసుకుని జరిపిన వ్యవహారాలు. ఆ ప్రేమలు తమ ఆశలు పిల్లల ద్వారా తీరాలన్న వాంఛితాల ప్రేరితాలుగానే ఉంటాయి. ప్రేమ లభించాలి స్వేచ్ఛా కానుకగా. దానికి ఓ వెల చీటీ ఇంకా తగులుకునే ఉంటే, అప్పుడు అది ప్రేమ కానేకాదు.

## మూడవప్రశ్న:

ప్రియ ఓషో,

ఈ ఆశ్రమంలో మీరు మాంసాహారాన్ని ఎందుకు అనుమతించరు?

స్వామి యోగచిన్మయ ఈ ప్రశ్నను అడుగుతున్నాడు. మాంసం తినాలనే ఓ ఊహ ఆ చిన్మయుడి మనస్సులో ఉండి ఉండే ఉంటుంది. ఆయన ప్రగాఢాంతరంలో ఓ హింసా ప్రవృత్తి ఎక్కడో దాక్కునే ఉండి ఉంటుంది. ఎన్నో వేలమంది ఉంటున్న ఈ ఆశ్రమంలో ఓ శాఖాహారి నుంచి ఈ ప్రశ్న వచ్చి ఉండదు. ఇది ఎంతో అయుక్తంగా కనిపిస్తుంది. కానీ పరిస్థితులు అలాగే ఉంటాయి. శాఖాహారి నిజంగా శాఖాహారిగానే ఉండడు; బలవంతంగా అణచిపెట్టుకుని ఉంటాడు. కోరిక తలెత్తుతూనే ఉంటుంది.

కానీ నేను ఇక్కడ ఈ ఆశ్రమంలో మాంసాహారాన్ని అనుమతించకుండా ఉండడంలో మత ప్రమేయం ఏదీ లేదు. అది కేవలం స్వచ్ఛంగా కళాత్మకంగా ఉండడంకోసం మాత్రమే ఉంటోంది. మాంసాహారాన్ని భుజిస్తూ ఉంటే జ్ఞానోదయం కలగదని అనుకునే మనిషిని కాను నేను. జీసస్‌కు జ్ఞానోదయం కలిగింది. మహమ్మద్‌కు సంప్రజ్ఞత వచ్చింది. రామకృష్ణులవారికి మహాప్రజ్ఞాప్రాప్తి వచ్చింది – దాన్ని గురించిన ఏ సమస్యా లేదు. మాంసాహారం తీసుకుంటున్నా సంప్రజ్ఞత, జ్ఞానోదయం మీకు ప్రాప్తించవచ్చు. కాబట్టి అది ఓ మతం సమస్య కానే కాదు.

అది కళాత్మకంగా ఉండదు అనేదే నా సమస్య. ఎందుకంటే జీసస్ మాంసాహారిగానే ఉండిపోయాడు కాబట్టి, జీసస్‌కు గొప్ప కళాత్మక జ్ఞానం లేదని నాకు అనిపిస్తుంది. ఆయనకు ఓ మతం లేదని కాదు నేను అంటున్నది – ఆయన నిజంగా ఓ మతం మనిషే. బుద్ధుడు ఎంతటి మతవర్తో జీసస్ కూడా అంతటి మతం మనిషే. కానీ ఆయనలో ఏదో లోపించి ఉంటోంది. రామకృష్ణులవారు చేపలను తింటూనే ఉండేవాడు; అంత కళాత్మకంగా ఉండేవాడు కాదు. ఆయన కొంచెం వికారంగా ఉండేవాడు.

అక్కడ సంప్రజ్ఞత ఫణంగా పెట్టబడడం లేదు. కానీ అక్కడ మీ కవిత్వం ఫణంగా పెట్టబడుతోంది, అక్కడ మీ కళాత్మక దృష్టి ఫణంగా పెట్టబడుతోంది. మీ మానవత్వం అక్కడ ఫణంగా పెట్టబడుతోంది. మీ మహామానవత్వం కాదు. అందువల్లే నేను ఈ ఆశ్రమంలో మాంసాహారాన్ని అనుమతించలేకపోతున్నాను – అది అనుమతించబడదు కూడా. కళాపోషణే సమస్య. రసాత్మకతే సమస్య.

దీన్ని అర్థం చేసుకోగలిగితే ఎన్నో విషయాలు మీకు తేటతెల్లం అయిపోతాయి. మధువును ఈ ఆశ్రమంలోకి అనుమతించవచ్చు, కానీ మాంసాహారాన్ని మాత్రం లోపలికి రానీయకూడదు. ఎందుకంటే మధువు శాఖాహారమే కాబట్టి – పళ్ళరసం... పులియపెట్టబడి ఉండవచ్చు, అయినా అది పళ్ళరసం మాత్రమే. అప్పుడప్పుడూ కొంత మధువు పుచ్చుకుంటే గొప్ప కవిత్వం కూడా పుట్టుకురావచ్చు. ఆ సంభావ్యత ఉంది. మధువుకు ఇక్కడ అనుమతి లభించి తీరాలి. కొత్త ఆశ్రమంలో ఓ మధుశాల ఉంటుంది – ఉమర్‌ఖయ్యాం బార్. ఉమర్‌ఖయ్యాం ఓ సూఫీ సన్యాసి. సంప్రజ్ఞత ప్రాప్తించిన ఓ సూఫీయోగి.

కానీ మాంసాహారాన్ని అనుమతించడం కుదరదు. అది అసహ్యంగా ఉంటుంది. తినడం కోసం ఓ జంతువును చంపేయాలన్న ఆలోచన సైతం అసహ్యంగానే ఉంటుంది. అది కళాత్మకంగా ఉండదు. నేను మాంసాహారాన్ని వ్యతిరేకిస్తాను. ఎందుకంటే అక్కడ ఓ జంతువు చంపబడుతుంది కనుక... ఆ జంతువులో ఆవశ్యకమైన ఆత్మ మూలం చావదు కనుక. దాన్ని చంపడానికే వీలులేదు. మరి ఆ జంతువులో ఉన్న అనావశ్యక భాగం మీరు చంపకపోయినా అదే చస్తుంది. కాబట్టి అది అసంగతంగా ఉంటుంది. ఆ విషయాన్ని కాదు నేను ఆలోచించవలసింది. సమస్య జంతువును చంపడమో, జంతువును చంపితే బాగుండదనో కాదు. సమస్య ఏమిటంటే ఆ జంతువును నువ్వు చంపుతున్నావు అన్నదే – నువ్వే. తినడానికి మాత్రమేనా? ఎంతో అందమైన శాఖాహారం లభిస్తూనే ఉన్నా కూడా? మీకు శాఖాహారం లభించకపోతూ ఉంటే, అది వేరే విషయం. కానీ శాఖాహారం లభిస్తూనే ఉంటోంది. మరి ఎందుకు? ఓ శరీరాన్ని ఎందుకు ధ్వంసం చెయ్యాలి? మీరు ఓ జంతువును చంపెయ్యగలుగుతూ ఉంటే, మరి మీరు నరమాంసభక్షకులుగా ఎందుకు ఉండకూడదు? ఇంకో మనిషిని చంపేస్తే తప్పు ఏమిటి? ఓ మనిషి శరీరంలోంచి వచ్చిన మాంసం మనకు మరింత ఎక్కువ శృతితో ఉంటుంది. మనం మనుష్యులను ఎందుకు చంపి తినెయ్యకూడదు? ఇది కూడా ఓ కళాత్మకతత్వపు ప్రశ్నే.

మరి ఆ జంతువులు మన అన్నలూ, చెల్లెళ్ళు అయి ఉంటున్నాయి. ఎందుకంటే ఆ జంతువుల్లోంచే మానవుడు ఆవిర్భవించాడు కనుక. అవి మన కుటుంబమే. ఓ మనిషిని చంపేస్తే అప్పుడు అది ఓ ఎదిగిన జంతువును చంపినట్లు అవుతుంది, లేదా ఓ జంతువును చంపితే అప్పుడు అది ఇంకా ఎదగకుండా ఉన్న జంతువును చంపినట్లే అవుతుంది. అదీ సమానమే. ఓ ఒకటో తరగతిలో

చదువుకుంటూ ఉన్న ఓ చిన్నపిల్లవాణ్ణి చంపేసినా, ఓ యూనివర్సిటీలో విద్యాభ్యాసాన్ని పూర్తిచేసేసిన ఓ యువకుణ్ణి చంపేసినా, ఏ గొప్ప వ్యత్యాసమూ ఉండదు. జంతువులు మానవుడి దిశలో ఎదుగుతూ ఉన్నాయి. ఒకప్పుడు మానవులంతా ఆ జంతువులే. ఇది కేవలం కళాత్మకతను అర్థం చేసుకునే సమస్యే. మీ పెళ్ళాన్నే చంపేసి ఎందుకు తినెయ్యకూడదు? ఆమె ఎంతో అందంగా, తియ్యగా ఉంటోంది.

ఓ నరమాంసభక్షకుడి ఇంటికి ఓ స్నేహితుడు వచ్చాడు. వంట తయారైంది. ఇద్దరూ కూర్చుని తినేశారు. అంతటి రుచికరమైన వంటకాలను ఆ స్నేహితుడు తన జీవితంలో ఎప్పుడూ తినలేదు. ఓ తిండి అంత రుచితో ఉండగలుగుతుందని ఆ స్నేహితుడు తన కలలో కూడా ఊహించలేదు. ఆ వంటకాలు అంత రుచిగా ఉన్నాయి. ఆ స్నేహితుడు అక్కణ్ణుంచి వెళ్ళిపోతున్నప్పుడు ఆ నరమాంసభక్షకుడితో అన్నాడు "ఈ రోజు భలే ఇష్టంగా తిన్నాను. నా జన్మలో నేను ఇంత ఇష్టంతో భోజనం చెయ్యలేదు. నీ వంట అద్భుతంగా ఉంది. ఇంకోసారి మళ్ళీ ఇక్కడికి వచ్చినప్పుడు ఇదే వంట మళ్ళీ చెయ్యి."

అప్పుడు ఆ నరమాంసభక్షకుడు అన్నాడు "మళ్ళీ ఈ వంటే చెయ్యడం కష్టం. ఎందుకంటే నాకు ఒక్క తల్లి మాత్రమే ఉండేది కనుక."

మీరు మీ అమ్మను ఎందుకు తినెయ్యలేరు? మీరు మీ భర్తనూ, మీ అబ్బాయినీ ఎందుకు తినెయ్యలేరు? – వాళ్ళు ఎంతో రుచిగా ఉంటారు! ఈ ప్రశ్న మతానిది కాదు. నేను మళ్ళీ ఇంకోసారి గుర్తుచేద్దాం అనుకుంటున్నాను. ఈ ప్రశ్న కళాత్మకతకు, రసాత్మకతకు సంబంధించిందే. ఓ రసాత్మకత ఉన్న మనిషి జీవితం అందంగానే ఉండాలనే ఆశిస్తాడు, అది మనిషికి అసహ్యంగా, ఓ పీడకలలా ఉండకూడదు.

కానీ ఈ ప్రశ్న చిన్మయుడి మనస్సులో నుంచి వచ్చింది. అందులో ఏదో కనిపిస్తుంది. భారతదేశంలోని శాఖాహారులు నిజంగా శాఖాహారులు కారు. కేవలం ఓ శాఖాహారం తింటున్న కుటుంబంలో జన్మించారు కాబట్టి వాళ్ళకు ఆ శాఖాహారం మాత్రమే విధింపబడింది. మరి అందువల్లే వాళ్ళకు కుతూహలం కలుగుతూ ఉంటుంది. సహజంగానే మాంసాహారాన్ని రుచి చూడాలని వాళ్ళు అనుకుంటూ ఉంటారు. సహజంగా వాళ్ళల్లో ఏర్పడే ఊహే అది. "ప్రపంచమంతా మాంసాహారాన్నే తినేస్తోంది. ఆ మనుష్యులందరూ మస్తుగా జీవితాన్ని అనుభవిస్తున్నారు". ఆ మనిషికి ఏ విధంగానో దాన్నంతా పోగొట్టుకుంటున్నట్లే అనిపిస్తుంది. అందువల్లే ఈ ప్రశ్న బయటికి వచ్చింది.

దీనికి ధ్యానంతో ఏ సంబంధమూ లేదు. మాంసాన్ని తిని మీరు ధ్యానం చేసుకోవచ్చు. మాంసాన్ని తిని మీరు ప్రేమకార్యం చేయవచ్చు. దీనికి ప్రేమతో కూడా ఏ సంబంధమూ లేదు. కానీ మీ గురించిన ఓ విషయాన్నే మీరు బయటపెట్టేసుకుంటూ ఉంటారు – మీరు ఎంతో క్రూరులని, మహా ఆదివాసులుగా ఉన్నారని, సంస్కృతి లేనివాళ్ళని, అనాగరికులని; జీవితం ఎలా ఉండాలో తెలియనివాళ్ళని. రసాత్మకతలోంచే శాఖాహార భోజనతత్వం జన్మించింది, అది మతధోరణితో ఇరుక్కుపోయింది. అది అలా దారితప్పిపోయింది. దాన్ని ఇప్పుడు మతతత్వంలోంచి తొలగించాలి.

నన్ను చూసేందుకు వచ్చి ఎందరో అడుగుతూ ఉంటారు, ఓ జైనుడు అడిగాడు "జీసస్‌కు జ్ఞానోదయం కలిగిందని మీరు ఎలా చెప్పగలుగుతున్నారు? - ఆయన ఓ మాంసాహారి అయి ఉన్నప్పుడు?" అని. ఆ మనిషి అడుగుతున్న ప్రశ్న సంగతమే, ఎందుకంటే మాంసాహారులకు ముక్తి కలగదు అని ఆయన అనుకుంటున్న అభిప్రాయం కనుక. మాంసాహారులు కూడా మోక్షం పొందగలుగుతారు, కవులు కానివారు కూడా కైవల్యాన్ని పొందుతున్నట్లుగానే. అది ఓ ప్రతిబంధకమూ, హద్దూ కానేకాదు. సౌందర్యాన్ని దర్శించలేని వాళ్ళూ, ఓ రోజాపువ్వు అందాన్ని గుర్తించలేని వాళ్ళూ కూడా మహాప్రజ్ఞా ప్రాప్తాన్ని ప్రాప్తించుకోగలుగుతారు... చంద్రుడి అందాన్ని చూడలేనివాళ్ళకు కూడా సంప్రజ్ఞత ప్రాప్తించవచ్చు. కానీ జీసస్‌లో ఏ మోటుతనమో కనిపిస్తుంది. బహుశా ఆయనకు ముక్తి ప్రాప్తించకపోవచ్చేమో? బహుశా ఆయన మాంసాహారులందరి మధ్యే జీవిస్తూ ఉండేవాడేమో? ఆయనకు ఓ శాఖాహారిగా ఉండేందుకు వీలు ఉండేది కాకపోవచ్చు. దాదాపుగా అది ఆయనకు అసాధ్యమే అయి ఉండవచ్చు. అయినా ఆ కష్టాన్ని ఆయన పడే తీరాల్సి ఉండవచ్చు.

కానీ మరచిపోకండి, ఈ ఆశ్రమంలో నా వ్యవహారం పద్ధతి మహాకట్టుబాటు వ్యవహారంగానే ఉంటుంది. ధ్యానం ఇక్కడ అవసరం, కవిత్వం కూడా ఇక్కడ అంతే. రసాత్మకత కూడా ఇక్కడ ఆవశ్యకమే. మతం కూడా ఇక్కడ అవసరమే. సంగీతం కూడా అవసరమే. కళ కూడా అవసరమే. మానవుడు సంఘటితంగా ఎన్నో పరిధుల్లో పురోగమించాలి. ఆ తరువాత పరమపుష్పీకరణ జరుగుతుంది, మీ అన్ని పూరేకులూ విచ్చుకున్నప్పుడు. మరి అప్పుడు మహాజీవితానందమూ, మహాఆశీర్వాదమూ ప్రాప్తిస్తుంది.

సెయింట్ ఫ్రాన్సిస్ జీసస్ కన్నా మరెంతో రసాత్మకంగా ఉండేవాడు. సహజంగానే సెయింట్ ఫ్రాన్సిస్ గురించి ఎన్నో కథలు వినిపించాయి – పక్షులు

వచ్చి ఆయన భుజాల మీద కూర్చుంటూ ఉండేవనీ, ఆయన్ని చూడడానికి చేపలు నీళ్ళలోంచి పైకి ఎగురుతూ ఉండేవనీ, జంతుప్రపంచంతో ఆయనకు అత్యంత ఆత్మీయ ఆప్యాయత ఉండేదనీ. ఆయన వృక్షాలతో, మొక్కలతో మాట్లాడుతూ వాటిని "చెల్లెళ్ళూ" అనీ, పక్షులనూ, సూర్యచంద్రులనూ సంబోధిస్తూ మాట్లాడుతూ ఉండేవాడని. అటువంటి కథలు ఏవీ జీసస్ దగ్గర కనిపించవు, మహమ్మద్ వద్ద కనిపించవు. అటువంటివి వాళ్ళ వద్ద జరగనే జరగలేవు.

అయినా అప్పటికీ వాళ్ళందరూ జ్ఞానోదయాన్ని పొందిన మనుష్యులేనని నేను అంటాను. కానీ వాళ్ళ సంప్రజ్ఞతలో ఏదో కొంత న్యూనత్వం ఉంది, లోపం ఒకటి ఉంది – కళాత్మక రసానుభూతి. వాళ్ళు దాన్ని కూడా ఎందుకు ప్రాప్తించుకుని ఉండకూడదు? మీ ఉనికి సర్వస్వంలో ఆ సంప్రజ్ఞత బహుముఖ పరిధుల్లో ఎందుకు ప్రాప్తించి ఉండకూడదు?

## నాలుగవప్రశ్న :

*ప్రియ ఓషో,*

*మిమ్మల్ని శరణుజొచ్చడంలో పరమార్థం ఏమిటి?*

సవితా, ఏది నీ దగ్గర నిజంగా లేదో, ఏది నీకు ఉందని నువ్వు అనుకుంటూ ఉంటావో, దాన్నే నువ్వు నాకు సమర్పించుకోవాల్సి ఉంటుంది. నిజంగా నీకు 'అహంకారం' అన్నది లేదు, 'నేను' అన్నది లేదు, 'ఆత్మ' అన్నది లేదు. నిజంగా నీకు అది లేదు. ఉనికితో ఏ విధంగానో అన్యంగా ప్రత్యేకంగా నువ్వు ఉన్నావు అన్న భ్రమ నీకు ఉంటోంది. నిజంగా నీకు ఉనికితో ఓ అన్యత్వత లేదు. ఓ క్షణాంతర సమయంలో కూడా ఉనికితో నువ్వు అన్యంగా ఎప్పుడూ లేవు. నువ్వు ఓ ద్వీపంలాగా అన్యంగా ఎప్పటికీ ఉండలేవు. నువ్వు సర్వస్వంలో ఓ అంశానివి మాత్రమే. సర్వస్వమూ నీలోంచి ఎప్పుడూ ప్రకటితం అవుతూ ఉంటుంది. సర్వస్వపు శక్తి అనవరతంగా నీ మీద ప్రసరిస్తూనే ఉంటుంది, కానీ నీకు మాత్రం ప్రత్యేకంగా ఉన్నాను అన్న ఊహ మిగిలి ఉంటుంది.

ఆ 'నేను'నే నువ్వు నాకు అర్పించుకోవాల్సి ఉంటుంది. మరి నీకు అది నిజంగా స్వంతమై ఉండదు. కాబట్టి యదార్థంగా నువ్వు సమర్పించుకునేది ఏదీ ఉండదు. నువ్వు నాకు ఓ భ్రమనే సమర్పించుకుంటావు. అదే మాటను నన్ను మళ్ళీ

చెప్పనీ : ఏది నీ వద్ద లేదో, దాన్నే నేను తీసేసుకోవాలనీ, ఏది నీ వద్ద ఉందో, దాన్ని నీకు తిరిగి ఇచ్చెయ్యాలి అనుకుంటాను. నేను నీ సత్యతను నీకు తిరిగి ఇచ్చేస్తాను. దాన్ని గురించి నువ్వు మరచిపోయి ఉన్నావు. నేను నీ అసత్యతనే నీ దగ్గర్నుంచి తీసేసుకోవాలని అనుకుంటాను.

మరచిపోవద్దు. నీ అహాన్ని నాకు అర్పించినప్పుడు, నీకు పోయేది ఏదీ ఉండదు. నువ్వు పొందుతావు, నువ్వు నీ సత్యతను పొందుతావు. నువ్వు నిద్రపోతూ స్వప్నాలను కంటూ ఉంటే, నేను వచ్చి నీకు మెలకువ తెప్పించేసినట్లే ఉంటుంది ఇది. కానీ నువ్వు దేన్నయినా పోగొట్టుకుని ఉంటావా? ముందుగా ఆ స్వప్నమే నిజంగా నీలో ఉండదు, అది సత్యం కాదు. అది ఓ స్వప్నం, అది ఓ కల మాత్రమే. మరి నువ్వు ఇప్పుడు నీ కళ్ళను తెరచుకుంటావు, అప్పుడు తెల్లారిపోయి ఉంటుంది. సూర్యుడు అప్పుడు ఉదయిస్తూ ఉంటాడు. పక్షులన్నీ పాడుతూ ఉంటాయి. వృక్షాలన్నీ ఆనందంగా ఊగుతూ ఉంటాయి, ఆ నవోదయాన.

ఏది ఉందో దాన్ని నీకు ఇస్తూ, ఏది లేదో దాన్ని నేను తీసేసుకుంటూ ఉంటాను. నేను నిన్ను నిద్ర నుండి లేపేస్తాను. నీకు పోయేది ఏమీ ఉండదు. మరి మరచిపోవద్దు, నువ్వు శరణుజొచ్చినందువల్ల నాకు వచ్చేది ఏమీ ఉండదు. కాబట్టి నువ్వు పిసినారిగా ఉండకు. నీ దగ్గర నుంచి నాకు వచ్చేది ఏమీ ఉండదు - నాకు ఏమీ వచ్చెయ్యదు. నేను మెలకువ తెప్పించగానే, నీ స్వప్నం అదృశ్యం అయిపోతుంది కానీ ఆ నీ స్వప్నం నాకు వచ్చెయ్యదు. నీ కలలు నాకు వచ్చేటట్లు ఉంటే ముందుగా నీ అహంకారాన్ని నాకు సమర్పించమని నేను నిన్ను అడగనే అడిగి ఉండను. అదే జరిగితే నేను దాదాపుగా పచ్చడి అయిపోతాను, చచ్చి ఊరుకుంటాను.

విసుగుపుట్టించే ఓ మనిషి తన స్నేహితుడి దగ్గరికి వచ్చాడు. ఆ మనిషిని చూడగానే గతానుభవాలన్నీ గుర్తొచ్చి ఈ స్నేహితుడికి కంపరం పుట్టుకొచ్చింది. ఆ మనిషి  గంటలు గంటలు విసుగు పుట్టిస్తూ, మాట్లాడుతూ, వాగుతూనే ఉన్నాడు. చివరికి అక్కణ్ణుంచి వెళ్ళిపోతూ స్నేహితుడితో "ఇది ఏదో వింతగానే ఉంది. ఇక్కడికి వచ్చినప్పుడు నాకు తలనొప్పిగా ఉంది. ఇక్కడికి వచ్చాక ఇప్పుడు అది మాయమైపోయింది" అన్నాడు.

ఆ మనిషితో అప్పటిదాకా వేగిన ఈ బాధితుడు అన్నాడు వెంటనే "నువ్వు దాని గురించి ఏం బెంగపెట్టుకోకు - అది ఇప్పుడు నాకు వచ్చేసి ఉంది. అది ఎక్కడికీ పోలేదు."

నువ్వు నీ అహంకారాన్ని నాకు సమర్పించుకుంటే, అది నాకు వచ్చెయ్యదు. నువ్వు నీ తలనొప్పిని నాకు అర్పించేస్తే, నీ తలనొప్పి నాకు వచ్చెయ్యదు. అందువల్ల నాకు వచ్చేది ఏమీ ఉండదు, కాబట్టి నువ్వు లోభిగా ఉండకు. అందరూ తమ అహంకారాలను నాకు సమర్పించేసుకుంటూ ఉంటున్నారు కాబట్టి నేను ఏ గొప్ప నిధులనో పోగు చేసేసుకుంటున్నానని తలపోయకు. నాకు వచ్చేది ఏదీ ఉండదు. నీకే సత్యం వస్తుంది. నీ ప్రామాణికతే నీకు తిరిగి వచ్చేస్తుంది.

### ఐదవప్రశ్న:

*ప్రియ ఓషో,*

*బుద్ధుడి గురించీ, సారిపుత్రుడి గురించీ, సుభూతి గురించీ, ఆనందుడి గురించీ, మహాకాశ్యపుడి గురించీ మీరు మాట్లాడుతూ ఉంటున్నప్పుడు, మీరు అప్పుడు నిజంగా ఆ బుద్ధుడు జీవిస్తూ ఉన్నప్పుడు అక్కడ ఉండేవారనీ, ఆయన మాటలను గ్రహిస్తూ ఉండేవారనీ, ఆయనను ఆరాధిస్తూ ఉండేవారనీ నాకు ఎంతో బలీయంగా అనిపిస్తూ ఉంటుంది. అదంతా ఆయన చైతన్యాన్ని మీరు స్వీకరించినందువల్ల కాక, సాక్షాద్ అనుభవంతో సజీవంగా ఉంటున్న ఆ బుద్ధుణ్ణి గ్రహించినందువల్లేనని నాకు అనిపిస్తూ ఉంది. ఇది సత్యమేనా?*

ఔను, ప్రమోద్. కానీ దీన్ని ఎవరికీ చెప్పకు. నీలోనే రహస్యంగా దాచుకో. దీన్ని గురించి మళ్ళీ ఎప్పుడూ అడగకు.

### ఆరవప్రశ్న:

*ప్రియ ఓషో,*

*మీకు ఏమనిపిస్తోంది ఓషో, మీరు అంటున్న ఏ అత్యల్ప ఊహో నాలో ఉంటోందా, లేదా ఏ అత్యల్ప ఊహనో ఉంచుకోవడం కూడా తప్పేనా?*

ఔను సుభూతీ.

### ఏడవప్రశ్న:

*ప్రియ ఓషో,*

*బుద్ధుడు అంటాడు మనం ఇప్పుడు ఉండడం అంతా మన గత ఆలోచనల ఫలితంగా మాత్రమేనని, మన ప్రస్తుతపు ఉనికి గత ఆలోచనల మీదే ఆధారపడి*

**ఉందని, గత ఆలోచనలతోనే తయారై వుందని. ఓ మనిషి సదాలోచనలనే చేస్తూ సత్‌భాషణలనే చేస్తూ ఉంటే ఆ మనిషిని సంతోషం నీడలా అనుసరిస్తుందని. దీన్ని అమనస్కానికి అన్వయించుకోవడం ఎలా సాధ్యం అవుతుంది? ఆలోచనలను పవిత్రంగా ఉంచుకుంటూ, అదుపులో ఉంచుకోవచ్చు కానీ అమనస్కం ఆలోచనల అదుపుకు వ్యతిరేకంగానే కనిపిస్తూ ఉంటుంది కదా?**

మొదటి విషయం. మూడు రకాల మనస్సులు ఉండగలగడం సాధ్యం. మొదటిది : హింసాత్మకమైన మనస్సు. అది విధ్వంసం మార్గంలోనే జీవిస్తూ ఉంటుంది. ఆ మనస్సుకు దేన్నో నాశనం చేయాలనే ఉంటుంది. దానికి మనుష్యులకు చిత్రహింసలను సృష్టిస్తూ ఆనందించే స్వభావం ఉంటుంది, అటువంటి మనస్సును దైన్యమే నీడలా అనుసరిస్తుందని బుద్ధుడు అంటాడు. ఎవరికో దైన్యాన్ని సృష్టించాలని మీరు సంకల్పిస్తూ ఉంటే చివరికి మీ కోసమే ఓ దైన్యాన్ని సృష్టించేసుకుంటారు. మీరు ఉనికి పట్ల వైరుధ్యంతో ఉంటే, ఉనికి కూడా మీ పట్ల వైరుధ్యంతోనే ఉంటుంది – ఎందుకంటే మీకు ఉనికి ఓ దర్పణమే కాబట్టి; అది మిమ్మల్నే ప్రతిబింబిస్తూ ఉంటుంది, ప్రతిధ్వనిస్తూ ఉంటుంది.

మీరు తిడితే, మీకు తిట్లే తిరిగి వస్తాయి.. ఓ మంచి పాటను మీరు పాడితే, ఆ మంచి పాటే వెనక్కు తిరిగొచ్చి మీ మీద కురుస్తుంది. మీరు ఏది ఇస్తూ ఉంటారో అదే మీకు వెయ్యిరెట్లు తిరిగి వస్తుంది. మీరు ఏ విత్తుల్ని నాటుతారో, మీరు ఆ పంటే వెయ్యిరెట్లుగా నూరుస్తారు. కాబట్టి దైన్యమే ఓ హింసాత్మక మానసాన్ని అనుసరిస్తుంది. ఓ నరకమే దుష్టమానసాన్ని అనుసరించి వస్తుంది. దుష్టమానసం హింసనే ఆనందిస్తుంది, నాశనాన్నే సంకల్పిస్తుంది, హత్యలనే వాంఛిస్తూ ఉంటుంది. తామర్లేనూ, జెంఘిస్‌ఖానూ, అడాల్ఫ్ హిట్లరూ, జోసెఫ్ స్టాలిన్ – ఇవన్నీ దుష్టమానసాలు.

ఆ తరువాతది పవిత్ర మానసం – ఇది దుష్టమానసానికి వ్యతిరేకంగా ఉంటుంది. ఇది దానికి పూర్తిగా విరుద్ధంగానే ఉంటుంది. ఇది సృజనాత్మకంగా ఉంటుంది. సంతోషంగా ఉంటున్న మనుష్యుల్ని చూస్తూ ఇది సంతోషపడుతూ ఉంటుంది. ఇది సహాయపడుతుంది, సేవిస్తుంది. అందరికీ సంతోషాన్ని ప్రసాదిస్తూ ఉంటుంది. మనుష్యులు సంతోషంగా ఉంటే చూస్తూ ఇది సంతోషిస్తుంది. ఈ మనస్సును సంతోషమే నీడలా అనుసరించి వస్తుంది – ఈ పవిత్ర మానసాన్ని.

కానీ ఇందులో మీ ఎరుకలో లేని మరో విషయం కూడా ఉంది. అక్కడ ఓ సంతోషం ఉంటే, సరిగ్గా దానికి ఆవలే ఎక్కడో దుఃఖం కూడా ఉంటుంది. ఓ

దుఃఖం మనస్సులో ఉంటే సరిగ్గా దానికి ఆవలి హద్దుల్లో ఎక్కడో ఓ ఆనందం కూడా ఉంటుంది. ఆ రెండూ కలిసే ఉంటాయి. దుష్టచింతన చేసే మానసాన్ని దైన్యమే, నరకమే అనుసరిస్తుంది, కానీ, ఎక్కడో ఆ నరకాన్ని అనుసరిస్తూ ఓ స్వర్గం కూడా ఉంటుంది. సంతోషమే ఓ పవిత్రమైన మానసాన్ని అనుసరిస్తుంది, కానీ ఆ సంతోషాన్ని అనుసరిస్తూ ఓ దుఃఖం కూడా ఉంటుంది. ఎందుకంటే ఈ రెండూ విడివిడిగా ఉండలేవు కనుక. అవి రెండు సంభవాలు కావు.

మీరు సంతోషంగా ఎలా ఉండగలుగుతారు మీకు ఓ దుఃఖం కూడా ఉండకపోతే? దుఃఖాన్ని మరచిపోయిన మీరు సంతోషాన్ని కూడా మరచిపోగలుగుతారు. మీకు రుగ్మత అంటే ఏమిటో, జబ్బు అంటే ఏమిటో తెలియకుండా ఉంటే, మీరు ఆరోగ్యస్థితిని, స్వస్థతాస్థితిని కూడా అనుభూతితో తెలుసుకోలేరు. అది అసంభవం. మీరు స్వస్థులుగా ఉన్నారు అన్న ఎరుకతోనే ఉండడంకోసం అప్పుడప్పుడూ జబ్బులుపడుతూ ఉండడం కూడా తప్పదు.

మీరు ఓ తెల్లసుద్దముక్కతో తెల్లగోడ మీద వ్రాయలేరు. నిజంగా వ్రాయలేరని కాదు, మీరు వ్రాయవచ్చు, కానీ మీరు ఏం వ్రాశారో ఎవరికీ చదివేందుకు కుదరదు, మీకు కూడా. మీరు ఓ తెల్లసుద్దముక్కతో వ్రాయాలంటే ఓ నల్లబల్ల ఉండితీరాలి. ఆ నల్లబల్లే ఓ నేపథ్యంగా పనిచేస్తుంది. తెల్లసుద్దముక్కతో వ్రాసిన గీతలే ఓ బొమ్మ అవుతుంది. జీవితం కూడా ఇలాగే ఉంటోంది. మీ సంతోషం తెల్లసుద్దముక్కలాగా ఉంటోంది. దానికి ఓ నల్లటి నేపథ్యం ఉండితీరాలి. ఓ పవిత్రుడు సంతోషంగానే జీవిస్తూ ఉంటాడు. కానీ ఆ మనిషి సంతోషం ఓ బొమ్మలాగా ఉంటూ ఆ నల్లటి నేపథ్యంగా దుఃఖం ఉంటుంది. దుఃఖం ఉండకపోతే ఆ మనిషికి సంతోషం అంటే ఏమిటో తెలుసుకోగలగడం సాధ్యపడదు. వ్యత్యాసపు నేపథ్యం ఉండకపోతే తెలుసుకునేందుకు ఏ మార్గమూ ఉండదు.

కాబట్టి చివరిగా పవిత్రమైన మనస్సూ, దుష్ట మనస్సూ అనేవి రెండు మనస్సులు కావు. ఆ రెండూ ఒకే నాణానికి ఉన్న రెండు పార్శ్వాలు. సన్యాసీ, పాపీ కలిసే ఉంటారు. ఓ సన్యాసి ఏ క్షణంలోనైనా పాపిగా మారిపోవచ్చు, ఓ పాపి సన్యాసిగా ఏ క్షణంలోనైనా పరివర్తితుడు అయిపోవచ్చు. వాళ్ళు దూరంగా ఉండరు. వాళ్ళు దూరంగా ఉన్న పొరుగువాళ్ళు అయి ఉండరు. వాళ్ళిద్దరూ అతిసామీప్యంలోనే సహవాసం చేస్తూ ఉంటారు, వాళ్ళు మహా ఆత్మీయంగా ఉంటారు. వాళ్ళ హద్దులు ఒకటిలో మరొకటి కలిసిపోయి విలీనం అయిపోయే ఉంటాయి.

మూడవ మనస్సు అమనస్కం – అది సన్యాసీ కాదు, పాపి కూడా కాదు; అది సంతోషమూ కాదు, దుఃఖం కూడా కాదు. వాటి ద్వంద్వాలు కూలిపోయి ఉంటాయి. అప్పుడు అక్కడ నిశ్శబ్దం, పవిత్రత ఉంటుంది. అప్పుడు అక్కడ శాంతి ఉంటుంది. అక్కడ అన్ని కల్లోలాలూ అంతం అయిపోయి ఉంటాయి. గుర్తుంచుకోండి. సంతోషం కూడా ఓ కల్లోలమే. సంతోషం కూడా ఓ విధమైన జ్వరమే. అది మీకు ఇష్టంగా ఉంటుంది, అది ఓ విషయం, కానీ అది కూడా ఓ జ్వరమే, అది జ్వరం వచ్చినట్లే ఉంటుంది. మీరు ఎప్పుడూ దాన్ని గమనించలేదా? మీరు సంతోషంగా ఉన్నప్పుడు, కాసేపటికి మీరు అలసిపోతూ ఉంటారు. అప్పుడప్పుడూ ఆ సంతోషం కలుగుతూ ఉంటే బాగానే ఉంటుంది. కానీ అదేపనిగా ఎప్పుడూ ఆ సంతోషమే ఉంటూ ఉంటే, మీరు సంతోషంగా ఉండలేరు. మీకు త్వరలోనే విసుగు వచ్చేస్తుంది. మీకు దాంతో మొహం మొత్తిపోతుంది. అది మీకు అలుపు తెప్పిస్తూ ఉంటుంది.

మీరు ఎక్కువ సంతోషంగా ఉంటే మీకు రాత్రిపూట నిద్రపట్టదు. అదేవిధంగా మీరు మహాదుఃఖంతో ఉన్నా మీకు రాత్రిపూట నిద్రపట్టదు. మీరు సౌఖ్యులు కాలేకపోతారు. మీ సంతోషమే ఓ ఉద్విగ్నత అయిపోతుంది. ఆ రెండూ మీకు విసుగునే తెప్పిస్తాయి. మీరు దుఃఖం వల్ల అలసిపోతూ ఉంటే, మీరు అప్పుడు సంతోషం వైపుకు చరిస్తూ ఉంటారు. ఆ విధంగానే జీవితపు లోలకం కదులుతూ ఉంటుంది, ఊగుతూ ఉంటుంది. ఓ చివర నుండి మరో చివరకు. అమనస్కం ఎంతో విభిన్న విషయంగా ఉంటుంది. దానితో మనస్సుకు ఏ సంబంధమూ ఉండదు – సంతోషంగా ఉన్నా, దుఃఖంగా ఉన్నా; పవిత్రంగా ఉన్నా, పాపాత్మకంగా ఉన్నా.

మీకు గుర్తొస్తోందా? బోధిధర్ముడు చైనాకు వెళ్ళినప్పుడు చక్రవర్తి ఊ ఆయన్ని కొన్ని ప్రశ్నలు అడిగాడు. అందులో ఓ ప్రశ్న ఏమిటంటే “నేను ఎన్నో మఠాలను కట్టించాను, ఎన్నో బౌద్ధాలయాలను నిర్మింపజేశాను. బౌద్ధసందేశ ప్రచారం కోసం ధనభాండాగారాలను విస్తృతంగా వాడాను. ఇవి పవిత్రకార్యాలని మీకు అనిపిస్తోందా?” అని.

అప్పుడు బోధిధర్ముడు పెద్దగా నవ్వి “అందులో పవిత్రత ఏముంది? అది ఓ వ్యాపారంలాగే ఉంటోంది. పరలోకం గురించి మీరు ప్రణాళికలను తయారు

చేసుకుంటూ ఉన్నారు, మీరు స్వర్గాన్ని ఆశిస్తూ ఇది చేస్తున్నారు. ఇందులో ఏ పవిత్రతా లేదు, తక్కినవాటిలాగా ఇది కూడా అపవిత్రకార్యంగానే ఉంటోంది" అన్నాడు.

బోధిధర్ముడి మాటలకు అర్థం ఏమిటి? ఆయన పవిత్ర కార్యాలని మీరు చెప్పుకుంటున్న అన్నిటినీ అనుసరిస్తూ అపవిత్ర విషయాలే చోటుచేసుకుంటాయని అంటున్నాడు. ఎందుకంటే ప్రగాఢపు లోతుల్లో కోరికలే అపవిత్రాలు కాబట్టి.

ఆ చక్రవర్తి ఎంతో ఇబ్బంది పడిపోయాడు. ఆ ఘాతాన్ని భరించలేక పోయాడు. ఆయనకు కోపం వచ్చేసింది. ఆయన అన్నాడు "అయితే మీరు అనుకుంటున్నది ఏమిటి? – బుద్ధుడు పవిత్రుడు కాడా?"

మళ్ళీ బోధిధర్ముడు నవ్వుతూ "ఆయన పవిత్రుడూ కాడు, స్వరూపధారి కూడా కాడు. ఆయన మహాశూన్యంగా ఉంటున్నాడు. ఓ పవిత్రత ఆయనలో ఎలా ఉండగలుగుతుంది? ఆ పవిత్రత కూడా ఆయనకు ఓ మలినంలాంటిది మాత్రమే. ఆయన పరిపూర్ణ నిశ్శబ్దంగా ఉంటాడు. ఆయనే శూన్యత."

అమనస్స్థితి పవిత్రంగానూ ఉండదు, అపవిత్రంగానూ ఉండదు. బుద్ధుడు పవిత్రుడూ కాడు, పాపి కూడా కాడు. ఆయన ద్వంద్వాలకు అతీతుడై ఉంటాడు. బుద్ధుడే ఓ అతీతత్వం.

కాబట్టి దయచేసి గుర్తుంచుకోండి, ఓ దుష్టమానసం నుండి మీరు ఓ పవిత్రమానసం కావచ్చు కానీ అప్పుడు అక్కడ నిజంగా ఏ పరివర్తనమూ ఉండదు. అప్పుడు అందులో కొన్ని డిగ్రీల తారతమ్యం మాత్రం ఉంటుంది. అప్పుడు అక్కడ కొన్ని డిగ్రీల తేడా సమస్య మాత్రం ఉంటుంది. మనస్సుకు అతీతంగా మీరు ఇప్పటికీ పోనే లేదు. ఓ అమనస్కం మాత్రమే మిమ్మల్ని ముక్తుల్ని చేస్తుంది.

కాబట్టి మీరు పవిత్రులు అయిపోయేందుకు ప్రయత్నించకండి. పవిత్రులే పరమ అపవిత్రులుగా ఉంటారు. పరమహంసలు అయిపోయేందుకు ప్రయత్నించకండి ఎందుకంటే ఆ ప్రయత్నమంతా ఓ అహంకారపు యాత్రగానే తయారవుతుంది కాబట్టి – అది మనస్సు ఓ కొత్త ఆటను ఆడుకోవడంగా మాత్రం ఉంటుంది కాబట్టి, అది ఓ అత్యల్ప క్రీడ మాత్రమే. 'పవిత్రంగా ఉండాలి, అపవిత్రుణ్ణై ఉండకూడదు' అన్న మతిలేని పనులన్నీ మానెయ్యండి. సన్యాసిగానూ మరి పాపిగానూ ఉండకండి, రెండింటికీ వీడ్కోలు చెప్పెయ్యండి. చీకటికీ మరి వెలుగుకూ, రెండింటికీ వీడ్కోలు చెప్పెయ్యండి. స్వర్గానికి మరి నరకానికి, రెండింటికీ వీడ్కోలు చెప్పెయ్యండి.

అప్పుడు మీరు ఏనాడూ ఊహించలేని ఓ నవ్యప్రపంచం ఆవిర్భవిస్తుంది. అప్పుడు అక్కడ అతి పవిత్రత ఉంటుంది. అప్పుడు అక్కడ పరమశాంతి ఉంటుంది. అప్పుడు అక్కడ ఏ కల్లోలాలూ ఉండవు. అప్పుడు అక్కడ పిల్లతరంగాలు కూడా పుట్టవు. ఆ స్థితిలోనే బుద్ధత్వస్థితి ఉంటుంది. అప్పుడు బాధా ఉండదు, సౌఖ్యమూ ఉండదు. ఎందుకంటే బాధ కంటే అన్యంగా సౌఖ్యమూ, సౌఖ్యం కన్నా అన్యంగా బాధా ఉండదు కనుక.

అయితే అప్పుడు అక్కడ ఏముంటుంది? బుద్ధుడు దీన్ని గురించి మహా నిశ్శబ్దంగానే ఉంటాడు, దాన్ని గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు కనుక, ఎందుకంటే ఏం చెప్పినా అది అప్పుడు ద్వంద్వత్వంలో ఓ అంశంగానే ఉండితీరుతుంది కనుక. అది 'ఆనంద పారవశ్యంగా' ఉంటుంది అంటే అది 'దైన్యస్థితిలాగా ఉండదు' అని మీరు అనుకుంటారు కనుక. 'అది వెలుతురుగా ఉంటుంది' అంటే 'అది చీకటిగా లేదు' అని మీరు అనుకుంటారు కాబట్టి. 'అది ఓ గ్రీష్మంలాగా ఉంటుంది' అంటే 'అది హేమంత ఋతువులాగా ఉండదు' అని మీరు అనుకుంటారు కనుక. 'అది ఒక పుష్పంలాగా ఉంటుంది' అంటే, 'అది ఓ ముల్లులాగా ఉండదు' అని మీకు అనిపిస్తూ ఉంటుంది కాబట్టి. ఏం చెప్పినా కానీ మీరు ద్వంద్వాలలోనే ఆలోచనలు చేస్తూ ఉంటారు.

బుద్ధుడు దీన్ని గురించి పూర్తిగా మౌనాన్నే వహిస్తాడు. ఎందుకంటే నిశ్శబ్దంతో మాత్రమే దాన్ని వ్యక్తీకరించగలగడం సాధ్యపడుతుంది కనుక. అదే నిశ్శబ్దం. నిశ్శబ్దాన్ని శబ్దాలతో ఎలా వ్యక్తీకరించగలుగుతారు?

## ఎనిమిదవ ప్రశ్న :

ప్రియ ఓషో,

కొన్నేళ్ళ క్రితం యోగాభ్యాసాలతో, ధ్యానాలతో ప్రార్థన ఔన్నత్య శిఖరాలను నేను అందుకోగలిగాను. నా జీవ ఉనికి సర్వస్వంలో ఆ ఆనందపారవశ్యాన్ని అనుభవించగలిగాను - సర్వస్వం అప్పుడు దివ్యంగా, ప్రేమభరితంగా, కృతజ్ఞతాత్మకంగా ఉండేది. ఏ కారణం వల్లో అందులో నుంచి నేను బయటికి వచ్చేశాను. ప్రస్తుతం నేను మళ్ళీ ఓ గాడాంధకారపు లోయలోనే ఉంటున్నాను. ఎక్కడో విషయాలు తప్పుదారి పట్టాయి. దోషిత్వభావంతో ఉంటున్నాను. మళ్ళీ నిలబడడం కూడా శ్రమపూరితంగానే ఉంటోంది. దయచేసి ఏమైనా చెప్పండి.

మీ నిశ్శబ్దానికీ, మీ ఆనందపారవశ్యానికీ ఏదో కారణమై ఉంటే, అది తప్పకుండా మాయం అయ్యే తీరుతుంది. సకారణంగా సంభవించేది ఏదీ శాశ్వతం కాదు. మీరు యోగాసనాల ద్వారా, ధ్యానాల ద్వారా వాటిని పొందారు, కానీ అవి సహజ సంభవాలు కావు. అవి కృత్రిమంగా సృష్టింపబడ్డవే. అవి తాత్కాలికాలుగా ఉంటాయి. అవి తాత్కాలికాలుగా ఉందుకు ఉంటాయి అంటే ఆ అనుభూతులను మీరు రసాయనాలతో సైతం పొందవచ్చు కనుక. కానీ అలా రసాయనాల వినిమయంతో తెచ్చుకునే అనుభవాలు రసాయనాల ప్రభావం పోగానే అతరించిపోతాయి కనుక.

మీరు కొంత పరిమాణంలో LSDని తీసుకున్నాక మరి అప్పుడు మీరు ఆనంద పారవశ్యంలో దారితప్పిపోయి ఉంటారు, అప్పుడు సర్వస్వమూ ఆ సామరస్యంతోనే ఉన్నట్లు, అంతా ఆనందమే ఉన్నట్లు, జీవితం ఇంకా సుందరంగా ఉన్నట్లు, ఇంకా వైభవంగా ఉన్నట్లు, వృక్షాలు మరింత పచ్చగా ఉన్నట్లు, రోజా పువ్వులు మరింత ఎర్రగా ఉన్నట్లు, ప్రతి ముఖమూ వెలిగిపోతున్నట్లు కనిపిస్తుంది. జీవితం వెలుగుల్ని చిమ్ముతూ, రంగులు మారిపోతూ ఉంటుంది. కానీ కాస్సేపటికి ఆ LSD శక్తి క్షీణించిపోతుంది. మళ్ళీ ఆ మరునాటి ఉదయం ప్రపంచం ఎప్పుడూ ఎలా ఉందో అలాగే కనిపిస్తూ ఉంటుంది. వృక్షాలు వృక్షాలుగానే దుమ్ముకొట్టుకుంటూ ఉంటాయి. మీరు అనుభవించినంత పచ్చదనం మళ్ళీ అక్కడ కనిపిస్తూ ఉండదు. ఎక్కడా ఏ వెలుగులూ ఉండవు. ఏ వెలుగులూ వాటిల్లోంచి ఊరుతూ ఉండవు. మనుష్యుల ముఖాలు మళ్ళీ కళాహీనంగానే, అతిమామూలుగానే, విసుగుపుట్టిస్తూ ఉంటాయి. అంతా దుమ్మూ ధూళే. అది మహాసాధారణంగానే ఉంటుంది.

ఇదే అనుభవం యోగాభ్యాసాల వల్ల కూడా కలుగవచ్చు. పస్తులుపడి ఉన్నప్పుడు కూడా ఇవే అనుభవాలు కలుగవచ్చు. మరే పద్ధతుల వల్లో కూడా ఇవి సంభవాలు కావచ్చు. ఓ క్షణమాత్ర వీక్షణాన్ని, ఓ పూర్వావలోకనాన్ని కలిగించేందుకు పద్ధతులు మంచివే. కానీ అవి తాత్కాలికాలుగానే ఉంటాయి. అవే శాశ్వతాలు అయిపోవు. మీ చైతన్యం అదే స్థితిగా పరిణమించదు.

కాబట్టి అందులో ఏ సమస్యా లేదు, అది సాధారణమే. అవి అదృశ్యం అయిపోతాయి, అందులో మీ తప్పేమీ ఉండదు. తప్పంతా మీ ఆలోచనా విధానంలోనే ఉంది. మీరు అనుకుని ఉండవచ్చు యోగాసనాలు మరి ధ్యానం వల్ల మీరు ఓ శాశ్వత అనుభవాన్ని సృష్టించుకోగలుగుతారని. అది సంభవించడం అసాధ్యం.

శాశ్వతాన్ని సృష్టించలేం. సృష్టింపబడిన ప్రతి విషయమూ ఏదో ఓ నాటికి నశించే తీరుతుంది.

మీకు సృష్టింపబడకుండానే శాశ్వతం వస్తుంది. శాశ్వతమే సంభవిస్తుంది. దాన్ని ఓవరూ సృష్టించరు. అన్ని సాధనలకూ, అన్ని పద్ధతులకూ మీరు అతీతులు అయిపోయిన తరువాత, అన్ని పద్ధతులనూ, అన్ని సాధనలనూ మీరు వదిలిపెట్టేసిన తరువాత, ఒక విషయాన్ని మీరు తెలుసుకునే స్థితిలోకి చేరుకున్న తరువాత - ఉనికి మాత్రంగా ఉన్నది ఉన్నట్లు ఉంటే చాలు అన్న, మరింకేమీ చెయ్యనక్కరలేదు అన్న విషయాన్ని గ్రహించిన తరువాత, ఇక ఏ సర్దుబాట్లూ చేసుకోనక్కరలేదు అన్న అవగాహనను తెచ్చుకున్న తరువాత, ఆది నుంచీ అందరూ బుద్ధుళ్ళే అన్న అవగాహన మీకు వచ్చిన తరువాత - మీరు ఏ స్థితిలోకో ఎదగరనీ, ఇప్పుడు ఆ స్థితిలోనే ఉన్నారనీ, మీకు ఇప్పటికే తత్ప్రాప్తి వచ్చేసి ఉందని తెలుసుకున్నాక, అప్పుడు మీరు సౌఖ్యులు అవుతారు.

అలా 'స్వస్థితిలో సౌఖ్యాన్ని పొందడం' అన్నది ఓ పద్ధతిగా జరగకూడదు. ఓ యోగాసనం వేసుకుని మీరు ఆ సౌఖ్యాన్ని తెచ్చుకోకూడదు. ఈ విషయం మీకు అర్థమైతే వెంటనే మీకు సౌఖ్యం వచ్చేసి ఉంటుంది. దీన్ని అర్థంచేసుకోవడమే సౌఖ్యాన్ని పొందడం. మీరు సౌఖ్యులు అయిపోతారు, మీ ప్రయత్నాలన్నీ అదృశ్యం అయిపోతాయి. మీరు ఓ సాధారణ జీవితాన్నే గడుపుతూ ఉంటారు - కట్టెల్ని చీల్చి ముక్కలు చేసుకుంటూ, బావిలోంచి నీళ్ళు తోడుకుంటూ, నీళ్ళు మోసుకుని నడుస్తూ, వంటలు వండుకుంటూ, నిద్రపోతూ, ప్రేమించుకుంటూ సాధారణ జీవితాన్నే గడుపుకుంటూ, ఏ అత్యాశలూ వ్యామోహాలూ ఉండకుండా, ఏ అతికోరికా లేకుండా సాధారణంగానే జీవిస్తూ ఉంటారు.

ఆ తరువాత ఏదో ఒకనాటికి మీకు అది వస్తుంది. మీరు చేసుకున్నందువల్ల కాదు. ఉన్నట్లుండి ఓ రోజు మీకు అది వచ్చేసి ఉంటుంది. ఓ రోజు నిద్రలేవగానే అది మీ ముందు ఉంటుంది – ఆ తరువాత అది ఇంకెక్కడికీ పోదు. తానంతట తానే అది మీ వద్దకు వచ్చింది. అలా కాకుండా అది మీ ప్రయత్నం వల్ల వస్తే మళ్ళీ అది మీ నుంచి తప్పకుండా వెళ్ళిపోయే తీరుతుంది, మీ వద్ద తాత్కాలికంగా ఉంటుంది.

మీరు "కొన్నేళ్ళ క్రితం యోగాభ్యాసాలతో, ధ్యానాలతో ప్రార్థన ఔన్నత్య శిఖరాలను అందుకోగలిగాను", అని అంటున్నారు. అవి మీరు సృష్టించుకున్న శిఖరాలే. అవి మీ కలలు, స్వప్నాలు, మీ కల్పితాలు. "నా జీవ ఉనికి సర్వస్వంలో ఆ ఆనంద

పారవశ్యాన్ని అనుభవించగలిగాను". కానీ మీరు అప్పుడు అక్కడ ఉన్నారు. మీరు ఆనంద పారవశ్యాన్ని అనుభవించారు, కానీ మీరు అప్పుడు ఉన్నారు. మీరు మాయం అయిపోలేదు. "అప్పుడు సర్వస్వం దివ్యంగా ఉండేది" అది మీరు చేసుకున్న విశ్లేషణ. అక్కడ మీ మనస్సు పనిచేస్తోంది. మీ మనస్సే చెప్తోంది "ఇప్పుడు సర్వస్వం దివ్యంగా ఉంటోంది" అని. మీరు వినే ఉంటారు, మీరు చదివే ఉంటారు, మీ మనస్సు విశ్లేషిస్తూ నిర్ణయిస్తూనే ఉంటుంది – సర్వస్వమూ దివ్యమే, ప్రేమభరితమే, కృతజ్ఞతాత్మకమే. ఇవన్నీ మీ ఆలోచనలలో తేలివస్తున్న మేఘాలు.

కానీ మీరు అప్పుడు అక్కడ ఉన్నారు. మీ జ్ఞాపకం అక్కడే ఉంది. మీ గతం కూడా అక్కడ ఉంది. ఉండకపోతే "సర్వస్వమూ దివ్యంగా ఉంది" అని ఎవరు చెప్పగలుగుతారు? అంతా దివ్యంగానే ఉంటే, 'దివ్యంగానే ఉంది' అని మనం ఎందుకు చెప్పుకోవాలి? అక్కడ ఆ మాట అనుకోవాల్సిన అవసరమే ఉండదు. ఆ మాటను మీరు అంటున్నారు కాబట్టి సర్వస్వం దివ్యంగా లేదు అనే అర్థం. ఆ మాటను మీరు నియమించి చెబుతున్నారు, విధించి చెబుతున్నారు.

ఔను. యోగాభ్యాసాల వల్లా, ధ్యానాల వల్లా అక్కడ ఓ విధమైన సంతోషం సృష్టింపబడే ఉండితీరుతుంది. అక్కడ ఓ విధమైన ఆనందం తప్పకుండా ఉండితీరాలి. ఆ ఆనందం మీదే మీ వేదాంతాన్ని అంతా మీరు విధించేసుకున్నారు – దాన్నే దివ్యత్వం అని అనుకునేశారు. అదే ప్రేమ అనుకునేశారు. అదే కృతజ్ఞతాత్మకత అనుకునేశారు. కొద్దిరోజులపాటు మీరు ఆ స్వప్నంలోనే ఆనందిస్తూ ఉండేవారు – కానీ అది స్వప్నం మాత్రమే.

"ఏ కారణం వల్లో అందులోంచి నేను బయటికొచ్చేశాను". ఏ కారణం వల్లో కాదు, అతి సహజం అది. దానిలోంచి మీరు వచ్చేసే తీరాలి. మీరు ఆ స్వప్నంలోనే శాశ్వతంగా ఉండిపోలేరు – ఒకే స్వప్నంలో ఎవ్వరూ శాశ్వతంగా ఉండలేరు. ఓ స్వప్నం ఎప్పటికీ శాశ్వతంగా ఉండదు. ఉంటే స్వప్నానికీ, వాస్తవానికీ ఏ భేదం ఉంటుంది? ఓ స్వప్నం తాత్కాలికంగా ఉంటుంది. త్వరగానో, లేకపోతే కాస్త ఆలస్యంగానైనా మీరు మేల్కోవాల్సే వస్తుంది. కళ్ళు తెరవకముందే స్వప్నం అదృశ్యం అయిపోయి ఉంటుంది, వాస్తవమే ప్రత్యక్షం అయి ఉంటుంది.

"ఏ కారణం వల్లో అందులోంచి నేను బయటకి వచ్చేశాను. ప్రస్తుతం నేను మళ్ళీ ఓ గాడాంధకారపు లోయలోనే ఉంటున్నాను". మీరు సూర్యకాంతి ప్రతిఫలిస్తున్న ఆ శిఖరాగ్రాల మీద ఉండేవారు, మీరు గాఢాంధకారపు లోయల్లోనూ

ఉండేవారు. అక్కడ ఒక్కటి మాత్రం ఉంటుంది... మీరు ఉండటం. గాఢాంధకారపు లోయలైనా, సూర్యకాంతి ప్రతిఫలిస్తున్న శిఖరాగ్రాలైనా. అక్కడ ఏది ఉన్నా అసంగతం; ఏది సంగతం అంటే మీరు అక్కడ ఉండడమే – అక్కడ మీ అహంకారం ఉంది. మీ అహంకారమే గాఢాంధకారపు లోయలో ఉంటోంది. మీ అహంకారమే శిఖరాగ్రంలో ఉంటోంది. స్వప్నాలను అహంకారమే సృష్టించుకుంటూ ఉంటుంది.

నన్ను ఓ విషయాన్ని చెప్పనీయండి : గాఢాంధకారపు లోయ కూడా మీ స్వప్నమే, మీ విధింపే, మీ ఊహే. ఏ గాంఢాంధకారపు లోయలూ లేవు. సర్వస్వమూ దివ్యమే అయితే గాఢాంధకారపు లోయలు అక్కడ ఎందుకు ఉంటాయి? గాఢాంధకారపు లోయలు అక్కడ ఉంటే సర్వస్వమూ దివ్యం ఎలా అవుతుంది? గాఢాంధకారపు లోయలూ లేవు, సూర్యకాంతి ప్రతిఫలిస్తున్న శిఖరాగ్రాలూ లేవు; కనిపిస్తున్నదంతా మీ అహంకారం ఆడుకుంటున్న ఆట మాత్రమే. విషయాంతాలలోకి ధృవాలలోకి మీ అహంకారం చరిస్తూ ఉంటుంది. ఇక్కడి నుండి అక్కడికీ, అక్కడి నుండి ఇక్కడికీ తిరుగుతూనే ఉంటుంది. దాన్ని మీరు దర్శించారంటే – మధుర స్వప్నం కూడా కలే అనీ, పీడకల కూడా స్వప్నమే అని, ఆ రెండూ కలలేనని – మేల్కోండి, ఆ రెండు కలలనూ విడిచిపెట్టెయ్యండి. అప్పుడు మీరు మొట్టమొదటిసారిగా వాస్తవంతో కలయికతో ఉంటారు.

కానీ గుర్తుపెట్టుకోండి, ఏ క్షణంలో వాస్తవం మీ ముందు ఉంటుందో, ఆ క్షణంలో మీరు ఉండరు. ఈ విశేషాన్ని మీరు అర్థం చేసుకోగలిగితే చాలు. అదే ప్రమాణం. మరే ప్రమాణమూ ఉనికిలో లేదు. ఉన్న ఏకైక ప్రామాణికత ఏమిటంటే, ఓ అనుభవం నిజంగా వాస్తవానికే సంబంధించినదై ఉంటే అక్కడ మీరు కనిపిస్తూ ఉండరు. అక్కడ మీరు కనిపిస్తూ ఉండలేరు. అక్కడ మీరు అస్సలు ఉండరు. అక్కడ బ్రహ్మానంద పారవశ్యం ఉంటుంది. కానీ మీరు దాన్ని అనుభవిస్తూ ఉండరు. బ్రహ్మానంద పారవశ్యాన్ని అనుభవిస్తూ "బ్రహ్మానంద పారవశ్యాన్ని అనుభవిస్తున్నాను" అని చెప్పేవాడు ఎవ్వడూ అక్కడ ఉండడు. అక్కడ దేవుడు ఉంటాడు, కానీ మీరు ఉండరు. "సర్వస్వమూ దివ్యంగా ఉంటోంది" అని చెబుతున్నవాడు అక్కడ ఉండడు. దీన్ని జ్ఞప్తిలోనే నిలిపి ఉంచుకోండి.

ఇది సంభవించగలుగుతుందే తప్ప సంభవింపజేయలేం. మీరు దాన్ని సృష్టించుకోలేరు. తయారు చేయబడిన వస్తువు కృత్రిమంగా ఉంటుంది. అది

కొంతదూరం మాత్రమే వెళుతుంది. తరువాత మాయమైపోతుంది. తయారుచేయబడిన వస్తువు అతిసరసంగా ఉంటుంది. మీరు ఏం తయారు చేసుకుంటున్నారో ఒకసారి గమనించి చూసుకోండి. మీరు ఓ యోగాభ్యాసాన్ని చేస్తున్నప్పుడు, మీరు చేస్తున్నది ఏమిటి? మీరు ఓ శీర్షాసనం వేసుకుని ఉంటున్నారు – తలక్రిందులుగా నిలబడితే జ్ఞానోదయం కలుగుతుందా? ఓ శీర్షాసనం వేసినంత మాత్రానే? మరీ అంత చవకగానా?

శీర్షాసనం వేసుకుని నిలబడితే మీ శిరస్సుకు ఓ ఘాతం తగలవచ్చు. మీకు ఓ విద్యుత్‌చికిత్స (షాక్‌ట్రీట్‌మెంట్) జరగవచ్చు. పరవళ్ళు తొక్కుతున్న ఓ నెత్తుటి వెల్లువ మీ తలలోకి వస్తే మీకు ఉన్నట్లుండి ఆగిపోయిన అనుభవం కలుగవచ్చు – మీ ఆలోచన ఆగిపోతుంది. ఉన్నట్లుండి ఎంతో రక్తప్రవాహం వచ్చేసింది. మ్మ్? – మీరు తలక్రిందులుగా నుంచున్నారు కాబట్టి. భూమ్యాకర్షణ శక్తి మీ నెత్తురును బలంగా శిరస్సులోకి లాగుతూ ఉంటుంది కాబట్టి. మీ శిరస్సుకు దాన్ని భరించే సామర్థ్యం ఉండదు. అదో ఉధృతంగా ఉన్న నెత్తుటి వెల్లువ. కాబట్టి ఒక్క క్షణం మీ ఆలోచన ఆగిపోతుంది. ఆ క్షణంలో మీ అనుభూతితో "ఆహా! నేను ఆనందాన్ని అనుభవిస్తున్నాను. ఏం పారవశ్యం? సర్వస్వం దివ్యంగా ఉంటోంది" అని తెలుసుకుంటూ ఉంటారు. కానీ అదే ఆసనంలో ఎంతసేపు ఉండగలుగుతారు? ఎంతోసేపు శీర్షాసనంలోనే ఉండిపోవడాన్ని మీరు అభ్యాసంచేసి సాధించుకున్నా, మీతోపాటు మీ మనస్సుకు కూడా ఆ నెత్తుటి వెల్లువ ఉధృతంగా ఉన్నా ఆలోచనలను ఎలా చేయవచ్చో నేర్చేసుకుంటుంది. అదో సమస్యే కాదు. మీ మనస్సు కూడా మీతోపాటు అభ్యాసాన్ని చేస్తూనే ఉంటుంది. ఆ తరువాత మీరు శీర్షాసనం వేసుకుని కూడా ఆలోచిస్తూ ఉండవచ్చు.

నా బాల్యంలో శీర్షాసనం వేసుకుని ఎంతో సమయాన్ని గడుపుతూ ఉండేవాణ్ణి. అది నాకు ఎంతటి అలవాటుగా పరిణమించింది అంటే ఓ రోజు శీర్షాసనంలోనే నాకు నిద్రపట్టేసింది. అది జరగడం దాదాపుగా అసంభవం, అసాధ్యం. మా ఊళ్ళో నివసిస్తూ ఒక విధమైన యోగిలాగా ఉంటున్న ఓ వృద్ధుడి వద్దకు వెళ్ళి నేను జరిగిందంతా చెప్పాను. ఆయన అన్నాడు "అసంభవం. నాకు సైతం ఇలాంటి అనుభవం ఎప్పుడూ కలగలేదు. శీర్షాసనం వేసుకుని నిద్రపోవడమా...?" అని – ఎందుకంటే నిద్రపట్టాలంటే తలలోకి రక్తప్రసారం తక్కువగా జరగాలి, సాధారణంగా జరిగే ప్రసారం కన్నా. అందువల్లే మనం రాత్రిపూట నిద్రపోయేప్పుడు దిళ్ళు వేసుకుని పడుకుంటాం. మన శిరస్సును కొంచెం ఎత్తులో ఉంచుకునేందుకు. అలా ఎత్తు

దిళ్ళు వేసుకుని పడుకుంటే తలలోకి తక్కువ రక్తం ప్రవహిస్తుంది కనుక. దిండు వేసుకోకపోతే శిరస్సులోకి సాధారణ రక్తప్రవాహాలు జరుగుతూ శిరస్సు తన పనిని చేస్తూనే ఉంటుంది. ఓ మనిషికి తెలివితేటలు ఎంత ఎక్కువగా ఉంటాయో అంతంత ఎక్కువ ఎత్తున్న దిండును ఆ మనిషి తలక్రింద పెట్టుకోవాల్సి వస్తుంది – రెండు, మూడు, నాలుగు దిళ్ళు. లేకపోతే కొంచెం రక్తం తలలోకి ప్రసరించినా ఆలోచనల క్రమం ప్రారంభమైపోతుంది. అందువల్లే శిరస్సుకు ఆహారాన్ని అందించడం పూర్తిగా మానెయ్యాలి.

ఆ వృద్ధయోగి అన్నాడు “అది అసంభవం”. కానీ నాకు అది జరిగింది. శీర్షాసనంలో నిద్రపోవడమే కాదు, శీర్షాసనంలో నుంచి క్రిందపడిపోయాను కూడా. కానీ అది అలవాటు అయిపోయింది. శీర్షాసనం వేసుకుని ఆలోచనలు చెయ్యడం మాత్రమేకాక, నిద్రపోవడమూ, కలలు కనడమూ కూడా సంభవాలు కావచ్చు. కాబట్టి మీరు ఎక్కువసేపు శీర్షాసనం వేసుకుంటూ ఉంటే మీరు దానికి అలవాటు పడిపోతారు. మొట్టమొదటిసారి కలిగిన ఆనందం ఆ తరువాత మళ్ళీ మీకు ఎప్పటికీ ప్రాప్తించదు.

మరి ధ్యానాలు చేస్తున్నప్పుడు మీరు చేస్తున్నది ఏమిటి? ధ్యానాలు చేస్తూ, యోగాసనాలు వేసుకుంటూ, పస్తులుపడుతూ, నియమిత ఆహారాలు తింటూ మీరు ముక్తిని ఎలా సాధిద్దాం అనుకుంటున్నారు? కుదరదు. ఆ విషయం ఎంతో అతీతంగా ఉంటోంది – తారలకు అతీతంగా. ఈ చిన్న చిన్న విషయాలన్నీ భౌతిక అనుభవాలే. అవి మిమ్మల్ని శుద్ధి చేస్తాయి, మీ మలినాలను ప్రక్షాళన చేస్తాయి. కానీ మీకు అవి జ్ఞానోదయాన్ని సంతరింపజేయలేవు. మీకు అవి కొన్ని క్షణాల ఆనందాన్ని అందించగలుగుతాయి. కానీ ఆ ఆనందాన్ని మీరు బ్రహ్మానందపారవశ్యంగా ఊహించుకోకూడదు. ఎందుకంటే మీరు అక్కడ ఉంటున్నారు కాబట్టి. వాటివల్ల అప్పుడప్పుడూ మీలో గొప్ప వెలుగు వెలగవచ్చు, కానీ ఆ వెలుగు శాశ్వత వెలుగు కాదు. మీకు శాశ్వతపు వెలుగు ప్రాప్తించాలంటే మీకు స్త్రీత్వం ఉండాలి, మీకు కర్తృత్వం ఉండకూడదు. మీరు అకర్మాత్మకంగానే ఉండాలి, నిర్లిప్తతతో, నిశ్చేష్టతతో. మీరు నిరీక్షిస్తూ ఉండాలి. సాధారణంగా ఉంటూ, వేచి ఉండండి.

మరి ఏ యోగాభ్యాసాలను చెయ్యకండి అని నేను చెప్పడం లేదు; అవి శరీరానికి మంచిదే. ధ్యానాలు చెయ్యకండి అని నేను చెప్పడం లేదు, అవి ఎంతో మంచివి. మిమ్మల్ని శుద్ధుల్ని చేస్తాయి. కానీ యోగాసనాలతో, ధ్యానాలతో దేవుణ్ణి సృష్టించవచ్చని మీరు అనుకోకండి. దేవుణ్ణి మీరు తయారు చేసుకోలేరు. కానీ మీకు ప్రక్షాళన కలుగుతుంది. దివ్యత్వం ప్రాప్తించడానికి మీ అవకాశం పెరుగుతుంది.

కానీ మీకు ఏ మాత్రమూ ఎరుక ఉండని క్షణంలోనే మీకు జ్ఞానోదయం ప్రాప్తిస్తుంది. ఆ దేవుడి గురించి మీరు ఏ మాత్రమూ వెతకకుండా ఉన్నప్పుడు, ఏమీ చెయ్యకుండా తాపీగా కూర్చుని ఉన్నప్పుడు, ఏ కర్మలూ ఆచరించకుండా ఏ కోరికా మీకు ఉండనప్పుడు – అతి చిన్న కోరిక తునక కూడా మీ మదిలో ఉండకూడదు, మీరు మరేదో అయిపోవాలన్న తలంపు కూడా ఉండకూడదు, ముక్తి ప్రాప్తించాలి, ఇంకోటి కావాలి, ఇవేమీ ఉండకూడదు – అలా మీరు కూర్చుని ఉన్నప్పుడు, ఏమీ చేయకుండా ఉన్నప్పుడు, ఉన్నట్లుండి అది జరుగుతుంది. అది ఎప్పుడూ హఠాత్తుగానే జరుగుతుంది. అదే దిగి మీలోకి వస్తుంది. కానీ అప్పుడు మీరు ఇక ఉండరు; మోక్షం ఉంటుంది మీరు ఉండరు. సంప్రజ్ఞత వస్తుంది, మీరు ఉండరు. దేవుడు వస్తాడు మీరు ఉండరు.

## చివరిప్రశ్న:

***ప్రియ ఓషో,***

***నేను రెండు నెలలు 'అ, ఆ' ఆశ్రమంలో, రెండేళ్ళు ఫ్రాన్సులో ఉన్న మరో ఆశ్రమంలో ఉన్నాను. అవన్నీ నిష్ప్రయోజనాలే అయిపోయాయి – ప్రేమ ఉప్పొంగడం కన్నా ద్వేషమే పెచ్చరిల్లింది.***

***నాకు అనిపించింది నాతో నేను సమగ్రంగా ఉండగలిగేందుకు సామూహిక నిర్ణయాల వల్ల నడుస్తున్న, సామూహిక సంపదల పోషణ వల్ల నడుస్తున్న, స్వేచ్ఛా లైంగికత్వం ఉన్నచోట నేను ఉంటే బాగుంటుంది అని. ఆశ్రమ జీవితం ఎలా ఉండాలని మీరు అనుకుంటున్నారో చెప్తారా?***

సమస్య ఉంటున్నది మీరు ఉంటున్న చోటులో కాదు. మీరే సమస్య. మీరు ఓ ఆశ్రమానికి వెళ్తూ మీ సమస్యలన్నింటినీ మీతోపాటు అక్కడికి తీసుకువెళ్తూ ఉంటారు. ఈ ఆశ్రమంలో జీవించడానికి వస్తున్న అందరూ సరిగ్గా మీలాగే వస్తారు, వాళ్ళ సమస్యలన్నింటినీ మోసుకుంటూ. ఏదో ఒకనాటికి ఆ సమస్యలన్నీ పైకి తేలుతాయి. ఈ బయటి విషయాల వల్ల ఏ ఉపయోగమూ ఉండదు. అవన్నీ మిమ్మల్ని తప్పుదారి పట్టిస్తూ ఉంటాయి, మీ ధ్యాసను మళ్ళిస్తూ ఉంటాయి. అసలైన సంస్కరణ మీలోనే జరగాలి, ఏ ఆశ్రమంలో ఉన్నా లేకపోయినా. అసలైన నిజపరివర్తన మీ ప్రగాఢాంతరంలోని జీవుడిలోనే కలగాలి. ఆ పరివర్తన మీలో ఈ ఆశ్రమంలో సంభవిస్తే, అప్పుడు మాత్రమే మీ జీవితం విభిన్నంగా ఉంటుంది. ఆ పరివర్తన మీలో జరగకపోతే మీ జీవితం విభిన్నంగా ఉండదు.

మీరు "అవన్నీ నిష్ప్రయోజనాలే అయిపోయాయి" అని అంటున్నారు. అవి ఎందుకు ఉత్తీర్ణతను పొందలేకపోయాయి అంటే మీలో ఏ పరివర్తనా కలగలేదు కాబట్టే. నిజంగా అవేవీ అపజయాన్ని పొందలేదు. అవి విజయాన్ని సంధించలేకపోయాయి అంటే మీకే భంగపాటు కలిగింది అనే అర్థం. మీ వాంఛితాలను అవి తీర్చలేకపోయాయి. మీరు వేటిని ఆశిస్తూ ఉన్నారు? మీరు ఓ ఆశ్రమంలో జీవిస్తే సరిపోతుందని అనుకుంటున్నారు, మీ సమస్యలన్నీ అంతటితో పరిష్కారం అయిపోతాయని అనుకుంటున్నారు.

ఏ ఆశ్రమం కూడా మీకు ఆ సహాయాన్ని చెయ్యలేదు. మీరు హిమాలయాలలోకి వెళ్ళి ఓ గుహలో ఉంటున్నా అందువల్ల ఏ ప్రయోజనమూ కలుగదు. జీవితాన్ని మనం వాస్తవికంగానే ఎదుర్కోవాలి. మీ సమస్యలను మీరే దర్శించుకోవాలి, ఆ సమస్యల మూలాలలోకి మీరే వెళ్ళి చూసుకోవాలి. ఆ సమస్యల మూలాలను మీరే తగలబెట్టేసుకోవాలి. వాటి విత్తనాలను కూడా మీరు విధ్వంసం చేసేసుకోవాలి. అప్పుడు మాత్రమే – ఏదైనా సంభవించగలుగుతుంది.

మీరు ఓ స్వర్గాన్నే అన్వేషిస్తున్నారు కదూ, మ్‌మ్? యుగాల పర్యంతమూ మనుష్యులంతా ఎప్పుడూ చేస్తున్నది అదే. వాళ్ళు మారరు. వాళ్ళు ఓ స్వర్గాన్ని కోరుకుంటూ ఉంటారు. ఒకవేళ అక్కడికి వెళ్ళినా వాళ్ళు అక్కడ ఓ నరకాన్నే సృష్టించుకుంటారు. వాళ్ళే నరకం – ఏ స్వర్గాన్నో ఎక్కడో వెతుక్కోనక్కరలేదు. అది స్వంతంగా మీ లోపలే ఉంటే తప్ప, మరి ఇంకెక్కడా అది మీకు కనిపించదు.

అనుబోధి నాకు ఓ చక్కటి కథను పంపించాడు :

ఒకప్పుడు సర్వఖర్చుల్నీ వాళ్ళే భరించే స్వర్గనరకాల సందర్శనా యాత్రను గెలుచుకున్న ఓ మనిషి నాకు తెలుసు. ఆ మనిషిని 'ముందుగా నువ్వు ఎక్కడికి వెళ్తావు' అని అడిగారు. ఈ విజేత "ముందుగా నరకాన్నే దర్శించాలి అనుకుంటున్నాను" అన్నాడు.

నరకంలోకి వెళ్ళగానే ఆ మనిషికి ఓ గొప్పదర్శనం కలిగింది. ఓ పెద్ద హాల్లో పొడవుగా బల్లలు వేసి అక్కడ అన్నిరకాల ఆహార పదార్థాలనూ అమర్చిపెట్టి ఉన్నారు. అక్కడ ఎంతోమంది కూర్చుని ఉన్నారు, చేతుల్లో ఫోర్కులు పట్టుకుని భోజనం మొదలుపెట్టబోతూ. ఆ ఆహార పదార్థాలన్నీ ఆవిర్లు చిమ్ముతూ వంటకాల వాసనను ఆ హాలు మొత్తాన్నీ నింపుతున్నాయి. కానీ ఎవ్వరూ భోంచెయ్యడం లేదు.

ఆ మనిషి సందిగ్ధంలో పడిపోయాడు. ఏమీ అర్థం కావడం లేదు. కొంచెం దగ్గరకు వెళ్ళి పరీక్షగా చూశాడు. అప్పుడు ఆ మనిషికి ఏదో తెలిసి వచ్చింది. వాళ్ళందరికీ మోచేతులు పక్షవాతం వచ్చి పట్టేసినట్లు బిగుసుకుపోయి ఉన్నాయి. వాళ్ళు ఎంతటి ప్రయత్నాన్ని చేస్తూ ఉన్నా తిండి వాళ్ళ నోళ్ళ దగ్గరకు చేరలేకపోతోంది.

ఈ మనిషి "కాబట్టి, ఇది అన్నమాట 'నరకం' అంటే", అనుకున్నాడు. "సర్వసమృద్ధంగా ఉన్న ఈ విశ్వంలో సర్వప్రాణుల సర్వఆశలనూ తీర్చే అన్ని వసతులూ, వనరులూ, సదుపాయాలూ మిక్కుటంగానే ఉన్నా ఒక్క ముద్ద తిండి కూడా తినలేని దౌర్భాగ్యం."

ఇక దాన్ని చూడలేక, వెనక్కు తిరిగి ఇక తనను స్వర్గానికి తీసుకెళ్ళమని ఆ మనిషి అడిగాడు. స్వర్గంలో కూడా అదే దృశ్యం కనిపించింది. అక్కడ కూడా బల్లల మీద అన్నిరకాల తిళ్ళూ, వాటిముందు కూర్చుని దేన్నీ తినలేకపోతున్న మనుష్యులే కన్పించారు. ఇంకొంచెం దగ్గరగా వెళ్ళి పరీక్షించి చూస్తే అక్కడ ఉన్న మనుష్యులకు కూడా నరకంలో కనిపించిన పక్షవాతమే వచ్చేసి మోచేతులు బిగుసుకుపోయి ఉండడమే కనిపించింది. "ఇదా స్వర్గం?" అని ఆ మనిషి ఆక్రోశించాడు, దాదాపుగా ఎంతో గట్టిగానే. కానీ ఇంకా దగ్గరికి వెళ్ళి ఇంకొంచెం పరీక్షించి చూస్తే అక్కడ ఆ మనిషికి ఓ తేడా కనిపించింది. ఆ చిన్న తేడా వల్లే అది స్వర్గం అయి ఉంటోంది. అక్కడ ఒకరికి మరొకరు తినిపించుకుంటూ అందరూ భోజనం చేస్తున్నారు.

వాళ్ళందరికీ కూడా అదే పక్షవాతపు జబ్బు ఉంది. కానీ ఒకరికి మరొకరు అందించుకుంటూ అందరూ ఆహారాన్ని తింటున్నారు. వాళ్ళ నోళ్ళలోకి వాళ్ళు స్వంతంగా ఆహారాన్ని తెచ్చుకోలేరు. కానీ వాళ్ళు ఇంకో మనిషికి ఆహారాన్ని అందించగలుగుతారు. ఆ రెండవ మనిషే ఈ మొదటి మనిషికి ఆహారాన్ని అందిస్తూ ఉంటాడు.

అది ఒక్కటే తేడా. కానీ అంతరంలో ఆ తేడా ఉంటోంది – వాళ్ళల్లో కరుణావేశం ఉంటోంది. మీరు బోధిసత్వులు అయితే తప్ప, మీరు ఎక్కడికి వెళ్ళినా మీరు ఓ నరకంలోనే ఉంటారు. ఆవేశం కరుణావేశంగా పరివర్తితమైతే... అప్పుడు మీరు ఎక్కడ ఉన్నా అదే స్వర్గం అయిపోతుంది. కేవలం అది ఒక్కటే సంభవించగల స్వర్గం.

ఈ రోజుకు ఇది చాలు.

# 7. శాంతినివాసి

భగవానుడు అప్పుడు అన్నాడు : ఔను, సుభూతీ... ఎందుకంటే తథాగతుడు భాషించాడు, ప్రత్యేక బుద్ధ ధర్మాలు అన్నవి ప్రత్యేక బుద్ధ ధర్మాలు కానే కావని. అందువల్లే అవి ప్రత్యేక బుద్ధ ధర్మాలు అనబడుతున్నాయి.

భగవానుడు అడిగాడు : నువ్వు ఏమనుకుంటున్నావు, సుభూతీ, ఏటివిజేతకు అనిపిస్తుందా ‘ఏరుదాటిన ఫలం నాకు ప్రాప్తించింది’ అని?
సుభూతి బదులు పలికాడు : అనిపించదు, ఓ భగవాన్, మరి ఎందుకు? ఎందుకంటే, ఆ మనిషి ఏ ధర్మాన్నీ పొందలేదు కనుక.
అందువల్లే ఆ మనిషి ఏటివిజేత అనబడుతున్నాడు. ఏ దృశ్యవస్తువూ పొందబడలేదు, ఏ శబ్ద విశేషాలూ, ఏ గంధ విశేషాలూ, ఏ రుచి విశేషాలూ, ఏ స్పర్శా వస్తువులూ, ఏ మనోధర్మాలూ పొందబడలేదు. అందువల్లే ఆ మనిషి ఏటివిజేత అనబడుతున్నాడు.
ఒకవేళ, ఓ భగవాన్, ఆ ఏటివిజేతకు ‘ఏరుదాటిన ఫలం నాకు ప్రాప్తించింది’ అని అనిపించి ఉంటే, అలా అనిపించడం ఓ ‘నేను’ను, ఓ ‘జీవి’ని, ఓ ‘ఆత్మ’ను, ఓ ‘వ్యక్తి’ని మళ్ళీ లాక్కుని తెచ్చేసుకోవడమే అయిపోతుంది కాబట్టి...

భగవానుడు అడిగాడు : నువ్వు ఏమనుకుంటున్నావు, సుభూతీ, ఆ అర్హతుడికి అప్పుడు అనిపించి ఉంటుందా ‘అర్హత్వం నాకు ప్రాప్తించింది’ అని?
సుభూతి అన్నాడు : అనిపించి ఉండదు, భగవాన్. మరి ఎందుకు అనిపించి ఉండదు? ఎందుకంటే అర్హతగా చెప్పబడే ఏ ధర్మమూ లేదు కనుక.

> అర్హతగా ఎంచబడే ఏ ధర్మమూ లేదు కనుకే అర్హత అని చెప్పబడుతూ ఉంది... మరి ఎందుకు? నేనై ఉన్నాను భగవాన్, తథాగతులవారి భాషణలో శాంతినివాసులలో పరమాగ్రుణ్ణిగా, నేను ఉంటున్నాను భగవాన్ అర్హతుణ్ణై, వీతరాగుణ్ణై. అయినా నాకు అనిపించడం లేదు భగవాన్ 'నేను అర్హతుణ్ణి, వీతరాగుణ్ణి' అని.
>
> ఒకవేళ అర్హతుడను అన్న భావన నాలో ఏర్పడగలిగే ఉంటే
> అప్పుడు తథాగతులవారు అని ఉండరు, "సుభూతి, ఈ ఉత్తమ
> కులపుత్రుడు, శాంతి విహారులలో అగ్రగణ్యుడు, ఎక్కడా
> విహరించడం లేదు. అందుకే ఆయన్ని
> శాంతి విహారి అని, శాంతి నివాసి అని అంటున్నాం."

వజ్రచ్ఛేదికా ప్రజ్ఞాపారమితాసూత్రం మీలో ఎందరికో అసంగతంగానే, వైపరీత్యంగానే, పిచ్చిగానే, కనిపించవచ్చు. ఇది అసాహేతుకంగా ఉండవచ్చు కానీ సాహేతుకతకు విరుద్ధంగా మాత్రం ఉండదు. తర్కానికి, హేతువుకు ఏదో అతీతంగానే ఇది ఉంటుంది. అందువల్లే మాటలతో ఈ సూత్రాన్ని వర్ణించడం ఎంతో కష్టంగా ఉంటుంది.

ఒకప్పుడు ఓ విస్కీ తాగుతూ ఉండే, నిరంతర ధూమపానంచేస్తూ ఉండే, ఎప్పుడూ పాప్‌కార్న్ తింటూ ఉండే అమెరికన్ పూజారి ఒకాయన నాతోపాటే ఉండేవాడు. నా లైబ్రరీలో వెతుకుతూ, తిరుగుతూ ఉన్నప్పుడు ప్రమాదవశాత్తుగా ఈ వజ్రచ్ఛేదిక సూత్ర గ్రంథం ఆయన చేతికి వచ్చింది. ఓ పదినిముషాలు, ఓ పావుగంట ఆ పుస్తకాన్ని తిరగేస్తూ ఇక్కడ కొంచెం, అక్కడ కొంచెం ఆయన చదివి, అప్పుడు నా దగ్గరికి వచ్చి ఇలా అన్నాడు "ఈ బుద్ధ మానవుడు తప్పకుండా ఓ పిచ్చివాడే అయి ఉంటాడు. ఆ మనిషి ఓ పిచ్చివాడు అయి ఉండడమే కాక, ఆ మనిషికి శిష్యులు, అనుయాయులు కూడా తయారై ఉన్నారు" అన్నాడు.

ఆయన మాటను నేను అర్థం చేసుకోగలుగుతున్నాను. బుద్ధుడు మీకు కూడా ఓ పిచ్చివాడిగానే కనిపిస్తూ ఉండవచ్చు. ఎందుకంటే ఆయన అవ్యక్తాన్ని వ్యక్తీకరించేందుకు, మాటలతో చెప్పేందుకు ప్రయత్నిస్తున్నాడు కనుక, పట్టుకోవడానికి వీల్లేని సారమూలాన్ని దేన్నో పట్టుకోవాలని ఆయన ప్రయత్నిస్తున్నాడు కనుక. అందువల్లే ఈ వింత మాటలన్నీ – ఎంతో వింత మాటలుగా ఉన్నాయి. అవి వింత మాటలుగా

ఎందుకు ఉన్నాయంటే, అవి వింత పద్ధతిలో చెప్పబడుతూ ఉంటున్నాయి కనుక, వ్యక్తీకరణలు వింతధోరణిలో జరుగుతూ ఉన్నాయి కనుక, ఆ మాటలు తార్కికంగా లేవు కనుక, వింటూ ఉంటే ఏ అర్థమూ స్ఫురిస్తూ ఉండేలా అవి ఉండడం లేదు కనుక, కనీసం ఉపరితలం మీద అయినా.

ఆ అతీతంలో ఉన్నదాన్ని దేన్నో అనుభూతితో తెలుసుకుని మీరు ఉంటూ ఉండకపోతే బుద్ధుడు ఏం చెప్పేందుకు ప్రయత్నిస్తున్నాడో దాన్ని అర్థం చేసుకోవడం మీకు ఎంతో కష్టంగానే అనిపిస్తుంది. మనం అర్థం చేసుకోగలిగేది మన అనుభవంతో గ్రహించగలిగిన దేన్నో దాన్ని మాత్రమే. యధాతథంగా గ్రహించలేకపోయినా కనీసం అందులోని ఓ భాగాన్ని. అలా కానప్పుడు మన అవగాహన మన అనుభవంలోనే స్థితం అయిపోయి ఉంటుంది.

ఇది జరిగింది : ఆ రోజు ఉదయం చార్లీ మొట్టమొదటిసారిగా బడికి వెళ్ళాడు. ఇంటికి తిరిగివచ్చిన తరువాత చార్లీని వాళ్ళ అమ్మ అడుగుతోంది "వెరీగుడ్, చార్లీ, నీకు స్కూల్లో ఎలా ఉంది?"

"బాగానే ఉందమ్మా, కానీ టీచర్ నాకు ఇంకా ప్రెజెంట్ ఇవ్వనే లేదు."

"ప్రెజెంటా?" అమ్మ అడుగుతోంది "టీచర్ ప్రెజెంట్ ఇవ్వడం ఏంటి? నువ్వు ఏమంటున్నావు?"

"నన్ను చూడగానే మా టీచర్ ఏమనిందంటే అమ్మా, 'ఫార్ ది ప్రెజెంట్' ఇక్కడ కూర్చో నాన్నా" అని. "నేను ఉదయం నుంచీ అక్కడే కూర్చున్నాను. టీచర్ నాకు ఏమీ ఇవ్వలేదు."

ఇప్పుడు, ఓ చిన్నపిల్లవాడి అవగాహన 'చిన్నపిల్లవాడి అవగాహన'గానే ఉంటుంది. మీరు కూడా అలాగే ఉంటున్నారు – బుద్ధుడికి సంబంధించినంతవరకూ మీరు చిన్నపిల్లలే, బుద్ధుడి మాటలకు సంబంధించినంతవరకూ మీరు చిన్నపిల్లలు మాత్రమే. ఆయన చెబుతున్న మాటలు పరమానుభవానికి చెందినవి. మీరు ఎంతో ఓర్పుపట్టి ఉండితీరాలి. అప్పుడు మాత్రమే మీ చైతన్యంలో నుంచి ఏదో ఉదయించడం ఆరంభం కాగలుగుతుంది. ఆ మాటలు మహాప్రాముఖ్యాలై ఉంటున్నాయి. ఇందులోని ఒక్క వాక్యం మీకు అర్థమైనా అదే మూలనిరూపణం అవుతుంది. మీ ప్రథమ మూలం నుంచే మీరు పరివర్తితులు అవుతారు.

ఓ తండ్రి తన కుమారుణ్ణి మొట్టమొదటిసారిగా ఓ 'ఒపేరా'కు (పాశ్చాత్య సంగీత నాటకానికి) తీసుకెళ్ళాడు. ఓ సంగీత స్వరనిర్దేశకుడు చేతిలో ఓ కర్రను

పట్టుకుని శృతిని నిర్దేశిస్తూ ఊపుతూ ఉన్నాడు. ఓ గాయకురాలు తన ఆలాపనను తృతీయస్థాయిలో ప్రారంభించి స్వరనిర్దేశకుడి సూచనలకు అనుగుణ్యంగా ఆ నాదాన్నే చేస్తోంది. ఆ పిల్లవాడు ఎంతో శ్రద్ధగా ఎంతోసేపు విని చివరికి తన తండ్రిని ఇలా అడిగాడు "ఆయన ఆమెను ఎందుకు కొడుతున్నాడు?"

"ఆయన ఆమెను కొట్టడం లేదు" అని అన్నాడు తండ్రి, కుమారుడికి అర్థమయ్యేలా చెప్పబోతూ.

"కొట్టకపోతే ఆమె ఎందుకు గావుకేక పెడుతోంది?"

మీ మనస్సులో ఎన్నోసార్లు ఈ ఊహలు తప్పకుండా వస్తూ ఉంటాయి : బుద్ధుడు ఏం చెప్తున్నాడు? ఈ మాటలు పూర్తిగా పిచ్చివిగానే కనిపిస్తాయి. ఏ అర్థమూ అందులో స్ఫురించడం లేదు. జ్ఞాన పరిధికి అతీతంగా ఇది ఉంటోంది. మిమ్మల్ని మీరే కూర్చుకుని మీకంటే ఎంతో ఎత్తులోకి ఎక్కాల్సి వస్తుంది. మీ చేతుల్ని అతీతం వైపుకు ఎంతో పైకి ఎత్తాల్సే వస్తుంది. ఆ మాటల్లోని ఏ చిన్న ముక్క అయినా మీ చేతికి అందితే, మీ జీవితం ఇక ఉండదు సమానంగా.

కానీ ఇదెంతో కష్టం. మనం భూమిలోకి పాతుకునిపోయి ఉంటున్నాం. మనం ఉంటున్నాం ప్రగాఢంగా భూమిలోకి వేళ్ళు పాతేసుకున్న వృక్షాలలాగే. కానీ బుద్ధుడు ఉంటున్నాడు ఆకాశంలో రెక్కలు చాచి ఎగురుతున్న పక్షిలా. ఇప్పుడు భూమిలో పాతుకుని ఉన్న ఈ వృక్షాలు, భూమి మూలాలతో ఏ మాత్రమూ సంబంధం లేని, ఆకాశపు మహావ్యాపకాన్ని ఎంతో తెలుసుకుని ఉన్న, ఆ ఆకాశపు అనంతత్వాన్ని గ్రహించి ఉన్న, ఆ ఆకాశంలో విహరిస్తూ ఉన్న ఆ పక్షి సందేశాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఆయనకు ఉంటోంది ఓ విభిన్న అవగాహన. ఓ విభిన్న దర్శనం. మరి ఈ దూరం ఉంటోంది మహా విస్తారంగా.

దేన్ని వ్యక్తీకరించాలని బుద్ధుడు ప్రయత్నిస్తున్నాడో దాని కొన్ని క్షణమాత్ర వీక్షణాలను కేవలం అతికొద్దిమంది మాత్రమే గ్రహించగలుగుతారు. ఓ మహావిలువ ఉన్న ఏ విషయమో మీకు అందింపబడుతూ ఉంది. మీరు అర్థం చేసుకోలేకపోతూ ఉంటే, గుర్తుతెచ్చుకోండి మీరు అర్థం చేసుకోలేరని. చెప్పకండి, ఆ విస్కీ్కత్రాగుతూ ఉండే, నిరంతర ధూమపానాన్ని చేస్తూ ఉండే, పాప్‌కార్న్ నములుతూ ఉండే అమెరికన్ పూజారి చెబుతున్నట్లు, బుద్ధుణ్ణి పిచ్చివాడని. ఆ మాటలను ఉచ్చరించకండి. ఉండండి ఎరుకతో జాగ్రత్తగా. అర్థం చేసుకోవాల్సిన బాధ్యత నుండి తప్పించుకుని

బయటపడి బుద్ధుణ్ణి పిచ్చోడని అనేసుకోవడం మహాసులభంగానే ఉంటుంది. అప్పుడు మీరు ఈ వజ్రచ్ఛేదిక పుస్తకాన్ని ఇక్కడితో మూసేసి ఇంతటితో మరచిపోవచ్చు దీని గురించిన అంతటినీ.

“నాకు అతీతంగా ఉంది ఇది” అని మీరు అన్నారంటే, తక్షణం ఓ సామర్థ్యపు పరీక్ష, ఓ సవాలుగా మీకు ఇది తయారయిపోతుంది. “నేనే పిల్లవాడిగా ఉన్నానేమో, బాల్యావస్థలో అర్థంచేసుకోలేకపోతున్నాను. ఓ అవగాహనలోకి నేను ఎదగాలి. బుద్ధుడు ఎలా ఉంటాడు పిచ్చివాడుగా?” అని మీరు అనుకుంటే అప్పుడు ఉంటుంది మీ సామర్థ్యాన్ని పెంచుకునే సవాలు, మీ పరిణితీ సమరానికి పిలుపు. అప్పటినుంచే మీరు ఎదగడాన్ని ప్రారంభిస్తారు.

ఎప్పుడూ గుర్తుపెట్టుకోండి దీన్ని : నిర్ణయించకండి రెండవవాణ్ణి గురించి. బుద్ధుడికి పిచ్చే ఉన్నా, ఓ సవాలుగానే దాన్ని స్వీకరించండి. దేన్నీ మీరు పోగొట్టుకోరు. ఆయనకు పిచ్చి ఉంటే, మీరు కూడా మీ హద్దులను అతిక్రమించి వెళ్ళి ఆయనను అర్థంచేసుకుంటూ ఉండే ప్రయత్నంలోనే ఉంటారు. ఆయనకు పిచ్చిలేకపోతే, అప్పుడు మీరు ఏ మహావిలువనో సమీపించి కలుసుకుని ఉంటారు. ఓ మహానిధి మీదే మీరు తట్టుకుని పడి ఉంటారు.

సూత్రాలు :

**భగవానుడు అప్పుడు అన్నాడు : ఔను, సుభూతీ... ఎందుకంటే తథాగతుడు భాషించాడు, ప్రత్యేక బుద్ధ ధర్మాలన్నవి ప్రత్యేక బుద్ధ ధర్మాలు కానే కావని. అందువల్లే అవి ప్రత్యేక బుద్ధ ధర్మాలు అనబడుతున్నాయి.**

చూడండి ఇప్పుడు ఈ వైపరీత్యాన్ని - కానీ ఇదుంటోంది మహా ప్రాముఖ్యంగా. ఇదుంటోంది ఎంతో అర్థవంతంగా. ఏమిటి బుద్ధ ధర్మాలు, ఏవి బుద్ధుడి ప్రత్యేక లక్షణాలు? ఆయనకు ఉంటున్న అతిప్రత్యేక లక్షణం ఏ లక్షణాలూ ఆయనలో లేవు అన్నదే, ఆయన అతిసామాన్యంగా ఉంటున్నాడు అన్నదే. ఎదురైతే ఆయనను ఏ మాత్రమూ మీరు గుర్తించలేరనే.

ఆయన దేన్నో నిర్వర్తిస్తున్న మనిషి కాడు. ఆయన రాజకీయపు మనిషి కాడు. ఆయన ఓ నటుడు కాడు. ఏ అహంకారమూ లేదు అయనకు ప్రకటించేందుకు. ఆయన ఉండడంలేదు తన గొప్పతనాన్ని ఎవరికో నమ్మింపజేసే పనిచేస్తూ. అక్కడ ఉంటున్న ఆయన అక్కడ ఉండనే ఉండడు. ఆయన అక్కడ పరోక్షంగా ఉంటాడు.

పరోక్షంగానే ఆయన ప్రత్యక్షం ఉంటుంది. లేనితనమే ఆయన ఉనికితనంగా ఉంటుంది. అందువల్లే ఈ వైపరీత్యపు మాటలన్నీ ఉంటాయి. ఆయన లక్షణం ఏమిటంటే ఆయన జీవిస్తూ ఉంటాడు చచ్చిపోయి ఉన్నవాడిలాగా; ఆయన నడుస్తూ ఉంటాడే కానీ ఆయనలో నడుస్తున్నవాడు ఎవడూ ఉండడు. ఆయన మాట్లాడుతూ ఉంటాడు కానీ ఆయన లోంచి మాట్లాడుతున్నవాడు ఎవడూ ఉండడు... పూర్తి నిశ్శబ్దం అక్కడ ఉంటుంది, ఎప్పుడూ భంగం కాకుండా.

జెన్ మునులు అంటారు బుద్ధుడు ఒక్కమాట కూడా మాట్లాడలేదని. మరి బుద్ధుడు మాట్లాడుతూనే ఉండేవాడు నలభైఅయిదు సంవత్సరాల పర్యంతమూ, నిరంతరంగా. ఆయనకంటే ఎక్కువగా మాట్లాడగలిగేవాడు ఎవడైనా ఉంటే, వాణ్ణి నేనే; తక్కిన ఇంకెవ్వరూ ఆయన్ను మించి మాట్లాడలేరు. మరి నేను అంటున్నాను మీతో. నేను కూడా ఒక్కమాటనైనా ఉచ్ఛరించనే లేదు. జెన్ మనుష్యులు సరైన మాటనే అంటున్నారు. నా అనుభవపూర్వకంగా నేను ఆ జెన్ మనుష్యుల మాటతో ఏకీభవిస్తున్నాను. ఎన్నో విషయాలను మీతో నేను మాట్లాడుతూ ఉంటాను. కానీ నా అంతరపు లోతుల్లో సంపూర్ణ నిశ్శబ్దం ఉంటుంది, నేను అంటున్న మాటల వల్ల ఆ నిశ్శబ్దం ఏ మాత్రమూ కలత చెందదు. నేను మాట్లాడుతున్నప్పుడు నిశ్శబ్దమే అక్కడ ఉంటుంది. ఒక మహాసూక్ష్మ అలజడి కూడా అక్కడ రేగదు.

నేనున్నానిక్కడ, ఓ విధంగా పూర్తిగా ప్రత్యక్షమై, మరోవిధంగా నేనుంటున్నాను పూర్తిగా అంతర్ధానం అయిపోయి, ఎందుకంటే నాలో ఎక్కడా ఏది "నేను" అని అంటుందో అది ఉదయించడం లేదు కనుక. "నేను" అన్న పదాన్ని నేను ఉపయోగించడంలేదని కాదు ఈ మాటకు అర్థం; ఆ 'నేను'ను వాడి తీరాలి, అదుంటుంది ఉపయోగార్ధకంగా – కానీ దానికి ఉండదు ఏ వాస్తవికత. ఇదుంటుంది కేవలం ఉపయోగార్ధంతో, ఓ సౌకర్యంగా, ఓ భాషా వ్యూహంగా, ఏ వాస్తవానికో ప్రతీకగా అది ఉండదు.

నేను "నేను" అని అంటున్నప్పుడు, కేవలం ఆ పదాన్ని నావైపు సూచించుకోవడానికి మాత్రమే నేను ఉపయోగించుకుంటున్నాను. కానీ మీరు నా లోపలికి చూస్తే "నేను" అన్నవాడు ఎవడూ మీకు అక్కడ కనిపించడు. నాకు ఎవ్వడూ అక్కడ కనిపించలేదు. నేను వెతుకుతూనే, వెతుకుతూనే, వెతుకుతూనే చూస్తూ ఉన్నాను. ఎంత ఎక్కువగా నేను పరీక్షించి చూసుకుంటున్నానో అంతంతగా ఆ 'నేను' ఆవిరి అయిపోతూ ఉంటోంది. ఈ 'నేను' ఉంటుంది కేవలం మీ లోపలికి

మీరు చూసుకోకుండా ఉంటున్నప్పుడు మాత్రమే. మీరు చూడకుండా ఉంటున్నప్పుడు మాత్రమే అది ఉంటుంది. ఏ క్షణంలో దాన్ని మీరు చూస్తారో తక్షణమే ఆ 'నేను' మాయమైపోతుంది.

అదుంటుంది ఓ అంధకారం ఉన్న గదిలోకి ఓ దీపాన్ని పట్టుకొచ్చినట్లు. దీపం రాగానే అంధకారం అయిపోతుంది అదృశ్యం. మీ అంతర్దృష్టి ఓ దీపమే, ఓ జ్వాలా శిఖే. ఏ అంధకారమూ మీకు అక్కడ కనిపించదు – మరి మీ 'నేను' కూడా సాంద్రీకృతమై సంక్షిప్తంగా ఉన్న అంధకారం మాత్రమే.

ఓ బుద్ధుడి మౌలిక లక్షణం, బుద్ధ ధర్మం, ఆయన ప్రత్యేక శ్రేష్ఠత, ఆయన ఉండకపోవడమే, ఏ గుణాలూ ఆయనకు ఉండకపోవడమే, ఆయన ఉంటాడు నిర్వచించేందుకు అతీతంగా, ఏ నిర్వచనాన్ని ఆయన గురించి చేసినా అదుంటుంది అనుచితంగానే, ఎందుకంటే ఆ నిర్వచనం వల్ల ఓ వ్యక్తిత్వ లక్షణం అక్కడ తయారయిపోతుంది కనుక, గుర్తించగలగడం సాధ్యపడిపోతుంది కనుక, ఆయనను పరిమితం చేసేస్తుంది కనుక, ఆయన ఉంటాడు అపరిమితంగా. ఆయన ఉంటాడు మహాశూన్యంగా. ఆయన ఎవరూ కానివాడే.

బుద్ధుడు ఎంత సాధారణంగా ఉంటాడంటే మీరు ఆయన ముందుకొచ్చేసినా ఆయన్ని గుర్తించలేకపోయేంత. ఓ రాజును మీరు గుర్తించగలుగుతారు. ఓ రాజును గుర్తుపట్టే భాష మీకు తెలుసు. ఏ భాషతో మీరు ఆయనను గుర్తించగలుగుతారో ఆ భాష ఆ రాజుకు కూడా తెలిసుంటుంది. ఆ భాషకు అందేట్లుగా ఆయన తయారయి ఉంటాడు. అభ్యసించి ఉంటాడు. రాజుగా తనను ప్రత్యేకంగా నిరూపించుకునేందుకు తగ్గట్లుగా ఆయన తయారైపోయి ఉంటాడు. బుద్ధుడి వద్ద అటువంటి ఏ తీరులూ ఉండవు. ఎవరికో తనను నిరూపించుకునే ఏ ప్రయత్నాలనూ ఆయన చేసుకుని ఉండడు. మీరు గుర్తించగలిగేందుకు వీలుకల్పిస్తూ ఆయన ఉండడు. ఎవరో తనను గుర్తించాలన్న అవసరం ఆయనకు ఉండదు. ఆయన వచ్చేసి ఉంటాడు ఇంటికి. ఆయన మీద మీ ధ్యాస ఆయనకు అక్కరలేదు.

జ్ఞప్తిలో ఉంచుకోండి. ధ్యాస ఓ మానసికపు అవసరం. దీన్ని అర్థం చేసుకోవాలి. ఎందుకు కావాలి మనుష్యులకు తమ మీద అంత ధ్యాస? తమనే ఎవరో గమనిస్తూ ఉండాలని ముందుగా ప్రతి ఒక్కరికీ ఎందుకు అనిపిస్తూ ఉంటుంది? ఎందుకనుకుంటారు ప్రతి ఒక్కరూ ప్రత్యేకంగా ఉండాలని? అంతరంలో ఏదో లోపించి ఉంటోంది. మీరెవరో మీకు తెలియడం లేదు. మీ గురించి మీకు తెలుస్తున్నదంతా

మిగిలినవాళ్ళ గుర్తింపువల్ల మాత్రమే. మీ జీవుణ్ణి సాక్షాత్తుగా చూసుకునే వీలు మీకు ఉండడం లేదు. ఇంకొకరి ద్వారానే మీరక్కడికి చేరాల్సి ఉంటోంది.

ఎవరైనా మిమ్మల్ని మంచివాళ్ళని అంటే, సంతోషిస్తూ దాన్ని మీరు తెలుసుకుంటారు. ఎవరైనా మిమ్మల్ని మంచివాళ్ళు కారు అన్నారంటే, దిగులుతో దాన్ని మీరు తెలుసుకుంటారు – కాబట్టి మీరు మంచివాళ్ళు కాదు. ఎవరైనా మిమ్మల్ని అందంగా ఉన్నారని అంటే, మీరుంటారు సంతోషంగా. ఎవరో మిమ్మల్ని వికారంగా ఉన్నారని అంటే మీరుంటారు దుఃఖిస్తూ. మీరెవరో మీకే తెలియడం లేదు. తక్కినవాళ్ళ అభిప్రాయాల మీదే ఆధారపడి మీరు ఉంటున్నారు. అందరి అభిప్రాయాలనూ సేకరించుకుంటూ మీరుంటారు. ఏ స్వంత గుర్తింపూ మీకు లేదు – సూటిగా, తక్షణం, మీ జీవుణ్ణి చూసుకునేందుకు. అందువల్లే ఓ అరువు తెచ్చుకున్న జీవుణ్ణి మీరు పట్టేసుకుంటారు. అందువల్లే మీకు కావాలి మిగిలినవాళ్ళ ధ్యాస.

ఇంకొకళ్ళ ధ్యాస మీ మీద ఉంటే, వాళ్ళు మిమ్మల్ని ప్రేమిస్తూ ఉన్నట్లే మీకు అనుభూతిలో అనిపిస్తూ ఉంటుంది. ఎందుకంటే ప్రేమిస్తూ ఉన్నప్పుడు మనం ఇంకొకరి మీద ఎంతో ధ్యాస పెడతాం కనుక. ఇద్దరు ప్రేమించుకుంటూ ఉంటే వాళ్ళు ఈ మొత్తం ప్రపంచాన్నే మరచిపోతారు. ఇద్దరి జీవుళ్ళూ అప్పుడు కలిసిపోయి ఉంటాయి. ఒకరి జీవుడితో మరొకరి జీవుడు కలిసిపోయి ఉంటాడు, సంపూర్ణంగా. ఆ ప్రేమికులు ఇద్దరూ ఒకరికళ్ళల్లోకి మరొకరు చూసుకుంటారు. ఆ క్షణాలలో వాళ్ళకు సర్వస్వమూ మాయమైపోయి ఉంటుంది. ఏ ఉనికీ ఉండదు. ఆ పవిత్ర క్షణాలలో వాళ్ళిక్కడ ఉండరు. ఎంతో పరమోత్తమ తలంలో, ఎక్కడో ఆకాశంలో, ఏ స్వర్గంలోనో వాళ్ళుంటూ ఒకరి మీద మరొకరు తమ ధ్యాసను గుప్పించేసుకుంటూ ఉంటారు.

ప్రేమ ఉంటుంది ధ్యాసాత్మకంగా – ప్రతి ఒక్కరూ తమ ప్రేమను పోగొట్టుకున్నారు. అతికొద్దిమందికి మాత్రమే ప్రేమ ప్రాప్తిస్తుంది. ఎందుకంటే ప్రేమే దివ్యత్వం కనుక. కోట్లాదిమంది ప్రేమ లేకుండానే జీవిస్తూ ఉంటారు. ఎందుకంటే కోట్లాదిమందికీ దివ్యత్వం ఉండడంలేదు కనుక. ప్రేమ వాళ్ళల్లో లోపించి ఉంటోంది. ఆ లోపాన్ని ఎలా పూరించుకోవడం? ఏ ప్రత్యామ్నాయంతో ఆ లోటును భర్తీ చేసుకోవాలి? అతిసులభమైన ప్రత్యామ్నాయం మనుష్యుల ధ్యాసను తమ మీదికి తెప్పించుకోవడం. అందువల్ల మీరే వెంగళాయిలు కావచ్చు. అందువల్ల మీరే మోసపోవచ్చు అందరూ మిమ్మల్ని ప్రేమిస్తున్నారని అనుకుంటూ.

రాజకీయ నాయకుడికి జరుగుతున్నది అదే. ఆ మనిషి ఓ ప్రధానమంత్రో ఓ దేశానికి రాష్ట్రపతో అయిపోతాడు. అందువల్ల ప్రజలందరి ధ్యాస వాళ్ళ మీద ఉండితీరాలి. అంతేకదా మరి? ఆ మనిషికి మహాసంతోషంగా ఉంటుంది. ఆనందాన్ని పొందే, ప్రేమను పొందుతున్న అనుభూతిని చెందే, ప్రత్యామ్నాయ మార్గం ఇదే. కానీ ఎవ్వరూ ఆ మనిషిని ప్రేమిస్తూ ఉండరు. ఆ స్థానం పోయిన తరువాత ఆ మనిషి ఎక్కడున్నాడో ఎవ్వరూ పట్టించుకోరు.

ఎవరు పట్టించుకుంటున్నారిప్పుడు నిక్సన్‌ను, బ్రతికున్నాడా, పోయాడా - ఎవరు పట్టించుకుంటారు? చనిపోయినప్పుడు మాత్రమే ఆయన గురించి మనకు తెలుస్తుంది. అప్పుడు వార్తాపత్రికలు ఆయన మృతి గురించి ఆయన గురించి ఏదో చెప్పాల్సి వస్తుంది. అప్పుడు ఆయన గురించి మనకు ఉన్నట్లుండి తెలుస్తుంది. "అయితే ఇప్పటిదాకా ఆయన బ్రతికున్నాడన్నమాట". అధికారంలో లేని రాజకీయనాయకులను ఎవరు పట్టించుకుంటారు? అధికారంలో ఉన్నప్పుడు అందరూ ఆయన మీద ధ్యాసను పెడుతూ ఉంటారు. వాళ్ళు ధ్యాసపెడుతూ ఉన్నది ఆ అధికారపు హోదా మీదే. కానీ ఆ రాజకీయనాయకుడు అనుకుంటూ ఉంటాడు అందరి ధ్యాసా తనమీదే ఉంటూ ఉందని.

మరి ఎవరు ప్రేమకోసం అన్వేషిస్తూ ఉన్నారో, ఎవరు ప్రేమించలేక పోతున్నారో, ఎవరు ఎవరి వల్లా ప్రేమింపబడలేకపోతున్నారో వాళ్ళే రాజకీయ నాయకులు. వాళ్ళ అన్వేషణ ప్రేమ కోసమే. ఆ అన్వేషణ ఓ మహా మహాసూక్ష్మమైన మార్పునూ, వక్రతనూ పొంది ఉంటుంది. ఇప్పుడది అయిపోయి ఉంటుంది ధ్యాస కోసం అన్వేషణ. ఆ మనిషి తన ఫోటో ప్రతిరోజూ వార్తాపత్రికలలో కనిపిస్తూ ఉండాలని కోరుకుంటూ ఉంటాడు. ఒక్కరోజు తన ఫోటో వార్తాపత్రికలో కనిపించకపోతే ఆ మనిషికి తనను ఎవరూ పట్టించుకోలేదన్న అనుభూతే కలుగుతుంది.

ఆ మనిషి తన ప్రేమ కోరికనే పండించుకుంటూ ఉంటాడు. కానీ ఆ మార్గంలో ఆ కోరిక తీరదు. ప్రేమ, ఎక్కడెక్కడ అది సంభవించినా, ధ్యాసనే నీడలా తనతోబాటు పట్టుకొస్తుంది. కానీ ధ్యాస ప్రేమను పట్టుకురాదు. ధ్యాస వెయ్యిరకాలుగా మీ మీదికి రావచ్చు. మీరేదయినా ఆకతాయిపని చేసినా అందరిధ్యాసా మీ మీదికి వచ్చేస్తుంది. రాజకీయనాయకుడు వాంఛించే ధ్యాసా, ఓ నేరస్థుడు వాంఛించే ధ్యాసా ఒక్కలాగే ఉంటుంది.

ఓ నేరస్థుడు కూడా ఆ విషయాన్నే కోరుకుంటాడు – ధ్యాసను. ఓ హత్య చేస్తాడు. వెంటనే తన బొమ్మ వార్తాపత్రికల్లోకి వచ్చేస్తుంది, తన పేరు వినిపిస్తుంది రేడియోలో. తను కనిపిస్తాడు టెలివిజన్లో. ఆ మనిషికి ఎంతో సంతోషం కలుగుతుంది. ఇప్పుడు ప్రతి ఒక్కరికీ తనను గురించి తెలుసు. ఇప్పుడు అందరూ తనను గురించే ఆలోచిస్తూ ఉంటారు – తన పేరు ప్రపంచంలో మారుమ్రోగుతోంది. ప్రఖ్యాతి ఉన్నవాడూ, పరమ పాపాత్ముడూ కూడా ఒకే విషయాన్నే అన్వేషిస్తూ ఉంటారు.

బుద్ధుడు ఉంటాడు పరమప్రేమమూర్తిగా. ఉనికి సర్వస్వాన్నీ ఆయన ప్రేమించి ఉంటాడు, ఉనికి సర్వస్వమూ ఆయన్ని ప్రేమించి ఉంటుంది. అదే 'సమాధి' అంటే. సర్వస్వంతో మీరు భావప్రాప్తి పొంది ఉన్న సంబంధం, సంపూర్ణ భావప్రాప్తి అనుభవం ఆయనకు తెలిసి ఉంటుంది – ఆ భావప్రాప్తి శరీరానికీ, మనస్సుకూ సంబంధించినదేకాక ఉనికి సర్వస్వానికీ సంబంధించినదై ఉంటుంది. సంపూర్ణంగా – పాక్షికంగా కాదు. బ్రహ్మానంద పారవశ్యాన్ని ఆయన తెలుసుకుని అనుభవించి ఉంటాడు. ఇప్పుడు ఆయన తన మీద ఎవరి ధ్యాసనూ ఆశించడు.

ఆయన మీ ముందే మీ వీధి లోంచి నడిచివెళ్తూ ఉంటాడు కానీ మీరు ఆయనను గుర్తించలేరు. ఎందుకంటే రాజకీయనాయకులనూ, పోకిరీ నేరస్థులనూ, ఇంకా అటువంటి వాళ్ళను మాత్రమే మీరు గుర్తుపట్టగలుగుతారు కనుక. ఓ పిచ్చివాణ్ణి మీరు ఇట్టే గుర్తుపట్టేయ గలుగుతారు, ఎందుకంటే ఆ మనిషి ఏదో వెర్రిపని చేస్తూ మీకు కనిపిస్తాడు కాబట్టి. ఓ నిశ్శబ్దంగా నడిచివెళ్తున్న బుద్ధుణ్ణి మీరు గుర్తించలేరు. బుద్ధుడు ఎంతో నిశ్శబ్దంగా మీ ముందు నుంచి వెళ్ళిపోతాడు, ఓ గుసగుస కూడా వినిపించదు. అదే బుద్ధుడి ప్రధాన లక్షణం, లేనట్లే ఉండడం. కానీ అది మాత్రమే ఆయన ప్రధాన లక్షణం అయితే – ఉంటూ లేనట్లు ఉండడం– అప్పుడు ఆయనకు ఏ లక్షణాలూ ఉండవు.

అదే బుద్ధుడి మాటలకు అర్థం, బుద్ధుడు ఈ మాటలను అంటూ ఉన్నప్పుడు:

**ఔను, సుభూతీ... ఎందుకంటే తథాగతుడు భాషించాడు,**
**ప్రత్యేక బుద్ధ ధర్మాలన్నవి ప్రత్యేక బుద్ధ ధర్మాలు కానే కావని.**
**అందువల్లే అవి ప్రత్యేక బుద్ధ ధర్మాలు అనబడుతున్నాయి.**

బుద్ధుడి మహా అసాధారణత్వం ఆయనకు ఉన్న మహా సాధారణత్వం మాత్రవే. ఆయన అతిసామాన్యతే ఆయనకు ఉన్న అతిసామాన్యత్వం. అతిసామాన్యంగా ఉండడమే ప్రపంచంలో అత్యంత మహాసాధారణమైన విషయం.

నిన్ననే ఎంతో అందమైన కథ ఒకటి నా దృష్టికి వచ్చింది. ఆ కథ సెయింట్ ఫ్రాన్సిస్‌కు సంబంధించినది. సెయింట్ ఫ్రాన్సిస్ ఓ బుద్ధుడే.

ఆస్సిసీ వాసి అయిన సెయింట్ ఫ్రాన్సిస్ తన మృత్యుశయ్య మీద ఉన్నాడు. ఆయన పాట పాడుతూ ఉన్నాడు. ఎంతో గట్టిగా పాడుతున్నాడు కాబట్టి చుట్టుప్రక్కల ఉన్న అందరు పొరుగువాళ్ళకూ ఆ విషయం తెలిసిపోయింది. మహా ఆడంబరంగానే ఉండే, కానీ ఎంతో ప్రాముఖ్యత ఉన్న ఫ్రాన్సిస్కన్ క్రైస్తవశాఖా సాంప్రదాయ అర్చక సమూహంలో సభ్యుడైన బ్రదర్ ఎలియాస్ ఆయన సమీపానికి వచ్చి "ఫాదర్, మీ కిటికీకి ఆవల వీధిలో ఎందరో మనుష్యులు వచ్చి నిలబడి ఉన్నారు" అని మెల్లగా చెప్పాడు. ఎంతోమంది అక్కడికి వచ్చేసి బయటే నిలబడి ఉన్నారు. అందరూ భయపడుతూ ఉన్నారు మృత్యుక్షణాలు ఆయన మీద పడిపోబోతున్నాయని. అమితంగా ఆయన్ని ప్రేమించే అందరూ అక్కడ ఉన్నారు.

బ్రదర్ ఇలియాస్ అన్నాడు "మీ పాట ఎవరికీ వినిపించకుండా నిరోధించేందుకు మేము చేస్తున్న ప్రయత్నాలన్నీ వృధా అయిపోయాయి. ఎంతో ఆందోళన పడుతూ ఉన్నాం. ఇలా నిస్సంకోచంగా ఈ వేళప్పుడు రాత్రిపూట ఇంత గట్టిగా పాడుతూ ఉంటే అర్చక సమాఖ్యకు మీ వల్ల ఎంతో అసౌకర్యమూ, ఇబ్బందీ కలుగవచ్చు. ఫాదర్, మహాయోగ్యతతో పరమోత్తమ స్థానాన్ని ఆర్జించుకున్న మీ ఖ్యాతికి ఇందువల్ల ఓ కళంకం కూడా ప్రాప్తించవచ్చు. బహుశా మీ అతి వల్ల మిమ్మల్ని మహాసన్యాసిగా గౌరవిస్తూ, కీర్తిస్తూ ఉన్న ఆ భక్తసందోహాల పట్ల మీకు ఉండాల్సిన కారుణ్య నిరతిని, సేవాతత్పరత్వాన్ని తమరు కొంచెం విస్మరిస్తున్నారేమో, మీరు ప్రశాంతంగా చచ్చిపోతే వాళ్ళకు మరింత ఎక్కువగా ఉపదేశాత్మకం గానూ, మరింత ఎక్కువ క్రైస్తవ ఘనత గానూ ఉంటుందేమో?"

"నన్ను క్షమించు బ్రదర్" సెయింట్ ఫ్రాన్సిస్ అన్నాడు, "నా హృదయంలో పొంగుతున్న ఆనందాన్ని భరించలేక, ఆపుకోలేకపోతున్నాను. నేను పాడే తీరాలి."

ఆయన అలా పాడుతూనే పరమపదించాడు. యావత్‌క్రైస్తవచరిత్రలో పాడుతూ ప్రాణాలను వదిలిపెట్టిన ఏకైక మానవుడు ఆయనే. ఎంతోమంది జెన్ మనుష్యులు పాటలు పాడుతూ మరణించారు. కానీ వాళ్ళెవ్వరూ క్రైస్తవానికి చెందినవాళ్ళు కారు. క్రైస్తవుల్లోని ఏకైక జెన్ మాస్టర్ ఆయన మాత్రమే. క్రైస్తవ మర్యాదనూ, ఘనతనూ ఆయన ఏ మాత్రమూ పట్టించుకోలేదు.

ఇప్పుడు ఏం జరిగింది? ఈ బ్రదర్ ఇలియాస్ సెయింట్ ఫ్రాన్సిస్‌ను ఓ సన్యాసిగా నిరూపించాలనుకున్నాడు. ఆయనను ప్రజలిప్పుడు ఓ సన్యాసే కాదు అనేస్తారేమోనని భయపడి పోతున్నాడు; వాళ్ళు ఆయనకు పిచ్చో, మరేదో పట్టిపోయాడని నుకుంటున్నారేమో? ఓ సన్యాసి నిర్వచనం ప్రకారం ఎప్పుడూ విచారంతోనే ఉండాలి. విచారంగా ఉంటున్న సన్యాసులనే క్రైస్తవులు విశ్వసిస్తారు. జీసస్‌క్రైస్ట్ ఎప్పుడైనా నవ్వి ఉంటాడంటే క్రైస్తవులు విశ్వసించలేరు; నవ్వడం, నవ్వుతూ ఉండడం ఓ క్రైస్తవ మర్యాద కాదు. నవ్వడమా? – ఎంత మానవికం? ఎంత సాధారణం? వాళ్ళకు ఒక్క విషయం మాత్రం తెలుసు, మానవత్వానికి ఎంతో ఎత్తులో జీసస్‌క్రైస్ట్‌ను నిలబెట్టాలి – కానీ అప్పుడు ఆయనలో ఉన్న అన్ని మానవ లక్షణాలనూ తొలగించెయ్యాల్సి వస్తుంది. అప్పుడు ఆయన ఓ మృత, నెత్తురులేని వస్తువు అయిపోతాడు.

ఈ ఎలియాస్ బ్రదర్ ఎంతో ఆందోళన పడిపోయాడు. ఇదే ఆఖరిక్షణం. సెయింట్ ఫ్రాన్సిస్ చచ్చిపోబోతున్నాడు, ఓ అప్రతిష్ఠను మిగుల్చుకుని, ఓ చెడ్డపేరును తెచ్చుకుని ఆయన వెళ్ళిపోతాడు. ప్రజలందరూ అనుకుంటారు ఆయన సన్యాసి కాదనీ లేదా ఓ పిచ్చివాడేనని. ఓ సన్యాసిగా సెయింట్ ఫ్రాన్సిస్‌ను నిరూపించాలనుకుంటున్నందువల్లే అంత ఆందోళన ఎలియాస్ బ్రదర్‌కు. నిజానికి ఆ ఆందోళన సెయింట్ ఫ్రాన్సిస్‌కు అప్రతిష్ఠ వచ్చేస్తుందని కాదు. ఆ బ్రదర్ ఆందోళన అంతా తన కోసమే, తన పూజారుల సమూహం కోసమే. “ఈయన పోయిన తరువాత ఎన్నో ఇబ్బందులు ఏర్పడవచ్చు. ఇంతమంది ప్రజలకు ఏం సమాధానం ఇచ్చుకోవాలి? ‘ఆఖరి క్షణాలలో ఏం జరిగింది?’ అని అందరూ ప్రశ్నలు అడుగుతూ ఉంటే వాళ్ళకంతా ఏం చెప్పుకోవాలి?” తన గురించే ఎలియాస్ ఆందోళన పడుతున్నాడు. గురువు పిచ్చివాడయితే మరి శిష్యుడి సంగతేమిటి? ఎలియాస్ కూడా శిష్యుడే.

కానీ చూడండి రెండు విభిన్న తలాలను, రెండు విభిన్న పరిధులనూ దర్శించండి. ప్రజావాక్యం గురించే ఎలియాస్ పట్టించుకుంటున్నాడు. తన గురువును ఓ మహాసన్యాసిగా నిరూపించాలని అనుకుంటున్నాడు. ఆయనను ఓ మహాసన్యాసిగా నిరూపించేందుకు ఎలియాస్‌కు ఒకే ఒక మార్గం మాత్రం తెలుసు – ఆయన ఉండాలి గంభీరంగా, ఆయన తన జీవితాన్ని గంభీరంగానే స్వీకరించాలి, ఆయన నవ్వకూడదు, పాటలు పాడకూడదు, నాట్యాలు చెయ్యకూడదు. అవన్నీ మామూలు మనుషుల నైజాలు. మామూలు మర్త్యుల్ని క్షమించవచ్చు, కానీ సెయింట్ ఫ్రాన్సిస్‌లాంటి మహోత్తముడు మాత్రం క్షమార్హుడు కాదు.

కానీ సెయింట్ ఫ్రాన్సిస్‌కు ఉంది ఓ విభిన్న దృక్పథపు దర్శనం – ఆయన సాధారణ మనిషి. ఆయన అంటాడు "దయచేసి నన్ను క్షమించు, బ్రదర్, కానీ నాలో పట్టలేని ఆనందం హృదయం లోంచి పొంగుకొస్తోంది, తాళలేకపోతున్నాను. నా వల్ల కాదు, నేను పాడితీరాల్సిందే!" వాస్తవంలో, అక్కడ సెయింట్ ఫ్రాన్సిస్ పాడుతూ ఉండడు. ఫ్రాన్సిస్సే అయిపోయి ఉంటాడు గీతంగా. అందువల్లే ఆయనేమీ చేయలేకపోయాడు. స్వవశుడు కాలేకపోయాడు. పారవశ్యం లోంచి వెనక్కు తీసుకొచ్చేందుకు ఆయనలో మనిషి లేడు. ఓ గీతం అక్కడ వినబడుతూ ఉంటే ఆ గీతాలాపనే అక్కడ జరుగుతూ ఉంటోంది. ఎవరి స్వాధీనం లోనూ లేదు అది. ఉండదు కూడా. ఎందుకంటే శాసకుడు అదృశ్యం అయిపోయాడు కనుక. ఆ నేను, అహంకారం అప్పటికే వెళ్ళిపోయింది. లేదు ఉనికితో. ఓ వ్యక్తిగా సెయింట్ ఫ్రాన్సిస్ అప్పుడు లేడు. ఓ మహానిశ్శబ్దం మాత్రమే లోపల ఉంది. ఆ నిశ్శబ్దం లోంచే ఈ గీతం ఉద్భవించింది. సెయింట్ ఫ్రాన్సిస్ ఏం చెయ్యగలుగుతాడు? అందువల్లే ఆయన అన్నాడు "నా వల్ల కాదు. నేను పాడే తీరాలి!"

పాడుతూనే ఆయన పరమపదించాడు. అంతకుమించిన ఉత్తమ మరణం మరొకటి ఉండదు. మీరు పాటపాడుతూ మరణించగలిగితే అదే ఋజువు పాటగానే మీరు జీవించారని, మీ జీవితం ఆనందభరితమేనని, మీ మృతి ఆ ఆనందపు పరాకాష్ట అని, ఆనందపు ఆఖరి ఎల్ల అని.

సెయింట్ ఫ్రాన్సిస్ ఓ బుద్ధుడు : బుద్ధత్వ లక్షణం అతిసాధారణత్వమే. ఆయన ఉంటాడు సాధారణంగా. తను ఎలా ఉండాలన్న ఏ ఊహలూ ఉండవు ఆయనలో. ఆయన ఉంటాడు సద్యఃవర్తనుడై, సద్యఃవ్యక్తుడై. అప్పుడు ఏం జరిగినా అదే జరుగుతుంది. తక్షణప్రేరిత జీవనుడై ఆయన ఉంటాడు. అదే ఆయన ప్రామాణికత. అదే ఆయన లక్షణమని మీరు చెప్పుకోవచ్చును, కానీ అదేం రకపు లక్షణం? ఏ లక్షణాలూ ఆయనలో లేవన్నదే ఆ లక్షణం. ఏ వ్యక్తిత్వమూ లేకపోవడమే ఆయన వ్యక్తిత్వం. వ్యక్తిత్వపు ఏ బిగువుల బంధమూ ఆయనకు ఉండదు. ఏ రక్షణలూ ఆయనకు ఉండవు. గతప్రేరితకర్ముడై ఆయన ఉండడు. ఏ క్రైస్తవపు ఘనతలూ, మర్యాదలూ ఆయనకు తెలియవు. ఈ క్షణంలో పసిపాపలా ఆయన జీవిస్తూ ఉంటాడు.

> ***ఔను, సుభూతీ... ఎందుకంటే తథాగతుడు భాషించాడు,***
> ***ప్రత్యేక బుద్ధ ధర్మాలన్నవి ప్రత్యేక బుద్ధ ధర్మాలు కానే కావని.***
> ***అందువల్లే అవి ప్రత్యేక బుద్ధ ధర్మాలు అనబడుతున్నాయి.***

సాధారణత్వమే ఆయనకున్న అసాధారణత్వం. ఎవరూ కాకుండా ఉండడమే ఆయనకున్న ఎవరో అయి ఉండేతత్వం. అక్కడ ఆయన ఉండకపోవడమే అక్కడ ఆయన ఉంటూ ఉండడం. మృత్యువే ఆయన జీవితం.

> **భగవానుడు అడిగాడు : నువ్వేమనుకుంటున్నావు, సుభూతీ,**
> **ఏటివిజేతకు అనిపిస్తుందా 'ఏరుదాటిన ఫలం నాకు ప్రాప్తించింది' అని?**
> **సుభూతి బదులు పలికాడు : అనిపించదు, ఓ భగవాన్, మరి ఎందుకు?**
> **ఎందుకంటే, ఏ ధర్మాన్నీ ఆ మనిషి పొందలేదు కనుక.**
> **అందువల్లే ఆ మనిషి ఏటివిజేత అనబడుతున్నాడు. ఏ దృశ్యవస్తువూ పొందబడలేదు, ఏ శబ్ద విశేషాలూ, ఏ గంధ విశేషాలూ, ఏ రుచి విశేషాలూ, ఏ స్పర్శా వస్తువులూ, ఏ మనోధర్మాలూ పొందబడలేదు. అందువల్లే ఆ మనిషి ఏటివిజేత అనబడుతున్నాడు.**
> **ఒకవేళ, ఓ భగవాన్, ఆ ఏటివిజేతకు 'ఏరుదాటిన ఫలం నాకు ప్రాప్తించింది' అని అనిపించి ఉంటే, అలా అనిపించడం ఓ 'నేను'ను, ఓ 'జీవి'ని, ఓ 'ఆత్మ'ను, ఓ 'వ్యక్తి'ని మళ్ళీ లాక్కుని తెచ్చేసుకోవడమే అయిపోతుంది కాబట్టీ...**

బుద్ధుడు ఓ సాధకుడి నాలుగుస్థాయిల గురించి చెప్పాడు. మొదటిస్థాయి సాధకుణ్ణి ఆయన 'ఏటివిజేత' అన్నాడు. 'ఏటివిజేత' అంటే బుద్ధక్షేత్రంలోకి చేరుకున్నవాడు, బౌద్ధ దీక్షను స్వీకరించినవాడు. ఓ బుద్ధసన్యాసి అయినవాడు. ఎందుకు అంటున్నారు ఆ మనిషిని 'ఏటివిజేత' అని? – ఎందుకంటే ఒడ్డు మీదే నిలబడి ఆ మనిషి ఉండిపోవడంలేదు కనుక. ఆ మనిషి ఉండడంలేదు స్తబ్ధంగా. జీవిత ప్రవాహంతోబాటుగా ప్రవహిస్తూ ఆ మనిషి ఉంటున్నాడు. ప్రవహిస్తున్న ప్రవాహంతో, నదితో, ఆ మనిషి యుద్ధం చెయ్యడాన్ని మానేసి ఉన్నాడు. నదితో యుద్ధం చేయాలన్న, ప్రవాహానికి ఎదురీదాలన్న ప్రయత్నాన్ని ఏది ప్రేరేపిస్తుందో ఆ అహంకారం ఆ మనిషిలో ఇప్పుడు ఉండడం లేదు.

ఇప్పుడు మళ్ళీ మీకు అనిపిస్తుంది ఇది అసంగతంగా ఉంటోందని. ప్రవాహమే గెలిచింది. అందువల్లే ఆ మనిషిని 'ఏటివిజేత' అంటున్నారు. తన అన్ని సంఘర్షణలనూ ఆ మనిషి వదిలిపెట్టేశాడు. లొంగిపోయాడు. అందువల్లే విజయుడు అయ్యాడు. అందువల్లే ఆ మనిషి ఏటివిజేత అయ్యాడు. వింతమాటలు. ముందుగా ఆ మనిషి ప్రవాహాన్ని జయించే ప్రయత్నాన్నే చేశాడు. ప్రపంచంలో అందరూ చేస్తున్న

కార్యం అదే – స్వీయవాంఛలూ, ప్రణాళికలూ, ప్రసారిత లక్ష్యాలూ ఈడేరేందుకు తగ్గట్లుగా ఉన్న జీవితాన్ని గడిపేందుకు ప్రయత్నించడం, తామే కలలతో, కోరికలతో సృష్టించుకున్న ఓ విధానాన్ని జీవితం మీద విధించుకోవడం. ప్రతి ఒక్కరూ ఏటికి ఎదురీదే ప్రయత్నాన్నే చేస్తూ ఉంటారు, ప్రతి ఒక్కరూ జీవితంతో యుద్ధం చేసే ప్రయత్నాన్నే చేస్తూ ఉంటారు. ప్రకృతితో యుద్ధం. దేవుడితో యుద్ధం. సామాన్య మానవజీవితం మహాసంఘర్షణతో ఉంటున్న ఉద్విగ్న సంగ్రామపు జీవితమే.

కానీ మీరు పోట్లాడుతున్నది ఎవరితో? మీ జీవాధారంతోనే మీరు చేస్తున్నారు యుద్ధం. ఎవరితో మీరు యుద్ధం చేస్తున్నది? మీతోనే. ఆ యుద్ధం మిమ్మల్ని మరింత లోతుల్లోకే తీసుకుపోతూ భంగపాటునే మీకు కలిగిస్తుంది. ఎందుకంటే మీరు విజయులు కాలేరు కనుక, అది కాదు విజయాన్ని సాధించే పద్ధతి. తప్పకుండా మీరు పరాజితులే అవుతారు. ఎందుకంటే మీరు కేవలం ఓ అంశం మాత్రమే కాబట్టి, ఉనికి సర్వస్వం మహాపరివ్యాప్తం, మహాఅనంతం కాబట్టి. సర్వస్వాన్ని ఎదిరించి మీరు గెలవలేరు. సర్వస్వంతో కలిసి ఉంటేనే మీరు గెలవగలుగుతారు.

దాంతో యుద్ధం చేసి మీరు గెలవలేరు. దాంతోబాటే సాగుతూ దాన్ని మీరు గెలవొచ్చు. సర్వస్వం మిమ్మల్ని సమర్ధిస్తే, మీరు విజయులు కాగలుగుతారు. సర్వస్వం మిమ్మల్ని సమర్ధించకపోతే, ఎంత విశ్వాసం మీకున్నా మీరు పరాజితులే అయిపోతారు. కాలమే జవాబు చెబుతుంది. త్వరలోనే లేదా కాస్త ఆలస్యంగా అయినా, మీరు అలసిపోయే తీరుతారు, భంగపడే తీరుతారు, యుద్ధం వల్ల అలసిపోయే తీరుతారు, ఆ తరువాత మీరు కూలిపోతారు – కానీ మీరు కూలిపోయేది ఓడిపోయి మాత్రమే. మరి ఆ అపజయంతో ఉండదు ఆనందం. ఎలా ఉంటుంది ఆనందం అపజయంతో? వివేకం ఉన్న మానవులకు పరాజయాన్ని పొందక మునుపే ఆ ప్రజ్ఞ ప్రాప్తిస్తుంది. లొంగిపోగలిగితేనే అప్పుడు అక్కడ ఉంటుంది ఆనందం.

లొంగుబాటూ, పరాజయామూ ఉంటాయి అత్యంత విభిన్నంగా, అయినా ఎంతో పోలికతో. ఓడిపోయినవాడికి కూడా లొంగిపోయినట్లే ఉంటుంది, లొంగిపోయినవాడికి కూడా ఓడిపోయినట్లే ఉంటుంది. కానీ అది పోలిక వరకు మాత్రమే. అది కనిపిస్తూ ఉంటుంది పైపైన మాత్రమే, ఉపరితలం మీద మాత్రమే. కానీ లోపలి ప్రగాఢతలో అదుంటుంది భిన్న ప్రపంచాల వ్యాప్తంతో. ఓడిపోయిన మనిషి కోపంతో ఉంటూ, రేగిపోతూ, భంగపాటు భావంతో ఉంటాడు, అప్పుడు అతనుంటాడు నరకంలో. లొంగిపోయిన మనిషిలో దైన్యం ఉండదు. ఆ మనిషిలో ఉంటుంది ఉల్లాసం, ఆ మనిషి ఉంటాడు బ్రహ్మానందంలో. యుద్ధం చెయ్యడం

నిరర్థకమనీ, ఎటూ పరాజయమే ప్రాప్తిస్తుందనీ ఆ మనిషి అర్థం చేసుకునే ఉంటాడు. 'పోరాడి గెలవడం అసాధ్యం' అని ఆ మనిషికి తెలుసు.

అది ఎలా ఉంటుందంటే నా ఎడమచెయ్యి నా కుడిచేతితో యుద్ధం చేస్తున్నట్లు. అది ఉంటుంది నా చేతివ్రేళ్ళు నా శరీరంతోనే యుద్ధం చేస్తున్నట్లు. ఎలా గెలుస్తాయి ఆ చేతివ్రేళ్ళు? ఆ యుద్ధ ఫలితం పూర్వనిర్ణితమే అయిపోయి ఉంటుంది. వివేకవంతుడు లొంగిపోతాడు. ఆ వివేకి అంటాడు "దేవుడే ఉండనీ, నీ సంకల్పమే నెరవేరనీ, నీ రాజ్యమే ఉండనీ". ఆ వివేకి అంటాడు "నేను ఇకలేను. నాలోంచి ప్రవహించు. నన్నుండనీ ఖాళీ వెదురుగా, వేణువుగా, నీ పాటే నాలోంచి నీ ఇష్టంతోనే సాగనివ్వు. లేదా సాగనివ్వు నిశ్శబ్దాన్ని సొంతంగా నా లోంచి". ఆ మనిషే అయిపోతాడు ఓ ప్రవాహం. ఓ ప్రవాహంతోబాటు ఆ మనిషి కూడా ప్రవహిస్తాడు. ఆ మనిషి ఉంటాడు "జీవిత ప్రవాహం నన్ను స్వంతం చేసుకోనీ. నేను యుద్ధం చెయ్యను. నేను కనీసం దీన్ని ఈదను. నేనుంటాను తేలుతూ, గాలి ఎలా వీస్తూ ఉంటే అలా వెళ్ళిపోతూ ఉంటాను."

జీవితం పట్ల అటువంటి అవగాహనను తెచ్చుకోవడమే ఏటివిజేత కావడం అంటే, కానీ ఇది ఉంటుంది ఓ వింతమాట గానే. 'శరణు జొచ్చడమే విజయాన్ని పొందడం' అని అనబడుతూ ఉంది – ఎందుకంటే పోరు వైఫల్యానికే, పరాజయానికే దారితీస్తుంది కనుక. లొంగిపోవడమే నడిపిస్తుంది గెలుపులోకి, విజయంలోకి.

ఈ జీవితం వైపరీత్యాలమయం. బుద్ధుడు ఏం చెయ్యగలుగుతాడు? జీవితమే వైపరీత్యాలమయం. లొంగిపోతున్నవారే స్వయంగా నిరూపించుకుంటూ ఉంటారు విజయులు తామయ్యామని, పోరాటాలు చేస్తూ ఉన్నవారే ఏదో ఒకనాటికి గ్రహిస్తూ ఉంటారు ఆ పోరాటం వల్లే తమశక్తి నిర్వీర్యం అయిపోయిందని విజయసూచనలు ఎక్కడా కనిపించడమే లేదని.

గుర్తుపెట్టుకోండి, అలెగ్జాండర్ ఓడిపోయాడు, సెయింట్ ఫ్రాన్సిస్ ఓడిపోలేదు. నెపోలియన్ ఓడిపోయాడు, జీసస్ ఓడిపోలేదు. చెంఘిజ్‌ఖానూ, తామర్లేనూ ఓడిపోయారు, బుద్ధుడు ఓడిపోలేదు. వాస్తవ చరిత్ర ఓడిపోయినవాళ్ళ గురించి పట్టించుకోకూడదు – చెంఘిజ్‌ఖాన్ గురించీ, తామర్లేను గురించీ, అలెగ్జాండరు గురించీ. వాస్తవ చరిత్ర గెలిచినవాళ్ళ గురించే మరింత ఎక్కువగా ఆలోచిస్తూ ఉండాలి, బుద్ధుడి గురించీ, జీసస్ గురించీ, ఫ్రాన్సిస్ గురించీ – వీళ్ళే నిజం మనుష్యులు, నిజంగా గెలిచినవాళ్ళు. కానీ వాళ్ళ గెలుపులు వాళ్ళు లొంగిపోయినందువల్లే వచ్చాయి.

ఎందుకండీ, కొంచెం దీన్ని గురించి ఆలోచించండి, కొంచెం ఆలోచించండి ఏ యుద్ధమూ చెయ్యకుండా ఉన్నప్పటి, ప్రవాహంతోబాటు తేలిపోతూ ఉన్నప్పటి, అందం గురించీ, ఆశీర్వాదం గురించి. ఆ నది మిమ్మల్ని సముద్రంలోకి తీసుకువెళ్తుంది, అది సముద్రంలో కలిసేందుకే వెళ్తోంది. అనవసరంగా మీరే ఎంతో రొద చేస్తున్నారు. ఎలాగూ అది ప్రవహిస్తూనే ఉంటోంది. దాంతోబాటే మీరూ పోండి, ఆ సముద్రంలోకే మీరూ చేరుతారు, ఆ సర్వస్వంలోకే మీరూ చేరుతారు, ఆ అనంతంలోకే మీరూ చేరిపోతారు. ఈ సంపూర్ణ శరణ్యాన్నే బుద్ధుడు ఏటివిజేతకు ప్రాప్తిస్తున్న 'ఏరుదాటిన ఫలం' అని అంటున్నాడు.

సాధకుడి రెండవ సాధనాస్థాయి 'సుకృదాగామి (ఒకప్పుడు తిరిగొచ్చినవాడు) స్థాయి' అనీ, మూడవస్థాయి 'అనాగామి (ఎప్పటికీ తిరిగిరానివాడు) స్థాయి' అనీ, నాల్గవస్థాయి 'అర్హతుడి స్థాయి' అనీ చెప్పబడుతోంది. ఏటివిజేత మూడు గొలుసు బంధనాలను తొలగించుకుని ఉంటాడు. మొదటి బంధనం అహంకారం. వ్యక్తిత్వం. ప్రత్యేక ఆత్మ అన్న ఊహ. సహజంగానే అన్ని యుద్ధాలకూ అదే మూలకారణం. రెండవ బంధనం ఆచారక్రమం – నియమాలూ, నిష్టలూ, క్రతువులూ, పూజలు; ఎంతోమంది ధార్మికం మనుష్యులు ఉన్నారు, కానీ నియమాల క్రమాన్నే వాళ్ళు అనుసరిస్తూ ఉంటారు. వాళ్ళకు మతం గురించి ఏమీ తెలియదు. క్రతువు కాదు మతం. ఆచారం కాదు మతం.

మతం అంటే పూర్తిగా విభిన్నం అయిన ఓ జీవిత శైలీవిధానం – ధ్యాస ఉండే జీవితం, ప్రేమ ఉండే జీవితం. కరుణావేశం ఉండే జీవితం. కానీ మీరు ప్రపంచమంతా తిరిగి చూస్తే ఎన్నో కోట్లమంది మానవులు చర్చీలకూ, దేవాలయాలకూ, మసీదులకూ, గురుద్వారాలకూ వెళ్తూ, పూజలు చేస్తూ, ఇదో మరి అదో, ఇంకోటో చేస్తూ కనిపిస్తారు. ఆ పనులన్నీ సాంప్రదాయికమైన ఆచారాలు మాత్రమే. మతం ఉంటుంది ఉనికితో ఉండక.

ఓ ప్రాచీన భారతదేశపు కథను నేను విన్నాను :

ఓ మనిషి మరణించిన తన తండ్రి కోసం సాంప్రదాయక ఆచారక్రమంలో శ్రాద్ధకర్మ జరిపిస్తూ ఉన్నాడు. 'శ్రాద్ధకర్మ' అంటే ఎవరి తండ్రి అయినా మరణిస్తే ఆ మనిషి యాత్ర కోసం, ఆ మనిషి కోసం మీరు చేసే ప్రార్థన.

ఆ శ్రాద్ధకర్మ జరుగుతూ ఉన్నప్పుడు ఆ ఇంటి పెంపుడుకుక్క ఆ పూజ జరుగుతున్న గదిలోకి వచ్చేసింది. ఆ శ్రాద్ధకర్మకు విఘ్నం ఏర్పడుతుందేమోనని

భయపడి ఆ మనిషి వెంటనే లేచి ఆ కుక్కను బయటికి లాక్కెళ్ళి వరండాలో ఓ స్తంభానికి కట్టేశాడు.

కొన్నేళ్ళు అయిపోయిన తరువాత ఆ మనిషి చచ్చిపోయాడు.ఆ మనిషి కుమారుడు ఇప్పుడు తన తండ్రికి ఉత్తరక్రియలు – శ్రాద్ధకర్మ జరిపిస్తున్నాడు. ఆ శ్రాద్ధకర్మ కచ్చితంగా అదే క్రమంలో జరిగితీరాలని అనుకుంటున్నాడు కాబట్టి ఆ కుమారుడు వీధిలోకి వెళ్ళి ఓ ఊరకుక్కను వెతికిపట్టుకుని తీసుకొచ్చి వరండాలో స్తంభానికి కట్టేశాడు, తన తండ్రి ఇదివరకు ఎలా చేశాడో, సరిగ్గా అలాగే. ఏ పొరబాటూ జరగకూడదు కాబట్టి. కుక్కను అక్కడ కట్టెయ్యడం ఎంతో ముఖ్యమని ఆ కుమారుడు అనుకున్నాడు. “శ్రాద్ధకర్మ జరుగుతూ ఉన్నప్పుడు మా నాన్న పూజలోంచి లేచి కుక్కను కట్టేసిన తరువాత ఆయన మళ్ళీ వెళ్ళికూర్చుని పూజ పూర్తి చేశాడు”. కాబట్టి ఏ అనాచారమూ తనవల్ల జరగకూడదని అనుకున్నాడు ఆ కుమారుడు. ఆ శ్రాద్ధ కర్మ సక్రమంగా జరిగితీరాలి.

కానీ ఇప్పుడు ఇంట్లో ఓ పెంపుడుకుక్క లేదు కాబట్టి ఆ మనిషి ఓ ఊరకుక్కను వెతికిపట్టుకోవాల్సి వచ్చింది. ఆ కుక్కను పట్టుకుని తీసుకొచ్చి వరండాలో స్తంభానికి కట్టేశాడు. తరువాత శ్రాద్ధకర్మ జరిపించాడు. ఎంతో సంతోషంతో తృప్తిపడ్డాడు. ఆ ఇంట్లో ఆ ఆచారం ఎన్నో శతాబ్దాల నుంచీ సక్రమంగా జరుగుతోంది. వాస్తవంగా, కుక్కను కట్టేసే ఈ పవిత్ర క్రతువు శ్రాద్ధకర్మలో అత్యంత ప్రాముఖ్యం ఉన్న అనుష్ఠానం.

ఆ విధంగానే విషయాలన్నీ గడుస్తూ ఉంటాయి. మనుష్యులు జీవిస్తూ ఉంటారు అచేతనంలో. మీ తండ్రి పూర్వీకులు ఏవో చేస్తూ ఉండేవారు. వాళ్ళ తండ్రులు, వాళ్ళ తండ్రులు ఏవో చేశారు. అందువల్ల ఆ కార్యానికి ఏ పవిత్రపు వెలుగో వచ్చేస్తుంది. అవే పనుల్ని మీరు కూడా చేస్తూ ఉంటారు. ‘ఎందుకు ఆ పనిని చెయ్యాలి, దానికి అర్థం ఏమిటి?’ అని ఆలోచించరు. అర్థాన్ని పట్టించుకోరు ఏ మాత్రమూ.

జీసస్ దేవుణ్ణి అనేవాడు. “నా తండ్రి – అబ్బ” అని. మీరు కూడా దేవుణ్ణి ‘తండ్రి’ అనే అంటున్నారు. కానీ ఆ మాటల్లో ఇప్పుడు అర్థం ఉండడం లేదు. అటువంటి హృదయం మీకు ఉండడంలేదు. మీ పూజ ఉపరితలం మీదే ఉంటోంది. దేవుణ్ణి ఆప్యాయంగా ‘అబ్బా’ అని పిలిచే హృదయం మీకు ఉండడం లేదు. ‘అబ్బ’ అన్న పదంలో ఏ అర్థమూ ఉండదు, కానీ అర్థం మీ హృదయానుభూతిలోనే ఉంటుంది. ఆ అనుభూతి మీ లోపల ఉంటే, అప్పుడు మీరు ఆ మాటను ఉచ్ఛరించాల్సిన అవసరం కూడా ఉండదు. మీ అనుభూతే చాలు. ఆ అనుభూతి మీలో ఉండకపోతే, మీ మాటలన్నీ క్రతువులే అయిపోతాయి.

ఇది నేను విన్నాను :

నాలుగేళ్ళ పాపాయిని పక్కలో పడుకోబెట్టేసిన తరువాత, ఆ తల్లి చేతులు జోడించి ప్రార్థన ప్రారంభించింది. పొరబాటుగా ప్రార్థనకు బదులుగా తను ఎక్కాలు వల్లించేస్తున్నానన్న విషయం స్పృహలోకి వచ్చిన ఆ తల్లి, ఓసారి ఇంటి పైకప్పు మీదికి తలెత్తి చూసి ఓ చిరునవ్వు నవ్వుతూ, "దాన్ని తుడిచెయ్ జీసస్'' అంది. ఆ తరువాత పడుకోబోయేముందు చేసే పడక ప్రార్థనను మొదలుపెట్టింది.

ఆచారక్రమాలు ఆ విధంగానే ఉంటాయి. అవి మీలో ఎదగవు. బలవంతంగా ఎవరో వాటిని మీ మీద విధించి ఉంటారు. దాన్నే మీరు పాటిస్తూనే ఉంటారు. అవి జరుగుతూ ఉంటాయి యాంత్రికంగా.

బుద్ధుడు అంటాడు, కొన్ని విషయాలను ఏటివిజేత వదిలిపెట్టెయ్యాలని. మొదటిది అహంకారం. రెండవది ఆచారాలక్రమం. మూడవది సంశయం, మీ మనస్సులోని కలవరం.

సంశయిస్తూ ఉండే మనస్సు ఎప్పుడూ సౌఖ్యాన్ని పొందదు. సంశయిస్తూ ఉన్న మనస్సు ఎప్పుడూ లొంగిపోదు. సంశయిస్తూ ఉన్న మనస్సు ఎప్పుడూ ఉండదు సంపూర్ణంగా. ఆ మనస్సులో ఒక భాగం ఎప్పుడూ యుద్ధం చేస్తూనే ఉంటుంది. ఒక భాగం 'వద్దు' అంటూ ఉంటుంది 'కాదు' అంటూ ఉంటుంది. సంశయిస్తూ ఉన్న మనస్సు ఎప్పుడూ పూర్తిగా 'కావాలి' అనదు, పూర్తిగా 'ఔను' అని అననే అనదు. ఏటివిజేతకు అటువంటి మనస్సు ఉండకపోవడమే మౌలికలక్షణం - జీవితాన్ని 'కావాలి' అనడమే, ఏ షరతులూ ఉండకుండా 'ఔను' అని అనగలగడమే, అతిసహజంగా 'ఔను' అని అనగలగడమే – ఆ మాట మీ ఉనికి సర్వస్వం లోనూ ఉండాలి. అదే నిజమైన ప్రార్థన. ఆ ప్రార్థన మీలో ఉంటే చాలు. మీరు నిశ్శబ్దంగా కూర్చుని ఉనికి సర్వస్వానికీ 'ఔను' అని అనుభూతితో అనుకోగలిగితే, చాలు - అంతకుమించి మీరేమీ చెయ్యనక్కరలేదు. ఏ క్రతువులూ అక్కరలేదు.

ఈ మూడు విషయాలనూ ఏటివిజేత తప్పకుండా విడిచిపెట్టేసెయ్యాలి. అప్పుడు వస్తుంది రెండవస్థాయి – సుకృదాగామిస్థాయి. 'సుకృదాగామి' అంటే 'చచ్చిపోయి ఇంకొక్కమారు తిరిగివచ్చినవాడు' అని అర్థం. ఆయన ఆశనూ, ఇంద్రియలోలత్వాన్నీ, దుశ్చింతనూ త్యజించెయ్యాలి. అయినా ఆ మనిషి చచ్చిపోయి మళ్ళీ ఇంకొక్కసారి తిరిగివస్తాడు.

మూడవస్థాయి 'అనాగామి' స్థాయి. మళ్ళీ తిరిగిరానివాడు. జీవితాశను ఈ మనిషి విడిచిపెట్టెయ్యాలి. లోకాంతర జీవితాశను కూడా ఈ మనిషి విడిచిపెట్టెయ్యాలి. ఉనికిలో ఉండాలన్న ఆశ ఉండకూడదు. మరి నాల్గవస్థాయి 'అర్హతుడి' స్థాయి. శరీరంలో ఏ మనిషీ ఉండనిస్థాయి. ఎవరూ ఆ మనిషిలో ఉండని స్థాయి. అంతరంలో శూన్యం మాత్రమే ఉండే స్థాయి. ఆ మనిషే బుద్ధుడు కాబోతూ ఉంటాడు.

బుద్ధుడు ఈ నలుగురిని గురించీ సుభూతిని అడిగాడు. బుద్ధుడు అడుగుతున్నాడు

***...ఏటివిజేతకు అనిపిస్తుందా 'ఏరుదాటిన ఫలం నాకు ప్రాప్తించింది' అని?***

ఎంతో సామాన్యంగా ఉన్న, కానీ ఎంతో ప్రాముఖ్యం ఉన్న ప్రశ్న.

***సుభూతి బదులు పలికాడు : అనిపించదు, ఓ భగవాన్, మరి ఎందుకు? ఎందుకంటే, ఏ ధర్మాన్నీ ఆ మనిషి పొందలేదు కనుక.***

"నేను లొంగిపోయాను" అని మీరు చెబుతూ ఉన్నారంటే, అప్పుడు మీరు లొంగిపోలేదనే అర్థం. ఎందుకంటే ఎలా మీరు లొంగిపోగలుగుతారు? ఆ 'మీరే' లొంగిపోవాలి. 'నేను'నే, మీ అహంకారాన్నే మీరు సమర్పించుకోవాల్సి వస్తుంది. "నేను లొంగిపోయాను" అని మీరు చెప్పలేరు. మీరు చేస్తున్న ఓ కర్మగా అది జరిగితే అప్పుడది లొంగిపోవడం, శరణుజొచ్చడం కాదు.

కొంతమంది నా దగ్గరికొచ్చి నన్ను అడుగుతూ ఉంటారు "ఎలా మిమ్మల్ని మేం శరణుజొచ్చాలి?" అని. అప్పుడు నేను చెబుతూ ఉంటాను "మీరు శరణుజొచ్చలేరు. శరణు జొచ్చడానికి 'మీరే' ఉంటున్నారు అభ్యంతరంగా. మీరు దారిలోంచి కాస్త పక్కకు తప్పుకోండి. శరణుజొచ్చడం అదే జరిగిపోతుంది" అని.

'శరణుకోరడం' అన్నది ఏదో చెయ్యడమో, ఏ చెయ్యగలిగే పనో కాదు. అది ఓ కర్మ కాదు. 'శరణువేడడం' అన్నది స్వయంగా పొందుతున్న ఓ అవగాహన మాత్రమే. 'నేను' అన్నది ఎప్పుడూ ఉంటుంది యుద్ధ తలంపుతో. 'నేను' అన్నది యుద్ధ ప్రవృత్తితో ఉండకుండా ఎప్పుడూ ఉండదు, యుద్ధ చింతనవల్లే దాని ఉనికి ఉంటుంది, యుద్ధ ప్రవృత్తితోనే దాని మనుగడ ఉంటుంది. యుద్ధం చెయ్యడం ఇతరులతో కావచ్చు లేదా ఇతరులతో యుద్ధం చెయ్యకుండా ఉన్నప్పుడు, ఆ యుద్ధం

మీతోనే జరుగుతూ ఉంటుంది. మతాలలో మీ సన్యాసులందరూ ఎప్పుడూ చేసుకుంటున్నది అంతా ఇదే. ప్రపంచంలో వాళ్ళు యుద్ధాలు చెయ్యరు. ఎవరితోనూ వాళ్ళు పోట్లాట పెట్టుకోరు. ప్రపంచాన్ని వాళ్ళు త్యజించి ఉంటారు, ఇప్పుడు వాళ్ళు వాళ్ళతోనే స్వయంగా యుద్ధాలు చేసుకుంటూ ఉంటారు.

శరీరం అంటుంది "నాకు ఆకలిగా ఉంది" అని. వాళ్ళు అంటారు "లేదు" అని. ఇదే ఆ యుద్ధం. ఇప్పుడు అహంకారం ఓ కొత్తమార్గంలో తలెత్తుతుంది. అహంకారం అంటుంది "చూడు, నీ శరీరాన్ని నేనెంతో చక్కగా పరిరక్షిస్తూ అదుపులో ఉంచుతున్నాను. నేనే ఈ శరీరానికి యజమానిని. ఈ శరీరమే నాకు బానిస". మీ కళ్ళు అలసిపోయి ఉంటాయి. అవి చెబుతాయి "మాకు నిద్రపోవాలని ఉంది" అని. అయినా మీరంటారు "వీల్లేదు, నిద్రపోకూడదని నేను నిర్ణయించుకున్నాను. రాత్రంతా మేలుకునే ఉంటాను. ఇదే నేను చేస్తున్న ధ్యానం. ఓ ప్రత్యేక ధ్యానాన్నే నేనిప్పుడు చేస్తున్నాను. నేను నిద్రపోలేను". అప్పుడు మీకు బాగుందని అనిపిస్తుంది. ఇప్పుడు ఓ యుద్ధాన్ని మీరు ప్రారంభించేసి ఉంటారు.

మీ శరీరం కొంత సౌఖ్యాన్ని పొందాలనుకుంటూ ఉంటుంది, మీరు శిలల మీద నిద్రపోతారు. మీ శరీరం ఓ చల్లని నీడను కోరుకుంటూ ఉంటుంది. మీరు వెళ్ళి ఎండలో నుంచుంటారు. మీ శరీరం దుస్తుల రక్షణను కోరుకుంటూ ఉంటుంది. మీరు నగ్నంగా చలిలో నిలబడతారు. ఇవే యుద్ధం చేసే పద్ధతులు. ఇప్పుడు యుద్ధం చేసేందుకు ప్రపంచంలేదు కనుక మీరు రెండుగా విభజింపబడిపోతారు.

మీ అహంకారం ఘర్షణ వల్లే జీవిస్తూ ఉంటుంది, ఎటువంటి ఘర్షణ అయినా పరవాలేదు. భర్త భార్యతో పోట్లాడుతూ ఉంటాడు. భార్య భర్తతో పోట్లాడుతూ ఉంటుంది. ఇవన్నీ అహంకారాన్ని పోషించుకునే పద్ధతులే. ఎంత ఎక్కువగా మీరు పోట్లాడుతూ ఉంటారో అంత ఎక్కువగా అహంకారం బలోపేతం అవుతూ ఉంటుంది. అహంకారానికి మహాబలం మీతో మీరే పోట్లాడుకుంటున్నందువల్లే కలుగుతుంది. ఎందుకంటే అదే అతికష్టపు పోట్లాట కాబట్టి. తక్కిన ఇంకెవ్వరినో చంపెయ్యడం ఒక విషయం. మిమ్మల్ని మీరే చంపేసుకోవడం, నెమ్మదిగా, నిరంతరంగా, ఎన్నో ఏళ్ళపాటు కొనసాగించడం ఎంతో కష్టమైన పనే. తాపీగా చేసుకునే ఆత్మహత్యే అది. మరి అందువల్ల మీ అహంకారానికి ఎంతో బావుంటుంది. అందువల్లే సన్యాసులని చెప్పబడుతున్న వాళ్ళల్లో గొప్ప అహంకారాలు ఉంటాయి; అంత గొప్ప

అహంకారాలను దర్శించాలని అనిపిస్తూ ఉంటే, గొప్ప అహంకారాలు ఎలా ఉంటాయో చూద్దామని మీకు అనిపిస్తూ ఉంటే వెళ్ళండి హిమాలయాలకు. అక్కడి గుహల్లో మీకు అవి కనిపిస్తాయి.

శరణుజొచ్చినవాడు ఆ మాట చెప్పుకోలేదు "నేను శరణుజొచ్చాను" అని. శరణు పొందడం జరిగిందని మాత్రమే చెప్పడానికి వీలవుతుంది.

***...అనిపించదు, ఓ భగవాన్, మరి ఎందుకు?***
***ఎందుకంటే, ఏ ధర్మాన్నీ ఆ మనిషి పొందలేదు కనుక.***
***అందువల్లే ఆ మనిషి ఏటివిజేత అనబడుతున్నాడు.***

మీరు మీ 'నేను'ను, అహంకారాన్ని విడిచిపెట్టేశారు కాబట్టి; అందువల్లే మిమ్మల్ని 'శరణుజొచ్చినవాడు' అంటున్నారు. మీరు చెప్పలేరు 'నేను శరణుజొచ్చాను' అని. ఆ మాటను మీరు అన్నారంటే, అసలు విషయాన్ని మీరు పోగొట్టుకున్నారు అన్నమాటే.

***ఏ దృశ్యవస్తువూ పొందబడలేదు, ఏ శబ్ద విశేషాలూ, ఏ గంధ విశేషాలూ,***
***ఏ రుచి విశేషాలూ, ఏ స్పర్శా వస్తువులూ, ఏ మనోధర్మాలూ పొందబడలేదు.***
***అందువల్లే ఆ మనిషి ఏటివిజేత అనబడుతున్నాడు.***

ఆ ఏటివిజేత వస్తువులాంటి దేన్నీ గెలుచుకోలేదు. దేన్నో గెలుచుకోవాలన్న ప్రయత్నాన్ని కాకుండా ఆ మనిషి ఆ గెలుచుకోవాలన్న సంకల్పాన్నే విడిచిపెట్టేశాడు. అందువల్లే ఆ మనిషిని 'ఏటివిజేత' అంటున్నాం. మొత్తం యుద్ధాన్నే ఆ మనిషి విడిచిపెట్టేశాడు, మొత్తం సంగ్రామాన్నే. అప్పటిదాకా అనేక జన్మల పర్యంతమూ చేసిన ఆ సంగ్రామాన్నే. విజేత కావాలన్న ఆశయాన్నే ఆ మనిషి విడిచిపెట్టేశాడు. అందులో ఏ ఉత్సాహమూ అతడిలో ఇప్పుడు లేదు.

ఆ మనిషి దేన్నీ చూపించి మీతో చెప్పలేదు "దీన్ని నేను గెలుచుకున్నాను. చూడండి! ఇదే నా విజయం" అని. ఆ మనిషి తన రాజ్యాన్ని మీకు చూపించలేదు, తను జయించి సంపాదించుకున్న రాజ్యాన్ని. కళ్ళకు కనిపించగల దేన్నీ ఆ మనిషి గెలుచుకోలేదు. దేన్నో గెలుచుకునేందుకు బదులుగా ఆ మనిషి తన అహంకారాన్నే విడిచిపెట్టేసుకున్నాడు. తన అహంకారాన్ని ఆ మనిషి పోగొట్టుకున్నాడు. కానీ అలా తన అహంకారాన్ని కోల్పోవడంలోనే అతడి మహావిజయం ఉంది. కానీ తాను పొందిన విజయాన్ని గురించి ఆ మనిషి చెప్పుకోలేదు.

> *ఒకవేళ, ఓ భగవాన్, ఆ ఏటివిజేతకు 'ఏరుదాటిన ఫలం నాకు ప్రాప్తించింది' అని అనిపించి ఉంటే, అలా అనిపించడం ఓ 'నేను'ను, ఓ 'జీవి'ని, ఓ 'ఆత్మ'ను, ఓ 'వ్యక్తి'ని మళ్ళీ లాక్కుని తెచ్చేసుకోవడమే అయిపోతుంది కాబట్టి...*

ఏ క్షణంలో మీరు "నేను విజయుణ్ణి అయ్యాను; నేను శరణుజొచ్చాను" అని అనుకుంటారో, తక్షణమే ఓ కొత్త 'నేను'ను సృష్టించేసుకుంటారు. మళ్ళీ అక్కడ అహం తయారైపోతుంది. మళ్ళీ మీరు మీ అహంకారపు దార్లలో చూడడాన్ని ప్రారంభించేస్తారు. మళ్ళీ మీరు అహాన్ని గ్రహించేస్తారు.

ఇంగ్లీషుపదం 'PERCEPTION' (గ్రహణం) ఎంతో అందంగా ఉంటుంది. అది Per-cap, Capio అన్న మూలాలలోంచి వచ్చింది. దానికి అర్థం 'పట్టుకొను' అని. 'లాక్కొను' అని. 'దొరకబుచ్చుకొను' అని. 'స్వాధీనం చేసికొను' అని. ఏ క్షణంలో ఏ విధంగా అయినా మీరు అక్కడ ఉన్నారని గ్రహిస్తారో తక్షణమే మళ్ళీ మీరు మీ అహంకారాన్ని ఒడిసి పట్టేసుకుని ఉంటారు, మీ అహంకారం కూడా మళ్ళీ మిమ్మల్ని ఒడిసిపట్టేసుకుని ఉంటుంది, మళ్ళీ మీరు మీ పాత గాడిలోనే పడిపోయి ఉంటారు. మొత్తం విషయమంతా పోతుంది. ఏటివిజేతగా మీరు అప్పుడు ఉండరు.

ఇదే పద్ధతిలో బుద్ధుడు సుకృదాగామి గురించీ, అనాగామి గురించీ సుభూతిని ప్రశ్నించాడు. కానీ ఆ రెండు విషయాలూ ఒక్కటే కాబట్టి నేను సూత్రంలోంచి విడిచిపెట్టేశాను. చివరగా :

> *భగవానుడు అడిగాడు : నువ్వేమనుకుంటున్నావు, సుభూతీ, ఆ అర్హతుడికి అప్పుడు అనిపించి ఉంటుందా 'అర్హత్వం నాకు ప్రాప్తించింది' అని?*
>
> *సుభూతి అన్నాడు : అనిపించి ఉండదు, భగవాన్. మరెందుకు అనిపించి ఉండదు? ఎందుకంటే అర్హతగా చెప్పబడే ఏ ధర్మమూ లేదు కనుక. అర్హతగా ఎంచబడే ఏ ధర్మమూ లేదు కనుకే అర్హత అని చెప్పబడుతూ ఉంది... మరి ఎందుకు? నేనయి ఉన్నాను భగవాన్, తథాగతులవారి భాషణలో శాంతినివాసులలో పరమాగ్రుణ్ణిగా, నేనుంటున్నాను భగవాన్ అర్హతుణ్ణై, వీతరాగుణ్ణై. అయినా నాకు అనిపించడం లేదు భగవాన్ 'నేను అర్హతుణ్ణి, వీతరాగుణ్ణి' అని.*

> ***ఒకవేళ అర్హతుడనన్న భావన నాలో ఏర్పడగలిగే ఉంటే తథాగతులవారు అప్పుడు అని ఉండరు, "సుభూతి, ఈ ఉత్తమ కులపుత్రుడు, శాంతి విహారులలో అగ్రగణ్యుడు, ఎక్కడా విహరించడం లేదు. అందుకే అంటున్నాం ఆయన్ని శాంతి విహారి అని, శాంతి నివాసి అని."***

అతిసామాన్యం, అర్థం చేసుకున్నారంటే, ఆ ఊహ మీకు వచ్చిందంటే. ఆ ఊహ ఏమిటంటే సత్య ప్రపంచంలోకి మీ చరితం ప్రారంభం అయిందంటే, దేన్నీ 'నా స్వంతం', అని చెప్పడానికే వీల్లేదన్నదే. మీరు దేన్నీ మీ స్వంతం అనీ, దేన్ని అయినా మీరు పొందారని గానీ అంటే ఆ మాటలన్నీ అబద్ధాలే అయిపోయి ఉంటాయి.

ఒకప్పుడు ఎవరో బుద్ధుడి వద్దకు వచ్చి "మీరు ముక్తులా?" అని అడిగారు. బుద్ధుడు అన్నాడు – "నేను ఆ మాటను చెప్పలేను, ముక్తుణ్ణయ్యాను కాబట్టి."

ఆ మాటలో ఉన్న అందాన్ని గమనించండి. ఆయన అంటున్నాడు "నేను ఆ మాటను చెప్పలేను, ముక్తుణ్ణయ్యాను కాబట్టి. నేను ఆ మాటను అన్నానంటే, అదే అయిపోతుంది ఓ నిశ్చిత సంజ్ఞ, తత్ప్రాప్తాన్ని నేను పొందనేలేదని". కానీ ఆ మాట చెప్పడంలో ఉన్న కష్టాన్ని కూడా గమనించండి. ఒకవేళ బుద్ధుడు "నేను ముక్తిని పొందలేదు" అన్నాడంటే, అప్పుడు ఆ మాటే అయిపోతుంది ఓ అబద్ధం. "నేను ముక్తిని పొందాను" అని అనాలంటే ఆ మాట చెప్పడమే అయిపోతుంది అసాధ్యం. ఎందుకంటే ఆ ప్రాప్తంలో 'నేను' ఉండదు కనుక. తత్ప్రాప్తం ఎలా ఉంటుందంటే 'నేను' పోయిన తరువాత మాత్రమే అది కాగలుగుతుంది సంభవం. ఎంత కష్టం వచ్చేసి ఉందో చూడండి, భాష ఎలా నిర్వీర్యం అయిపోతుందో గమనించండి.

బుద్ధుడు అడిగాడు :

> ***నువ్వేమనుకుంటున్నావు, సుభూతీ, ఆ అర్హతుడికి అప్పుడు అనిపించి ఉంటుందా 'అర్హత్వం నాకు ప్రాప్తించింది' అని?***

ఇప్పుడు 'అర్హత్వం' అన్నది ఒక స్థితి కాదు. అది ఉండదు ఓ వస్తువులాగా. దాన్ని మీరు పట్టుకోలేరు. దాన్ని మీరు స్వంతం చేసుకోలేరు. దాన్ని మీరు పోగుచేసుకోలేరు. అది ఓ స్వాతంత్ర్యం, స్వంతం చేసుకునే ఓ వస్తువు కాదు. అదో స్వాతంత్ర్యం. మీరు మీ బంధాలను తొలగించుకుంటూపోతూ ఉంటారు. ఏదో

ఒకనాటికి మీ అన్ని బంధాలూ అదృశ్యం అయిపోయి ఉంటాయి. చిట్టచివరి 'నేను' అన్న తలంపు కూడా అదృశ్యం అయిపోయి ఉంటుంది అప్పుడు అక్కడ ఎవడూ ఉండడు. ఆ చైతన్యాన్నే 'అర్హత' అని చెప్పబడుతుంది.

బుద్ధుడు అడుగుతున్నాడు "ఆ అర్హతుడికి అప్పుడు అనిపించి ఉంటుందా 'అర్హత్వం నాకు ప్రాప్తించింది' అని?"

> **సుభూతి అన్నాడు : అనిపించి ఉండదు, భగవాన్. మరెందుకు అనిపించి ఉండదు? ఎందుకంటే అర్హతగా చెప్పబడే ఏ ధర్మమూ లేదు కనుక. అర్హతగా ఎంచబడే ఏ ధర్మమూ లేదు కనుకే అర్హత అని చెప్పబడుతూ ఉంది... మరి ఎందుకు? నేనయి ఉన్నాను భగవాన్, తథాగతులవారి భాషణలో శాంతినివాసులలో పరమాగ్రుణ్ణిగా.**

ఇప్పుడు సుభూతి స్వయంగా తననే ఓ ఉదాహరణగా ఉపయోగించుకుంటున్నాడు. ఆయన అంటున్నాడు "మీరు నన్ను తత్ప్రాప్తిని పొందినవాడిగా చెప్పారు. నేను అర్హతుడనయ్యానని మీరు అన్నారు. మీరు అన్నారు నన్ను ఓ శాంతివిహారి అని". ఇది బుద్ధుడు మాట్లాడే ఓ ప్రత్యేక పద్ధతి. ఆయన అంటున్నాడు అంతరంలో ఎవరూ లేరని – ప్రశాంతంగా నివసిస్తున్నవాడని.

'ప్రశాంతంగా నివసించడం' అంటే అక్కడ ఎవ్వరూ లేరనే, ఎందుకంటే అక్కడ ఎవరైనా ఉంటే శాంతి అసాధ్యం కనుక. అక్కడ ఎవరైనా ఉంటే, ఏ సంక్షోభమో కొనసాగుతూనే ఉంటుంది. ఇల్లు ఎప్పుడు నిశ్శబ్దంగా ఉంటుందంటే, ఇంట్లో ఎవ్వరూ లేనప్పుడే. ఇంట్లో ఏ ఒక్కరు కొంచెం ఉన్నా సంక్షోభమే కొనసాగుతుంది. ఒక్క మనిషి ఇంట్లో ఉన్నా ఆ మనిషి ఇక్కడ తీసి అక్కడ పెడుతూ ఉంటాడు వస్తువుల్ని. ఆ మనిషి ఏదో ఒకటి చేస్తూనే ఉంటాడు. ఆ మనిషి నిద్రపోతూ ఉన్నా ఓ గురకపెడుతూనే ఉంటాడు. ఏదో ఒకటి జరిగే తీరక తప్పదు. ఎప్పుడు అక్కడ ఎవరూ ఉండరో అప్పుడే అక్కడ ఉంటుంది శాంతి.

బుద్ధుడు అంటాడు అర్హతుడి పరిస్థితిని అర్హత్వం అని ఓ శాంతి మాత్రం అక్కడ ఉన్నప్పుడు, ఏ మనిషి కూడా కనిపించకపోయేంతటి మహాశాంతి అక్కడ ఉన్నప్పుడు. "ఇప్పుడు సుభూతీ, నువ్వున్నావు శాంతివాసివై" అని బుద్ధుడు అంటున్నప్పుడు ఆయన మాటకు అర్థం "ఇప్పుడు సుభూతీ, నువ్వు లేనే లేవు" అనే. అదే సమాన అర్థం.

సుభూతి అంటున్నాడు "మీరు అన్నారు సుభూతి 'శాంతినివాసి' అని. మీరు అన్నారు సుభూతి 'అర్హతుడు అయిపోయాడు' అని. మీ మాటలు సత్యమే అయివుండితీరాలి. భగవాన్, మీ మాటలు ఎలా అసత్యాలు అవుతాయి? కానీ నేను చెప్పలేను. ఇది నాకు స్ఫురించదు – 'అర్హతుణ్ణి, వీతరాగుణ్ణి' అని. ఆ ఊహ నాలో కలిగితే, మీ మాట తప్పు అయిపోతుంది. ఓ అర్హతుడిని అన్న భావన నాలో కలిగితే, అప్పుడు అహంకారం రేగిందనే, అప్పుడు 'నేను' గ్రహింపబడిపోయి, మళ్ళీ నేను పాతఉచ్చులోనే చిక్కుకుపోయి ఉంటాను. నేను శాంతినివాసిని అన్న భావన నాలో ఏర్పడితే, ఆ శాంతి అప్పటికే పోయుంటుంది, ఎందుకంటే 'నేను' తిరిగొచ్చేసింది కనుక, నివాసి వెనక్కు తిరిగివచ్చేసి ఉంటాడు". అప్పుడు మీరు శాంతిలో నివసిస్తూ ఉండరు. అప్పుడు తప్పకుండా ఏదో ఒకటి జరిగే తీరక తప్పదు – ఏ దైన్యమో, ఏ స్వప్నమో, ఏ కోరికో, దాంతోబాటే ప్రపంచం, మొత్తం ప్రపంచం ప్రారంభమైపోతుంది.

అహంకారమే ప్రపంచానికి విత్తనం. చిన్న విత్తనంలో ప్రపంచమంతా దాగి ఉంటుంది. 'నేనున్నాను' అని కేవలం అనుకుంటే చాలు, ప్రపంచమంతా తిరిగొచ్చేసి ఉంటుంది, తక్షణం!

సుభూతి అంటున్నాడు :

> **...నాకు అనిపించడం లేదు భగవాన్ 'నేను అర్హతుణ్ణి,**
> **వీతరాగుణ్ణి' అని. ఒకవేళ అర్హతుడనన్న భావన**
> **నాలో ఏర్పడగలిగే ఉంటే తథాగతులవారు అప్పుడు అని ఉండరు,**
> **"సుభూతి, ఈ ఉత్తమ కులపుత్రుడు, శాంతి విహారులలో అగ్రగణ్యుడు,**
> **ఎక్కడా విహరించడం లేదు. అందుకే అంటున్నాం ఆయన్ని**
> **శాంతి విహారి అని, శాంతి నివాసి అని."**

ఎప్పుడు ఒకడు మాయమైపోయాడో, ఎప్పుడు నివాసి ఇకలేడో, అప్పుడే శాంతి ప్రాప్తించి ఉంటుంది.

శూన్యత్వతే బుద్ధ సందేశపు రుచి. ఒకడు తనుండని పరిస్థితిలోకే చేరిపోయి ఉన్నప్పుడు, అతడి అంతర్ధానం మాత్రం అక్కడ మిగిలున్నప్పుడు, ఆ మాట అనేందుకు అక్కడ ఎవ్వడూ లేనప్పుడు, ఎవడూ వచ్చి దాన్ని గురించి మాట్లాడుతూ గొప్పలు చెప్పుకోలేడు.

బుద్ధుణ్ణి అర్థంచేసుకోవడానికి ఉనికి ఉండని జీవుడి స్థితి అనుభవక్షణాల వీక్షణాలు కొన్ని మీకు ఏర్పడి ఉండాలి. భాషాపరంగా మీరు అర్థంచేసుకోవచ్చు. ఆయన ఏం చెబుతున్నాడో, కానీ అందువల్ల ఉండదు ఉపయోగం ఎక్కువగా. ఆ అవగాహన మిమ్మల్ని సుదీర్ఘంగా అందులోకి తీసుకెళ్ళదు. ఉనికి ఉండని క్షణాల వీక్షణానుభవం మీరు పొంది ఉండాలి – అప్పుడే అవి అవుతాయి సాధ్యం.

కొన్ని సమయాల్లో, కేవలం నిశ్శబ్దంగా కూర్చుని ఉన్నప్పుడు, ఏమీ చెయ్యకుండా ఉన్నప్పుడు, సవ్వడి చెయ్యకుండా మౌనంగా ఉన్నప్పుడు, ఓ మంత్రపు అలజడి కూడా మీ ధ్యాసకు భంగం కలిగించకుండా ఉన్నప్పుడు, దేవుడి పేరు మీద కూడా మీ మనస్సు ఉండనప్పుడు, ఏ ప్రత్యేక యోగాసనంలోనైనా మీరుండనప్పుడు, ఏ చింతనా చెయ్యకుండా ఉన్నప్పుడు, ధ్యానం కూడా చెయ్యకుండా ఉన్నప్పుడు – కేవలం సద్దు చెయ్యకుండా మీ గదిలో కూర్చుని ఉన్నప్పుడో, ఓ చెట్టుప్రక్కన లేదా ఏ నదీతీరం లోనో, గడ్డి మీద పడుకుని ఉన్నప్పుడో, తారలను చూస్తూ ఉన్నప్పుడో, కళ్ళుమూసుకుని ఉన్నప్పుడు. కేవలం ఉంటున్నంత మాత్రాన, ఎక్కడికీ పోని శక్తికొలను లాగా ఉన్నప్పుడు – ఆ మీరుండని క్షణాలు మీ వైపుకు రావడం ప్రారంభమవుతాయి. ఓ క్షణంలో మీరున్నారా లేరా అనే అనుభూతి కలుగుతుంది.

ఉండడం మీరుంటారు మహాస్థితంగా, అయినా మీరుండరు. మీరుండరు, కానీ మొదటిసారిగా మీరుంటారు. అప్పుడు అర్థం అవుతుంది మీకు బుద్ధుడి మాటలెందుకు వైపరీత్యాలుగా ఉంటున్నాయో. మీరుండనప్పుడు మాత్రమే మీరుంటారు. మీరు అదృశ్యం అయిపోయినప్పుడే మీ సాక్షాత్కారం ఉంటుంది. మీ అహం మాయమై పోయినప్పుడే మీరుంటారు నిండుగా, సర్వస్వంగా. ఓ బిందువుగా మీరు అదృశ్యమై ఓ సముద్రంగా సాక్షాత్కరిస్తారు. ఓ వైపు మీరు మాయమైపోతూ మరోవైపు ప్రత్యక్షమవుతూ ఉంటారు – మొట్టమొదటిసారిగా.

సంప్రజ్ఞత ఓ మృత్యువూ, పునరుత్థానమూ కూడా. మరి ఆ రెండూ ఏకకాలంలోనే జరుగుతాయి. సద్యఃవర్తమానతతో. ఇప్పుడు ఇక్కడ సంభవిస్తుంది మృత్యువు. ఆ క్షణంలోనే ఏర్పడుతూ పూర్తవుతుంది పునరుత్థానం. కానీ దాన్ని మీరు రుచిచూసి తీరాలి, దాన్ని మీరు ఆస్వాదించాలి. ఇవన్నీ కేవలం మాటలు కావు. ఇవన్నీ కేవలం సిద్ధాంతాలూ, వేదాంతాలూ కావు. ఇవన్నీ ఉనికి సత్యానుభవాలే.

మీ కష్టం నాకు అర్థమవుతుంది. ఎన్నో ప్రశ్నలు వచ్చాయి నా వద్దకు. "మీరు సూఫీల గురించి మాట్లాడుతూ ఉంటే మా హృదయాలు నాట్యాలు చేస్తూ

ఉంటాయి. కానీ ఈ వజ్రచ్ఛేదిక వినబడుతూ ఉంటే మా గుండెలు చెయ్యడం లేదు నృత్యాలు". ఇదుంటోంది పరమోత్తమ తలంలో. ఇదుంటోంది అత్యంత అరుదుగా.

సూఫీలను మీరు అర్థం చేసుకోగలుగుతారు, వాళ్ళుంటారు మీకు మహాసామీప్యంలో. వాళ్ళు మాట్లాడుతూ ఉంటారు ప్రేమ గురించి. కనీసం వాళ్ళ మాటల్లో 'ప్రేమ' అన్న శబ్దం అయినా ఎక్కువగా మీకు వినిపిస్తూ ఉంటుంది. 'ప్రేమ' అంటే ఏమిటో చెప్పే ఎన్నో ఊహలు ఉన్నాయి మీలో. సూఫీల ప్రేమను మీరు అర్థం చేసుకోలేకపోవచ్చు, వాళ్ళ మాటలతో. కానీ ప్రేమ అంటే ఏమిటో కనీసం మీకు కొంత తెలుసు. వాళ్ళ మాటలు కనీసం కొంచెం మీకు అర్థమవుతూ ఉంటుంది. 'ప్రేమ' అనే మాట వినిపించిన తక్షణం మీ హృదయం కరిగిపోవడం ప్రారంభమైపోతుంది. కానీ ఈ బుద్ధుడు అంటున్న మాటలు మరెంతో ఉన్నతంగా ఉంటున్నాయి.

కానీ అందరికీ ఇదే విధంగా ఉండదు : కొన్ని ప్రశ్నలు వచ్చాయి నా దగ్గరికి. ఆ మనుష్యులు పులకించిపోతున్నారట. అదుంటుంది మీ మీదే ఆధారపడి. కావాలంటే ప్రసాద్‌ను మీరు అడగొచ్చు. వజ్రచ్ఛేదికను వింటున్నప్పుడు దాదాపుగా గుండె ఆగిపోయేంతగా ఆయన హృదయం నాట్యంచేస్తూ ఉందట. లేకపోతే మీరు ప్రదీపానయినా అడగవచ్చు.

ఒక్క విషయాన్ని గుర్తుపెట్టుకోండి : ఇక్కడ నేను ఎంతోమంది కోసం మాట్లాడుతూ ఉంటున్నాను. అందరూ ఉంటారు విభిన్నంగా. వాళ్ళు విషయాలను సమీపించే తీరు విభిన్నంగా ఉండవచ్చు. కొన్నిసార్లు మీకు ఇవి వర్తించవచ్చు. కొన్నిసార్లు మీకు ఇవి వర్తించకపోవచ్చు. ఇవి మీకు వర్తించకుండా ఉన్నప్పుడు ఓర్పుపట్టే మీరు ఉండితీరాలి. ఎందుకంటే మీకు ఇవి వర్తించినప్పుడు, మరొకరికి ఇవి వర్తించకపోవచ్చు కాబట్టి. అప్పుడు వాళ్ళు ఓపిక పట్టాల్సి ఉంటుంది. నేను ఎంతోమంది కోసం మాట్లాడుతూ ఉంటున్నాను – మరి నేను మీతో, మీకోసం మాత్రమేకాక, ఇక్కడ ఇప్పుడు లేని తక్కిన కోట్లాదిమంది కోసం కూడా మాట్లాడుతూ ఉన్నాను, అవి ఎవరికి వినపడితే వాళ్ళకు అర్థమవుతుందో వాళ్ళకోసం కూడా.

కొన్నిసార్లు మీకు ఇవి అర్థం కాకపోయినా, మీకు వర్తించేట్లు ఇవి ఉండకపోయినా, ఉండండి ఓర్పుతో. వినండి. మీ హృదయం నాట్యం చేస్తూ ఉండకపోవచ్చు. ఈ మాటలు మీ హృదయంకంటే ఉత్తమంగానో, మీ హృదయం కంటే ప్రగాఢంగానో ఉండవచ్చు.

ఇవన్నీ శిరస్సుకు సంబంధించిన విషయాలు, హృదయానికి సంబంధించిన విషయాలు ఉంటాయి, హృదయంకంటే అతీతంగా ఉన్న విషయాలు కూడా ఉంటాయి. ఇవే ఆ అతీతపు విషయాలు. ఈ అతీతం ఉంటుంది ఎంతో కష్టంగా. మీకు శిరస్సుకు సంబంధించిన విషయాలు కొన్ని తెలుసు. హృదయానికి సంబంధించిన విషయాలు కూడా కొన్ని తెలుసు మీకు. కానీ అతీతం గురించి మీకు తెలిసింది శూన్యం.

కానీ ఈ మాటలు ఉంటున్నాయి అత్యంత అరుదువై. ఈ వజ్రచ్ఛేదికా సూత్రం ఓ వజ్రం, ప్రపంచ సాహిత్యంలో అత్యంత విలువైన వజ్రం. ఆ విధంగా ఎవ్వరూ మాట్లాడలేదు, అంత ఉన్నత తలాలలోకి ఎవ్వరూ విహరించలేదు. అంత ఎత్తుల్లోకి మీరు ఎగరలేకపోవచ్చు అని మీకు అనిపించినా, ముకుళితులు అయిపోకండి మీరు. చెయ్యండి ప్రయత్నాలను. ఇప్పుడు వెళ్ళగలుగుతున్న దానికంటే కొంచెం ఎక్కువ మీరు చేరగలిగినా, అజ్ఞాతంవైపుకు అతికొద్ది అడుగులు మీరు వేయగలిగినా, అవుతారు మీరు సంపద్వంతులు.

ఈ రోజుకు ఇది చాలు.

# 8. ఇల్లు చేరే ఉన్నాం

## మొదటిప్రశ్న :

ప్రియ ఓషో,

*ఎందుకొచ్చారు మహాగురువులందరూ ప్రాచ్యం నుంచే?*

ఎందుకంటే మానవత్వం ఇంకా సంపూర్ణం కాలేదు కనుక. ప్రాచ్యం ఉంటోంది అంతర్ముఖంతో, పాశ్చాత్యం ఉంటోంది బహిర్వ్యాపారంలో. మానవుడు ఉంటున్నాడు విభజింపబడి (Schizophrenic). మనస్సు ఉంటోంది వాస్తవంతో పొంతన లేకుండా, పెక్కులుగా విభజింపబడి. అందువల్లే మహాగురువులందరూ ప్రాచ్యం నుంచీ, మహావైజ్ఞానికు లందరూ పాశ్చాత్యం నుంచీ వచ్చారు. పాశ్చాత్యం వైజ్ఞానికతనే అభివృద్ధి చేస్తూ పూర్తిగా విస్మరించింది అంతరాత్మను; అదుంటోంది పదార్థాన్నే పట్టించుకుంటూ, కానీ అంతర్జీవి ఆంతర్యాన్నీ వ్యక్తిగతజ్ఞానాన్నీ ఏ మాత్రమూ దర్శించకుండా. దృశ్యం మీదే, విషయం మీదే పాశ్చాత్యపు దృష్టి ఉంటుంది. అందువల్లే గొప్పవైజ్ఞానికులందరూ పాశ్చాత్యం లోనే పశ్చిమం లోనే జన్మించారు.

ప్రాచ్యం అంతరాత్మనే ఎక్కువగా పట్టించుకుంటూ విషయపరజ్ఞానాన్నీ, పదార్థాన్నీ, ప్రపంచాన్నీ మరచిపోయింది. మహామతగురువులు ఇందువల్ల పుట్టుకొచ్చారు, కానీ పరిస్థితి ఇప్పుడు సవ్యంగా ఉండడంలేదు, ఈ విధంగా ఉండకూడదు. మానవుడు ఒక్కడు కావాలి. మానవుడు ఉండకూడదు విభజింపబడి. ఈ అస్తవ్యస్థత మానవుడి నుంచి పోవాలి. మానవుడు ఉండాలి ప్రవహిస్తూ. మానవుడు అంతర్వ్యాపారిగానూ, బహిర్వ్యాపారిగానూ ఉండకూడదు. అంతర్‌దృష్టితోనూ ఉండకూడదు, బహిర్దృష్టితోనూ ఉండకూడదు. సమగ్ర దర్శనమే మానవుడికి ఉండాలి. అంతరాలూ, బాహ్యాలూ ఏకమైతే, అప్పుడుంటుందది మానవుడికి బ్రహ్మానంద పారవశ్యతతో.

అంతరంలోకి అతిగా మొగ్గని, బాహ్యంలోకి అతిగా వాలని మానవుడే ఉంటాడు సమతుల్యుడుగా. అటువంటి సమవర్తే ఏకకాలంలో వైజ్ఞానికుడిగానూ, మార్మికుడిగానూ ఉండగలుగుతాడు. ఇటువంటిదే తప్పకుండా జరుగుతుంది, జరగబోతుంది. అటువంటి సంభవం కోసం మనం ఓ క్షేత్రాన్ని ప్రస్తుతం నిర్మిస్తూ ఉన్నాం. పాశ్చాత్యుడూ కాని, ప్రాచ్యుడూ కాని మానవుడినే దర్శించాలని నేను ఆకాంక్షిస్తూ ఉన్నాను. ఎందుకంటే పాశ్చాత్యంతో వైరంతో ఉంటున్న ప్రాచ్యుడూ అసహ్యంగానే ఉంటాడు, ప్రాచ్యులతో వైరంతో ఉంటున్న పాశ్చాత్యుడు కూడా వికారిగానే ఉంటాడు. ఈ ప్రపంచం మనది, ఈ ప్రపంచానికే మనం అందరం చెందుతాం. మానవుడు మానవుడిగానే ఉండాలి – సంపూర్ణంగా, సర్వస్వంగా. ఆ సంపూర్ణ సర్వస్వంలోంచే ఓ నవ్య ఆరోగ్యపు స్థితి ఆవిర్భవిస్తుంది.

ప్రాచ్యమూ బాధలు పడింది, పాశ్చాత్యమూ బాధలు పడింది. ప్రాచ్యం బాధలు పడింది : అన్నివైపుల్లోనూ దాన్ని మీరు చూడొచ్చు – దరిద్రం, తిండి కోసం అలమటించడం. పాశ్చాత్యం బాధలు పడింది, పాశ్చాత్యమానసపు లోతుల్ని మీరు దర్శించవచ్చు – ఉద్విగ్నత, ఉత్కంఠ, దిగులు, వ్యధలు. పాశ్చాత్యం ఉంటోంది అంతరంలో పేదగా, ప్రాచ్యం ఉంటోంది బాహ్యంలో పేదగా. పేదరికం చెడ్డది. ఆ పేదరికం బాహ్యంలో ఉన్నా, అంతరంలో ఉన్నా ఏ వ్యత్యాసమూ లేదు పేదరికాన్ని అనుమతించకూడదు. అందరూ ఉండాలి భాగ్యవంతులై, అంతరంలో, బాహ్యంలో, మానవుడి సర్వపరిధులలోనూ భాగ్యమే ఉండాలి.

ఆల్బర్టు ఐన్‌స్టీన్ మరి గౌతమబుద్ధుడు ఇద్దరూ ఒకే వ్యక్తిలో ఉంటే ఆ మానవుణ్ణి గురించి కాస్త ఆలోచించి చూడండి. ఆ సంభవం సాధ్యపడే దిశలో కాస్త ధ్యానించి చూడండి – అది సంభావ్యమే. వాస్తవంలో ఐన్‌స్టీన్ మరికొంతకాలంపాటు జీవించే ఉంటే తప్పకుండా ఆయన ఓ మార్మికుడు కాగలిగి ఉండేవాడు. అంతరాన్ని గురించి ఆయన ఆలోచించడం ప్రారంభించాడు, ఆంతర్యపు రహస్యాలను అన్వేషించాలన్న అభిలాష ఆయనకు ఎంతోఉండేది. బాహ్యరహస్యాల మీదే ఉత్సాహితులై ఎంతకాలం ఉండిపోగలుగుతారు మీరు? రహస్యాలను గ్రహించాలన్న జిజ్ఞాస నిజంగా మీలో ఉంటే త్వరలోనే, కాకపోతే కాస్త ఆలస్యంగానయినా ఆంతర్యంలోకి కూడా మీరు తొట్రుపడి చేరక తప్పదు.

పాశ్చాత్యమూ కాని, ప్రాచ్యమూ కాని, అంతర్వ్యాపారమూ కాని బహిర్వ్యాపారమూ కాని, అంతర్వృత్తీ కాని, బాహ్యవృత్తీ కాని సంపూర్ణపు సమతుల్యపు

ప్రపంచమే నా సంకల్ప ప్రపంచం. ఈ దృక్పథం గతంలో ఎప్పుడూ లేదు. అందువల్లే మీ ఈ ప్రశ్న మహా సంగతాన్ని సంతరించుకుంది.

మీరు అడుగుతున్నారు "ఎందుకొచ్చారు మహాగురువులందరూ ప్రాచ్యం లోంచే?" అని. ఎందుకంటే అంతర్వృత్తే ఓ వ్యసనంగా ప్రాచ్యాన్ని పట్టుకుంది కనుక. బాహ్యాన్ని అది అభిలషించలేదు. అంతరావగాహన గురించే శతాబ్దాల పర్యంతం అంతర్యానాలను చేస్తున్న ప్రాచ్యంలో మీరు ఓ బుద్ధుణ్ణి మాత్రమే, ఓ నాగార్జునుణ్ణి మాత్రమే, ఓ శంకరుణ్ణి మాత్రమే, ఓ కబీరును మాత్రమే సృష్టించుకోగలుగుతారు. అది సహజం.

ఆంతర్యాన్ని పట్టించుకోకుండా బహిర్ వ్యాపారంలోనే, బాహ్యావృత్తిలోనే వ్యసనం పట్టేసిన పాశ్చాత్యం ఓ ఆల్బర్టు ఐన్‌స్టీన్‌ను మాత్రమే, ఓ ఎడ్డింగ్టన్‌ను మాత్రమే, ఓ ఎడిసన్‌ను మాత్రమే సృష్టించుకోగలుగుతుంది. అది సహజం. కానీ మానవాళి సర్వస్వానికి ఇది ఉండదు శ్రేయంగా. ఏ లోపమో అందువల్ల ఏర్పడుతూ ఉంది. అంతరాభివృద్ధి ఏ మాత్రమూ జరగకుండా బాహ్యంలో మాత్రమే ఎదుగుతున్న మనిషి బాహ్యంలో ఉంటాడు బాల్యంలోనే, మూర్ఖుడిగానే. అదే పరిస్థితి, అదే సమాన పరిస్థితే నెలకొని ఉంటుంది బాహ్యంలో ఎంతో ఎదిగిన మనిషిలో; ఎంతో పరిణితి సాధించిన మనిషిలో, గణితపు లెక్కల ప్రకారం, భౌతిక రసాయనిక శాస్త్రాల ప్రకారం, కానీ అంతరంలో ఇంకా జన్మించని మనిషిలో, ఇంకా గర్భంలోనే ఉంటున్న మనిషిలో.

ఇదే మీకు నా సందేశం: ఈ అర్ధగోళాల వ్యవహారాన్ని ఇక వదిలిపెట్టెయ్యండి– ప్రాచ్యాన్నీ, పాశ్చాత్యాన్నీ – ఈ రెండు అర్ధగోళాలనూ ఆంతర్యం, బాహ్యం అన్న ఈ రెండు అర్ధగోళాలనూ విడిచిపెట్టెయ్యండి. తయారవ్వండి ప్రవహిస్తున్న వ్యక్తులుగా. ప్రవహిస్తూ సాగించండి మీ ప్రవాసాన్ని. మీ జీవితంగానే మీరుండండి. బాహ్యానికీ, అంతరానికి కూడా అందుబాటులోనే ఉండండి.

అందువల్లే మీకు నేను ప్రేమనూ, ధ్యానాన్నీ నేర్పిస్తూ ఉంటాను. ప్రేమే బాహ్యంలోకి దారితీసే ప్రవాళిక. ధ్యానమే అంతరంలోకి మిమ్మల్ని చేర్చే ప్రవాళిక. ప్రేమనూ, ధ్యానాన్నీ అందిపుచ్చుకున్న మనిషే ఉంటాడు ఏ ద్వంద్వాలూ ఉండక. షీజోఫ్రెనిక్‌గా ఉండక. ఏ విభజనలూ ఉండక. ఆ మనిషే అయివుంటాడు సంఘటితుడై. ఆ మనిషికే నిజంగా ఉంటుంది ఆత్మ.

## రెండవప్రశ్న :

ప్రియ ఓషో,

మీకు ఉండదా విసుగూ, విసుగూ, విసుగూ, మరి మొహంమొత్తిపోవడమూ, రోజు తరువాత మరో రోజు అవే ప్రశ్నలకు మళ్ళీ సమాధానాలను ఆపకుండా ఇస్తూ ఉంటే, మేమిక్కడ చెవులు మూసేసుకుని, కళ్ళు మూసేసుకుని, ఏ సందేశాన్నీ మీ నుంచి అందుకోకుండానే ఉంటే – ఆ ప్రశ్నలకు సమాధానాలే ఉండవనీ? మీరెప్పుడూ మమ్మల్ని ఆశ్చర్యచకితుల్ని చేసేస్తూనే ఉంటారు ఓ తాజా హిమబిందువులాంటి స్వచ్ఛతతో సుప్రభాత వేళల్లో ఉన్నట్లే. అయినా నేను ఉంటూనే ఉన్నాను అంధురాలినై, చెవిటిదాన్నై, కుంటిదాన్నై మీ జ్యోత్స్న వెలుగుల్ని అప్పుడప్పుడు మాత్రమే అందుకోగలుగుతూ.

మొదటి విషయం. నేను లేను. కాబట్టి చికాకూ, విసుగెత్తడమూ, మొహంమొత్తి పోవడమూ నాకు ఉండవు. ముందుగా మీరు ఉండాలి విసుగు మీకు కలగాలంటే. ఎంతెంత ఎక్కువగా మీరు ఉంటే అంతంత ఎక్కువగా విసుగు కూడా ఉంటుంది. ఎంతెంత తక్కువగా మీరు ఉంటారో అంతంత తక్కువగానే మీ విసుగు ఉంటుంది. అందువల్లే చిన్నపిల్లలకు చికాకూ, విసుగూ పెద్దవాళ్ళకు ఉన్నంత ఉండదు. అదెప్పుడయినా మీరు గమనించారా? చిన్నపిల్లలకు దాదాపుగా చికాకే ఉండదు, విసుగే ఉండదు. వాళ్ళు ఆడుకుంటూ ఉంటారు అవే బొమ్మలతో, వాళ్ళు పరుగులుపెడుతూ ఉంటారు అవే సీతాకోకచిలుకలవెంట, ఏరుకుంటూనే ఉంటారు అవే గవ్వలను, ఆల్చిప్పలను సముద్రతీరంలో. వాళ్ళకు అతితక్కువ విసుగు ఉంటుంది.

ఓ చిన్నపిల్లవాడికి ఎప్పుడైనా ఓ కథ చెప్పారా మీరు? మీరు కథ చెప్పిన తరువాత ఆ పిల్లవాడు మళ్ళీ మిమ్మల్ని అడుగుతాడు 'మళ్ళీ చెప్పు... మళ్ళీ చెప్పు' అని. మీరెప్పుడయినా కనిపిస్తే వాడు మళ్ళీ మిమ్మల్ని పట్టుకుని "ఆ కథ మళ్ళీ చెప్పు. అదెంతో ఇష్టం నాకు" అంటాడు. ఎందుకు రాదు ఆ పిల్లవాడికి విసుగు? – ఎందుకంటే వాడు ఉండడు కనుక. లేదా, ఉన్నా మహామూలప్రాయంగానే ఉంటాడు. అహం ఇంకా ఎదిగి ఉండదు. అహంకారపు ఎదుగుదలే చికాకునూ, విసుగునూ, అసహనాన్నీ సృష్టిస్తుంది.

జంతువులకు విసుగే ఉండదు. వృక్షాలకు విసుగు ఉండదు. ఏ అపురూప లక్షణం ఉంటోంది ఆ జంతువుల్లో, వృక్షాల్లో? ఓ రోజాపొద అవే పువ్వుల్ని సంవత్సరాల

పర్యంతమూ పూయిస్తూ ఉంటుంది. ఓ పక్షి ఒకే పాటను పొద్దస్తమూ ఉదయం పూట, సాయంత్రం పూట పాడుతూనే ఉంటుంది. ఓ కోకిలకు ఉండదు అనేక కూతల సామర్థ్యం, దానికి ఉంటుంది ఒకే కూతస్వరం. ఆ కూతనే కోకిల కుహూకుహూమని కూస్తూనే ఉంటుంది. ఆ కూత ఉంటుంది ఏకస్వరంలోనే. అయినా ఏ జంతువుకూ ఆ కోకిల కూతలు విసుగు తెప్పించవు. ఏ వృక్షమూ విసుగుపొందదు. ప్రకృతికి విసుగే ఉండదు. ఎందువల్ల? - ఎందుకంటే ప్రకృతికి ఇప్పటిదాకా ఏ అహంకారమూ లేదు కనుక.

ఓ బుద్ధుడికి ఉండదు విసుగు, ఓ జీసస్‌కు ఉండదు విసుగు, ఎందుకంటే అహంకారాలను మళ్ళీ వాళ్ళు విడిచిపెట్టేశారు కనుక. ప్రకృతికి ఇంకా ఆ వికాసం రాలేదు. బుద్ధుడు దాన్ని విడిచిపెట్టేశాడు. బుద్ధుడిదీ మరి ప్రకృతిదీ పద్ధతి దాదాపుగా సమానం. 'దాదాపుగా' అని ఎందుకంటున్నానంటే ఒక వ్యత్యాసం మాత్రం ఉంది కనుక - ఎంతో ప్రాముఖ్యత ఉన్న వ్యత్యాసం, కానీ ఉన్న ఏకైక వ్యత్యాసం. ఆ వ్యత్యాసం ఉంటోంది ఎరుకలో - ధ్యాసలో. ప్రకృతి ఉంటోంది అహంలేకుండా, కానీ ధ్యాస కూడా లేకుండానే. బుద్ధుడిలో అహంలేదు కానీ ఉంది ధ్యాస.

ఒక్కసారి మీకు తెలిసిందంటే మీరక్కడ లేరని, ఎవరికి వస్తుంది విసుగు, మొహం మొత్తేది ఎవరికి? అందువల్లే ప్రతి ఉదయాన్నే నేనూ వచ్చేసి మీ అన్ని ప్రశ్నలకూ సమాధానాలను ఇస్తూనే ఉంటాను. నాకు లేదు విసుగు. విసుగు నాకు కలగదు. పాతికేళ్ళ నుంచీ చూడలేదు నేను విసుగు రుచిని. ఆ విసుగు రుచిని ఎప్పుడో నేను మరచిపోయాను, అది ఎలా ఉంటుందో.

రెండవ విషయం. ప్రశ్నలు ఉండవు సమానంగా. అవి అలా ఉండలేవు కూడా - అవి వస్తాయి వేర్వేరు వ్యక్తుల నుండి. ఎలా ఉండగలుగుతాయి అవి అవే ప్రశ్నలుగా? ఔను. అప్పుడప్పుడూ అవే పదాలు ఆ ప్రశ్నల్లోనూ ఉండొచ్చు, కానీ ఆ ప్రశ్నలు ఉంటాయి విభిన్నంగానే. ఇద్దరు మనుషులు ఉంటే ఇద్దరూ ఉంటారు విభిన్నంగానే - ఎలా ప్రశ్నించ గలుగుతారు వాళ్ళు ఒకే విధంగా? వాళ్ళ మాటలు సమానంగానే ఉన్నా, వాళ్ళ మాటల రచన ఒకే విధంగానే ఉన్నా, అవే ప్రశ్నలు అయినా - మీకు గుర్తుచెయ్యాలను కుంటున్నాను - అవి ఉండలేవు సమానంగా.

ఈ ప్రశ్నను ప్రస్తుతం ఆనందశైలా అడుగుతోంది; ఇంకెవ్వరూ ఆ విధంగా ప్రశ్నను అడగలేరు. ఈ ప్రశ్నను ఇంత పెద్ద ప్రపంచం మీద వేరెవ్వరూ అడగలేరు.

ఈ ప్రశ్న ఉండాలంటే ఓ శైలా ఉండితీరాలి. ఒక్క శైలానే ఉంటుంది, చాలామంది శైలాలు ఉండరు.

కాబట్టి గుర్తుపెట్టుకోండి. ప్రతి మనిషికీ ఉంటుంది ఓ విభిన్న ప్రత్యేకత. ఈ ప్రశ్నలన్నీ సమానమే అంటే ఆ ప్రశ్నలను అవమానించినట్లే అవుతుంది. మీ ప్రశ్నలను నేను గౌరవిస్తాను. అవి ఉండవు సమానంగా. వాటి ఔచిత్యాలు వాటికి ప్రత్యేకంగా ఉంటాయి, వాటి స్వాభావిక వర్ణాలు వాటికి ఉంటాయి, కానీ సూక్ష్మ వ్యత్యాసతను ప్రగాఢంగా దర్శించే కళ్ళు మీకు ఉండాలి, లేకపోతే వాటిని మీరు దర్శించలేరు.

మీరు మీ చుట్టూ చూస్తే సస్యశ్యామలతే కనిపిస్తుంది. వృక్షాలన్నీ ఉంటాయి పచ్చదనంతోనే. కానీ అన్ని వృక్షాలూ ఒకే పచ్చదనంతోనే ఉంటున్నాయని మీకు అనిపిస్తోందా? అప్పుడు రంగును ఎలా చూడాలో మీకు తెలియదనే అర్థం. అక్కడికి అప్పుడో వర్ణచిత్రకారుణ్ణి తీసుకురండి. ఆ మనిషిని అడగండి. ఆ మనిషి అంటాడు “అవన్నీ విభిన్నమైన పచ్చదనాలు. కొన్నివేలరకాల పచ్చదనాలు ఉన్నాయి – వాటిల్లో ఉన్నాయి ఎన్నో ఛాయలు, ఎన్నో వైవిధ్యాలు. ఏ రెండు వృక్షాలూ ఒకే హరితంతో ఉండవు” అని. కొంచెం పరీక్షించి చూడండి – ఔను, ప్రతి పచ్చదనమూ ఉంటోంది ప్రత్యేకంగానే.

ఆ విధంగానే ఉంటాయి ప్రశ్నలు కూడా. ఓ మనిషి ఓ ప్రశ్ననే మళ్ళీ మళ్ళీ అడుగుతూ ఉన్నా అప్పుడు కూడా ఆ ప్రశ్నలు విభిన్నంగానే ఉంటాయి. ఎందుకంటే అనుక్షణమూ మీరు మారిపోతూనే ఉంటారు కాబట్టి. ఒకే నదిలోకి రెండుసార్లు మీరు కాళ్ళు ముంచలేరు, ఒకే మనిషిని రెండుసార్లు మీరు కలుసుకోలేరు. శైలా ఈ ప్రశ్ననే రేపు మళ్ళీ అడగలేదు. ఎందుకంటే ఆమె ఈ రోజున్నట్లు రేపు ఉండదు కనుక. గంగ ప్రవహించేసే ఉంటుంది, ఎన్నో నీళ్ళు వెళ్ళిపోయే ఉంటాయి. ఈ క్షణానికి మాత్రమే ఉంటుంది ప్రాముఖ్యత. ఈ క్షణం లోనే ఉంటుంది అది సంగతంగా. రేపుండదు అది సంగతంగా. మీ చైతన్యంలో మరేదో తలెత్తి ఉంటుంది.

ఏ ఇద్దరు మనుష్యులూ ఒకే ప్రశ్నను అడగలేరు. తన ప్రశ్ననే ఓ మనిషి మళ్ళీ అడగలేడు, ఎందుకంటే ఆ మనిషి మారిపోతూ ఉంటాడు కనుక. ఓ మనిషి ఉంటాడు దీపంశిఖలా, అనుక్షణమూ పరివర్తితమవుతూ. కానీ మహాప్రగాఢంగానే మీరప్పుడు వీక్షించాల్సి ఉంటుంది. నా వద్దకు ఎప్పుడూ అవే ప్రశ్నలు రాలేదు. మీ ప్రశ్నలు వింటూ ఉంటే నాకు అద్భుతానుభవ ఆవేశాలు కలుగుతూ ఉంటాయి.

నాకెప్పుడూ కలుగుతూనే ఉంటుంది ఆశ్చర్యం ఈ ప్రశ్నలను మీరు ఎలా అడగగలుగుతున్నారని.

“మీకుండదా విసుగూ, విసుగూ, విసుగూ మరి మొహంమొత్తిపోవడమూ, రోజు తరువాత మరోరోజు అవే ప్రశ్నలకు మళ్ళీ సమాధానాలను ఆపకుండా ఇస్తూ ఉంటే, మేమక్కడ చెవులు మూసేసుకుని, కళ్ళు మూసేసుకుని, నోళ్ళు మూసేసుకుని, ఏ సందేశాన్నీ మీ నుండి అందుకోకుండానే ఉంటే – ఆ ప్రశ్నలకు సమాధానాలే ఉండవనీ?”

అలా నువ్వు “చెవులూ, కళ్ళూ నోరూ మూసేసుకుని సందేశాన్ని అందుకోకుండానే” ఉంటున్నప్పుడు అది తయారైపోతుంది నాకొక సవాలుగా. అదుంటుంది ఓ సాహసంగా నువ్వు మొండిపట్టుతో ఉంటావు, నేను కూడా మొండిపట్టుతోనే ఉంటాను. ఇప్పుడు సమస్య ఏమిటంటే : ఎవరు గెలుస్తారు? నువ్వుండిపోతావా ఎప్పటికీ ఇలాగా ముడుచుకునే? లేదా నా మీద జాలిపడి నేనేం చెబుతున్నానో వింటావా... కళ్ళనూ, చెవులనూ, హృదయాన్నీ కొంచెం తెరచుకుని? ఇదుంటుంది ఓ సంఘర్షణగా. ఈ కుస్తీనే జరుగుతూ ఉంటుంది గురువుకూ, శిష్యుడికీ మధ్య – ఓ నిరంతర యుద్ధం.

మరి శిష్యుడు ఎప్పుడూ గెలవలేడు. ‘శిష్యుడు గెలవగలడు’ అన్న మాట ఎప్పుడూ వినిపించలేదు. శిష్యుడు కొంత తాత్సారం చెయ్యవచ్చు. కొంత ఆలస్యాన్ని కల్పించుకోవచ్చు. కానీ గెలవలేడు. ఎంత ఆలస్యాన్ని శిష్యుడు చేస్తూ ఉంటాడో అంతంతగా శిష్యుడి పరాజయం నిశ్చితమైపోతూ ఉంటుంది. నేను మీ ‘జీవుడి’ మీదికి, ‘జీవి’ మీదికి ఆక్రమణ చేస్తూ ఉంటాను ఎన్నోవిధాలుగా, ఎన్నో మార్గాల్లో. మీరు ఉంటారు అక్కడ కూర్చుని చెవులు మూసేసుకుని, కళ్ళు మూసేసుకుని, హృదయాన్ని మూసేసుకుని. మీరు ఉంటారు అక్కడ, అంతే. మీరు ఉండండి ఇక్కడ, చాలు. ఏదో ఓ నాటికి, నా సందేశం మీకు వినిపించే తీరుతుంది.

ఎంతకాలం ఉంటారు మీరు మిమ్మల్నే మూసేసుకుని? తన తప్పిదాన్నే కొనసాగిస్తున్న మనిషి వివేకవంతుడవుతాడని చెప్పబడింది. మీ పట్టు మీరు పట్టండి. ఏదో ఓ నాటికి, ఎంత బిగుసుకుని మీరున్నా, నా మాట మీకు వినిపించే తీరుతుంది. అందువల్లే నేను మాట్లాడుతూనే ఉంటాను ప్రతి రోజూ, ప్రతి సాయంత్రమూ, సంవత్సరాది నుండి సంవత్సరాంతం దాకా.

ఓషో

ఇంకా నువ్వు అంటున్నావు "...ఏ సందేశాన్నీ మీనుంచి అందుకోకుండానే ఉంటే- సమాధానాలే ఉండవని". ఆ సందేశం నీకు ఎప్పుడు అందుతుందంటే, ఏ ప్రశ్నలూ నీ మనస్సులో మిగిలి ఉండనప్పుడే, అంతకుముందు మాత్రం కాదు. ఎలా వస్తుంది నీకు సందేశం ఏ సమాధానాలూ లేవని, ప్రశ్నలు ఇంకా నీలో మిగిలే ఉన్నప్పుడు? అడగబడుతున్న ఆ ప్రశ్నే స్వయంగా ఓ పూర్వసమాధానాన్ని కూడా ఊహించుకునే ఉంటుంది. ఆ ప్రశ్నే సమాధానం కోసం చేస్తున్న అన్వేషణ. ఆ ప్రశ్నకు ఓ సమాధానం ఉందన్న నిశ్చితాన్ని అది ముందుగా తీసుకునే ఉంటుంది. లేకపోతే ఆ ప్రశ్నకు ఎలా ఉండగలుగుతుంది ఉనికి? ఓ ప్రశ్నకు స్వంతంగా ఓ ఉనికి ఉండదు. ఓ సమాధానం మీదే ఆధారపడి ఉంటుందది, లేదా ఓ సమాధానం దానికి ఉందన్న సంభావ్యత మీదే ఓ ప్రశ్న ఉంటుంది ఆధారపడి.

ఏ రోజున నీలో ఏ ప్రశ్నలూ లేవు అన్న ప్రజ్ఞ నీకు కలుగుతుందో ఆ రోజునే ఏ సమాధానాలూ లేవు అన్న సందేశం కూడా నీకు ఎరుక పడుతుంది. మరి ఆ రోజున నువ్వు ఏ ప్రశ్ననూ అడగనే లేదనీ, ఏ సమాధానాన్నీ నేను ఇవ్వనే లేదన్న విషయాన్ని నువ్వు గ్రహిస్తావు. ఓ సంపూర్ణ నిశ్శబ్దం మాత్రమే అక్కడ ఉంటుంది. ప్రశ్నలన్నీ, సమాధానాలన్నీ స్వప్నాలుగానే ఉంటాయి.

కానీ ప్రశ్న నువ్వు అడిగావు కాబట్టి, సమాధానాన్ని నేను ఇచ్చేతీరాలి. ప్రశ్నలన్నీ నీలోంచి తొలగిపోయేందుకు ఇదొక్కటే ఉన్న మార్గాంతరం. గుర్తుపెట్టుకోండి, నా సమాధానాలన్నీ మీ ప్రశ్నలను పరిష్కరిస్తున్న సమాధానాలు కావనీ, అవి పరికరాలు మాత్రమేనని. నా సమాధానాలు మీ ప్రశ్నలను తీర్చడానికి కాదు. ఎందుకంటే ఏ ప్రశ్నలూ లేవన్న విషయం అత్యంత స్పష్టంగా నాకు తెలుసు కనుక. అన్ని ప్రశ్నలూ అబద్ధాలే. వాటిని మీరు కల కని ఉంటారు. కానీ మీరు అడిగినప్పుడు నేను గౌరవిస్తాను మిమ్మల్ని. సమాధానం ఇస్తాను. నా సమాధానం కేవలం నేను మీకు అందిస్తున్న గౌరవం మాత్రమే. నా సమాధానాలు ఉంటాయి సాధనాలుగా, పరికరాలుగా. మీ ప్రశ్నలు క్రమేపీ అదృశ్యం అయిపోయేందుకే పనికొస్తాయి.

ఉన్నట్లుండి ఏ ప్రశ్నలూ లేకుండా మీరు నిద్రలేస్తారు. ఆ రోజు మీకు అర్థం అవుతుంది ఏ సమాధానాలనూ నేను ఇవ్వనే లేదని. ఏ సమాధానాలూ ఉండవు. ఎందుకంటే ఉనికిలో ఏ ప్రశ్నలూ లేవు కనుక. ఉనికి ఉనికితో ఉంటుంది ఏ ప్రశ్నలూ ఉండకుండా. ఇది ఓ రహస్యం – పరిష్కరించాల్సిన ఓ సమస్య కాదు ఇది, ఆనందించాల్సిన ఓ రహస్యం ఇది. జీవించాల్సిన ఓ రహస్యం ఇది.

మరి శైలా అంటుంది "మీరెప్పుడూ మమ్మల్ని ఆశ్చర్యచకితుల్ని చేసేస్తూనే ఉంటారు, మీ తాజా హిమబిందువులాంటి స్వచ్ఛతతో సుప్రభాతవేళల్లో ఉన్నట్లే. అయినా నేను ఉంటూనే ఉన్నాను అంధురాలినై, చెవిటిదాన్నై, కుంటిదాన్నై మీ జ్యోత్స్న వెలుగుల్ని అప్పుడప్పుడు మాత్రమే అందుకోగలుగుతూ" అని.

అప్పుడప్పుడూ అందుకుంటున్న ఆ స్వల్పక్షణాలే చాలు. ఆ క్షణాలే ఉంటాయి నీకు నమ్మకంగా. ఆ క్షణాల లోనే నేను నీ లోపలికి ప్రవేశిస్తూ ఉంటాను. ఆ స్వల్ప క్షణాలే క్రమేపీ వ్యాప్తం అవుతాయి. ఏదో ఒకనాటికి ఆ స్వల్ప క్షణాలే నిన్ను గెలిచాయని గ్రహిస్తావు. ఓ క్షణంపాటు నీతో నా కలయిక ఏర్పడినా, అది చాలు. చాలడం ఏమిటి? అదే మహాగొప్ప. ఆ చిన్న విద్యుల్లతలే నీ మనస్సునంతా కాల్చేస్తాయి సంపూర్ణంగా, దాని మూలాల దాకా, ఏ వేర్లూ మిగిలుండవు.

## మూడవప్రశ్న:

*ప్రియ ఓషో,*

*ఈ బుద్ధ సూత్రాలను నేను ఆనందించలేకపోతున్నాను. అవి ఉంటున్నాయి మరీ పొడిగా, కఠినంగా, మహాసంక్లిష్టంగా. సత్యం సులువుగా ఉండదా? సామాన్యంగా?*

సత్యం ఉంటుంది కోమలంగా, కఠినంగా. వాస్తవంలో అది కఠినంగానే ఉంటుంది. ఎందుకంటే కోమలంగా అది ఉంటుంది కనుక. అదుంటుంది సామాన్యంగానే కానీ మీ మనస్సే మహాసంక్లిష్టంగా ఉంటూ ఆ సామాన్యతను అర్థంచేసుకోలేకపోతూ ఉంటుంది, ఎప్పుడూ దాన్ని చేజార్చుకుంటూనే ఉంటుంది. అది ఎంతో సామాన్యంగా ఉంటూ ఏ సవాలునూ మీతో చెయ్యదు. అదెంతో సామాన్యంగా ఉంటూ దానిప్రక్కనుంచే వెళ్తున్న మీరు దాన్ని దాటే వెళ్ళిపోతారు సత్యాన్ని అతిక్రమించారన్న ఎరుక లేకుండా.

సత్యం ఉంటుంది సామాన్యంగా, సాక్షాత్తుగానే అది ఉంటోంది కాబట్టి. కానీ సామాన్యంగా ఉందంటే సులువుగా అది ఉంటుందని కాదు. ఆ సామాన్యతే ఉంటుంది సంక్లిష్టమై. అందులోకి మీరు ప్రవేశించారంటే మీరు అయిపోతారు అదృశ్యం. అందులోంచి మీరెప్పటికీ బయటికి రారు. ఆ సామాన్యతలోనే ఉంటుంది మహాప్రగాఢ గాంభీర్యం. అదుండదు లోతు లేకుండా. ఆ సామాన్యతను మీరు

సంతరించుకోవాలంటే ఎన్ని విషయాలనో మీరు వదులుకోవాల్సి వస్తుంది – వాటిని వదిలిపెట్టడం ఎంతో కష్టంగా ఉంటుంది.

ఉదాహరణకోసం : ఎందుకు కనిపిస్తున్నాయి మీకు ఈ బుద్ధ సూత్రాలు మహాకఠినంగా? – ఎందుకంటే తార్కికంగా అవి ఉండడంలేదు కనుక. మీ తర్కాన్ని వదిలిపెట్టేశారంటే అవి అప్పుడు ఉంటాయి సరళంగా, సామాన్యంగా. కష్టమంతా మీ మనస్సు వల్లే కలుగుతోంది. ఆ సూత్రాల లోంచి ఆ కష్టం రావడం లేదు. బుద్ధుడు అతిసామాన్యపు మనిషి. ఆయన ఓ వాస్తవాన్ని మాత్రమే మామూలుగా చెబుతూ ఉంటాడు. కానీ సమస్య అంతా మీలోంచే అవుతుంది ఉత్పన్నం, ఎందుకంటే ఆ సూటి వాస్తవాన్ని మీరు అంగీకరించలేక పోతున్నారు కనుక. మీ ఊహలు మీకు ఉంటాయి. ఆ మీ ఊహలే మీ అవగాహనకు అడ్డం పడుతూ జోక్యాన్ని కల్పించుకుంటాయి.

మీరు అంటారు “ఎలా ఉంటుంది అది? ఈ మనిషి చెబుతున్నది ఒప్పే అయితే అప్పుడు నా తర్కం అంతా తప్పే అయిపోతుంది” అని. దాన్ని మీరు ఒప్పుకోలేరు. మీ విద్య అంతా, మీ శిక్షణలన్నీ, తర్కంతోనే అందాయి. ఇప్పుడు ఈ మనిషి ఏ తర్కమూ ఉండని విషయాలనే మాట్లాడుతున్నాడు. నిస్సహాయుడు ఆయన. ఆ ఔన్నత్యంలో, ఆ పరమోత్తమ తలంలో, తర్కానికి ఉనికే ఉండదు. ఆయన ఏం చేయగలుగుతాడు? ఆ తలంలో అన్నీ వైపరీత్యాలుగానే ఉంటాయి. ఆ ప్రజ్ఞాతలంలో వ్యతిరేకాలు కలుసుకుంటాయి. వైరుధ్యాలు సమన్వయాలే అయిపోతాయి. ఏం చేయగలుగుతాడు ఆయన? ఆ విషయాలను ఆయన ధృవీకరించే చెప్పాల్సి వస్తుంది. సమస్య మీలోంచే ఉత్పన్నం అవుతోంది – ఆ సత్యాలు మీ తర్కానికి అనుగుణ్యంగా అనువదింపబడాలని మీరు అభిలషిస్తున్నారు కాబట్టి.

ఓ హైస్కూలు విద్యార్థి ఈ అభ్యంతరాన్ని ప్రకటిస్తున్నాడని అనుకోండి : “ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ సిద్ధాంతాన్ని నేను ఒప్పుకోలేను.”

“ఒప్పుకోవా?” ఫిజిక్స్ టీచర్ అడుగుతాడు “ఎందుకు ఒప్పుకోవూ?”

“ఎందుకంటే, ముందుగా – అదుంటోంది విసుగుపుట్టిస్తూ. మీరు దాన్ని గురించి ఎప్పుడు వివరించి చెబుతూ ఉన్నా, తప్పకుండా అప్పుడు నేను నిద్రపోతూనే ఉంటాను. తరువాత, అదుండడంలేదు తుల్యతతో. చూడండి మీరే! $E = mc^2$ ఆయన ఓ అక్షరాన్ని ఏకంగా ఒకవైపుకు ఆ సమీకరణంలో పడేసి రెండు అక్షరాలనూ, ఓ

అంకెనూ మొత్తం మూడింటిని సమీకరణపు రెండోవైపులో నిలిపి ఉంచాడు. కుడిప్రక్కనుంచి ఏ అక్షరాన్నో అంకెనో ఆయన ఎందుకు తీసి సమీకరణానికి ఎడమప్రక్కన పెట్టకూడదూ? అప్పుడుంటుంది కదా సమీకరణం రెండుప్రక్కలా సమానంగా! అందుకే దీన్ని నేను ద్వేషిస్తూ ఉన్నాను."

ఇప్పుడు ఆ కుర్రాడు అందమైన ప్రశ్నలను రేపుతున్నాడు. ఆ సమీకరణం ఉండడం లేదు తుల్యతతో. "ఇదేమి సమీకరణం? రెండు ప్రక్కలూ సమానంగా లేనే లేవు. కళాత్మకంగా ఇది ఉండడంలేదు. ఒక్క అక్షరాన్ని ఆ ప్రక్కనుండి లేపి ఈ ప్రక్కన పడేస్తే అప్పుడుంటుంది కదా అది మరింత ఉత్తమంగా? తుల్యతతో?"

ఆ కుర్రవాడికి తనేం మాట్లాడుతున్నాడన్న విషయపు ఎరుక ఉండడంలేదు. కానీ వాడు చెబుతున్నది సాహేతుకంగానే వినిపిస్తుంది, కనిపిస్తుంది. కానీ ఈ ఐన్‌స్టీన్ సమీకరణం మిమ్మల్ని ఆనందపరవశుల్ని చేసేందుకు ఉద్దేశించబడింది కాదు. సత్యాన్ని ప్రకటించడానికి మాత్రమే అదక్కడ ఉంటోంది. దాంతో మీకు విసుగు వచ్చేస్తూ ఉంటే, మీరు మహా మొద్దు రాచ్చిప్పలనీ, ఆ ప్రగాఢ ప్రజ్ఞను మీరు అర్థం చేసుకోలేకపోతున్నారనీ మాత్రమే దానికి అర్థం. ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతాన్ని కేవలం పన్నెండుమంది మాత్రమే అర్థం చేసుకోగలిగారని చెప్పబడింది, ఈ ప్రపంచం మొత్తంమీద. పన్నెండుమందికి మాత్రమేనా?

సత్యం ఉంటుంది సామాన్యంగా. కానీ దాని వివరణలలోకి మీరు ప్రవేశించారంటే, ఆ సత్యపుతత్వం లోకి ప్రగాఢంగా మీరు ప్రవేశించారంటే, అప్పుడయిపోతుందది కష్టం. ఉదాహరణకోసం, సెయింట్ అగస్టీన్ ఇలా అన్నాడని అంటారు – "అందరికీ తెలుసు 'కాలం' అంటే ఏమిటో. 'కాలం' అంటే ఏమిటో నాకు కూడా తెలుసు. కానీ ఎవరైనా 'కాలం' అంటే ఏమిటి? కొంచెం నాకు అర్థమయ్యేలా చెప్పండి" అని అడిగితే, అప్పుడు నాకు నోట మాట రాదు."

మీకు కాలం అంటే ఏమిటో తెలుసు. కాలానికి తగ్గట్లుగానే జీవిస్తూ మీరుంటున్నారు. ఉదయం ఆరుగంటలకు మీరు నిద్రలోంచి లేస్తారు. రాత్రి పదకొండుగంటలకు మళ్ళీ మీరు నిద్రకు ఉపక్రమిస్తారు. ఒంటిగంటకు మీరు భోంచేస్తారు. ఆఫీసుకు వెళ్తారు, ఇంటికి తిరిగొస్తారు. కాలాన్ని మీరు వినియోగించుకుంటూ ఉంటారు. కాలం అంటే ఏమిటో మీకు తెలుసు. కానీ దాన్ని మీరు స్పష్టం చెయ్యగలుగుతారా? ఏ క్షణంలో దాన్ని గురించి చెప్పాలనుకుంటారో

తక్షణం అది జారిపోయి ఉంటుంది. దాన్ని మీరెప్పుడూ చూడలేదు. అదెప్పుడూ మీ చేతుల్లో కనిపించలేదు. దాన్ని మీరు పట్టుకోలేరు. ఏమిటది?

అగస్టీన్ సరయిన మాటే అంటున్నాడు – వర్ణించేందుకు పూనుకున్నప్పుడే సమస్య తలెత్తుతుంది. కాంతి ఉంటుంది సామాన్యంగా. అదుంటుంది అన్నివైపులా, వృక్షాల మీద నాట్యాలు చేస్తూ. ఆకాశం మొత్తం కాంతితో నిండి ఉంటుంది. ఓ గుడ్డివాడికి ఈ కాంతి గురించి వర్ణించి చెప్పేందుకు ప్రయత్నించి చూడండి. ఆ మనిషికి విసుగొచ్చేసి "ఆపండి ఈ అర్థం లేని వాగుడునంతా" అనేస్తాడు. ముందుగా దాని గురించి మాటలతో చెప్పేందుకు ఎంతో కష్టంగా ఉంటుంది. లేదా, ప్రశ్నించడాన్ని మీరు వదిలిపెట్టెయ్యొచ్చు. అది ఓ వైజ్ఞానికపు ప్రశ్న. అందులో మీకు ఉత్సాహం ఉండకపోవచ్చు.

మీరు ప్రేమించారు. మీకు ప్రేమ అంటే ఏమిటో తెలుసు. తప్పకుండా మీరు ప్రేమించే ఉంటారు; మీ తండ్రిని, మీ చెల్లెల్ని, ఏ స్త్రీనో, మీ భార్యనో, మీ భర్తనో, మీ పిల్లలనో, ఎవర్నో. ప్రేమ అంటే ఏమిటో మీరు చెప్పగలుగుతారా? అప్పుడు మీరు మూగవాళ్ళై పోతారు. అప్పుడు ఉన్నట్లుండి మీ తెలివి అంతా మాయమైపోతుంది – ఎవరో మిమ్మల్ని కొట్టిచంపేసినట్లు. మీకొచ్చేసి ఉంటుంది పక్షవాతం. బిగుసుకుపోతారు. ఏమిటి ప్రేమంటే? నిర్వచనం చెప్పగలుగుతారా?

ప్రేమ అందరి అనుభవమే. కొద్దో గొప్పో, కానీ ఎవరూ దాన్ని నిర్వచించలేరు. నిర్వాణం అందరి అనుభవం కాదు – అప్పుడప్పుడూ అది జరుగుతూ ఉంటుంది – బుద్ధుడు మీకు నిర్వాణం గురించి చెప్పేందుకు ప్రయత్నిస్తూ ఉంటాడు.

సత్యం ఉంటుంది సామాన్యంగానే, కానీ దాన్ని గురించి చెప్పేందుకు ప్రయత్నించిన వెంటనే అది అయిపోతుంది మహాకష్టం. కానీ గుర్తుపెట్టుకోండి, మీరిక్కడికి వచ్చింది ఉత్సాహంతో ప్రొద్దుపుచ్చడానికి కాదు. మిమ్మల్ని ఆనందింపజేసేందుకు నేను విముఖుణ్ణి కాను – కానీ ఆనందం యుక్తసమయంలో ఉంటేనే బాగుంటుంది. ఆనందిస్తూ ఉండడంకన్నా మరేదో మనం చెయ్యాల్సింది ఉంటోంది. దాన్ని చేస్తేనే మనకు కలుగుతుంది జ్ఞానోదయం. ఆనందిస్తూ ఉండడం ఓ అతి తక్కువ అవసరం. జ్ఞానోదయాన్ని పొందడమే మహోత్తమమైన అవసరం. ఒక ఆనందం లోంచి మరో ఆనందం లోకి ప్రవేశిస్తూ మీరుండిపోతే మీరుంటారు కాళ్ళు మాత్రం తడుస్తూ, అతితక్కువ లోతుల్లో. ఎప్పటికీ ఎదగరు. మీరుంటారు అపరిపక్వంగానే. అప్పుడప్పుడూ మీరు జీవితం లోతుల్లోకి, ప్రేమ లోతుల్లోకి, కాంతి

లోతుల్లోకి, దివ్యత్వపు లోతుల్లోకి వెళ్ళాల్సే ఉంటుంది. అప్పుడప్పుడూ శాశ్వతం లోకి మీరు ఎగరాల్సే వస్తుంది ఆ రుచిని తెలుసుకోవడానికి. అది చేస్తేనే మీకు కలుగుతుంది పరిణితి.

మీ కష్టాన్ని నేను అర్థం చేసుకోగలుగుతాను. మీరు అంటారు "ఈ బుద్ధసూత్రాలను నేను ఆనందించలేకపోతున్నాను" అని. అప్పుడు దాన్ని ఎలా ఆనందించాలో నేర్చుకోండి. అప్పుడు ఉత్తమ విషయాలను ఎలా ఆనందించాలో నేర్చుకోండి. ఉత్తమవిషయాలు ఉన్నాయి. సాంప్రదాయ భారతీయసంగీతాన్ని మీరు ఆనందించాలంటే శాస్త్రీయసంగీతాన్ని మీరు నేర్చుకోవాలి. అక్కడికి వెళ్ళి కూర్చుని ఆ ఆనందాన్ని మీరు పొందలేరు. ఆ ఆనందాన్ని పొందేందుకు ముందుగా ఎన్నో సన్నాహాలను చేసుకోవాల్సి వస్తుంది. సంగీతాన్ని ఆస్వాదించే స్వీకృతితత్వం మీలో ఉండాలి. అదుండదు వికారంగా. దాన్ని అర్థం చేసుకునేందుకు ఓ అవగాహన మీలో ముందుగా ఉండాలి... శబ్దాల, నిశ్శబ్దాల జ్ఞానం. అవగాహన – ఎందుకంటే సంగీతంలో శబ్దమూ, నిశ్శబ్దమూ ఉంటుంది కాబట్టి. సంగీతం శబ్దం మాత్రమే కాదు. అందులో నిశ్శబ్దం కూడా ఉంటుంది.

సంగీతం మరింత ఉన్నతమూ, ప్రగాఢమూ అవుతుంది అందులో నిశ్శబ్దం పాలు పెరుగుతూ ఉంటే. మీ నిశ్శబ్దాన్ని అది ప్రేరేపిస్తూ ఉంటే, మీ హృదయంలోకి దూసుకువెళ్ళి మీ అంతర్నిశ్శబ్దాన్ని విడుదల చేస్తూ ఉంటే. ఆ సంగీతాన్ని వింటున్నప్పుడు మీ మనస్సు మాయమైపోతుంది. మీ ఆలోచనలన్నీ ఆగిపోతాయి... కానీ అప్పుడు మీరు నేర్చుకోవాల్సి వస్తుంది, ఓ క్రమశిక్షణలోంచి మీరు చరించాల్సి వస్తుంది. మరింత ధ్యానాత్మకంగా మీరు తయారవవలసి వస్తుంది. అప్పుడు ఏదో నాటికి మీరు సంగీతాన్ని ఆనందించగలుగుతారు. కానీ ఇప్పుడే ఆ ఆనందాన్ని అనుభవించేయాలంటే, మీరు అందుకు సంసిద్ధంగా లేరు, సంగీతాన్ని నిందించకండి.

బుద్ధ సూత్రాలు విసుగుపుట్టిస్తున్నాయని అనకండి, ఆ ఔన్నత్యాన్ని ఇంకా అర్థం చేసుకోలేకపోతున్నామని మాత్రమే చెప్పండి. అంత ఉన్నత తలంలోకి చూడలేక పోతున్నామని మాత్రమే చెప్పండి. ఆ మహోన్నత చైతన్య ఎవరెస్టును అధిరోహించలేకపోతున్నామని మాత్రమే చెప్పండి. బుద్ధుడు మహోన్నత ఆ శిఖరం మీద నుంచి మాట్లాడుతున్నాడు. మీరుంటున్న భూ బిలం లోంచి మీరు బయటికి రావాలి కాస్త. ఆ తరువాత ఆ పర్వతాలను మీరు ఎక్కాలి. అప్పుడు మాత్రమే అర్థం అవుతాయి సూర్యకాంతితో మెరుస్తున్న ఆ పరమోత్తమ శిఖర సూత్రాలు.

అదెంతో కష్టం. ఎందుకంటే అంతటి అవగాహనకోసం మనం ఏ ప్రయత్నాలనూ చేయనేలేదు కాబట్టి. అందువల్లే అప్పుడప్పుడూ మీకు విసుగొచ్చేస్తూ ఉంటుంది. కానీ ఆ విసుగుతత్వంతోనే చెయ్యండి యుద్ధం. మీ విసుగును మీరు విధ్వంసం చేసేసుకోండి. బుద్ధుడు దేన్ని చూశాడో దాన్ని మీరు కూడా చూడాలి. దాన్ని దర్శిస్తేనే మీరు అవుతారు సాఫల్యులు.

### నాల్గవప్రశ్న:

**ప్రియ ఓషో,**

**మనల్ని ఇంటికి రానీయకుండా ఆపుతున్న ఏకైక విషయం 'ఇప్పటికీ మనం ఇల్లు చేరనేలేదు' అని సందేహపడుతూ ఉండడం మాత్రమేనా, మనచుట్టూ ఉన్న ప్రతి ఒక్కరూ దీన్ని బలపరుస్తూనే ఉన్నట్లు?**

ఔను శోభా. ఆ సందేహమే అందరినీ ఆపేస్తోంది – ఉండాల్సిన పద్ధతిలో మనం ఉండడం లేదన్న, దివ్యత్వం మనలో లేదన్న సందేహం. ఎలా ఉండగలుగుతాడు దేవుడు మన లోపల?– ఎందుకంటే మనకు దేవుడు ఎక్కడో ఏ ఏడో స్వర్గంలో బంగారు సింహాసనం మీద మిగతా దేవతలందరూ హార్పులు వాయిస్తూ 'అల్లేలూయా' అని పాటలు పాడుతూ ఉంటే వింటూ కూర్చుని ఉంటాడని బోధింపబడి ఉంది కనుక.

ఆయన ఇక్కడ లేడు, ఆయన ఎంతో దూరంలో ఉన్నాడు. ఆయన ఉంటాడు మహా ఎత్తుగా, ఆయన ఉంటాడు ఎంతో పెద్దవాడిగా, ఆయన ఉంటాడు శాశ్వతంగా. ఆయన ఉంటాడు ఇలాగా, అలాగా. ఎలా ఉండగలుగుతాడు ఆయన మీ హృదయంలో! ఎంత చిన్న గుండె మీది? ఎలా ఉండగలుగుతాడు ఆయన ఈ గుండెలో? – మీరు ఉంటున్నారు ఎంతో అసహ్యంగా, వికారంగా, ఘోరంగా. మీరు వెయ్యిన్నొక్క విధాలుగా ఆత్మనింద చేసుకుంటూనే ఉంటున్నారు నిరంతరంగా. ఎలా ఉండగలుగుతాడు ఆయన ఇక్కడ? దేవుడు మీ లోపలే ఉంటే, మరి దుష్టభూతం ఎక్కడ ఉంటుంది? సందేహం...

మరి అప్పుడు ఎవరో అంటారు దేవుడు మీలోనే ఉన్నాడని. ఆ మాటలను మీరు ఒప్పుకోలేరు. ఆ మాటను మీరు ఎన్నోమార్లు విన్నారు, జీసస్ ప్రజలతో చెప్పిన మాటలను "దైవసామ్రాజ్యం మీ లోపలే ఉంది". కానీ ఈ మాటను క్రైస్తవులు కూడా వినరు, ఆయన అనుయాయులు కూడా. జీసస్‌తో ఎంతో ఆత్మీయంగా ఉంటున్న

అనుయాయులు కూడా, అతిదగ్గరి అనుయాయులు కూడా ఆయన్ని అడుగుతూనే ఉంటారు స్వర్గంలో ఉంటున్న దేవుడి గురించి. ఆయన చెబుతూ ఉంటాడు "దేవుడు మీలోనే ఉన్నాడు" అని. వాళ్ళు స్వర్గంలో ఉంటున్న దేవుడి గురించే మాట్లాడుతూ ఉంటారు "మనం అందరం చనిపోయిన తరువాత ఎలా జీవిస్తాం స్వర్గంలో? దేవుడి కుడిచేతి వద్ద ఎవరు ఉంటారు? మనకు అక్కడ ఏ హోదా ఉంటుంది? ఎవరుంటారు ఎవరుగా? అధికారక్రమంలో ఎవరెక్కడ ఉంటారు?" మరి జీసస్ చెబుతూనే ఉంటాడు "దేవుడు మీ లోపలే ఉన్నాడు", కానీ ఎవరూ ఆ మాటల్ని నమ్మరు. ఎందుకంటే మిమ్మల్ని మీరే నమ్మడం మీకు నేర్పింపబడలేదు కనుక.

జన్మించినప్పటి నుండీ మీ జీవుడి నుంచి ధ్యాస మళ్ళింపబడి మీరు దూరం అయిపోయే ఉన్నారు. ప్రతి ఒక్కరూ మిమ్మల్ని నిందించేవాళ్ళే – మీ తల్లిదండ్రులు, మీ ఉపాధ్యాయులు, మీ పూజారులు, మీ రాజకీయం మనుషులు. ప్రతి ఒక్కరూ మిమ్మల్ని తప్పుపడుతూనే, నిందిస్తూనే ఉంటున్నారు. ప్రతి ఒక్కరూ అన్నారు "నువ్వా! నువ్వున్నట్లు ఇలా నువ్వుంటే సరికాదు. నువ్వు సరిగ్గా తయారవ్వాలి. ఏదో శుద్ధిని నువ్వు పొంది తీరాలి."

ఎన్నో లక్ష్యాలు మీకు అందించబడ్డాయి. ఆ లక్ష్యాల వల్ల, ఆ వ్యక్తిత్వపు సవ్యతాతీరు కోసం మీరెప్పుడూ నిందార్హులుగానే ఉంటూ అణచేయబడే ఉంటారు. ఎలా స్వీకరించ గలుగుతారు దివ్యత్వం మీలోనే ఉందన్న సందేశాన్ని మీరు? ఇప్పటికే ఇంటిని చేరే ఉన్నారన్న సందేశాన్ని ఎలా గ్రహించగలుగుతారు మీరు? అసలు మీ ఇంట్లోంచి మీరు బయటికి పోనేలేదనీ, అంతా సవ్యంగానే ఉందంటే ఎలా విశ్వసించగలుగుతారు మీరు? కేవలం సౌఖ్యులు కండి, చాలు. మీలో మీరు సౌఖ్యులైతే చాలు మీ ఇంట్లోనే మీరుంటారు. ఇదే మీ స్వంతం.

సందేహం తలెత్తుతుంది : "దేవుడు నా లోపల ఉండడమా? మా నాన్న అంటూ ఉండేవాడు 'ఈ ఊళ్ళో ఉన్న అందరు పిల్లలలో నువ్వే పరమచండాలపు వెధవ్వి' అని. మరి మా అమ్మ కూడా అంటూనే ఉండేది 'నువ్వెందుకు చావవురా? వంశానికే చెడ్డపేరుగా తయారయ్యావ్. నీ వల్ల మేము నిందలు పడుతూ తలెత్తుకోలేకుండా ఉన్నాం. నిన్ను 'ఎందుకు కన్నామా' అని ఎప్పుడూ దుఃఖిస్తూనే ఉంటున్నాం!" అని – మీ స్కూల్లో టీచర్ మిమ్మల్ని 'వెర్రివాడివి, మూర్ఖుడివి. పరమశుంఠవి' అనేది. మీ పూజారి మిమ్మల్ని 'నువ్వు నరకానికే పోతావ్, పరమ పాపివి నువ్వు' అనేవాడు.

నిన్ననే క్రైస్తవచర్చికి రమ్మని ఆహ్వానాన్ని అందుకున్న ఓ హైందవ మార్మికుణ్ణి గురించి చదివాను. చర్చిలో ఓ ఉపన్యాసం పూర్తయిన తరువాత పూజారి చర్చికి వచ్చిన అందర్నీ ఉద్దేశిస్తూ గట్టిగా ఇలా అన్నాడు "పాపులారా! ఇప్పుడు మోకాళ్ళ మీద వ్రాలి ప్రార్థించండి! మోకాళ్ళమీద వ్రాలి ప్రార్థించండి!"

హైందవ మార్మికుడు తప్ప తక్కిన అందరూ మోకాళ్ళ మీద వాలిపోయారు. క్రైస్తవ పూజారి హిందూ మార్మికుణ్ణి చూసి "మీరు మాతోబాటు కలిసి ప్రార్థన చెయ్యరా?" అని అడిగాడు.

ఆయన అన్నాడు "చేసేవాణ్ణే. కానీ నేను పాపిని కాను. మరి నాకిక్కడ పాపులెవ్వరూ కనిపించడంలేదు. నేను ప్రార్థన చేద్దామనే అనుకున్నాను. ఇప్పుడు మీరు ఆ ప్రార్థనను నాకు అసాధ్యం చేసేశారు. నేనిప్పుడు మోకాళ్ళ మీద వ్రాలలేను. నేను పాపిని కాను కాబట్టి. దేవుడు నా లోపలే ఉన్నాడు. ఆ దేవుడి పట్ల అమర్యాదగా నేను ప్రవర్తించలేను. దేవుడు నా లోపల ఉన్నప్పుడు మాత్రమే నేను ప్రార్థించగలుగుతాను. మరి నేను దేన్ని గురించో ఆయన్ని ప్రార్థించను – నా కృతజ్ఞతను సమర్పించుకోవడం కోసమే నా ప్రార్థన. దేవుడు నాకు ఇప్పటికే ప్రసాదించిన వాటిపట్ల దైవానికి కృతజ్ఞత ప్రకటించడానికి మాత్రమే నా ప్రార్థన. నా శరీరంలో ఆయన ఉంటున్నందుకు కృతజ్ఞత ప్రకటించడంకోసమే నా ప్రార్థన. ఆ దేవుడు నా దేహంలో ఉంటూ నన్నెంతో గౌరవిస్తున్నాడు. ఆయనలో భాగంగానే నేనుంటున్నాను. ఆయన ఉన్నాడు నాకు స్వంతమై. నేను ప్రార్థన చేసేందుకే సిద్ధపడ్డాను. మోకాళ్ళ మీద మోకరిల్లేందుకే సిద్ధపడ్డాను. కానీ ఓ పాపిగా ఉంటూ మాత్రం కాదు. ఎందుకంటే అప్పుడది సత్యం కాదు కనుక."

మీకు అందరికీ మీరు పాపులనీ, జీసస్‌క్రైస్ట్ మిమ్మల్ని రక్షిస్తే తప్ప మీరందరూ నరకానికే వెళ్తారనీ బోధింపబడింది. మిమ్మల్ని ఎంతగా నిందింపబడడం జరిగిందంటే ఈ ప్రాచ్య సందేశం మీ జీవుడి మీద పేలిన తక్షణం మీరు సందేహంలో పడిపోయేలా. "ఇది అసంభవం. నేను?... నేనెప్పుడూ ఇంటిని వదిలిపెట్టనేలేదా? బుద్ధుడి విషయంలో ఇది సత్యం కావచ్చు, జీసస్ విషయంలో ఇది సత్యం కావచ్చు. కానీ నేను? – నేను పాపినై ఉన్నాను."

ఎవ్వడూ పాపి కాడు. జీవితంలో మహాగాఢాంధకారపు బిలంలో మీరుంటున్నా ఇప్పటికీ మీరు దివ్యులే. మీ దివ్యత్వాన్ని మీరు పోగొట్టుకోలేరు. దాన్ని

పోగొట్టుకునే ఏ మార్గమూ లేదు. మీ జీవి ఉనికే అది. ఆ దివ్యత్వంతోనే మీరు నిర్మింపబడ్డారు.

శోభ అడుగుతోంది "మనల్ని ఇంటికి రానీయకుండా ఆపుతున్న ఏకైక విషయం 'ఇప్పటికీ మనం ఇల్లు చేరనేలేదు' అని సందేహపడుతూ ఉండడం మాత్రమేనా, మన చుట్టూ ఉన్న ప్రతి ఒక్కరూ దీన్ని బలపరుస్తూనే ఉన్నట్లు?" అని.

ఔను. మీ చుట్టూ ఉంటున్న అందరివల్లే ఇది బలపరచబడింది. అందువల్లే నేను అంటూ ఉంటాను ఎవరైనా మిమ్మల్ని దివ్యుల్నిగా స్వీకరించినప్పుడే ప్రేమ అక్కడ ఉంటుందని. ఆ మనిషే మీరు దివ్యులేనన్న మీ నమ్మకాన్ని బలపరుస్తాడు. మీరు దివ్యులు కారన్న విషయాన్ని ఎవరైనా బలపరుస్తూ ఉంటే, అది ప్రేమ కాదు. అది చేస్తున్నది మీ తల్లి కావచ్చు, తండ్రి కావచ్చు. ఎవరు చేస్తున్నా తప్పే. ఎవరైనా మిమ్మల్ని మీరే నిందించుకునే పరిస్థితిని కల్పించే తమ ఊహల ఉపదేశాలను అందిస్తే, ఆ మనిషి మిమ్మల్ని విషపూరితుణ్ణి చేస్తుంటాడు. ఎవరైనా ఉన్నదున్నట్లు మిమ్మల్ని స్వీకరించలేమనీ, కొన్ని నియమాలకు మీరు తలఒగ్గితేనే దేవుడు మిమ్మల్ని ప్రేమిస్తాడనీ చెబుతూ ఉంటే, ఆ మనిషి మిమ్మల్ని నాశనమే చేస్తూ ఉంటాడు. ఆ మనిషి మీ శత్రువు - ఆ మనిషిపట్ల జాగరూకులై ఉండండి.

## అయిదవప్రశ్న :

*ప్రియ ఓషో,*

*నిన్న నేను ఓ హిందూసన్యాసితోబాటు ఆశ్రమంలోకి వస్తున్నప్పుడు ఆ సన్యాసిని ఏ కారణమూ చెప్పకుండా వెనక్కు పంపించేశారు. ఈ విషయం గురించి లక్ష్మితో ప్రస్తావిస్తే ఆమె ఇంచుమించుగా నా పని నన్ను చూసుకోమనే చెప్పింది. ఎవరిపట్ల అయినా అమర్యాదగా ప్రవర్తింపబడుతున్నట్లు నాకు అనిపిస్తే తక్షణం నాలో కలిగే స్పందన ఆ బాధకు లోనవుతున్న వాళ్ళకు సహాయపడాలనే. నిజంగానే ఇది నా వ్యవహారం కాదా ఇతరులకు సహాయపడడం?*

ఈ ప్రశ్న మా దేవ తూలికా దగ్గర్నుంచి వచ్చింది.

ఈ ప్రశ్న ఇక్కడున్న అందరికీ వర్తిస్తుంది, అంతేగాక నాతో సంబంధం పెట్టుకో బోతున్న వాళ్ళందరికీ కూడా. ఈ ఆశ్రమంలో ఏం జరుగుతూ ఉన్నా అవన్నీ నా అభిప్రాయాలకు తగ్గట్లుగానే జరుగుతాయి. ఆశ్రమంలోకి ప్రవేశం లభించని

మనిషి గురించి నాకు తెలుసు. ఆ తిరస్కారం జరిగిన మనిషికి తనకెందుకు ఆశ్రమప్రవేశం లభించలేదో తెలుసు. ఈ విషయంలో తలదూర్చడం నీ వ్యవహారం కాదు.

ఈ విషయాన్ని మీరు పూర్తిగా అర్థంచేసుకోవాలి, ఇక్కడేం జరుగుతూ ఉన్నా... నా గదిలోంచి నేను బహుశా బయటికి రాను. ఉదయంపూటా, సాయంత్రవేళల్లో తప్ప ఆ గదిలోంచి నేను బయటికి రాను. ఈ ఆశ్రమంలో ఎక్కడా తిరగను – కానీ ఇక్కడ జరుగుతున్నదంతా నాకు తెలిసే ఉంటుంది. అన్నీ నా నిర్దేశకతలోనే జరుగుతూ ఉంటాయి. దయచేసి మీరు కల్పించుకోకండి.

తూలికలాగా అనవసరంగా జోక్యం కల్పించుకుంటున్న మరికొందరు కూడా ఉంటున్నారు. తప్పొప్పుల్ని నిర్ణయించడానికి మీరు ఎవరూ కారు. ఈ విషయం ముందే మీకు తెలిసే ఉంటే మీరు జ్ఞానోదయాన్ని పొంది ఉన్నవాళ్ళే – మీరు వెళ్ళిపోండి ఇంటికి.

న్యాయాన్యాయాలను విచారిస్తూ ఉండడం కాదు మీ వ్యాపారం. ఇది సామాన్యపు ఆశ్రమం కాదు. కాబట్టి సామాన్య విషయాలు ఇక్కడ వర్తించవు. ఓ మహా అసాధారణ ప్రయోగం జరుగుతోంది ఇక్కడ. ఎవరికి ఏం ఆవశ్యకమో తెలుసు నాకు. ఎవరినైనా ఆశ్రమద్వారం వద్ద నుంచే వెనక్కు పంపించేయాలని నాకు అనిపిస్తే, ఆ మనిషిని లోపలికి రానీయకపోవడం మాత్రమే జరుగుతుంది. తిరస్కరించినందుకు ఏ కారణాన్నీ ఇవ్వనక్కరలేదని నాకు అనిపిస్తే అప్పుడు ఏ కారణాలూ ఇవ్వబడవు. ఆ మనిషిపట్ల అలా ప్రవర్తించడం నా సాధనం, ఆ మనిషి కోసమే ఆ సాధనం.

ఇప్పుడు మీరు ఇందులోకి రాకూడదు. ఆ పనినే మీరు చేస్తే మీ అభివృద్ధిని పొందే అవకాశాన్నే మీరు పోగొట్టుకుంటారు. ఆశ్రమద్వారం రక్షకులకు వాళ్ళ విధులు ఉంటాయి. వాళ్ళ కర్తవ్యం ఏమిటో వాళ్ళకు తెలుసు. వాళ్ళేం చేస్తున్నారో వాళ్ళకు తెలుసు. వాళ్ళు నా అందుబాటులోనే ఉంటారు. వాళ్ళేం చేస్తున్నారో నాకు తెలుసు. మీరు పట్టించుకోకండి.

ఇది సామాన్య ప్రదేశం కాదు. ప్రతి ఒక్కరూ ఇక్కడ పరిరక్షించబడతారు. అందరి శ్రేయాన్నీ ఇక్కడ గమనించుకోవడం జరుగుతుంది. ఎవరికైనా నెత్తిమీద ఓ దెబ్బపడాల్సే ఉంటే, ఆ దెబ్బను ఆ మనిషికి ఇవ్వడం జరుగుతోంది. దాన్ని మీరు నిరోధించకూడదు. ఆ పనిచేశారంటే ఆ మనిషి అభివృద్ధికి మీరే తయారవుతారు ఓ

అభ్యంతరంగా, ప్రతిబంధకంగా. ఆ మనిషికి మీరు అడ్డంపడుతూ, మీకు కూడా అడ్డంగానే తయారవుతారు. అనవసరంగా దాన్ని గురించి ఆందోళన, ఆవేశాలు పడిపోతారు.

కొంతమంది ఉన్నారు – వారిలో పద్మసంభవ ఒకరు. వాళ్ళు నాకు ఉత్తరాలు వ్రాస్తూ ఉంటారు 'అది జరిగింది, ఎవరో ఇది చేశారు, ఇది ఈ విధంగా ఉండకూడదు' అంటూ. ఏది ఇక్కడ ఉండాలో, ఉండకూడదో నిర్ణయించడానికి మీరెవరూ కారు. ఈ ఆశ్రమంలోకి మీరు ప్రవేశించిన తక్షణం మీరు అయిపోతారు ఇందులో భాగం. అప్పుడు మీరు సర్వస్వాన్నీ నాకు వదిలిపెట్టెయ్యాలి. అది జరగకపోతే పనిజరగడం అసాధ్యం.

ఆశ్రమంలోకి ప్రవేశం లభించని మనిషి నాకు తెలుసు, ఎందుకు ఆ మనిషికి ప్రవేశం లభించలేదో కూడా తెలుసు – తనకెందుకు ఆహ్వానం లభించలేదో ఆ మనిషికి కూడా తెలుసు. కారణాలు చెప్పాల్సిన అవసరం లేదు. ప్రతి విషయానికీ కారణాలు చెప్పుకుంటూ ఉండాలంటే అప్పుడు నా పని అంతా కారణాలను అందిస్తూ ఉండడం మాత్రమే అయిపోతుంది. వేలమంది వస్తూ ఉంటారు. ప్రతి ఒక్కరికీ కారణాలు కావాలి, వివరణలు కావాలి, ప్రతివిషయం గురించీ. లక్ష్మి సరయిన మాటనే అంది.

మరి ఎప్పుడూ మరచిపోకండి లక్ష్మి ఏ పనినీ తన స్వంత నిర్ణయాలతో ఎప్పుడూ చేయదని. ఆమె ఉంటోంది సవ్యమైన వాహనంగా; అందువల్లే ఆ పనికోసం ఆమెను ఎంచుకోవడం జరిగింది. ఇక ఇప్పుడు నేను తూలికను ఏ పనికోసమూ ఎంచుకోలేను, ఎందుకంటే ఏది తప్పో, ఏది ఒప్పో నిర్ణయించే విచక్షణా ఊహ ఆమెలో ఉంది కనుక. లక్ష్మికి ఏ విచక్షణా లేదు. ఆమె విని పనిచేస్తుంది. ఏం చెప్పినా ఆ పనిని చేస్తుంది.

మరి మీరు కూడా ఈ పద్ధతులను నేర్చుకుని తీరాలి. ఎందుకంటే త్వరలోనే మరింత పెద్ద ఆశ్రమంగా ఇది కాబోతూ ఉంది కనుక, మరి ఎన్నోవేలమంది ఇక్కడికి వచ్చిచేరుతూ ఉంటారు కనుక, ఈ విషయాలను ఇంతటితో ముగించండి. ఈ విషయాలను మళ్ళీ మళ్ళీ మీరు నా దృష్టికి తీసుకొస్తూ ఉండకూడదు. మళ్ళీ మళ్ళీ మీరు ఉత్తరాలు వ్రాస్తూనే ఉంటున్నారు "ఎవరో ఇది చేశారు..." అని. దాన్ని దర్శించాల్సిన పని నాది. అవి అయుక్తాలని నాకు అనిపిస్తే వాటి నిరోధం తప్పకుండా

జరుగుతుంది. మీరు దాన్ని నా దృష్టికి తెచ్చే పనే ఉండకూడదు. నా సమయాన్ని మీరు అందువల్ల దుర్వినియోగం చేసేస్తారు.

మరి మీక్కూడా ఆందోళనలూ, ఆవేశాలూ వచ్చేస్తూ ఉంటాయి... సన్యాసాన్ని వదిలిపెట్టేసి వెళ్ళిపోయినవారు కూడా ఉన్నారు, ఏ విడ్డూర అన్యాయమో ఇక్కడ జరగడం వాళ్ళు చూశారు కాబట్టి. ఇప్పుడు వాళ్ళు తమ అవకాశాన్ని పోగొట్టుకున్నారు. అది వాళ్ళ వ్యాపారం కాదు. మీరు ఇక్కడికి వచ్చారు మీ ఎదుగుదలకోసం. మీ స్వీకారం, సమర్పణ ఉండాలి సంపూర్ణంగానే. అప్పుడే తత్పురోగమనం కాగలుగుతుంది సంభవం. అప్పుడు మాత్రమే పని జరగగలుగుతుంది. అప్పుడు మాత్రమే నేను మీకు సహాయపడగలుగుతాను. దయచేసి నాకు సలహాలు ఇవ్వకండి. ఏ క్షణంలో సలహాలను మీరు నాకు అందిస్తారో ఆ క్షణం నుండి మీరు నాకు దూరం అయిపోయి ఉంటారు, నాతో సంబంధాన్ని తెంపేసుకుని.

ఇది ఉండదు ప్రజాస్వామ్యంగా 'ఏం చెయ్యాలి, ఏం చెయ్యకూడదు' అని మిమ్మల్ని అడగబడడం జరగదు, జరగకూడదు. మొదటినుంచీ ఈ విషయాన్ని మీరు గుర్తుపెట్టుకోవాలి – ప్రజాస్వామికంగా ఇక్కడ ఉండదని. మీ అభిప్రాయాల ప్రకారం ఇక్కడ ఏదీ ఉండదని. ఈ జ్ఞానాన్ని మీరు మీలో నిలిపి ఉంచుకోవాలి. మీరు ఇందులో ఓ భాగంగా దాన్ని నియమించుకోవాలి, నేను చేసిన నిర్ణయాలే సంపూర్ణాలు. వాటిని ఎంచుకోవడానికి మీరు సుముఖులు కాలేకపోతే, ఇక్కణ్ణుంచి మీరు వెళ్ళిపోవడమే మంచిది.

కొంతమందికి ఆశ్రమ ప్రవేశం లభించడం లేదు. కానీ ఈ ఆశ్రమం నుండి వెళ్ళిపోవడాన్ని మాత్రం ఎవ్వరూ నిషేధించరు. మీరు వెళ్ళిపోవచ్చు. వెళ్ళిపోతామంటే ఆపేయబడుతున్నవాళ్ళను మీరు చూశారా? ఇక్కణ్ణుంచి వెళ్ళిపోవడం పూర్తిగా ఉచితం– మీరు స్వేచ్ఛులే, అదే మీ నిర్ణయమైతే. మీరిక్కడ ఉండాలనుకుంటే మీరుండాలి ఇక్కడ సంపూర్ణంగా. ఇది మీరు ఉండాల్సినచోటు కాదని మీకు అనిపిస్తే, మీ వాంఛితాలు ఇక్కడ మీకు తీరడంలేదని మీకు అనిపిస్తే, మీకు యుక్తంగా ఇక్కడ ఉండడంలేదని మీకు అనిపిస్తే, స్వేచ్ఛులై మీరు వెళ్ళిపోవచ్చు.

ఈ ఆశ్రమం ఉండదు మీకు అనుకూలంగా. ఈ ఆశ్రమం ఉంటోంది మిమ్మల్ని పరివర్తించేందుకోసమే. మరి ఇవే ఆ ప్రారంభాలు. తప్పొప్పుల్ని తెలుసుకోవడానికి మీరు ఎవరు? కారణాలను ప్రశ్నించడానికి మీరు ఎవరు? మీకేంటి దీంతో ప్రమేయం?

ఏ హిందూసన్యాసి ఇక్కడికి రానీయబడలేదో, ఎందుకు తను ఈ ఆశ్రమంలోకి రానీయబడలేదో కారణం తెలుసుకోవాలని ఉంటే దాన్ని కనుక్కునేందుకోసం మళ్ళీ ఇక్కడికి తప్పకుండా తిరిగొస్తాడు. ఆ మనిషి కారణాన్ని ప్రశ్నించలేదు. ఎందుకంటే ఆ మనిషికి తెలుసు కనుక. ఎందుకు లోపలికి రానివ్వలేదో ఆ మనిషికి చెప్పబడింది. ఆ మనిషి ఈ ఆశ్రమానికి ఓ ఉపద్రవంగా తిరుగుతున్నాడు. కానీ ఈ విషయాలను ప్రతిఒక్కరూ అడుగుతూ ఉండకూడదు. అది మంచిదికాదు. ఆ మనిషి గురించి అందరికీ చెప్పడం మంచిదికాదు. అప్పుడది అమర్యాద చేసినట్లే అవుతుంది ఆ మనిషికి. ఆ మనిషికి చెప్పడం జరిగింది. అర్థం చేసుకున్నాడు. ఎందుకంటే తనేం చేస్తున్నాడో ఆ మనిషికి తెలుసు కనుక.

మధ్యలోకి ఉన్నట్లుండి నువ్వొచ్చి దూకావు. ఏ గొప్ప పనో చేశావని అనుకున్నావు. ఏ గొప్ప సేవో చేశావనుకున్నావు. అన్యాయం నుండి ఓ మనిషిని కాపాడుతున్నానని అనుకున్నావు. జరిగిన కథ మొత్తం నీకు తెలియదు. ఆ జరిగిన కథను నువ్వు తెలుసుకోవాల్సిన అవసరం కూడా లేదు. ఎందుకంటే ప్రతి ఒక్కరి కథలనూ చెప్పుకుంటూ కూర్చోవడానికి ఇక్కడ ఎవ్వరున్నారు? నీ గురించి మాత్రమే నువ్వు నిర్ణయించుకో. ఈ ఆశ్రమంలో విషయాలు అన్నీ నువ్వు అనుకుంటున్నట్లే జరగవు. ఆ విషయాలతో, పరిస్థితితో నువ్వే సర్దుకుని ఉండాలి. అలా సర్దుకుని ఉండడం కష్టం అని నీకు అనిపిస్తూ ఉంటే, ఇక్కణ్ణుంచి స్వేచ్ఛతో నువ్వు వెళ్ళిపోవచ్చు.

ఇదే ఆఖరిప్రశ్న కానీయండి. ఎన్నో ప్రశ్నలు వస్తున్నాయి నా వద్దకు. ఎవరో ఓ వ్యక్తి అభివృద్ధి సమూహంలో చేరుతారు. తరువాత ఉత్తరాలు వ్రాస్తారు – "ఎందుకుంటోంది ఇంత ఎక్కువ హింసాప్రవృత్తి ఈ అభివృద్ధి చర్చలలో?" అని. మరి ఈ ప్రశ్న ఆ వ్యక్తి అభివృద్ధి సమూహపు నాయకురాలి దగ్గర్నుంచే వచ్చింది. ఆ అమ్మాయే ఆ సమూహానికి నాయకురాలై ఉంది అప్పుడు. రెండుమూడురోజులపాటు ఆ అమ్మాయే వ్యక్తిత్వం మీద దాడి చేసే గ్రూప్ నాయకురాలై, తరువాత 'ఆ నాయకత్వం నాకొద్దు' అని వదులుకుంది. ఆ విషయం గురించే ప్రశ్నిస్తూ ఉంది. ఆమే అడిగింది ఆ నాయకత్వాన్ని తనకు ఇమ్మని. ఆ నాయకత్వాన్ని ఆమెకు ఇవ్వకూడదు, ఇంకెవరికో ఇవ్వాలని నేను నిర్ణయించుకుని ఉన్నాను. కానీ ఆమే వచ్చి ప్రార్థించింది "వ్యక్తిత్వం మీద దాడి నేనే చేస్తాను" అని. నేను "సరే" అన్నాను. కానీ అలా నేను ఎందుకన్నానో మీరు అర్థం చేసుకోవాలి. అటువంటి విషయాల్లో స్వంతనిర్ణయాలు తీసుకోవచ్చన్నదే నా అర్థం.

ఓ సమూహానికి నాయకురాలు అయ్యింది కాబట్టి ఆ విషయం తనకు తెలుసుననే ఆ అమ్మాయి అనుకుంది. కొన్నిసార్లు ఆ నాయకురాలి పనే చేసింది కాబట్టి తనకంతా తెలుసునని ఆమె అనుకుంది. ఆమె నా దగ్గరికి వచ్చి అడిగినప్పుడే ఆ పనిని సవ్యంగా పూర్తిచేసే సమర్ధత తనకు లేదని నాకు అనిపించింది. ఎందుకంటే అప్పుడు ఆ సమూహంలో సభ్యులుగా నమోదు అయినవాళ్ళు ఆ క్షణంలో ప్రపంచంలో మహాప్రఖ్యాత స్థానాలలో ఉన్నవాళ్ళు కాబట్టి. నేనిస్తున్నంతటి పరిపూర్ణ స్వాతంత్ర్యం మరెక్కడా మీకు ప్రాప్తించదు.

పశ్చిమదేశాల్లోని వ్యక్తిత్వం మీది దాడి గ్రూపులు పరిమితాలతో నింపి కూర్చినవై ఉంటున్నాయి. ఎందుకంటే ఆ గ్రూపులీడర్లు పరిమితులే కాబట్టి. కొంతదూరం వరకు మాత్రమే ఆ నాయకులు వెళ్ళగలుగుతారు. పరిస్థితిని అదుపులో ఉంచడం కష్టం అయిపోయినప్పుడు, వాళ్ళు దాన్ని నిర్వహించలేని అసౌకర్యం వచ్చేసి, విషయాల్లోకి ముందుకుపోలేని ప్రతిబంధకాలు అక్కడ ప్రబలం అయిపోయి ఉంటాయి. నిర్వహిస్తున్న మనిషి మళ్ళీ వెనక్కు తిరిగిరాలేని పరిస్థితి తయారైపోయి ఉంటుంది. ఆ స్థితిలో పనిచేస్తే ఏ అభివృద్ధీ జరగదు. ఆ ప్రయత్నమే అయిపోతుంది అప్పుడు ఓ నిరోధం.

ఇక్కడ ఏ హద్దుల్నీ మనం విశ్వసించం.

వ్యక్తిత్వం మీద దాడి సమూహంలోకి నాయకులను వాళ్ళు తమ పరిధులను దాటివెళ్ళారన్న విషయం పరిపూర్ణంగా గ్రహించి ఉన్నారని నాకు తెలిసున్నప్పుడే పంపిస్తాను; వాళ్ళు అన్ని పరిధులకూ అతీతమైన జ్ఞానాన్ని పొంది ఉండాలి - లైంగికత్వపు పరిధులనూ, హింస పరిధులనూ, కోపం రౌద్రం పరిధులనూ, అన్నింటినీ. అన్ని పరిధులకూ అతీతంగా వాళ్ళు ఉండాలి. అదే నాయక సామర్థ్యం - అన్ని పరిధులనూ అధిగమించిన ప్రజ్ఞ.

ఇప్పుడు ఈ అమ్మాయికి ఎంతో భయం కలుగుతూ ఉంది. ఇప్పుడు ఆమె ఆ సమూహంతో వైరుధ్య దిశలో చరిస్తోంది. ఇప్పుడు ఆమె నన్ను అడుగుతూ ఉంది "అంత హింసను మీరెందుకు అనుమతిస్తున్నారు?" అని. అది మీ వ్యాపారం కాదు. అందులోకి ప్రవేశించే సామర్థ్యం మీకు ఉండకపోతే, అందులోకి మీరు ప్రవేశించనే అక్కరలేదు. మ్మ్? మరింత అహింసాత్మకంగా ఉన్న గ్రూపులోకి మీరు ప్రవేశించవచ్చు - జాజెన్. విపస్సన. మనవద్ద ఆడుకోవడానికి ఎన్నో బొమ్మలు ఉన్నాయి. మ్మ్? మీరే ఎంచుకోవచ్చు.

కానీ ఉత్తరాలు మాత్రం నాకు వ్రాయకండి. ఇక్కడ ఏం జరుగుతూ ఉన్నా అవన్నీ నా ఎరుకతోనే జరుగుతూ ఉంటున్నాయి. నాకు తెలియకుండా ఇక్కడ ఏ విషయాలూ జరగవు. కాబట్టి వాటిని గురించి మీరు నాకు చెప్పనక్కరలేదు. అవన్నీ నాకు ముందే తెలుసు. కాలం వృధా చెయ్యడం మాత్రమే అది అవుతుంది.

మరి ఏ క్షణంలో మీరు నాకు శరణుజొచ్చి సమర్పించుకుని నా సన్యాసులు అవుతారో నా సన్యాసినులు అవుతారో, ఆ సమర్పణే మహాసంపూర్ణంగా ఉండితీరాలి. కొన్నినెలలు పూర్తిగా ఆ అర్పణాభావంతోనే నా శరణ్యంలోనే మీరు ఉండిచూడండి. అప్పుడు మీకు కనిపిస్తుంది - అదుంటుంది మహారసాయనికంగా. అది మిమ్మల్ని పరివర్తిస్తుంది.

కొత్త మనుషులు ఇక్కడికి వచ్చి అనుకుంటారు "ఏమిటి సంగతి? పాతసన్యాసులు ఎందులోనూ జోక్యాన్నే కల్పించుకోరా? ఆశ్రమద్వారం దగ్గర ఎవర్నో లోపలికి రానీయకుండా పంపించేస్తూ ఉంటే పాతసన్యాసులు చూసీచూడనట్లుగానే వెళ్ళిపోతూ ఉంటారా? వాళ్ళకు అర్థం అవుతోందా, కావడంలేదా అది తప్పు అని? ఎంత నిర్లక్ష్యం, ఎంత ఉదాసీనత?

కాదు, వాళ్ళుంటున్నారు జ్ఞానులై. మీరు నేర్చుకుంటున్నట్లే వాళ్ళు కూడా నేర్చుకున్నారు. నెమ్మది నెమ్మదిగా ఏం జరుగుతూ ఉన్నా అన్నీ ఓ నిర్దిష్ట ప్రణాళిక ప్రకారమే జరుగుతున్నాయన్న జ్ఞానాన్ని వాళ్ళు పొంది ఉన్నారు. అదొక సాధనోపాయం అని అర్థం చేసుకుని వాళ్ళు ఉన్నారు. అందులో ఓ రహస్య విధానక్రమం దాగి ఉంది. ఆ విధానక్రమం ఏమిటో ఇక్కడ నాకు తప్ప ఇంకెవ్వరికీ తెలియదు. కాబట్టి మీరు లక్ష్మి దగ్గరికి వెళ్ళకూడదు. ఆమెకు తెలియదు. ఆమె వచ్చి ఏం చెయ్యాలో అడుగుతుంది, ఏం జరగాలో నేను చెబుతూ ఉంటాను, ఆమె చేస్తూ ఉంటుంది. ఆశ్రమద్వారం దగ్గర ఉన్న సాధువును మీరు అడగకూడదు - "మీరు ఏం చేస్తూ ఉన్నారు?" అని. ఆయనకు విధించబడి ఉన్న పనినే ఆయన చేస్తున్నాడు.

ఈ ఆశ్రమంలో భాగంగా మీరిక్కడ ఉండాలంటే, దీన్నంతా మీరు అర్థంచేసుకుని తీరాలి. మీరు ఉండాలి ఇక్కడ మహాసౌఖ్యులుగానే. ఏ తీర్పుల్నీ మీరు చేస్తూ ఉండకూడదు. త్వరలోనే, కొన్నినెలల సౌఖ్యతా, స్వీకారమూ తరువాత, అర్థం అవుతుంది మీకు. అదే జరిగింది పాతసన్యాసులు అందరికీ - వాళ్ళు ఇప్పుడు అర్థంచేసుకుని ఉన్నారు.

## ఆరవప్రశ్న:

*ప్రియ ఓషో,*

*ఓ రోజు గడచిన సందర్భంలో చిన్న చిన్న బహుమతులు నాకు దక్కితే బావుంటుందని నాకు అనిపిస్తూ ఉంటుంది; కొన్ని బీర్లో, సిగరెట్లో, డ్రగ్సో. కానీ ప్రస్తుతం ఇవేవీ నన్ను తృప్తిపరచలేకపోతున్నాయి. కానీ ఏ పారితోషికమో నాకు దక్కాలన్న ఆకాంక్ష మాత్రం నన్ను విడిచిపెట్టడంలేదు. ఏమిటి ఈ తపన? దేనితో నాకు కలుగుతుంది తృప్తి?*

దేనితోనూ మీకు లభించదు తృప్తి. కోరిక పనిచేసే సూక్ష్మవ్యవహారం గురించి మనం అర్థంచేసుకోవాలి. కోరిక ఈ విధంగా పనిచేస్తుంది : కోరిక మీ సంతోషానికి ఓ నియమాన్ని విధిస్తుంది. "నాకు ఈ కారో, ఈ అమ్మాయో, ఈ ఇల్లో స్వంతం అయితే నేను ఆనందంగా ఉంటాను" అని. అవి మీకు దక్కితే సంతోషం మీద ఉన్న నియమం తొలగిపోతుంది. ఆ అభ్యంతరం తొలగిపోగానే మీకు హాయిగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఇందులో మీరు చేసింది అనవసరంగా సంతోషం మీద విధించుకున్న నియమాన్ని, అడ్డును తొలగించు కోవడం మాత్రమే. కానీ అతిత్వరలోనే మీరు "ఓ అభ్యంతరాన్ని నేనే సృష్టించుకుని, ఆ తరువాత ఆ అభ్యంతరాన్ని నేనే తొలగించుకుంటే అప్పుడు నాలో ఏర్పడిన సౌఖ్యం అంతకుముందు ఏర్పడి ఉన్న సౌఖ్యంలాగే ఉంటోంది" అని ఆలోచిస్తున్నట్లు తప్పకుండా తెలుసుకుంటారు. కాబట్టి కోరికలు, మనం వాటిని తీర్చుకున్నప్పటికీ, మళ్ళీ మళ్ళీ, కొత్త కోరికలను సృష్టించుకుంటూనే ఉంటాయి.

నేను చెబుతూ ఉన్నది అర్థమవుతూ ఉందా? ముందు మీరో షరతును విధించు కుంటారు. "ఈ అమ్మాయి నాకు అందితే తప్ప నేను ఆనందంగా ఉండను. ఈ అమ్మాయిని పొందితేనే నేను ఆనందంగా ఉంటాను". ఇప్పుడు మీరు ఆ అమ్మాయిని పొందే ప్రయత్నాన్ని ప్రారంభం చేసేస్తారు. ఆ ప్రయత్నం ఎంత కష్టంగా ఉంటే, అంత ఉత్సాహమూ, అంత ఉబలాటమూ మీకు ఎక్కువ అవుతూ ఉంటుంది. జ్వరం వచ్చేసినట్లు ఉంటుంది.

మీకు కష్టం ఎంత ఎక్కువగా ఉంటే, అంత ఎక్కువగా ఆ సమస్య మిమ్మల్ని ఊరిస్తూ ఉంటుంది. ఎంత కష్టంగా ఆ పని ఉంటే అంత ఎక్కువగా మిమ్మల్ని మీరే ఘణంగా పెట్టుకుంటారు. జూదం ఆడేందుకు తయారైపోతారు. మీ నమ్మకం పెరుగుతూ

ఆ అమ్మాయిని పొందాలనే ఆశ కూడా పెరుగుతూనే ఉంటుంది. అదెంతో కష్టంగా, కఠినంగా ఉంటుంది. ఆ అమ్మాయి గొప్ప మనిషే అయ్యుండాలి. అందువల్లే ఇంత కష్టంగా ఉంది. ఆ అమ్మాయిని మీరు తరిమి, తరిమి వేటాడి చివరికి పట్టుకుంటారు. ఏ రోజు ఆ అమ్మాయిని మీరు పట్టుకుంటారో ఆ రోజే "ఈ అమ్మాయిని పొందితేనే, నేను ఆనందంగా ఉంటాను" అన్న షరతు తొలగిపోతుంది. ఇప్పుడు ఆ అమ్మాయిని మీరు పట్టుకుని ఉన్నారు. మీకు కలుగుతుంది సౌఖ్యం. మీ ఇబ్బంది అంతా తొలగిపోతుంది. ఇక మీరు ఆ అమ్మాయిని తరిమి వేటాడనక్కర లేదు. ఆమె దగ్గరికి వచ్చేశారు. ఫలితం మీ చేతుల్లోనే ఉంది. మీరుంటారు అప్పుడు సంతోషంగా – సంతోషంగా ఎందుకు ఉంటారంటే ఇబ్బంది తొలగిపోయింది కాబట్టి.

ఓ రోజు ముల్లానస్రుద్దీను నడచివస్తూ ఉంటే చూశాను. తిట్లూ, శాపాలూ పెట్టుకుంటూ ఎంతో బాధపడుతూ నడుస్తున్నాడు. నేను నస్రుద్దీనును అడిగాను "ఏమైంది? ఏమిటి సంగతి? కడుపునొప్పా, తలనొప్పా, ఏమొచ్చింది? ఎంతో వేదన పడుతున్నట్లున్నావు" అని.

నస్రుద్దీను అన్నాడు "ఏమీ లేదు. నేను తొడుక్కున్న బూట్లు ఇరుకుగా ఉన్నాయి."

"అయితే వాటిని ఎందుకు వేసుకున్నావ్?"

నస్రుద్దీన్ అన్నాడప్పుడు "నాకు మిగిలున్న ఏకైక సుఖం అదొక్కటే – నా బూట్లు విప్పేసిన తరువాత నాకు మిగిలేది. అదొక్కటే నాకు మిగిలున్న ఆనందం. కాబట్టి ఈ బూట్లను నేను పారెయ్యకూడదు. అవి నా కాలుసైజుకంటే ఒక నంబరు తక్కువ సైజు బూట్లు. వీటిని తొడుక్కుంటే ఓ నరకంలో ఉన్నట్లే ఉంటుంది, కానీ వదిలిన తరువాత స్వర్గాన్నే ఇవి అందిస్తాయి. ఇంటికి వెళ్ళి, బూట్లు విప్పేసి, పరుపుమీద వాలిపోయానంటే స్వర్గంలోకి వచ్చేశానని నేను అనుకుంటాను. ఎంతబావుంటుందో అది."

అదే మీరూ చేస్తున్న పని. బాధను మీరే సృష్టించుకుంటారు, వేదనను మీరే కల్పించుకుంటారు, వేటాడడాన్నీ, జ్వరాన్నీ మీరే తెచ్చుకుంటారు. ఆ తరువాత ఏదోనాటికి ఇంటికి తొరిగొచ్చేసి, పరుపుమీద పడుకుని, "ఆహా! ఎంత గొప్పగా ఉందో? నేను వచ్చేశాను!" అని అనుకుంటారు. కానీ ఎంతసేపు ఉంటుందది? ఆ సౌఖ్యం కాస్సేపే ఉంటుంది. మళ్ళీ మీరు ఇంకో అత్యాశ పడాల్సిందే.

ఇప్పుడు ఆ అమ్మాయి మీకు పనికిరాదు. ఆమె మీ దగ్గరే ఉంది కాబట్టి. ఇక ఏ షరతునూ ఆమె మీద మీరు విధించలేరు. మళ్ళీ ఆ మాటను చెప్పుకోలేరు. "ఈ అమ్మాయిని పొందితేనే, నేను ఆనందంగా ఉంటాను" అని. ఆ అమ్మాయిని అప్పటికే మీరు పొందేసి ఉన్నారు కనుక. ఇప్పుడు మీరు ఇంకెవరి భార్యనో పొందాలని అనుకుంటారు. "ఆ అమ్మాయిని నేను పొందితే..." ఇప్పుడు మీకో కిటుకు తెలుసు - ముందుగా మీ సంతోషం మీద ఓ అభ్యంతరాన్ని మీరు విధించుకోవాలి, తరువాత కొంపలు ముంచుకుపోయేటట్లు ఆ అభ్యంతరం వెంటపడాలి. ఏనాటికైనా ఆ సౌఖ్యం మీకు దక్కుతుంది. కానీ ఇదంతా నిష్ఫలం. అర్థం చేసుకునే మనిషి ఏ షరతులనూ విధించుకోనక్కరలేదన్న విషయాన్ని దర్శించ గలుగుతాడు. మీరు ఏ అభ్యంతరాలనూ విధించుకోకుండానే ఆనందంగా ఉండవచ్చు. ముందు ఇరుకు బూట్లు వేసుకుని తరువాత ఎందుకు అనుభవించాలి సౌఖ్యాన్ని! ఏ ఇబ్బందీ లేకుండానే ఉండవచ్చుకదా? కానీ అప్పుడు మీకు సౌఖ్యంగా అనిపించదు కదా! – అదీ సమస్య. సౌఖ్యంగా ఉన్నట్లు మీకు అనిపించాలంటే ఏ తారతమ్యమో అందులో ఉండాలి. సౌఖ్యంగానే ఉన్నా, దాన్ని మీరు అనుభూతి పొందలేరు కాబట్టి.

అదే నిజంగా సంతోషంగా ఉంటున్న మనిషికి నిర్వచనం : నిజంగా సంతోషంగా ఉన్న మనిషి ఎవరంటే సంతోషం గురించి ఏమీ తెలియకుండా ఉన్నవాడే అని, దాన్ని గురించి ఎప్పుడూ విననివాడే అని, ఎంతో సంతోషంగా ఎవరు ఉన్నారో, ఏ షరతులూ లేకుండా ఎంత సంతోషంగా ఎవరున్నారో, అటువంటివాళ్ళు సంతోషంగా తామున్నామని ఎలా తెలుసుకోగలుగుతారు? సంతోషంగా లేని మనుషులు మాత్రమే చెప్పగలుగుతారు "నేను సంతోషంగానే ఉన్నాను, అన్నీ గొప్పగా ఉంటున్నాయి" అని. ఇలా అంటున్నవాళ్ళందరూ సంతోషంగా లేని మనుషులే. సంతోషంగా ఉన్న మనిషికి సంతోషం గురించి ఏమీ తెలియదు. మామూలుగానే అది అక్కడ ఉంటుంది. ఎప్పుడూ ఉంటుంది అది అక్కడే, ఓ శ్వాసలాగా.

శ్వాసిస్తూ ఉన్నప్పుడు సంతోషంగా మీరు ఉంటున్నట్లు ఉండరు. అప్పుడు మీరు ఒక పని చెయ్యాలి. గట్టిగా మీ ముక్కు మూసేసుకోండి. ఏ యోగాసనాలో వేసుకుని కూర్చుని మీ శ్వాసను బంధించి ఆపెయ్యండి. లోపలున్న గాలిని బయటికి వదిలిపెట్టకూడదు. బయట ఉన్న గాలిని లోపలికి తెచ్చుకోకూడదు. అప్పుడు తయారవుతుంది మీలో తపన-వేదన. దాన్ని కూడా అణచిపెట్టేస్తూ ఉండండి. నిజంగా

ఓ యోగశిష్యుడు అయిపోండి – శ్వాసను ఇంకా అణచేసి ఉంచండి. ఉన్నట్లుండి అది పేలిపోతుంది. అప్పుడు వచ్చేస్తుంది మీకు ఓ గొప్ప ఆనందం, కానీ ఇదంతా చెయ్యడం మూర్ఖత్వమే – కానీ ప్రతి మనిషీ ఎప్పుడూ చేస్తున్నది ఇదే. అందువల్లే మీరందరూ ఫలితం కోసం సాయంత్రం ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తూ ఉంటారు.

సంతోషం ఉంటోంది ఇక్కడే, ఇప్పుడే; దానికి ఏ నియమాలూ, అభ్యంతరాలూ, షరతులూ అక్కర్లేదు. సంతోషమే సహజస్థితి. ఈ సూక్ష్మాన్ని అర్థంచేసుకోండి. ఏ షరతులనూ మీ సంతోషం మీద విధించుకోకండి. సంతోషంగానే ఉండండి ఏ కారణమూ లేకుండానే. ఏ కారణమూ లేదు వెతుక్కుని సంతోషంగా ఉండడానికి. ఉండండి మామూలుగా సంతోషంగానే. సహజంగా సంతోషంగానే.

వృక్షాలు ఉంటున్నాయి సంతోషంగా. వాటికి సాయంత్రం అయ్యేసరికి బీర్లు అక్కరలేదు, సిగరెట్లు అక్కరలేదు. అవి ఉంటున్నాయి సంపూర్ణంగా సంతోషంలో. చూడండి!... వీస్తోన్న గాలి సంతోషంగా ఉంటోంది, సూర్యుడు ఉంటున్నాడు సంతోషంగా. ఇసుకమేటలు ఉంటున్నాయి సంతోషంగా, సాగరం ఉంటోంది సంతోషంగా. మరి అన్నీ ఉంటున్నాయి సంతోషంగానే, ఒక్క మానవుడు తప్ప – ఎందుకంటే ఏ షరతులూ వాటికి ఉండడంలేదు కనుక. ఉండండి సంతోషంగా.

సంతోషంగా మీరు ఉండలేకపోతే, అప్పుడు అటువంటి అసాధ్యాలయిన షరతులను అందుకోసం విధించుకోకండి – అదెంతో కష్టంగానే ఉంటుంది. అప్పుడు ముల్లా చేస్తున్నది సరయిన పనే అవుతుంది – ఎంతో చిన్న విషయం. నాకు అర్థమైంది. మీరు అనుకుంటున్న దానికంటే ముల్లా మహాతెలివున్న మనిషే; ఎంత చిన్న చిట్కా–ఒకసైజు తక్కువ బూట్లు తొడుక్కోవడం – ఎంతో సామాన్యమైన ఉపాయం. ఈ కిటుకును వాడుకోకుండా ఎవ్వరూ మిమ్మల్ని ఆపలేరు. సాయంత్రం అయ్యేసరికి మీరెంతో సంతోషంగా ఉంటారు. చిన్న చిన్న కిటుకులను, చిట్కాలను, సాధనాలను, ఉపాయాలను వినియోగించుకోండి. మీరు ఎంత సంతోషంగా ఉండాలని అనుకుంటే, అంత సంతోషంగానే ఉండండి.

కానీ మీరు అంటారు "ఈ పెద్ద మేడ నా స్వంతమయితేనే సంతోషంగా నేనుంటాను" అని. ఓ పెద్ద నిబంధనను మీరు ఇప్పుడు విధించుకుంటున్నారు. ఇది ఫలించడానికి ఎన్నో ఏళ్ళు పట్టొచ్చు. మీరు అలసిపోవచ్చు, సొలసిపోవచ్చు. నిజంగా

ఈ ఇల్లు మీ స్వంతం అయ్యేసరికి మీరు మృత్యుశయ్యమీదే ఉండొచ్చు. అదే జరుగుతుంది. మీ జీవితాన్నంతా వృథా చేసుకుని ఈ ఇంటిని మీ సమాధిగా సంపాదించుకుంటున్నారు. మీరనుకోవచ్చు "ఓ మిలియన్ డాలర్లను సంపాదించిన తరువాతనే నేను ఆనందంగా ఉంటాను" అని. అప్పుడు మీరు ఆ మిలియన్ డాలర్లకోసం మీ జీవితాంతమూ శ్రమించాలి వృథాగా. ముల్లా నస్రుద్దీను మీకంటే ఎంతో వివేకం ఉన్న మనిషిలా కనిపిస్తున్నాడు. చిన్న చిన్న నియమాలతో మీకు కావాల్సినంత సంతోషాన్ని పొందుతూ ఉండండి.

విషయాన్ని మీరు అర్థంచేసుకునే ఏ నిబంధనలనూ మీరు విధించుకోనక్కర లేదు. విషయసూక్ష్మతను గ్రహించండి – నిబంధనలతో సంతోషం సృష్టింపబడదు, వాటితో కేవలం ఓ విమోచనం మాత్రమే మీకు కలుగుతుంది. కానీ ఈ విమోచనం ఉండదు శాశ్వతంగా. ఏ ఉపశమనమూ ఉండదు ఎల్లకాలమూ. కేవలం కొన్నిక్షణాలు మాత్రమే మీకు సౌఖ్యంగా ఉంటుంది.

ఎన్నిసార్లు దీన్ని మీరు గమనించలేదూ? మీరు ఓ కారు కొనాలనుకుంటారు. ఆ కారు మీకొస్తుంది. మీ పోర్టికోలో ఆ కారు ప్రక్కన మీరు గర్వంగా సంతోషంతో నిలబడి ఉంటారు. ఎంతసేపు ఉంటుంది ఆ సంతోషం? రేపటికి ఆ కారు ఒకరోజు పాతదైపోయి ఉంటుంది. ఎల్లుండికి అది రెండురోజుల పాతదైపోయి ఉంటుంది. మీ మీ చుట్టుప్రక్కల్లో వాళ్ళు అందరూ అప్పటికే ఆ కారును చూసేసి ఉంటారు. అందరూ ఆ కారునూ, మిమ్మల్నీ మెచ్చుకోవడం పూర్తయిపోయి ఉంటుంది. ఆ కారు పని పూర్తయిపోయి ఉంటుంది! ఇక దాన్ని గురించి ఎవ్వరూ మాట్లాడరు. ఇందువల్లే కార్లు ఉత్పత్తి చేసేవాళ్ళు కొత్త కొత్త కార్లను ప్రవేశపెడుతూ, పరిచయం చేస్తూ ఉంటారు, కొత్త కొత్త షరతులను మీకు విధిస్తూ.

మనుషులందరూ అత్యాశల వెంట పరుగులుతీస్తూ ఉన్నది తాత్కాలిక సుఖాలకోసమే. ఈ కథను ఎప్పుడైనా మీరు విన్నారా?

ఓ భిక్షగాడు ఓ చెట్టుక్రింద కూర్చుని ఉన్నాడు. ఓ ధనవంతుడి కారు పాడయి పోయింది. డ్రైవర్ ఆ కారును బాగుచేసేందుకు ప్రయత్నిస్తూ ఉన్నాడు. అందువల్ల కారు దిగి ఆ ధనవంతుడు చెట్టుక్రిందికి వచ్చి నిలబడ్డాడు. అక్కడే ఈ భిక్షగాడు హాయిగా విశ్రాంతి తీసుకుంటూ ఉన్నాడు. ఆ ధనికుడు "నువ్వేదయినా ఉద్యోగం చేసుకోవచ్చును కదా?" అని భిక్షగాణ్ణి అడిగాడు.

భిక్షగాడు అడిగాడు “ఎందుకు?”

ధనికుడికి ఆ మాట వినేసరికి ఎంతో అసౌకర్యం కలిగింది – “నీ దగ్గర డబ్బుంటే పెద్ద ఖాతాను బ్యాంక్‌లో పెట్టుకోవచ్చు?”

మళ్ళీ భిక్షగాడు అడుగుతున్నాడు “ఎందుకూ?”

ధనికుడికి ఇంకా ఎక్కువ ఇబ్బంది కలిగింది. “ఎందుకా? వృద్ధాప్యంలో పనిచెయ్యడం మానేసి హాయిగా విశ్రాంతి తీసుకోవచ్చు కాబట్టి.”

“కానీ”, భిక్షగాడు అంటున్నాడు “ఆ విశ్రాంతిని ఇప్పుడే నేను తీసుకుంటూ ఉన్నాను కదా! దానికోసం ముసలివాడిని అయ్యేదాకా ఎందుకూ వేచిఉండడం? ఈ బుద్ధిలేని పనులన్నిటినీ అంతకాలం ఎందుకు చెయ్యాలి? – ఉద్యోగం చెయ్యాలి, డబ్బు సంపాయించాలి, బోలెడు డబ్బు బ్యాంక్‌లో జమచేసుకోవాలి. ఆ తరువాత తీసుకోవాలా విశ్రాంతీ? మీకు కనిపిస్తోందా? నేను ఇప్పుడే తీసుకుంటున్నాను విశ్రాంతి! దీనికోసం ఎందుకు వేచి ఉండాలి?”

సాయంత్రం దాకా ఎందుకు వేచి ఉండాలి? బీరుకోసం వేచి ఉండడం ఎందుకూ? నీళ్ళు త్రాగుతూ ఎందుకు ఆనందించకూడదూ?

జీసస్ నీళ్ళను ద్రాక్షసారాగా మార్చేసిన కథ విన్నారా? క్రైస్తవులు ఎవరూ ఆ కథను విననేలేదు. వాళ్ళందరూ జీసస్ నిజంగానే నీళ్ళను వైన్‌గా మార్చేశాడని అనుకుంటున్నారు. అది కాదు సత్యం. జీసస్ కూడా తన శిష్యులకు ఇప్పుడు నేను మీకు నేర్పిస్తున్న రహస్యాన్నే బోధిస్తూ ఉండి ఉండవచ్చు. ఆయన చెప్పి ఉంటాడు తన శిష్యులకు “ఈ నీళ్ళను ఆనందంగా త్రాగుతూ ఈ నీళ్ళనే ద్రాక్షసారా కానియ్యండి.”

నీళ్ళను కూడా మీరు ఎంతో ఆనందిస్తూ త్రాగగలిగితే దాదాపుగా ఓ మత్తే కలుగుతుంది మీకు. ప్రయత్నించి చూడండి! నీళ్ళు కూడా మీకు మత్తును కలిగించగలుగుతాయి. అది మీ మీదే ఆధారపడి ఉంది. బీరు మీదో, వైను మీదో ఆధారపడి అది లేదు. ఇది మీకు ఇంకా అర్థంకాకుండా ఉంటే వెళ్ళి ఓ హిప్నాటిస్టును అడిగిచూడండి – ఆ మనిషికి ఇది తెలిసే ఉంటుంది. ఓ మనిషిని యోగనిద్రలోకి పంపించి, ఓ గ్లాసు నీళ్ళు ఆ మనిషి చేతికి ఇచ్చి అదే వైన్ అని చెబితే, ఆ మనిషి దాన్ని త్రాగిన తరువాత, ఆ మనిషికి నిజంగానే మత్తెక్కుతుంది – నీళ్ళతో.

ఇప్పుడు డాక్టర్లకు ప్లాసెబోల గురించి తెలుసు. కొన్నిసార్లు వైద్యఫలితాలు ఎంతో సందిగ్ధాన్నీ, ఆశ్చర్యాన్నీ కలిగిస్తాయి. ఓ హాస్పిటల్‌లో కొన్ని ప్రయోగాలను

చేస్తూ ఉన్నారు. ఒకే జబ్బుతో బాధపడుతూ ఉన్న ఇరవైమందికి మందులు ఇచ్చారు, మరో ఇరవైమంది రోగులకు 'మందు ఇస్తున్నాం' అని చెబుతూ మంచినీళ్ళు ఇచ్చారు, మంచినీళ్ళతో రోగం కుదురుతుందేమో చూద్దామని. ఈ ప్రయోగం జరుగుతున్నప్పుడు ఏ డాక్టరుకూ, ఏ రోగికీ అది మంచినీళ్ళు అని తెలియదు. ఎందుకంటే డాక్టరుకు తను ఇస్తున్నది మంచినీళ్ళే అని తెలిసి ఉంటే రోగి చేతికి అది అందే లోపలే ఆ సంగతి డాక్టర్ వ్యవహారంవల్లే బయటపడిపోతుంది కాబట్టి. తను మంచినీళ్ళనే మందుగా ఇస్తున్నానని డాక్టరుకు తెలిస్తే నిజం మందు ఇస్తున్నంత గంభీరంగా మంచినీళ్ళను అందించలేడు కాబట్టి. అందువల్ల రోగికి కూడా ఏదో అనుమానం, సందేహం కలిగే తీరుతుంది. కాబట్టి అక్కడ మంచినీళ్ళనే మందుగా ఇవ్వబడుతూ ఉన్నదని ఏ డాక్టరుకూ, ఏ రోగికీ తెలియకుండా ప్రయోగాన్ని చేస్తున్నవాళ్ళు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆ జ్ఞానాన్ని కాగితం మీద వ్రాసి ఓ వాల్టులో (ఇనప్పెట్టె) పెట్టి తాళం వేసేశారు.

ఏం అద్భుతం అప్పుడు జరిగిందంటే నిజం మందులు ఎంత సమర్ధవంతంగా రోగుల మీద పనిచేశాయో మంచినీళ్ళు కూడా అంత సమర్ధవంతంగానే రోగులమీద పనిచేశాయి! రెండు ఇరవైమంది రోగుల సమూహాల్లోనూ పదిహేడుమందికి, రెండు సమూహాల్లోనూ, ఆరోగ్యం చేకూరింది, రెండు వారాల్లో. అంతకంటే అద్భుతమైన విషయం ఏమిటంటే, మంచినీళ్ళతో ఆరోగ్యం చేకూరినవాళ్ళే, ఆ మందుల్తో ఆరోగ్యాన్ని పొందినవారి కన్నా, ఎక్కువరోజులు ఆరోగ్యంగా ఉన్నారు. నిజమైన మందులతో ఆరోగ్యాన్ని పొందిన మనుషులు కొన్నివారాల తరువాత మళ్ళీ హాస్పిటల్‌కు రావడం ప్రారంభమయిపోయింది.

ఏం జరిగింది ఇక్కడ? మంచినీళ్ళు అంత అద్భుతంగా ఎందుకు పనిచేశాయి? 'అది మంచిదే' అన్న భావన సహాయపడుతుంది, మందు కాక. మంచినీళ్ళు మంచినీళ్ళే కాబట్టి ఏ ప్రమాదమూ ఉండదు, మందులవల్లే కలుగుతుంది ప్రమాదం. అందువల్లే నిజం మందుల్ని మ్రింగిన మనుష్యులే మళ్ళీ వైద్యశాలకు తిరిగొచ్చేశారు, వాళ్ళు కొత్త కోరికల్ని, కొత్త జబ్బుల్ని, కొత్త సమస్యల్ని సృష్టించుకోవడం ప్రారంభించేశారు కాబట్టి... ఎందుకంటే ఏ మందును మీకు ఇచ్చినా, అది ఏదో ఓ విధంగా మీ శరీరవ్యవస్థ మీద ఓ విరుద్ధ స్వభావాన్ని, ఓ అస్తవ్యస్తాన్ని సృష్టించి తీరుతుంది కాబట్టి. ప్రతి మందుకూ ప్రతిక్రియ శరీరానికి ఉంటుంది. నీళ్ళకు ప్రతిక్రియ ఉండదు. ఇది కేవలం స్వచ్ఛమైన యోగనిద్ర, హిప్నాసిస్ మాత్రమే.

ఎంతో ఆనందంగా, ఎంతో ఉత్సాహంతో, ఎంతో భక్తితో త్రాగితే మంచినీరే అయిపోతుంది మధువు. జెన్ మనుష్యులు ఓ సాంప్రదాయకర్మ చేస్తున్నంత శ్రద్ధగా, ఏ క్రతువునో చేస్తున్నంత భక్తితో టీ త్రాగే ఆచారాన్ని ఎంత ఎరుకతో చేస్తారో వెళ్ళిచూడండి. అప్పుడు ఆ టీ కూడా ఓ మహాప్రభావం ఉన్న సంభవమే అయిపోతుంది. మామూలు టీ అక్కడ పరివర్తింప బడుతుంది. సాధారణ వ్యవహారాలను సైతం మనం పరివర్తించుకోవచ్చు – తొలిసంధ్యకు ముందే సాగించే నడకసైతం మహా మత్తును మనకు అందించవచ్చు. ప్రొద్దున్నే నడక సాగిస్తే ఏ ఉత్సాహమూ మీకు కలగకుండా ఉంటే మీలోనే ఏదో తప్పు ఉన్నట్లే. ఓ గులాబీపువ్వును చూస్తున్నంత మాత్రాన మీకు పారవశ్యం కలుగవచ్చు. ఆ పువ్వు మీకు ఆ మత్తును ఇవ్వలేకపోతే, మరి దేంతోనూ మీకు మత్తు ఎక్కదు. ఓ పసిపాప కళ్ళల్లోకి చూసినంత మాత్రాన మహా పారవశ్యం మీకు కలుగుతుంది.

ఆనందంగా ఈ క్షణంలో జీవించడాన్ని నేర్చుకోండి. ఫలితాలను గురించి వెతక్కండి. ఏవీ ఉండవు. జీవితం ఎక్కడికీ వెళ్ళిపోదు. ఏ అంతమూ లేదు దానికి. జీవితం ఏ అంతానికో కాదు ప్రారంభం. ఇప్పుడిక్కడ ఉండడమే జీవితం. జీవించండి దీన్నే, పూర్తిగా జీవించండి, సక్రమంగా జీవించండి, సంతోషంగా చరించండి – సంపూర్ణులై మీరుంటారు. సాఫల్యాన్ని ఎప్పుడూ దాటివేయకూడదు. 'ఎప్పుడో దాన్ని సాధిద్దాం' అనుకుంటే ఎప్పటికీ మీకు సాఫల్యం రాదు. సాఫల్యం జరగాలి ఇప్పుడే ఇక్కడే – ఇప్పుడు జరగకపోతే మరెప్పటికీ అది జరగదు.

## చివరిప్రశ్న :

***ప్రియ ఓషో,***

***మనుషలు నన్ను నీచుణ్ణనీ, లోభిననీ అనుకుంటూ ఉంటారు. కానీ నాది పిసినారితనం మాత్రమేనని నాకు అనిపిస్తూ ఉంటుంది. మీరేమంటారు ఓషో?***

నేను మీకో చిన్న కథ చెప్తాను :

ఓ రోజు ప్రొద్దున్నే ఫుట్‌బాల్ ఆటల ఫలితాల పోటీలో తను గెలిచాడనీ, యాభైవేల పౌండ్ల బహుమతి వచ్చిందనీ తెలిసేసరికి ఆ యువకుడిలో ఆనందానికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి. ఆ యువకుడు తన తల్లిదండ్రులవద్దే ఆ ఇంట్లోనే ఉంటున్నాడు, వాళ్ళతోబాటే. ఆ విషయాన్ని వాళ్ళకు కూడా చెప్పేసరికి వాళ్ళు కూడా ఎంతో ఆనందించారు.

"సహజంగానే" ఆ యువకుడు ఉత్సాహంతో అమ్మానాన్నలతో అంటున్నాడు, "ఈ సంపదను మీతో పంచుకోకుండా నేను ఉండలేను. అందువల్ల ఇద్దరికీ చెరో పది పౌండ్లు ఇస్తాను."

ఓ గాఢనిశ్శబ్దం ఓ క్షణంపాటు ఆ ఇంట్లో నిండింది. ఆ తరువాత ఆ యువకుడి తండ్రి "మంచిది నాయనా" అంటూ ఇలా అన్నాడు, "నీకోసం మేము ఎంతో చేశాం, నీ మీదే మా ఆశలన్నీ పెట్టుకుని బ్రతుకుతూ ఉన్నాం, మీ అమ్మా, నేనూనూ. ఇన్నేళ్ళుగా ఏ లోపమూ నీకు జరగకుండా నిన్ను పెద్దచేశాం, ఇప్పుడు నీ కాళ్ళమీద నువ్వు నుంచోగల వాడివయ్యావ్. కానీ ఇప్పుడు మేము నీకు ఓ విషయం గురించి చెప్పేతీరాలి. నేనూ, మీ అమ్మా ఇద్దరం కలిసే ఉంటున్నాం కానీ మాకు పెళ్ళి జరుగలేదు."

"ఏమిటీ!" ఆ యువకుడు నిశ్చేష్టుడు అయిపోయాడు. "అయితే నువ్వు అంటున్నది నేను..."

"నువ్వు వాడివే", అన్నాడు తండ్రి, "అందులోనూ పరమ నీచాతి నీచుడివి!"

ఈ రోజుకు ఇది చాలు.



# 9. నిర్మల ధరిత్రీ స్వర్గం

భగవానుడు అడిగాడు : నువ్వేమనుకుంటున్నావు, సుభూతీ,
తథాగతుడు దీపంకర తథాగతుడి వద్ద నుండి నేర్చుకున్న ధర్మం
ఏదయినా ఉందా?
...సుభూతి బదులు పలికాడు : లేదు భగవాన్, ఏదీ లేదు.

భగవానుడు అన్నాడు : ఏ బోధిసత్త్వుడయినా 'చక్కటి సామరస్యం ఉన్న బుద్ధక్షేత్ర వ్యూహాలను నేను సృష్టిస్తాను' అన్నాడంటే, ఆయన మాట అసత్యమే అవుతుంది. మరి ఎందుకు? ఆ చక్కటి బుద్ధక్షేత్ర వ్యూహాలను... సుభూతీ, సామరస్యం ఉండని బుద్ధక్షేత్ర వ్యూహాలేనని తథాగతుడు భాషించాడు కనుక. అందువల్లే 'చక్కటి బుద్ధక్షేత్ర వ్యూహాలు' అని ఆయన అంటున్నాడు...

భగవానుడు అన్నాడు : మరి మళ్ళీ, సుభూతీ, ఓ ఉత్తమ స్త్రీ కానీ, ఓ ఉత్తమ పురుషుడు కానీ, గంగానదీ తీరం మీద ఎన్ని ఇసుకరేణువులు ఉన్నాయో అన్నిరెట్లు తమ సంపత్తును దానం చేస్తున్నారనుకో; మరి అనుకో 'ఈ ధర్మపరిబోధనంలోని నాలుగు శ్లోక పాదాలయినా ఒకరు గ్రహించి ఇతరులకు పరిబోధించారు' అని. అప్పుడు ఈ ధర్మప్రకాశి అంతకన్నా గొప్ప కొలవలేని, అగణనీయ, మహాపుణ్యరాశిని పొంది ఉన్నవాడు అవుతాడు.

ఆ ధర్మబోధ పూజ్యనీయుడైన సుభూతి కళ్ళల్లోకి
ఆనంద భాష్పాలను తెప్పించేసింది.
కన్నీళ్ళు కార్చి భగవానునితో అన్నాడు : అద్భుతం భగవాన్,
పరమాద్భుతం సుగతా, ఎంత బాగా తథాగతులవారు భాషించారు

ధర్మాన్ని! తత్ప్రజ్ఞ నాకు ప్రాప్తించింది... నిజంగా ఇది అగ్రాహ్యం. మరి ఎందుకు? బుద్ధుళ్ళు, భగవానులు, తమ అన్ని గ్రహణాలనూ వదలిపెట్టి వెళ్ళిపోయారు కనుక.

భగవానుడు అన్నాడు : ఔను, ఇదింతే సుభూతీ.
అద్భుతంగా ఆశీర్వదింపబడినవాళ్ళే అవుతారు ఈ ధన్యజీవులు,
ఈ ధర్మసూత్రాన్ని విని వణికిపోనివారు, భీతిల్లనివారు,
భయవిహ్వలులు కానివారు...
పైగా, సుభూతీ, తథాగతుడి క్షమాసంస్కరణ నిజంగా
సంస్కరణే కాదు.
మరి ఎందుకు? ఎందుకంటే, సుభూతీ, కళింగరాజు
నా సర్వాంగాలనూ ఖండిస్తూ ఉన్నప్పుడు ఆ సమయంలో
నాకు 'అహాన్ని' అన్న, 'జీవిని' అన్న, 'ఆత్మను' అన్న, 'వ్యక్తిని' అన్న
ఏ గ్రహణాలూ నాలో లేవు కనుక.
మరి ఎందుకు? ఒకవేళ, సుభూతీ, ఆ సమయంలో
ఓ 'అహాన్ని' నేనన్న గ్రహణం నాలో కలిగి ఉంటే
ఓ దుశ్చింతనా గ్రహణం కూడా నాలో ఆ సమయంలో
కలిగి ఉండేదే కనుక...

మరి ఇంకా, సుభూతీ, సర్వజీవుల శ్రేయం కోసమే బోధిసత్త్వుడు
చేయాలి దానాలను ఈ విధంగా.
మరి ఎందుకు? ఓ 'జీవిని' అన్న గ్రహణం, సుభూతీ,
కేవలం ఓ అగ్రహణం మాత్రమే. ఏ సర్వజీవుల గురించి
తథాగతుడు భాషించాడో, వారందరూ నిజంగా
అజీవులే కనుక.
మరి ఎందుకు? ఎందుకంటే తథాగతుడి భాషణ వాస్తవానికి
అనుగుణ్యంగానే ఉంటుంది కనుక, సత్యభాషణమే
అయివుంటుంది కనుక, ఏది ఉన్నదో దాన్నే భాషిస్తాడు కనుక,
లేనిదాన్ని చెప్పడు కనుక. ఓ తథాగతుడు అసత్యభాషణం చెయ్యడు...

'తథాగత' శబ్దం, సుభూతీ, సత్య సమతకే ఉంటుంది
సారూప్యంగా...

***భగవానుడు అడిగాడు : నువ్వేమనుకుంటున్నావు,***
***సుభూతీ, తథాగతుడు దీపంకర తథాగతుడి వద్దనుండి***
***నేర్చుకున్న ధర్మం ఏదయినా ఉందా?...***
***సుభూతి బదులుపలికాడు : లేదు భగవాన్, ఏదీ లేదు***

దీపంకరుడు ఓ ప్రాచీన బుద్ధుడు. గౌతమబుద్ధుడు తన గతజన్మలో, జ్ఞానోదయం పొందని రోజుల్లో, దీపంకరుని వద్దకు వెళ్ళాడు. తనను శిష్యుణ్ణిగా స్వీకరించమని గౌతమబుద్ధుడు దీపంకర తథాగతుణ్ణి ప్రార్థించాడు. కానీ ఆయన నవ్వేసి "నువ్వు నేర్చుకోవలసింది ఏదీ లేదు" అన్నాడు.

సత్యాన్ని నేర్చుకునేందుకు సాధ్యపడదు. ఔను. దేన్నో మీరు అర్థంచేసుకుని తీరాలి, కానీ దేన్నీ మీరు నేర్చుకోకూడదు. సత్యాన్ని గ్రహించే తీరాలి. ఇది ఇప్పటికే మీ ఉనికిలో ఉంది. దాన్ని బహిర్గతం చేసుకోవాలి. కానీ అక్కడ నేర్చుకునేది ఏమీ ఉండదు.

సత్యం ఉండడం లేదు సవ్యంగా. సత్యమే స్వయంగా మీ జీవి; మీ ఉనికి. మీరు తయారవ్వాలి ధ్యాసగా. మీరు మరింత జ్ఞానవంతులు అయితీరాలని కాదు. వాస్తవంలో మీరెంత ఎక్కువ జ్ఞానవంతులు అవుతూ ఉంటారో, అంత తక్కువ ధ్యాసగానే మీరు ఉంటారు. మీకు తెలుసునని ఎంత ఎక్కువగా అనుకుంటూ ఉంటారో, అంత ఎక్కువ అజ్ఞానంతోనే మీరు కప్పబడి ఉంటారు.

జ్ఞానమే అజ్ఞానం. జ్ఞానవంతుడు జ్ఞాపకాల, సమాచారాల, ఉల్లేఖనాల, వేదాంతాల కారుమబ్బులతోనే కప్పబడి ఉంటాడు.

దీపంకరుడు అన్నాడు గౌతముడితో, "ఏదో నేర్చుకోవాలన్న ఆలోచనలను నువ్వు చెయ్యకూడదు. సత్యం ఇప్పటికే ఉంది నీలోనే. సత్యాన్ని అందించడం సాధ్యపడదు". ఇది మాత్రమే కాదు, కానీ గౌతమబుద్ధుడు దీపంకర తథాగతుడి పాదాలను స్పృశించినప్పుడు, దీపంకరుడు కూడా ముందుకు వంగి గౌతముడి పాదాలను స్పృశించాడు. గౌతముడికి అప్పటికి ఇంకా జ్ఞానోదయం కలగలేదు. ఆయనకు సంభ్రమం కలిగింది. ఎంతో ఇబ్బంది కూడా పడిపోయాడు.

ఆ సమావేశంలో గొప్పసన్యాసులు అందరూ ఉన్నారు. అక్కడ ఎవ్వరికీ ఏం జరుగుతూ ఉందో అర్థం కావడం లేదు. ఏం సంభవిస్తోంది అక్కడ. దీపంకరుడు

అప్పటిదాకా ఎవరి పాదాలనూ పట్టుకోలేదు. అప్పుడు గౌతముడు అన్నాడు "మీరు చేసిందేమిటి? నా పాదాలనెందుకు ముట్టుకున్నారు? నేనో పాపిని, అజ్ఞానిని. మీ పాదాలను నేను పట్టుకోవడం ఒప్పే. కానీ మీరు నా పాదాలను స్పృశించడమే ఉంటోంది ఓ వైపరీత్యంగా. మీకు పిచ్చెక్కిందా?"

దీపంకరుడు అప్పుడు మళ్ళీ నవ్వి ఇలా అన్నాడు "లేదు, గౌతమా. నీకెందుకు సంభ్రమం కలిగిందంటే నీ భవిష్యత్తు నీకు తెలియదు కనుక. నాకు పిచ్చిపట్టలేదు. జరగబోయేది నాకిప్పుడు కనిపిస్తూనే ఉంది – త్వరలోనే నువ్వు బుద్ధుడివి కాబోతున్నావు. ఆ విషయాన్ని గౌరవించడానికోసమే నీ పాదాలను ఇప్పుడు స్పృశించాను. మరి, పైగా, ఓ బుద్ధుడికి అందరూ బుద్ధుళ్ళుగానే కనిపిస్తారు. నీకు బుద్ధత్వం ఎప్పుడొస్తుందన్నది కాలపు సమస్య. ఎప్పుడొచ్చినా మరేం పరవాలేదు. ఈ రోజు నేను బుద్ధుడినయ్యాను, రేపు నువ్వు బుద్ధుడివౌతావు. ఇంకెవరికో బుద్ధత్వం ఎల్లుండి ప్రాప్తిస్తుంది – ఎప్పుడొచ్చినా మరేం పరవాలేదు. జ్ఞానోదయం అందరికీ తప్పకుండా జరిగే తీరుతుంది, ప్రతి జీవికీ. నువ్వే దాన్ని ఆలస్యం చేసేసుకుంటూ ఉండవచ్చు. అది నీ ఇష్టం. దాన్ని ఆలస్యం చేసుకోవడాన్ని ఏ క్షణంలో నువ్వు ఆపేస్తావో, దాన్ని పొడిగించుకోవడాన్ని ఏ క్షణంలో నువ్వు ఆపేస్తావో, అప్పుడే నీకు అదుంటుంది. నువ్వెప్పుడు గుర్తిస్తావా అని ఎదురుస్తూ ఉందది."

ఎంతో అందమైన కథలలో ఇది ఒకటి – దీపంకరుడు గౌతముడి పాదాలను స్పృశించే కథ. మరి అప్పుడు గౌతముడు ఓ అజ్ఞాతం మనిషే. ఎన్నో శతాబ్దాల తరువాత, సుమారుగా మూడువేల ఏళ్ళ తరువాత, గౌతముడు బుద్ధుడయ్యాడు, జ్ఞానోదయాన్ని పొందాడు. తక్షణం ఆయన చేసిన తొలి పని దీపంకరుడికి ఆయన మోకరిల్లాడు. ఇప్పుడు దీపంకరుడు లేడు. కానీ ఆయనకు మోకరిల్లి, నవ్వి, అన్నాడు "ఇప్పుడు అర్థమైంది నాకు మీరెందుకు నా పాదాలను స్పృశించారో. ఇప్పుడు నేనిక అందరి పాదాలనూ స్పృశించవచ్చు. ఇప్పుడు నాకు తెలుసు, జీవసర్వస్వం జ్ఞానోదయాన్ని పొంది తీరుతుందని

బుద్ధత్వం – జ్ఞానోదయం ఓ సహజ సంభవం. దానికి ఏ అభ్యంతరాలనూ మనం కల్పించుకోకుండా ఉంటే, తప్పకుండా అదే జరిగితీరుతుంది. అది దాన్ని మీరు సాధించి తీరాల్సిన పని కాదు. మీరు చెయ్యాల్సిందల్లా ఏ అవరోధాలనూ దానికోసం కల్పించుకోకుండా ఉండడం మాత్రమే. ఆ అవరోధాలనూ, అభ్యంతరాలనూ వెయ్యిన్నొక్క విధాలుగా మీరు సృష్టించుకుంటూ ఉంటారు. ఆ జ్ఞానోదయం కలిగేందుకు

మీరు సమ్మతించరు. అది జరుగుతున్నప్పుడు భయాన్ని మీరు తెచ్చేసుకుంటారు. అది మిమ్మల్ని స్వంతం చేసుకుంటూ ఉన్నప్పుడు, అంతగా దానికి స్వంతం అయిపోయేందుకు మిమ్మల్ని మీరు అర్పించుకోలేరు – మీరుంటారు మీలోనే ముడుచుకుపోతూ. మీరొచ్చేస్తారు వెనక్కు. మీరొచ్చేస్తారు మీ అహంకారపు మహాసూక్ష్మ కణం లోపలికి. అప్పుడనిపిస్తుంది సంరక్షింపబడి మీరు ఉన్నారని, ఆత్మరక్షణను పొంది ఉన్నారని, క్షేమంగా ఉన్నారని.

సంప్రజ్ఞత మహావిచ్చుకుని ఉన్న అభద్రతా ఆకాశం. అది మహా విస్తృతం. ఏ మార్గాలూ గుర్తింపబడని అనంత సాగరం. మీ ప్రయాణం ఉంటుంది ఓ అజ్ఞాతం నుండి మరో అజ్ఞాతంలోకి. తెలుసుకోగలిగేది ఏదీ అక్కడ లేదు. జ్ఞానం, జ్ఞానం అన్న ఆలోచన కూడా మానవుడి మూర్ఖత్వంలో భాగమే. జీవితం ఎంతటి రహస్యంగా ఉందంటే, దాన్ని తెలుసుకోలేనంత అసాధ్యంగా. దాన్ని తెలుసుకోబడడానికే అసాధ్యంగా ఉంటే ఎలా అవుతుంది దాన్ని బోధించడానికి సాధ్యం? దాన్ని నేర్పించడానికే వీలులేకుండా ఉంటే ఏ గురువుగానో, ఏ శిష్యుడిగానో ఉండడం వల్ల ఏమిటి ప్రయోజనం?

కొద్దిరోజుల క్రితమే ఓ ప్రశ్న వచ్చింది నా దగ్గరికి – “ఎందుకు ప్రకటించుకున్నారు మిమ్మల్ని మీరే ఓ ఓషోగా?” ఇది ఒక నాటకం. నేను ఓషో పాత్రను నిర్వహించేందుకు నిశ్చయించుకున్నాను, మీరు శిష్యుల పాత్రలు నిర్వహించడానికి నిశ్చయించుకున్నారు – కానీ ఇది ఒక నాటకం మాత్రమే. ఏ రోజు ధ్యాస మీకొచ్చి ఎరుకపడుతుందో ఆ రోజే అర్థమవుతుంది ఏ గురువూ లేడని, ఏ శిష్యుడూ లేడని. ఆ రోజు మీకు అర్థం అవుతుంది గడచినదంతా ఓ స్వప్నమని – కానీ తక్కిన మీ అన్ని స్వప్నాలలో నుండి మిమ్మల్ని బయటికి తీసుకువచ్చేసిన స్వప్నం అని, మీ శరీరంలోకి గుచ్చుకున్న తక్కిన అన్ని ముండ్లనూ వెలికి తీసేసిన ముల్లు అని. అదుండవచ్చు ఓ పరికరంలా, ఉపకరణంగా – కానీ అది కూడా ఓ ముల్లే. మీలోని తక్కిన అన్ని విషాలనూ కక్కించేసే విషం కావచ్చు అది – కానీ అదీ విషమే. నదిని దాటేందుకు పనికొస్తున్న ఓ తెప్పలాగానే దీన్ని కూడా ఉపయోగించుకోండి. అందువల్లే దీన్ని అంటున్నాను ఓ నాటకమని.

మీరు శిష్యులై ఉంటూ ఉండడమూ, నేను ఓ గురువునై ఉంటూ ఉండడమూ కూడా ఓ నాటకమే. ఈ నాటకాన్ని వీలయినంతగా రక్తి కట్టించండి. మీకు ఇది ఓ వాస్తవమే, నాకు తెలుసు; నాకు ఇది ఓ నాటకం. మీ వైపు నుంచి ఇది ఓ గొప్ప

వాస్తవం, నా వైపు నుంచి ఇది ఒక ఆట మాత్రమే. ఏదో ఒకనాటికి మీకు కూడా అర్థం అవుతుంది ఇదంతా ఒక ఆట మాత్రమేనని. ఆ రోజే ఉంటుంది మీకు జ్ఞానోదయం ప్రాప్తించిన దినంగా.

దీపంకరుడు గౌతముడితో చెబుతున్నది, గౌతముడి పాదాలను వంగి స్పృశించినప్పుడు, ఆయన చెబుతున్నది ఇదే, 'ఇది ఒక నాటకం మాత్రమే' అని. నువ్వు నా పాదాలను ముట్టుకున్నా, నేను నీ పాదాలను ముట్టుకున్నా – ఏ భేదమూ లేదు. మనం అందరమూ బుద్ధుళ్ళమే, మనం అందరమూ దేవుళ్ళమే. 'నేను దేవుణ్ణి, మీరు కాదు' అని కాదు చెబుతున్నది – సర్వస్వమూ దివ్యమే. వృక్షాలు దేవుళ్ళే, జంతువులు దేవుళ్ళే. అన్నీ దేవుళ్ళే, రాళ్ళు కూడా!

రాళ్ళల్లో దేవుడు ప్రగాఢంగా నిద్రపోతూ ఉంటాడు. వృక్షాల్లో ఆయనకు కొంచెం స్పృహ వచ్చి ఉంటుంది, జంతువుల్లో ఆయన మరికొంత ఎక్కువ స్పృహలో ఉంటాడు. మీలో మరింత మేల్కొని ఉంటాడు. ఓ బుద్ధుడిలో దేవుడు పూర్తిగా నిద్రలేచేసి మహాచురుకుగా ఉంటాడు. లక్షణంలో ఉండడంలేదు వ్యత్యాసం, వ్యత్యాసం ఉంటోంది కేవలం పరిమాణంలోనే, ఇంత ధ్యాస మీకు వస్తే, అంత ధ్యాస మీకు వచ్చేట్లు కూడా మీరు తయారుకావచ్చు.

బుద్ధుడు అంటున్నాడు :

***భగవానుడు అడిగాడు : నువ్వేమనుకుంటున్నావు, సుభూతీ, తథాగతుడు దీపంకర తథాగతుడి వద్ద నుండి నేర్చుకున్న ధర్మం ఏదయినా ఉందా?***

ఆయన అడుగుతున్నాడు "దీపంకరుడి వద్ద నుండి నేను దేన్నయినా నేర్చుకున్నానా?" అని. నేర్చుకోవాల్సింది ఏదీ లేదక్కడ. సత్యం ఉంది నిశ్చితవాస్తవంగా. మీరేం నేర్చుకున్నా అవుంటాయి అబద్ధాలై. సత్యాన్ని నేర్చుకోనక్కరలేదు. సత్యాన్ని కనిపెట్టనక్కరలేదు. గుర్తిస్తే చాలు. అంతకన్నా మరింత చక్కగా చెప్పాలంటే దాన్ని పునర్గ్రహిస్తే చాలు.

మరి ఈ 'నేర్చుకోవడం' అన్న పదం ఉంటోంది మహా ప్రమాదకారకంగా. 'నేర్చుకోవడం' అంటే సమాచారాన్ని పోగుచేసుకుంటూ ఉండడం, ఎంతెంత ఎక్కువగా సమాచారాన్ని సేకరించి పోగుచేసుకుంటూ ఉంటారో అంతంతగా వాస్తవం మీ అచేతనంలోకి కూరుకుపోతూ ఉంటుంది. మీకు మోత భారం పెరిగిపోతుంది. మీ

పైభాగం బరువు ఎక్కువ అయిపోయి ఉంటుంది. మీ శిరస్సు జ్ఞానం గోలను ప్రారంభించేస్తుంది, దాని మోత ఎక్కువైపోతుంది. దాని ఘోష ఎక్కువైపోతుంది. అప్పుడు మీకు మీ చిన్ని హృదయపు మాట వినిపించదు. ఆ నిశ్శబ్దం పోయుంటుంది జ్ఞానపు ఘోషతో.

అందువల్లే పాపులు సైతం సాధించుకుంటూ ఉంటారు, పండితులు పోగొట్టుకుంటూ ఉంటారు – ఎందుకంటే ఓ పాపి వినమ్రుడై ఉండగలుగుతాడు, ఓ పండితుడు వినమ్రుడై ఉండలేడు కనుక. పాపి అరవగలుగుతాడు, ఏడ్వగలుగుతాడు కూడా; కానీ పండితుడికి తెలిసి ఉంటుంది. తనకు ఉన్న జ్ఞానం వల్ల ఆ మనిషి కఠినంగా ఉంటాడు. ఉంటాడు అహంకారంతో, జ్ఞానం ఉంది కనుక. ఆ పండితుడు ఉంటాడు మహాకఠినంగా, కరిగిపోడు. ఉండడు స్వీకరించే తత్వంతో విచ్చుకుని. ఉంటాడు మూసుకుపోయి. తనకు ఉన్న జ్ఞానంవల్ల ఆ మనిషి లోని అన్ని కిటికీలూ, తలుపులూ మూసుకునిపోయి ఉంటాయి, పోగుచేసుకుని ఉన్న ఉల్లేఖనాల, శాస్త్రాల జ్ఞానంతో.

సత్యంలోకి రావడం అంటే నేర్చుకున్న అంతటినీ పూర్తిగా వదిలిపెట్టెయ్యడం అనే అర్థం, ఇంకా ఎక్కువ నేర్చుకోవాలని కాదు. మీకు తెలిసి ఉన్న మొత్తం జ్ఞానాన్ని మీరు వదిలిపెట్టి మరచిపోవాలి. అది నేర్చుకోవడం కాదు, వదిలిపెట్టెయ్యడమే. జ్ఞానాన్ని వదిలిపెట్టెయ్యడమే సత్యాన్ని చేరే మార్గం. మీరు ఉండకుండా పోగలిగితే ఉండే సామర్థ్యం కూడా ఉంటుంది. వదిలించేసుకోవడం మీకు చేతనయితే పట్టుకోవడం కూడా మీకు చేతనవుతుంది. మీరు నేర్చుకుని ఉన్నదాన్నంతా ఏ షరతులూ ఉండకుండా, ఏ నియమాలూ ఉండకుండా, దేన్నీ పట్టుకుని ఉండకుండా, పూర్తిగా వదిలిపెట్టెయ్యగలిగితే మళ్ళీ తయారవుతారు మీరు అమాయకంగా – ఆ అమాయకత్వమే మిమ్మల్ని తీసుకొస్తుంది మీ స్వగృహంలోకి.

***...సుభూతి బదులు పలికాడు : లేదు భగవాన్, ఏదీ లేదు.***

ఓ గురువుకూ ఓ శిష్యుడికీ మధ్య ఏది ప్రసరిస్తుంది? సత్యం కాకుండా, జ్ఞానం కాకుండా – ఏది ప్రసరిస్తుంది గురుశిష్యుల మధ్య ఆ రెంటినీ తప్పించి? వాస్తవంలో, ఏదీ ప్రసరించదు. గురుసమక్షంలో ఉన్నప్పుడు శిష్యుడి ప్రగాఢాంతరంలో నుండి ఏదో పైకొస్తుంది. అది పైకి వచ్చిందే తప్ప ఎక్కణ్ణుంచీ ప్రసరించలేదు. గురువు నుండి శిష్యుడి లోకి ఏమీ ప్రసరించదు. ప్రసరించేది ఏదీ అస్సలు లేదు.

కానీ గురువు ముందు ఉన్నంత మాత్రాన, శిష్యుడి ముందు గురువు నిలబడి ఉన్నంత మాత్రాన శిష్యుడి మహాప్రగాఢాంతరం లోంచి ఏదో పైకి తేలడం ప్రారంభమయిపోతుంది. గురు సమక్షమే శిష్యుడి జీవిని పైకి రమ్మంటుంది. గురువు దేన్నీ ఇచ్చేదీ ఉండదు, ఆయనలోంచి ప్రసరించేది ఏదీ ఉండదు. శిష్యుడి ముందు ఆయన ప్రత్యక్షమే తయారవుతుంది శిష్యుడిలో ప్రక్షాళనను ప్రేరేపించే కార్యంగా, తక్షణం ఆ శిష్యుడిలో ఓ పరివర్తన ప్రారంభం అయిపోతుంది.

అంతేమరి, కానీ శిష్యుడిలో అనిపిస్తుంది గురువు ఏదో చేశాడని. ఏం చెయ్యడమూ జరుగుతూ ఉండదు. నిజమైన గురువు ఎప్పుడూ ఏమీ చెయ్యడు. ఆయన చేసేది అంతా కేవలం మీ ముందు నిలబడి ఉండడం మాత్రమే, మీకు అందుబాటులో ఉండడం మాత్రమే. ఆయన చేస్తున్న పని అంతా ఒక సామాన్య విషయాన్ని మాత్రమే – మీ ముందు ఉండాలి ఆయన; సూర్యుడు ఉన్నట్లుగానే.

సూర్యుడు ఉదయిస్తాడు ప్రొద్దున్నే. వెంటనే మొగ్గలన్నీ విచ్చుకుని పువ్వులుగా తయారయిపోతాయి. సూర్యుడు వాటికి దేన్నో అందిస్తాడని కాదు. సూర్యుడే వచ్చేసి ఆ మొగ్గలన్నింటినీ విప్పి పువ్వులుగా మార్చేస్తాడని కాదు – సూర్యుడు ఆ పనులేవీ చెయ్యడు. సూర్యకాంతి ప్రత్యక్షంకాగానే మొగ్గలన్నీ పువ్వులైపోవడం ప్రారంభం అయిపోతుంది. ఆ విచ్చుకోవడం మొగ్గల్లోనే ఉంటుంది స్వయంగా... మొగ్గలు విచ్చుకుంటాయి, పరిమళాలు వచ్చేస్తాయి – అదంతా మొగ్గల్లోంచే వస్తుంది. సూర్యుడు మొగ్గలకు దేన్నీ జోడించడు. కానీ ఆ సూర్యుడి ప్రత్యక్షమే ఆ మొగ్గలలో ప్రేరేపిస్తుంది ప్రక్షాళనను. సూర్యుడు కనిపించకపోతే మొగ్గలు విచ్చుకోవడం దాదాపుగా అసంభవంగానే ఉంటుంది. అప్పుడు వాటికి విచ్చుకునే శక్తి తమలోనే ఉందన్న ఎరుక ఉండదు. తమ సామర్థ్యాన్ని స్వయంగా గ్రహించి విప్పారి పువ్వులుగా మారే శక్తి ఆ మొగ్గలలో చురుకుతనాన్నీ, చైతన్యాన్నీ పొంది ఉండదు.

ఓ గురువు కేవలం మీ సామర్థ్యాన్ని మీరే గుర్తించేట్లు మాత్రమే చేస్తాడు. ఆయన తన సామర్థ్యాన్ని గుర్తించుకోగలిగి ఉంటే, మీరు కూడా మీ సామర్థ్యాన్ని గుర్తించుకోగలుగుతారు. ఆయన ఉంటాడు సరిగ్గా మీలాగే – నెత్తురూ, ఎముకలూ, శరీరమూ. సరిగ్గా ఆయన ఉంటాడు మీలాగే. ఆ గురువు జీవుడిలో ఏదైనా సంభవం కాగలిగితే, ఆయన మొగ్గ ఓ పువ్వు కాగలిగితే, మీరెందుకు కాలేరు? ఈ ఆలోచనే మహా ప్రగాఢంగా మీ హృదయం లోతుల్లోకి మునిగిపోతుంది, మీ జీవుడిని

కుదిపేస్తుంది. మరి శక్తులు పైకి తేలడం ప్రారంభం అయిపోతుంది. మీ మొగ్గ విచ్చుకోవడం అవుతుంది ప్రారంభం.

దీన్నే ప్రాచ్యులు 'సత్సంగం' అంటారు - గురువు సమక్షంలో ఉండడం. నిజమైన శిష్యుడు ఎవరంటే గురువు ముందు ఆయనకోసం ఎలా ఉండాలో తెలుసుకుని ఉన్నవాడే. ఓ గురువు ఉంటాడు ప్రత్యక్షమై, కానీ మీరెలా ఉండాలి ఆయనముందు ప్రత్యక్షమై?

సూర్యవర్తినీ పుష్పాన్ని - ప్రొద్దుతిరుగుడు పువ్వును - మీరు చూసి ఉన్నారా? ఆ పువ్వే ఓ శిష్యుడికి సంకేతం. సూర్యుడు ఎటు వెళ్తూ ఉంటే, ఆ పువ్వు కూడా ఆయనవైపే తిరుగుతూ ఉంటుంది. ఆ పువ్వు ఉంటుంది ఎప్పుడూ సూర్యుడిముందు ప్రత్యక్షమై. అదుంటుంది ప్రొద్దుటిపూట తూర్పువైపుకి తిరిగి సూర్యుణ్ణి చూస్తూ, అదుంటుంది సాయంత్రంపూట పశ్చిమంవైపుకు తిరిగి సూర్యుణ్ణే చూస్తూ. సూర్యుడు ఏ వైపు ఉంటే ఆ పువ్వు కూడా ఆ వైపునే ఉంటుంది. ఆ ప్రొద్దుతిరుగుడు పువ్వే శిష్యుడికి సంకేతం. రూపకాలంకారం.

బుద్ధుడు అడుగుతున్నాడు, "నువ్వేమనుకుంటున్నావు, సుభూతీ, దీపంకరుడి నుండి నేను దేన్నయినా నేర్చుకున్నానా?" అని. సుభూతి చెబుతున్నాడు "లేదు భగవాన్" అని - ఎందుకంటే నేర్చుకోవడానికి అక్కడ ఏమీ లేదు కనుక. అయితే దీనికి అర్థం దీపంకరుడి పట్ల బుద్ధుడికి ఏ కృతజ్ఞతాభావమూ లేదనేనా? కాదు, కానే కాదు. ఆయనకు జ్ఞానోదయం కలగగానే, బుద్ధుడు చేసిన మొట్టమొదటి పని దీపంకర తథాగతుడికి తన కృతజ్ఞతను ప్రకటించుకోవడం మాత్రమే, అప్పటికే ఎప్పుడో అనంతంలోకి అదృశ్యం అయిపోయి ఉన్న, ఏ ఛాయలూ భూమిమీద మిగిలిపోయి ఉండకుండా పోయి ఉన్న మహాచార్యుడికి. కేవలం ఆయన జ్ఞాపకాలు మాత్రం మిగిలి ఉన్నాయి గౌతమబుద్ధుడిలో, మరెక్కడా ఏవీ లేవు.

దీపంకర తథాగతుణ్ణి గురించి ఏ గాథలూ కనిపించవు, ఏ ఉల్లేఖనాలూ కనిపించవు. బహుశా ఆ రోజుల్లో ఉల్లేఖనాలు జరిగేవి కావేమో. ఆయన గురించిన ప్రస్తావన ఇంకెక్కడా కనిపించదు. గౌతమబుద్ధుడే ఆయనను స్మరించుకోవడానికి ఉన్న ఏకైక గుర్తింపు, గురుతు. బుద్ధుడి ద్వారా మాత్రమే మనం ఆయనను స్మరించుకోవచ్చు. మూడువేల సంవత్సరాలు గడచిపోయాయి. దీపంకరుడి గురించి ఎవ్వరికీ తెలియదు. కానీ బుద్ధుడికి జ్ఞానోదయం కలుగగానే తొలి కృతజ్ఞత, తొలి

వందనసమర్పణం దీపంకరుడికే ప్రకటింపబడింది. ఎందుకు? ఎందుకంటే ఆయన సమక్షంలోనే ఓ గొప్ప బుద్ధుణ్ణి కావాలన్న మహేచ్ఛ తనలో ఉదయించింది కనుక. ఆయన సమక్షంలోనే గౌతముడి మొగ్గ తను విరిసి ఓ మనోహరపుష్పంగా తయారవ్వాలన్న స్వప్నం ప్రారంభమయింది కనుక. మూడువేల సంవత్సరాలు పట్టింది గౌతముడు తనలోని అన్ని అవరోధాలనూ, అభ్యంతరాలనూ విసర్జించుకునేందుకు. కానీ కాల శాశ్వతత్వంలో మూడువేల ఏళ్ళు అంటే ఎంత? శూన్యమే... కేవలం కొన్ని క్షణాలు మాత్రమే.

బుద్ధుడు ఎందుకు ప్రశిస్తున్నాడు సుభూతిని? అలా ప్రశ్నిస్తే తనవద్ద నుండి నేర్చుకోవాల్సింది ఏదీ లేదని సుభూతి అర్థం చేసుకుంటాడు కనుక. బుద్ధుడే స్వయంగా దీపంకర తథాగతుడి వద్ద నుండి నేర్చుకున్నది ఏదీ లేదు. కాబట్టి "అక్కడ ఏమీ లేదు, సుభూతీ, నా వద్ద నుండి నువ్వు నేర్చుకోవలసినవి. నాతోనే ఉండు. దేన్నీ నేర్చుకోవాలన్న యోచనలు చేయకు. ఏ క్షణంలో నా వద్ద నుండి దేన్నయినా నేర్చుకోవాలని నువ్వు అనుకుంటావో తక్షణంలోనే నువ్వు నా నుండి దూరమైపోయి ఉంటావు."

ఇక్కడ కూడా రెండు రకాల మనుషులు ఉంటున్నారు – శిష్యులు, విద్యార్థులు. ఎవరు దేన్నీ నేర్చుకోవాలని వెతుక్కుంటూ ఉంటారో వాళ్ళు విద్యార్థులు. వాళ్ళు ఇక్కడికి ఎందుకొస్తారంటే దేన్నీ పోగుచేసుకుని తరువాత 'మాకు ఇదొచ్చు, అదొచ్చు' అంటూ గొప్పలు ప్రకటించుకోవడానికే. లభ్యమవుతున్న వజ్రాలను వదిలిపెట్టేసుకుంటూ కేవలం రంగురంగుల కథలను దొరకబుచ్చుకుంటూ వాళ్ళుంటారు.

జ్ఞానాన్ని ఆర్జించుకోవాలన్న ఉత్సాహంతో ఉండనివాడే శిష్యుడు. తన ఉనికితో ఉండేందుకు ఉత్సహిస్తున్నవాడూ, ఇక్కడ నాతోబాటు ఉండడానికే ఇష్టపడుతున్నవాడూ, ఇక్కడ ఉండడానికి మరే కారణాలూ, ఉద్దేశ్యాలూ లేనివాడూ ఆ శిష్యుడే. ఆతడి హృదయానికి ఓ స్పర్శ తగిలి ఉంటుంది, ఆతడి స్వప్నం ప్రారంభమయి ఉంటుంది. ఓ మహా శుభేచ్ఛ ఆ శిష్యుడిలో ఉదయించి ఉంటుంది.

సరిగ్గా నిన్నటి రాత్రే సరోజ్ ఇక్కడ ఉంది. తనకు ఎంతో మృత్యుభయం కలుగుతూ ఉంటోందని ఆ అమ్మాయి అంటోంది. నేను అడిగాను "ఎందుకు? ఎందుకు నీకు అంత భయం?" మరి ఆ అమ్మాయి ఇస్తోన్న సమాధానం అందంగా ఉంటోంది.

ఆమె అంటోంది "నా భయం చావు గురించి కాదు ఓషో. ఇప్పటిదాకా దేన్నీ తెలుసుకోలేదన్నదే నా భయం. దేన్నీ నేను గ్రహించలేకపోయి ఉన్నాను. ఏ అనుభూతీ నాకు ప్రాప్తించనే లేదు. సత్యాన్ని తెలుసుకోకుండానే నా జీవితం ముగిసిపోతుందేమో అన్నదే నా ఆదుర్దా; అదే నా భయం."

నిజ స్వీయ ఉనికిలో నిండుగా ఉండాలన్న మహా తీవ్రేచ్ఛ ఉన్నవాడే శిష్యుడు- సత్యంలోనే ఉండాలనుకునేవాడు, దాన్ని గురించి తెలుసుకోకుండా. సరోజ్ చచ్చిపోతానేమోనని భయపడడంలేదు. తనకూ నాకూ మధ్య ఉదయిస్తూ ఉన్న ఆత్మీయతకు మృత్యువు వల్ల భంగం వాటిల్లుతుందేమోనన్నదే ఆ అమ్మాయి భయం. నా ప్రత్యక్షాన్ని గ్రోలుతూ ఉన్న, ఆమెలోకి ప్రవేశిస్తూ ఆమె ఆత్మాంతరాన్ని వెయ్యిన్నొక్క తెరవులలో పరివర్తిస్తూ ఉంటున్న నా సమక్షాన్ని మృత్యువు మట్టుపెట్టేస్తుందేమోనన్నదే ఆమె భయం- ఆమె భయం అదే.

శిష్యుడు ఎవరంటే జ్ఞానాన్ని ఆర్జించుకోవడం పట్ల అమితోత్సాహం ఉండనివాడూ, తన నిజజీవుడి ఉనికిపట్ల నిరతితో ఉండేవాడే. దేవుణ్ణి గురించి తెలుసుకునే ఉత్సాహం ఉండనివాడు కాదని కాదు. ఆ దేవుణ్ణే రుచి చూద్దామని ఉవ్విళ్ళూరుతున్నవాడే. 'దైవం' అన్న ఆ జీవధార ఊటను గ్రోలాలనే దప్పికతో ఉన్నవాడే. ఆ శక్తి సాగరంలో భాగం అయిపోవాలని అనుకుంటున్నవాడే.

గుర్తుంచుకోండి. ఓ విద్యార్థిగా మీరిక్కడ ఉండాలనుకుంటూ ఉంటే వివేకులై మీరు ఉండరు. విద్యార్థిగా ఇక్కడ ఉండాలనుకోవడం మూర్ఖుడిగా ఉండిపోవడం మాత్రమే. ఇది ఓ పాఠశాల కాదు. ఓ శిష్యుడు అయి ఉండడం అంటే ఓ గురువు సామీప్యాన్ని చేరగలిగే సాహసం ఉంటున్నవాడనే, పర్యవసానాలను ఏ మాత్రమూ ఎంచకుండా. ఓ శిష్యుడు అంటే గురుసామీప్యపు ప్రమాదాన్ని నిశ్శంకితుడై నిర్భీతుడై త్యజించి గురుసమక్షంలో ఉండే సాహసాన్ని చేస్తున్నవాడనే అర్థం. అది ఒక ప్రమాదమే – ఆ ప్రమాదంలో మీరు తప్పకుండా మరణిస్తారు. మొగ్గ చచ్చిపోతుంది, అప్పుడు మాత్రమే పుష్పం రాగలుగుతుంది. విత్తనం చచ్చిపోతుంది. అప్పుడే వృక్షం అవుతుంది సంభవం. మీరు మరణించేతీరాలి. అప్పుడే దివ్యత్వం మీలో పుష్పించగలుగుతుంది.

> ***భగవానుడు అడిగాడు : నువ్వేమనుకుంటున్నావు, సుభూతీ,***
> ***తథాగతుడు దీపంకర తథాగతుడి వద్ద నుండి నేర్చుకున్న ధర్మం***
> ***ఏదయినా ఉందా?***

ఓ మహా సత్యాన్వేషి ఇలా వ్రాశాడు “సమాధానాలకోసం వివేకుల వద్దకు నేను వెళ్ళాను. ఎందరో వివేకులూ, ప్రతి ఒక్కరి వద్దా వాళ్ళ సమాధానాలూ ఉన్నాయి. అప్పుడు అర్థం అయింది నాకు వాళ్ళందరూ తమను తామే బయటపెట్టేసుకుంటూ ఆత్మవంచన చేసుకుంటూ ఉన్నారని. కానీ అలా ఉంటూ ఉండని మనుషులను కూడా కొందరిని నేను కలుసుకోవడం తటస్థించింది. ఇద్దరు ముగ్గురు, మహా జీవశక్తితో కూర్చుని ఉంటున్నవాళ్ళు, నా ప్రశ్నలను విని నవ్వుతూ ఉన్నవాళ్ళు; సమాధానం కోసం నేను రెట్టిస్తే, కరుణతో మరిన్ని ప్రశ్నలను వాళ్ళు నాకు ప్రసాదించారు.

“నేను గడపగలిగిన కొన్నిక్షణాలు ఉన్నాయి వాళ్ళతో, వివేకం గురించి సొంతమూ నేను మరచిపోయివున్న క్షణాలు. నిస్సంకోచంగా, నిర్మొహమాటంగా, నిర్భీతితో, ఏ బింకపు పట్టింపులూ ఉండకుండా, వెర్రివాళ్ళు మాత్రమే, చిన్నపిల్లలు మాత్రమే నవ్వగలిగేలా నేను నవ్వగలిగిన క్షణాలు. నిజమైన వివేకుల వద్ద నుండి ఏ సమాధానాలనూ నేను పొందలేకపోయాను. నా అవివేకమే నన్ను వాళ్ళ ముందుకు పంపించింది. మరి నాకు ఎలా అర్థం అవుతుంది ఏది వివేకమో? మాటలతో అది చెప్పబడగలిగేదే అయినా, నిజంగా చెప్పబడినా, నిజమైన వివేకులు నిజం సమాధానాలను ఇవ్వకుండా ఉంటున్నందువల్లే అయివుంటున్నారు వివేకులు.”

ఓ సత్యవివేకి తన జీవుడినే మీకు అందిస్తాడు, స్వయాన్నే మీకు సమర్పించుకుంటాడు. ఓ సత్యవివేకి సొంతంగా మీ ముందు ఉంటాడు మీకు అందుబాటులో. ఆ సాహసం మీకు ఉంటే ఆయన జీవుడి లోంచి మీరు త్రాగెయ్యొచ్చు, తినెయ్యొచ్చు. జీసస్ తన శిష్యులతో ఈ అర్థంతోనే అంటున్నాడు ఈ మాటలను “నన్ను తినెయ్యండి! నన్ను త్రాగెయ్యండి!” గురువును మీరు భుజించే తీరాలి, గురువును మీరు పీల్చుకునే తీరాలి. ఆయన్ని మీరు జీర్ణం చేసుకునే తీరాలి. అప్పుడు మాత్రమే మీరు మీ సత్యంలోకి పడతారు. ఏదీ ఉండదు నేర్చుకోవడానికి – ఉండదు ఏ ధర్మమూ నేర్చుకోవడానికి. ఏ వేదాంతమూ ఉండదు నేర్చుకోవడానికి.

> *భగవానుడు అన్నాడు : ఏ బోధిసత్త్వుడయినా ‘చక్కటి సామరస్యం ఉన్న బుద్ధక్షేత్ర వ్యూహాలను నేను సృష్టిస్తాను’ అన్నాడంటే, ఆయన మాట అసత్యమే అవుతుంది. మరి ఎందుకు? ఆ చక్కటి బుద్ధక్షేత్రవ్యూహాలను... సుభూతీ, సామరస్యం ఉండని బుద్ధక్షేత్ర వ్యూహాలేనని తథాగతుడు భాషించాడు కనుక. అందువల్లే ‘చక్కటి బుద్ధక్షేత్ర వ్యూహాలు’ అని ఆయన అంటున్నాడు...*

ఈ 'బుద్ధక్షేత్రం' అన్న పదానికి అత్యంత ప్రాముఖ్యత ఉంది. దీన్ని మీరు అర్థం చేసుకోవాలి. ఎందుకంటే ఇక్కడ నేను చేస్తున్నది దీన్నే కనుక – ఓ బుద్ధక్షేత్రాన్ని నేనిక్కడ సృష్టిస్తూ ఉన్నాను. కేవలం ఓ బుద్ధక్షేత్రాన్ని సృష్టించుకోవడంకోసమే ప్రపంచాన్నుంచి మనం దూరమైపోతూ, ఎంతో దూరాల్లోకి వచ్చేసి ఉంటున్నాం. ఓ సంపూర్ణ విభిన్న శక్తిని అందుకోగలగడంకోసం.

బుద్ధక్షేత్రం అంటే మీలో నిద్రపోతూ ఉన్న బుద్ధుణ్ణి మేల్కొలిపే పరిస్థితి అని అర్థం. బుద్ధక్షేత్రం అంటే ఓ శక్తిక్షేత్రం, ఎక్కడ మీ ఎదుగుదల ప్రారంభం అవుతుందో, పక్వత పెరుగుతుందో, ఎక్కడ మీ నిద్రాభంగం జరుగుతుందో, ఎక్కడ ఓ బలవద్ఘాతంతో చటుక్కున మీరు స్పృహలోకి ఎరుకలోకి వస్తారో ఆ విద్యుత్క్షేత్రం. అక్కడ మీరు నిద్రపోతూ ఉండలేరు, అక్కడ మీరు మేల్కొనే చురుగ్గా ఉండాల్సి వస్తుంది, ఎందుకంటే విద్యుద్ఘాతాలు మీ మీదికి ఎప్పుడూ వస్తూనే ఉంటాయి కాబట్టి.

బుద్ధక్షేత్రం ఓ శక్తిక్షేత్రం – ఏ క్షేత్రంలో బుద్ధుడు జీవుల్ని పరిణమింపజేస్తాడో ఆ శక్తిక్షేత్రం. ఓ మహానిర్మల పృధ్వీతలం అది. ఓ అలౌకిక లౌకికప్రపంచం అది. ఓ భూతలస్వర్గం అది. మహాశీఘ్ర ఆధ్యాత్మికాభివృద్ధికి దోహదం చేస్తుంది అది. ఓ బుద్ధక్షేత్రం ఓ గర్భం.

గర్భం – 'MATRIX' అన్న పదం లాటిన్ భాషా పదం. దీనికి అర్థం 'గర్భాశయం' అని. ఆ పదం లోంచే MATTER (పదార్థం), MOTHER (తల్లి) వంటి పదాలు కూడా వచ్చాయి. ఓ గర్భాశయం కొత్తగా తయారవబోతున్న జీవితానికి మూడు విషయాలను అందిస్తూ ఉంటుంది; ఓ సంభవం సంభవించగల సంభావ్యతా మూలాన్ని, ఆ సంభావ్యతను అన్వేషించేందుకు ఓ శక్తిమూలాన్ని, ఆ అన్వేషణను సాగించడానికి సాధ్యపడే ఓ సురక్షిత ప్రదేశాన్ని.

దాన్నే మనం కూడా చేయబోతూ ఉన్నాం. మన కొత్త ఆశ్రమం బుద్ధత్వస్థితి కోసం చేసే మహా ప్రయోగపు సుక్షేత్రమే అవుతుంది. ఎన్నో శక్తులు మీకు అక్కడ లభ్యమవుతూ ఉండేలా చూడాలి. అన్ని సంభావ్యతలనూ సుస్పష్టంగా మీకు దర్శింపబడగలిగేలా చూడాలి. మీ సామర్థ్యాన్ని మీరు గుర్తించగల ధ్యాస మీలో ఏర్పడగలిగించగలిగేదిగా చూడాలి. మీ సాధనా యత్నం సురక్షితంగా సాగించే వీలు కలిగించబడగలిగేదిగా చూడాలి. ఏ క్షేత్రంలో మీ ధ్యాసకు భంగం ప్రపంచం వల్ల వాటిల్లదో, మీ ధ్యాసకు భంగాన్ని ఎక్కడ ఏ జనాలూ కలిగించరో, ఎక్కడ సాధారణ

విషయాలూ, నిషిద్ధాలూ, అభ్యంతరాలూ ఉండవో, ఎక్కడ ఒక్క విషయానికి మాత్రమే ప్రాధాన్యత ఉంటుందో – 'బుద్ధుడిగా ఎలా అవ్వాలి?' అని... ఎక్కడ తక్కిన విషయాలూ మీ మనస్సుల్లోంచి సులభంగా తొలగిపోతాయో – డబ్బూ, అధికారమూ, గౌరవాలూ; ఎక్కడ తక్కిన సర్వస్వానికీ ఏ ప్రాముఖ్యమూ ఉండదో, ఎక్కడ తక్కిన సర్వస్వమూ సరిగ్గా అది ఎలా ఉందో అలాగే అంతమాత్రంగానే ఉంటుందో – ఓ 'ఛాయా ప్రపంచం'గా – ఆ బుద్ధక్షేత్ర నిర్మాణం ఉంటుంది. మరి అప్పుడు ఏ మాత్రమూ దారితప్పిపోరు దృశ్యప్రపంచంలో.

దృశ్య ప్రపంచంలో ఓ 'మాయ' లోనే చిక్కుకుని మీరు ఉంటారు. ఇదే ఈ ప్రపంచంలో ఉంటున్న మహాభ్రమ–కనిపిస్తున్న జాలం. దృశ్యాజగత్తు మన మనస్సులను మహాబలంగా లాగేసుకునే ఉంటుంది. ఓ బుద్ధక్షేత్రంలో ఆ మాయ లోంచి బయటపడి మీరు ఉంటారు. ఆశ్రమపు నిశ్శబ్దంలో, నిరభ్యంతరావరణంలో, ఏ నిషిద్ధాలూ ఉండని పరిస్థితిలో గురుశిష్యులిద్దరూ తమ నాటకాన్ని సంపూర్ణంగా నటించవచ్చు. ఆ నాటకానికి పరాకాష్ఠ గురువు శిష్యుడి పాదాలను ముట్టుకున్నప్పుడు ఉంటుంది, గురుశిష్యులిద్దరూ సత్యంలో పూర్తిగా విలీనమైనప్పుడు.

> **భగవానుడు అన్నాడు : ఏ బోధిసత్త్వుడయినా 'చక్కటి సామరస్యం ఉన్న బుద్ధక్షేత్ర వ్యూహాలను నేను సృష్టిస్తాను' అన్నాడంటే, ఆయన మాట అసత్యమే అవుతుంది. మరి ఎందుకు? ఆ చక్కటి బుద్ధక్షేత్ర వ్యూహాలను... సుభూతీ, సామరస్యం ఉండని బుద్ధక్షేత్ర వ్యూహాలేనని తథాగతుడు భాషించాడు కనుక. అందువల్లే 'చక్కటి బుద్ధక్షేత్ర వ్యూహాలు' అని ఆయన అంటున్నాడు...**

ఇప్పుడు అర్థం చేసుకోండి : ఎవరైనా "నేను బుద్ధక్షేత్రాన్ని సృష్టిస్తాను" అని అన్నాడంటే, అలా అంటున్నప్పుడు 'నేను' మీదే బలంగా ఆ మాట ఒత్తి చెప్పబడుతూ ఉంటే, అప్పుడు ఆ మాట అయిపోతుంది అబద్ధం. ఎందుకంటే ఇంకా ఆ 'నేను' మహా సజీవంగానే ఉంటున్న ఆ మనిషి ఓ బుద్ధక్షేత్రాన్ని సృష్టించలేడు కనుక. 'నేను' ఏ మనిషిలో ఉండదో, కేవలం ఆ మనిషి మాత్రమే సృష్టించగలుగుతాడు ఓ బుద్ధక్షేత్రాన్ని. వాస్తవంలో ఆ మాట అప్పుడు ఉండదు ఒప్పుగా; భాష చాలదు.

ఆ సృష్టికి ఉన్న సంస్కృతపదం మరెంతో ఉత్తమంగా ఉంటుంది. ఆ సంస్కృత పదం 'నిష్పాదయతి'. దీనికి ఎన్నో అర్థాలు ఉన్నాయి; 'సృష్టించు' అని ఓ అర్థాన్ని చెప్పుకోవచ్చు. 'సాధించు' అనే మరో అర్థాన్ని దీనికి చెప్పుకోవచ్చు. 'పక్వతపొందు'

అన్న అర్థంతో దీన్ని చెప్పుకోవచ్చు. 'పరిణితిపొందు' అని మరో అర్థంతో చెప్పుకోవచ్చు. అతిసహజార్థంతో 'ఉనికిలోకి చేర్పింపజేయు' అని చెప్పుకోవచ్చు. అదే సరయిన అర్థం.

ఓ బుద్ధుడు సృష్టించడు. అందులోకే ఆయన చేర్పించేస్తాడు. ఆయన "చేర్పించేస్తాడు" అని చెబితే కూడా అంతగా బాగుండదు; ఆయన సమక్షంలోనే విషయాలు సంభవిస్తాయి. ఆయన సమక్షంలోనే విషయాలు ప్రేరేపింపబడిసాగుతాయి, పరివర్తనల పద్ధతి కార్యాచరణ ప్రారంభమయిపోతుంది. ఆయన సమక్షమే నిప్పు, విద్యుత్కణం. మరి ప్రారంభమయిపోతాయి విషయాలు. ఒకటి మరి ఇంకొకటికి దారితీస్తుంది. ఓ పెద్ద గొలుసు సృష్టి అక్కడ జరిగిపోయి ఉంటుంది.

ఇక్కడ మనం చేస్తున్నది కూడా ఈ ప్రకారంగానే. నేను కూర్చుని ఉంటాను నా గదిలో ఏమీ చెయ్యకుండా. ప్రపంచంలోని అన్ని మూలలనుంచీ సత్యాన్వేషులు ఇక్కడికి ధార పడినట్లు వచ్చేస్తారు. నేను కనీసం ఓ ఉత్తరం కూడా వ్రాయను... కేవలం ఉంటాను ప్రత్యక్షంగా. ఒకరు వస్తారు, ఇంకొకరు వస్తారు, ఓ గొలుసు సృష్టి జరిగిపోయి ఉంటుంది. ఓ బుద్ధక్షేత్ర నిర్మాణం జరగాల్సిన ఆవశ్యకత ఇప్పుడు ఆసన్నం అయి వుంది. ఓ గర్భం ఇప్పుడు ఆవశ్యకం. ఎందుకంటే – మీకు తెలియదు – ఎన్నో వేలమంది వస్తున్నారు దారిలో. వాళ్ళ ప్రవాసం ఇప్పటికే ప్రారంభం అయిపోయి వుంది. ఇక్కడికి రావాలన్న ఆలోచనను వాళ్ళు ఇప్పటికే చేసేశారు.

మరి ఎంత ఎక్కువమంది అక్కడ ఉంటారో, అంత పెద్దదిగా ఆ బుద్ధక్షేత్రం ఉంటూ, అంత ఎక్కువ శక్తివంతంగా ఆ బుద్ధక్షేత్రం ఉంటుంది. ఈ ప్రపంచంలో ఏనాడూ లేనంతటి అత్యంత మహాగొప్ప, మహాశక్తివంతమైన బుద్ధక్షేత్రాన్ని మనం సృష్టించుకోగలిగే సంభావ్యత ప్రస్తుతంలో ఉంది. ఎందుకంటే ప్రపంచంలో ఏనాడూ ఇప్పుడు జరుగుతున్నంతటి తీవ్రమైన అన్వేషణ ఇప్పటిదాకా ఎప్పుడూ జరగలేదు కనుక. ఎందుకంటే ఇప్పుడున్నంతటి మహాహీన దుర్దశలో మానవుడు ఏనాడూ లేడు కనుక.

మనం ఉంటున్నాం ప్రస్తుతం సంభవింపబోతున్న మానవత్వపు నవ్యస్థాయి దేనిలోకో ప్రవేశించబోతూ ఆ మహాద్వారపు గడపమీదే నుంచుని. మానవత్వం మరణించి అదృశ్యం అయినా అయిపోవాలి, లేదా మనం ఓ లంఘనాన్ని, ఓ దుముకును చేసి ఓ నవ్య జీవి జననాన్ని అయినా సృష్టించుకోవాలి. మనం

ఉంటున్నాం ప్రస్తుతం, కొన్ని కోట్ల సంవత్సరాలకు ముందు ఎక్కడున్నామో సరిగ్గా ఆ చోట్లోనే - వానరాలు వృక్షాల మీద నుంచి క్రిందికి దిగి భూమిమీదికొచ్చి మానవత్వం ప్రభవించి నరుడు తయారయినప్పటి ఆ చోట్లోనే, సరిగ్గా ఆ పరిస్థితిలోనే ప్రస్తుతం మనం ఉంటున్నాం. ఆ క్షణం మళ్ళీ మన అతిసామీప్యానికి వచ్చేస్తూ ఉంది. ఇది ఎంతో ప్రమాదభరితమైన సమయక్షణం, ఎందుకంటే ఏం జరిగేందుకయినా అవకాశాలు ఉన్నాయి కనుక...

అప్పటి ఆ గతంలో భూమి మీద వానరాలు జీవించి ఉండలేకపోవడమే జరిగి ఉండవచ్చు. కోతి భూమి మీద జీవించి ఉండలేకపోయి ఉండవచ్చు. కానీ కొన్ని వానరాలు ధైర్యం చేశాయి. ప్రమాద పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కొన్నాయి. మిగతా కోతులన్నీ భూమి మీద నిలబడి ఉన్న ఆ కోతుల్ని చూస్తూ వాటిని పిచ్చికోతులుగా, మూర్ఖులిగా ఊహించి ఉండవచ్చు - మ్మ్? - అవన్నీ అప్పటికే చెట్ల మీదే ఉండేవి. సంతోషంగానే వృక్షాల మీద అవి జీవిస్తూ ఉండేవి. ఆ కోతులు తప్పకుండా అనుకునే ఉంటాయి "వీళ్ళకు పిచ్చెత్తి ఉంటుంది. ఉన్మాదం కలిగే ఉంటుంది. భూమి మీద నుంచోడానికి వీటికి ఏం పని? ఎందుకు వెళ్ళాలి అసలు భూమి మీదికి? ఎందుకు వెళ్ళారు భూమి మీదికి? ఎందుకు అనవసరంగా కష్టాలను కొనితెచ్చుకోవడం? మన తండ్రులూ, వాళ్ళ తండ్రులూ, వాళ్ళ తండ్రులూ అందరూ వృక్షాల మీదే నివసిస్తూ ఉండేవారు కదా?"

అదే పరిస్థితే ఇప్పుడు వచ్చేసి జరగబోతోంది. మానవుడు తన పాత అలవాట్లకు అనుగుణ్యంగానే ఎంతోకాలం నుండీ జీవించాడు. ఈ శతాబ్దాంతంలోనే ఓ మహాలంఘనం సంభవించే సంభావ్యత ఉంది. మానవుడు ఓ మూడవ ప్రపంచ యుద్ధాన్నయినా చేసుకుని మరణిస్తాడు లేదా మానవుడు ఓ లంఘనాన్ని చేసి ఓ కొత్త మానవుడిగానయినా తయారవుతాడు. అది సంభవం అయ్యేందుకు ఓ గొప్ప బుద్ధక్షేత్రం అత్యంత ఆవశ్యకం- ఏ క్షేత్రంలో భవిష్యత్తును మనం సృష్టించుకో గలుగుతామో ఆ బుద్ధక్షేత్రం.

కానీ ఓ బోధిసత్త్వుడు చెప్పలేడు "నేను ఓ చక్కటి సామరస్యం ఉన్న బుద్ధక్షేత్ర వ్యూహాన్ని సృష్టిస్తాను" అని. ఆ 'నేను' మీద ఒత్తిడి కనిపిస్తూ ఉంటే ఆ మనిషికి ఇంకా బోధిసత్త్వ స్థితి రాలేదనే అర్థం. బుద్ధుళ్ళు సైతం 'నేను' అన్న పదాన్ని ఉపయోగించు కుంటూనే ఉంటారు. కానీ ఆ బుద్ధుళ్ళు మళ్ళీ మళ్ళీ నొక్కి చెబుతూనే ఉంటారు ఆ 'నేను'కు ఏ వాస్తవమూ లేనే లేదని, భాషాపరంగా ఉపయోగించవలసి

వస్తున్న సహాయకారి శబ్దం మాత్రమేనని, ఆ పదం కేవలం ఉపయోగార్థం వినియోగింపబడుతున్న శబ్దం మాత్రమేనని.

మరి బుద్ధుడు అంటాడు "ఈ సామరస్యపు బుద్ధక్షేత్ర వ్యూహాల్లో ఏ సామరస్యమూ లేనే లేదు" అని. ఎందుకు? – సామరస్యం ఉందన్న మాట వినబడితే అక్కడ ఇంకా సంఘర్షణ సజీవంగా ఉంటున్నదనే అర్థం కాబట్టి. సామరస్యం అంటే 'సంఘర్షించే అంశాలు అందులో ఉన్నాయి కానీ అవన్నీ తమ సంఘర్షణలను మానేసి ఉంటున్నాయి' అని అర్థం. బుద్ధుడు అంటాడు, నిజమైన సామరస్యం ఎప్పుడొస్తుందంటే సంఘర్షిస్తున్న అన్ని అంశాలూ కరిగిపోయి ఏకత్వం ఏర్పడి ఉన్నప్పుడు మాత్రమేనని, కానీ ఆ స్థితిని 'సామరస్యస్థితి' అని అప్పుడు మనం చెప్పలేం, ఎందుకంటే సామరస్యం ఉండాలంటే ఎందరో ఉండాలి కాబట్టి. సామరస్యం అంటే ఎన్నో అంశాలు అందులో ఉంటూ కలిసే సర్వస్వంగా ఉంటున్నదనే అర్థం. బుద్ధుడు అంటాడు ఓ నిజమైన సామరస్యం ఆ అన్ని అంశాలూ కరిగిపోయి ఓ ఏకత్వం మాత్రమే మిగిలున్నప్పుడు మాత్రమేనని.

కాబట్టి 'సామరస్యం' అన్నది నిజంగా ఓ సామరస్యం కానే కాదు. దాన్ని 'సామరస్యం' అని చెప్పుకోవడానికి కూడా వీల్లేదు. నిజమైన సామరస్యం ఏకత్వం మాత్రమే– ఏ సంఘర్షణా, ఏ రాపిడీ ఉండదు కనుక. ఎందుకంటే ముక్కలుగా ఉన్న అన్ని అంశాలూ విలీనం అయిపోయి అదృశ్యం అయిపోయి ఉన్నాయి కనుక.

***మరి ఎందుకు? ఆ చక్కటి బుద్ధక్షేత్ర వ్యూహాలను... సుభూతీ, సామరస్యం ఉందని బుద్ధక్షేత్ర వ్యూహాలేనని తథాగతుడు భాషించాడు కనుక. అందువల్లే 'చక్కటి బుద్ధక్షేత్ర వ్యూహాలు' అని ఆయన అంటున్నాడు...***

జ్ఞాపకం తెచ్చుకుంటూనే ఉండండి మళ్ళీ మళ్ళీ. భాష చాలకపోని సమస్యే ఇదంతా. అందువల్లే బుద్ధుడు మాట మాటకూ మీకు నొక్కి చెబుతూనే ఉంటాడు, మీకు జ్ఞాపకం తెప్పించడానికి, భాష చాలని వ్యక్తీకరణలను వింటూ బలి అయిపోవద్దని.

***భగవానుడు అన్నాడు : మరి మళ్ళీ, సుభూతీ, ఓ ఉత్తమ స్త్రీ కానీ, ఓ ఉత్తమ పురుషుడు కానీ, గంగానదీ తీరం మీద ఎన్ని ఇసుకరేణువులు ఉన్నాయో అన్నిరెట్లు తమ సంపత్తును దానం చేస్తున్నారనుకో; మరి అనుకో 'ఈ ధర్మపరిబోధనంలోని నాలుగు శ్లోక పాదాలయినా ఒకరు గ్రహించి ఇతరులకు పరిబోధించారు' అని. అప్పుడు ఈ ధర్మప్రకాశి అంతకన్నా***

**గొప్ప కొలవలేని, అగణనీయ, మహాపుణ్యరాశిని పొంది ఉన్నవాడు అవుతాడు.**

ఓ మహాగురువూ, జెన్ సాంప్రదాయంలో ఆరవ మహాగురువూ అయిన హుయ్ నెంగ్‌కు వజ్రచ్ఛేదిక సూత్రంలోని నాలుగు పాదాలను వినిన వెంటనే జ్ఞానోదయం కలిగిందన్న విషయం ప్రచారంలో ఉంది. ఆయన విఫణి వీధిలో నడుచుకుంటూ వెళ్తున్నాడు. దేన్నో కొనుక్కునేందుకు ఆయన వెళ్ళాడు బజారు వీధికి. ఆయన జ్ఞానోదయం పొందాలని కూడా అనుకోవడంలేదు. ఎవరో ఆ వీధిలో ఓ ప్రక్కన కూర్చుని వజ్రచ్ఛేదికను పఠిస్తూ ఉన్నాడు. ఆ మనిషి తన యావజ్జీవితమూ ఆ వజ్రచ్ఛేదికను పారాయణం చేస్తూనే ఉన్నాడు – ఆయన తప్పకుండా ఓ పండితుడో, విద్యాధికుడో, రామచిలుకో అయ్యుంటాడు – అదే ఆయన నిత్యకృత్యం, అనుష్టానం; ప్రొద్దున్నా, సాయంత్రంపూటా కూర్చుని వజ్రచ్ఛేదికను పారాయణం చేస్తూ ఉండడం.

సాయంత్రం పూర్తయి చీకట్లు కమ్ముకుంటున్నాయి. అంగళ్ళు అన్నీ మూసేశారు. అందరూ తమ ఇళ్ళకు వెళ్ళిపోతూ ఉన్నారు. హుయ్‌నెంగ్ కూడా ఆ వీధిలోనే నడుస్తూ ఉన్నాడు. అలా నడుస్తున్నప్పుడు వజ్రచ్ఛేదిక సూత్రంలో నాలుగుపాదాలు ఆయనకు వినిపించాయి. ఉన్నట్లుండి ఆయన స్తబ్ధుడైపోయాడు. ఏ మాటలూ లేవు ఆయనలో అలాగే నుంచుండిపోయాడు. ఆయన ఆ రాత్రంతా అలా అక్కడే నిలబడిపోయే ఉన్నాడట. వజ్రచ్ఛేదిక పారాయణం పూర్తయిపోయింది. అంగళ్ళన్నీ మూసేశారు. పారాయణం చేస్తున్న మనిషి కూడా లేచి వెళ్ళిపోయాడు. హుయ్‌నెంగ్ అక్కడే నిలబడిపోయాడు. వెళ్ళిపోయాడు పర్వతాల్లోకి. ప్రపంచం ఆయనకు అసంగతంగా తోచింది. కేవలం విన్నంత మాత్రాన్నా? – ఔను. అది కూడా సాధ్యమే, ఎలా వినాలో మీకు తెలిసి ఉంటే. ఈ హుయ్‌నెంగ్ ఎంతో ఎంతో అమాయకపు మనిషి అయ్యుంటాడు. ఆయన ఓ అద్భుతమైన మనిషి.

బుద్ధుడు అంటాడు ఈ వజ్రచ్ఛేదికలోని నాలుగు పాదాలను వర్ణించి చెప్పగలిగినా, ఆ మనిషికి మహాపుణ్యం ప్రాప్తిస్తుందని, ఆ పుణ్యరాశి ఇంతటిది అని కొలవడానికీ, లెక్కించడానికీ వీలే కాదని. ఎవరైనా గంగానదీ ఒడ్డుమీద ఎన్నిరేణువులు ఉంటాయో అన్నిరెట్లు తమ సంపదను దానం చేస్తే ఎంత పుణ్యం వస్తుందో అంతకంటే గొప్ప పుణ్యం వస్తుందని.

వైరాగ్యం మాత్రం ఉంటే ఏ ఉపయోగమూ ఉండదు. అవగాహన ఉంటేనే ఉంటుంది ఉపయోగం. ప్రపంచాన్ని త్యజించినంత మాత్రాన మీరెక్కడికీ వెళ్ళిపోరు.

మీరు అర్థం చేసుకుని అవగాహనను సంపాదించుకోవాలి. త్యజించెయ్యడం ఓ మూర్ఖపు ప్రయత్నం మాత్రమే. మూర్ఖులు మాత్రమే త్యజిస్తూ ఉంటారు, వివేకులు విషయాన్ని అర్థం చేసుకునే ప్రయత్నాన్నే చేస్తారు. వివేకవంతుడు ఎప్పుడూ తప్పించుకునిపోయేవాడు కాడు. మూర్ఖులు మాత్రమే తప్పించుకుపోయేవాళ్ళయి ఉంటారు. ఎందుకంటే వాళ్ళు జీవితాన్ని ఎదుర్కోలేరు కాబట్టే, జీవితాన్ని ఓ పరీక్షగా, సవాలుగా వాళ్ళు తీసుకోలేరు. ఆ దమ్ములు వాళ్ళకు ఉండవు. ఆ ధైర్యం వాళ్ళకు ఉండదు. హిమాలయాలకు పారిపోతారు. ఏ టిబెట్టు లోని మఠాల్లోకో వెళ్ళి దాక్కుంటారు – ప్రపంచం నుండి వాళ్ళు పరుగెత్తుకుపోతారు. పిరికిపందలు. మతం ఉండగలిగేది ధైర్యం మీకు ఉన్నప్పుడే – అత్యంత ధైర్యం ఉండితీరాలి.

బుద్ధుడు అంటాడు ఈ సూత్రాలను అత్యంత విలువైనవని. సంపూర్ణంగా దీన్ని మీరు వింటే, మీ హృదయాన్ని తెరుచుకుని, దానిని వింటూ మార్పు పొందడానికి మీరు సంసిద్ధులు అయి ఉంటే, మీ జీవితాన్ని అది పరివర్తించగలుగుతుందని. ఒక్కొక్కప్పుడు ఓ చిన్న పదం కూడా చాలు మహత్తర పరివర్తనం మీలో ఏర్పడడానికి, మహాశక్తితో అది ఉంటుంది.

ఓ మనిషి గురించి నేను విన్నాను. ఆయన కూడా హుయ్‌నెంగ్‌లాంటి మనిషే అయ్యుంటాడు తప్పకుండా. ఎంతో వృద్ధుడు. అరవై అయిదో – డెబ్బై ఏళ్ళో ఉంటాయి ఆయనకు. ఓ రోజు ప్రొద్దున్నే మార్నింగ్‌వాక్ కోసం బయల్దేరాడు. ఎవరో ఓ ఆడమనిషి అప్పుడు తన కుమారుణ్ణి నిద్రలేపుతూ ఉండి ఉంటుంది, కుమారుణ్ణో, లేకపోతే ఇంకెవరినో. ఈ ముసిలాయన ఆ ఇంటిముందు నడుస్తున్నాడు, ఆమె ఎవర్నో నిద్రలేపుతూ ఇలా అంటోంది "నిద్రలేచే వేళ అయ్యింది. తెల్లారిపోయింది! రాత్రి కాదిది!"

వృద్ధుడు ఈ మాటల్ని విన్నాడు. మ్మ్? – అది వజ్రచ్ఛేదికా సూత్రం కూడా కాదు. ఒక స్త్రీ ఎవరికో చెప్తున్న మాటలు. "లెయ్! చాలు! ఎక్కువసేపే నిద్రపోయావు. రాత్రి కాదు ఇది. సూర్యుడొచ్చేశాడు. తెల్లారిపోయింది "ముసలాయన విన్నాడు. ఆయనకు ఓ స్వీకరించే తత్వపు గుణం ఉన్న మనస్సు తప్పకుండా ఉండే ఉంటుంది – ప్రభాతవేళ, పక్షుల పాటలూ, జరుగుతున్న సూర్యోదయమూ, చల్లగాలులూ – మరి ఆ మాటలు ఆయనకు గట్టిగానే తగిలాయి, బాణాల్లా ఆ మనిషి హృదయంలోకి దూసుకుపోయాయి. "తెల్లారిపోయింది. ఎంతోసేపు నిద్రపోయావు. రాత్రి కాదిది". ఆ వృద్ధ మానవుడు మళ్ళీ ఇంటికి పోనేలేదు. ఆ పట్టణాన్ని దాటి వెళ్ళిపోయి, ఓ గుళ్ళో కూర్చుని ధ్యానం చేసుకుంటున్నాడు.

అందరికీ ఆయన్ని గురించి తెలిసింది. ఇంట్లోవాళ్ళు ఆయనకోసం పరుగెత్తుకుంటూ వచ్చారు. అన్నారు ఆయనతో "ఏం చేస్తున్నారు మీరిక్కడ?"

ఆయన అన్నాడు "తెల్లారిపోయింది. రాత్రి కాదిది. ఇప్పటికే చాలినంత నిద్రపోయాను. అయిందేదో అయిపోయింది. ఇకచాలు! క్షమించండి, నన్నిక వదిలిపెట్టెయ్యండి. నేనిక మేల్కొనే ఉండాలి. వచ్చేస్తోంది మృత్యువు – నేనుండాలి మేలుకునే."

ఆ వృద్ధుడు మళ్ళీ ఎప్పుడు ఆవైపొచ్చినా, ఆ ఇంటిముందు నుంచి వెళ్తున్నా – ఆ ఆడమనిషిని ఆయన ఎప్పుడూ చూడలేదు – ఆయనవెళ్ళి ఆ ఇంటి గడపకు తన తలను ఆనించి దండం పెట్టుకుంటాడు. అదే ఆయనకు దేవాలయం. ఆ ఆడమనిషే ఆయనకు గురువు. ఆ ఆడమనిషిని ఆయన ఎప్పుడూ చూడలేదు. ఆ ఆడమనిషి ఓ సాధారణ స్త్రీ మాత్రమే.

కొన్నిసార్లు కొన్ని మాటలు అతి సాధారణం మనుషుల దగ్గర్నుండి వినిపించినా, ఆ విత్తనాలు హృదయ సుక్షేత్రాలలోకే వచ్చి పడి ఓ గొప్ప పరివర్తనను మానవుడిలో తీసుకురాగలుగుతాయి. బుద్ధుడి మాటలను గురించి ఇక చెప్పేందుకు ఏముంటుంది?

***ఆ ధర్మబోధ పూజ్యనీయుడైన సుభూతి కళ్ళల్లోకి***
***ఆనంద భాష్పాలను తెప్పించేసింది.***
***కన్నీళ్ళు కార్చి భగవానునితో అన్నాడు : అద్భుతం భగవాన్,***
***పరమాద్భుతం సుగతా, ఎంత బాగా తథాగతులవారు భాషించారు ధర్మాన్ని!***
***తత్ప్రజ్ఞ నాకు ప్రాప్తించింది... నిజంగా ఇది అగ్రాహ్యం. మరి ఎందుకు?***
***బుద్ధుళ్ళు, భగవానులు, తమ అన్ని గ్రహణాలనూ వదలిపెట్టి***
***వెళ్ళిపోయారు కనుక.***

సుభూతిలాంటి లక్షణాలు ఉన్న మనిషి కన్నీళ్ళు పెట్టుకోవడం అత్యంత అరుదుగానే జరుగుతుంది. కానీ అంతటి కరుణావేశం అంతటి ప్రేమ బుద్ధుడిలో నుంచి ఆయన మీద వర్షిస్తూ ఉన్నప్పుడు అటువంటి వజ్రపు పలుకులు ఆయనమీద కురుస్తూ ఉన్నప్పుడు, సుభూతి అందులో మునిగిపోయాడు.

***ఆ ధర్మబోధ పూజ్యనీయుడైన సుభూతి కళ్ళల్లోకి***
***ఆనంద భాష్పాలను తెప్పించేసింది.***

గుర్తుపెట్టుకోండి. అంతటి ప్రగాఢమైన మీ కృతజ్ఞతలను అర్పించుకోడానికి కన్నీళ్ళకు మించినది మరొక్కటి లేదు. కన్నీళ్ళను మించిన ఏ ప్రార్థనా పద్ధతీ లేదు. కొద్దిరోజులముందు గీత గోవింద్ ఎసాలెన్ నుంచి వచ్చాడు. నాతో ఒక్కమాట కూడా మాట్లాడలేకపోయాడు – కన్నీళ్ళే కన్నీళ్ళు. ఎంతో ఇబ్బంది పడిపోయాడు కూడా. ఏదో నాతో చెప్పాలనుకుంటూ ఉన్నాడు. కానీ నోరు పెగలటం లేదు.

ఆ కన్నీళ్ళు ఉన్నాయి ఎంతో సౌందర్యంతో. అప్పట్నుంచి ఆ మనిషి ఇంకా ఏడుస్తూనే ఉన్నాడు. ఇక్కడ ఉన్న ఆ రెండు మూడువారాల పర్యంతమూ ఏడుస్తూనే ఉన్నాడు. వెళ్ళిన తరువాత ఉత్తరం కూడా వ్రాశాడు "ఓషో, ఏం చెయ్యాలి? ఈ కన్నీళ్ళను ఎలా ఆపుకోవడం? అవి వస్తూనే ఉన్నాయి"... తగిలింది స్పర్శ... ఆ మనిషి నాతో సంబంధాన్ని పెట్టుకున్నాడు. అందువల్లే ఆ అశ్రువులు. ఆ మనిషి నన్ను చూశాడు. అందువల్లే ఆ అశ్రువులు. ఆ మనిషి కళ్ళే కృతజ్ఞతను ప్రకటిస్తూ ఉన్నాయి. అందువల్లే ఆ అశ్రువులు. ఆ కళ్ళు సాఫల్యాన్ని పొందాయి, అందుకే ఆ అశ్రువులు.

కన్నీళ్ళు వచ్చేస్తాయని భయపడకండి. మీ 'నాగరికత' అన్నది మిమ్మల్ని కన్నీళ్ళకు భయపడేట్లు చేసేసింది. ఓ విధమైన నిందత్వ భావాన్ని మీలో సృష్టించింది. మీకు కన్నీళ్ళు వస్తే ఏ ఇబ్బందో కలుగుతుంది. మీకు అనిపిస్తుంది "మిగిలినవాళ్ళు ఏమనుకుంటారో? నేను ఓ మగాణ్ణి అయి ఉండి ఏడుస్తున్నాను ! ఇది స్త్రీత్వం లాగే, బాల్యత్వం లాగే కనిపిస్తుంది. ఈ విధంగా ఉండకూడదు". మీరు కన్నీళ్ళను ఆపేసుకుంటారు, మీరు చంపేసుకుంటారు మీలో దేన్నో, పెరుగుతూ ఉన్నదాన్ని.

మీలో ఉన్న అన్నిటికన్నా కన్నీళ్ళే మరెంతో ఎక్కువ అందంగా ఉంటాయి. ఎందుకంటే కన్నీళ్ళు మీ జీవుడిలో నుంచే పొంగి వస్తాయి కనుక. ఆ కన్నీళ్ళు దుఃఖం కోసం మాత్రమే కాదు అవసరం. మీ ఆనందం ఎక్కువైపోయినా మీకు కన్నీళ్ళు వస్తాయి. మహాశాంతి మీలో నెలకొన్నప్పుడు కూడా కన్నీళ్ళే వస్తాయి. ప్రేమానుభూతి పారవశ్యంలో కూడా వస్తాయి కన్నీళ్ళు. బ్రహ్మానంద పారవశ్యంలో కూడా కన్నీళ్ళు వస్తాయి. వాస్తవంలో సంతోషానికీ, దుఃఖానికీ కన్నీళ్ళతో ఏ సంబంధమూ లేదు. మీ హృదయాన్ని ఏది తీవ్రంగా కుదిపేసినా, దేనితో మీరు అణగద్రొక్కెయ్యబడినా, ఏది మీ సర్వస్వాన్ని ముంచెత్తినా, ఏది మిమ్మల్ని పట్టుకున్నా, ఏ అతి మీలో ఎక్కువైనా, దేన్ని మీరు అదుపు చేసేసుకోలేకపోయినా అదే పొంగుతుంది – అవే కన్నీటిని తెస్తాయి.

ఆనందంగానే స్వీకరించండి కన్నీళ్ళను, వాటిని ఆస్వాదించండి, వాటిని పోషించండి, వాటిని స్వాగతించండి. ఆ కన్నీళ్ళ ద్వారానే ఎలా ప్రార్థించాలో మీరు తెలుసుకుంటారు. కన్నీళ్ళ ద్వారానే ఎలా చూడాలో మీరు తెలుసుకుంటారు. కన్నీళ్ళు నిండిన కళ్ళే సత్యాన్ని చూడగలిగే సామర్థ్యం కలిగిన కళ్ళు అయి ఉంటాయి. కన్నీళ్ళు నిండిన కళ్ళే జీవిత సౌందర్యాన్నీ, ఆశీర్వాదాన్నీ దర్శించగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉన్న కళ్ళు అయి ఉంటాయి.

***ఆ ధర్మబోధ పూజ్యనీయుడైన సుభూతి కళ్ళల్లోకి***
***ఆనంద భాష్పాలను తెప్పించేసింది.***
***కన్నీళ్ళు కార్చి భగవానునితో అన్నాడు : అద్భుతం భగవాన్,***
***పరమాద్భుతం సుగతా, ఎంత బాగా తథాగతులవారు భాషించారు ధర్మాన్ని!***
***తత్ప్రజ్ఞ నాకు ప్రాప్తించింది...***

ఆయన అంటున్నాడు, “మీ సమక్షం, మీ కరుణావేశపు పలుకులు, మీ ప్రేమ, మీ అనుగ్రహం ప్రజ్ఞను నాకు ప్రాప్తింపజేశాయి. సత్యం ఏదో ఆ దర్శనం ప్రాప్తించింది... నిజంగా ఇది అగ్రాహ్యం. ఎందుకంటే దాన్ని దర్శిస్తూ ఉన్నవాడు ఎవ్వడూ లేడు కనుక. కేవలం స్వచ్ఛమైన ప్రజ్ఞ మాత్రమే అది.

జ్ఞాత్వత ఉదయించింది, కానీ తెలుసుకున్నవాడు ఎవడూ లేడు, తెలియబడింది కూడా ఏదీ లేదు. కేవలం తెలుసుకోవడం – జ్ఞాత్వత మాత్రం ఉదయించింది. అదే స్వచ్ఛమైన తెలుసుకునే తత్వం. విభజన ఏదీ అక్కడలేదు – తెలుసుకుంటున్నవాడూ లేడు, తెలియబడుతూ ఉన్నదీ లేదు, తెలిసిందీ ఏమీ లేదు; కేవలం జ్ఞాత్వత మాత్రం ఉంది.

***మరి ఎందుకు? బుద్ధుళ్ళు, భగవానులు, తమ అన్ని గ్రహణాలనూ***
***వదలిపెట్టి వెళ్ళిపోయారు కనుక.***

“మరిప్పుడు నాకు తెలుసు, ఎందుకు బుద్ధుళ్ళు తమ అన్ని గ్రహణాలనూ ఇక్కడే వదిలిపెట్టి వెళ్ళిపోయారో. ఎందుకంటే ఓ గ్రహణం జరగడానికి గ్రహిస్తున్నవాడూ, గ్రహింపబడుతున్నదీ కూడా ఉండితీరాలి కనుక; గమనించడానికి గమనిస్తున్నవాడూ, గమనింపబడుతున్నదీ కూడా ఉండేతీరాలి కనుక. ఈ ద్వంద్వాలన్నీ పోగొట్టుకోబడ్డాయి. అక్కడ ఏకత్వం మాత్రమే ఉంది.”

ఇది ఎంతో కష్టం చెప్పడానికి.

మైఖేల్ ఆడమ్స్ మాటలు ఇక్కడ తప్పకుండా ఉపయోగపడతాయి :

"ఇన్ని మాటలు కావలసి వస్తున్నాయి చెప్పడానికి, కానీ ఏముంది చెప్పడానికి? ఇక్కడ ఇప్పుడు, ఏముందక్కడ? చెట్ల మధ్య గాలులు – ఇవి వస్తుంటాయి, అవి వాలుతూ ఉంటాయి. నేను ఎన్నో మాటల్ని అనేశాను; నగుబాటుకు ఇది కారణం, సత్యం ఒక్కమాటే కనుక. జీవితం ఒక మాట. మృత్యువు ఒక మాట. ప్రేమ ఒక మాట. సంతోషం ఒక మాట. దేవుడు ఒక మాట. గాలీ చెట్టూ, పక్షీ చేపా, పిల్లోడూ సూర్యుడూ అన్నీ నిజాలు. తక్కినవన్నీ మాటలే.

"సూర్యుడి గురించిన మాటల్లో ఉండదు నీడల నిజం – మరి ఉంటుందెంతో చల్లగా కూడా. గోజారే మనస్సుకూ తెలీదు, అన్వేషించే హృదయానికీ తెలీదు, సూర్యుడు మరోలా ఉంటూ, ఏ చప్పుడూ చేయకుండా, కష్టమే పడనట్లు ఉంటాడు కనుక. కానీ ఈ నిశ్చల నిశ్శబ్ద భూమికి అర్థమవుతున్నట్లే, ఏ ప్రయత్నమూ లేకుండానే తెలిసున్నట్లుంది సూర్యుణ్ణి. ఈ మృత్యు సమానపు పోలిక క్రింద, మంచుకమ్మిన ముసుగు క్రింద, చలికాలం మధ్యలో, బట్టబయటి భూమికి నిశ్శబ్దంలోనే తెలుసు సూర్యుడంటే ఏమో."

ఆ శిష్యుడు బీటలువారిన భూమిలాగా ఉండాలి – బీటలువారిన భూమికే తెలిసి ఉంటుంది నిజంగా మేఘమంటే ఏమిటో. శిష్యుడు కూడా బట్టబయలు భూమిలాగే ఏ రక్షణలూ లేకుండానే ఉండాలి. ఆ అరక్షిత అవనికే తెలుసు అరుణుడంటే ఎవరో. కానీ దాన్నది చెప్పలేదు, వ్యక్తీకరించలేదు, కానీ దానికి తెలుసు.

సుభూతి మాట్లాడుతున్న మాటలకు అర్థం అదే. "ప్రజ్ఞ నాకు ప్రాప్తించింది. కానీ నేను చెప్పలేను; నేను లేను అక్కడ దాన్ని పట్టుకోడానికి. నేను లేను అక్కడ దాన్ని లాక్కోడానికి. నేనున్నాను ఓ శూన్యంగా – కానీ ఓ ప్రజ్ఞాగ్రహణం కలిగింది. ప్రజ్ఞ ప్రాప్తించింది. దర్శనం కలిగింది. నేను చూశాను, మరి చూస్తున్నవాడు లేడు."

**భగవానుడు అన్నాడు : ఔను, ఇదింతే సుభూతీ.**
**అద్భుతంగా ఆశీర్వదింపబడినవాళ్ళే అవుతారు ఈ ధన్యజీవులు,**
**ఈ ధర్మసూత్రాన్ని విని వణికిపోనివారు, భీతిల్లనివారు,**
**భయవిహ్వలులు కానివారు...**

ఈ సూత్రాలు ఉంటున్నాయి మృత్యు తుల్యాలై, అవి ఉంటున్నాయి శిలువ పడేట్లుగా – మీరు తప్పకుండా మరణించేతీరాలి. మృత్యువు వల్లే జీవితం అంటే ఏమిటో మీకు తెలుస్తుంది. పునరుత్థానం సంభవంగానే ఉంటుంది, కానీ శిలువపడిన తరువాత మాత్రమే. అందువల్లే అంటున్నాడు బుద్ధుడు ఈ సూత్రాలను ప్రమాదకారకాలు అని, మరి :

*అద్భుతంగా ఆశీర్వదింపబడినవాళ్ళే అవుతారు ఈ ధన్యజీవులు,*
*ఈ ధర్మసూత్రాన్ని విని వణికిపోనివారు, భీతిల్లనివారు,*
*భయవిహ్వాలులు కానివారు...*
*పైగా, సుభూతీ, తథాగతుడి క్షమాసంస్కరణ నిజంగా*
*సంస్కరణే కాదు.*
*మరి ఎందుకు? ఎందుకంటే, సుభూతీ, కళింగరాజు*
*నా సర్వాంగాలనూ ఖండిస్తూ ఉన్నప్పుడు ఆ సమయంలో*
*నాకు 'అహాన్ని' అన్న, 'జీవిని' అన్న, 'ఆత్మను' అన్న, 'వ్యక్తిని' అన్న*
*ఏ గ్రహణాలూ నాలో లేవు కనుక.*
*మరి ఎందుకు? ఒకవేళ, సుభూతీ, ఆ సమయంలో*
*ఓ 'అహాన్ని' నేనన్న గ్రహణం నాలో కలిగి ఉంటే*
*ఓ దుశ్చింతనా గ్రహణం కూడా నాలో ఆ సమయంలో*
*కలిగి ఉండేదే కనుక...*

బుద్ధుడు తన ఓ గతజన్మపు అనుభవాన్ని సుభూతికి గుర్తుచేస్తున్నాడు, తన సర్వావయవాలూ కళింగరాజు చేతిలో ఖండిపబడుతూ ఉన్న అనుభవాన్ని గురించి. ఆయన అంటున్నాడు "అలా నా శరీరాంగాలు ఖండింపబడుతూ ఉన్నప్పుడు, నా చేతులు నరికివేయబడుతూ ఉన్నప్పుడు, నా కాళ్ళు నరికివేయబడుతూ ఉన్నప్పుడు, నా నాలుకనూ, కళ్ళనూ పెకలింపవేయబడుతూ ఉన్నప్పుడు, నేను గమనిస్తూనే ఉన్నాను. అప్పుడు కూడా ఓ 'నేను' అన్న గ్రహణం ఆ సమయంలో తలెత్తి ఉంటే, అప్పుడు తప్పకుండా ఓ దుశ్చింత కూడా వచ్చి ఉండేది. అప్పుడు నాకు ఆ రాజు మీద కోపం వచ్చేసి ఉండేది, నన్ను చంపేస్తూ నాశనం చేసేస్తూ ఉన్నవాడి మీద. కానీ నాలో కోపం లేదు, ఏ కోపమూ లేదు అక్కడ."

అహంకారమే ఆగ్రహాన్ని తెప్పిస్తుంది. అహంకారపు ఛాయే ఆగ్రహం–కోపం. అహంకారమే పోరునూ, ఆక్రమణనూ, హింసనూ పట్టుకొస్తుంది. అహంకారం

అదృశ్యం అయిపోయిన వెంటనే హింస అంతా మాయమైపోతుంది. ఓ మనిషి ప్రేమగా మారడం అహంకారం అదృశ్యం అయినప్పుడే జరుగుతుంది.

మరి ఇంకా, సుభూతీ, సర్వజీవుల శ్రేయం కోసమే బోధిసత్వుడు
చేయాలి దానాలను ఈ విధంగా.
మరి ఎందుకు? ఓ 'జీవిని' అన్న గ్రహణం, సుభూతీ,
కేవలం ఓ అగ్రహణం మాత్రమే. ఏ సర్వజీవుల గురించి
తథాగతుడు భాషించాడో, వారందరూ నిజంగా
అజీవులే కనుక.
మరి ఎందుకు? ఎందుకంటే తథాగతుడి భాషణ వాస్తవానికి
అనుగుణ్యంగానే ఉంటుంది కనుక, సత్యభాషణమే
అయివుంటుంది కనుక, ఏది ఉన్నదో దాన్నే భాషిస్తాడు కనుక,
లేనిదాన్ని చెప్పడు కనుక. ఓ తథాగతుడు అసత్యభాషణం చెయ్యడు...

'తథాగత' శబ్దం, సుభూతీ, సత్య సమతకే ఉంటుంది
సారూప్యంగా...

బుద్ధుడు అంటున్నాడు "నేను ఏది ఉందో దాన్నే చెబుతున్నాను - యధాభూతమ్. అది తప్ప ఇంకేమీ నేను చెప్పడం లేదు. అందువల్లే ఉంటున్నాయి నా ఈ మాటలు వైపరీత్యాలుగా - ఎంతో అతార్కికంగా - ఎందుకంటే సత్యమే ఉంటోంది అతార్కికంగా కనుక. సత్యాన్ని అర్థం చేసుకోవాలంటే తర్కాన్ని మీరు విడిచిపెట్టెయ్యాలి."

ఈ రోజుకు ఇది చాలు.

# 10. బొత్తిగా శూన్యం

## మొదటిప్రశ్న:

*ప్రియ ఓషో,*

*మీతో నా సంబంధంలో కూడా, కాలం గడుస్తున్నకొద్దీ మాటల అవసరం క్రమేపీ తగ్గిపోతుంది. ఓ బుద్ధుడూ, ఓ బోధిసత్వుడూ ఎందుకు మాట్లాడుకోవాలి?*

దేన్ని గురించి అంటున్నావు? ఏం మాటలు? అవెప్పుడూ జరగలేదు. ఎవరు దేన్నీ చెప్పలేదు. ఎవరూ దేన్నీ వినలేదు. వజ్రచ్ఛేదికలో సూత్రాలే లేవు. మహాసత్వా, అందువల్లే దీన్ని వజ్రచ్ఛేదిక అంటున్నారు. ఇది బొత్తిగా శూన్యం. మాటల వద్దే ఇరుక్కుపోతే దీని సందేశాన్ని మీరు తప్పకుండా కోల్పోతారు. వజ్రచ్ఛేదిక సాంతమూ శూన్యమే, ఏ సందేశమూ అందులో లేదు. చదివేందుకు ఏమీ లేదు, వినేందుకు ఏమీ లేదు. అదుంది పూర్ణ నిశ్శబ్దంగా.

దేన్నో మీరు వజ్రచ్ఛేదికలో చదివి ఉంటే దాన్నే మీరు పోగొట్టుకున్నారనే అర్థం. ఏ సిద్ధాంతమయినా, ఏ వేదాంతమయినా అందులో కనుగొని ఉంటే మీరు తప్పకుండా దాన్ని ఊహించుకుంటున్నారనే అర్థం. అది తప్పకుండా మీ స్వప్నమే అయివుంటుంది. బుద్ధుడు ఏమీ చెప్పలేదు, సుభూతి సైతం దేన్నీ వినలేదు. ఆ మాట్లాడని, వినిపించని దాంట్లో ఏదో జరిగింది – మాటలకు అతీతంగా ఉన్నదేదో. ఆనందుడు దాన్ని మీకు మాటలతో అందించేందుకు ప్రయత్నించాడు, కానీ మాటలతో అది అందలేదు. రెండు శూన్యత్వాల మధ్య జరిగిన ప్రసారణమే అది.

సముద్రం దగ్గరికి వెళ్ళి సూర్యోదయాన్ని చూస్తారు, తాజా గాలినీ, సూర్యకిరణాలనూ, కెరటాలనూ, తరువాత ఎవరికో మీరు చూసినదాన్ని చెబుతారు. అప్పుడు కేవలం మాటలనే మీరు చెబుతారు. 'సముద్రం' అన్న పదం సముద్రం కాదు, 'సూర్యుడు' అన్న పదం సూర్యుడు కాదు. 'తాజాదనం' ఉండదు తాజాదనంతో. ఎలా ప్రసారం చెయ్యగలుగుతారు? సముద్రం దగ్గర్నుంచి మీరు తిరిగొస్తారు, మీ

అర్ధాంగి మిమ్మల్ని అడుగుతుంది “ఏం జరిగింది?” అని. మీరు అక్కడ జరిగిందంతా మాటల్లోకి పట్టుకొచ్చేస్తారు, మాటలతో చెప్పేందుకు అది సాధ్యపడే విషయం కాదనీ, మాటల్లోకి దాన్ని దిగజార్చేందుకు అసాధ్యమనీ మీకు తెలిసే ఉన్నప్పటికీ. పదాలు ఉంటాయి ఎంతో పాలిపోయి.

ఏదో తప్పకుండా జరిగింది బుద్ధుడికీ సుభూతికీ మధ్య, అతీతమైనది ఏదో. బహుశా వాళ్ళిద్దరూ కేవలం కళ్ళల్లోకి చూసుకుని ఉండవచ్చు. సుభూతి చైతన్యంలో ఏదో ప్రేరేపింపబడి బుద్ధుని సమక్షంలో సంభవించి ఉంటుంది. ఆనందుడు ఆ విషయాన్ని చెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు. మీరుంటున్నారు అంధులై. వెలుతురును మీరు చూడలేరు, ‘వెలుతురు’ అన్న పదాన్ని మీరు వినగలుగుతారు.

కాబట్టి గుర్తుపెట్టుకోండి : వజ్రచ్ఛేదిక ఓ సూత్రం కానే కాదు. అందువల్లే దాన్ని అంటున్నారు ‘వజ్రచ్ఛేదికా సూత్రం’ అని. మహావిలువైనది. ఎందుకంటే ఏ వేదాంతమూ, ఏ పద్ధతీ, ఏ సిద్ధాంతమూ అందులో లేదు కనుక. అందులో ఏ పదాలూ ఉండవు. అది ఓ శూన్యపుస్తకం.

ఆ మాటలను మీరు మరచిపోగలిగి ఆ మాటల మధ్యల్లోని వ్యవధుల నిశ్శబ్దపు ప్రగాఢాంతరాల్లోకి వెళ్ళగలిగితే, పంక్తులను మీరు మరచిపోగలుగుతూ ఆ పంక్తుల మధ్య ఉన్న వ్యవధుల ప్రగాఢాంతరాల్లోకి వెళ్ళగలిగితే, ఆ విరామాల మధ్య ఉన్న నిశ్శబ్దపు లోతుల్లోకి, మాటలు ఆగి ఉన్న సమయపు నిశ్శబ్దపు లోతుల్లోకి వెళ్ళగలిగితే, అప్పుడు తెలుసుకుంటారు మీరు అక్కడ ఏం జరిగిందో. అది మాటలతో జరిగిన ప్రసారం కాదు.

నేను కూడా మీతో మాట్లాడుతున్నాను, అయినప్పటికీ నేను మీకు గుర్తుచేస్తున్న దేమిటంటే నా సందేశం నా మాటలలో ఉండదనే. ఆ మాటలను మీరు అధిరోహిస్తూ దాన్ని పొందాలి. ఉపయోగించుకోండి నా మాటలను వర్తులాకారంతో పైకి తీసుకెళ్ళే మెట్లలా, సోపానాలలా, పడికట్లుగా. గుర్తుపెట్టుకోండి, కాలికి బురద అంటకుండా రాళ్ళమీద నడుస్తున్నప్పుడు ఆ రాళ్ళే ఉంటాయి మీకు మహాప్రతిబంధకాలుగా, ఆ రాళ్ళమీద ఎలా నడవాలో మీకు తెలియకుండా ఉంటే.

ఓ నిశ్శబ్దం లోంచి మరో నిశ్శబ్దం లోకి మీరు వినాలి.

మహాసత్వా, బుద్ధుడు ఒక్కమాటను కూడా చెప్పలేదు, సుభూతి ఒక్కమాటను కూడా వినలేదు. అపార కరుణావేశంతో ఆనందుడే మీకు కొన్ని మ్యాపులు గీసి చూపిస్తున్నాడు. ఆ మ్యాపుల్లో దేశాలు ఉండవు. ఓ భారతదేశపు చిత్రపటం భారతదేశం

కాదు, అదే భారతదేశం అయిపోదు. ఓ ఇండియా మ్యాపు ఇండియా ఎలా కాగలుగుతుంది? కానీ ఆ మ్యాపు మీకు కాస్త ఉపయోగపడుతుంది. నిజం ఇండియాకు మిమ్మల్ని అది చేర్చగలుగుతుంది. ఓ మైలురాయి మీద కనిపిస్తున్న బాణపు గుర్తులాగా అది ఉంటుంది. ఆ బాణపు గుర్తు మీకు దేన్నో సూచిస్తుంది.

ఈ వజ్రచ్ఛేదిక మొత్తం నిశ్శబ్దం లోకే సూచిస్తుంది. అందువల్లే అందులో ఉంటాయి అన్ని వైరుధ్యాలు. ఎందుకంటే వైరుధ్యాలతో మాత్రమే నిశ్శబ్దపు సృష్టి జరగగలుగుతుంది కనుక. ఒక మాటకు మరో విరుద్ధపు మాట వెంటనే ఉచ్ఛరించబడుతూ, ఆ రెండు మాటలూ పరస్పరం నాశనం చేసేసుకుని, ఆ విధ్వంసపు ఉద్భవంలో నిశ్శబ్దం అనుభవింపబడుతుంది.

## రెండవప్రశ్న :

**ప్రియ ఓషో,**

**నా లోపలికి నేనే ఎంత ప్రగాఢంగా పడిపోతున్నానో అంతగా ఒంటరితనాన్ని అనుభవిస్తున్నాను. అక్కడ శూన్యం మాత్రమే ఉంటోంది. మరి అప్పుడప్పుడూ, మీ కళ్ళలోకి చూస్తూ ఉన్నప్పుడు, ఆ మహాశూన్యత్వానుభవమే నాలో కలుగుతూ ఉంటోంది. అదే సహజస్థితి అయితే – ఒంటరితనమే మౌలికస్థితి అయితే, నా ఉనికి జీవమూలం అదే అయితే – ఏకత్వాన్ని పొందాలన్న భ్రమాత్మకపు ఊహ, మరో మనిషితో శాశ్వత ప్రేమ అన్న ఊహ ఎలా వచ్చి ఉంటుంది జీవుడికి ముందుగా? మరెందుకు మహా కష్టంగా ఉంటుంది 'అదంతా భ్రమ మాత్రమే'నన్న ఎరుక ఏర్పడుతున్నప్పుడు? దయచేసి నా సంశయాలను తీరుస్తారా?**

సందేహీ మీరే, సందేహమూ మీరే. మరే సందేహమూ లేదు. ముందుగా, "నాలోకి నేనే ఎంత ప్రగాఢంగా పడిపోతున్నానో అంతగా ఒంటరితనాన్ని అనుభవిస్తున్నాను" అని మీరు చెబుతున్నప్పుడు, నిజంగా మీ ప్రగాఢాంతరంలోకి చేరుతున్నప్పుడు ఏకాంతాన్నే అనుభవిస్తూ ఉంటారు కానీ "ఒంటరిగా నేనున్నాను" అన్న అనుభూతి మీలో ఉండదు, ఎందుకంటే అప్పుడక్కడ రెండు విషయాలు - నేను, ఒంటరితనం – ఉంటాయి కనుక. అప్పుడు మీరుండరు ఒంటరిగా. అప్పుడు అక్కడ అనుభవిస్తున్నవాడూ ఉంటాడు, అనుభవం కూడా ఉంటుంది; గమనిస్తున్నవాడూ ఉంటాడు, గమనింపబడుతూ ఉన్న విషయం కూడా ఉంటుంది. అప్పుడు మీరుండరు ఒంటరిగా, రెండవది అక్కడ ఉంది – అనుభవమే రెండవది.

మీరు నిజంగా మీ ప్రగాఢాంతరంలోకి పడిపోతే, మీరు కూడా కనిపించరు; ఇదే అర్థం చేసుకోవాల్సిన విషయం అంతా. కేవలం ఉపరితలం మీద మాత్రమే కెరటాలు ఉంటాయి ఉనికితో. సముద్రపు లోతుల్లోకి మీరు వెళ్తే, అక్కడ ఏ కెరటాలనూ మీరు చూడలేరు... లేదు, చూడగలుగుతాం అంటారా? సముద్రం లోపల అలలు ఎక్కడ ఉంటాయి? అలలు ఉపరితలం మీద మాత్రమే ఉంటాయి, అవి ఉండగలుగుతాయి కేవలం ఉపరితలం మీదే. కెరటాలు ఉండడానికి వీస్తున్న గాలులు కావాలి.

ఈ 'నేను' కేవలం ఉపరితలం మీద మాత్రమే ఉండగలుగుతుంది, ఎందుకంటే దానికో 'నువ్వు', 'నీ వీస్తున్న గాలి', తన ఉనికి ఉండేందుకోసం కావాలి కాబట్టి. మీరు మీ ప్రగాఢాంతరంలోకి ప్రవేశించారంటే, ఏ వీస్తున్న గాలులూ అక్కడ ఉండవు. 'నువ్వు'లు అక్కడ ఉండవు. ఎలా ఉండగలుగుతుంది 'నేను'? 'నేనూ' – 'నువ్వూ' కలిసే ఉంటాయి జంటలుగా, అవి ఎప్పటికీ విడాకులు తీసుకోవు. ఔను. మీకక్కడ ఒంటరితనం మాత్రమే కనిపిస్తుంది, కానీ 'నేను లేనితనం' మాత్రం కనిపించదు. ఆ ఒంటరితనం ఉంటుంది మహా అందంగా. మళ్ళీ ఇంకొక్కసారి నన్ను గుర్తుచేయనీయండి. Alone (ఒంటరితనం) All One అన్న పదానికి అర్థం అంతా ఒక్కటే అనే. ఆ పదం ఆ విధంగానే పుట్టింది – అంతా ఒక్కటే. ఉపరితలం మీద సర్వస్వం నుంచి ప్రత్యేకంగా మీరే కనిపిస్తారు. వాస్తవంలో, ఉపరితలం మీదే మీరుంటారు ఒంటరిగా, ఎందుకంటే సర్వస్వం నుంచి వేరైపోయి మీరు ఉంటున్నారు కనుక. లోతుల్లో, మీరు మాయమైపోయి ఉన్నప్పుడు, మీకూ సర్వస్వానికీ మధ్య విభజన ఉండదు. అంతా ఒక్కటే; మీరుండరు అక్కడ, ఒంటరితనం మాత్రమే అక్కడ ఉంటుంది.

మీరు అంటున్నారు "నా లోపలికి నేనే ఎంత ప్రగాఢంగా పడిపోతున్నానో అంతగా ఒంటరితనాన్ని అనుభవిస్తున్నాను" అని. తప్పకుండా అప్పుడు మీరు మీ ప్రగాఢాంతరంలోకి వెళ్ళిపోయినట్లు ఊహించుకుని ఉంటారు. మీ మనస్సు ఎన్నో ఆటలు ఆడగలుగుతూ ఉంటుంది. అది 'ఒంటరిగా ఉంటున్నాను' అన్న ఆటను ఆడగలుగుతుంది, 'ప్రార్థనలో ఉన్నాను' అన్న ఆటను ఆడగలుగుతుంది. 'ధ్యానంలో ఉన్నాను' అన్న ఆటను ఆడగలుగుతుంది. కానీ మీకు అక్కడ 'నేను' మిగిలి ఉండి కనిపిస్తే అప్పుడు మీరు నిశ్చయించి చెప్పుకోవచ్చు – అది ఒక 'ఆట మాత్రమే'నని. ఏదీ నిజంగా జరగలేదు. అందువల్లే ఇంకొకరు ఉండాలన్న కోరిక ఉదయిస్తుంది.

ఈ 'నేను' ఉండలేదు ఒంటరిగా, ఉనికితో. దానికి ఓ రెండవది కావాలి. దాన్ని నిలబట్టేందుకు రెండవదాని ఊతం కావాలి. దాన్ని నిలబెట్టేందుకు రెండవదాని తిండి కావాలి. దాన్ని నిలబెట్టేందుకు రెండవదాని పోషణ కావాలి. ఆ రెండవ దాన్లోకి మిమ్మల్ని అది మళ్ళీ పట్టుకొచ్చేస్తుంది. అందువల్లే ఒంటరిగా ఉన్నప్పుడు మీరు మీ ప్రేయసి గురించి, మీ స్నేహితుణ్ణి గురించి, మీ అమ్మను గురించి, మీ నాన్నను గురించి మీ వీడి గురించి, మీ వాడి గురించి ఆలోచించడాన్ని ప్రారంభించేస్తారు, వెయ్యిన్నొక్క విషయాలను. మీరు ఊహాత్మకపు 'నువ్వు'లను సృష్టించేసుకుంటారు. ఓ మనిషికి ఏకాంతవాసాన్ని మూడువారాలకంటే ఎక్కువగా విధించేస్తే ఆ మనిషి తనతో తానే మాట్లాడుకోవడాన్ని ప్రారంభించేస్తాడు. అన్ని సంభాషణలనూ తనే సృష్టించేసుకుంటాడు. ఆ మనిషే రెండుగా విభజింపబడిపోయి ఉంటాడు, 'నువ్వు'గా, 'నేను'గా. తనే రెండు అయిపోతాడు, ఆట ఆడుకునేందుకు. 'నేను'కు ఉనికి ఉండదు 'నువ్వు' లేకపోతే.

"నా లోపలికి ఎంత ప్రగాఢంగా పడిపోతున్నానో అంతగా ఒంటరితనాన్ని అనుభవిస్తున్నాను."

లేదు. 'ఏకాకి' అయిపోయారనే మీరు దిగులు పడుతున్నారు. Aloneness (ఏకాంతం), Loneliness (ఏకాకితనం) ఈ రెండు పదాలనూ సమానార్థకంగా వినియోగించుకోండి. Loneliness ఉంటుంది ఋణార్థకంగా, అపసవ్యంగా. Aloness ఉంటుంది సవ్యంగా, ధనార్థకంతో. Loneliness లో మీరుంటారు, ఓ లోపం కూడా ఉంటుంది. రెండవవాడు లేని లోపం. Aloneness లో మీరు ఉంటారు, లోపం ఉండదు. మీరే ఉంటారు పూర్తిగా ప్రత్యక్షంగా. మీరుంటారు పూర్తిగా అక్కడ. Loneliness లో రెండోవాడు ఉండడు. Aloneness లో మీ శాశ్వత జీవిగా మీరే ఉంటారు.

మీరు అంటున్నారు "అక్కడ శూన్యం మాత్రమే ఉంటోంది" అని. కాదు, అక్కడ కేవలం శూన్యత్వం మాత్రమే ఉంటే ఏ సమస్యా ఉండదు. శూన్యత్వం మాత్రమే అక్కడ ఉంటూ, తెలుసుకుంటున్న ఎవడూ అక్కడ ఉండకపోతే, అనుభవిస్తున్న ఎవడూ అక్కడ ఉండకపోతే, అప్పుడక్కడ ఏ సమస్యా ఉండదు. అప్పుడు సందేహం ఎక్కణ్ణుంచి వస్తుంది? ఎలా రాగలుగుతుంది సందేహం? రాదు. మీరక్కడ ఉన్నారు. అప్పుడు శూన్యత్వం అంతా దగా, ఎందుకంటే మీరక్కడ ఉన్నారు కనుక. ఎలా కాగలుగుతుంది అది ఓ శూన్యత్వం? అది కేవలం మీ ఊహ మాత్రమే.

నేను బాల్యంలో ఉన్నప్పుడు ఇది జరిగింది, మా ఇంట్లో. నేను సోమరిపోతును– నేను ఇప్పటికీ అదే – ఎంతో సోమరిపోతుగా నేను ఉండేవాణ్ణి. ఎంతో బద్ధకంతో. మా ఇంట్లోవాళ్ళు నా మీద అన్ని ఆశలనూ వదులుకున్నారు. క్రమక్రమంగా నా గురించి మరచిపోవడం ప్రారంభించేశారు, ఎందుకంటే ఏ పనినీ నేను చెయ్యను కనుక. ఓ మూల్లోకి వెళ్ళి కూర్చుంటాను, ఊరికే కూర్చుంటానంతే, కళ్ళు మూసుకునో, తెరచుకునో. ఏ పనికీ నేను వాళ్ళకు పనికిరాను కనుక క్రమంగా అందరూ నన్ను పట్టించుకోవడం మానేశారు. నేను ఇంట్లో ఉన్నానో లేనో కూడా వాళ్ళకు ఎవ్వరికీ తెలీదు.

అప్పుడప్పుడూ మా అమ్మకు బజారు నుండి ఏవో కావాల్సి వచ్చేది, కూరగాయలో, ఏవో. నేను ఆమె ముందే ఉండేవాణ్ణి కూర్చుని. ఆమె అంటూ ఉండేది “ఇక్కడ ఎవ్వరూ ఉన్నట్లు లేరు” అని. నా ముందే ఆమె కూర్చుని ఉండేది, నాతోనే అంటూ ఉండేది “ఇక్కడ ఎవ్వరూ ఉన్నట్లు లేరు. ఎవరైనా బజారుకు వెళ్ళి కూరగాయలు తెస్తే బావుణ్ణు”. ఆమె ముందే నేను ఉండేవాణ్ణి కూర్చుని. ఆమె అంటుంది “ఎవరూ ఇక్కడ లేరు”.

లేనివాణ్ణిగానే నన్ను లెక్కకట్టేశారు. ఇంట్లోకి ఏ ఊరకుక్క వచ్చేసినా, నేను రానిచ్చేవాణ్ణి. నేను గేటు దగ్గరే కూర్చుని ఉంటాను. ఓ కుక్క ఇంట్లోకి వెళ్తూ ఉంటుంది. నేను చూస్తూ ఉంటాను. మా అమ్మ ఆ కుక్కతోబాటు బయటికి పరుగెత్తుకొచ్చి అనేది “కుక్కను లోపలికి రానివ్వకుండా ఆపేందుకు ఎవరూ లేరు” అని. నేను అక్కడే ఉండేవాణ్ణి, కూర్చుని!

క్రమక్రమంగా ఇంట్లో నేనున్నా, నేనింట్లో లేనట్లేనని అందరూ తీర్మానించేసుకున్నారు. కానీ అందువల్ల ఏ గొప్ప వ్యత్యాసమూ నాకు ఉండేది కాదు. నేనుండేవాణ్ణి అక్కడే. కుక్క ఇంట్లోకి వెళ్ళడాన్ని చూస్తూనే ఉండేవాణ్ణి. అందరి మాటలనూ వింటూనే ఉండేవాణ్ణి. మార్కెట్టుకు వెళ్ళి కూరగాయలు కొనుక్కొచ్చే పనిని సమర్థవంతంగా నేను నిర్వహించగలనని కూడా నాకు తెలుసు. అయినా ఆ ఊహను తలచుకుంటూ, నవ్వుకుంటూ ఉండేవాణ్ణి – ఆమె ‘ఇక్కడ ఎవరూ ఉన్నట్లు లేరు’ అని ఎప్పుడూ చెప్పడాన్ని.

మీలో సంభవిస్తున్నది కూడా ఇదే. మీరు ఉన్నారు అక్కడ. కానీ అంటున్నారు శూన్యత్వం అక్కడ ఉందని. అక్కడ మీరు ఉన్నారన్న విషయం మీకు తెలియడంలేదు. అక్కడ మిమ్మల్ని మీరు గుర్తించుకోవడంలేదు. గుర్తించి ఉంటే మీరు అక్కడే

ఉన్నారని మీకు తెలిసొచ్చి ఉండేది. మీరు అక్కడ ఉంటూ ఉండకపోతే, ఎవరు చెబుతున్నారు శూన్యత్వం అక్కడ ఉందని? మీరక్కడ ఉండకపోతేనే స్వచ్ఛమైన శూన్యత్వం అక్కడ ఉండగలుగుతుంది. ఆ స్వచ్ఛతలోనే నిర్వాణమూ, సంప్రజ్ఞత్వమూ ఉంటాయి. అదే మహా విలువ ఉన్న ప్రదేశం. అదే మహా విస్తృతావరణం ఉన్న ప్రదేశం. కాబట్టి ఆ ప్రదేశాన్నే అందరూ అన్వేషిస్తూ ఉంటున్నారు, ఎందుకంటే అదుంటుంది అనంతంగా, అపారంగా. దాని స్వచ్ఛత ఉంటుంది పరమంగా. అది దేనివల్లా కాదు కలుషితం; మీరు కూడా అక్కడ ఉండరు. అక్కడ వెలుగూ, చైతన్యాలు ఉంటాయి, కానీ 'నేను' ఉండదు. 'నేను' ఉంటుంది మంచులా, గడ్డకట్టుకుని ఉన్న చైతన్యం. చైతన్యం ఉంటుంది కరిగిపోయిన మంచులాగా, ద్రవంగా, లేదా, అంతకంటే ఉత్తమంగా చెప్పాలంటే, ఆ జలం కూడా ఆవిరైపోయి, ఆవిరి కూడా అదృశ్యం అయిపోయి.

మరి మీరు చెప్తూ ఉన్నారు : "మరెందుకు మహాకష్టంగా ఉంటుంది 'అదంతా భ్రమ మాత్రమే' అన్న ఎరుక ఏర్పడుతున్నప్పుడు?" – రెండోవాడు. అదుంటుంది బాధాకరంగానే, ఎందుకంటే 'నేను' మరణిస్తూ ఉంటుంది కాబట్టి. రెండవది భ్రమే అనీ, ప్రేమ ఓ భ్రమేననీ గుర్తించడం ఎంతో కష్టంగానే ఉంటుంది, ఎందుకంటే 'నేను' మరణించడం ప్రారంభం అయిపోతుంది కనుక. 'నువ్వు'ను మీరు వదిలిపెట్టేస్తే 'నేను'కు ఉనికి ఉండదు. మరి మీకు ఆ 'నేను'ను వదిలిపెట్టెయ్యడంలో ఉన్న సౌందర్యం గురించి తెలియదు.

మరి మీరు అడుగుతూ ఉన్నారు : "అదే సహజస్థితి అయితే – ఒంటరితనమే మౌలిక స్థితి అయితే, నా ఉనికి జీవమూలం అదే అయితే, ఏకత్వాన్ని పొందాలన్న భ్రమాత్మకపు ఊహా, మరో మనిషితో శాశ్వత ప్రేమ అన్న ఊహా, ఎలా వచ్చి ఉంటుంది జీవుడికి ముందుగా?" అని.

అదొచ్చింది అక్కడికి అందువల్లే – ఒంటరితనమే మౌలిక సారమూల ఆవశ్యకం కనుక. హైందవ పురాణాలు అంటాయి దేవుడు ఒంటరివాడుగానే ఉంటాడని. కొంచెం ఆలోచించండి, ఒంటరిగా ఉన్న దేవుణ్ణి ఊహించి చూసుకోండి, ఒంటరిగానే మరి ఒంటరిగానే శాశ్వతంగా ఉండిపోతున్న దేవుడి పరిస్థితిని. ఆయనకు ఆ ఒంటరితనంతో మొహంమొత్తి పోయి ఉంటుంది. మహా విసుగుగా ఉంటుందది. ఆయనకు కొంచెం ఆడుకోవాలని అనిపించి ఉంటుంది. రెండోవాణ్ణి ఆయన సృష్టించుకుని దాగుడు మూతలాటను ఆడుకుంటూ ఉన్నాడు.

ఆట ఆడి ఆడి మీకు అలసట వచ్చేస్తే, ఆ ఆటతో మీకు మొహం మొత్తేస్తే, మళ్ళీ మీరు బుద్ధుళ్ళు అయిపోతారు. మళ్ళీ మీరు అన్ని ఆట బొమ్మల్నీ ప్రక్కకు పడేస్తారు. అవన్నీ మీరు సృష్టించుకున్నవే, వాటి విలువలన్నీ మీరు కల్పించుకున్నవే, మీరే విలువలను వాటిమీద పెట్టుకున్నారు. ఏ క్షణంలో ఆ విలువలను మీరు తొలగించేసుకుంటారో తక్షణమే అవి అదృశ్యమైపోతాయి. మళ్ళీ మీరు ఒంటరివాళ్ళు అయివుంటారు.

హైందవ ఆదిప్రజ్ఞ మహావిలువనూ, వైశిష్ట్యాన్నీ సంతరించుకుని ఉంది. అది అంటుంది దేవుడు ఒంటరివాడేనని. అలా ఉండడం విసుగువచ్చేసి మొహం మొత్తేసింది. అనంతంగా కొనసాగే ఒంటరితనం మహావిసుగే. ఆయన ప్రపంచాన్ని సృష్టించుకున్నాడు, రెండవదాన్ని సృష్టించాడు. కాస్త పిచ్చాపాటీ మాట్లాడుకునేందుకు. ఏ సంభాషణలో చేసుకునేందుకు. అందువల్ల కూడా మళ్ళీ మళ్ళీ విసుగొచ్చేస్తుంది, అలుపు వచ్చేస్తుంది. రెండవది దుర్భరం అయిపోతుంది. మళ్ళీ ఏకత్వంలోకే అయిపోతాడు అదృశ్యం. తన శూన్యత్వంలోకే మళ్ళీ వెళ్ళిపోతాడు, దేవుడు అయిపోతాడు.

మీరందరూ మిమ్మల్ని మీరే వంచించుకుంటున్న దేవుళ్ళే. దాన్నే మీరు ఎంచుకున్నారు. ఏ రోజున ఆ విధంగా ఉండకూడదని మీరు ఎంచుకుంటారో అప్పుడే అయిపోతుంది మీకు విముక్తి. అది మీ స్వప్నమే. ఒంటరితనం వల్ల – ఏకాంతతే మీ జీవుడి ఆవశ్యక మహాలక్షణం కనుక – ఆ ద్వితీయం, రెండవది సృష్టింపబడుతుంది.

మీరు దీన్ని ప్రయత్నించి చూడండి : కొన్నివారాలపాటు పర్వతాల మీదికి వెళ్ళిపోయి అక్కడే ఏకాంతంలో కూర్చోండి. అప్పుడు తెలుస్తుంది మీకు ఎంతో హాయిగా ఉన్నట్లు. సంబంధాలతో అందరికీ అలుపే, విసుగే వచ్చేసి ఉంటుంది, మొహంమొత్తిపోయే ఉంటుంది. వెళ్ళి పర్వతాల మధ్య కొన్నిరోజులు ఏకాంతవాసం చేయండి. అప్పుడు ఎంతో అందమైన సౌఖ్యానుభవం కలుగుతుంది. కానీ మూడునాలుగు రోజులు గడిచిన తరువాత, అయిదు రోజులు, ఏడు రోజులు, మూడు వారాలు, రెండవదాన్ని గురించి మీరు ఆలోచించడాన్ని ప్రారంభించేస్తారు. మళ్ళీ మీ అర్థాంగి మిమ్మల్ని మహా ఆకర్షిస్తూ ఉంటుంది. అన్ని సాధింపులనూ, ననసూ మీరు మరచిపోతారు. ఆమె ఇంట్లో పెట్టే పోరునంతా మరచిపోతారు. సర్వస్వాన్నీ మీరు మరచిపోతారు. మళ్ళీ ఆమె ఉంటుంది మహా అందంగా, మళ్ళీ ఉంటుందామె

ప్రేమదేవతగా, మళ్ళీ ఉంటుందామె అద్భుతంగా, మ్మ్?– మళ్ళీ విలువలను మీరు అక్కడ తెచ్చిపెట్టేస్తారు.

అప్పుడు మీరు అన్ని కొండలనూ దిగి నేలమీదికే చేరాల్సి వస్తుంది. రెండు మూడు రోజులు అన్నీ అందంగానే సాగుతాయి – మళ్ళీ ఓ ప్రేమయాత్ర – రెండు మూడురోజుల తరువాత మళ్ళీ వచ్చేస్తాయి కష్టాలు, మళ్ళీ మీరు అనుకుంటారు ఎలా ధ్యానం చేసుకుంటూ ఉండాలని, ఎలా నిశ్శబ్దంగా ఉండాలని. ఈ విధంగానే మీరు వ్యవహరిస్తూ ఉంటారు. కాస్త గమనించి చూసుకోండి, మీ చైతన్యాన్నీ, అందులో జరుగుతున్న మార్పుల్నీ. ఆ గమనించే వ్యాసంగం ద్వారా మొత్తం సృష్టికార్యక్రమాన్నీ తెలుసుకుంటారు, ఎందుకంటే మీరు కూడా మహాసంక్షిప్తంగా ఉంటున్న సృష్టే కాబట్టి.

మీ చైతన్యపు లోలకం అటూ ఇటూ ధ్యానం, ప్రేమల మధ్యే ఊగుతూ ఉంటుంది, ఒంటరితనం, సాహచర్యాల మధ్యే ఊగుతూ ఉంటుంది. మరి ప్రపంచంలో ఉన్న మతాలన్నీ ఇప్పటిదాకా ప్రేమకో, ధ్యానానికో మాత్రమే పరిమితాలు అయివుంటున్నాయి కాబట్టి అవి ఉంటున్నాయి విభజితాలుగానే, అవి ఉండడంలేదు సంపూర్ణంగా. ఓ సంపూర్ణ మతాన్ని నేనిప్పుడు మీకు ఇస్తున్నాను. దేన్నీ నేను ఎంచుకోవడం లేదు.

ఉదాహరణకోసం, బుద్ధుడు ధ్యానాన్ని ఎంచుకున్నాడు. ఆయన మీకు ధ్యానపు ప్రేమనే అందిస్తాడు, మరే ప్రేమనూ ఇవ్వడు. ఆయన మిమ్మల్ని ఏకాంతంలో ఉండమనే బోధిస్తాడు. పూర్ణ ఏకాంతంలో మాత్రమే ఉండమంటాడు. మరెక్కడా ఉండకూడదంటాడు. అది మంచిది. ప్రపంచంలో విసుగు వచ్చేసి మొహంమొత్తిపోయి ఉన్నవాళ్ళకు అది మహా పూర్తిగా మంచిది. బుద్ధుడు రాజై ఉండేవాడు. ఆయన భిక్షగాడు కాడు. స్త్రీలతో ఆయన అలసిపోయాడు. ఆయన తండ్రి తన రాజ్యంలో ఉన్న అందగత్తెలనందరినీ ఆయనకోసం పట్టుకొచ్చాడు. ఆయనకు ఓ అతి మనోహర స్త్రీల అంతఃపురం ఉండేది. ప్రపంచంలోని అందగత్తెలందరూ మీ ఇంట్లో మీ కోసం ఉంటే అక్కడ ఎన్నాళ్ళు మీరు ఉండగలుగుతారు? కేవలం ఆ విషయాల గురించి కాస్త ఆలోచించి చూడండి : ఒక్క అందగత్తే మహా ఎక్కువ. ఇప్పుడు యావత్ప్రపంచపు అందగత్తెలందరూ అక్కడ ఉన్నారు. ఆయనకు పిచ్చెత్తిపోయి ఉంటుంది. ఆయన తప్పించుకుని పారిపోయాడంటే, అందులో ఆశ్చర్యం ఏమీ లేదు. అన్ని సౌఖ్యాలూ ఆయనకోసం అమర్చిపెట్టబడ్డాయి. అన్నిరకాల సౌఖ్యాలూ ఆయనకోసం అమర్చి పెట్టబడ్డాయి. ఆయనకు మొహంమొత్తిపోయి ఉంటే అందులో ఏ ఆశ్చర్యమూ లేదు.

ఆయన రెండవ ధృవానికి వెళ్ళిపోయాడు. ఆ ద్వితీయ ధృవం కూడా ఆయనకు 'అతి' అయిపోయింది. అరణ్యాల్లోకి పారిపోయాడు, ఒంటరివాడు అయిపోయాడు.

ధ్యానానికి సంబంధించిన మతాలు ఉన్నాయి – బౌద్ధం, జైనం. ప్రేమకు సంబంధించిన మతాలు ఉన్నాయి – క్రైస్తవం, మహమ్మదీయం. మరి దీన్ని అర్థంచేసుకోవాలి. జీసస్ ఓ నిరుపేద. మహమ్మదు కూడా అంతే. ఇద్దరూ నిరుపేదలే అయివుండడం ప్రమాదవశాత్తూ జరిగింది అయివుండడానికి వీలులేదు. మహావీరుడు ఓ రాజు, బుద్ధుడు కూడా అంతే. ఈ ఇద్దరు రాజులూ ప్రపంచానికి ధ్యానమతాలను అందించారు. ఆ ఇద్దరు నిరుపేదలూ ప్రేమ మతాలను అందించారు ప్రపంచానికి.

నిరుపేద రెండవదానితో మొహంమొత్తిపోలేదు. ఆ రెండవది ఈ నిరుపేదకు అంత ఎక్కువగా ఎప్పటికీ ఉండదు కనుక. నిరుపేద ఎప్పుడూ రెండవదానికోసం కాంక్షిస్తూనే ఉంటాడు. ఆ రెండవది స్త్రీ కావచ్చు, ధనం కావచ్చు, అధికారం కావచ్చు, దైవం కావచ్చు, అందువల్ల ఏ వ్యత్యాసమూ ఉండదు – రెండవది నిరుపేదకు ఎప్పుడూ అవసరమే.

క్రైస్తవమూ, మహమ్మదీయమూ ఈ రెండూ ప్రార్థనా, ప్రేమ మతాలే – దేవుడికోసం ప్రేమ, దేవుడికోసం ప్రార్థన. బౌద్ధమూ, జైనాల్లో, దైవానికి చోటు ఉండదు ఏ మాత్రమూ. ఎందుకంటే రెండవదాని కోసం ప్రదేశం అక్కడ ఉండదు కనుక. ఏకాంతమే చాలు. జైనం, బౌద్ధాల్లో ప్రార్థనలాంటి దానికి ఉనికే ఉండదు. 'ప్రార్థన' అన్నమాట కూడా వాటిలో వినిపించదు; వాళ్ళకు ధ్యానం గురించి మాత్రమే తెలుసు కనుక. క్రైస్తవానికి ధ్యానం గురించి ఏమీ తెలియదు. ఇవన్నీ ప్రమాదవశాత్తుగా సంభవించిన విషయాలు కావు. ఇవన్నీ ఆ మతస్థాపకుల ఏ తత్వాన్నో మాత్రమే చూపిస్తాయి.

నేను మీకో సంపూర్ణ మతాన్ని ఇస్తున్నాను, ఆ రెండింటినీ స్వీకరిస్తున్న మతాన్ని. రెండవదాంతో అలసిపోయివున్నట్లు అనిపిస్తూ ఉన్నప్పుడు, వెళ్ళండి ధ్యానంలోకి, ఊగండి ఆ దిశలో ధ్యానంలోకి. ఒంటరితనంతో ఏకాంతంతో మీకు అలుపూ విసుగూ వచ్చేస్తూ ఉన్నప్పుడు ఊగి రండి ప్రేమలోకి. ఆ రెండూ మంచివే. ఆ రెండూ ఉంటాయి పరస్పర వైరుధ్యాలుగానే, కానీ ఆ పరస్పర వైరుధ్యత వల్లే మహా ఆనందం ఆవిర్భవిస్తుంది. ఏ ఒక్కటి మాత్రమో మీ వద్ద ఉంటే మీ దగ్గర ఉండదు ఆ విధమైన సంపద. ఒకటి మీకు నిశ్శబ్దాన్నో, బ్రహ్మానందాన్నో ఇస్తుంది. కానీ రెండూ ఉంటే అవి ఇవ్వగలుగుతాయి దేన్నో, అత్యంత విలువ ఉన్న దేన్నోనూ

పోల్చలేని దేన్నో. ఆ రెండూ కలిసి మీ వద్ద ఉంటే, ఓ నిశ్శబ్ద ఆనంద పారవశ్యాన్నే, ఓ ప్రశాంత ఆనందాన్నే అవి మీకు ఇస్తాయి. మీ మహాంతర మూలకేంద్రంలో మీరుంటారు మహానిశ్శబ్దంలో, పరిధి మీద ఉంటుంది, నాట్యం. మరి ఆ నిశ్శబ్దం నాట్యంచేస్తూ ఉన్నప్పుడు లేదా ఆ నిశ్శబ్దం పాటలు పాడుతున్నప్పుడు, అదే ఉంటుంది మహా సంపత్కరమై, మహోత్తుంగ శిఖరమై. అందువల్లే నేను పట్టుపట్టి చెబుతున్నాను, ఈ రెండూ ఉండాలని.

ఒకప్పుడు జార్జి బెర్నార్డ్ షా ఓ పెద్ద విందు జరుగుతూ ఉన్న ఓ గదిలో ఓ మూల్లో ఒంటరిగా కూర్చుని ఉన్నాడు. ఆతిథ్యాన్ని ఇస్తున్న ఆ పెద్దావిడ ఆయన దగ్గరికి నడిచొచ్చి ఆప్యాయంగా అడిగింది "ఏమండీ, ఆనందంగా మీకు ఉన్నట్లు లేదా?" అని.

ఆయన బదులు పలికాడు "ఆ సర్వస్వానందాన్నే నేను అనుభవిస్తున్నాను".

ఓ మహాసత్యాన్నే ఆయన గురిచూసి కొట్టాడు, ఓ మహాప్రజ్ఞ అక్కడ ఉంది. స్వీయాత్మ మాత్రమే ఒక మనిషి ఆనందించగలిగిన సర్వస్వం. జీవితం నిశ్శబ్దాన్ని స్వీకరించే లక్షణాన్నే పట్టుకోవడాన్ని ప్రారంభించేస్తుంది. కానీ స్వీయాత్మానందాన్ని అనుభవించగలుగుతూ రెండవదాన్ని అనుభవించలేకపోతూ ఉంటే ఓ గొప్ప పరిధిని మీరు తప్పకుండా పోగొట్టుకుంటారు. మనిషికి స్వయాన్నీ, రెండోదాన్ని కూడా అనుభవించగలిగే సామర్థ్యం ఉండాలి. ఆ మనిషినే నేను పూర్ణమానవుడని అంటాను. ఆ పూర్ణమానవుడే పవిత్ర మానవుడు.

## మూడవప్రశ్న :

*ప్రియ ఓషో,*

*మీ ప్రసంగాలను వింటున్నప్పుడూ, మరికొన్ని సమయాల్లో కూడా జ్ఞానోదయం పొందడానికి ఆవశ్యకమైన అన్నిటినీ తెలుసుకుని నేను ఉన్నాననే నాకు అనిపిస్తూ ఉంటుంది. ఆ సమయాల్లో జ్ఞానోదయాన్ని పొందే నేను ఉంటానా? బాహ్య విషయాలుగానే ఉపరితలంలో అతిసహజంగానే అర్థం అవుతున్న ఈ 'జ్ఞాత్వత' ఎలా అంతరంలోకి దూసుకువెళ్ళి జీవుడి ఉనికితత్వంగా పరిణమిస్తుందో దయచేసి చెప్పండి. నాకు అనిపిస్తుంది ఈ నేర్చుకుంటూ ఉండడం నా అమాయకత్వాన్నీ, మరింత సంపూర్ణ అనుభవజ్ఞానాన్నీ నాలోంచి దోచేస్తూ ఉన్నట్లే, నా జీవుడి ఎదుగుదుల కన్నా నా*

జ్ఞానపు ఎదుగుదలే ఎక్కువ వేగంగా జరుగుతున్నట్లు తోస్తూంది. అయినా ఇప్పుడు 'జీవుడు' అన్నది లేనే లేదన్న విషయం తెలిసొచ్చిన తరువాత ఓ ఎదుగుదలను నా జీవుడిలో పొందాలని కూడా నాకు ఇప్పుడు అనిపించడంలేదు.

మొదటి విషయం : మీరు అంటున్నారు "మీ ప్రసంగాలను వింటున్నప్పుడూ, మరికొన్ని సమయాల్లో కూడా జ్ఞానోదయం పొందడానికి ఆవశ్యకమైన అన్నింటినీ తెలుసుకుని నేను ఉన్నాననే నాకు అనిపిస్తూ ఉంటుంది" అని. జ్ఞానోదయం జరగడానికి ఏమీ అవసరం లేదు. కాబట్టి జ్ఞానోదయం పొందడానికి కావల్సిన అన్నిటినీ మీరెలా తెలుసుకోగలుగుతారు? జ్ఞానోదయాన్ని పొందడానికి ఏమీ అవసరం లేదు. జ్ఞానోదయం స్థితే మీ సహజస్థితి. దేన్నో తయారుచేసుకోవాల్సిన, నిర్మించుకోవాల్సిన, సృష్టించు కోవాల్సింది కాదు అది. దేన్నో కొత్తదాన్ని మీరు తయారుచేయాలనుకుంటే, అప్పుడు మీకు ఎన్నో పదార్థాలు, విషయాలు అవసరమవుతాయి. దేన్నీ మీరు తయారు చేసుకోవాల్సింది కొత్తది ఉండకపోతే ఏం కావాల్సి వస్తుంది? మీరున్నారు సంప్రజ్ఞులై. ఏదయినా ఉండాల్సిన అవసరం ఏముంటుంది? ఏమీ అవసరం లేదు.

కాబట్టి "జ్ఞానోదయం పొందడానికి ఆవశ్యకమైన అన్నింటినీ తెలుసుకుని ఉన్నాను" అన్న మీ ఊహే మీ దారికి అడ్డం పడుతోంది. జ్ఞానోదయం పొందడానికి ఏమీ అవసరం లేదు. తెలుసుకోవాల్సింది ఏదీ లేదు జ్ఞానోదయాన్ని పొందడానికి. జ్ఞానోదయం అప్పటికే అక్కడ ఉంది. అదే స్థితి ఉందక్కడ. అదో ప్రాప్తం కాదు. అది ఓ గుర్తింపు మాత్రమే. దాన్ని పొందడానికి ఏ ప్రయత్నాలనో మీరు చెయ్యనక్కరలేదు; ఏ ప్రయత్నాలనూ చెయ్యకుండా ఉండడమే మీరు చెయ్యాల్సిన పని. అన్ని ప్రయత్నాలనూ వదిలిపెట్టెయ్యండి – ఉన్నట్లుండి అదే అక్కడ ప్రత్యక్షమవుతుంది. అది మీకెందుకు కనిపించడంలేదంటే దాన్ని చూసేందుకోసం అన్ని ప్రయత్నాలనూ చేస్తూనే మీరుంటున్నారు కాబట్టే. దాన్ని చూడాలని మీరు చేస్తున్న ప్రయత్నాలే మిమ్మల్ని చూడనీయకుండా అడ్డుపడుతున్నాయి.

మళ్ళీ మీరు అడుగుతున్నారు "ఆ సమయాల్లో జ్ఞానోదయాన్ని పొందే నేనున్నానా?" అని. సర్వసమయాల్లో జ్ఞానోదయాన్ని పొందే మీరు ఉంటారు, కానీ మీరు నన్ను వింటున్నప్పుడు కాదు. ఈ వజ్రచ్ఛేదికలో ఏ సూత్రాన్నో మీరు చదువుతున్నప్పుడు కాదు – ఆ క్షణాలలో మాత్రమే కాదు. అన్ని సమయాల్లోనూ జ్ఞానోదయాన్ని పొందే మీరు ఉంటారు. జన్మించిన తొలి క్షణం నుంచీ మృత్యువుతో

అంతం అయిపోయే ఆఖరిక్షణం దాకా ఎప్పుడూ జ్ఞానోదయాన్ని పొందే మీరు ఉంటారు. జ్ఞానోదయాన్ని పొందనేలేదని మిమ్మల్ని మీరే ఎంతకాలమయినా అలా మోసం చేసుకుంటూనే ఉండిపోవచ్చును. కానీ ఎల్లవేళల్లోనూ జ్ఞానోదయాన్ని పొందే మీరు ఉంటారు.

అది ఎలా ఉంటుందంటే ఓ మగమనిషి ఓ నాటకంలో ఆడమనిషి వేషాన్ని వేస్తూ ఉన్నట్లే. అన్నివేళల్లోనూ ఆ మనిషి మగాడే. కానీ ఎంతసేపయినా ఆ వేషాన్ని వేసుకుంటూ ఉండవచ్చు. అప్పుడప్పుడూ ఆ విషయాన్ని ఆ మగాడు మరచిపోతూనే ఉండవచ్చు. గొప్ప నటుడే ఆ మనిషి. నిజంగా ఓ గొప్పనటుడే. తను ఆడదానినన్న ఓ ఊహను తెచ్చుకుని తరువాత తను మగవాడన్న విషయాన్ని మరచిపోవచ్చు. కొన్ని క్షణాలపాటు తను ఓ స్త్రీ అనే అనుకుంటూ ఉండవచ్చు. కానీ మళ్ళీ మళ్ళీ ఆ మనిషికి తను మగవాడినే అన్న విషయం తెలుస్తూనే ఉంటుంది.

జ్ఞానోదయాన్ని పొందే మీరున్నారన్న విషయాన్ని మరచిపోయి ఉండడం నిజంగా ఓ అద్భుతమే. అలా ఎప్పుడూ మరిచిపోయే ఉంటూ ఉండడం అద్భుతమే. గుర్తుంచుకోండి. జ్ఞానోదయం అన్నది ఎప్పుడో ఏ భవిష్యత్తులోనో మీకు సంభవించబోయే ఓ లక్షణం కాదు. దాన్ని మీరు మీ జన్మతోబాటే తెచ్చుకునే ఉన్నారు. అదుంటోంది మీ శ్వాసలో. అదుంటోంది మీ హృదయస్పందనలో. ఆ జ్ఞానోదయ పదార్థంతోనే నిర్మింపబడి మీరు ఉంటున్నారు.

“ఆ సమయాల్లో జ్ఞానోదయాన్ని పొందే నేనున్నానా?” లేదు. అప్పుడప్పుడూ జ్ఞానోదయాన్ని పొంది ఉన్నట్లూ అప్పుడప్పుడూ జ్ఞానోదయాన్ని పొందకుండానే ఉన్నట్లూ మీకు అనిపిస్తూ ఉంటే అప్పుడు మీకు జ్ఞానోదయం కలగలేదనే అర్థం. ఏ క్షణంలో సర్వవేళల్లోనూ జ్ఞానోదయాన్ని పొందే మీరున్నారని మీకు తెలుస్తుందో ఆ క్షణం నుండే జ్ఞానోదయాన్ని పొంది మీరు ఉంటారు. ఒక్కసారి ఆ అనుభవం మీకు కలిగిందంటే, అదుంటుంది ఎప్పటికీ మీతోబాటే, ఓ సుగంధంలాగా.

అయినా మీరు వెయ్యిన్నొక్క ఆటలను ఆడుకుంటూనే ఉంటారు. నేను ఆడుతున్నాను. బుద్ధుడు ఆడుతున్నాడు. కానీ అలా ఆటలు ఆడుకుంటూ ఉంటున్నంత మాత్రాన ఏ వ్యత్యాసమూ ఉండదు. అప్పుడు సంపూర్ణ చైతన్యంతోనే నిండు ఎరుకతోనే ఆ ఆట కొనసాగింపబడడం జరుగుతుంది. ఆ ఆటలో ఇరుక్కుపోవడం జరగదు. అది మిమ్మల్ని బంధించదు.

ఒక్కసారి ఆటను మీరు అది ఆటే అని తెలుసుకుని ఆడారంటే, అప్పుడు ఏ సమస్యా ఉండదు. అప్పుడు మీరు ప్రపంచంలోనే ఉండవచ్చు, ఏ ఆనందాన్నయినా పొందుకుంటూ మీరుండొచ్చు, కానీ లోతుల్లో అది మీరు కాదని తెలుసుకునే మీరుంటారు. లోతుల్లో మీరుంటారు దూరంగానే. మీరవుతారు అప్పుడు ఓ పద్మంలా – నీళ్ళల్లోనే మీరుంటారు, అయినా ఆ నీళ్ళు అంటవు మిమ్మల్ని.

"ఆ సమయాల్లో జ్ఞానోదయాన్ని పొందే నేనున్నానా?" మీరు అడుగుతున్నారు, "బాహ్య విషయాలుగానే ఉపరితలంలో అతి సహజంగానే అర్థం అవుతున్న ఈ 'జ్ఞాత్వత' ఎలా అంతరంలోకి దూసుకువెళ్ళి జీవుడి ఉనికితత్వంగా పరిణమిస్తుందో దయచేసి చెప్పండి."

ఉపరితలం మీద జరుగుతున్న జ్ఞాత్వత ఎప్పటికీ ఉనికితత్వంగా కాదు. మహాప్రగాఢ జ్ఞాత్వత కూడా ఎప్పటికీ ఉనికితత్వం అయిపోదు. జ్ఞానమే అవరోధం. జ్ఞాత్వం ఏనాటికీ జీవుడి ఉనికి అయిపోదు. జ్ఞానమే ఉంటోంది అవరోధంగా. జ్ఞాత్వత్వం ఏనాటికీ జీవుడి ఉనికి కాదు – ఆ జ్ఞానం ఉపరితల జ్ఞానమయినా, ప్రగాఢజ్ఞానం అయినా. ఆ జ్ఞానాలలో ఏ వ్యత్యాసాన్నీ నిర్ణయించుకోకండి. ఇవన్నీ మనస్సు మళ్ళీ ఉపయోగించుకున్న కిటుకులు మాత్రమే. జ్ఞానార్జన సామర్థ్యపు మనస్సు అది.

జ్ఞానార్జన సామర్థ్యం ఉన్న మనస్సు మీతో ఇలా చెప్పగలుగుతుంది "అవును. నువ్వు అంటున్నది ఒప్పే. ఉపరితల జ్ఞానం వల్ల నీకు జ్ఞానోదయం రాదు. కానీ ప్రగాఢ జ్ఞానం సంగతేమిటి?" అని.

ఇది కూడా మీ మీద ప్రయోగింపబడుతున్న ఓ మాయోపాయపు కిటుకు మాత్రమే. ప్రగాఢ జ్ఞానమా? మహాగంభీర జ్ఞానమా? అప్పుడు మీరు మళ్ళీ తప్పకుండా ఆ వలలోనే పడి చిక్కుకుపోయి ఉంటారు. ప్రగాఢ జ్ఞానం అయినా, గంభీర జ్ఞానం కాకపోయినా అన్నీ స్వాభావికంగా ఉపరితల జ్ఞానాలే. మహాగంభీర ప్రగాఢ జ్ఞానం కూడా ఉపరితల జ్ఞానం మాత్రమే. జ్ఞానార్జనే ఉపరితల తత్వం. ఉనికితో ఉండడం అంటే ఉనికితో ఆ జ్ఞానంతో తయారై ఉండడమేనని మీరు అంటున్నట్లు.

మీరు ఉండాలి ఎరుకతో. మనస్సు మహా టక్కరిది. అన్ని విషయాలనూ అది పట్టుకోగలుగుతూ ఆ విషయాలను దొడ్డిదారిలో నుండి పట్టుకొచ్చి మళ్ళీ మళ్ళీ మీ ముందు నిలబెట్టుతూ ఉంటుంది. అది చెప్పగలుగుతుంది "ఒప్పే. నేను నీతో

ఒప్పుకుంటాను. ఉపరితల జ్ఞానం ఎలా అందించగలుగుతుంది జ్ఞానోదయాన్ని? అసాధ్యం అది. ప్రగాఢ జ్ఞానాన్ని ఏ మార్గంలో సంపాదించుకోవచ్చో నేను చూపిస్తాను."

ప్రగాఢ జ్ఞానాన్ని సంపాదించుకోడానికి మీరు ఏం చేస్తారు? ఏ జ్ఞానాన్ని ఆర్జించుకున్నా అదుంటుంది ఉపరితల జ్ఞానంగానే. ఎందుకంటే అన్ని జ్ఞానాలూ ఉపరితల జ్ఞానాలు మాత్రమే కాబట్టి. మహాఅయితే మీకు మరింత ఎక్కువ ఉపరితలజ్ఞానం పోగు అయ్యుంటుంది. ఆ జ్ఞాన పరిమాణం మాత్రం పెరుగుతుంది. ఆ జ్ఞానం వల్ల మీకు మహాప్రగాఢ జ్ఞానం వచ్చేసి ఉందన్న భ్రమ కలుగుతుంది.

మీరు వెళ్ళవచ్చు ప్రగాఢ జ్ఞానపు వివరాలలోకి. కానీ ఆ వివరాలు ఉనికి లోతుల్లోకి తీసుకువెళ్ళవు. మీరు ఓ విషయాన్ని గురించి ఓ విషయం తెలుసుకోవచ్చు లేదా ఒక్క విషయాన్ని గురించి వెయ్యి విషయాలను తెలుసుకోవచ్చు; ఎన్ని వివరాలు నేర్చుకున్నా ఏ వ్యత్యాసమూ ఉండదు – జ్ఞానం ఉంటుంది దేన్నో గురించి, దేన్నో గురించి. లక్ష్యాన్ని అది ఛేదించదు. లక్ష్యాన్ని అది ఎప్పటికీ చేరదు. లక్ష్యాన్ని జీవుడు మాత్రమే సమీపించి చేరుకోగలుగుతాడు. ఆ ఉనికిగా ఉండేందుకు, జ్ఞానాన్ని పూర్తిగా విడిచిపెట్టెయ్యబడడం జరగాలి. జ్ఞానం అంతటినీ, అన్ని నియమాలతో సహా, "ఇది మంచిది, ఉంచుకో; ఇది చెడ్డది, పారేయ్; ఇది గంభీరం, ఉంచుకో; ఇది గంభీరం కాదు, పారెయ్" అన్న ఏ ఎంపికలూ చెయ్యకుండా. జ్ఞానానికి సంబంధించిన దేన్ని మీరు మీతో నిలుపుకున్నా జ్ఞానోదయం పొందకుండానే మీరుంటారు. అద్భుతాల్లో మహాద్భుతం ఏమిటంటే జ్ఞానోదయాన్ని పొందే మీరుంటూ జ్ఞానోదయాన్ని పొందకుండానే ఉన్నట్లు మీరుండడమే.

ఈ ప్రశ్న చిపర్ రోత్ వద్ద నుంచి వచ్చింది. ఆయన తప్పకుండా ఇక్కడికి కొత్తవాడే అయ్యుంటాడు. తప్పకుండా బయటి మనిషే అయ్యుంటాడు. మీరుండండి ఇక్కడే. మేము మీ జ్ఞానాన్నంతా క్రమక్రమంగా తొలగించేస్తాం. నేను చేస్తున్న అంతటి పనీ మనుషుల్ని అజ్ఞానులుగా తయారుచెయ్యడం మాత్రమే. అజ్ఞానానికే ఉంటుంది గాంభీర్యం, అజ్ఞానానికే ఉంటుంది అమాయకత్వం, అజ్ఞానమే ప్రగాఢత్వం – అజ్ఞానానికి పరిమితే ఉండదు. జ్ఞానవే ఉంటుంది పరిమితంగా. ఎలా ఉండగలుగుతుంది గాంభీర్యంతో? జ్ఞానం మీకు ఎంత ఎక్కువ ఉన్నా, దానికి ఉంటుంది ఓ పరిమితి, ఓ హద్దు ఉంటుంది దానికి. అజ్ఞానానికి మాత్రమే ఏ పరిమితీ ఉండదు.

విజ్ఞానం అల్పాన్ని గురించి, మరింత అల్పాన్ని గురించి, మరింత మరింత ఎక్కువగా నేర్చుకునే ప్రయత్నం అనే అంటారు. ఈ పద్ధతిలోనే మీరు ముందుకు, మరింత ముందుకు పోతూ ఉంటే – అల్పాన్ని గురించి మరింత, మరింత ఎక్కువగా తెలుసుకునేందుకు – ఏం ఉంటుంది అంత్యంలో? ఆఖరున అంతంలో మీరు తెలుసుకున్నది ఏదీ ఉండదు. దేన్ని గురించీ మీరు తెలుసుకుని ఉండరు. అదే తార్కికంగా లభించే సమాప్తం.

దీనికి సరిగ్గా వ్యతిరేక పద్ధతే మతానికి ఉందని నేను మీతో చెప్పాలనుకుంటున్నాను: తక్కువగా, మరింత తక్కువగా ఎక్కువ గురించి మరింత ఎక్కువగా తెలుసుకోవడం. అప్పటి అంతిమ ఫలితం ఏమయివుంటుంది? ఏదో ఓ నాటికి... తక్కువగా, మరింత తక్కువను ఎక్కువ గురించి, మరింత ఎక్కువ గురించి తెలుసుకుంటూ; ఏదో ఓ నాటికి మీకు తెలుస్తుంది శూన్యం సర్వస్వం గురించి. దాన్నే నేను అంటాను అజ్ఞానం అని.

రోత్, దయచేసి మరికొంతకాలం మీరు ఇక్కడే ఉండండి, ఉండండి చుట్టుప్రక్కల్లోనే.

## నాల్గవప్రశ్న :

**ప్రియ ఓషో,**

**ఈ నాటకాన్ని నేను ఎంతో ఆనందిస్తూ ఉంటున్నాను. ఈ ప్రొద్దున ఓ మహాప్రదర్శనే జరిగింది. ప్రతి ఉదయం పూట తెర తొలగగానే 'ఏ ప్రదర్శన జరుగుతుందా?' అని నేను ఉత్సాహంతో ఎదురుచూస్తూనే ఉంటాను. మీతోబాటే కలిసి ప్రవహిస్తూ నేనుంటాను. కానీ అందువల్ల నాకు నవ్వు వస్తుందే తప్ప కన్నీళ్ళు రావడం లేదు. ఎక్కడ ఉన్నాయి నా కన్నీళ్ళు?**

సుచేతా, అవి ఉంటున్నాయి నీ నవ్వులోనే. నవ్వులూ, కన్నీళ్ళూ విభిన్న విషయాలు కావు. రెండు రకాల మనుషులు ఉన్నారు. కన్నీళ్ళు పెట్టుకుంటూ ఉండే రకం మనుషులూ, నవ్వుతూ ఉండే రకం మనుషులు. ప్రతిచోటా ఎప్పుడూ ఈ రెండు రకాల మనుషులు మాత్రమే ఉంటున్నారు. ఈ సృష్టి సర్వస్వమూ విభజింపబడి ఉంటోంది ద్వంద్వత్వంతో – పురుషుడూ, స్త్రీ, యిన్, యాన్, ధనత్వం/ఋణత్వం, పగలు/రాత్రి, జీవితం/మృత్యువు. కాబట్టి అక్కడ ఉంది ఓ విభజనం. నవ్వుతూ ఉండే మనుషులు, కన్నీళ్ళు పెట్టుకునే మనుష్యులు.

కన్నీళ్ళ మనుషులు అంతర్వృత్తితో ఉంటారు. వాళ్ళు ఉంటారు సులభంగా అంతర్ముఖులు కాగలిగినవారై. మరి అంతరంలోకి మీరు ప్రవేశించినప్పుడు, ఎంతెంత లోతుల్లోకి మీరు వెళ్తూ ఉంటారో, అంతంతగా మీ కళ్ళు కన్నీటితో నిండుతూ ఉంటాయి. సుచేతా ఉంటోంది బహిర్వర్తిని అయి. ఆమె ఉంటోంది నవ్వుతున్న బుద్ధుడిగా; గీత్‌గోవింద్ ఓ కన్నీటి బుద్ధుడు. ఆమెది బహిర్వృత్తి, ఆమె బాహ్యావర్తిని, ఓ నిజం అమెరికన్ ఆమె. కాబట్టి పట్టరాని అనుభూతి ఆమెకు కలిగితే, ఆమెకు వచ్చేస్తాయి నవ్వులు.

ఎప్పుడూ గుర్తుపెట్టుకోండి, అనుకరించకండి ఎవ్వర్నీ. గీత్‌గోవింద్ సుచేతాను అనుకరించాడంటే అతడికి వచ్చేసి ఉంటుంది కష్టం, అతడి నవ్వు ఉంటుందప్పుడు అతి పేదదిగా, ఆ నవ్వు ఉంటుందప్పుడు అసహజంగా. సుచేతా గీత్‌గోవింద్‌ను అనుకరించాలని ప్రయత్నిస్తే ఆమెకు ఎంతో కష్టమైపోతుంది కన్నీళ్ళు తెప్పించుకునేందుకు. ఏ కృత్రిమ ఉపాయంతోనో ఆ కన్నీళ్ళను ఆమె తెచ్చిపెట్టుకున్నా అవి ఉండవు సత్యమై, అవి ఉంటాయి అబద్ధాలై.

బహిర్వర్తులు తమదారినే అనుసరించాలి. వాళ్ళ జీవితంలో, వాళ్ళలో ఉప్పొంగుతున్న శక్తే వాళ్ళ నవ్వులు అవుతూ ఉంటాయి. ప్రేమ ఉంటుంది వాళ్ళకు సులభంగా, ధ్యానం వాళ్ళకు ఉంటుంది కొంచెం కష్టంగా. అంతర్వర్తులకు, ధ్యానం ఉంటుంది సులభంగా, నవ్వులు ఉంటాయి కొంచెం కష్టంగా.

ఎప్పటికీ ఎవ్వర్నీ అనుకరించండి, కేవలం మీ దార్లోనే మీరు నడుస్తూ ఉండండి. క్రమక్రమంగా మీలోనే ఓ పరివర్తన కలుగుతూ ఉండడాన్ని దర్శిస్తారు, అంతరం చివరను మీరు అందుకున్నప్పుడు. ఉదాహరణకోసం, నవ్వుతూనే మీరు ఉంటూ ఉంటారనుకుందాం... ఉదాహరణకోసం. సుచేతా అతి అంతంలో నవ్వుతూ ఉన్నప్పుడు, తప్పకుండా కన్నీళ్ళు వచ్చి తీరుతాయి. నవ్వుతూనే ఉన్నప్పుడు ఓ క్షణం వస్తుంది. అప్పుడు నవ్వు అదృశ్యం అయిపోతూ, కన్నీళ్ళు ప్రత్యక్షం అవుతూ ఉంటాయి. గీత్‌గోవింద్ ఏడుస్తూనే, ఏడుస్తూనే, ఏడుస్తూనే ఉంటే, కన్నీళ్ళు, కన్నీళ్ళు, కన్నీళ్ళు చివరిదాకా వస్తూనే ఉంటూ చివరికి, తతాలున ఓ పరివర్తనం జరగడాన్ని గుర్తిస్తాడు : అప్పుడు వస్తుంది నవ్వు పైకి. విప్లవం వచ్చేది అంతంలో మాత్రమే.

ఒకప్పుడు నేను ఓ బౌద్ధ సమాఖ్యలో మాట్లాడుతూ ఉన్నాను. ఇప్పుడు ఆ బౌద్ధులకు ఓ పరివర్తనం అంతంలోనే వస్తుందన్న మాటను చెప్పడం ఎంతో కష్టం,

ఎందుకంటే బౌద్ధులు మధ్యేమార్గాన్నే, బంగారు మధ్యస్థానాన్నే విశ్వసిస్తారు కనుక. బుద్ధుడి మార్గాన్ని మజ్జమ నికాయం, మధ్యేమార్గం అంటారు.

నేను వాళ్ళందరూ బౌద్ధులన్న విషయాన్ని మరచిపోయాను. అతి అంతం గురించీ, అత్యంతంలోనే పరివర్తన వస్తుందన్న విషయం గురించీ వాళ్ళకు చెప్పేశాను. మహోంతానికి పోతే తప్ప సత్యం మీకు ప్రాప్తించదు. సత్యం ఉంటుంది అంతంలో మాత్రమే, ఇదీ లేదా అదీ – కానీ అంతంలోనే ఉంటుంది సత్యం అని చెప్పేశాను. ప్రేమలో అయినా చివరిదాకా పోవాలి, ధ్యానం లోతుల్లోకి అయినా వెళ్ళాలి.

వాళ్ళెంతో సహనాన్ని పాటించారు – బౌద్ధులు ఉంటారు మహా ఓర్పుతో; వాళ్ళు మహమ్మదీయుల్లాగా ఉండరు, వాళ్ళు ఏ యుద్ధాలనూ ప్రారంభించరు – అయినప్పటికీ, సహనానికి కూడా ఓ హద్దు ఉంటుంది. ఓ బౌద్ధుడు నా మాటలను సహించలేకపోయాడు– ఓర్పు పట్టే ఉండాలని బుద్ధుడు బోధించినప్పటికీ. లేచి నుంచున్నాడు, అన్నాడు "మరీ అతిగా మాట్లాడుతున్నారు. మీకు తెలియదా బౌద్ధులది మధ్యేమార్గమనీ?"

అప్పుడు నాకు గుర్తుకొచ్చింది. మరి అప్పుడు నేను అన్నాను – "సత్యమే. నాకు తెలుసు. కానీ మధ్యాంతంలో మీరుంటే తప్ప సత్యం ఉండదు". నేను మాట్లాడుతున్నది అంతం గురించే, మధ్యస్థానంతో దానికి ఏ సంబంధమూ లేదు. "సరిగ్గా మీరు మధ్యాంతం చివర్లో ఉంటే తప్ప, సరిగ్గా అతి మధ్య ప్రదేశంలో ఉంటేనే, అప్పుడుంటుంది మళ్ళీ, సత్యం. సత్యం అంతంలోనే సంభవిస్తుంది."

అంతంలోనే లోలకం మరో అంతంవైపుకు కదలడం, మరో ధృవం వైపుకు కదలడం ప్రారంభమవుతుంది. కాబట్టి, మంచిది. సుచేతా, నవ్వు – చివరిదాకా నవ్వు. ఒకనాటికి ఆ నవ్వే కన్నీళ్ళను తెప్పించిందని నువ్వు తెలుసుకుంటావు.

## ఐదవప్రశ్న :

ప్రియ ఓషో,

*దేవుణ్ణి అనుభవంతో గ్రహించానని ఓ మనిషి ప్రకటించలేదా?*

మీరు అనుభవించి ఉంటే, మీ ఉనికే అప్పుడు ఓ ప్రకటన అయి ఉంటుంది. మీరు ఆ ప్రకటనను చెయ్యనక్కరలేదు. కనీసం ఆ విషయాన్ని గురించి అడగనక్కరలేదు. ఆ ప్రకటన బయటికి వస్తే అదొస్తుంది. మీరేం చేయగలుగుతారు?

దైవాన్ని అనుభవించి ఉన్నవాడు ఏ నిర్ణయాలనూ చేసుకోడు, కనీసం దీన్ని కూడా - ఆ విషయాన్ని ప్రకటించవచ్చునా, కూడదా అని. దైవాన్ని అనుభవించినవాడు తన మనస్సును ఎప్పుడో వదిలిపెట్టేసే ఉంటాడు. ఇప్పుడు ఏం జరిగినా ఆ మనిషి అందులో తప్పకుండా ఉంటాడు. ఆ మనిషి ఉంటాడు సంపూర్ణంగా అందులో. ఓ ప్రకటనే వస్తే అదే వస్తుంది.

ఇదే వచ్చింది మన్సూరుకు. ఆయన ప్రకటించాడు "అనా।ల్ హక్, నేనే దేవుణ్ణి" అని. ఆయనకు గురువు అయిన జునాయిద్, మన్సూరుకు చెప్పాడు "మన్సూర్, ఇది సరిగ్గా లేదు, కష్టాలు పడతావు. నాకు కూడా తెలుసు, కానీ నేనెప్పుడూ ప్రకటించుకోలేదు. ఎందుకంటే నీ చుట్టూ ఉన్న మహమ్మదీయులను గురించి నీకు తెలుసు - వాళ్ళు నిన్ను చంపేస్తారు."

కానీ మన్సూరు అన్నాడు "నేనేం చెయ్యగలుగుతాను? ఆయనే ప్రకటించుకుంటున్నప్పుడు నేనేం చెయ్యగలుగుతాను? ఉన్నట్లుండి ఆయనే నన్ను పట్టుకుని ఆ ప్రకటన చేసుకున్నాడు."

జునాయిద్ ఎంతో భయపడిపోయి మన్సూరును తన పాఠశాల నుండి బయటికి వెళ్ళగొట్టాడు. ఆయన అన్నాడు "దూరంగా వెళ్ళిపో. ఎక్కడికైనా వెళ్ళిపో ఇక్కణ్ణుంచి. నువ్వు కష్టాలు పడతావు. నీ వల్ల నాక్కూడా కష్టాలు వచ్చేస్తాయి.

కానీ మన్సూరు అన్నాడు "నేనేం చెయ్యగలుగుతాను? ఆయనే కష్టాలు పడాలనుకుంటుంటే, నేనేం చెయ్యగలుగుతాను?" మన్సూరుకు కష్టాలు వచ్చేశాయి. కానీ ఆయన ఏమీ చెయ్యలేడన్న విషయం కూడా సత్యమే. శిలువ మీద నుంచుని ఆయన కూడా "అనా।ల్ హక్, నేనే దేవుణ్ణి" అంటూ నవ్వాడు.

ఎవరో అన్నారు క్రింద ఉన్న గుంపులోంచి "ఆ మాట అబద్ధమనీ, నువ్వు దేవుడివని చెప్పినమాట తప్పు అనీ ఇప్పటికైనా ఒప్పుకుంటే, నువ్వు క్షమింపబడతావన్న ఆశను ఇంకా నువ్వు పెట్టుకోవచ్చు" అన్నారు.

మన్సూరు నవ్వుతూ అన్నాడు "నేనేం చెయ్యగలుగుతాను? ఆయనే ప్రకటించుకుంటూ ఉంటే."

మరి మీరిప్పుడు అడుగుతున్నారు "దివ్యత్వానుభవం కలిగితే ఎవరైనా దాన్ని ప్రకటించుకోవచ్చునా?" అని. దేవుడే ఆ మాటను ప్రకటించుకుంటూ ఉంటే, మంచిదే.

దేవుడు ఆ విషయాన్ని ప్రకటించుకోకుండా ఉంటే, మీరు ఉండండి దయచేసి నిశ్శబ్దంగా, దాన్ని ఆయనకే వదిలిపెట్టెయ్యండి.

J. డొనాల్డ్ వాల్టర్స్ వ్రాశాడు :

కొన్నేళ్ళక్రితం తనను తాను నిలబెట్టుకుని ఉన్న, కానీ పూర్తిగా త్రాగేసి ఉన్నట్లు, అయినా మహా ఆత్మాహంకారంతో ఉన్నట్లు కనిపిస్తూ ఉన్న ఓ మనిషిని నేను కలుసుకున్నాను. ఈ విశ్వాన్ని సవ్యంగా ఎలా నడిపించాలన్న విషయాన్ని గురించి ఆ మనిషి స్వాజ్ఞానాన్ని వింటూ, సృష్టి ఎలా సంభవించిందన్న విషయాన్ని నేను మరచిపోయి, దైవదర్శనం ప్రాప్తించిన కనీసం అయిదారుమందిని నాకు తెలుసునన్న విషయాన్ని ఆ మనిషి ముందు ప్రస్తావించడం జరిగింది. నా కరుణావేశం ఆ మనిషి తన చేతిని, వెంట్రుకలు బాగా పెరిగివున్న తన చేతిని నా హస్తచాలనంకోసం చాచేలా చేసింది. “నా చెయ్యిని ఊపు!” అని బొంగురుగొంతుతో ఆ మనిషి అన్నాడు. “ఏడవవాణ్ణి నువ్విప్పుడు కలుసుకున్నావు.”

డొనాల్డ్ దైవదర్శనం ప్రాప్తించిందన్న ఆ మనిషి అనుభవాన్ని విశ్వసించలేకపోయాడు. ఎందుకంటే ఆయన ఆలోచన ప్రకారం “ఎలా, ఓ మనిషి, అంత ధాటిగా “నా చెయ్యిని ఊపు! దైవాన్ని దర్శించిన ఏడవమనిషిని నువ్విప్పుడు కలుసుకున్నావు” అని అరిచి చెప్పగలుగుతాడు?

కానీ అది నా అభిప్రాయం కాదు. అది సంభవం కావచ్చు... ఎందుకంటే దేవుడికి అప్పుడప్పుడూ గొంతురాసి బొంగురుగొంతు వచ్చెయ్యవచ్చు కనుక, అప్పుడప్పుడూ ఆయన అతి సభ్యంగా అప్పుడప్పుడూ గొంతురాపుతో ఉండవచ్చు కనుక. దేవుడు వస్తాడు ఎన్నో ఆకారాలతో, పరిమాణాలతో. కొన్నిసార్లు ఆయన చేతులు మృదువుగా ఉంటాయి, కొన్నిసార్లు ఆయన చేతుల మీద వెంట్రుకలు నిండి ఉండవచ్చు. ఎన్నో విధాల దార్లలో ఆయనొస్తాడు. ఆయన పద్ధతులు ఉంటాయి మహా నిగూఢంగా.

కాబట్టి ఆయన మీ ద్వారా ప్రకటించుకోవాలనుకుంటూ ఉంటే, ఇంటి మీదికి ఎక్కి నుంచుని ఆయన్ని ఆ ప్రకటన చేయనివ్వండి. కానీ ప్రకటించుకోవాలని ఆయనకు ఉండకపోతే, మీ అంతట మీరే ఆ విషయాన్ని ప్రకటిస్తే, మీరే ప్రవేశిస్తారు కష్టాల్లోకి. ఆయన కష్టాలు పడడానికి నిశ్చయించుకుంటే, అది ఆయన వ్యాపారం. కానీ ఆయన బదులు నిర్ణయాన్ని మీరు తీసుకోకండి. చేశారా అదయిపోతుంది మీ అహంకారపు ప్రయాణపు యాత్ర.

ఈ కథను చదువుతూ ఉన్నప్పుడు "నా చెయ్యిని ఊపు! దైవాన్ని దర్శించిన ఏడవ మనిషిని నువ్విప్పుడు కలుసుకున్నావు" అని చెప్పిన ఆ మనిషికోసం నేనెంతో సానుభూతిని పొందాను.

వాల్టర్స్ ఆక్షేపించే ధోరణితోనే వ్రాస్తున్నాడు. ఆయన అనుకుంటున్నాడు అది సరయిన పద్ధతి కాదని. ఏది సరయిన పద్ధతో నిర్ణయించడానికి ఆయన ఎవరు? ఎవ్వరూ నిర్ణయించకూడదు. మీరు 'ప్రకటించకూడదు' అని చెప్పడానికి నేనెవర్ని? ఆయన ప్రకటించుకోవాలని అనుకుంటూ ఉంటే నేనెవరు మీకు చెప్పడానికి? ఆయన మాటే చెల్లనీ, ఆయన సంకల్పమే నెరవేరనీ.

కానీ ఎప్పుడూ గుర్తుపెట్టుకోండి. అది ఉండకూడదు మీ నిర్ణయంగా. మీరే నిర్ణయించుకుని, ప్రకటించుకుంటే, దానికి అర్థం మీరు తెలుసుకోలేదనే. అప్పుడు మనస్సు మహా గొప్ప అతి తిక్కలాటను ఆడుకుంటూ ఉంటుంది. అప్పుడు ఆ మనస్సుకు వెర్రెత్తి, పిచ్చెత్తిపోయి ఉంటుంది.

## ఆరవప్రశ్న :

ప్రియ ఓషో,

నా ప్రియ స్నేహితురాలు అయిన ఓ అమ్మాయి తనకో సన్యాస నామాన్ని ఇవ్వమని అభ్యర్థిస్తూ ఈ ఆశ్రమానికి ఉత్తరం వ్రాసింది. ఇక్కణ్ణుంచి ఓ సమాధానం తనకు చేరకముందే ఆమె ఇక్కడికి వచ్చేసి సన్యాసాన్ని స్వీకరించింది. ఆమెకు ఉత్తరం ద్వారా అందిన సన్యాస నామం ఇక్కడ మీరు ఆమెకు నామకరణం చేసిన సన్యాస నామానికి విభిన్నంగా ఉంది. నాకు ఎంతో ఆందోళన కలిగింది, ఈ విషయాన్ని ఆ అమ్మాయి నాతో చెప్పినప్పుడు. ఎందుకంటే ఆ సన్యాస నామాన్నే నా సత్యాన్వేషణా పథంగా నేను చేసుకున్నాను కనుక. దారితప్పుతున్నప్పుడు ఆ సన్యాస నామాన్నే ఉపయోగించుకుంటూ మళ్ళీ నేను సక్రమ మార్గంలోకి వస్తూ ఉంటాను. ఇప్పుడు నాకు అగమ్యగోచరంగా ఉంది ఇదంతా. మీరు మాకు ప్రసాదిస్తున్న సన్యాస నామానికి ఏది ప్రాశస్త్యం?

వీరా, అంతా పవిత్ర ఆవుపేడ! ఆ పేర్లు చూసుకుని నువ్వు మోసపోకు. నువ్వు ఎప్పుడూ దేన్నో పట్టుకోవాలని అత్యాశపడుతూ ఉంటావు, శూన్యాల్లో నుంచి దేన్నో నువ్వు పొందాలనుకుంటూ ఉంటావు. నేను మీకు ఇస్తున్న సన్యాస నామాలన్నీ

ప్రేమికులు పెట్టుకుంటున్న ముద్దుపేర్లలాంటివే. దాన్ని గురించి అంత రాద్ధాంతాలు చెయ్యకండి.

వాస్తవంలో, ఓ సన్యాస నామాన్ని నేను మీకు ఇచ్చిన తరువాత, ఎప్పుడూ నా దగ్గరికొచ్చి దాని అర్థం ఏమిటని నన్ను అడక్కండి, ఎందుకంటే ఆ అర్థాన్ని నేను మరచిపోతాను కాబట్టి. ఇస్తున్న క్షణంలోనే ఆ సన్యాస నామానికి ఓ అర్థాన్ని నేను సృష్టిస్తూ ఉంటాను. వాటినంతా నేనెలా గుర్తుంచుకుంటాననుకుంటారు? నేను ఇప్పటిదాకా ఏ ముప్పైవేలమందికో సన్యాస నామాలను ఇచ్చి ఉంటాను.

ఓ పేరు ఓ పేరు మాత్రమే; మీరుంటారు అనామకులై. ఏ పేరూ మిమ్మల్ని బంధించదు, ఏ పేరూ మిమ్మల్ని నియమితం చెయ్యదు. అవుంటాయి కేవలం సంజ్ఞికలుగా- ఉపయోగార్థంతో, ఆ పేర్లలో ఆధ్యాత్మికత ఏమీ ఉండదు. కానీ ఆ సన్యాస నామానికి ఎంతో వైశిష్ట్యం ఉన్నట్లు మీ మీద ఎంతో అవధానంతో ఆ పేర్లను మీకు పెడుతూ ఉంటాను కాబట్టి, వర్ణించి చెబుతూ ఉంటాను కాబట్టి, మీరు దానికి ఇరుక్కుపోతూ చిక్కుకుపోతూ ఉంటారు. ఇదంతా మీ మీద నా అవధానాన్ని చూపించడం కోసం మాత్రమే, అంతకుమించి ఏమీ లేదు; అదంతా కేవలం మీ మీద నా ప్రేమను వ్యక్తం చెయ్యడానికోసం మాత్రమే. అంతకుమించి ఏమీ లేదు.

## ఏడవప్రశ్న:

***ప్రియ ఓషో,***

***నేనెందుకు నిద్రపోతూ ఉంటాను ప్రసంగం జరుగుతూ ఉన్నప్పుడు? ఎంతో నిశ్చలంగా కూర్చుని తదేకంగా మిమ్మల్ని అలా పీల్చేసుకుంటున్నవాళ్ళతో నన్ను పోల్చి చూసుకోవడం జరుగుతోంది నాకు అప్రయత్నంగానే. అందువల్ల నాకు అనిపిస్తూ ఉంటుంది నేనింకా ఎంతో పురోగమించాల్సి ఉందని, ముఖ్యంగా మీ ఉపన్యాసం పూర్తయిన తరువాత నా దగ్గరికొచ్చి "ఈ రోజు విషయం అద్భుతంగా ఉంది కదా?" అని కొంతమంది అడుగుతూ ఉన్నప్పుడు.***

***నిద్రపోయేముందు ఉపన్యాసం జరుగుతున్న చోటే అత్యుత్తమ స్థలం అన్న విషయాన్ని నేను సమ్మతించినప్పుడు బహుశా మరింత జ్ఞానం నాకు వస్తుందేమో?***

ఇదే అత్యుత్తమ స్థలం. నీ దగ్గరికొచ్చి మాట్లాడుతున్న వాళ్ళను నువ్వేం పట్టించుకోకు. వాళ్ళు నీతో పరిహాసాలు ఆడుతూ ఉండవచ్చు. బాగా నిద్రపో. వాళ్ళు నీ నిద్ర చెడగొట్టేందుకు ప్రయత్నిస్తూ ఉండవచ్చు తప్పకుండా, నీలో ఓ

అసూయను సృష్టించేందుకు వాళ్ళు ప్రయత్నిస్తూ ఉండవచ్చు. నిజంగా వాళ్ళే అసూయపడుతూ ఉండవచ్చు – నువ్వు హాయిగా నిద్రపోతూ ఉన్నావనీ, గురక కూడా పెడుతున్నావనీ, వాళ్ళేమో కూర్చుని ఉండాల్సి వస్తున్నదని. వాళ్ళు నీకు నిద్రాభంగం కలిగించాలని అనుకుంటూ ఉంటారు. నువ్వేమీ ఆందోళన పడకు. నిద్రపోతూనే ఉండు. నువ్వింకా ఎంతో దూరం వెళ్ళాలి, కానీ నిద్రపోతూ ఉన్నప్పుడు, ఇంకెక్కడికీ నువ్వు వెళ్ళనక్కరలేదు.

ఓ ఆట పస లేకుండా మందకొడిగా నీరసంగా విసుగుపుట్టిస్తూ జరుగుతోంది. ఇంతలో ఆట చూస్తున్న జనంలో ఓ మనిషి ఉన్నట్లుండి ఓ మోత చప్పట్లను వాయించి పారేశాడు. ఆ మనిషి ప్రక్కన కూర్చుని ఉన్నవాడు అడిగాడు "ఎందుకు కొట్టావు చప్పట్లు?"

"సారీ", అన్నాడు ఆ మనిషి, "మేలుకుని ఉండడంకోసం నేను ప్రయత్నిస్తున్నాను."

మేలుకుని ఉండేందుకు మనుషులు ఎన్నెన్ని కష్టాలు పడుతూ ఉన్నారో నీకు తెలీదు. నీ నిద్రలోకి నువ్వు వెళ్ళిపో. అందులోనే సౌఖ్యుడివి కా. దాన్ని నువ్వు సంపూర్ణంగా సమ్మతిస్తే, అదుంటుంది నీకు ఓ గొప్ప అనుభవంగా.

మనస్సు ఎప్పుడూ సంఘర్షణను సృష్టిస్తూనే ఉంటుంది. నువ్వు నిద్రపోకపోతే మనస్సు అంటుంది "నిద్రపోతే బావుంటుందని నాకు అనిపిస్తూ ఉంది" అని. నువ్వు నిద్రపోయావంటే, అప్పుడు చెబుతుంది "దేన్నో నువ్వు ఇప్పుడు పోగొట్టుకున్నావ్. నువ్వు ఈ పని చెయ్యకూడదు" అని. మనస్సు ఎప్పుడూ సృష్టిస్తూనే ఉంటుంది సంఘర్షణనూ, రాపిడినీ. ఎలా ఉన్నా దానికి సంతోషమే ఉండదు. ఆ మనస్సును విసిరి పారెయ్. సహజంగా నీకు నిద్ర వస్తూ ఉంటే, అప్పుడు దాన్ని స్వాగతించు. అలా జరుగుతున్న ఆ స్వీకారం వల్లనే మరి ఆ మనస్సు అదృశ్యం అయిపోవడంలోనే ఈ వజ్రచ్ఛేదికా సూత్రం నీకు తప్పకుండా వినిపిస్తుంది.

పతంజలి అంటాడు నిద్ర సమాధికి ప్రక్కనే ఉంటుందని. ఓ మంచి నిద్ర, ఓ ప్రగాఢ నిద్ర, ఓ సమాధి స్థితీ ఉంటాయి కాస్త విభిన్నంగా కేవలం ఒక్క విషయంలోనే. సమాధిలో ఉంటుంది జాగృతం అయివున్న ధ్యాస. నిద్రలో ఆ ధ్యాస ఉండదు. కానీ ధ్యాస నిద్రలో కూడా సంభవించవచ్చు. ఏ కష్టాలనూ నువ్వు తెచ్చుకోవద్దు. నిన్ను నువ్వు విభజించుకోవద్దు. నిద్ర రాకుండా ఉంటే, మరీ మంచిది. మేలుకునే ఉండు.

అప్పుడు ఉండదది ఓ ప్రయత్నంగా. నిద్ర వస్తూ ఉంటే, నిద్రపో. అప్పుడు మేలుకుని ఉండడంకోసం ప్రయత్నించకు. మరి నేను చెప్పడం లేదు నిద్ర రాకుండా ఉంటే నిద్రపోయేందుకు ప్రయత్నించమని. ఏదొస్తే దాన్ని రానీ. ఏది రాకపోతే దాన్ని పోనీ. ఏదొస్తే దాన్నే స్వీకరించు. జరుగుతున్న వాస్తవాన్ని జరుగుతున్న క్షణంలోనే సమ్మతించు. నువ్వుండు ఆ క్షణంలో నిండుగా.

అదే నా మొత్తం సందేశం. ఈ క్షణంలో పూర్తిగా ఉండడం. ఇది ఓ కోరిక: "నేను నిద్రపోకూడదు". ఎందుకు? "ఇది ఆధ్యాత్మికం కాదు", ఓ ప్రసంగం జరుగుతున్నప్పుడు నిద్రపోవడం. ఎందుకు? నిద్ర పూర్తిగా ఆధ్యాత్మిక వ్యాసంగమే, ఎంతో గొప్ప ఆధ్యాత్మిక వ్యాసంగం. ఇది ఉంటుంది అక్కడ కూర్చుని ఇలా ఆలోచించినట్లుగానే: "స్వప్నాలు కంటూ ఉంటే మంచిది. స్వప్నాలు కంటూ ఉండడం ఓ ప్రాచీన ఆలోచనా విధానమే. ఇంకా రంగులమయం అయ్యుంటుంది కూడా. మిగతా వాళ్ళు ఆలోచిస్తున్నారు, నువ్వు స్వప్నాలు కంటూ ఉంటున్నావు. ఏమిటి భేదం? బాగా స్వప్నాలు కను. బాగా నిద్రపో. సౌఖ్యుడివి కా.

ఒకనాడు, ఇలా సౌఖ్యుడివై ఉంటున్నందువల్ల అవధానమూ ఎరుకా నీకు ఏర్పడి, చురుకుగా నువ్వుంటావు. కానీ ఆ చురుకుతనానికి తప్పకుండా ఓ విభిన్న లక్షణం ఉంటుంది. అది ఏర్పడి ఉండదు బలవంతంగా. అది నువ్వు ప్రయత్నించి నిర్మించుకున్నదై ఉండదు. అదే వచ్చి ఉంటుంది. ఏదో ఒకనాడు, ప్రసంగం జరుగుతున్నప్పుడు మధ్యలో ఎప్పుడో, ఉన్నట్లుండి నీ కళ్ళను నువ్వే తెరుచుకుంటావు. అవుంటాయి మహా తాజాగా, యవ్వనంతో, గాఢ నిద్ర లోంచి నువ్వు లేచావు కాబట్టి. మరి ఏ విషయమో, కేవలం ఒకే ఒక్క పదమో, నీ జీవుడిలోకి చేరిపోయి నిన్ను పరివర్తిస్తుంది.

హుయ్‌నెంగ్ ఈ వజ్రచ్ఛేదికను విన్నప్పుడు ఆ వజ్రచ్ఛేదిక మొత్తమూ ఆయనకు అవసరం కాలేదు. ఆయన నాలుగు పంక్తులను మాత్రమే విన్నాడు - అంతే చాలింది. కొన్నివేళల్లో బుద్ధుడి మాటల్లో ఒక్క పదం కూడా సరిపోతుంది; ఒక్క పదమే సూటిగా బాణంలాగా రివ్వున వెళ్ళి నీ గుండెలోకి గుచ్చుకుంటుంది. ఆ తరువాత అదివరకటిలా నువ్వు ఉండవు.

కాబట్టి ఆందోళన పడకు. బాగా సౌఖ్యాన్ని పొందు. బాగా సౌఖ్యాన్ని పొందిన తరువాత, కళ్ళను నువ్వే తెరుచుకున్నప్పుడు, అప్పుడప్పుడూ అది కూడా సంభవం

కాగలుగుతుంది – అప్పుడు నీకూ నాకూ మధ్య ఓ సమావేశం జరగవచ్చు. మరి నువ్వు అప్పుడుంటావు మహా తాజాగా, నిద్ర నుండి అప్పుడే లేచినందువల్ల, ఏ ఆలోచనలూ ఉండకుండా, నువ్వెవరో కూడా నీకే తెలియకుండా...

నీకు తెలీదా? – అప్పుడప్పుడూ ఇదే జరుగుతూ ఉంటుంది ప్రొద్దున పూట నువ్వు నిద్ర లేవంగానే. కొన్ని క్షణాలపాటు నిన్ను నువ్వే గుర్తించుకోలేకపోతూ ఉంటావు. నీ మనస్సు నీ దగ్గరికి తిరిగి రావడానికి కొంత సమయం పడుతుంది. అప్పుడప్పుడూ నువ్వు ఎవరివో నీకే తెలుస్తూ ఉండదు. ఎక్కడున్నావో నీకే తెలుస్తూ ఉండదు. నిద్ర మధ్యలో మెలకువ తెప్పించేస్తే, ప్రతి ఒక్కరికీ ఎవరు తామన్న విస్మయం కలుగుతుంది, ఎక్కడ ఉన్నారన్న విషయం కూడా తెలియకుండా ఉంటుంది. ఆ మనిషికి కొంచెంసేపు కావాల్సి వస్తుంది తనను వెనక్కు తెచ్చుకునేందుకు.

కాబట్టి దీనికి ఉంది సంభావ్యత. నిద్రపోతూ ఉన్నప్పుడు, ఏదో ఒకరోజు మధ్యలో ఉన్నట్లుండి నా కేక నీకు వినిపిస్తుంది. ఉన్నట్లుండి నీకు మెలకువ వచ్చేసి నువ్వెక్కడ ఉన్నావో, నువ్వు ఎవరివో నీకు తెలియకుండా ఉంటున్న క్షణం వచ్చేసి ఉంటుంది. ఆ క్షణంలోనే నీ లోపలికి నేను ప్రవేశించగలుగుతాను.

కాబట్టి నువ్వేమీ ఆందోళన పడకు. ఏం జరుగుతూ ఉన్నా అన్నీ మంచికే. సర్వస్వాన్నీ నేనిక్కడ అనుమతిస్తూనే ఉంటాను. నువ్వు ఎలా ఉన్నా అలాగే నిన్ను నేను సమ్మతిస్తూనే ఉంటాను. నేను నీకు చేసి తీరాల్సిన వేటినీ శాసించి చెప్పను.

## చివరిప్రశ్న:

*ప్రియ ఓషో,*

*ఎందుకు అర్థంచేసుకోరు మనుషులు తమ, వాళ్ళ పరస్పర మతాలను? ఎందుకుంటోంది ఎప్పుడూ అంత ఎక్కువ సంఘర్షణ?*

అహంకారం. దీనికి మతాలతో ఏ ప్రమేయమూ లేదు. కేవలం అహంకారం మాత్రమే. ఏది నీదో అది అయ్యుండాలి ప్రపంచంలో సర్వోత్తమంగా. మిగతా వాళ్ళందరి వద్దా ఏమున్నా అది ఉండదు ఉత్తమమై, ఉండడానికి ఒప్పుకోం. ఏదీ ఉండకూడదు ప్రపంచంలో మన దగ్గరున్న దానికన్నా ఉత్తమమైనది మరెవరిలోనైనా.

మీ భార్యే ఉంటుంది అత్యుత్తమ సౌందర్యరాశియై, మీ భర్తే అత్యంత అందగాడు. మీరే ప్రపంచంలోని అతిశ్రేష్టపు మనిషి. ఆ మాటలను మీరు

చెప్పకపోవచ్చు, కానీ దాన్ని మీరు ప్రకటిస్తూనే ఉంటారు వెయ్యిన్నొక్క విధాలలో, మీ వద్ద ఉన్నదే మీ స్వంతమై ఉన్నదే అత్యంత పరమౌన్నత్యం అయితీరాలి. మనుషులు ఉంటారు సరిగ్గా చిన్నపిల్లలలాగే. చిన్నపిల్లలు అంటూ ఉంటారు "మా నాన్న మీ నాన్నను ఈజీగా ఊది పడేస్తాడు" అని.

ఓ చిన్న అబ్బాయి ఇంకో చిన్న పిల్లోడితో చెబుతూ ఉన్నాడు "మా అమ్మ భలే మాట్లాడుతుంది. ఏ విషయాన్ని గురించి అయినా ఎన్ని గంటలైనా మాట్లాడుతూ ఉండగలుగుతుంది."

ఆ రెండో పిల్లోడు అప్పుడు అంటున్నాడు "ఏముంది అందులో? మా అమ్మ ఇంకా భలే బాగా మాట్లాడగలుగుతుంది. ఏ విషయమూ లేకపోయినా సరే, ఎన్ని గంటలయినా మాట్లాడుతూ ఉండగలుగుతుంది. ఎవ్వరికీ ఆమె ఏం మాట్లాడుతూ ఉంటుందో అర్థమే కాదు."

మనుషులు ఎప్పుడూ తమ గురించీ, తమ వస్తువుల గురించీ, అన్నింటి గురించీ, గొప్పలు చెప్పుకుంటూనే ఉంటారు. మతం గురించి కూడా.

ముల్లా నస్రుద్దీను పుత్రుడు తండ్రిని అడుగుతూ ఉన్నాడు "బాప్. ఓ మహమ్మదీయుడు తన మతాన్ని విడిచిపెట్టేసి ఓ హిందువో, క్రైస్తవుడో అయిపోతే వాణ్ణి నువ్వు ఏమంటావు?" అని.

ముల్లా నస్రుద్దీనుకు మహాకోపం వచ్చేసి ఇలా అన్నాడు, "వాడో మతద్రోహి! వాణ్ణి తుపాకీతో పేల్చి చంపి పడెయ్యాలి. అంతకుమించిన మహాపాపం ఈ ప్రపంచంలోనే లేదు – నీ మతాన్ని మార్చుకోవడం నీ మతానికి ద్రోహం చెయ్యడం. వాడు నమ్మకద్రోహి. నమక్ హరామ్. విశ్వాసఘాతకుడు. తింటున్న ఉప్పుకే ద్రోహం చేస్తున్నాడు."

అప్పుడు ఆ కుర్రాడు ఇలా ప్రశ్నించాడు "అయితే బాపూ, ఓ హిందువు కానీ, ఓ క్రైస్తవుడు కానీ మహమ్మదీయుడిగా మతం మార్చేసుకుంటే?"

వెంటనే ముల్లాలో అన్ని నవ్వులూ కనిపించాయి. జిమ్మీకార్టర్ నవ్వినట్లు.. అన్నాడు ఇలా "అది ఓ గొప్ప పని. ఆ మనిషి మహా వివేకవంతుడు. ఆ మనిషికి స్వాగతం పలికి, మర్యాద చేసి, గౌరవించాలి. ఆ మనిషికి ఏది సత్యమో తెలుసు. ఆ మనిషి మహాధైర్యశాలి కూడా. వాడు పరివర్తితుడు రా, అబ్బాయ్!"

ఇప్పుడు విషయం మారిపోయింది. ఓ మహమ్మదీయుడు హిందువో, క్రైస్తవుడో అయిపోతే అప్పుడు ఆ మనిషి ద్రోహి; ఓ హిందువో, క్రైస్తవుడో మహమ్మదీయుడు అయిపోతే అప్పుడు ఆ మనిషి మహా పరివర్తితుడూ, మహా గొప్పవాడు. ఆ మనిషిని గౌరవించి మర్యాద చెయ్యాలి. ఆ మనిషి మహా వివేకి, ఎందుకంటే నిజమైన మతం ఏదో దాన్ని గుర్తుపట్టేశాడు కనుక.

ఈ విధంగానే మన అహంకారాలు పనిచేస్తాయి. అందువల్లే మతాలు, ప్రపంచంలోకి శాంతిని తెప్పించే పనిచెయ్యకపోగా, కారణం అవుతూ ఉన్నాయి రక్తపాతాలు జరిగే యుద్ధాలకు. ఎంతో ఎక్కువమంది మరణించారు మతం పేరుతో మరో పేరుతో కన్నా. రాజకీయనాయకులు సైతం అధిగమించలేకపోయారు మతం పేరుతో జరిపించబడిన హత్యాకాండను. అనేకమంది మనుషుల హత్యలను చర్చీలూ, మసీదులూ, దేవాలయాలే చేశాయి.

భవిష్యత్తులో ఈ వికారం అంతా విసర్జింపబడాలి. తక్షణం ఈ హత్యలు ఆగిపోవాలి. ఓ మతం ఉండాలి మానవుడి స్వేచ్ఛా ఎంపికతో, ఎవరికో రోజాపువ్వు ఇష్టంలేకపోతే మీరు వాళ్ళను చంపేసి వాళ్ళు వికారం మనుషులు అని అనకూడదు. మీరు చెప్పకూడదు ఆ మనిషి తప్పు చేశాడని. మీరు చెప్పాలి అది ఆ మనిషి ఇష్టం అని. ఆ మనిషికి రోజాపువ్వు నచ్చదు. అది పూర్తి అయిపోతుంది. నాకు రోజాపువ్వంటే ఇష్టం. కానీ అది నా ఇష్టానికే సంబంధించిన ప్రశ్న. సత్యాన్ని గురించిన ప్రశ్నలేదు అందులో. ఏ వాదనలూ జరగాల్సిన ప్రశ్న దాని గురించి లేదు, ఎందుకు నాకు రోజాపువ్వు నచ్చదో నిరూపించుకోవాల్సిన కారణం ఏమీ అక్కడ లేదు. నాకు నచ్చకపోతే నాకు నచ్చదు, అంతే. మీకు నచ్చితే, మీకు నచ్చుతుంది. ఏ సంఘర్షణా లేదు. మతాలు ఉండాలి ఈ విధంగానే.

ఎవరో జీసస్‌ను ఇష్టపడతారు - విశిష్ట వాంఛితం. ఎవరో బుద్ధుణ్ణి ఇష్టపడతారు, ఎవరో కృష్ణుణ్ణి ఇష్టపడతారు - ఇష్టాలు. మతానికి జన్మతో ఏ ప్రమేయమూ ఉండకూడదు. స్వంత ఇష్టాల ప్రమేయంతోనే అవి ఉండాలి. అప్పుడు ఏ సంఘర్షణలూ ఉండవు, అప్పుడు శతాబ్దాల పర్యంతమూ జరిగే ఏ వాదనలూ ఉండవు. ప్రార్థనలు చేసేందుకు మారుగా ప్రజల్లో వాదనలే జరుగుతున్నాయి. వాళ్ళ శక్తి సర్వస్వమూ ఆ వాదనల కోసమే పెట్టుకుంటున్నారు. ఆ శక్తిని ప్రార్థనకోసం పెట్టుకుంటే వాళ్ళకు తెలిసి ఉండేది ఏది దివ్యత్వమో. అయినా ఆ వాగ్యుద్ధాలు

ఆగవు, ఆ వాదన వ్యవహారాలు ఆగవు, ఆ చర్చలు సాగుతూనే ఉంటాయి, నిరూపించబడేది ఏదీ ఉండదు, నిరూపించేందుకు ఏమీ లేదు కనుక.

మీరు జీసస్‌ను ఇష్టపడుతూ ఉంటే, అదుంటుంది ఓ అమ్మాయితో మీరు ప్రేమలో పడుతున్నట్లే. దేన్నీ మీరు నిరూపించుకోలేరు. ఎందుకు?... మీరు దేన్ని నిరూపించినా అది మిగతావాళ్ళకు మూర్ఖంగానే కనిపిస్తుంది. మీరు అంటారనుకోండి "ఆ పిల్ల ముక్కు చూడండి – ఎంత పొడవో, ఎంత అందమో" అని, వాళ్ళు అంటారు "అసహ్యంగా ఉంది. వంకరగా ఉంది. మరీ పెద్దది. ఆ ముక్కుకు తగ్గట్లుగా తల ఉండడం లేదు" అని. మీరు అంటారనుకోండి "ఆ కళ్ళు చూడండి – ఎంత పెద్దవో, ఎంత సౌందర్యమో" అని. అప్పుడు ఎవరో అంటారు "అవి భయాన్ని పుట్టిస్తున్నాయి. ఆ అమ్మాయి దగ్గర రాత్రిపూట నేను ఉండలేను... జడుపు వస్తోంది. మరీ పెద్ద కళ్ళు, రెండూ ఒకేలా లేవు కూడా!"

మీ ఇష్టాన్ని నిరూపించుకునే ఏ పద్ధతీ ఉండదు. ఎవరో జీసస్‌ను ఇష్టపడతారు, ఎవరో బుద్ధుణ్ణి ఇష్టపడతారు : ఇది ప్రేమలో పడడమే – దాన్ని మీరు నిరూపించనక్కరలేదు. మీరు నిరూపించినా మూర్ఖుల్లాగా మీరే కనిపిస్తూ ఉంటారు అందరికీ. వాళ్ళకు అలాగే కనిపిస్తుంది. జీసస్ ప్రేమలో పడినవాళ్ళు మూర్ఖులని హిందువులకు అనిపిస్తుంది; ఏముంది ఆ మనిషిలో? అడగండి హిందువులను – వాళ్ళ దగ్గర ఓ అందమైన కర్మసిద్ధాంతం ఉంది. వాళ్ళు అంటారు మీరు ఇప్పుడు కష్టాలు పడుతూ ఉన్నది కేవలం గతజన్మల్లో మీరు దుష్కర్మలను చేసి ఉంటే మాత్రమేనని. ఎందుకు జీసస్‌కు శిలువ పడింది? ఆయన ఎన్నో పాపకార్యాలను చేసి ఉంటాడు. లేకపోతే శిలువ ఎందుకు పడుతుంది? శ్రీకృష్ణుడికి శిలువ పడలేదు కదా. శ్రీరాముడికి శిలువ పడలేదు కదా – ఎందుకు పడింది జీసస్‌కు శిలువ? తప్పకుండా ఆయన ఓ పాపే అయి ఉంటాడు.

ఇప్పుడు మొత్తం దృక్పథం మారిపోతుంది. ఇప్పుడు మీరు ఓ క్రైస్తవుణ్ణి శ్రీకృష్ణుడు ఓ పిల్లనగ్రోవి ఊదుతూ ఉండడం గురించి అడగండి – అదుంటుంది ఎంతో అందంగా, శిలువ మీద ఉన్న జీసస్‌ను చూస్తూ ఉంటే ఉంటుంది ఎంతో దుఃఖంగా – ఆ క్రైస్తవుడు తప్పకుండా అంటాడు, "ఏం మాట్లాడుతూ ఉన్నారు మీరు? ఈ ప్రపంచం ఎంతటి దైన్యస్థితిలో ఉంది? శ్రీకృష్ణుడిది ఓ పాషాణ హృదయమే అయివుంటుంది. ఓ పిల్లనగ్రోవిని మ్రోగించుకుంటూ ఉంటాడా? ప్రజలక్కడ బాధలు

పడుతూ ఉంటే రోగాలూ, చావులూ అక్కడ ఉంటూ ఉంటే ఈయన ఫ్లూటు వాయించుకుంటూ ఉంటాడా? ఆ మనిషి హృదయం ఓ కఠినశిలే అయివుంటుంది. ఆ మనిషికి హృదయమే లేదు. ఆ మనిషికి హృదయం ఉండి ఉంటే దళిత జనులకోసం, పీడిత ప్రజలకోసం, దైన్యంలో ఉంటున్న జీవులకోసం ఆత్మాహుతి చేసుకుని ఉండేవాడు. జీసస్ క్రైస్టును చూడండి – ఆయనే రక్షకుడు. మనం ఉద్ధరింపబడేందుకోసం ఆయన ప్రాణాలను అర్పించాడు. కృష్ణుడు ఖాళీమనిషిగా కనిపిస్తున్నాడు" అంటాడు.

కానీ శ్రీకృష్ణుణ్ణి ప్రేమించే హిందువును అడిగిచూడండి. ఆ మనిషి అంటాడు "మీరేం మాట్లాడుతున్నారు? ఏ దైన్యమూ లేదు. అన్ని దైన్యాలూ మాయే. ఎవరైనా కష్టాలు పడుతూ ఉంటే వాళ్ళ పాప ఫలాన్నే వాళ్ళు అనుభవిస్తున్నారు. ఎవ్వరూ వాళ్ళను ఉద్ధరించలేరు. ఎవరైనా వాళ్ళను ఉద్ధరించగలుగుతారంటే వాళ్ళు ప్రపంచంలోకి ఆనందాన్ని నింపే వాళ్ళే అయి ఉంటారు. ఆనందం మాత్రమే స్వస్థత పరచేశక్తి. మీరెలా ఉద్ధరించుకోగలుగుతారు?" అంటాడు.

హిందువులు అంటారు, ఏ మనిషి అయినా ఏడుస్తూ ఉంటే, మీరు వెళ్ళి ఆ మనిషి ప్రక్కన కూర్చుంటే, మీక్కూడా ఏడుపు వచ్చేస్తుందని. ఎలా మీరు ఆ మనిషిని ఉద్ధరించగలుగుతారు? దుఃఖం ద్విగుణీకృతమవుతుంది. ఏడుపు రెట్టింపు అయిపోతుంది. ఎవరో జబ్బుపడతారు. మీరు కూడా సానుభూతి చూపిస్తూ ఆ మనిషి ప్రక్కనే పడుకుంటే– ఆ మనిషికి మీరేం సహాయపడగలుగుతారు? జబ్బు మనిషికి సహాయపడాలంటే మీరు ఉండాలి ముందుగా ఆరోగ్యంగా. మీరు కూడా జబ్బుపడిపోకూడదు. శ్రీకృష్ణుడు ఉంటాడు ఆరోగ్యంగా. శ్రీకృష్ణుడు ఉంటాడు ఆనందంగా. ప్రపంచం ఉంటోంది దైన్యంలో. అందువల్లే ఆయన వేణువును పట్టుకొచ్చాడు. అందరూ అప్పటికే శిలువలను మోసుకునే ఉంటున్నారు– శిలువల్ని మోసుకుంటూ తిరగడంలో ఏం ఉంటుంది? అందరూ శిలువలను మోస్తూనే ఉన్నారు కదా; ఓ పిల్లనగ్రోవినే ఎత్తుకోవాలి. ఇప్పుడు ఈ రెండు మార్గాలు ఉన్నాయి. ప్రతి ఒక్కరూ వాటిని సమర్థిస్తూ వ్యతిరేకిస్తూ ఎన్ని మాటలనయినా చెప్పుకోవచ్చు. ఎన్ని వాదలనయినా చేసుకోవచ్చు.

నా మట్టుకు, మతం ఓ ప్రేమ వ్యవహారమే. తెలివితో దానికి ఏ ప్రమేయమూ లేదు. తర్కంతో, కారణంతో దానికి ఏ ప్రమేయమూ లేదు. అది ప్రేమలో పడడం

మాత్రమే. ఎవరి ప్రేమలో మీరు పడుతూ ఉన్నా, అది మీ మార్గమే, పద్ధతే. పడిపోండి ప్రేమలో. ఉద్ధరించే శక్తి ప్రేమ ఒక్కటే. ప్రేమే రక్షకుడు. కానీ మీ అహంకారాలు...

ఈ అందమైన కథను ధ్యానించి చూడండి :

మొట్టమొదటి పాట్రిక్కు, ఐరిష్ పోపు వాటికన్ నగరంలోని తన ఆఫీసులో కూర్చుని 'కేథొలిక్ హెరాల్డ్' న్యూస్ పేపర్‌ను చదువుతూ ఉన్నాడు. ఉన్నట్లుండి ఆయన కళ్ళు 'తాజా జననాలు' శీర్షిక క్రింద ఉన్న పట్టిక మీదకు ఆకర్షితమయ్యాయి.

"హోలీమేరీ, మైఖేల్!" తన సెక్రటరీ కార్డినల్ ఫిట్జ్-మైఖేల్‌ను దగ్గరికి చేరపిలిచాడు. పాట్రిక్, "ఇది చూశావా, నిత్యసంతోషీ?" అని అడిగాడు.

"ఇదేమిటి మహారాధ్యా?" చేస్తున్న పనంతా అలాగే వదిలిపెట్టి లేచి వెంటనే అక్కడికి వచ్చిన మైఖేల్ అడిగాడు.

"డబ్లిన్ నగర వాస్తవ్యుడి భార్యామణి శ్రీమతి ప్యాడీ ఓ'ఫ్లిన్ పండంటి యాభైఆరవ పుత్రికను ప్రసవించి ఆయనకు సమర్పించిందని ఉంది ఇక్కడ" అన్నాడు పోపు పాట్రిక్.

"దేవతలు కీర్తింపబడుదురు గాక, సార్!" అన్నాడు మైఖేల్, "ఓ మహాద్భుతం, కదండీ, కాదా?"

"అది దైవకార్యం, తప్పకుండా" ఆనందభాష్పాలతో అన్నాడు పోపు "ఓ ఉత్సవాన్ని ఈ శుభసమయ కీర్తికోసం, మన కాథొలిక్ చర్చి సంఘటితత్వం కోసం, ప్రపంచ విశ్వాస ప్రాభవం కోసం, ముఖ్యంగా ఈ ఎమెరాల్డ్ ద్వీపం ప్రశస్తి కోసం తప్పకుండా మనం జరిపితీరాలి."

"అదే నిజం, సార్, మీరు చేద్దామనుకుంటున్నది ఏముంది మీ మనస్సులో?"

"మనస్సే లేదు, మైఖేల్" ప్రత్యుత్తరాన్ని ఇచ్చాడు, మహోత్సాహంతో పోపు "ఉపక్రమించు పనికి! తక్షణం వెళ్ళిపో వర్క్‌షాపుకు. మేలిమి బంగారుతో ఓ మడోన్నా బొమ్మను చేయించు. అన్ని పనులూ ప్రక్కనపెట్టి ఆ బొమ్మతయారీ ఆఘమేఘాల మీద జరిపించు. ట్రావెల్ ఏజెంటుతో మాట్లాడి ఓ ఫస్ట్‌క్లాస్ ఎయిర్ లింగస్ విమానం టికెట్టును డబ్లిన్ నగరాన్ని చేరేందుకోసం వెంటనే కొను. నేనే స్వయంగా ఆ కానుకను అక్కడికి పట్టుకు వెళ్తాను. ఓ'ఫ్లిన్ దంపతులను ఆశీర్వదించి ఆ కానుకను వాళ్ళకు

సమర్పిస్తాను. నాక్కూడా కొంచెం విశ్రాంతి తీసుకోవాల్సిన అవసరం ఆ ప్రాచీన దేశంలో ఉంది."

మరుసటిరోజు ప్రొద్దున్నే టంచనుగా పోప్ పాట్రిక్ మడోన్నా బొమ్మనూ, హెరాల్డ్ పేపరునూ, ప్రయాణంలో త్రాగడానికి ఓ ఐరిష్ విస్కీ సీసానూ పట్టుకుని డబ్లిన్‌కు వెళ్ళే విమానాన్ని ఎక్కేశాడు. డబ్లిన్ నగరాన్ని చేరుకోగానే వెంటనే ఓ'ఫ్లిన్ ఇంటికి చేరుకున్నాడు. పుట్టినరోజు వేడుకలు జరుగుతున్న ప్రదేశంలోకి పోపు పాట్రిక్‌ను ఆ ఇంట్లోవాళ్ళు ఎవరో తీసుకుని పోయారు.

"ఎవరో వచ్చారు డాడ్, మిమ్మల్ని కలిసేందుకు" అన్నాడు ఓ'ఫ్లిన్ కుమారుడు అయిన ఓ అబ్బాయి. ఆ హాల్లో అందరూ మద్య సేవనంలో మునిగి ఉన్నారు.

"ఆయన చేతికి ఓ గిన్నీస్ సీసా ఇచ్చి ఆయన్ని ఇక్కడికి పంపించు" అని కేకపెట్టాడు ఓ'ఫ్లిన్. ఎంతో ఉదాత్తమైన, అందరూ గాల్లో తేలిపోతున్నట్లున్న వాతావరణం ఆ హాల్‌లో ఉంది.

పోప్ పాట్రిక్ ఓ గిన్నీస్ సీసాను దొరకబుచ్చుకుని, మడోన్నా బొమ్మను ముందుకు చాపి ఉన్న చేత్తో పట్టుకుని బంధుమిత్ర సపరివారాల గుంపులోంచి ముందుకు నడిచాడు. కొన్నిగంటల తరువాత, పెక్కు గుక్కల గిన్నీస్ గుటకలు పూర్తి అయిన తరువాత పోప్ తూలుతూ పాడీ ఓ'ఫ్లిన్ దగ్గరికి చేరాడు. తన చేతిలోని బంగారు మడోన్నా బొమ్మను పాడీ చేతికి అందించబోతూ "మీకు నా హృదయపూర్వక అభినందనను సమర్పించు కుంటున్నాను" అన్నాడు పోప్ పాట్రిక్.

"సంతోషం, కానీ మేము మిమ్మల్ని ఎలా సంబోధించాలో, తమరెవరో దయచేసి చెబుతారా?" అన్నాడు పాడీ తన ముందు తూలుతూ ఓ చేత్తో గిన్నీస్ సీసానూ, మరో చేత్తో స్వర్ణ మడోన్నా బొమ్మనూ పట్టుకుని నుంచుని ఉన్న చర్చి మనిషిని చూస్తూ.

"నిజంగా నీకు నాతో పరిచయంలేదు పాడీ, కానీ వాస్తవంగా నేను పోప్ పాట్రిక్‌ను."

"పోపా!" ఆశ్చర్యాన్ని పట్టలేకపోయాడు పాడీ. "మీరు మహా ప్రమాదకరమైన చోట్లో ఉన్నారు ఖచ్చితంగా. ఇంకో చిన్న గుటక గిన్నీస్ పుచ్చుకుంటారా?"

"సరే, పుచ్చుకుంటాను, కానీ నువ్వు నాకు ఓ వాగ్దానాన్ని ఇచ్చిన తరువాత" అన్నాడు పోప్ పాట్రిక్.

"త్రాగుతూ ఉన్న మనిషి దగ్గర", అన్నాడు పాడీ, "మాట తప్పడం మహాకష్టం."

"నువ్వు వాటికన్ నగరం సమర్పిస్తున్న ఈ చిన్న కానుకను స్వీకరించి తరువాత దీన్ని తీసుకువెళ్ళి మీ సమీపంలో ఉన్న కాథొలిక్ చర్చిలో మూలపీఠం మీద ఉంచాలి."

"ఆ ఇప్పుడు, సార్", అన్నాడు పాడీ. "మడోన్నా బొమ్మను తీసుకుంటాను, సార్, తప్పకుండా; మీకెంతో కృతజ్ఞుడినై ఉంటాను. కానీ దాన్ని తీసుకువెళ్ళి ప్రాంతీయ కాథొలిక్ చర్చిలో మూలపీఠం మీద పెట్టలేను."

"ఎందుకు పెట్టలేవు" ఆశ్చర్యపడిపోతూ అన్నాడు పోప్, "మేరీమాతకు కానుకగా?"

"సత్యం ఏమిటంటే, సార్" అన్నాడు పాడీ "నేను కాథొలిక్కును కాను. ప్రొటెస్టెంట్‌ను."

"ఏమిటీ?" పోప్ గావుకేక పెట్టాడు. "అయితే నువ్వంటున్నది ఇంతదూరమూ ఇంత కష్టపడి వచ్చి ఈ బంగారు మడోన్నా బొమ్మను కానుకగా నేను సమర్పిస్తున్నది ఓ దొబ్బే కామం పిచ్చోడికా?"

ఈ రోజుకు ఇది చాలు.



# 11. పరిపూర్ణ సంప్రజ్ఞుడు

భగవానుడు అడిగాడు : నువ్వేమనుకుంటున్నావు, సుభూతీ,
తథాగతుడికి అనిపించి ఉంటుందా 'ధర్మం నా వల్ల
పరిబోధింపబడింది' అని? ఎవరైనా, సుభూతీ, 'తథాగతుడిచే
ధర్మం పరిబోధింపబడింది' అని అన్నారంటే ఆ మాట తప్పే
అయిపోతుంది, లేని దేన్నో పట్టుకున్న ఆ మనిషి నన్ను సరిగా
పరిదర్శింపజేయలేదు కాబట్టి. మరి ఎందుకు?...
ఎందుకంటే ఏ అత్యల్ప ధర్మమైనా అక్కడ దర్శించేందుకు లేదు కనుక,
గ్రహించేందుకు లేదు కనుక. అందువల్లే అంటున్నాం దాన్ని
'పరిపూర్ణ సంప్రజ్ఞత' అని.
పైగా సుభూతీ, స్వీయైక్యతయే ఆ ధర్మం అయివుంటూ
ఏ వైరుధ్యాలూ ఉండవు అందులో. అందువల్లే దాన్ని అంటున్నాం
'పరిపూర్ణ సంప్రజ్ఞత' అని.
స్వీయైక్యతే 'నేను' ఉండకపోవడం వల్ల,
'జీవుడు' ఉండకపోవడం వల్ల, 'ఆత్మ' ఉండకపోవడం వల్ల
'వ్యక్తి' ఉండకపోవడం వల్ల, పరమంగా ఉంటూ ఒప్పైన
'పరిపూర్ణ సంప్రజ్ఞత' అయివుంటూ, ధర్మ సర్వస్వం
పరిపూర్ణంగా పూర్తిగా తెలియబడి ఉంటోంది...

నువ్వేమనుకుంటున్నావు, సుభూతీ, ఓ తథాగతుడికి అనిపించి
ఉంటుందా 'సర్వజీవులూ నా వల్ల విముక్తి పొందారు' అని?
ఆ విధంగా దాన్ని నువ్వు చూడకూడదు! సుభూతీ, మరి ఎందుకు?
తథాగతుడు విముక్తిని తెప్పించిన ఏ జీవీ లేదు కనుక...
ఇంకా ఆ సందర్భంలో భగవానుడు
ఈ పద్యపాదాలను భాషించాడు :

ఓ స్వరూపంగా నన్ను దర్శిస్తున్నవాళ్ళు,
నా స్వరాన్నే అనుసరించినవాళ్ళు
తప్పు ప్రయత్నాలనే తద్విధంగా చేస్తూ,
దర్శించలేరు నన్ను.

ధర్మంలోనే జీవి బుద్ధుణ్ణి దర్శించాలి
ధర్మదేహం లోంచే లభిస్తుంది వాటికి మార్గదర్శకత్వం.
అయినా ధర్మపు సత్యస్థితి అసాధ్యం గ్రహణానికి.
ఓ దృశ్యవస్తువుగా ఆ స్థితిని ఎవ్వరూ ఎరుకనొందరాదు...

ఎవరైనా తథాగతుడు 'వెళ్తూంటాడు, వస్తూంటాడు,
నుంచుంటాడు, కూర్చుంటాడు, పడుకుంటాడు' అని అంటున్నారంటే
ఆ మనిషికి నా బోధ అర్థం కాలేదనే అర్థం. మరి ఎందుకు?
'తథాగతుడు' అని ఎక్కడికీ పోనివాణ్ణే, ఎక్కణ్ణుంచో రానివాణ్ణే అంటాం.
అందువల్లే అంటాం 'తథాగతుడు' అని, 'అర్హతుడు' అని,
'పరిపూర్ణ సంప్రజ్ఞుడు' అని.

### పునః సమీక్షకోసం :

భగవానుడు అన్నాడు : తథాగతుడి భాషణ వాస్తవానికి
అనుగుణ్యంగానే ఉంటుంది, సత్యభాషణమే అయివుంటుంది,
ఏది ఉన్నదో దాన్నే భాషిస్తాడు, లేనిదాన్ని చెప్పడు...
'తథాగత శబ్దం', సుభూతీ, సత్య సమతకే ఉంటుంది సారూప్యంగా.

ఈ 'సమత' అన్న పదానికి వాస్తవం పట్ల బౌద్ధ సత్య దర్శనా శీలంలో మహావైశిష్ట్యత ఉంటోంది. తక్కిన మతాల్లో 'దేవుడు' అన్న పదానికి ఎంత ప్రాముఖ్యత ఉంటుందో అంత ప్రాముఖ్యత ఈ 'సమత' అన్న పదానికి బౌద్ధంలో ఉంటుంది.

ఈ 'సమత' అన్న పదానికి బౌద్ధంలో ఉపయోగింపబడే పదం 'తథాత'. ఆ పదానికి అర్థం "విషయాలను, వస్తువులను, పదార్థాన్ని, దృశ్యాన్ని ఉన్నది ఉన్నట్లు చూడడం" – అని– "ఏ వైఖరినీ, ఏ తీరునూ అవలంభించకూడదు. ఏ పూర్వాభిప్రాయాలనూ పెట్టుకోకూడదు. ఏ పక్షపాతాన్నీ వహించకూడదు. ఏ తీర్పులనూ

చెయ్యకూడదు, ఏ నిందలనూ మోపకూడదు" అని. బౌద్ధ ధ్యానాల్లో ఈ సమత ఉంటుంది. ఇది ఉంటుంది మహా సులభ సాధ్యంగా, మహా ప్రగాఢంగా. బుద్ధుడు తన శిష్యులకు చెప్పాడు "విషయాలను ఉన్నది ఉన్నట్లుగానే చూడండి, ఏ ఆలోచనలనూ వాటి మీదికి ప్రసరించకండి, నిరభ్యంతరంగా చూడండి" అని. ఉదాహరణకోసం, మీకు ఓ తలనొప్పి వచ్చి ఉంటుంది. ఏ క్షణంలో దాన్ని మీరు గుర్తిస్తారో, తక్షణమే అది మంచిది కాదన్న ఓ అభిప్రాయం అందులోకి ప్రవేశిస్తుంది. "ఎందుకు రావాలి నాకీ తలనొప్పి? ఇది నాలోంచి పోవాలంటే నేనేం చెయ్యాలి?" అని. వెంటనే మీకు వచ్చేస్తుంది ఆందోళన. ఓ అభిప్రాయాన్ని మీరు స్వీకరించుకుని ఉన్నారు. అది రావడం మీకు ఇష్టంలేదు. దాన్ని అణచిపెట్టేయడాని కోసం ప్రయత్నాన్ని ప్రారంభించేసి ఉన్నారు. ఆ అణచిపెట్టేసే ప్రయత్నం రసాయనిక పదార్థాలను తీసుకోవడం వల్ల జరగవచ్చు, ఓ 'ఆస్ప్రో'నో, 'నొవాల్జిన్' మాత్రనో తీసుకోవడం ద్వారా. లేదా ఆ అణచిపెట్టేసుకునే ప్రయత్నాన్ని మీ చైతన్యంతో కూడా మీరు చేసుకుంటూ ఉండవచ్చు – ఆ తలనొప్పి వైపుకు చూడకుండా, దాన్ని ప్రక్కకు పెట్టేసుకుంటూ. వెంటనే మీరు ఇంకో పనిలో ధ్యాసను మళ్ళించుకుంటారు. మరో ప్రయత్నంలోకి మీ ఎరుకను పట్టుకెళ్ళిపోతారు, ఈ తలనొప్పిని మరచిపోయేందుకోసం. కానీ ఈ రెండు విధాల ప్రయత్నాలలోనూ 'సమత'ను పోగొట్టుకున్నవారే అయిపోయి ఉంటారు.

బుద్ధుడు అప్పుడు మీకు ఏ సలహాను సూచిస్తాడు? బుద్ధుడు దాన్నే గమనించమంటాడు, రెండుసార్లు. "తలనొప్పి, తలనొప్పి". దాంతో ఏ వైరాన్నీ అనుభూతికి తెచ్చుకోకూడదు. దాంతో స్నేహంతోనూ ఉండకండి, విరోధంతోనూ ఉండకండి. ఆ తలనొప్పి వచ్చి ఉందన్న విషయాన్ని గుర్తించండి చాలు, దాంతో మీకు ఏ సంబంధమూ లేనట్లు. "తలనొప్పి, తలనొప్పి" అనుకుని ఏ కలతా లేకుండా ఉండిపోండి. ధ్యాసను మళ్ళించుకోకండి. దాంతో ప్రేరితులు అయిపోకండి. దానిపట్ల ఏ అభిప్రాయాలనూ పెట్టుకోకండి.

చూడండి విషయాన్ని. వెంటనే తొంభైశాతం తలనొప్పి మీ నుంచి వెళ్ళిపోయి ఉంటుంది... ఎందుకంటే ఓ తలనొప్పి నిజంగా ఓ తలనొప్పి నొప్పి కాకుండా, తొంభైశాతం దానిపట్ల ఉన్న విరుద్ధ వైఖరి వల్లే జన్మించి ఉంటుంది కాబట్టి. తక్షణం మీకు కనిపిస్తుంది ఆ తలనొప్పిలో అత్యధిక భాగం ఇప్పుడు అక్కడ లేదని. ఇంకో విషయాన్ని కూడా మీరు గుర్తిస్తారు – బహుశా ఇప్పుడు మీకు కోపం అనుభూతి కలుగుతూ ఉన్నట్లు. ఏం జరిగింది? తలనొప్పిని మీరు అణచిపెట్టేసుకుంటే దాని నిజమైన సందేశం ఏమిటో ఎప్పటికీ మీరు తెలుసుకోకుండానే పోతారు. ఆ తలనొప్పి

మీకు మీరు ఆ క్షణంలో కోపంతో నిండి ఉన్నారన్న విషయాన్ని సూచించడానికే వచ్చిందనీ ఆ కోపమే మీ తలలో ఓ ఉద్విగ్నతను సృష్టిస్తూ ఉందనీ, అందుకే మీకు ఆ తలనొప్పి వచ్చిందనీ. కానీ మీరు గమనించారు. అదక్కడ ఉందని గుర్తించారంతే – తలనొప్పి, తొలనొప్పి" – మీరున్నారు అప్పుడు ఏ పక్షపాతమూ వహించకుండా, దృశ్యపరంగా.

అప్పుడా తలనొప్పి అదృశ్యం అయిపోతుంది. మరి ఆ తలనొప్పి మీకో సందేశాన్ని అందిస్తుంది "నేను తలనొప్పిని కాను. నేను కోపాన్ని" అని. ఇప్పుడు బుద్ధుడు అంటాడు, మళ్ళీ దాన్ని గుర్తించమని "కోపం, కోపం". ఇప్పుడు మీరు కోపంతో కోపం తెచ్చుకోరు, తెచ్చుకున్నారంటే మళ్ళీ మీరు ఉచ్చులోనే పడి ఇరుక్కుపోయి సమతను పోగొట్టుకుని ఉంటారు. మీరు "కోపం, కోపం" అని అనుకున్నారంటే, తొంభైశాతం కోపం మీలోంచి వెళ్ళిపోయి ఉంటుంది తక్షణం. ఇది ఎంతో సులభమైన అభ్యాసపు పద్ధతి. మరి అప్పుడు మిగిలున్న ఆ పదిశాతం కోపం తన సందేశాన్ని అప్పుడు తప్పకుండా విడుదల చేస్తుంది. బహుశా మీకప్పుడు కనిపించవచ్చు అది కోపం కాదని, అది అహంకారం అని. మళ్ళీ దాన్ని గుర్తించండి: "అహం, అహం". ఇదే పద్ధతిని కొనసాగించండి. ఒక విషయం మరో దాన్తో కలిసి ఉంటుంది. ఎంత లోతులోకి మీరు వెళ్తే ప్రథమకారణానికి అంతంత దగ్గరగా మీరు చేరుకుంటారు. మూలకారణాన్ని మీరు సమీపించారంటే ఆ గొలుసు తెగిపోతుంది – దానికి అతీతమైనది ఏదీ ఉండదు.

గొలుసు చివరి బంధం లంకెను మీరు గుర్తుపట్టే క్షణం వచ్చేసిన తరువాత శూన్యత్వమే ఉంటుంది. అప్పుడు ఆ గొలుసు నుండి పూర్తిగా బంధవిముక్తులు అయిపోయి ఉంటారు. మరి అప్పుడు అక్కడ ఓ మహాస్వచ్ఛమైన, మహానిశ్శబ్దం ఉదయిస్తుంది. ఆ మహానిశ్శబ్దమే 'సమత' అని చెప్పబడుతుంది.

దీన్ని నిరంతరంగా అభ్యసించి తీరాలి. అప్పుడప్పుడూ మీరు మరచిపోతూ ఉండడం కూడా జరగవచ్చు మరి అచేతనంగా, యాంత్రికంగా ఓ అభిప్రాయాన్ని కలిగించుకుని ఉండవచ్చు. అప్పుడు బుద్ధుడు చెప్తాడు మళ్ళీ జ్ఞప్తి తెచ్చుకోమని "అభిప్రాయం, అభిప్రాయం". మళ్ళీ దీని దగ్గర్నుంచి దారితప్పి వెళ్ళిపోకూడదు – ఓ అభిప్రాయం ఉంది మీ దగ్గర, మీరు చేసుకున్నదే. సమతను పోగొట్టుకున్నానని వ్యథ చెందకండి. దాన్ని గుర్తించండి చాలు "అభిప్రాయం, అభిప్రాయం". మరి అప్పుడు ఉన్నట్లుండి మీకు తప్పకుండా కనిపిస్తుంది – తొంభైశాతం అభిప్రాయం పోయుంటుంది, పదిశాతం మిగిలి ఉంటుంది, అదే ఓ సందేశాన్ని విడుదల చేస్తుంది

మీకోసం. ఏమిటా సందేశం? ఆ సందేశం ఏమిటంటే మీలో కొంత అభ్యంతరం, ఏదో నిషిద్ధం ఉందని; ఆ నిషిద్ధం లోంచే ఆ అభిప్రాయం తయారై ఉండి పైకొచ్చింది.

ఓ లైంగికత్వపు ఊహ మీ మనస్సులో కలుగుతుంది, వెంటనే మీరు అంటారు "ఇది చెడ్డది" అని. ఇది ఒక అభిప్రాయం. ఏమిటి చెడ్డది? – మీకు దాన్ని చెడ్డది అని నేర్పింపబడి ఉంది కాబట్టి అదుంటోంది చెడ్డదిగా; అది ఓ నిషేధం; గుర్తుపట్టండి దాన్ని, "నిషిద్ధం, నిషిద్ధం". అదే ప్రకారం కొనసాగించుకుంటూ పొండి.

అప్పుడప్పుడూ మీరు కొన్ని తీర్పుల్ని చేయడం కూడా జరుగుతుంది - తీర్పు చెప్పడమే కాదు, ఓ అభిప్రాయాన్ని నిర్మించుకోవడం కూడా; ఓ అభిప్రాయాన్ని ఏర్పరచుకోవడం మాత్రమే కాదు, పోగొట్టుకోవడం వల్ల దేన్నో అణచిపెట్టేసుకోవడం కూడా. అప్పుడు మళ్ళీ దాన్ని గుర్తించండి "అణచివేత, అణచివేత", మళ్ళీ కొనసాగించండి.

ఎప్పుడెప్పుడు చైతన్యంలోకి మీరు వస్తూ ఉన్నా, ఏ విషయంలోనయినా, అక్కడి నుంచే గుర్తించడాన్ని ప్రారంభించండి – మామూలుగా కేవలం గుర్తించుకుంటే చాలు – ఆ తరువాత దాన్ని విడిచిపెట్టెయ్యండి. మరి అతి శీఘ్రంగానే చిక్కులు పడిపోయివున్న మీ మనస్సులో ఏ చిక్కులూ ఇప్పుడు ఉండడం లేదన్న వాస్తవాన్ని మీరు గమనిస్తారు. విషయాలు అన్నీ అదృశ్యం అయిపోవడం ప్రారంభమవుతాయి. అప్పుడప్పుడు సమత ఏర్పడి ఉన్న క్షణాలు కూడా మీకు వచ్చి ఉంటాయి. ఆ సమత, ఆ తథాత అక్కడ ఉంటుంది, కేవలం మీరు ఉన్నప్పుడు, ప్రకృతి అక్కడ ఉన్నప్పుడు, మీకూ సృష్టికీ మధ్య ఏ అభిప్రాయమూ ఉండనప్పుడు, ఆలోచనల వల్ల కలిగిన ఏ కల్లోలమూ ఉండదు. ఆలోచనల వల్ల ఏర్పడే ఏ కాలుష్యమూ ఉండదు. ప్రకృతి ఉంటుంది. కానీ మీ మనస్సు ఉంటుంది మాయమైపోయి. ఆ అమనస్కపు దర్శనా స్థితే సమత – అని చెప్పబడుతూ ఉంటుంది.

బుద్ధుడు అంటాడు : "తథాగత శబ్దం సత్య సమతకే సారూప్యంగా ఉంటుంది" అని – తథాగతుడికి సమతా లక్షణం ఉంటుందని కాదు. ఆయనే సమత.

ఇంకా అంటాడు బుద్ధుడు : ఓ తథాగతుడు వాస్తవానికి అనుగుణ్యంగానే భాషిస్తాడు" అని. తద్విరుద్ధంగా ఆయన ఏమీ చెయ్యలేడు – ఆయనకు ఎంచుకునేందుకు ఉండదు. సత్యానికి అనుగుణ్యంగానే మాట్లాడాలని ఆయన దేన్నీ ఎంచుకోవడం ఉండదు. ఏది సత్యమో అదే మాటలై ఆయన లోంచి వస్తాయి. దేన్నీ ఆయన ఎంచడు. "ఇది సత్యం. దీన్నే నేను మాట్లాడాలి, ఇది అసత్యం, నేను దీన్ని

మాట్లాడకూడదు" అని ఆయనలో ఉండదు. ఆ ఎంపిక ఆయనలో జరిగి ఉంటే, ఆయన ఇంకా ఓ బుద్ధుడు కాలేదనే అర్థం.

ఏ ఎంపికలూ చెయ్యని స్థితిలో నుండే బుద్ధుడు మాట్లాడుతూ ఉంటాడు. కాబట్టి ఆయన మాట్లాడుతున్నదంతా సత్యమే అని కాదు. వాస్తవంలో ఈ మాటను ఈ విధంగా చెప్పితీరాల్సి వస్తుంది. ఆయన ఏం మాట్లాడినా ఆ మాట సత్యం అయివుంటుంది. ఆయన సత్యానికి అనుగుణ్యంగానే మాట్లాడతాడు. వాస్తవంలో సత్యమే ఆయన లోంచి మాట్లాడుతూ ఉంటుంది. ఆయన ఉంటాడు కేవలం ఓ మాధ్యమంగా, ఓ ఖాళీ వెదురుగొట్టంలా. సత్యం ఆ వేణువు లోంచి తన పాటను పాడుకుంటుంది. ఆయన వద్ద స్వంత పాటలేవీ ఉండవు. ఆయన లోని అభిప్రాయాలన్నీ ఆయన లోంచి వెళ్ళిపోయి ఉంటాయి, అదృశ్యం అయిపోయి. ఆయన కూడా అదృశ్యం అయిపోయి ఉంటాడు. ఆయన ఉంటాడు స్వచ్ఛమైన స్థలావరణంగా. సత్యం ఆయన లోంచి ప్రసరించి ప్రపంచం లోకి రాగలుగుతుంది. సత్యం ఆయన లోంచి దిగి ప్రపంచం లోకి రాగలుగుతుంది. ఆయన... సత్యాన్నే భాషిస్తాడు. ఏది ఉన్నదో, దాన్నే భాషిస్తాడు.

యధాభూతమ్ – అక్కడ ఏం ఉన్నా, అదే మాట్లాడతాడు. దాన్ని గురించి ఏ మనస్సూ ఆయనకు ఉండదు. తనలోంచి ప్రసరిస్తున్నదానికి ఆయన అడ్డుపడడు. తనలోంచి ప్రసరితం అవుతున్న దేన్నీ ఆయన జార్చుకోడు. తనలోంచి వస్తున్నదానికి దేన్నీ జోడించడు. ఆయన ఒక అద్దం; ఆ అద్దం ముందుకు ఏది వచ్చినా ఆ అద్దం దాన్ని ప్రతిబింబిస్తూ ఉంటుంది. ఈ ప్రతిబింబించి ప్రత్యక్షం అవుతున్నదే సమత.

***'తథాగత శబ్దం', సుభూతీ, సత్య సమతకే ఉంటుంది సారూప్యంగా.***

ఎందుకు అంటున్నాడు ఆయన 'సత్య సమత' అని? అసత్యమైన సమత కూడా మరొకటి ఉందా? ఉంది. మీరు అభ్యాసం చెయ్యవచ్చు. మీరు అభ్యాసం చెయ్యగలరు. సమత అన్న ఓ లక్షణాన్ని మీరు అభ్యసించి తెచ్చుకోగలుగుతారు. కానీ అదుండదు సత్యంగా. 'సత్య సమత' అంటే నిజమైన సమత. అది అభ్యసిస్తే వచ్చేది కాదు. తనంతట తనే అది వస్తుంది.

ఉదాహరణ కోసం, నేను 'మీరు అభ్యసించవచ్చు' అని అంటున్నప్పుడు నా మాటకు ఏమిటి అర్థం? మీరు నిర్ణయించుకోవచ్చు, "నేను సత్యాన్ని మాత్రమే చెప్తాను, అందువల్ల ఏ పరిణామాలు సంభవించినా సరే. నా ప్రాణం పోయే పరిస్థితి వచ్చినా సరే, సత్యమే చెప్తాను", అని దృఢసంకల్పాన్ని చేసుకుని సత్యాన్నే పలుకుతూ

ఉంటారు – కానీ ఇది కాదు సత్య సమత, ఇది మీ నిర్ణయం. మీలో ఓ అసత్యం రేగుతుంది. దాన్ని మీరు అణచిపెట్టేసుకుంటూ ఉంటారు ఎప్పుడూ. మీరు అంటారు "నా ప్రాణాలు పోతూ ఉన్నా నేను సత్యాన్నే పలుకుతాను". ఇది ప్రయత్నం. సత్యం మీ స్వాభిమానం, ప్రతిష్ట అయిపోయి ఉంది. మీ ప్రగాఢాంతరాల్లో మీరు సత్యం కోసం ప్రాణాలు అర్పించేవారిగా తయారవ్వాలని సంకల్పించుకుని ఉంటున్నారు. మీ ప్రగాఢాంతరాల్లో ప్రపంచమంతా మిమ్మల్ని సత్యవంతులుగా తెలుసుకోవాలన్న అభిలాష ఉంటోంది, సత్యం కోసం ప్రాణత్యాగాన్ని చెయ్యడానికి సంసిద్ధంగా మీరున్నారని ప్రపంచం అంతా గ్రహించేందుకోసం; మీరో గొప్ప మనిషి, ఓ మహాత్ముడు. మరి మీరు ప్రాణత్యాగాన్ని చేసెయ్యొచ్చు, కానీ అది సత్య సమత కాదు.

సత్య సమతకు ఏ ఎంపికలూ తెలిసుండవు. మీరు ఉంటారు సత్యానికి కేవలం ఓ పరికరంగా, వాస్తవానికి ఉపకరణంగా. మీరు మధ్యలోకి రారు, మీరు అడ్డుగా నిలబడి ఉండరు, మీరుంటారు మిమ్మల్ని పూర్తిగా ఉపసంహరించుకుని. ఓ అద్దం దేన్నీ నిర్ణయించుకోదు– "ఈ మనిషి నా ముందు నుంచుని ఉన్నాడు. ఆ మనిషికి నేను ఆ మనిషి నిజం మొహాన్నే చూపిస్తాను, అందువల్ల ఏ పరిణామాలు సంభవించినప్పటికీ. ఆ మనిషి ఓ రాయిని నా మీదకు విసిరినా సరే – ఆ మనిషి ఎంతో కురూపిగా ఉంటున్నాడు కాబట్టి, ఆ మనిషికి కోపం రావచ్చు – కానీ నేను ఆ మనిషికి తన నిజస్వరూపాన్ని మాత్రమే, నిజం మొహాన్ని మాత్రమే చూపిస్తాను" అని.

ఓ అద్దం ఆ విధమైన ఆలోచనలను చేసిందంటే, అప్పుడది ఇక అద్దంగా ఏ మాత్రమూ ఉండదు – మనస్సు వచ్చేసి ఉంటుంది దానికి. అప్పుడది ప్రతిబింబాన్ని చూపించే పనిని చెయ్యడం లేదు. అప్పుడది ఓ నిర్ణయాన్ని చేసుకుంటోంది. అది దాని స్వచ్ఛతను కోల్పోయి ఉంది. కానీ ఒక అద్దం కేవలంగా అక్కడ ఉంటే, దానికి ఉండదు మనస్సు; బుద్ధుడు కూడా అలాగే ఉంటాడు. అందువల్లే బుద్ధుడు 'సత్య సమత' అన్న మాటను ఉపయోగిస్తూ ఉన్నాడు.

ఈ బౌద్ధపు సత్య సమతా ధ్యానాన్ని – ప్రయత్నించండి, ఆడుకోండి దాంతో. 'దాన్ని అభ్యసించండి' అని నేను చెప్పలేను. దాంతో 'ఆడుకోండి' అని మాత్రమే నేను చెప్పగలుగుతాను. కూర్చుని ఉన్నప్పుడూ, నడుస్తూ ఉన్నప్పుడూ, అప్పుడప్పుడూ దీన్ని గుర్తుకు తెచ్చుకుంటూ ఉండండి – అలా ఆడుకోండి దానితో. మరి మీరప్పుడు

అత్యంత ఆశ్చర్యచకితులు అయిపోతారు, బుద్ధుడు ప్రపంచానికి స్వీయ అంతరంగపు మహాప్రగాఢ అంతర్భాగంలోకి మిమ్మల్ని చొచ్చుకుపోనిచ్చే ఓ అత్యంత విశిష్ట మహా తంత్ర సాధనాన్ని మీకు అందించినందుకు.

మానసిక విశ్లేషణలు మీ అంతరంగపు అంత మహాంతర్భాగాన్ని చేరుకోలేవు. అది కూడా ఆధారపడి ఉంటుంది ఏదో ఇటువంటి విషయం మీద – స్వేచ్ఛతో సమావేశమవుతున్న ఆలోచనలు – కానీ అది ఉంటుంది బాహ్యోపరితలం మీదే, ఎందుకంటే రెండవవాడి ప్రత్యక్షం ఓ ప్రతిబంధకమే కాబట్టి. ఆ మానసిక విశ్లేషకుడు అక్కడే కూర్చుని ఉంటాడు; ఆ మనిషి ఓ తెరవెనుక కూర్చుని ఉన్నా, మీకు తెలుసు, ఆ మనిషి అక్కడే ఉన్నాడని. ఎవరో ఒక మనిషి అక్కడున్నాడన్న ఆ సాక్షాత్ జ్ఞానమే స్వయంగా ఓ ప్రతిబంధకం, అభ్యంతరం అయిపోయి ఉంటుంది. మీరుండలేరు అప్పుడు నిజమైన ఓ అద్దంలా. ఎందుకంటే ఆ రెండవ మనిషి ప్రత్యక్షం సంపూర్ణంగా మీరు విచ్చుకుని తెరచుకోవడానికి అనుమతించదు కనుక. మీరు మీకు మాత్రమే సంపూర్ణంగా విచ్చుకుని తెరచుకోగలుగుతారు.

బుద్ధుడి పద్ధతి మరింత మహా ప్రగాఢాంతరంలోకి ప్రవేశించగలుగుతుంది. ఎందుకంటే మీరు మీ మాటలను మరెవ్వరితోనూ చెప్పుకోరు కనుక. ఆ మాటలు కేవలం అంతరంలో మీరు గుర్తించుకోవడానికి మాత్రమే. అది ఉంటుంది వ్యక్తిగతజ్ఞానం గానూ, విషయపరజ్ఞానం గానూ కూడా. ఈ సంభవం మీ వ్యక్తిగతంలోనే జరిగితీరాలి. కానీ మీరు ఉండాలి విషయపరతత్వంతో కూడా.

కేవలం గుర్తించండి, గుర్తించుకుంటూనే ఉండండి సదా, అది మీ వ్యాపారం కానట్లు, అది మీకు సంబంధించినది కానట్లు. అది మీకు జరుగుతూ ఉన్నట్లు కానట్లు. ఏ విధినో నిర్వర్తిస్తూ మీరు ఉన్నట్లు : వీధిలో ఈ ప్రక్కన నిలబడి ఉండి ఆ వీధిలో జరుగుతున్న గమనాల అన్నిటినీ గమనించండి. "ఓ అమ్మాయి, ఓ అమ్మాయి; ఓ కుక్క, ఓ కుక్క; ఓ కారు, ఓ కారు". మీరు చేస్తున్నది ఏదీ ఉండదు, జరుగుతున్న దాంతో ఏ ప్రమేయమూ మీకు లేదు. మీరుంటారు అక్కడ యధాలాపంగా, ఏమీ పట్టనట్లు, దూరంగా.

అది మిమ్మల్ని ఒక విషయం నుంచి మరో విషయానికి తీసుకుపోగలుగుతుంది. కొంత సమయం తరువాత ఓ క్షణం వస్తుంది – ఓ గొలుసు ఏర్పడి ఉంటున్నందుకు హేతువయిన ఆ సాక్షాత్ కారణాన్నే దర్శించగలిగే సమయ క్షణం. మీ జీవుడిలో అలాంటి గొలుసులు ఎన్నో ఉంటాయి. కొన్నివేల దారాల

పురులు ఒకదానితో మరొకటి కలగాపులగంగా కలిసి చిక్కుబడిపోయి ఉంటూ. మీరు దర్శిస్తారు ఓ మహా గందరగోళాన్నే అక్కడ. మీరే అయిపోయి ఉంటారు ఆ మహాగందరగోళం. ఆ చిక్కులో ఉన్న ప్రతి దారాన్నీ మీరు అనుసరించి వెళ్తూ ఉండాలి, నెమ్మదిగా, నెమ్మదిగా. అలా వెళ్తే ప్రతి దారపు పోగు చివరనూ మీరు చేరుకుని ఉంటారు తప్పకుండా. ఒక్కసారి ఆ దారపు పోగు చివరికి మీరు వచ్చి చేరుకున్నారంటే, వెంటనే ఆ గొలుసు అదృశ్యం అయిపోతుంది మీ జీవుడిలోంచి, మీ ఉనికిలోంచి. మీరు మరింత తేలికపడతారు.

నెమ్మదిగా, నెమ్మదిగా, ఓ నాటికి ఇది సంభవిస్తుంది – అన్ని దారాలూ అదృశ్యం అయిపోయి ఉంటాయి. ఎందుకంటే వాటిని కలిగిస్తున్న అన్ని కారణాలనూ మీరు దర్శించి ఉంటారు కాబట్టి. అవి ఉండేవి ఫలితాలై. ఓ రోజు, ఎప్పుడైతే అన్ని కారణాలనూ మీరు దర్శించేసి ఉంటారో, అన్ని కారణాలనూ మీరు గమనించేసి ఉంటారో, అన్నిటినీ పరీక్షించేసి ఉంటారో – మీ మనస్సు మీ లోపల మీతో ఆడుకుంటున్న అన్ని ఆటల్నీ, దాన్ని అన్ని కిటుకులనూ, చిట్కాలనూ, జిత్తుల్నీ, మోసాల్నీ, పిల్లాటలనూ – ఆ మొత్తం మనస్సు అయిపోయి ఉంటుంది మాయం, అదెప్పుడూ మీ దగ్గర లేనే లేనట్లు.

మనస్సు గురించీ, జీవితం గురించీ, ఉనికి సర్వస్వం గురించీ బుద్ధుడు ప్రవచించిన ప్రఖ్యాత మహాసూత్రం ఒకటి ఉంది. మహా స్వర్ణసూత్రం అది. ఆయన అంటాడు :

**మనస్సును ఊహించు**
**నక్షత్రాలుగా, ఓ దృష్టి దోషంగా, ఓ వెలుగుతున్న దీపంగా,**
**ఓ బూటక ప్రదర్శనంగా, మంచుబిందువుల్లా, లేదా ఓ నీటిబుడగలా,**
**ఓ కలగా, ఓ మెరుపులా, లేదా ఓ మేఘంగా**
**అలాగే చూడాలి మనిషి నియమితమై తీరి ఉన్నదాన్ని.**

మనస్సు ఓ నియమిత తీరుతో ఏర్పడి ఉన్న సంభవం. అనేక కారణాల ఫలితం. సూటిగా ఫలితాలను మీరు నాశనం చెయ్యలేరు, కారణాలలోకే మీరు వెళ్ళితీరాలి. కొమ్మల్నీ, రెమ్మల్నీ, ఆకుల్నీ తొలగించినంత మాత్రాన ఓ వృక్షాన్ని మీరు విధ్వంసం, నాశనం చెయ్యలేరు; ఆ వృక్షమూలాలలోకే మీరు వెళ్ళవలసి వస్తుంది. అదేవిధంగా ఉంటాయి మూలాలు మీలో కూడా. ఈ విషయాలను తప్పకుండా

అర్థం చేసుకోవాలి. బుద్ధుడు అంటాడు “మనస్సును ఊహించు నక్షత్రాలుగా” అని. ఎందుకు? నక్షత్రాలు ఉండగలుగుతాయి చీకట్లోనే. ఉదయం కాగానే నక్షత్రాలన్నీ అయిపోతాయి అదృశ్యం.

మీ మనస్సు కూడా అంతే; అది ఉండగలుగుతుంది మీ అచేతనంలోనే. చైతన్య సూర్యోదయం కాగానే అదృశ్యం అయిపోతుంది మనస్సు - నక్షత్రాలలాగే. చెయ్యకండి యుద్ధాన్ని నక్షత్రాలతో. వాటిని మీరు నశింపజేయలేరు. అవి ఉంటాయి కోటానుకోట్లుగా. వాటిని గురించి మరింత చైతన్యవంతులు కండి, అవే తమంతట తామే అయిపోతాయి అదృశ్యం.

ఓ దృష్టి దోషం... మీ కళ్ళు జబ్బుపడి ఉన్నాయి. ఏ దోషమో వాటికి ఉంది. అప్పుడు మీరు లేనివాటిని కూడా చూస్తూ ఉంటారు. ఉదాహరణకోసం. మీకు అన్నీ రెండుగా కనిపిస్తూ ఉండవచ్చు, లేదా విచిత్ర స్వరూపాలు కనిపిస్తూ ఉండవచ్చు. ఎందుకంటే ఉండాల్సిన పద్ధతిలో మీ కళ్ళు ఉండడం లేదు కనుక. మీ కాలేయం సక్రమంగా పనిచేస్తూ ఉండనప్పుడు మీ కళ్ళు లేని దృశ్యాలను కూడా చూస్తూ ఉంటాయి; ఓ బలహీనమైన కాలేయం ఉంటే మీకు గాలిలో ఎన్నో స్వరూపాలు, బుడగలు, చిత్రకల్పనలు, ఎన్నో రూపాలు కనిపిస్తూ ఉంటాయి. అవి నిజంగా అక్కడ ఉండవు. వాటి సృజనకు మీ కన్నే కారణం స్వయంగా. ఆ రూపాలతో మీరు యుద్ధం చేయలేరు. వాటిని మీరు నాశనం చెయ్యలేరు, ఎందుకంటే అవి ఉండవు కనుక. మీరు చేయాల్సిందల్లా ఓ వైద్యుడి వద్దకు వెళ్ళడం మాత్రమే. మీ కళ్ళకు వైద్యం జరగాలి, మీ కళ్ళకు స్వస్థత చేకూర్చబడాలి.

బుద్ధుడు అంటూ ఉండేవాడు “నేను వేదాంతిని కాను, ఓ వైద్యుణ్ణి. ఏ సూత్ర బోధనూ నేను మీకు అందించను. మీకు వైద్యాన్నే నేను చేస్తాను. ఏ సిద్ధాంతాన్నీ నేను మీకు ఇవ్వను. కేవలం నేను మీకు ఓ ఔషధాన్ని అందిస్తాను. వెలుతురు అంటే ఏమిటో నేను మాట్లాడను. మీ కళ్ళు తెరుచుకోగలిగే సహాయాన్నే చేసి మీరే చూసేలా చూస్తాను.”

ఓ అంధుడికి సహాయం ఏ కాంతి నిర్వచనాలవల్ల కానీ, రంగుల, ఇంద్రధనస్సుల వర్ణనలతో కానీ లభించదు. ఆ మనిషికి చేయగల ఏకైక సహాయం మళ్ళీ కళ్ళకు చూపును ఆ మనిషికి తెప్పించడం మాత్రమే. ఓ చెవిటి మనిషికి

సంగీతాన్ని గురించి మీరు వివరించి చెప్పలేరు. ఆ మనిషి తన చెవులతో స్వయంగా విన్నప్పుడు మాత్రమే తెలుసుకుంటాడు. అనుభవమే ఏకైక వివరణం.

మూడవది. బుద్ధుడు అంటాడు మనస్సును ఓ వెలుగుతున్న దీపంగా ఊహించుకోమని. ఎందుకు ఊహించాలి దాన్ని ఓ దీపంగా? చమురు ఉన్నంతసేపు మాత్రమే దీపం వెలగ గలుగుతుంది. తైలం అయిపోయిన వెంటనే దీపశిఖ అయిపోతుంది అదృశ్యం. మనస్సు కూడా అంతే – కోరికలే దానికి తైలం. కోరికలు ఉన్నంత కాలం మనస్సు కూడా ఉంటుంది సజీవంగా. దీపశిఖతో చెయ్యకండి యుద్ధం. ఆ ప్రమిదలోకి చమురును పొయ్యడం మానెయ్యండి. కోరికలే చమురు.

కోరిక అంటే, ఏది ఉందో, దాంతో తృప్తిపడి మీరు లేరనే. మీకు ఇంకా ఏదో కూడా కావాలి. మీరు జీవిస్తూ ఉండడంలేదు సమతతో – అదే అర్థం 'కోరిక' అంటే. 'కోరిక' అంటే ఉన్న వస్తువు అలా ఉండకుండా మరోవిధంగా ఉండాలని అనుకోవడమే. మీ స్వంత అభిప్రాయాలు అనేకంగా ఉంటాయి. వాస్తవం మీదికి గుప్పించేందుకు మీకు మీ స్వంతం అయిన ఎన్నో స్వప్నాలు ఉంటాయి. వాస్తవాన్ని ఉన్నదున్నట్లుగా చూడడం మీకు తృప్తిగా ఉండదు. మీ హృదయపు అభిలాష్యంతో వాస్తవాన్ని పరివర్తించాలని మీరు సంకల్పిస్తూ ఉంటారు. అప్పుడు ఉంటుంది మనస్సు మిగిలి. వాస్తవంతో తృప్తులై మీరు ఉండకపోవడంవల్లే ఉంటోంది మనస్సు ఉనికితో.

ఎంతోమంది నా దగ్గరికి వచ్చి అడుగుతూ ఉంటారు "ఆలోచనలను ఎలా ఆపుకోవాలి?" అని. సూటిగా ఆలోచనలను ఆపేసే ప్రయత్నాన్నే వాళ్ళు చేయాలనుకుంటారు. ఆ ఆలోచనలను ఆపగలగడం అసాధ్యం. కోరికలు ఉంటున్నందువల్లే ఆలోచనలు ఉంటాయి. కోరికలను అర్థంచేసుకుని మీరు వాటిని వదిలిపెట్టేస్తే తప్ప, ఆలోచనలను మీరు వదిలి పెట్టలేరు – ఎందుకంటే ఆలోచనలు ఉపవస్తువులు కాబట్టి.

ముందుగా కోరిక లోపలికి వస్తుంది. ఓ అందమైన కారు వెళ్తూ ఉంటుంది. మీలో కోరిక తలెత్తుతుంది. బుద్ధుడు తప్పకుండా అంటాడు "చెప్పుకోండి 'కారు, కారు' అని. అంతటితో దాన్ని పూర్తిచేసెయ్యండి" అని. కానీ ఓ అద్భుతమైన కారునూ, స్వప్నాన్నీ, కోరికనూ చూసి ఉన్న మిమ్మల్ని అవే పట్టుకుంటాయి.

ఇప్పుడిక ఎన్నో ఆలోచనలు తప్పకుండా తలెత్తుతాయి : "ఓ కారును ఎలా నేను సంపాదించుకోగలుగుతాను? ఈ ఇంటిని అమ్మేసెయ్యాలా? బ్యాంకుకు వెళ్ళాలా?

డబ్బు ఆర్జించాలా, సక్రమంగా/అక్రమంగా? ఎలాగైనా ఈ కారును స్వంతం చేసుకోవాలి". ఈ ఆలోచనలను ఆపుకోవడం ఎలా?

ఓ రాజకీయనాయకుడు నా దగ్గరికి వస్తూ ఉండేవాడు. ఆయనకు తన ఆలోచనలను ఆపేసుకోవాలని అనిపించింది. ధ్యానం చేసుకోవాలనుకుంటున్నాడు. నేను అన్నాను “ముందుగా రాజకీయాలను విడిచిపెట్టెయ్యండి, లేకపోతే ఎలా ఆపుకోగలుగుతారు ఆలోచనలను? మీరుంటున్నారు మహా అభివృద్ధి ఇచ్ఛతో.”

ముందు ఆయన ఓ MLA గా ఉండేవాడు. ఎంతో పైకి పోవాలని ఆయనకు ఆరాటం ఉండేది. ఓ ఉపమంత్రి అయ్యాడు. అప్పటికీ తృప్తి కలగలేదు. ఓ మంత్రి అయ్యాడు. ఇప్పుడు ఓ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిపోవాలని అనుకుంటున్నాడు. ఆయన అన్నాడు “కానీ ఆలోచనలను ఆపుకునేందుకోసమే నేనిక్కడికి వచ్చాను. నేను సౌఖ్యణ్ణి ఎలా కావాలో మీరు నేర్పిస్తే, ధ్యానాన్ని నేర్పిస్తే, మరింతగా పోరాడేతత్వం నాకు వస్తుంది. నా ప్రత్యర్థులతో, పోటీదార్లతో మరింత సమర్ధవంతంగా యుద్ధం చెయ్యొచ్చు. మీరేమో రాజకీయాల్నే మానుకోమంటున్నారు. అది నా వల్ల కాదు.”

కానీ కోరికలను మీరు విడిచిపెట్టలేకపోతే, ఎలా ఆపుకోగలుగుతారు ఆలోచనలను? ఆలోచనలు ఉంటాయి సహాయపడుతూ. మీరు ముఖ్యమంత్రి అయిపోవాలనుకుంటున్నారు. మనస్సు అల్లికలూ, కుట్లూ ప్రారంభించేస్తుంది. మనస్సు అంటుంది “ఇప్పుడు నేను అన్ని విషయాలనూ చూడాల్సి ఉంది. ఇది జరిగేలా చూడాల్సి ఉంది”. ఇప్పుడు అక్కడ పరిష్కరించాల్సిన వెయ్యిన్నొక్క సమస్యలు ఉంటాయి, ఆ తరువాతే మీ కోరిక ఈడేర గలుగుతుంది. కోరికలను సాకారం చేసుకునే సాధనమే మనస్సు. కోరికకు తనను తాను పండించుకోవడానికి పనికొచ్చే సాధనమే మనస్సు. సూటిగా ఆలోచనలను మీరు ఆపేసుకోలేరు.

బుద్ధుడు అంటాడు కోరిక దీపంలో చమురులాగా ఉంటున్నదని; ఆ చమురు మరి ఇక ఉండకపోతే, దీపశిఖ తనంతట తానే అదృశ్యం అయిపోతుందని.

ఊహించండి మనస్సును ఓ దీపంలాగా, ఊహించండి మనస్సును ఓ బూటకపు ప్రదర్శనంగా, ఓ ఇంద్రజాల ప్రదర్శనంగా. ఏమీ ఉండదు అక్కడ వాస్తవికంగా, ఘనంగా. అది ఉంటుంది ఓ యోగనిద్రాస్థితి లాగా. ఓ హిప్నాటిస్టు మిమ్మల్ని యోగనిద్ర లోకి పంపించేసి అంటాడు “చూడు – ఆ జంతువును, ఒంటె వస్తోంది” అని. వెంటనే మీ మనస్సులో ఓ పెద్ద ఒంటె తయారయిపోతుంది, ఆ

ఒంటెను మీరు చూస్తూ ఉంటారు, ఆ ఒంటె అక్కడే మీ ముందు ఉంటుంది – మీకోసం. అందరూ నవ్వుతూ ఉంటారు, ఎందుకంటే వారెవరికీ ఆ ఒంటె కనిపించదు, కానీ మీకు మాత్రం కనిపిస్తూ ఉంటుంది కనుక.

మీ మనస్సు ఓ మాయల పెట్టె. ఈ విషయాన్నే బుద్ధుడు ఎన్నోమార్లు అన్నాడు. అది సృష్టించుకుంటూనే ఉంటుంది భూతాలను, కల్పితాలను, ఏ పదార్థమూ ఉండదు వాటిల్లో – కానీ వాటిని మీరు విశ్వసిస్తూ ఉంటే అవి మీకు అవుతాయి నిజాలు. మీ మనస్సే ఓ మహా ఇంద్రజాల ప్రదర్శన. వాస్తవంలో ఇంగ్లీషు పదం 'మేజిక్' భారతదేశపు పదం అయిన 'మాయ' లోంచే వస్తుంది. 'మాయ' అంటే భ్రమే.

భ్రమలను సృష్టించుకోవచ్చు. మీరందరూ భ్రమలను సృష్టించుకుంటూనే ఉంటారు. ఓ అమ్మాయిని మీరు చూస్తారు. కానీ మీరు చూడరు ఆమెను 'యధాభూతం'గా– ఆమెను ఉన్నదున్నట్లుగా. అందువల్లే ఆ తరువాత మీరే భంగపడుతూ ఉండడం జరుగుతూ ఉంటుంది. ఆమెలో లేని విషయాలను మీరు చూస్తూ ఉంటారు, అవన్నీ మీ మానసిక ప్రసారాలు మాత్రమే. అందాన్ని మీరు ప్రసరించుకుంటారు. వెయ్యిన్నొక్క విషయాలను ఆ అభాగ్యురాలి మీదికి ప్రసరించుకుంటారు. ఆమెను సమీపించి మీరు చూసినప్పుడు, ఆ అమ్మాయితో కలిసి జీవించగలుగుతున్నప్పుడు, మీరు ప్రసరించుకున్న ఆ భూతాలన్నీ ఖర్చు అయ్యి అరిగిపోతూ ఉంటాయి. మీరు సృష్టించుకున్న ఆ భ్రమలు వాస్తవంతో కలిసి ఎల్లకాలమూ జీవించలేవు; ఆ అమ్మాయి వాస్తవమే చివరికి ప్రకటింపబడి ఉంటుంది, అప్పుడు మోసపోయినట్లు మీకు అనిపిస్తుంది. ఆ అమ్మాయే మిమ్మల్ని మోసం చేసిందని మీకు అనిపిస్తుంది.

ఆమె ఏ పనినీ చెయ్యలేదు. ఆమే స్వయంగా మీ వల్లే మోసగింపబడినట్లు అనుభూతితో తెలుసుకుని ఉంటుంది. ఎందుకంటే ఆమె కూడా మీ మీద తన ప్రసారాలను కొన్నింటిని చేసుకుని ఉంటుంది కాబట్టి. ఆమె మిమ్మల్ని ఓ 'హీరో' అనుకుని ఉంటుంది. ఏ అలెగ్జాండరో మీరని, ఇంకా ఏదో అనుకుని ఉంటుంది. ఓ గొప్పవారని అనుకుని ఉంటుంది. ఇప్పుడు మీరు ఆమెకు ఓ చిట్టెలుక కన్నా గొప్పగా కనిపించరు. మరి ఆమె మిమ్మల్ని ఓ మహాపర్వతంగా ఊహించుకుని ఉంటుంది – మీరు కనీసం ఓ చెదపుట్టగా కూడా ప్రస్తుతం కనిపిస్తూ ఉండరు. ఆమె తను మోసపోయానని తెలుసుకుంటుంది. మీ ఇద్దరికీ మోసపోయినట్లే ఉంటుంది, ఇద్దరికీ భంగపాటే కలిగివుంటుంది.

ఇది నేను విన్నాను :

ఓ స్త్రీ తప్పిపోయినవాళ్ళను వెతికిపెట్టే పోలీసువిభాగం ఆఫీసుకు వెళ్ళింది. "నా భర్త కనిపించడంలేదు, నిన్న రాత్రి నుంచి మాయమైపోయాడు" అని కంప్లయింట్ చేస్తూ.

"ఆయన్ని వెతికిపట్టుకునేందుకు మా సాయశక్తులా కృషిచేస్తాం" అని అక్కడి అధికారులు ఆమెకు భరోసా ఇచ్చారు, "దయచేసి ఆ మనిషి ఎలా ఉంటాడో పోలికలు చెప్పండి."

"మంచిది", ఆమె కాసేపు నిరీక్షించి ఆ తరువాత ఇలా అంది "ఆయన సుమారుగా అయిదడుగుల ఎత్తుతో ఉంటాడు, భూతద్దం కళ్ళద్దాలు పెట్టుకుంటాడు. బట్టతల. తెగ తాగుతూ ఉంటాడు. ఎర్రటి ముక్కు ఉంటుంది, కీచుగొంతుతో మాట్లాడుతూ ఉంటాడు..." ఆమె ఒక్క నిముషంసేపు మాట్లాడ్డం ఆపేసి ఓ క్షణం ఆలోచనలో పడిపోయి, తరువాత ఇలా అంది "పోనీండి. నేను చెప్పిందంతా మరచిపోండి. ఆయన్ని వెతక్కండి!"

వాస్తవాన్ని మీరు దర్శిస్తే అది ఇలాగే ఉంటుంది. మీరు తప్పకుండా అంటారు "పోనీండి. నేను చెప్పిందంతా మరచిపోండి" అనే అంటారు. కానీ మీరు చూడరు, ప్రసారాలను చేసుకుంటూనే ఉంటారు.

ఓ రోజు ముల్లానస్రుద్దీన్ నాతో అన్నాడు "మా బాబాయి ఎన్నో ఏళ్ళుగా ఇటలీలో జీవిస్తూ ఉండేవాడు. ఆయన మధువూ, మగువా, సంగీతాల వల్లే మరణించాడు" అని.

నేను అన్నాను నస్రుద్దీన్‌తో "మీ బాబాయి ఉమర్‌ఖయ్యాం లాంటి వాడనీ, రసిక పురుషుడనీ నేనెప్పుడూ అనుకోలేదే! మీ బాబాయి గురించి మరింత వివరంగా చెప్పు. ఎంతో ఉత్సాహం కలుగుతోంది."

ముల్లానస్రుద్దీను చెప్పాడు "వాస్తవంలో ఇది మనకు వినిపిస్తున్నంత రసికతతో ఉత్సాహభరితంగా మాత్రం ఉండదు. నేను సత్యాన్ని మీ దగ్గర దాచను. జరిగిందంతా చెప్పేస్తాను. ఓషో, ఆయన ఓ కొత్త సంసారి ఇంటి కిటికీ బయట ఓ బూతుపాట గట్టిగా పాడుకుంటూ ఉన్నాడు. ఆ పిల్ల మొగుడు బయటికొచ్చి మా బాబాయి బుర్ర బద్దలు కొట్టాడు, మెదడు బయటికొచ్చేలా. ఆయన మధువూ, మగువా, సంగీతాలవల్లే చచ్చాడు."

ఈ విధంగానే మనం చరిస్తూ ఉంటాం.

వాస్తవం ఎప్పటికీ భంగపాటును కలిగించదు. వాస్తవం ఉంటుంది ఎప్పటికీ సాఫల్యదాయకంగానే. భంగపాట్లు మనకెందుకు వస్తాయంటే వాస్తవం మీద భ్రమలను మనమే ప్రసరించుకుంటూ ఉంటున్నాం కాబట్టి.

బుద్ధుడు అంటాడు ఇంకో ఇంద్రజాలం అని. ఉండండి ఎరుకతో జాగ్రత్తగా – మీ మనస్సే ఓ మాయగాడు, ఓ ఇంద్రజాలికుడు. అది లేని విషయాలనన్నింటినీ మీకు చూపిస్తూ ఉంటుంది, ఎప్పుడూ అక్కడ ఉండని విషయాలను కూడా. అది మిమ్మల్ని భ్రమింపజేస్తుంది, ఓ అబద్ధపు ప్రపంచాన్ని అది మీ చుట్టూ సృష్టిస్తుంది. అప్పుడు మీరు ఆ అబద్ధపు ప్రపంచంలోనే జీవిస్తూ ఉంటారు. వృక్షాలతో, పక్షులతో, జంతువులతో, పర్వతాలతో నిండి ఉన్న ఈ ప్రపంచం అబద్ధం కాదు, కానీ మీ మనస్సు సృష్టించుకుంటున్నదే అబద్ధపు ప్రపంచం.

బుద్ధుడి లాంటి మనుషులు ఈ ప్రపంచం అబద్ధమని అంటూ ఉన్నప్పుడు మీరు తప్పుగా అర్థం చేసుకోకూడదు. వాళ్ళు ఈ వృక్షాలన్నీ అబద్ధాలు అని చెప్పడంలేదు, ఈ మనుషులందరూ నిజం మనుషులు కారని అంటున్నారని తప్పుగా అర్థం చేసుకోకూడదు. వాళ్ళు అంటున్నది వాస్తవాన్ని గురించి మీరు ఊహించుకుంటున్నదంతా నిజం కాదని మాత్రమే– మీ మనస్సే ఉంటోంది సత్యంగా ఉండక. ఒక్కసారి ఆ మనస్సును విడిచిపెట్టబడడం జరిగిందంటే, అన్నీ ఉంటాయి సత్యాలై. అప్పుడు మీరుంటారు జీవిస్తూ సమతలో. అప్పుడు మీరు అయివుంటారు తథాతగా – అప్పుడు మీరే సమత.

ఓ ప్రొఫెసర్ తన ఉదయపు ఎనిమిది గంటల తరగతిలోని వాళ్ళకు చెబుతున్నాడు “ఓ రోజును చక్కగా ప్రారంభించేందుకు నేను ఉపయోగించుకుంటున్న చక్కటి పద్ధతి నిద్రలేవగానే అయిదునిముషాలపాటు కసరత్తు చెయ్యడం, గాఢంగా ఉచ్ఛ్వసిస్తూ గాలి పీల్చుకోవడం, ఆ తరువాత చన్నీటి జల్లుతో స్నానం చెయ్యడం. అప్పుడు నేనుంటాను అప్పుడే విరిసిన పారిజాతంలా.”

ఓ నిద్రగొంతు చివరి బెంచీ మీద నుంచి వినిపించింది. “పారిజాతం గురించే ఇంకా కొంచెం మాట్లాడండి సార్!”

మనస్సు ఉంటుంది దేనిమీదకయినా లంఘించేందుకు సంసిద్ధంగా, దేని మీదకు ప్రసారాలు చేయడానికైనా సంసిద్ధంగా. మనస్సుతో చాలా జాగ్రత్తతో

ఉండండి. అదే ధ్యానం అంతా – జాగ్రత్తగా ఉండడం, మనస్సు వల్ల మోసపోకుండా ఉండడం.

అయిదవ విషయం : మనస్సును హిమబిందువులుగా ఊహించండి. అవి ఉంటాయి మహా పెళుసుగా... ఉనికితో ఉంటున్న ఆ కొద్దిపాటి క్షణాలపాటు. జరుగుతుంది సూర్యుడి ఉదయం, వెంటనే అవి ఆవిరి అయిపోతాయి. ఓ చిన్న గాలి వస్తుంది అవి జారి ఎక్కడికో వెళ్ళిపోతాయి. మనస్సు కూడా అంతే. దానికి వాస్తవాన్ని గురించి ఏమీ తెలీదు; శాశ్వతత్వం గురించి దానికి ఏమీ తెలీదు. అది కాలానికి పరిమితమైన సంభవం. హిమబిందువులుగా దాన్ని ఊహించండి. కానీ మీరు అనుకుంటారు దాన్ని ముత్యాలుగా, వజ్రాలుగా – ఎల్లకాలమూ అది శాశ్వతమై ఉండేట్లు.

మరి బుద్ధుణ్ణి మీరు విశ్వసించనక్కరలేదు, కేవలం మీ మనస్సునే మీరు గమనించి చూసుకోండి. కనీసం రెండుక్షణాల పర్యంతంలో అయినా అది ఉండదు సమానంగా. ఎప్పుడూ అది మారిపోతూనే ఉంటుంది. అది ఉంటుంది చంచలంగా. ఒక్క క్షణం 'ఇది'గా ఉంటుంది. మరుక్షణంలో 'అది'గా ఉంటుంది. ఒక క్షణంలో మీరుంటారు ప్రగాఢమైన ప్రేమలో, ఆ మరుక్షణం లోనే మీరుంటారు ప్రగాఢమైన ద్వేషంలో. ఒక క్షణంలో మీరుంటారు మహాసంతోషంగా, మరో క్షణంలో మీరుంటారు మహాదుఃఖంగా. కొంచెం మనస్సును గమనించండి చాలు!

మనస్సును అంటిపెట్టుకుని మీరుంటే, మీరుంటారు మహా కల్లోలంలో. ఎందుకంటే ఎప్పటికీ మీరు నిశ్శబ్దంలో ఉండలేరు కనుక – ఏదో ఒకటి మరేదో ఇంకోటి జరుగుతూనే ఉంటుంది ఎప్పుడూ. ఎప్పటికీ శాశ్వతపు రుచి మీకు కలగనే కలగదు, కేవలం ఆ రుచి మాత్రమే మిమ్మల్ని సాఫల్యుల్ని చేయగలుగుతుంది. కాలం ఉంటుంది నిరంతర ప్రవర్తితంగా.

ఆరవది : మనస్సును ఓ నీటిబుడగలా ఊహించండి. నీటిబుడగల లాగే అన్ని మనస్సు అనుభవాలూ త్వరలోనే లేదా కాస్త ఆలస్యంగా అయినా పేలి అదృశ్యమైపోయి శూన్యత్వం చేతుల్లో మిగులుతూ ఉంటుంది. మనస్సు వెంట పోండి – అదుంటుంది నీటి బుడగలా. మరి అప్పుడప్పుడూ ఆ నీటి బుడగ మహా అందంగా ఉంటుంది. మరి అప్పుడప్పుడూ ఆ నీటి బుడగలు మహా సౌందర్యంతో దర్శనమిస్తూ ఉంటాయి. సూర్యకిరణం దానిమీద పడితే ఇంద్రధనుస్సు అందులో కనిపిస్తుంది. ఇంద్రధనుస్సు లోని అన్ని రంగులూ అందులో కనిపించవచ్చు. మరి అప్పుడది

ఎంతో మనోహరంగానే, అద్భుతంగానే ఉంటుంది కనిపిస్తూ. పరుగెత్తుకుపోయి దాన్ని చేజిక్కించుకునేందుకు ప్రయత్నించండి, ఏ క్షణంలో దాన్ని పట్టుకుంటారో, ఆ క్షణంలోనే అది అక్కడ ఇక ఉండదు.

అదే మీ జీవితంలో ప్రతిరోజూ జరుగుతూనే ఉంటుంది. మీరు ఎప్పుడూ దీని వెనుకో, దాని వెనుకో పరుగులు పెడుతూనే ఉంటారు. ఏ క్షణంలో దాన్ని మీరు చేజిక్కించు కుంటారో ఆ క్షణంలోనే అది ఉండదు మొదటిలా. అప్పుడు అంత అందమూ పోయుంటుంది– ఆ అందం అంతా కేవలం మీ ఊహలో మాత్రమే అప్పటిదాకా ఉంది. అప్పుడు ఆనందం అంతా పోయుంటుంది – ఆ ఆనందం అదివరకు మీ ఆశ లోనే ఉండేది. మీరు ఏర్పడతాయని ఊహించుకుంటూ ఉన్న బ్రహ్మానంద పారవశ్యాలన్నీ, జరగనే జరగవు– అవన్నీ ఉండేది కేవలం మీ ఊహల్లోనే, అవి ఉండేవి కేవలం నిరీక్షిస్తూ.

వాస్తవం మీరు ఊహించుకున్న ఊహల్లోని బుడగలకన్నా పూర్తిగా విభిన్నంగానే ఉంటుంది – మరి అవన్నీ పేలిపోతూ ఉంటాయి. వైఫల్యం భంగపాటును కలిగిస్తుంది. సాఫల్యం కూడా అంతే. సాఫల్యం కూడా భంగపాటునే కలిగిస్తుంది – సాఫల్యాన్ని పొంది ఉన్నవాళ్ళను అడిగి చూడండి. దారిద్ర్యం భంగపాటును కలిగిస్తుంది. సంపద కూడా అంతే– ధనవంతులను అడిగి చూడండి. ప్రతి విషయమూ, మంచిదైనా, చెడ్డదైనా భంగపాటునే కలిగిస్తూ ఉంటుంది. ఎందుకంటే అవన్నీ మానసిక బుడగలు మాత్రమే కాబట్టి. కానీ మనం ఆ బుడగల వెంటే పరుగులు పెడుతూ ఉంటాం. ఆ బుడగలనే తరుముతూ ఉంటాం– వాటిని తరమడం మాత్రమే కాదు. వాటిని ఇంకా పెద్ద బుడగలుగా, మరింత పెద్ద బుడగలుగా, ఇంకా పెద్ద బుడగలుగా చెయ్యాలనుకుంటాం. ప్రపంచంలో ప్రతి అనుభవాన్నీ ఎక్కువ చేసేందుకు ప్రస్తుతం ఓ మహా ఉన్మాదం ఉంటోంది.

ప్రపంచదేశాలన్నిట్లోంచీ వచ్చిన అందరు విద్యార్థులనూ ఏనుగు గురించి తమ స్వంత అభిప్రాయంతో ప్రత్యేక వ్యాసాలను వ్రాయమని అడగబడడం గురించిన ఓ కథ ఉంది. ఓ జర్మన్ విద్యార్థి యుద్ధంలో ఏనుగుల ఉపయోగం గురించి వ్యాసాన్ని వ్రాశాడు. ఓ ఇంగ్లీషు విద్యార్థి ఏనుగుకున్న రాజసిక లక్షణాలను గురించిన వ్యాసాన్ని వ్రాశాడు. ఓ ఫ్రెంచి విద్యార్థి ఏనుగుల సంతానోత్పత్తి గురించిన వ్యాసాన్ని వ్రాశాడు. ఓ ఇండియన్ విద్యార్థి ఏనుగుకున్న ఆధ్యాత్మిక లక్షణాలను గురించిన వ్యాసాన్ని వ్రాశాడు. ఓ అమెరికన్ విద్యార్థి తన వ్యాసరచన కోసం ఈ విషయాన్ని ఎంచుకున్నాడు: అంతకంటే పెద్ద, ఉత్తమమైన ఏనుగులను ఎలా సృష్టించడం?

మనస్సు ఎప్పుడూ ఆలోచిస్తూనే ఉంటుంది - మనస్సు ఉంటుంది ఓ అమెరికన్ లాగా - ఎలా చెయ్యాలి వస్తువుల్ని పెద్దవిగా... ఓ పెద్ద ఇల్లు, ఓ పెద్ద కారు, అన్నీ పెద్దవిగానే ఉండాలి. మరి సహజంగానే, నీటి బుడగ ఎంత పెద్దది అయిపోతూ ఉంటుందో అంతంత దగ్గరగా పేలిపోవడం దగ్గరికే అది చేరుతూ ఉంటుంది. చిన్న చిన్న నీటిబుడగలు ప్రవాహంలో తేలుతూ మరికొంత ఎక్కువ సమయంపాటు ఉండవచ్చు ఉనికితో, పెద్ద నీటి బుడగలు కనీసం తేలనైనా తేలలేకపోతాయి. అందువల్లే కలుగుతున్నాయి అమెరికన్లకు భంగపాట్లు. తక్కిన వేరెవ్వరికీ అమెరికన్లకు ఉన్నంత భంగపాట్లూ, నైరాశ్యాలూ లేవు.

అమెరికన్ మానసం పెద్ద పెద్ద నీటిబుడగల్ని తయారుచెయ్యడంలో కృతకృత్యమైంది, విజయాన్ని సాధించింది; ఇప్పుడు ఆ బుడగలన్నీ పగిలిపోతున్నాయి ప్రతిచోటా. దాన్నిప్పుడు రక్షించుకునే ఏ ఉపాయాలూ లేవు వాళ్ళ వద్ద, వాటిని నిలిపి ఉంచుకునేందుకు; అవన్నీ ఇప్పుడు విస్ఫోటిస్తూ ఉన్నాయి. మరి అందులో ఎవరి తప్పూ ఉండడంలేదు. ఎందుకంటే ఎవరూ ఆలోచించరు "ఇది మా ప్రగాఢ కోరిక. ఇందులో మేము విజయులమయ్యాం" అని. విజయం విధ్వంసం అయినంతగా మరే వైఫల్యాలూ కావు.

ఏడవది : బుద్ధుడు అంటాడు 'మనస్సును ఓ స్వప్నం లాగా ఊహించుకోండి' అని. అది ఉంటుంది భావనగా, వ్యక్తిగతంగా, స్వీయ సృష్టిగా. మీరే దర్శకులు, మీరే నటులు, మీరే ప్రేక్షకులు. మీ మనస్సులో జరుగుతున్న సర్వస్వమూ మీ ఆంతరంగికమైన భావకల్పన; ప్రపంచానికి దానితో ఏ సంబంధమూ లేదు. ఉనికి సర్వస్వానికి దాన్ని సాకారం చెయ్యడానికి ఏ విద్యుక్త ధర్మమూ ఉండదు.

ఓ వైద్యుడు అప్పుడే పూర్తిచేశాడు, ఓ మధ్యవయస్కుడి కంటే కొంచెం పెద్దవాడయిన ఓ అస్వస్థుడికి తను చెయ్యాల్సిన అన్ని భౌతిక వైద్యపరీక్షలనూ. "మీలో ఏ లోపమూ నాకు కనిపించడం లేదండీ" అన్నాడు ఆ వైద్యుడు, "కానీ మీ లైంగికత్వపు జీవితాన్ని దాదాపుగా సగం పాలు మీరు తగ్గించేసుకుంటే మంచిదని నేను చెప్పాల్సే ఉంది" - అని హితవు చెప్పాడు మెల్లగా.

ఆ పెద్దాయన ఓ క్షణంపాటు వైద్యుడి కళ్ళల్లోకి గుచ్చి చూశాడు. తరువాత అన్నాడు "ఏ సగాన్ని? - దాన్ని గురించి ఆలోచించే దాన్నా, దాన్ని గురించి మాట్లాడడాన్నా?"

మనస్సులో ఘనపదార్థం ఏదీ ఉండదు – ఆలోచిస్తున్నా, మాట్లాడుతున్నా; దానికి సత్యం గురించి తెలిసింది శూన్యం. మీ మనస్సు ఎంత ఎక్కువ అయి ఉంటే అంత తక్కువ సత్యతే మీకుంటుంది. మీకు ఎంత తక్కువ మనస్సు ఉంటే అంత ఎక్కువ సత్యత మీకు ఉంటుంది. అమనస్కానికి మాత్రమే తెలుస్తుంది సత్యం అంటే ఏమిటో. సమత అంటే ఏమిటో. మనస్సు లేకుండా మీరుంటే, మీరు ఉంటారు తథాతగా. అప్పుడు మీరయి ఉంటారు ఓ తథాగతుడిగా – సమతను తెలుసుకుని ఉన్నవాడిగా.

ఏనిమిదవది : 'ఊహించండి మనస్సును ఓ విద్యుల్లత లాగా' అంటాడు బుద్ధుడు. దాన్ని పట్టుకోకండి. ఏ క్షణంలో మనస్సును మీరు పట్టుకుంటారో ఆ క్షణం నుండే కష్టాలను మీకోసం మీరే సృష్టించుకుంటారు. ఓ మెరుపు ఆకాశంలో ఓ క్షణమాత్ర కాలంలోనే ఏర్పడుతుంది. ఆ తరువాత మాయమైపోతుంది. అన్నీ వచ్చి వెళ్లిపోతూ ఉంటాయి. ఏవీ మిగిలి ఉండవు. కానీ మనం పట్టుకుంటూనే ఉంటాం. మరి అంటిపెట్టుకుని ఉంటూ ఉండడం వల్లే మనం దైన్యాన్ని సృష్టించుకుంటూనే ఉంటాం.

మీ మనస్సును గమనించండి. భవిష్యత్తు కోసం ఎంతగా అది భయపడుతూ ఉంటుందో గమనించండి, ఓ మార్పుకు ఎంతగా అది భయపడుతూ ఉంటుందో గమనించండి. మనస్సు ప్రతి విషయాన్నీ సుస్థిరం చేసెయ్యాలనే అనుకుంటుంది. జరుగుతున్న ప్రతి విషయాన్నీ పట్టుకోవాలనే అది అనుకుంటూ ఉంటుంది. మీరుంటారు సంతోషంగా. ఆ సంతోషం అలాగే ఉండాలని మీరు అనుకుంటారు. ఆ సంతోషాన్నే మీరు పట్టుకుంటారు. ఏ క్షణంలో దాన్ని పట్టుకుంటారో ఆ క్షణంలోనే దాన్ని మీరు అప్పటికే అణగదొక్కేసి ఉంటారు. అది అప్పుడు అక్కడ ఇక ఉండదు.

ఓ మనిషిని మీరు కలుసుకుంటారు, ఓ అమ్మాయిని మీరు కలుసుకుంటారు. మీరుంటారు ప్రేమలో. మీరు అంటిపెట్టుకుని ఈ ప్రేమ శాశ్వతంగా ఉండాలని వాంఛిస్తారు. ఆ క్షణం లోనే – ఏ క్షణంలో ఆ ప్రేమ శాశ్వతం అయిపోవాలని మీరు కోరుకుంటారో – అది అయిపోయి ఉంటుంది మాయం. ఇక అది అక్కడ ఉండదు. అన్ని మానసికానుభవాలూ ఉంటాయి మెరుపులలాగే. అవి వస్తాయి, వెళ్ళిపోతాయి.

బుద్ధుడు అంటాడు : మీరు కేవలం గమనించండి. దేన్నీ పట్టుకునేంత సమయం లేదు! దాన్ని గమనించండి చాలు. గుర్తించండి దాన్ని : "తలనొప్పి, తలనొప్పి", "ప్రేమ, ప్రేమ", "అందం, అందం". కేవలం దాన్ని గుర్తించండి. అది

చాలు. అదెంతో స్వల్పమైన సమయం. అంతకుమించి చేసేందుకు అక్కడ ఏమీ ఉండదు. గుర్తించండి. ఎరుకతో ఉండండి.

ఎరుకతో ఉండడమే మీ శాశ్వతత్వం కాగలుగుతుంది – ఇంకేదీ అవ్వదు.

మరి చివరిది, తొమ్మిదవది : బుద్ధుడు అంటాడు, మానసిక అనుభవాలను మేఘాల లాగా ఊహించండి. వాటి స్వరూపాలు మారిపోతూ ఉంటాయి. ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉంటాయి. మేఘాన్ని గమనించండి : అప్పుడప్పుడూ అది ఓ ఏనుగులాగా కనిపిస్తుంది. మరి వెంటనే అది మారిపోవడం ప్రారంభమైపోయి ఓ ఒంటెనో, గుర్రమో అక్కడ కనిపిస్తుంది, ఇంకా మరెన్నో కనిపిస్తాయి. మేఘం ఉండదు ఎప్పుడూ స్తబ్దంగా; ఎన్నో స్వరూపాలు ప్రత్యక్షం అవుతూ, అదృశ్యం అయిపోతూ ఉంటాయి. కానీ ఏ దిగులూ ఉండదు మీకు – మనకు ఏం పట్టింది అది ఓ ఏనుగులా కనిపిస్తే లేకపోతే ఓ ఒంటెలాగా దర్శనమిస్తే? అది ఏమయిపోయినా పరవాలేదు. అది ఓ మేఘం మాత్రమే.

మనస్సు కూడా అదేవిధంగా మీ చైతన్యాన్ని కమ్మి ఉన్న ఓ మేఘమే. మీ చైతన్యమే ఆకాశం, మరి మీ మనస్సే మేఘం. అప్పుడప్పుడూ అది ఉంటుంది ఓ కోపం మేఘంగా, అప్పుడప్పుడూ అది ఉంటుంది ఓ ప్రేమ మేఘంగా. అప్పుడప్పుడూ అది ఉంటుంది ఓ అసూయా మేఘంగా – కానీ ఇవన్నీ ఒకే శక్తికి ఉన్న బహు స్వరూపాలు మాత్రమే. దేన్నీ ఎంచుకోకండి. దేనికీ అంటిపెట్టుకుపోకండి. మేఘంలోని ఓ ఏనుగు రూపానికి మీరు అంటుకున్నారంటే మీరు తప్పకుండా దైన్యంలోనే ఉంటారు. మరుక్షణంలో ఆ ఏనుగు వెళ్ళిపోయి ఉంటుంది. మీరు ఉంటారు అరుస్తూ, ఏడుస్తూ. కానీ ఎవరిది బాధ్యత? మీ ఏడుపుకు బాధ్యత మేఘానిదా? మేఘం తన ప్రకృతి స్వాభావికతనే అనుసరిస్తోంది. మీరు కేవలం దాన్ని గుర్తుతెచ్చుకోండి – ఓ మేఘం ఉంటుంది మారిపోయేందుకే. మనస్సు కూడా అంతే.

మీ అంతరాకాశంలో నుండే గమనించండి, మేఘాలను తేలిపోతూ ఉండనివ్వండి. మీరు ఉండండి కేవలం సాక్షులై. మరి మరచిపోకండి, మేఘాలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. మీరుండాలి దేన్నీ పట్టించుకోకుండా.

అలా దేన్నీ పట్టించుకోకుండా ఉండే తత్వానికి బుద్ధుడు ఎంతో విలువను ఇచ్చాడు. ఆయన అన్నాడు ఆ తత్వాన్ని ‘ఉపేక్ష’ అని. మీరుండండి దేన్నీ పట్టించుకోకుండా “ఏం వచ్చినా, ఏం రాకపోయినా పరవాలేదు”.

ఇద్దరు అంతరిక్ష యాత్రికులు – ఓ పురుషుడూ, ఓ స్త్రీ, అంగారకగ్రహ యాత్ర చేశారు, ఆ గ్రహాన్ని సందర్శించేందుకు. అంగారకగ్రహ వాసులు వాళ్ళను ఎంతో సాదరంగా ఆహ్వానించారు. వాళ్ళకు తమ గ్రహంలోని అన్ని విషయాలనూ, ప్రదేశాలనూ, విశేషాలనూ తిప్పి చూపించాలని మహోత్సాహంతో ఆనందపడుతూ ఉన్నారు. కొద్దిరోజులు గడిచాక యాత్రికులు అంగారకవాసులను అడిగారు "మీ గ్రహంలో జీవోత్పత్తి ఎలా జరుగుతుందో చెప్పండి" అని ఓ అత్యంత నిశితమైన ప్రశ్నను మొహమాటపడుతూ అతిమెల్లగా అడిగారు.

అంగారకగ్రహం నాయకుడు వాళ్ళను ఓ ప్రయోగశాలకు తీసుకెళ్ళాడు. అక్కడ ఆ యాత్రికులకు జీవోత్పత్తి క్రమాన్ని అంతా చూపించాడు. ముందుగా ఓ తెల్లటి ద్రవాన్ని జాగ్రత్తగా కొలిచి ఓ గొట్టంలోకి పోశాడు, తరువాత అతి జాగ్రత్తగా ఓ గాఢ గోధుమరంగు పొడిని ఆ తెల్లద్రవం మీద కొంత చిలకరించాడు. ఆ మిశ్రమాన్ని కాసేపు పూర్తిగా కలిపాడు, తరువాత దాన్ని కొంచెం ప్రక్కకు ఉంచాడు. తరువాత అంతరిక్ష యాత్రికులతో అన్నాడు, ఆ మిశ్రమాన్ని మరిక ముట్టుకోకుండా, తొమ్మిదినెలలపాటు అలాగే ఉంచేస్తే అందులోంచి ఓ నవ్య అంగారకజీవి జననం సంభవిస్తుందని వివరించాడు.

ఆ తరువాత అంగారకగ్రహ వాసులకు భూమ్మీద జీవోత్పత్తి ఎలా జరుగుతుందని ప్రశ్నించే వంతు వచ్చింది. ఈ యాత్రికులు ఆ ప్రశ్న వినబడగానే ఎంతో ఇబ్బంది పడిపోయారు; చివరికి, ఎలాగయితేనేం, తగినంత ధైర్యాన్ని చిక్కబట్టుకున్నారు, ఆ జీవోత్పత్తి ప్రయోగం ఎలా జరుగుతుందో అంగారకగ్రహ వాసులకు ప్రత్యక్షంగా ఆచరించి చూపించేందుకు. రతికార్యాన్ని ప్రారంభించారు. కానీ అంగారకవాసుల ఘొల్లుమనే నవ్వులు హఠాత్తుగా వినిపించేసరికి వాళ్ళ ప్రయత్నానికి అంతరాయం కలిగింది.

"ఏముంది ఇందులో వింత?" అంతరిక్ష యాత్రికులు అడిగారు.

"ఆ విధంగానే" అన్నారు అంగారక నాయకుడు – "మేము తయారుచేస్తాం నెస్‌కాఫీని."

అన్నీ స్వరూపాకృతులే... మానవుడు వాటి గురించి ఏ బెంగా పడకూడదు. కేవలం వాటిని గమనించండి. మనస్సును గురించి ఊహించండి ఇలా :

**నక్షత్రాలుగా, ఓ దృష్టి దోషంగా, ఓ వెలుగుతున్న దీపంగా,**
**ఓ బూటక ప్రదర్శనంగా, మంచుబిందువుల్లా, లేదా ఓ నీటిబుడగలా,**

**ఓ కలగా, ఓ మెరుపులా, లేదా ఓ మేఘంగా**
**అలాగే చూడాలి మనిషి నియమితమై తీరి ఉన్నదాన్ని.**

అప్పుడు ఆ తీరి ఉండడాలన్నీ అయిపోతాయి అదృశ్యం, మీరు చేరుకుంటారు తీరులూ ఉండని సహజస్థితి లోకి. ఆ అనియమితతే సమత, సత్యం, వాస్తవం – యధాభూతమ్.

ఇప్పుడు సూత్రం :

*భగవానుడు అడిగాడు : నువ్వేమనుకుంటున్నావు, సుభూతీ,*
*తథాగతుడికి అనిపించి ఉంటుందా 'ధర్మం నా వల్ల*
*పరిబోధింపబడింది' అని? ఎవరైనా, సుభూతీ, 'తథాగతుడిచే*
*ధర్మం పరిబోధింపబడింది' అని అన్నారంటే ఆ మాట తప్పే*
*అయిపోతుంది, లేని దేన్నో పట్టుకున్న ఆ మనిషి నన్ను సరిగా*
*పరిదర్శింపజేయలేదు కాబట్టి. మరి ఎందుకు?...*
*ఎందుకంటే ఏ అత్యల్ప ధర్మమైనా అక్కడ దర్శించేందుకు లేదు కనుక,*
*గ్రహించేందుకు లేదు కనుక. అందువల్లే అంటున్నాం దాన్ని*
*'పరిపూర్ణ సంప్రజ్ఞత' అని.*
*పైగా సుభూతీ, స్వైయైక్యతయే ఆ ధర్మం అయివుంటూ*
*ఏ వైరుధ్యాలూ ఉండవు అందులో. అందువల్లే దాన్ని అంటున్నాం*
*'పరిపూర్ణ సంప్రజ్ఞత' అని.*
*స్వైయైక్యతే 'నేను' ఉండకపోవడం వల్ల,*
*'జీవుడు' ఉండకపోవడం వల్ల, 'ఆత్మ' ఉండకపోవడం వల్ల*
*'వ్యక్తి' ఉండకపోవడం వల్ల, పరమంగా ఉంటూ ఒప్పైన*
*'పరిపూర్ణ సంప్రజ్ఞత' అయివుంటూ, ధర్మ సర్వస్వం*
*పరిపూర్ణంగా పూర్తిగా తెలియబడి ఉంటోంది...*

బుద్ధుడు అడిగాడు :

***నువ్వేమనుకుంటున్నావు, సుభూతీ, తథాగతుడికి అనిపించి ఉంటుందా***
***ధర్మం నా వల్ల పరిబోధింపబడింది' అని?***

ఓ తథాగతుడికి అలా అనిపించదు, ఎందుకంటే ఆయనలో ఏ మూర్తిత్వమూ ఉండడం లేదు కనుక. 'మూర్తిత్వం' అన్నది ఓ మానసిక స్వరూప ఆకారం. 'నేను' అన్న ఊహ మేఘాల్లో ఉన్న ఓ స్వరూపం. ఓ తథాగతుడికి, మేఘాలన్నీ అదృశ్యం

అయిపోయి ఉంటాయి, ఆయనకు స్వచ్ఛమైన ఆకాశం మాత్రమే ఉంటుంది – వర్ణనాతీతమైనదీ, అనంతమైనదీ. అక్కడ 'నేను' అన్న ఊహ రేగదు.

కాబట్టి ఓ తథాగతుడు చెప్పలేదు "ధర్మాన్ని నేను పరిబోధించాను" అని. ముందుగా, ఆయనే లేడు; తరువాత, ఆయన అదృశ్యం అయిపోయి ఉన్నాడు కనుక, ఇప్పుడు ఆయనకు ఎవరూ లేరని తెలుసు.

ఉదాహరణకోసం, మీరందరూ ఈ రాత్రి నిద్రపోతారు. మీరు అందరూ కలలు కంటూ ఉంటారు. ఎవరో ఏదో చెప్పడం ప్రారంభిస్తారు, ఎవరో మూల్గడం ప్రారంభిస్తారు. ఇంకెవరో అరుస్తూ ఉంటారు. మేలుకున్న ఓ మనిషి, ఏమనుకుంటాడు? మీ అందర్నీ చూసి నవ్వుకుంటాడు – ఎందుకంటే కలలు కలలు మాత్రమేనని ఆ మనిషికి తెలుసు కనుక, అవి వాస్తవాలు కావని ఆ మనిషికి తెలుసు కనుక.

ఎవరో మూలుగుతూ ఉంటారు. ఎవరో ఏడుస్తూ ఉంటారు, ఎవరో అరుస్తూ ఉంటారు, ఇంకెవరో బ్రహ్మానందంలో ఉంటూ నవ్వుతూ ఉంటారు – ఆ మనిషికి అవన్నీ అబద్ధాలేనని తెలుసు. అక్కడ నవ్వేందుకు ఏ కారణమూ లేదు, అక్కడ ఏడుపు వచ్చేందుకు ఏ కారణమూ లేదు. అన్నీ అబద్ధాలే. మనుషులు అందరూ నిద్రపోతూ ఉన్నారు. ఆ మనిషి ఏడుస్తూ ఉన్న మనిషి వద్దకు వెళ్ళి ఓదారుస్తూ ఉంటాడు "ఏడవకు" అని చెబుతూ. అక్కడ ఓ మనిషి నవ్వుతూ ఉంటే ఈ మనిషికి ఆనందం కలగదు. ఆ మనిషికి తెలుసు అందరూ కలలు కంటూ ఉన్నారని.

ఇదే తథాగతుడి పరిస్థితి కూడా, ఓ బుద్ధుడి పరిస్థితి ఇదే. తన అంతరాకాశాన్ని తెలుసుకుని ఉన్న మనిషికి అప్పుడు తెలుసు అందరూ ఆ ఆకాశమే అని. కానీ ప్రతిమనిషీ మబ్బులు పట్టి ఉంటాడు. ఆ మబ్బులన్నీ అబద్ధాలే, ఊహాత్మకాలే. మరి ఆ మేఘాలన్నీ అబద్ధాలే అయితే ఊహాత్మకాలే అయితే అప్పుడక్కడ ఏ జీవుళ్ళూ లేరు. తథాగతుడు అప్పుడు ధర్మాన్ని ఎవరికి పరిబోధింపగలుగుతాడు? ఎవరూ లేరు అక్కడ. నిర్మలమైన ఆకాశం మాత్రమే ఉంది. ఏ క్షణంలో మీరు అదృశ్యం అయిపోతారో, సర్వజీవులూ అదృశ్యం అయిపోతాయి. అప్పుడు ప్రత్యేకంగా ఏ జీవులూ ఉండవు. అంతా ఒక్కటే అయి ఉంటుంది. గురువులాంటి వాడూ, శిష్యుడిలాంటి వాడూ ఎవడూ ఉండడు అక్కడ.

అందువల్లే మొన్న ఆ మధ్య నేను మీతో అన్నాను ఇదంతా ఒక ఆట మాత్రమేనని. ఓ మహా నాటకాన్నే మనమిక్కడ ఆడుకుంటూ ఉంటున్నాం. ఇది ఓ ప్రాచీనమైన నాటకం. ఎన్నోసార్లు ప్రదర్శింపబడిన నాటకం – బుద్ధుడితో మరి

ఆయన శిష్యులతో ఆ నాటకం ఆడుకోబడింది. క్రీస్తుతో మరి ఆయన శిష్యులతో ఆ నాటకం ఆడుకోబడింది. కృష్ణుడితో మరి ఆయన శిష్యులతో ఆ నాటకం ఆడుకోబడింది. అదే నాటకం ఇప్పుడు కూడా జరుగుతోంది. మీ వైపు నుంచి ఇది ఉంటుంది మహా వాస్తవమైన విషయంగా, ఓ శిష్యుడు అయి ఉండడం, నా వైపు నుండి అది ఉండదు గంభీరం గానూ, గాంభీర్యం లేకుండానూ. అదుంటుంది కేవలం ఓ మేఘంలా. మరి ఇక్కడి నా ప్రయత్నమంతా అది అంతా ఓ మేఘం అని మీరు తెలుసుకునేలా సహాయపడడం మాత్రమే. అవన్నీ మేఘాల్లో కనిపిస్తున్న స్వరూపాలు మాత్రమే.

మరి ఏ రోజున మీ మేలుకొలుపు అవుతుందో ఆ రోజే మీరు తప్పకుండా నవ్వుకుంటారు. ఎందుకంటే సాధించేందుకు అక్కడ ఏదీ లేదు కనుక – పోయేదేమీ ఉండదు, వచ్చేదేమీ ఉండదు. అన్నీ అలాగే ఉంటాయి ఎప్పుడూ అవి అలాగే ఉన్నట్లే, ఆది నుంచి అంతం దాకా సమానంగా. మేఘాలు కమ్ముకుంటే ఆకాశం పరివర్తితం అయిపోతుందని మీరు అనుకుంటారా? ఎండాకాలం వచ్చేసి మేఘాలన్నీ అదృశ్యం అయిపోతే ఆకాశం మారిపోతుందని మీరు అనుకుంటారా? మీకు అనిపిస్తుందా ఆకాశానికి ఏ మార్పో వచ్చేసి ఉందని? ఆకాశం ఉంటుంది ఎప్పటికీ సమానంగానే. మేఘాలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి.

సంసారం కూడా అంతే – ప్రపంచం కూడా అంతే, మనస్సు కూడా అంతే.

బుద్ధుడు అడుగుతున్నాడు :

> ***భగవానుడు అడిగాడు : నువ్వేమనుకుంటున్నావు, సుభూతీ, తథాగతుడికి అనిపించి ఉంటుందా 'ధర్మం నా వల్ల పరిబోధింపబడింది' అని? ఎవరైనా, సుభూతీ, 'తథాగతుడిచే ధర్మం పరిబోధింపబడింది' అని అన్నారంటే ఆ మాట తప్పే అయిపోతుంది, లేని దేన్నో పట్టుకున్న ఆ మనిషి నన్ను సరిగా పరిదర్శింపజేయలేదు కాబట్టి.***

అక్కడ నేనూ లేను, మీరూ లేరు. అక్కడ గురువూ లేడు, శిష్యుడూ లేడు. పరిబోధించడానికి అక్కడ ఏ ధర్మమూ లేదు. అన్నీ ఉంటాయి ఉన్నదున్నట్లుగానే. పట్టుకోడానికి అక్కడ ఏమీ ఉండదు. నేర్చుకోవడానికి అక్కడ ఏమీ ఉండదు. మరి ఎందుకు?

> **ఎందుకంటే ఏ అత్యల్ప ధర్మమైనా అక్కడ దర్శించేందుకు లేదు కనుక, గ్రహించేందుకు లేదు కనుక. అందువల్లే అంటున్నాం దాన్ని 'పరిపూర్ణ సంప్రజ్ఞత' అని.**

బుద్ధుడు అంటున్నాడు : అందువల్లే దాన్ని మనం 'పరిపూర్ణ సంప్రజ్ఞత' అంటున్నాం. 'సంప్రజ్ఞత' అంటే ఏమిటో సరయిన అవగాహన లేని ఇతర మతాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకోసం. క్రైస్తవ సంప్రజ్ఞత్వపు త్రిమూర్తిత్వ ఊహ - తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ. దీనికి అర్థం మహోత్తమ తలం చివర్లో క్రైస్తవంలో మూడు ప్రత్యయాలు, విభజనలు ఉన్నాయనే. దానికి అర్థం ఓ మేఘం అక్కడ నిలిపి ఉంచుకోబడిందనే. ఓ స్వరూపాకారం అక్కడ నిలుపుకోబడిందనే. ఓ వ్యాపకం మిగలబెట్టుకోబడిందనే. ప్రపంచం ఇంకా కొంచెం మిగిలి ఉంటోంది అక్కడ. మనస్సును విడిచిపెట్టెయ్యడం పూర్తిగా అక్కడ జరగలేదు.

హైందవపు ఊహ మరింత ఉదాత్తంగా ఉంటుంది. పరమంలో రెండు మాత్రం మిగిలి ఉంటాయి; దేవుడు, ఆత్మ. మూడు కంటే ఉత్తమం. అయినా రెండు ఉన్నాయి. ద్వంద్వత్వం. ద్వంద్వాలన్నీ మనస్సువే. మనస్సే విషయాలను విభజిస్తూ ఉంటుంది. మనస్సే నిర్వచిస్తూ ఉంటుంది. కాబట్టి దీన్ని కూడా 'పరిపూర్ణ సంప్రజ్ఞత' అని చెప్పుకోవడానికి వీల్లేదు.

జైన ప్రజ్ఞలో కేవలం ఒక్కటి మాత్రమే మిగిలి ఉంటుంది : ఆత్మ. ఇది ఎంతో శ్రేష్టమై ఉంది - క్రైస్తవం కన్నా ఉత్తమం - హైందవం కన్నా ఉత్తమం. కేవలం ఒక్కటి మాత్రమే పరమంలో మిగిలి ఉంటుంది : ఆత్మ. కానీ బుద్ధుడు అంటాడు అది కూడా పరిపూర్ణ సంప్రజ్ఞత కాదని. ఎందుకంటే ఒక్కదాన్ని గురించి ఆలోచించాలంటే రెండవదాన్ని గురించి కూడా ఆలోచించాల్సిన అవసరం ఏర్పడుతుంది కనుక, మూడు గురించీ, నాలుగు గురించీ, అయిదు గురించీ కూడా ఆలోచించాల్సే వస్తుంది. 'ఒక్కటి' అని మాట చెప్తే చాలు మొత్తం దాన్తోబాటు వచ్చేస్తాయి. ఒకటిని రెండవది లేకుండా నిర్వచించడం కుదిరే పని కాదు.

'ఒకటి' అంటే ఏమిటి మీ అర్థం? 'రెండు కాదని' మీరు చెప్పాల్సి వస్తుంది. కాబట్టి ఓ నిర్వచనాన్ని చేసుకునేందుకోసం అయినా రెండవది కావాల్సి వస్తుంది. ఆ రెండవది అక్కడే ఎక్కడో దాక్కుని ఉంటుంది, కానీ పూర్తిగా మాయం అయిపోయి ఉండదు. 'నేను' అక్కడ ఉంటే 'నువ్వు' కూడా అక్కడ ఉంటావు. అది అయిపోదు అదృశ్యం పూర్తిగా. 'నేను'కు 'నువ్వు' కావాలి; 'నేను' ఉనికితో ఉండేందుకోసం 'నువ్వు'

ఉనికి ఉండితీరాల్సి వస్తుంది. 'నేను' ఉంటుంది 'నువ్వు'తో బాటే. ఆ రెండూ కలిసే ఉంటాయి, నేను-నువ్వు ఒకే వాస్తవం.

కాబట్టి బుద్ధుడు అంటాడు 'నేను' కూడా అదృశ్యం అయిపోవాలని. అప్పుడు ద్వంద్వత్వమూ, త్రిమూర్తిత్వాలు కూడా పూర్తిగా అదృశ్యం అయిపోతాయి. పరమ అనుభవంలో మూడూ ఉండదు, రెండూ ఉండదు, ఒకటి కూడా ఉండదు. ఉంటుంది నిర్మల ఆకాశం మాత్రమే – శూన్యత్వం, ఏ జీవీ ఉండదు, ఏ మూర్తీ ఉండదు. అదుంటుంది సున్నగా, శూన్యతగా.

అందువల్లే బుద్ధుడు అంటున్నాడు, దీన్ని...

***...'పరిపూర్ణ సంప్రజ్ఞత' అని. పైగా సుభూతీ, స్వీయైక్యతయే***  
***ఆ ధర్మం అయివుంటూ ఏ వైరుధ్యాలూ ఉండవు అందులో.***  
***అందువల్లే దాన్ని అంటున్నాం 'పరిపూర్ణ సంప్రజ్ఞత' అని.***  
***స్వీయైక్యతే 'నేను' ఉండకపోవడం వల్ల,***  
***'జీవుడు' ఉండకపోవడం వల్ల, 'ఆత్మ' ఉండకపోవడం వల్ల***  
***'వ్యక్తి' ఉండకపోవడం వల్ల...***

అన్ని స్వరూపాలూ అదృశ్యం అయిపోయాయి. అందువల్లే నిర్మలాకాశం తనతోనే సమీకరించుకుని ఉంటోంది. ఇక అప్పుడు ఏ స్వరూపాలూ ప్రత్యక్షం అవుతూ, అదృశ్యం అయిపోతూ ఉండడం లేదు, ఏ మార్పూ ఇక జరుగుతూ ఉండడంలేదు. ఏ చలనమూ ఉండడంలేదు. అన్ని స్వప్నాలూ అదృశ్యం అయిపోయాయి. అది ఉదయం. అయింది సూర్యోదయం. మనిషి ఉన్నాడు మేలుకుని. ఉందక్కడ ఎరుక. కానీ 'నాకు ఎరుక ఉంది' అని చెబుతున్న వాడెవ్వడూ లేడు అక్కడ. ఏ బోధనలూ లేవు. 'నేను బోధిస్తున్నవాణ్ణి' అని చెబుతున్న వారెవరూ లేరక్కడ. ఓ మార్గం ఉంది. కానీ అదుంటోంది మార్గం కాని మార్గమై దాదాపుగా. పద్ధతులు – ఉన్నాయి కానీ శిష్యుడివైపు నుంచి మాత్రమే ఉన్నాయి. గురువువైపు నుంచి అన్ని పద్ధతులూ అయిపోయాయి మాయం.

***నువ్వేమనుకుంటున్నావు, సుభూతీ, ఓ తథాగతుడికి అనిపించి***  
***ఉంటుందా 'సర్వజీవులూ నా వల్ల విముక్తి పొందారు' అని?***  
***ఆ విధంగా దాన్ని నువ్వు చూడకూడదు! సుభూతీ, మరి ఎందుకు?***  
***తథాగతుడు విముక్తిని తెప్పించిన ఏ జీవీ లేదు కనుక...***

ఎలా ఉదయించగలుగుతుంది ఆ ఊహ ఓ తథాగతుడిలో – "సర్వజీవులకూ విముక్తిని నేను తెప్పించాను" అని? ముందుగా, బంధవిముక్తులు కానివారెవ్వరూ అక్కడలేరు. కాబట్టి "బుద్ధుడు ఓ రక్షకుడా?" అని మీరు అడిగితే, బుద్ధుడు అంటాడు తప్పకుండా "కాదు, నేను రక్షకుణ్ణి కాను – ఎందుకంటే రక్షింపబడాల్సినవాళ్ళు ఎవ్వరూ లేరు కనుక. రక్షింపబడేవాళ్ళు ఎవరూ లేరు" అని. స్వాతంత్ర్యమే సర్వుల సహజ నైజం. స్వాతంత్ర్యం ఉందక్కడ. ఎవ్వరూ దాన్ని పట్టుకురానక్కరలేదు. ఓ మనిషి కేవలం ఉన్నదాన్ని చూడగలిగితే చాలు. కాబట్టే బుద్ధుడు అంటున్నాడు :

*తథాగతుడు విముక్తిని తెప్పించిన ఏ జీవీ లేదు కనుక...*

*ఇంకా ఆ సందర్భంలో భగవానుడు ఈ పద్యపాదాలను*
*భాషించాడు :*
*ఓ స్వరూపంగా నన్ను దర్శిస్తున్నవాళ్ళు,*
*నా స్వరాన్నే అనుసరించినవాళ్ళు*
*తప్పు ప్రయత్నాలనే తద్విధంగా చేస్తూ,*
*దర్శించలేరు నన్ను.*

బుద్ధుడిని ఓ స్వరూపంగా మీరు దర్శిస్తే, ఓ శరీరంగా మీరు దర్శిస్తే, అప్పుడు మీరు పోగొట్టుకున్నవాళ్ళే అవుతారు. మీరు బుద్ధుడి స్వరాలను మాత్రమే వింటూ, ఆయన నిశ్శబ్దాన్ని వినలేకపోతూ ఉంటే, పోగొట్టుకున్నవాళ్ళే అవుతారు. ఆయన ముఖాన్నే మీరు చూస్తూ ఆయన అంతరాకాశాన్ని చూడలేకపోతూ ఉంటే, పోగొట్టుకున్నవాళ్ళే అవుతారు.

బుద్ధుడు కేవలం పరిపూర్ణ నిశ్శబ్దాన్ని మాత్రమే బోధిస్తాడు. బుద్ధుడు అక్కడ ఉంటాడు స్వరూపంతో కేవలం స్వరూప రాహిత్యాన్ని బోధించేటందుకే. ఈ పద్యవాక్యాల్ని గుర్తుపెట్టుకోండి. నేను కూడా మీకు దీన్నే చెబుతూ ఉంటాను :

*ఓ స్వరూపంగా నన్ను దర్శిస్తున్నవాళ్ళు,*
*నా స్వరాన్నే అనుసరించినవాళ్ళు*
*తప్పు ప్రయత్నాలనే తద్విధంగా చేస్తూ,*
*దర్శించలేరు నన్ను.*
*ధర్మంలోనే జీవి బుద్ధుణ్ణి దర్శించాలి*
ఆకాశపు దృక్పథంవైపు నుంచి, మేఘపు దృక్పథంవైపు నుంచి కాదు.

*ధర్మంలోనే జీవి బుద్ధుణ్ణి దర్శించాలి*
*ధర్మదేహం లోంచే లభిస్తుంది వాటికి మార్గదర్శకత్వం.*
*అయినా ధర్మపు సత్యస్థితి అసాధ్యం గ్రహణానికి.*
*ఓ దృశ్యవస్తువుగా ఆ స్థితిని ఎవ్వరూ ఎరుకనొందరాదు...*

ఈ మాటలు మాటలతో చెప్పడానికి వీలులేనిదాన్ని చెప్పేందుకోసం పలుకబడుతున్నాయి – వాచ్యాతీతాన్ని. మాటలతో చెప్పేందుకు వీల్లేని దాన్ని. బుద్ధుడు అంటున్నాడు: బుద్ధుడి మార్గదర్శకత్వం ఎక్కణ్ణుంచి వస్తుంది? స్వయంగా బుద్ధుడి వద్ద నుంచే రాదు. కానీ అదొస్తుంది శాశ్వతం నుంచి, ఆకాశం నుంచి. బుద్ధుడు ఉంటాడు కేవలం ఓ ప్రవాళికగా. శాశ్వతం ఆయన లోంచే తేలుతూ వస్తుంది. ఆయన పలుకుతున్న మాటలనే పట్టుకుని ఉండిపోకండి వ్యసనంతో, వినండి ఆయన నిశ్శబ్దాన్ని. ఆయన ఉంటున్న దేహాన్ని పట్టించుకోకండి ఓ వ్యసనంతో, ఆయన ఉంటున్న ఇంటిని అంతగా పట్టించుకోకండి. ఆయన అంతఃప్రత్యక్షాన్నే ఆలోచించండి, ఆయన ఉనికినే ఊహించండి, ఆయన ఆంతర్యాన్నే గ్రహించండి. ఆయన ప్రగాఢతనే దర్శించండి.

బుద్ధుడి ఆంతర్యాన్ని, ప్రగాఢతను ఎలా దర్శించడం? బుద్ధుడి ఆంతర్యాన్ని దర్శించడం కళ్ళు తెరుచుకుని చూస్తే సాధ్యపడేది కాదు. కళ్ళు మూసుకునే ఆయన ఆంతర్యాన్ని దర్శించాలి. కళ్ళు మూసుకుని మీ ఆంతర్యాన్ని చూసుకోవడమే బుద్ధుడి ఆంతర్యాన్ని దర్శించడం అంటే. మీ అంతరాకాశాన్ని స్వపరిచయంతో మీరు దర్శించుకోగలిగితే బుద్ధుడి అంతరాకాశాన్ని కూడా మీరు దర్శించుకోగలుగుతారు – సర్వకాలాల్లోని సర్వబుద్ధుళ్ళ అంతరాకాశాలను. గతంలోని, ప్రస్తుతపు, భవిష్యత్ బుద్ధుళ్ళ అంతరాకాశాలను కూడా. మీ జీవుడిలోకే మీరు దిగిపోండి.

*ఎవరైనా తథాగతుడు 'వెళ్తూంటాడు, వస్తూంటాడు,*
*నుంచుంటాడు, కూర్చుంటాడు, పడుకుంటాడు' అని అంటున్నారంటే*
*ఆ మనిషికి నా బోధ అర్థం కాలేదనే అర్థం. మరి ఎందుకు?*
*'తథాగతుడు' అని ఎక్కడికీ పోనివాణ్ణే, ఎక్కణ్ణుంచో రానివాణ్ణే అంటాం.*
*అందువల్లే అంటాం 'తథాగతుడు' అని, 'అర్హతుడు' అని,*
*'పరిపూర్ణ సంప్రజ్ఞుడు' అని.*

మేఘాలు వచ్చేసి ఉన్నప్పుడు, మీరు అనుకుంటారా ఆకాశం ఎక్కడికో వెళ్ళిపోయిందని? మేఘాలన్నీ వెళ్ళిపోయిన తరువాత, మీరు అనుకుంటారా, ఆకాశం

ఎక్కణ్ణుంచో తిరిగి వచ్చేసిందని? ఆకాశం ఎప్పుడూ ఉంటుంది. మీ అంతర్నైజం కూడా, మీ మహాంతర్ప్రకృతి కూడా ఎప్పుడూ ఉంటుంది.

ఒకప్పుడు మీరు ఓ రాయి అయి ఉండేవాళ్ళు. శిల ఆకారాన్ని ధరించిన ఓ మేఘం అది; మీరు జీవించి ఉండేవారు ఖనిజ ప్రపంచంలో. తరువాత మీరు ఓ వృక్షం అయ్యారు; మీ స్వరూపాన్ని మీరు మార్చుకున్నారు; మీరు ఓ రోజా పొద అయ్యారు. లేదా ఓ లెబనాన్‌లోని ఓ పైన్ (దేవదారు) వృక్షమో, సెడార్ (దేవదారు) వృక్షమో అయ్యారు. కానీ మీ అంతఃప్రకృతి అదేగా, సమానంగా ఉండేది. ఇప్పుడు ఆ మేఘ స్వరూపం మారింది. మీరు జీవించారు అప్పుడు వృక్ష సామ్రాజ్యంలో. తరువాత మీరు జంతువు అయ్యారు – బహుశా సింహమో, పులో, మొసలో, జింకో, కుక్కో. కేవలం ఆకార స్వరూపం మాత్రమే మారింది. కానీ మీ అంతఃప్రకృతి అదేగా, సమానంగా ఉంది. తరువాత మీరు ఓ పురుషుడో, స్త్రీయో అయ్యారు– మళ్ళీ స్వరూపం మారుతూ ఉంది. మీరు స్వర్గంలో ఓ దేవుడో, దేవతో కావచ్చు – కేవలం స్వరూపం మాత్రమే మారుతుంది.

ఒక స్వరూపం లోంచి మరో స్వరూపం లోకి మీరు వెళ్ళిపోతూ ఉండిపోవచ్చు. ఓ స్వరూపంతో మరణిస్తూ, మరో స్వరూపంతో జన్మిస్తూ ఉండవచ్చు. దీన్నే అంటారు 'సంసారం' అని; స్వరూపంలో ఇరుక్కుపోవడం, తరువాత మరో స్వరూపంలోకి చిక్కుకుపోవడం, ఒక స్వరూపం నుండి మరో స్వరూపంలోకి, ఓ ఖైదు నుండి మరో ఖైదులోకి.

ఏమిటి 'బుద్ధత్వం' అంటే? శిలలలోనూ, జంతువులలోనూ, వృక్షాలలోనూ, స్త్రీ పురుషుల్లోనూ ఉన్న అంతరాకాశాన్ని ఎరుక పట్టడమే. మీ అంతరాకాశాన్ని మీరు ఎరుక పట్టారంటే అన్ని స్వరూప బంధాల నుంచీ మీరు విముక్తులు అవుతారు. అదే స్వాతంత్ర్యం. మీరు స్వేచ్ఛులు అయిపోతారని కాదు... ఎందుకంటే ఆ స్వాతంత్ర్యంలో మీ ఉనికే ఉండదు. మీరు ఉండలేరు ఉనికిలో.

'మీరు విముక్తులు అవుతారు' అంటే 'మీ నుంచే మీరు విముక్తులు అవుతారని' అర్థం. అన్ని 'నేను'లూ స్వరూపాలే. శిలకో 'అహం' ఉంటుంది, ఓ ఆత్మ ఉంటుంది. వృక్షానికో ఆత్మ ఉంటుంది. జంతువుకో ఆత్మ ఉంటుంది. బుద్ధుడికి 'ఆత్మ' ఉండదు – ఆయన ఉంటాడు స్వతంత్రుడై. అందువల్లే అంటున్నాడు బుద్ధుడు :

***ఎవరైనా తథాగతుడు 'వెళ్తూంటాడు, వస్తూంటాడు... అంటే***

తప్పకుండా ఆయన వెళ్తూనే ఉంటాడు, వస్తూనే ఉంటాడు – ఈ వజ్రచ్ఛేదికా సూత్రం సరిగ్గా దీనితోనే ప్రారంభం అవుతుంది. గమనించండి ఇందులోని సౌందర్యాన్ని: వజ్రచ్ఛేదిక సూత్ర ప్రారంభం దీనితోనే జరిగింది – బుద్ధుడు భిక్షం ఎత్తుకునేందుకు వెళ్ళాడు, తరువాత ఆయన తిరిగొచ్చాడు, భిక్షాపాత్రను బోర్లించి క్రిందపెట్టేశాడు. కాళ్ళు కడుక్కున్నాడు. కూర్చున్నాడు. తన ముందు ఉన్న స్థలం మీదికి దృష్టి నిలిపాడు. అప్పుడు సుభూతి అడుగుతాడు. ఈ వజ్రచ్ఛేదిక స్వరూపంతో ప్రారంభమవుతోంది, రూపరహితంతో పరిసమాప్తం అవుతోంది.

అదే ప్రారంభం. ముందుగానే మీరు నిశ్శబ్దాన్ని వినలేరు; ముందుగా మీరు మాటలనే వినవలసి ఉంటుంది. అంతరాకాశాన్ని సూటిగా మీరు చూళ్ళేరు, ముందుగా మీరు నన్ను ఆవరించి ఉంటున్న మేఘాన్నే చూడాల్సి ఉంటుంది. అప్పుడు మాత్రమే, నెమ్మదిగా, నెమ్మదిగా, మహాంతరపు శృతిలోకి మీరు వస్తారు. ముందుగా, సహజంగానే, మీరు బాహ్యం దగ్గరికే వస్తారు. ముందుగా మీకు ఇల్లు కనిపిస్తుంది. ఆ తరువాత మీరు ఇంట్లో నివసిస్తున్నవాణ్ణి చూస్తారు.

ఇది సహజం, ఇందులో ఏ తప్పూ లేదు. కానీ ఇంటినే మీరు పట్టేసుకోకండి. ఇంటి దగ్గర్నుంచి, గృహం దగ్గర్నుంచి గృహవాసి దగ్గరికి చేరండి. ఇదే ఈ వజ్రచ్ఛేదికా సూత్రంలోని సౌందర్యం : బుద్ధుడి దేహంతో ఇది ప్రారంభం అవుతుంది – ఎలా నడుస్తాడు, ఎలా కూర్చుంటాడు, ఎలా చూస్తాడు, ఏం చేస్తాడు? మరిప్పుడు ఇది పరిసమాప్తం అయిపోతూ ఉంది ఈ వింత వాక్యంతో :

> ***ఎవరైనా తథాగతుడు 'వెళ్తూంటాడు, వస్తూంటాడు,***
> ***నుంచుంటాడు, కూర్చుంటాడు, పడుకుంటాడు' అని అంటున్నారంటే***
> ***ఆ మనిషికి నా బోధ అర్థం కాలేదనే అర్థం. మరి ఎందుకు?***
> ***'తథాగతుడు' అని ఎక్కడికీ పోనివాణ్ణే, ఎక్కణ్ణుంచో రానివాణ్ణే అంటాం.***
> ***అందువల్లే అంటాం 'తథాగతుడు' అని, 'అర్హతుడు' అని,***
> ***'పరిపూర్ణ సంప్రజ్ఞుడు' అని.***

ఎవరిని అంటారు 'సంపూర్ణ సంప్రజ్ఞుడు' అని? ఎవరికి ఆకాశం నిశ్చలంగా ఉంటుందని తెలుస్తుందో, కాలానికి అతీతంగా ఉన్న శాశ్వతత్వాన్ని ఎవడు తెలుసుకుంటాడో, సత్యాన్ని ఎవడు తెలుసుకుంటాడో ఆ మనిషిని.

సత్యం ఉంటుంది ఎప్పుడూ సమానంగా – స్వప్నాలు మారుతూ ఉంటాయి, సత్యం ఉంటుంది ఎప్పుడూ సమానంగానే. బుద్ధుడి మాటలను చక్కగా

అర్థంచేసుకోండి. కానీ ఆ మాటలనే పట్టుకుని ఉండిపోకండి. అవి మీకు పరిచయం మాత్రమే – అక్కణ్ణుంచి కదలండి.

నేను ఏమంటానంటే, వినండి ఆ మాటలను, కానీ వాటినే పట్టుకుని ఉండిపోకండి – వాటి నుండి కదలండి. క్రమక్రమంగా నా నిశ్శబ్దపు శృతిలోకి రండి. క్రమక్రమంగా, నన్ను మరచిపోండి – మేఘాన్ని మరచిపోయి ఆకాశంలోకి ప్రవేశించండి. అప్పుడు ఉంటారు మీరు పూర్ణశృతిలో. అప్పుడు మీరు సత్యంలోకి ప్రవేశించడాన్ని ప్రారంభించేసి ఉంటారు.

పదాలు అన్నీ సత్యాన్ని గురించే, కానీ తమంతట అవి సత్యం కాదు. 'దేవుడు' అన్న పదం కేవలం ఒక పదం మాత్రమే. అదే కాదు దేవుడు. 'ప్రేమ' అన్న పదం కేవలం ఒక పదం మాత్రమే. అది ప్రేమ అయిపోదు. ఉపయోగించండి పదాన్ని. తరువాత దాన్ని విసిరిపారెయ్యండి. అది పాత్ర మాత్రమే తప్ప ఆ పాత్రలో ఉన్న పదార్థం కాదు.

ఓ గురువుతో, మరీ ఎక్కువగా అతుక్కుని ఉండకండి ఆయన శరీరంతో. ఆ సామీప్య సాహచర్యమే ఓ బంధం, ఓ ప్రతిబంధకం అయిపోతుంది. ప్రేమించండి గురువును. కానీ ఆయన ప్రగాఢాంతరంలోకే ప్రవేశించండి. నెమ్మదిగా, నెమ్మదిగా, క్రమక్రమంగా, ఒక్కొక్క అడుగే వేసుకుంటూ ఆయన మహాంతర్భాగంలోకే చేరిపోండి. మరప్పుడు మీరు ఆశ్చర్య చకితులు అవుతారు – ఎందుకంటే ఆ మహాంతర్భాగం సమానంగానే ఉంటుంది కాబట్టి. మహాంతర్భాగంలో గురుశిష్యులిద్దరూ కలుసుకుంటారు. మహాంతర్భాగంలో ఏ వేరిమీ ఉండదు.

కబీర్ ఓ వింతమాటను అన్నాడు "గురువు శిష్యుడి పాదాల మీదకు తలవంచిన క్షణం వచ్చేసింది" అని. అప్పుడు ఏ ప్రత్యేకతా ఉండదు, ఏ విభిన్నతా ఉండదు. ఎవరు గురువో, ఎవరు శిష్యుడో అప్పుడు ఉండదు వ్యత్యాసం – ఏ భేదమూ అప్పుడు ఉండదు.

రింజాయ్ తన గురువు సాహచర్యంలో ఉన్నప్పుడు – ఆ గురువు మహా మహా చండశాసకుడు, మామూలుగా జెన్ మాస్టర్లు అందరూ ఉన్నట్లుగానే – రింజాయ్ ఆయన దగ్గర ఎన్నో దెబ్బలూ, తన్నులూ తింటూ ఉండేవాడు. ఆ గురువు రింజాయ్‌ని పైకెత్తి విసిరివేస్తూ ఉండేవాడు. క్రిందపడి ఉన్న రింజాయ్ మీదికి ఎగిరి దూకుతూ ఉండేవాడు. ఎప్పుడూ కొడుతూ ఉండేవాడు. ఒకప్పుడు రింజాయ్ ఇంకో ఊరికి పోవాల్సి వచ్చింది, ఓ ప్రయాణం, ఓ తీర్థయాత్ర చేయాల్సి వచ్చింది. మాస్టర్

రింజాయ్‌ని దగ్గరికి పిలిచి కొట్టడం ప్రారంభించేశాడు. రింజాయ్ అన్నాడు "కానీ నేనింకా ఒక్కమాట కూడా మాట్లాడనే లేదు కదా, నేనేమీ చెయ్యలేదు కదా!" అని.

మాస్టర్ ఇలా అన్నాడు "నాకు తెలుసు. కానీ నువ్వు తీర్థయాత్ర చెయ్యబోతున్నావు. నాకు ఏమనిపిస్తోందంటే తీర్థయాత్ర నుంచి నువ్వు ఇక్కడికి తిరిగి వచ్చేసరికి నీకు సంప్రజ్ఞత ప్రాప్తించే ఉంటుందని. ఆ తరువాత నిన్ను కొట్టేందుకు నాకు ఏ అవకాశమూ ఉండదు. అందువల్లే – ఇదే నాకు ఆఖరి అవకాశం."

రింజాయ్ ఆశ్రమానికి మళ్ళీ తిరిగి వచ్చినప్పుడు – ఔను, అదే జరిగింది. మాస్టర్ రింజాయ్ పాదాలకు తల ఆనించి నమస్కారం చేశాడు. "ఇప్పుడు నువ్వు నన్ను కొట్టవచ్చు" అన్నాడు. రింజాయ్ గురువును కొట్టలేదనుకోండి, కానీ గురువు అన్నాడు "ఇప్పుడు నువ్వు నన్ను కొట్టవచ్చు. ఇప్పుడు నువ్వు ఆనంద పడవచ్చు. నిన్ను కొడుతూ నేనెంతో ఆనందపడ్డాను కదా; నువ్వు స్వగృహాన్ని చేరుకున్నావు."

మహాంతర్భాగంలో ఏ వ్యత్యాసమూ ఉండదు.

బుద్ధుడు అంటున్నాడు మాటలనే అంతగా పట్టుకుని ఉండిపోకూడదని. ఉపయోగించుకోండి వాటిని మెట్లుగా, సోపానాలుగా, తారణ సాధనాలుగా. బుద్ధుడి కదలికలను, ఆయన శరీరపు కదలికలను అంతగా పట్టించుకోకండి. ఉన్నారు ఇక్కడ మనుషులు. అనుకరించేవాళ్ళు. బుద్ధుడిలా నడుస్తూ ఉండేవాళ్ళు. బుద్ధుడిలా మాట్లాడుతూ ఆయన మాటలనే ఉపయోగించుకుంటూ ఉండేవాళ్ళు. ఆయనలాగే చేతులు తిప్పుతూ ఉండేవాళ్ళు. బుద్ధుడు చెబుతున్నాడు అవన్నీ నిజం విషయాలు కావని. నిజం విషయాలు స్వరూపాలకు అతీతంగానే ఉంటాయి. వాటిని అనుకరించడం సాధ్యపడదు.

గురువును అనుకరించకండి. అప్పుడు మాత్రమే ఏదో ఒకనాటికి మీరే గురువులు కాగలుగుతారు. ప్రేమించండి, వినండి, కానీ ఇంకా ఎంతో దూరాలకు మీరు చేరాల్సి ఉందన్న విషయాన్ని ఎప్పుడూ జ్ఞప్తిలోనే ఉంచుకోండి. అన్ని మేఘాలకూ మీరు అతీతులు కావాలి.

ఈ రోజుకు ఇది చాలు.

# ఓషో గురించి

ఓషో బోధనలు అన్ని వర్గీకరణలను తిరస్కరిస్తూ, అన్ని వర్గీకరణలకు అతీతంగా ఉంటున్నాయి. ఓ వ్యక్తి ఒంటరిగా చేస్తున్న స్వీయ అన్వేషణ గురించే కాకుండా, నేడు మానవజాతి ఎదుర్కొంటున్న అనేక అత్యవసర సామాజిక మరియు రాజకీయ అంశాల పట్ల చాలా సహజంగా బోధనలు సాగుతున్నాయి. ఓషో పుస్తకాలు వ్రాయలేదు - కానీ తన జీవిత కాలంలో 35 సంవత్సరాలపాటు ఆయన మాట్లాడిన ఆడియో వీడియో ప్రవచనాల నుంచి పుస్తకాలుగా రూపొందించారు. 'సండే-టైమ్స్' అనే లండన్ పత్రిక ఓషోని "20వ శతాబ్దపు 1000 మంది నిర్మాతలలో ఒకరిగా" మరియు 'సండే-మిడ్-డే' అనే భారత పత్రిక భారతదేశ చరిత్రను తిరగరాసిన పదిమంది ప్రముఖులలో అంటే బుద్ధ, గాంధీ మొదలైన వారి సరసన చేర్చింది. అంతేకాకుండా, ప్రముఖ అమెరికా రచయిత 'టామ్‌రాబిన్స్' ఓషోను జీసస్ తర్వాత 'అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి'గా అభివర్ణించారు.

ఓషో సహాయమంతా ఒక నవ్యమానవుడిని నిర్మించే దిశలో జరుగుతుంది. ఆ నవ్య మానవుడిని 'ఓషో జోర్బా ది బుద్ధా' అంటాడు. ఆ నవ్య మానవుడు ఏకకాలంలో నేలపై ఉంటూనే నింగిలోని చుక్కలను కూడా అందుకోగలడు. ఓషో తన మణిహారంలో అన్ని విషయాలను చేర్చుకున్నారు. ఇటు సత్యాన్వేషణలో అసాధారణ ప్రజ్ఞ కలిగిన తూర్పుదేశాల జ్ఞానాన్నీ, అటు శాస్త్ర, సాంకేతిక రంగాలలో అత్యంత శక్తివంతమైన పడమటిదేశాల విజ్ఞాన సర్వస్వాన్నీ తనదైన శైలిలో సమన్వయపరచారు.

చాలా వేగంగా మార్పులకు లోనవుతున్న జీవన విధానాలకు ధీటుగా 'అంతః పరివర్తన విజ్ఞానాన్ని' వివిధ ధ్యాన పద్ధతుల ద్వారా ఈ కాలపు మనిషికి అందించారు. సాధనలో నిరంతరం అడ్డుపడే శారీరక, మానసిక పరమైన ఒత్తిడులను పారద్రోలిన తర్వాత ఆలోచనారహిత ధ్యాన అనుభవాన్ని సులువుగా అందించే విధంగా రూపొందించిన ఓషో 'చైతన్య ధ్యానాలు' (Active Meditations™) నేడు అత్యున్నతంగా నిలుస్తున్నాయి.

## తెలుగులో ఓషో ప్రచురణలు

1. ధ్యానం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం (స్వస్థత కోసం ధ్యాన చికిత్స)
2. వజ్రచ్ఛేదిక (పరిపూర్ణ సంప్రజ్ఞత)
3. అద్భుతాన్ని అన్వేషించడంలో (కుండలినీ యాత్ర)
4. ఆనందం
5. అవేర్‌నెస్
6. నిగూఢ రహస్యాలు
7. సాధనా రహస్యాలు
8. నిత్యజీవితంలో ధ్యానం
9. అద్భుత జెన్ కథలు
10. జీవిత రహస్యాలు
11. సంభోగం నుండి సమాధివైపు
12. సంభోగం నుండి సమాధివైపు (2,3 & 4)
13. విజ్ఞాన భైరవ తంత్ర – 1 (శ్వాస విశ్వానికి ఓ వారధి)
14. విజ్ఞాన భైరవ తంత్ర – 2
15. ధమ్మపదం (బుద్ధుని మార్గం) – (1&2)
16. ధమ్మపదం (బుద్ధుని మార్గం) – (3&4)
17. హృదయంలోకి ప్రయాణం
18. ఎమోషనల్ ఫిట్‌నెస్
19. మట్టిదీపాలు
20. సాక్షిసాధన
21. క్రాంతిబీజాలు
22. చిన్నారుల కోసం
23. మన అంతరంగంలో వెతకాలి
24. జీవితం ...? మరణం ...?
25. ఓషో : జీవితం – సందేశం
26. ఓషో జీవిత చరిత్ర – 1 (ఓషో లీలలు)
27. ఓషో జీవిత చరిత్ర – 2 (ఓషో లీలలు)
28. యోగా – 1
29. యోగా – 2
30. భవిష్యత్తు కృష్ణుడిదే – 1
31. భవిష్యత్తు కృష్ణుడిదే – (2&3)
32. తావో ఉపనిషత్తు – 1
33. తావో ప్రాణసాధన
34. గీతా దర్శనం – I (విషాద యోగం)
35. గీతా దర్శనం – II (సాంఖ్య యోగం)


జీవిత రహస్యాలు
ఓషో
Life's Mysteries
OSHO

OSHO
సాధనా రహస్యాలు
ఓషో


అవేర్‌నెస్
ఓషో
OSHO


సంభోగం నుండి
సమాధి వైపు
ఓషో
OSHO

OSHO MEVLANA MEDITATION CENTRE
Mahavir House, Basheer Bagh, Hyderabad - 500 029.
Cell : 93924 72766, 88973 23143 e-mail : oshomevlana@gmail.com

**Osho's Literature in English, Telugu**
**Books, DVD's & Photos Etc.**
**Available for sale**

**Centre Timings**
11.00 a.m to 4.00 p.m Monday to Saturday

**DAILY ACTIVITIES AT OUR MEDITATION CENTRE**
Dynamic Meditation : 6.00 a.m to 7.00 a.m (Everyday)

ఓషో
వేదాంత
సమాధి స్థితికి ఏడడుగులు


ధ్యానం ద్వారా
సంపూర్ణ ఆరోగ్యం
ఓషో
OSHO
From Medication to Meditation




ఓషో
ఎమోషనల్ ఫిట్‌నెస్
Emotional Fitness
OSHO




ఓషో
మట్టి దీపాలు
Matti Deepalu
OSHO


విజ్ఞాన
భైరవ తంత్ర-1
శ్వాస :
విశ్వానికి ఓ వారధి
ఓషో
OSHO


నిగూఢ
రహస్యాలు
ఓషో
Hidden
Mysteries
OSHO


అద్భుతాన్ని
అన్వేషించడంలో
ఓషో
OSHO


నిత్య జీవితంలో
ధ్యానం
ఓషో
OSHO


ఓషో
క్రాంతి బీజాలు
Kranthi Beejalu
OSHO

ఓ సమకాలీన బుద్ధుడు
గౌతమబుద్ధుడి గురించి మాట్లాడుతూ,
ఆయన మాటలకు మళ్ళీ ఓ కొత్త ప్రాణాన్ని పోస్తూ,
వాటి అర్థాలను పునః ప్రకాశింపజేస్తూ వున్నాడు.
వజ్రచ్ఛేదిక గౌతమబుద్ధుడి మహాప్రవచనాల్లో
ఒకటి. ఈ సూత్రాల రహస్యాలకు ఓషో
ఓ నవ్యయుగపు స్పష్టతను తీసుకొచ్చారు.

**భారతదేశంలో బుద్ధుని తర్వాత జన్మించిన
అంతటి గొప్ప అవతార పురుషుడు ఓషో.**

లామా కర్మప
రెడ్ హాట్ సెక్రటరీ, టిబెటన్ బుద్ధిజమ్

"ఓషో జ్ఞానసిద్ధి పొందిన గురువు. ఆత్మజ్ఞానాన్ని మనిషిలో
మరింత వృద్ధిపరచటానికి వీలైనన్ని మార్గాల ద్వారా కృషి చేస్తున్నారు."

- దలైలామా

కొన్ని మాటల్లో ఓషో గురించి చెప్పడం అసాధ్యం.
ఆయన మాటలు వందలాది పుస్తకాల రూపంలో
దొరుకుతున్నాయి. వాటిని చదవమని మాత్రమే చెప్తాను.

- కుష్వంత్‌సింగ్, ప్రముఖ జర్నలిస్ట్

ఓషో - ఈ తరం సాధించిన అద్భుతాలలో ఒకటిగా భావిస్తాను.

- అమృతా ప్రీతమ్, ప్రముఖ రచయిత్రి

OSHO

**Vajrachedika**
( Paripurna Sampragnatha )